మాటల తూటాలు



నార్ల వెంకటేశ్వరరావు

C1

మాటల తూటాలు

ఎన్నిక చేసిన సంపాదకీయాల సంకలనం

1944 — 1974

నార్ల వెంకటేశ్వర రావు

నవోదయ పబ్లిషర్స్ విజయవాడ-2
గుంటూరు-2

MOODU DASAABDAALU
Narla Venkateswara Rao

Navodaya Publishers
Vijayawada - 520 002

© V. R. Narla.

First Edition
August 1976

Printed at
JYOTI PRESS
Hyderabad

Paper Back Rs. **25-00**

Hard Bound Rs. **35-00**

కృతజ్ఞతాసూచకంగా

శ్రీ ముట్నూరి కృష్ణారావు,

శ్రీ ఖాసా సుబ్బారావుల

ఉత్తేజకరస్మృతికి

3

పీఠిక

ఎన్ని సంపాదకీయాలను ఇప్పటికి నేను వ్రాసివుండాలి? నిక్కచ్చితంగా లెక్క చెప్పలేను గాని, కనీసం ఆరేడు వేలకుపైగా. వీటిని అచ్చువేస్తే, హీన పక్షం పదిహేను వేల పేజీలకు విస్తరిస్తాయి. ప్రత్యేకవ్యాసాలు, గ్రంథసమీక్షలు, ఇతర రచనలను కలుపుకొంటే, మరొక అయిదు వేల పేజీలకు దేకవచ్చు.

నా సంపాదకీయాలలో అత్యధికభాగం దినపత్రికలలో వెలువడినట్టివే. వాటిని వ్రాసింది దైనందిన సంఘటనలపై, తాత్కాలిక సన్నివేశాలపై, తక్షణ సమస్యలపై. అందువల్ల వాటిలో నూటికి పది వంతులైనా పునర్ముద్రణకు నిశ్చయంగా తగవు.

"పోనీ, ఆ మిగిలిన పది వంతులనైనా సంకలనం చేసి, పుస్తక రూపంలో ప్రచురించరాదా?" అని నా పాఠకమిత్రులలో కొందరు కొన్నేళ్లుగా నాకు పదే పదే సూచిస్తున్నారు. వీరిలో ఒకరు ''మీరు అనుమతిస్తే సంకలన, ప్రచురణ బాధ్యతలను నేను స్వీకరిస్తాను'' అని ముందుకు వచ్చారు. మరొకరేమో "ఆసక్తి కలదుగాని, నాకు శక్తి లేదు. నేను పెద్దవాణ్ణి అయిపోయాను; మీ సంపాదకీయాల సంకలనాన్ని చూడాలని ముచ్చట పడుతున్నాను. నిన్ననే పంట అమ్మగా, ఈ పైకం వచ్చింది. దీన్ని వినియోగించి, నా ముచ్చట తీర్చండి" అంటూ వందరూపాయల నోట్లను కొన్నింటిని (ఎన్నో, నాకు తెలియదు) నా చేతిలో పెట్టబోయారు.

"నాపట్ల మీ ప్రేమాభిమానాలకు కృతజ్ఞుడను. కాని, మీ సాలుసరి ఆదాయంకంటె నాదే పెద్దది. నా సంపాదకీయాలలో పునర్ముద్రణకు తగినవి ఏవైనా వున్నాయని తోస్తే, వాటిని ఏ నాటికో ఒకనాటికి నేనే ప్రచురిస్తానులెండి" అని చెప్పి, ఆయన నూరు రూపాయల నోట్లను ఆయన చేతిలోనే తిరిగి పెట్టి, నిండుమనస్సుతో నమస్కరించి పంపించాను.

ఈ సంఘటనలు జరిగింది ఏడెనిమిదేళ్ల క్రితం. అయినా, నాసంపాదకీయాల సంకలనంవిషయమై, వాటి ప్రచురణవిషయమై ఒక నిర్ణయానికి నేను తేలికగా రాలేకపోయాను. అప్పుడే వండి, వార్చి, వడ్డించిన అన్నంవంటిది దినపత్రికలోని సంపాదకీయం. వంట చేతకాక, దాన్ని సరిగా యిగర నివ్వకపోయినా, తోప చేసినా, మాడ్చినా, అది గొంతు దిగ దనుకోండి. కాని, నేర్పుగా వండితే, మెతుకు మెతుకు ఒక మంచి ముత్తెంలా మిలమిల మెరుస్తుంది; ఆవిరులు కక్కుతూ నోరూరిస్తుంది. కాని, అదే మర్నాటి పొద్దుటికి చద్దివాసన కొడుతుంది!

ఈ చద్దివాసన ప్రమాదాన్ని తప్పించుకొనగల సంపాదకీయాలు నేను వ్రాసినవాటిలో ఎన్ని వున్నవో నిర్ణయించుకొనడానికి వాటిని నేను భద్రపరచుకోలేదు. కొత్తగా వాటిని సంపాదించాలంటే, 1959వ సంవత్సరానికి పూర్వపు "ఆంధ్రప్రభ" ఫైల్స్ దాని ఆఫీసులోనే కానరావడంలేదని (కొందరు మిత్రుల ద్వారా వాకబుచేయగా) తెలిసింది. ఆంధ్రప్రదేశ్‌లోని, చెన్నపురిలోని ముఖ్యమైన లైబ్రరీలవారిని విచారించగా, ఒక్క వేటపాలెంలోని "సరస్వతీ నికేతనం"లో మాత్రమే అవి వున్నట్టు తెలిసింది. అయితే, వేటపాలెంలోనైనా 1947 ప్రారంభం నుంచి మాత్రమే వాటిని పదిలంచేశారు. లండన్‌లోని ఒక స్నేహితునికి వ్రాయగా, బ్రిటిష్ మ్యూజియంలో గాని, ఇండియా హౌస్ లైబ్రరీలో గాని, ఏ తెలుగు దినపత్రికల ఫైల్స్ లేవని జవాబు వచ్చింది. వాషింగ్టన్‌లో విచారించగా, కాంగ్రెస్ లైబ్రరీలో ఆదినుంచీ కాక, 1946నుంచి మాత్రమే "ఆంధ్రప్రభ" సంపుటాలకు మైక్రోఫిల్ము కాపీ లున్నట్టు తెలియజేశారు. నా సంపాదకీయాల మాట విడిచిపుచ్చండి; వాటికి ఏపాటి విలువ కలదన్నమాట విడిచిపుచ్చండి; ఇలాగే అన్యుల సంపాదకీయాలనుగురించి పట్టించుకొనబోకండి. అయినా, కడచిన నూరు, నూటయాభై సంవత్సరాల తెలుగుదేశచరిత్రను వ్రాయాలంటే, తెలుగు దినపత్రికల, ఇతర పత్రికల ఫైల్స్ విధిగా కావాలన్న సంగతిని మరచిపోబోకండి. పంధొమ్మిదవ శతాబ్దికి సంబంధించినంతవరకు ఇవి దాదాపు పూర్తిగా అదృశ్యమైపోయాయి. తెలుగులో మొట్టమొదటి పత్రిక ఏదో కూడా ఇప్పుడు మనకు తెలియదు; "సత్యదూత", "వృత్తాంతిని", "వర్తమానతరంగిణి", "సంవాదకౌముది", "దినవర్తమాని". "హితవాది", "శ్రీయక్షిణి",

"సుజనరంజని", "ఆంధ్రభాషాసంజీవని", "పురుషార్థప్రదాయిని" మొదలైనవి ఈనాడు లభ్యం కావు; లభ్యమైతే, కొన్ని చిల్లరమల్లర సంచికలు మాత్రమే. పోతే, వీటితర్వాత వచ్చిన "వివేకవర్ధని" ఫైల్స్‌కూడా ప్రస్తుతం దొరకవు. హితకారిణిసమాజంలో ఒక ప్రముఖసభ్యుడు తొమ్మిది నెలలక్రితం నాకు చెప్పిన మాటప్రకారం, కందుకూరి వీరేశలింగం సంస్థాపకుడుగా, సంపాదకుడుగా చరిత్రను సృష్టించిన ఈ సుప్రసిద్ధపత్రిక చెదురుమదురు సంచికలు పదికిలోపుగానే ఈనాడు రాజమహేంద్రవరంలో వున్నాయి. అక్కడనే దాని సంపుటాలు లేకపోతే, మరొకచోట అవి వున్నాయని ఎలా అనుకోగలము?

"వివేకవర్థని"తర్వాత పుట్టి, కొంతకాలంపాటు జేగీయమానంగా నడిచి, అటుపిమ్మట నిలిచిపోయిన "కాంగ్రెస్, "ప్రజామిత్ర", "ప్రజాబంధు" "హితబోధిని", "తెనుగుపత్రిక", "సాధన పత్రిక" మొదలైనవాటి సంగతి చూడబోతే, ఏవో కొన్ని సంచికలు, లేదా ఒకటి, రెండు సంపుటాలు వినా, అవి సమూలం నష్టమైపోయినట్టే అని ఈమధ్య విన్నాను. ఇట్టి వార్తలు వినగా, వినగా కలిగిన బాధలోనే ఇప్పుడు మిగిలివున్న తెలుగుపత్రికల సంపుటాలకైనా మైక్రోఫిల్మ్ కాపీలు తీయించకపోతే, ఆధునికాంధ్ర చరిత్రరచనకు కావలసిన "ఒరిజినల్ సోర్సెస్" జీర్ణించి పోగలవని ముఖ్యమంత్రి జలగం వెంగళరావుగారి పేర కొన్నాళ్లక్రితం ఒక లేఖ వ్రాశాను. ఈ విషయంలో తక్షణచర్యకు ఉత్తరువు చేసినట్టు ఆయననుంచి వెంటనే ప్రత్యుత్తరం వచ్చింది. ఎంత త్వరగా, ఎంత క్షుణ్ణంగా ఈ ఉత్తరువు అమలు జరగనున్నదో వేచిచూడాలి. ఈ మాటలను వ్రాస్తుండగా విద్యాశాఖలో డిప్యూటీ సెక్రటరీ శ్రీ. బి. రామచంద్రా రెడ్డినుంచి వచ్చిన లేఖనుబట్టి, ఈ కృషి ఈసరికే చురుకుగా ప్రారంభమైనట్టు తెలుస్తున్నది. ఇందుకు ముఖ్యమంత్రికి నా ధన్యవాదాలు.

నా సంపాదకీయాల సంకలనంనుంచి చాలా దూరం వచ్చినట్టున్నాను. అయితే, వాటి సంకలనంకంటె మన తెలుగుపత్రికల సంపుటాలను భావితరాల వారి వినియోగార్థం భద్రపరచడం ఎంతో ముఖ్యం. అందువల్లనే ఈ విషయమై ఇంతగా ప్రస్తావించాను. ఎవరివద్ద మన పాత తెలుగుపత్రికల సంచికలు, లేదా సంపుటాలు ఏమి వున్నా, ఎన్ని వున్నా, వాటిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యా

శాఖకు చెందిన ఆర్కైవ్స్ డిపార్టుమెంటుకు పంపించడం సముచితం కాగలదు. మైక్రోఫిల్మ్ కాపీలను యెత్తినపిమ్మట ఆ డిపార్టుమెంటువారు వాటిని భద్రంగా తిప్పి పంపించగలరని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు.

ఇప్పుడు జ్ఞాపకం తెచ్చుకొనగా, 1945 నాటికే 1944వ సంవత్సరానికి పూర్వపు "ఆంధ్రప్రభ" ఫైల్స్ లుప్తమైపోయినట్టు తోస్తున్నది. ఇటీవలనే కీర్తిశేషుడైన నా మిత్రుడు చక్రపాణి పట్టుదలపై 1945 ప్రారంభంలో నాటి వరకు నేను చేసిన విభిన్నరచనలలో కొన్నింటిని "కదంబం" అనే పేరుతో ఒక సంకలనంగా ప్రచురించాను. దానిలో నేను చేర్చినవి 1944లోను, 1945 జనవరి, మార్చి నెలల మధ్యకాలంలోను నేను వ్రాసినవాటిలో తొమ్మిది సంపాదకీయాలను మాత్రమే. ఆ పత్రిక సంస్థాపన 1938 ఆగస్టులో; దానికి ఎడిటర్‌గా నా నియామకం 1942 మధ్యభాగంలో. అయినా 1943లో గాని, 1943లో గాని నేను వ్రాసిన సంపాదకీయాలలో ఒక్కటైనా నాటి "కదంబం"లో చోటు చేసుకొనక పోవడానికి కారణం అంతకుముందు సంవత్సరాలకు సంబంధించిన "ఆంధ్రప్రభ" ఫైల్స్ గల్లంతు కావడమే అయివుండాలి. ఈ ఊహ నిజం కాకపోతే, నాకంటె సంతసించగలవా రుండరు.

1944నుంచి మాత్రమే నా సంపాదకీయాలు లభ్యమైనందున, 1944-1974 సంవత్సరాలమధ్య వ్రాసినవాటిలోనుంచి కొన్నింటిని ప్రస్తుత సంకలనంలో చేర్చి, దీనికి "మూడు దశాబ్దాలు" అని పేరు పెట్టాను. అంతమాత్రంచేత దీన్ని ఈ మూడు దశాబ్దాల చరిత్రగా భావించరాదు. చారిత్రకదృష్టినుంచి కాక, కొన్ని జీవితపు విలువలదృష్టినుంచి ఈ సంకలనానికి నా సంపాదకీయాలను ఎన్నికచేశాను. చారిత్రకవిషయాల ప్రసక్తి దీనిలో అసలే లేదని నా తాత్పర్యం కాదు. నడుస్తున్న చరిత్రకే మరొక పేరు జర్నలిజం. అందువల్ల ఈ సంకలనంలోని ప్రతి పుటనుంచి ఏదో ఒక రూపంలో సమకాలికచరిత్ర తొంగిచూస్తూనే వుంటుంది. అయితే, ఒక క్రమంలో కాదు, ఒక పద్ధతిలోనైనా కాదు, ఒక తీరూ తెన్నూలేని మెరపుతీగ ధోరణిలో.

భారతీయ సంపాదకులలో నన్ను విశేషంగా ప్రభావితుని చేసినవారు ముట్నూరి కృష్ణారావు (1879-1945) ఖాసా సుబ్బారావు (1896-1961)

బ్రిటిష్ సంపాదకులలో నాకు మార్గదర్శకులైనవారు థామస్ బార్న్జ్ (1785-1841), జె. ఎ. స్పెండర్ (1862-1942), డబ్లియు. హెచ్. మ్యాసింగమ్ (1860-1924), సి. పి. స్కాట్ (1846-1932). వీ రందరు ఒక వృత్తిగా కాక, జీవితసాఫల్యానికి ఒక సాధనగా జర్నలిజంలో ప్రవేశించినవారే. వీ రంద రికి ఏవో కొన్ని స్పష్టమైన, స్థిరమైన, శిష్టమైన జీవితపు విలువలు వుండేవి. నా శక్తికొలది నేను సయితం ఇట్టి కొన్ని విలువలను పెట్టుకొనడానికే, వాటిని పాటించడానికే ప్రయత్నించాను. ఈ ప్రయత్నంలో నా వైఫల్యాలు నాకు తెలిసినంతగా ఇతరులకు తెలియవు. త్వరలో డెబ్బై సంవత్సరాలు నిండనున్నా, యౌవనదశలో నేను పెట్టుకొన్న నా జీవితపువిలువలపట్ల నా భక్తి విశ్వాసాలు చలించ లేదు, క్షీణించనూ లేదు. ఇదే మాటను, ఇంత గట్టిగా చెబుతూ కన్ను మూయగలిగితే, నా జీవితం వ్యర్థం కాలేదనే భావిస్తాను.

సంపాదకీయాలకు ఓంప్రథమంగా గౌరవప్రతిష్ఠలను కూర్చినవాడు బార్న్జ్. తన ముప్పైరెండవ యేట 1817లో లండన్"టైమ్స్" ఎడిటర్ పదవిని స్వీకరించినవెంటనే ఆయన నాలుగు ముఖ్యనిర్ణయాలను చేసుకొన్నాడు: (1)పత్రి కల కర్తవ్యం ప్రభుత్వభజన కాదు, మంత్రులపాద సేవ మొదలే కాదు; (2) ప్రజాభిప్రాయాన్ని పత్రికలు వ్యక్తంచేయాలి, ప్రజల యోగక్షేమాలను కాపాడాలి; (3) అవసరమైతే సంపాదకీయాలలో తీవ్రపదజాలాన్ని వాడడానికి సంకోచించరాదు. ("సంపాదకీయం బెల్లంపానకం కాదు, సిసలైన బ్రాండి" అనేది ఆయన సూక్తి); (4) పరిస్థితులు మారినప్పుడు అతఃపూర్వం తాను వెల్లడించిన అభిప్రాయాలకు విరుద్ధమైనవాటిని సంపాదకుడు వెల్లడించవచ్చు. ఇది చంచలచిత్తం కాదు, అవకాశవాదం కాదు. ఏనాటి పరిస్థితిని ఆనాడు చిత్త శుద్ధితో సంపాదకుడు పరిశీలించాలి; నిలకడ లేనివాడన్న నిందకు భయపడ కుండా న్యాయమైనదిగా తాను నమ్ముతున్నదాన్ని నిర్భీకంగా వ్రాయాలి. ఈ సూత్రాలను పూర్తిగా పాటించినందువల్లనే బార్న్జ్ హయాంలో "టైమ్స్" ప్రచారం కొన్ని రెట్లు పెరగగా, దాని సంపాదకీయాలప్రతిష్ఠ ఎన్నో రెట్లు పెరిగింది.

బ్రిటిష్ జర్నలిజంలో బార్న్జ్ తర్వాత ప్రథమశ్రేణి సంపాదకీయ రచయితలుగా యెన్నదగువారు నాకు మార్గదర్శకులుగా నేను పేర్కొన్న

వారిలో స్పెండర్, మ్యాసింగమ్, స్కాట్‌లతోపాటు జె. ఎల్. గార్విన్ (1868 -1947). ఈ నలుగురిలో ప్రత్యేకించి చెప్పుకొనదగువాడు స్పెండర్. 1895 నుంచి 1921వరకు 26 సంవత్సరాలకు పైగా ఆయన "వెస్ట్‌మినిస్టర్ గెజెట్" ఎడిటర్. ఈ పత్రికలో ఆయన వ్రాసిన మొత్తం సంపాదకీయాలు ఇంచుమించుగా 11,000. నూటికో కోటికో తప్ప ఏదీ 1200 మాటలను మించేది కాదు. అంతకు తగ్గేదీ కాదు. మధ్యలో విఘ్నాలు రాకపోతే, దాన్ని ఆయన 75 నిమిషాలలో ముగించేవాడు. దీన్ని వ్రాయడానికి ఆయనకు గరుకు కాగితాలు, సన్నగా ములికి చెక్కిన మూడు మెత్తని పెన్సిల్స్ కావలసివచ్చేవి. దాని స్థానం లోపలిపేజీలలో కాదు, మొట్టమొదటి పుటలో. వార్తలవిషయమై, ప్రత్యేకవ్యాసాల విషయమై, గ్రంథసమీక్షల విషయమై స్పెండర్ స్వయంగా శ్రద్ధపుచ్చుకొనేవాడు, ఇతర ఆకర్షణలను సయితం కూర్చడానికి యత్నించేవాడు. అయినా ''వెస్ట్‌మినిస్టర్'' ఎన్నడు 17,000 ప్రతులనుమించి అమ్మలేదు. 1914వ సంవత్సరానికిపూర్వం దానికి సాలీనా నష్టం పది, పధ్నాలుగు వేల పౌనులమధ్య; అటుతర్వాత నష్టం రెట్టింపుకుపైగా పెరిగిపోయింది. అయినా రాజకీయ, సారస్వత, సాంస్కృతిక రంగాలలో దాని ప్రతిష్ఠ ఇంతంత కాదు. దాన్ని, ముఖ్యంగా దాని సంపాదకీయాన్ని చదవని వ్యక్తి సంస్కారాన్ని శంకించేవారు. "సంస్కారులమధ్య వున్నామన్న భావంతో మనం చదవగలిగిన పత్రిక వెస్ట్‌మినిస్టర్‌మాత్రమే!'' అని ఒక సందర్భంలో బెర్నార్డ్ షా అన్నాడు.

జాంర్జ్‌వలె స్పెండర్‌కూడా తన ధర్మనిర్వహణకు స్థూలంగా కొన్ని సూత్రాలను పెట్టుకొన్నాడు. వాటిలో ముఖ్యమైన వివి: (1) భాషావైదుష్యాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నించరాదు; సహజధోరణిలో, సులభశైలిలో, స్పష్టతనే సర్వదా లక్షిస్తూ వ్రాయాలి. (2) ''కాని", "అయినా'', "బహుశా" వగైరాలను ఆసరా చేసుకొంటూపోతే, మీరు చెప్పగోరేదాన్ని సూటిగా చెప్పలేరు. నీళ్ళనమిలే సంపాదకుని వ్రాతలు నీళ్ళుకారుతూనే వుంటాయి, నిర్జీవంగానే వుంటాయి. (3) చేదుకషాయాన్ని ఒకేసారి గొంతులో పోయడంకంటె, అంత చేదుకాని మందును నాలుగైదు మోతాదులుగా మధ్యమధ్య కొన్ని రోజుల విరామంతో వాడకంచేయడం మంచిది. (4) భావాలలో తీవ్రత ఎంత పెరిగితే,

భాషలో తీవ్రత అంత తగ్గాలి. (మన తెలుగు నుడికారం ప్రకారం, చెప్పుదెబ్బలు కొట్టవలసివస్తే, మెత్తని చెప్పుతోనే కొట్టాలి.) (5) మొక్కుబడి తీర్చుకొన్నట్టు కాక, ఏమి వ్రాసినా ధర్మాభినివేశంతో వ్రాయాలి.

ఒక్క చిత్తశుద్ధిలో తప్ప తక్కిన అన్నింటిలో స్పెండర్, గార్విన్‌లకు పొద్దెదురు. ఆయన లిబరల్ కాగా, ఈయన కన్సర్వేటివ్. ఆయన ఆలోచనా పరుడు కాగా, ఈయన ఆవేశపరుడు. ఆయన నచ్చజెప్పడానికి తపన పడగా, ఈయన రెచ్చగొట్టడానికి ఉత్సహించేవాడు. ఆయన పదాడంబరాన్ని కంటగించు కొనగా, ఈయన రచనకు అదే జీవనాడి. ఎ. జి. గార్డినర్ అన్నట్టు, "వెలుతురు లేని వేడి, గమ్యంలేని గమనం, లక్ష్యంలేని ఉద్విగ్నత" గార్విన్ దౌర్బల్యాలు. అయితే, విలియం కాబెట్‌వలె (1763-1835) గార్విన్ "ఫైటింగ్ ఎడిటర్."

స్పెండర్ వ్రాసినంత విస్తృతంగా మ్యాసింగమ్, స్కాట్‌లు సంపాద కీయాలు వ్రాయలేదు. కాని, వ్రాసినప్పుడు మాత్రం సమంజసంగా వ్రాసేవారు, సమర్థంగా వ్రాసేవారు, ధర్మాభినివేశంతో వ్రాసేవారు; శక్తిమంతంగా వ్రాసే వారు. మ్యాసింగమ్, స్పెండర్‌వలె 75 నిమిషాలలో కాక, అరగంటలో తన సంపాదకీయాన్ని ముగించేవాడు. తన పత్రికల యజమానులకంటె ఎల్లప్పుడు ఆయన రెండడుగులు ముందు నడిచేవాడు. అందువల్ల పత్రిక తర్వాత పత్రిక నుంచి ఆయన తప్పుకోవలసివచ్చింది. స్కాట్ తన "మాంచెస్టర్ గార్డియన్"కు తానే యజమాని కనుక, ఆయనకు అట్టి ప్రమాదం రాలేదు. వార్తలకంటె సంపాదకీయాలకు ఆయన అధిక ప్రాధాన్యమిచ్చేవాడు. "గార్డియన్" ప్రచారం పెరిగితే, అది దాని సంపాదకీయాల మహిమగా ఆయన భావించేవాడట; దాని ప్రచారం తగ్గితే, వార్తావిభాగంలో ఏదో లోపం జరుగుతున్నట్టు విసుగుదల కనబరిచేవాడట!

తాత్కాలికమైన ఉద్రేకంవల్లనో, ఇట్టి మరొక కారణంవల్లనో ప్రజా బాహుళ్యం అపమార్గాన పోతున్నట్టు తాము నమ్మినప్పుడు ఆ మాట చెప్పడానికి మ్యాసింగమ్ కాని, స్కాట్ కాని, ఎన్నడూ వెనుకాడలేదు. బోయర్ యుద్ధాన్ని బ్రిటిష్ ప్రభుత్వంవలె, ప్రజలవలె తాను సమర్థించలేకపోయినందునే మ్యాసింగమ్

"డెయిలీ క్రానికల్" ఎడిటర్ పదవికి రాజీనామా పంపించాడు. ఆదే యుద్ధాన్ని వ్యతిరేకించినందుకు తనను, తన పత్రికను పెక్కుమంది ఖండించినా, దూషించినా, బహిష్కరించినా, స్కాట్ ఎంతమాత్రం లక్ష్య పెట్టలేదు. స్కాట్ సూక్తులలో అతి ముఖ్యమైనట్టిది Comment is free, but facts are sacred. దీన్ని ఆయన అక్షరాలా పాటించాడు.

ఈ బ్రిటిష్ పత్రికాసంపాదకులలో ఒక్కరినైనా నేను చూడలేదు. వారి సంపాదకీయాలను అంతగా చదవనైనా లేదు. వారి సంపాదకీయాలు కాక, వారి జీవితచరిత్రలు నన్ను ప్రభావితుని చేశాయి. కాగా, నాకు శ్రీ ఖాసా సుబ్బారావు, శ్రీ ముట్నూరి కృష్ణారావు సన్నిహితంగా తెలిసినవారు; వారి మనఃప్రవృత్తులు, వారి రచనాపద్ధతులు నేను ప్రత్యక్షంగా గమనించాను. బాంజ్‌వలె స్వవచన వ్యాఘాతనింద తనపై తరచు రాగా, ఆయన చెప్పిన సమాధానాన్నే ఖాసా కూడా చెబుతూవుండేవాడు. స్పెండర్‌కంటె కూడా తన సంపాదకీయరచనకు ఖాసా ఎక్కువ సమయం తీసుకొనేవాడు. స్పెండర్‌కు కావలసినవి గరుకు కాగితాలు కాగా, ఈయనకు కావలసినవి నునుపు కాగితాలు. అవి ఫుల్‌స్కాప్ సైజులో అర తావులై వుండాలి. వాటిని పెట్టుకొనడానికి ఒక కొయ్యపలక కావాలి టేబుల్‌వద్ద కుర్చీలో కూర్చున్నా, ఒక కాలు మడిచి, దానిపై కొయ్యపలక ఆన్చి, మెత్తగా వ్రాసే ఫౌన్‌టెన్ పెన్‌తో అక్షరాలను చెక్కుతున్న ధోరణిలో వ్రాయాలి. ప్రతి అక్షరం అణిముత్తెంవలె వుండాలి. పంక్తులు సమానాంతర రేఖలవలె సాగాలి. ఆయన భాషలో పదాడంబరం లేకపోయినా, సరళత తక్కువ. అయితే ఆయన చిత్తశుద్ధి, ఆయన నిర్భీకత ఆయన సంపాదకీయాలకు నిశితత్వాన్ని కూర్చేవి. అభిప్రాయస్వేచ్ఛకై, అన్యాయప్రతిఘటనకై ఆయన ఎన్నిసార్లు రాజీనామా చేశాడో లెక్కలేదు. ఆయన జేబులో దమ్మిడీలేని రోజు లున్నా, రాజీనామా లేఖలేని రోజు లేదేమో!

శ్రీ ఖాసా సుబ్బారావు దినపత్రికనుంచి వారపత్రికకు, వారపత్రికనుంచి దినపత్రికకు మారిన సందర్భా లనేకం; శ్రీ ముట్నూరి కృష్ణారావు జర్నలిజం "కృష్ణాపత్రిక"తో ప్రారంభమై, దానితోనే ముగిసింది. సోమవారంనుంచి,

గురువారంవరకు ఆయన ఏమి చదివినా, ఏమి చింతన చేసినా, ఏమి చర్చించినా, ఒకే ఒక విషయంపై ఆయనదృష్టి లగ్నమై వుండేది. అది - ఆ వారపు "కృష్ణాపత్రిక" ప్రధానసంపాదకీయం. నిజానికి అరుదుగా తప్ప ఒకే వారంలో రెండు విషయాలపై ఆయన సంపాదకీయాలను వ్రాసేవాడు కాదు. నాలుగు రోజుల తపస్సుతర్వాత అయిదవ రోజున - శుక్రవారం ఉదయాన - సంపాదకీయరచనకు కూర్చున్నప్పుడు జెట్ విమానం వేగంతో అది నడిచేది. చివరి రోజులలో టేబుల్‌వద్ద కాక, పడకకుర్చీలో ఆయన కూర్చునేవాడు. కరక్కాయ సిరాబుడ్డి ఆ కుర్చీదాపులో ఒక నాలుగుకాళ్ల కొయ్యపీటపై వుండేది. ఇత్తడిపాళీ కలాన్ని సిరాబుడ్డిలో ముంచుతూ, ఎక్కువ సిరా పాళీకి అంటుకొంటే, దాన్ని తన కాళ్లవద్ద పరచిన పాత న్యూస్‌పేపర్‌పై విదిలిస్తూ, తల యెత్తకుండా, దిక్కులకు చూడకుండా, నడుమనడుమ ఆగకుండా ఆయన వ్రాస్తూ పోయేవాడు. ముగింపుకు వచ్చేసరికి కాళ్లదగ్గరి పాత న్యూస్‌పేపర్ కరక్కాయ సిరా మరకలతో నిండిపోయి, అమావాస్య చీకటికంటె కారునల్లగా కనబడేది. వ్రాతకు కూర్చున్నప్పుడు ఎక్కడ ప్రారంభించాలో తెలిసినా, ఎక్కడ ఆగిపోవలెనో ఆయనకు బహుశా తెలిసేది కాదనుకుంటాను. అసాధారణమైనది ఆయన భావనాపటిమ. ఎక్కడెక్కడికో అది ఆయనను తీసుకువెళ్లేది; దృశ్యంతర్వాత దృశ్యాన్ని కళ్లకు కట్టినట్టు ఆయనకు చూపించేది; వ్యక్తుల, సమస్యల అంతరాంతరాలను ఆయనకు విశదపరిచేది; అన్నిటినీ మించి, ఆయన రచనకు అద్భుతమైన ప్రావాహికగుణాన్ని కల్పించేది. అది సాధారణ ప్రవాహమైనా కాదు, నయగరా జలపాతం. ఎంత మేరకు అది దూసుకుపోతుందో తెలియనందున "కృష్ణాపత్రిక"లోని మధ్యనాలుగుపేజీలను దానికోసం ఖాళీగా వుంచేవారు. ఒక్కొక్క వారం ఆ నాలుగు పేజీలకు అది పూర్తిగా విస్తరించేది; తక్కిన వారాలలో అది మిగిల్చిన చోటును నింపడానికి ఏవో కొన్ని ఇతరవ్యాసాలను సిద్ధంగా వుంచుకొనవలసివచ్చేది.

ఈ వివిధసంపాదకుల విభిన్నప్రభావాలు నా సంపాదకీయాలను, వాటి శైలిని ఏ విధంగా రూపొందించినవో నేను చెప్పదగు మాట కాదు. పోతే, నేను చెప్పదగిన మాట ఇది: నా సంపాదకీయం సగటు నిడివి ఏడెనిమిది వందల

మాటలు; దాన్ని వ్రాయడానికి నాకు ముప్పావుగంట కావాలి. దానిలో పావు గంట కృత్యాద్యవస్థతో గడిచిపోతుంది. దానినుంచి బయటపడేసరికి వేస్ట్ పేపర్ బేస్కెట్ సగమైనా నేను చించిపారవేసిన కాగితపు ముక్కలతో నిండుతుంది. ఒకసారి దారిని పడితే, వ్రాత చకచక ముందుకు సాగిపోతుంది. సంపాదకీయ రచనకు ప్రత్యేకించిన సమయంలో నాకు ఏకాంతం కావాలి, ఏకాగ్రత కావాలి. వ్రాతకు పెన్సిల్, ఫౌంటెన్ పెన్, బాల్‌పాయింట్ పెన్, ఏదైనా యిబ్బంది లేదు. అయితే, ఇంచుమించు ఎనిమిది అంగుళాలపొడవు, అయిదున్నర అంగుళాల వెడల్పు న్యూస్‌ప్రింట్ ప్యాడ్స్ కావాలి. వ్రాసేవి ఏడెనిమిది వందల మాటలైనా అందుకు వాడేవి (చింపి పారవేసేవాటితో సహా) వంద పేజీలకు పైగా. నేను వ్రాసినదాన్ని కంపోజ్ చేయడానికి ఒక రిద్దరికి ప్రత్యేకశిక్షణ యిచ్చుకోవాలి. ఒక్కొక్కసారి నేను వ్రాసింది నాకే అయోమయంగా వుంటుంది. వ్రాస్తున్నది వ్రాస్తున్నట్టుగా కంపోజ్ అయిపోతుంది. ప్రూఫులలో చేర్పులు మార్పులు అరుదుగా తప్ప జరగవు. గడియారంతో పరుగుపందెం వేస్తూ పని చేయవలసిన డెయిలీ న్యూస్‌పేపర్ ఆఫీసులో అందుకు విరామం లభించదు.

కాగా, ఈ సంకలనంలో చేర్చిన సంపాదకీయాలనుగురించి కూడా కొంత చెప్పాలి. కొన్ని సందర్భాలలో పాత శీర్షికలను మార్చవలసిన అవసరం కనబడినందున, ఆ పని చేశాను. పునరుక్తిదోషాన్ని తొలగించడానికి అక్కడక్కడ కొన్ని వాక్యాలను, లేదా పేరాలను తగ్గించాను. స్పష్టతకోసం కొన్ని భాగాలను స్వల్పంగా సవరించాను. ఉచితమని తోచినచోట్ల నుడికారాన్ని కూడా సవరించాను. అయితే, ఒక్క పనిమాత్రం చేయలేదు. కడచిన మూడు దశాబ్దాలలో నా అభిప్రాయాలలో కొన్ని నిశ్చయంగా మార్పు చెందాయి, విశేషంగా మార్పు చెందాయి. ఆ మార్పుదృష్ట్యా నా పాతరచనలను సవరించడం అనుచితం కాబట్టి, దాన్ని ఎంతమాత్రం చేయలేదు.

భాష, సాహిత్యం, కళలపై నేను వ్రాసిన సంపాదకీయాలు, ఇతర వ్యాసాలు పదులసంఖ్యలో వున్నాయి, వ్యక్తులనుగురించి వ్రాసినవి వందల సంఖ్యలో వున్నాయి. ఆరోగ్యం మరింత క్షీణించక పోతే. వాటిని మూడు, నాలుగు విడివిడి సంపుటాలుగా ప్రచురించాలని అనుకొంటున్నాను.

సంపాదకీయాలకు నా ముందుతరంలోగల ప్రాధాన్యం నా తరంలోనే తగ్గింది. ఇప్పుడు మరింత క్షీణించింది. ఇది కేవలం మన దేశానికి పరిమితమైన పరిణామం కాదు; దేశదేశాలలో ఇంతే జరుగుతున్నది. ఇందుకు స్పెండర్‌వంటి సంపాదకులు అరుదుకావడం ఒక కారణం కాగా, "వెస్ట్‌మినిస్టర్" వరసగా పదహారు సంవత్సరాలు తనను నష్టపరిచినా, అందుకు వెనుదీయని సర్ జార్జి న్యూన్స్‌వంటి (1851-1910) పత్రికావ్యవస్థాపకులు కరవు కావడం ఇంకొక కారణం; "మాంచెస్టర్ గార్డియన్" తనదైనా, దానినుంచి సాలుకు 2500 పౌనుల జీతం మాత్రం పుచ్చుకొని, తక్కిన లాభాలను పత్రికాభివృద్ధికై వినియోగించిన సి. పి. స్కాట్‌వంటి ఎడిటర్-ప్రొప్రయిటర్లు మిగలకపోవడం మరొక కారణం. కారణా లేవైనా, నేటి సంఘంలో సంపాదకునికి, అతడి సంపాదకీయాలకు పూర్వపు గౌరవప్రతిష్ఠలు లేవు. నా జీవితకాలంలో సంపాదకుని ప్రతిపత్తి ఇంతగా దిగజారిపోవడం నాకు మరింత బాధాకరం. ఈ శోచనీయపరిణామానికి నా స్వల్పపరిధిలో నా బాధ్యత ఏపాటి దన్న ఆత్మసంశోధన ఇటీవల నన్ను ఎక్కువగా కృంగదీస్తున్నది.

సంపాదకునికి లేని గౌరవం అతడి సంపాదకీయాలకు రాదు. విశ్వమానవ దృష్టి, శీలసంపద, ధర్మాభినివేశం లేనివాడు, ఏమైనాకావచ్చుగాని, ఉత్తమశ్రేణి సంపాదకుడు కాలేడు.

"లుంబిని"
బంజారా హిల్స్
హైదరాబాద్
జులై 7, 1976

నార్ల వెంకటేశ్వర రావు

138

మూడు దశాబ్దాలు

ఎన్నికచేసిన సంపాదకీయాల సంకలనం

1944 - 1974

మహోపన్యాసం

ఆయన పండు ముదుసలి. లోతుకు పోయిన కళ్లతో, జారిపోయిన దవడలతో, పాలిపోయిన ముఖంతో, శుష్కించిన దేహంతో కేవలం ఎముకల గూడువలె వున్నాడు. "కూర్చుంటే లేవగలడా? లేస్తే కూర్చోగలడా?" అని ఆయనను చూచినంతనే అనుమానం తోచింది.

కాని, ఉపన్యాసాన్ని ప్రారంభించినంతనే ఆయనలో ఎంత మార్పు! కళ్లు కాంతు లీనాయి; ముఖంలో అనిర్వచనీయమైన దీప్తి తాండవించింది; గొంతు కంచుగంటవలె మోగింది; ఆయన శరీరమే ఉప్పొంగి పోయినట్టు తోచింది. "ఎదుట నున్నది ఎనభయ్యో పడిలో పడిన ముదుసలి కాడు; ఉత్సాహంతో, విశ్వాసంతో జీవితప్రాంగణంపై అడుగుపెడుతున్న నవయువకుడు" అన్నట్టు తోచింది!!

సందేహం లేదు; నిన్న రైట్ ఆనరబుల్ వి. ఎస్. శ్రీనివాసశాస్త్రి* చేసిన ఉపన్యాసం చిరస్మరణీయమైన ఒక మహోపన్యాసం.

పత్రికాసంపాదకులు జీవితంలో వెలుగులనే కాదు, నీడల్ని కూడా చూస్తారు; శిఖరాలనే కాదు, లోయల్నికూడా చూస్తారు; అందువల్ల వారిని పదజాలం కదిలించ లేదు, ఉద్బోధనలు ఉత్సహింప జెయ్యలేవు. కాని, నిన్న మాత్రం ప్రతి పత్రికాసంపాదకుడు కేవలం సమ్మోహితుడై, రైట్ ఆనరబుల్ శ్రీనివాసశాస్త్రి గంభీరోపన్యాసాన్ని విన్నాడు.

---

* [1869-1946] గోఖ్లే శిష్యుడు; గోఖ్లేతర్వాత సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ అధ్యక్షుడు. లిబరల్ నాయకుడు.

వక్త నిష్కళంకహృదయుడు, పావనచరితుడు, దేశభక్తుడు, మానవ కల్యాణాభిలాషి. ఇక, ఆయన ఉపన్యాసవిషయం అసామాన్యమైనట్టిది. నిన్నటి సభ చిరస్మరణీయమైందిగా పరిణమించడానికి ఇవే కారణాలై వుండవచ్చు.

''యుద్ధం సమాప్తి కానున్నది. ప్రపంచ శాంతి సమావేశం త్వరలో కూడుతుంది దానిలో మన ప్రతినిధు లెవరు? ఇండియా ఆఫీసు నామినేట్ చేయగల కొరగానివారా?" అని ప్రశ్నించినప్పుడు శాస్త్రి నేత్రాలనుంచి విస్ఫు లింగాలు రాలినవి.

"మనది విశాల దేశం, మనది ప్రాచీన సభ్యత, మనది బహుళ ప్రజ. ఇట్టి మనకు ప్రతినిధిగా వామనమూర్తి ఆమెరీ-అతడి యెత్తు అయిదడు గుల నాలుగు అంగుళాలని నాకు జ్ఞాపకం - ప్రపంచశాంతి సమావేశంలో కూర్చుంటే. అంతకంటె సిగ్గుచేటు పని వుండగలదా?" అని శాస్త్రి ఉద్ఘోషించి నప్పుడు ఆవేశంతో ఆయన జీర్ణదేహం కంపించింది.

"మన గాంధి అహింసకోసం, శాంతికోసం తన జీవితాన్ని అంకితం చేశాడు. అసలు ఆయన నామధేయమే శాంతికి పర్యాయపదం. అట్టి నాయక శిఖామణి, అట్టి మానవోత్తముడు - మన గాంధిని మించి ప్రపంచశాంతి సంస్థా పనకై సందేశ మివ్వగలవా రెవరు? ఆయన ఆగాఖాన్ ప్యాలెస్‌లో బందీగా వుండగా శాంతి సమావేశమా? ఇంతకంటె హాస్యాస్పద మేది? దీన్ని మించిన విపరీత మేది?" అని శాస్త్రి గర్జించినప్పుడు ఆయన వాణిద్వారా ప్రపంచ ప్రజానీకమే ఘూర్ణిల్లినట్టు తోచింది.

వాస్తవానికి అది ఒక ఉపన్యాసం కాదు; కేవలం ఒక మహానదీప్రవాహం. మహోన్నత శిఖరంనుంచి దూకుతున్నట్టు కొన్ని సందర్భాలలో అది దిక్కులను ప్రతిధ్వనింప జేసింది; సమతలాన్ని చేరి, విశాలమై, గంభీరమై ప్రవహిస్తున్నట్టు మరికొన్ని సందర్భాలలో అది కనబడింది. ఇంతే కాదు. కొన్ని చోట్ల కోడి దూడవలె త్రుళ్లింతలాడింది; కొన్ని చోట్ల కృష్ణసర్పంవలె బుసలు కొట్టింది; కొన్ని చోట్ల నర్తకివలె నాట్యం చేసింది.

నిన్నటి ఉపన్యాసం విన్నవారు నిజంగా ధన్యులు!

[జనవరి 12, 1944]

వీరేశలింగం

నిస్సందేహంగా ఆధునికాంధ్ర మహాపురుషులలో అగ్రస్థానం కందుకూరి వీరేశలింగం గారిదే.* ఆయన యుగసంధ్యలో జన్మించాడు, యుగధర్మాన్ని పాలించాడు, యుగపురుషుడై విభాసించాడు.

మెదడుకు పని కల్పించక, వివేకానికి తిలోదకాలు వదలి, హృదయాన్ని కఠిన శిలగా మార్చుకుని, అంధప్రాయంగా అజ్ఞానకూపంలో బ్రతుకుతూ, అదే స్వర్గమని మనం భ్రమసిన ఆ సమయంలో వీరేశలింగం కార్యరంగంలో ప్రవేశించాడు. సంఘ పరిస్థితులను శ్రద్ధగా పరీక్షచేశాడు. ఏ దిక్కుకు చూచినా ఆయనకు అవిద్యే కనిపించింది, అజ్ఞానమే గోచరించిది. అక్రమాలే ఎదురైనాయి.

ఈ అజ్ఞాన తిమిరాన్ని నే నొక్కడినే తరిమివెయ్యగలనా ? ఈ పాప పంకిలాన్ని నే నొక్కడినే కడిగివెయ్యగలనా ? ఈ సాంఘికదురాచార కీకారణ్యాన్ని నే నొక్కడినే దహించివెయ్యగలనా ? ఇట్టి సందేహాలు ఒక్క క్షణమైనా ఆయనను బాధించలేదు. చరిత్ర నా పక్షాన వున్నది. అయినప్పుడు నే నొక్కడిని కాదుగదా ? ధర్మం నా పక్షాన వున్నది. అయినప్పుడు నే నొక్కడిని కాముగదా ? భగవంతుడే నా పక్షాన వున్నాడు. అయినప్పుడు నేనొక్కడిని కాదుగదా ? ఈ ధైర్యంతోనే తను ఏకాకినన్న సంకోచం లేశమైనా లేకుండా ఆయన కార్యరంగంలో ప్రవేశించాడు.

ఆనాటినుంచి, భౌతికదేహాన్ని చాలించినంతవరకు ఆయన జీవితం ఒక అనుక్షణ సమరం; ఒక అవిరళ కష్టగాథ, ఒక మహత్తర త్యాగగీతం, ఒక అపూర్వ ప్రేమపుష్పాంజలి, ఒక కరుణార్ద్రకావ్యం.

''ఈ ప్రపంచ మహాసంగ్రామంలో నేను మీకు వాగ్దానం చెయ్యగలిగింది స్వేదం, రక్తం, అశ్రువులు మాత్రమే" — ఇది సర్వవినాశం తప్పదేమో అని తోచిన గాఢాంధకార సమయంలో బ్రిటిష్ ప్రధాని చర్చిల్ బ్రిటిష్ ప్రజలకు చెప్పిన మాట. ఏకాకిగా తాను నడిపిన మహాసంగ్రామంలో ఇంతకుమించి

---

* [1848 - 1919]

తనకు తాను వీరేశలింగం ఏమీ వాగ్దానం చేసుకోలేదు. అయితే, విషాదాశ్రువులతో పాటు ఆనందబాష్పాలకు కూడా ఆయన నోచుకోగలిగాడు. ఆశాభంగాల మధ్య విజయశిఖరాలను కూడా ఆయన అప్పుడప్పుడు అందుకోగలిగాడు. తన కృషి, తన త్యాగం, తన కష్టాలు కేవలం వృధాకావడం లేదని తోచిన మధుర క్షణాలు ఆయనకు కొన్ని తన జీవితంలోనే లభించాయి. యుగప్రవక్తలు కొందరికంటె అంతవరకు ఆయన ధన్యుడే!

మానవస్వభావం అతి చిత్రమైనట్టిది. తన దైనందిన పరిసరాలు, తన సాంప్రదాయిక మతవిశ్వాసాలు, తన వర్తమాన ఆచారవ్యవహారాలు మొదలైనవి అవిచ్ఛిన్నంగా వస్తున్నవనే మానవుడు భ్రమపడుతూ వుంటాడు. చీకటి పడగానే స్విచ్ వేసే గృహస్థుకు ఎలక్ట్రిక్ దీపం దాదాపు అర్ధశతాబ్దికిందనే కనిపెట్టబడిందన్న సంగతి స్ఫురణకు రాదు. రైలులో, ట్రామ్‌లో, మోటార్‌లో, విమానంలో సుఖంగా ఎక్కికూర్చునే వ్యక్తులకు ఆ ప్రయాణసౌకర్యాలన్నీ ఆధునిక వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్రఫలితాలనే విషయం తోచదు.

ఇదే విధంగా మన వర్తమాన సాంఘికవ్యవస్థ ఎందరి కృషి ఫలితమో, ఎన్ని సంఘర్షణల పరిణామమో, మరెన్ని త్యాగాల ముక్తాఫలమో మనం సామాన్యంగా గుర్తించము. వీరేశలింగం విషయంలో చాలావరకు ఇంతే జరుగుతున్నది.

నేడు బాల్యవివాహాలను నిరోధించడానికి ఒక ప్రత్యేకశాసనం వున్నది: కాని, బాల్యవివాహాలను ఆదిలో ఖండించింది ఆయనే అని ఎందరికి తెలుసు నేడు వితంతువివాహాలను సంఘం ఆమోదిస్తున్నది, లేదా కనీసం సహిస్తున్నది. కాని ప్రతి ఒక్క వితంతువివాహాన్ని జరపడానికి ఆయన తమ ప్రాణాన్ని పణంగా పెట్టవలసివచ్చిందని ఎందరు గుర్తిస్తున్నారు? సభ్యమానవుడనని యెంచుకునే ప్రతి తండ్రి కూడా తన కుమారులతోపాటు కుమార్తెలకు కూడా ఈనాడు చదువు చెప్పిస్తున్నాడు. కాని, స్త్రీ విద్యావశ్యకతనుగురించి ఆయన చెవి నిల్లుకట్టుకొని చెప్పవలసి వచ్చినట్టు ఎంద రెరుగుదురు? నేడు పద్యం కంటె గద్యానికే ఎక్కువ ప్రచారం. కాని, గద్యరచనకు ప్రప్రథమంగా రూపురేఖల్ని దిద్ది, వ్యాప్తిలోకి తెచ్చింది ఆయనే అని ఎందరు సంస్మరిస్తున్నారు?

ఇట్టి పెద్ద విషయాలలో కాకుండా చిన్న చిన్న విషయాలు ఎన్నింటి లోనో కూడా వీరేశలింగం ఆంధ్రజాతికి మార్గదర్శకుడైనాడు. హిస్టీరియాను చూచి, దయ్యాలు, భూతా లనుకొనవలదని తొలుదొల్త ప్రచారం చేసింది ఆయనే. ప్రభుత్వాధికారులలో లంచగొండితనాన్ని మొట్టమొదటిగా ఎదుర్కొన్నది ఆయనే. సభలలోను, నాటకప్రదర్శనాలలోను పాల్గొనడం దోషంకాదని మున్ముందుగా ఉద్ఘోషించింది ఆయనే. మతవిభేదా లేమి, కులతత్వా లేమి భారత సంఘానికి వేరుపురుగులుగా పరిణమించినవని గ్రహించి, సహపంక్తి భోజనా లను ఓంప్రథమంగా ఏర్పాటు చేసింది ఆయనే. అస్పృశ్యతా నివారణకు, వ్యభిచారవృత్తి నిరోధానికి ఆదిలో కృషి చేసింది ఆయనే. పత్రికలు సారస్వత సేవతోనే సరిపుచ్చక, ప్రజాసేవకు సయితం పూనుకోవాలని చెప్పి మార్గ దర్శకుడైంది ఆయనే.

ఈ విధంగా ఆంధ్రజాతికి ఆయన సర్వతోముఖమైన సేవ చేశాడు. అయినా, ఆయన సేవ సారస్వత, సాంఘిక రంగాలను మించిపోలేదని ఒక దురభిప్రాయం పెక్కుమందిలో వున్నది. ఆయన జీవితచరిత్ర సమగ్రంగా తెలియకపోవడమే ఇందుకు కారణం. పారిశ్రామికాభివృద్ధిలేనిదే మన దేశానికి ఆర్థికంగా అభ్యున్నతి లేదని ఆయన 1880లోనే ఉద్బోధించాడు. మన దేశానికి ఆహారపదార్థాలు సమృద్ధిగా లేవనీ, విద్యాధికులైనవారు వ్యవసాయంలో శ్రద్ధ వహించి, కొత్త పద్ధతులపై సేద్యం చెయ్యాలనీ ఆయన అప్పుడే హెచ్చరించాడు కూడా ! పోతే, రాజకీయాలవిషయంలో కూడా ఆయన శ్రద్ధ చూపకపోలేదు. సంఘసంస్కరణ విదేశపరిపాలనకింద కష్టసాధ్యమని ఆయన గుర్తించాడు. అందువల్లనే ఆయన కాంగ్రెసులో సభ్యుడుగా చేరి, పూనాలో జరిగిన మూడవ కాంగ్రెసు మహాసభలో పాల్గొన్నాడు. కేవలం ఆ మహాసభలో పాల్గొనడమే కాదు; పూనానుంచి తిరిగివచ్చినంతనే కాంగ్రెసు జాతీయ స్వాతంత్ర్య లక్ష్యా లనుగురించి ప్రచారం కూడా చేశాడు. ఆంధ్రజాతికి ఇన్నివిధాల, ఇంతగా సేవ చేసిన వీరేశలింగం, మేము ఆదిలోనే పేర్కొన్నట్లు, యుగసంధ్యలో జన్మించి, యుగధర్మాన్ని పాలించి, యుగకర్తగా విభాసించిన మహాపురుషుడు.

[మే 27, 1944]

18

చర్చిల్ ను గెలిపిస్తే ....

బ్రిటన్ రోజులు బాగున్నాయి. అందువల్లనే దానికి ప్రస్తుత యుద్ధంలో చర్చిల్* నాయకత్వం లభించింది.

బ్రిటన్‌రోజులు ఇకముందు కూడా బాగుండగలవా ? ఇది నిజం కావాలంటే, యుద్ధం ముగిసిపోయినంతనే చర్చిల్ నాయకత్వాన్ని అది కోల్పోవాలి.

"మహావిపత్సమయంలో మేరుపర్వతంవలె నిలిచి, దేశాన్ని రక్షించాడు. అయినప్పుడు చర్చిల్‌ను త్రోసిరాజనడం కృతఘ్నతకాదా ?": ఇట్టి భావం బ్రిటిష్ ప్రజలలో బలీయమైతే, ఒక్క బ్రిటన్‌కే కాదు, సమస్త ప్రపంచానికే విపత్తు తప్పదు.

యుద్ధనాయకుడుగా చర్చిల్‌ను చాలగలిగినవారు అరుదు. ఇక, శాంతి నాయకుడుగా ఆయనను మించి అపకారం చెయ్యగలవారు సయితం అరుదే!

తమ కుటుంబవాతావరణ ప్రాబల్యాన్ని త్రోసిపుచ్చి, తమ అజన్మ పరిసరాల ప్రభావాన్ని ధిక్కరించి, స్వతంత్రదృష్టిని ప్రదర్శిస్తూ సాహసోపేతంగా సమస్త సమస్యలను సమీక్షచేసి, సముచిత కర్తవ్యాన్ని నిర్ణయించగలగడం ఏ గాంధికో చెల్లు, లేదా ఏ లెనిన్‌కో చెల్లు.

చర్చిల్ గొప్పవాడే కావచ్చు, కాని, ఆయన గాంధి, లెనిన్ ప్రభృతుల అంతస్తును చేరలేడు.

చర్చిల్ కన్సర్వేటివ్ కుటుంబంలో పుట్టి పెరిగాడు. కొంతకాలం పాటు లిబరల్ పార్టీలో చేరినప్పటికీ, తన కన్సర్వేటివ్ సంప్రదాయాన్ని ఎన్నడూ ఆయన వాస్తవానికి అధిగమించలేక పోయాడు.

---

* [1874 - 1965]

కన్సర్వేటివ్‌ల దృష్టిలో బ్రిటిష్‌సామ్రాజ్యం కేవలం భగవన్నిర్మితం. దానితో సరితూగ గల ఉత్తమనిర్మాణం, న్యాయవ్యవస్థ, ధర్మరాజ్యం మరి లేదు, వుండదు.

అందువల్ల గత ప్రపంచమహాసంగ్రామంవలె ప్రస్తుత మారణహోమం సయితం బ్రిటిష్ సామ్రాజ్య సుస్థిరత్వానికి ప్రోదిచేయాలి. లేకపోతే, ఈ ప్రపంచయుద్ధాలలో కురియించబడిన స్వేద మేమి, రక్త మేమి, అశ్రువు లేమి, కేవలం వృధా అయిపోయినట్టే!

ఉత్ప్రేక్షకోసం మేము ఈ విధంగా అనడం లేదు. మా పలుకులకు సమర్థన, — కామన్సు సభలో బ్రిటిష్ విదేశాంగనీతినిగురించి గతవారంలో జరిగిన చర్చలో భావిప్రపంచ వ్యవస్థపై చర్చిల్ చేసిన ప్రకటనే.

భావి ప్రపంచశాంతి రక్షణకు ఒక అంతర్జాతీయ సంస్థను నిర్మించడం అవసరమని ఈ ప్రకటనలో చర్చిల్ సూచించాడు. ప్రస్తుతం మృతప్రాయమైన నానాజాతిసమితివలె కాక, ఆ నూతనసంస్థకు ప్రపంచ శాంతిరక్షణకు అవసరమైన ఆయుధబలం వుండాలని ఆయ నన్నాడు. ఇంతటితో ఆయన ఆగితే, ఆయన ప్రతిపాదనలు - పూర్తిగాకాకపోయినా, కొంతవరకైనా - నిరాక్షేపణీయమైనవే అని అనకోవచ్చు.

కాని, చర్చిల్ దృష్టిలోగల భావి అంతర్జాతీయ వ్యవస్థలో వివిధ స్వతంత్రరాజ్యాలకు సమానస్థానం, ప్రతిపత్తి వుండవు. బ్రిటిష్‌సామ్రాజ్యం, యునైటెడ్ స్టేట్సు, సోవియట్ రష్యా: ఈ మూడు రాజ్యాల పలుకే శాసనంగా దానిలో చెల్లాలి.

ఇదే జరిగిననాడు కొన్నికొన్ని రాజ్యాలను ఒక కూటంగా ఏర్పరచడానికి ప్రయత్నా లేమి, ఒక కూటంకంటె మరొకటి శక్తిమంతమైనది కాకుండా చూడ్డానికి కుట్రలేమి, రహస్యసంధు లేమి, ఆ సంధుల అతిక్రమణ లేమి తిరిగి ఘోరంగా చెలరేగుతాయి. దీని ఫలితంగా ఇంకొక పాతిక సంవత్సరాలకు మరొక ప్రపంచయుద్ధం ప్రజ్వలించవచ్చు.

ఇది కేవలం మా అభిప్రాయం మాత్రమే కాదు, "న్యూయార్క్ వరల్డ్ టెలిగ్రాం" పత్రిక మొన్న ఒక సంపాదకీయాన్ని వ్రాస్తూ, సరిగా ఈ అభి

ప్రాయాన్నే వెల్లడించింది. దాని వ్యాఖ్యప్రకారం చర్చిల్ ఉద్దేశిస్తున్న కొత్త అంతర్జాతీయసంస్థ కేవలం ఒక కపటనాటకం మాత్రమే. అయితే మేము మాత్రం ''చర్చిల్ కపటి" అనే ఆరోపణను చెయ్యము.

ఇంపీరియలిస్ట్ వాతావరణంలో పుట్టి పెరిగిన చర్చిల్‌కు ఇంపీరియలిజం లేకుండా ప్రపంచం మనలేనని తోచడం సహజం.

ప్రపంచయుద్ధాలకు మూలకందం ఇంపీరియలిజమే అని మీకు తెలియవచ్చు, మాకు తెలియవచ్చు. కాని, చర్చిల్ మాత్రం తన ప్రవృత్తికారణంగా ఈ నగ్నసత్యాన్ని కానలేడు. అందువల్ల ఆయన వైఖరిపట్ల ఆగ్రహాన్ని ప్రదర్శించడం తగదు; ఆయన స్వాభావిక సంకుచితదృష్టికి విచారించాలి.

అయితే, చర్చిల్ స్వభావంలోని ఈ లోపాన్ని గుర్తించి, యుద్ధం ముగిసినంతనే నాయకత్వంనుంచి ఆయనను బ్రిటిష్ ప్రజలు తొలగించకపోతే మాత్రం, ఆ పొరపాటుకు బ్రిటన్‌తోపాటు, ప్రపంచమే మరొక మహాసంగ్రామం రూపంలో కఠోరమూల్యాన్ని చెల్లించ వలసివుంటుంది.*

[మే 30, 1944]

---

* 1945 లో జరిగిన ఎన్నికలలో చర్చిల్ పార్టీ ఓడిపోయింది; ఆయన ప్రధాని పదవికి రాజీనామా చేశాడు.

21

అమరజ్యోతి

పారిస్‌కు దాస్యవిముక్తి! పారిస్‌పై తిరిగి జేగీయమానంగా ఫ్రెంచి త్రివర్ణపతాకం!! దీన్ని విన్నంతనే ప్రతి మానవ స్వాతంత్ర్యారాధకుని హృదయం పులకితం కాదా?

"పారిస్ పతనం ఈ క్షణమో, మరుక్షణమో!"—ఈ వార్త నాలుగైదు రోజుల క్రితమే వచ్చింది. ఈ వార్త వచ్చినప్పుడు "పారిస్‌దిశలో అప్రతిహతంగా పురోగమిస్తున్న మిత్రసేనలే ఆ నగరవిముక్తిని సాధించేవరకు వేచివుండడం పారిస్‌చరిత్రకే కళంకం కాదా?" అనిపించింది. ఎన్నో స్వాతంత్ర్యోద్యమాల కది జన్మస్థలం; ఎన్నో విప్లవసంఘాల కది కార్యరంగం; ఎన్నో నూతన భావాల కది ప్రథనభూమి. ప్రాచీన పాశ్చాత్యప్రపంచంలో రోంవలె అధునాతన యూరోపియన్ చరిత్రలో జ్యోతిర్మయంగా అది వెలిగింది. అది అపారవిద్యాపీఠం, అప్రతిమ కళావాటి, అకర్మ విజ్ఞానకేంద్రం, అసమాన సభ్యతాజ్యోతి.

"స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాత్రం" అనే నినాదాలతో ప్రజావిప్లవశిఖలు ప్రజ్వరిల్లి, తమ దీప్తితో మానవకోటికి ఒక నూతన ప్రపంచ స్వరూపాన్ని ప్రప్రథమంగా పొడగట్టజేసింది ఆ నగరంనుంచే. ఫ్యూడలిజం మానవ సభ్యతావికాస నిరోధకశక్తిగా పరిణమించినందున, ఇక దాని స్థానాన్ని జాతీయత ఆక్రమించాలన్న మహోద్యమం విశ్వరూపం ధరించింది ఆ నగరంనుంచే. రాజకీయరంగంలోనే కాకుండా, ఆర్థిక విషయాలలో కూడా సర్వమానవసమానత్వాన్ని ఉద్ఘోషించడానికి తాత్కాలికంగానైనా వీరోచితయత్నాన్ని మొట్టమొదటిగా చేసిన పారిస్ కమ్యూన్ అవతరించింది కూడా ఆ నగరంలోనే.

ఆధునికయుగంలో ఆదినుంచీకూడా ప్రజల ఆశల కేమి, ఆశయాల కేమి, శక్తి కేమి, శౌర్యాని కేమి పారిస్ నగరం క్రీడారంగ మైంది. అందువల్లనే దాని సౌందర్యం బాహ్యమైనదే కాదు, ఆంతరంగికమైనది కూడా. దాని

ఆకర్షణ భౌతికమైనదే కాదు, నైతికమైనది కూడా. కేవలం విలాసాన్ని కోరేవారు మాత్రమే కాకుండా, సారస్వతసేవకు లేమి, కళారాధకు లేమి, విజ్ఞానపిపాసువు లేమి, నూతన భావప్రేరితు లేమి, విప్లవ విజయాకాంక్షు లేమి పారిస్‌నగరాన్ని ఒక పవిత్రకేంద్రంగా భావించడానికి దాని ఈ ఆంతరంగిక సౌందర్యమే, దాని ఈ నైతికసంపత్తే ముఖ్యకారణం.

ఈ నగర వాతావరణంలో వికసించి, ప్రపంచ చరిత్రలోనే అమర స్థానాన్ని గడించుకున్న విభిన్నవ్యక్తుల సంఖ్య అల్పమైంది కాదు. నెపోలియన్, మార్షల్ ఫోష్‌లను పోలిన మహాసేనాలు, కార్డినల్ రీషెలూను పోలిన రాజనీతి విశారదులు; జోన్ ఆఫ్ ఆర్క్‌ను పోలిన జాతీయవీరాంగనలు; రోబస్‌పేర్, మారా, డాన్టాన్‌లను పోలిన విప్లవోద్యమాల నాయకులు; లావాజే, లూయీ పాశ్చర్‌లను పోలిన వైజ్ఞానికశాస్త్రవేత్తలు; రూసో, వాల్టేర్, దిదిరోలను పోలిన నూతనభావ ప్రచారకులు; మోలియర్, బాల్జాక్, హ్యూగో, మపాసా, అనతోల్ ఫ్రాన్స్, రోమా రోలాలను పోలిన మహారచయితలు: వీరందరి అపార శక్తులకు తగిన విశాల కార్యరంగమైంది పారిస్ నగరమే !

ఇట్టి పారిస్ నగరానికి చెందిన పౌరులు మిత్రసేనలు వచ్చి, తమ విముక్తిని సాధించేవరకు మిన్నకుంటే, అది (మేము ఇదివరలోనే చెప్పినట్టు) తమ పూర్వ చరిత్రకే కళంకం కాదా ?

అందువల్లనే వారు ఒక్కుమ్మడిగా గత 19 వ తేదీని విప్లవాన్ని ప్రారంభించారు. నాలుగు రోజుల భీషణ యుద్ధానంతరం తమ నగరంలో తిరిగి తమ త్రివర్ణపతాకాన్ని సగర్వంగా ఎగరవేశారు.

1940 జూన్ 14 వ తేదీని ఈ పతాకం తన స్థానంనుంచి దొర్లి, ధూళి ధూసరితమై పోయింది. ఫ్రెంచి రాజకీయవేత్తల నైతికదారిద్ర్యంవల్లనే, ఫ్రెంచి సేనాధిపతుల హ్రస్వదృష్టివల్లనే ఫ్రెంచి త్రివర్ణపతాకానికి ఈ దుర్గతి పట్టింది. కాని, ఫ్రెంచి ప్రజలుమాత్రం పరాజయాన్ని అంగీకరించలేదు. పరిస్థితులు అనుకూలించినంతనే తమ స్వాతంత్ర్య పునర్విజయానికి వారు రహస్యంగా సన్నద్ధపడ్డారు. ఏ పరిస్థితులకై ఫ్రెంచి ప్రజలు వేచివున్నారో, అవి సిద్ధించి నంతనే పారిస్‌పై నేడు తిరిగి త్రివర్ణపతాకం ఎగురుతున్నది; ఫ్రెంచి భూతలం తిరిగి స్వాతంత్ర్యరుచులలో శోభిల్లుతున్నది.

[ఆగస్టు 25, 1944]

23

ఆంధ్ర శిల్పసంపద

ఆంధ్రుల శిల్పసంపద తిరిగి అన్యులపాలు కావలసిందేనా?

అమరావతి, జగ్గయ్యపేట, ఘంటశాల: ఈ విధంగా ఇదివరలో ఎన్ని చోట్ల ఆంధ్రభూమిలో పురాతన శిల్పసంపద లభించలేదు? కాని, ఇది దాదాపు పూర్తిగా రాష్ట్రాంతరాలకు చేరింది. అందువల్ల బౌద్ధయుగంనాటి ఆంధ్ర శిల్పుల కళాసృష్టిని సందర్శించాలంటే, ఇటు మద్రాసుకో, అటు కలకత్తాకో వెళ్లవలసిన దుర్గతి యేర్పడింది. కేవలం మద్రాసు, కలకత్తా నగరాలలోని పురావస్తు ప్రదర్శనశాలలకే కాదు; లండన్, పారిస్, బోస్టన్ నగరాలలోని వాటికి సయితం ఆంధ్రశిల్పాలు శోభ కూర్చుతున్నాయి.

"ఇదుగో! ఇది ఒక ప్రాచీన బౌద్ధవిహార స్తంభం. దీనిపై కొనలు తేలిన ఈ లతలు, అరవిచ్చిన ఈ పువ్వులు ఎంత సొగసుగా వున్నాయి!"

"అవిగో! అవి పురాతన బౌద్ధస్తూపాన్ని అలంకరించిన శిల్పఫలకాలు. ఒక్కొక్క ఫలకం ఒక్కొక్క జాతక కథకు అమరరూపాన్ని కల్పిస్తున్నది. ఇదుగో! ఆమె సుజాత, పుత్రమరణ దుఃఖోద్వేగభరంతో ఆమె సర్వాంగాలు కంపించిపోతున్నాయి. 'నాకు పుత్రభిక్ష పెట్టరా?' అంటూ గౌతమ బుద్ధునికి ఆమె ప్రణమిల్లుతున్నది. ఆమె దుఃఖాన్ని చూడగా, ఆయన కన్నులు చెమ్మగిల్లుతున్నాయి. కారుణ్యకాంతితోపాటు జ్ఞానజ్యోతి సయితం ఆయన నయనాలనుంచి వెల్లివిరుస్తున్నది. ప్రతి జీవికి మరణం తప్పదనే సత్యాన్ని ఆమెకు ఏ విధంగా బోధపరచడమా అని ఆయన ఆలోచిస్తున్నాడు. ఆయన పెదవులు మెదలుతున్నవి. 'బిడ్డా!' అనే పిలుపు వాటినుంచి వెలువడుతున్నది."

"ఇటు చూడండి: ఇది మరొక ఫలకం......ఆమె యశోధర. ఒకనాడు అతిలోకసుందరి. పుత్రజననంతో జీవితం మరింత మధురమైనట్టు సుమధుర స్వప్నాలను కంటూ నిద్రపోయింది. నిద్రలేచేసరికి పతికి దూరమైపోయింది.

ఆ లేతవయస్సులో ఆమెకు ఎంతటి కఠోర పరీక్ష? కాని, నాటి మహాప్రస్థానం నుంచి మానవజాతికి ఒక నూత్న సందేశం లభించింది; ఒక వినూత్న జీవిత పథం యేర్పడింది. తన మృదులహస్తాలనుంచి కూలిపోయిన మధుపాత్రికకై ఆమె విలపించాలా, లోకానికి అమృతభాండం సిద్ధించినందుకు సంతోషించాలా? ఈ ద్వంద్వం ఆమె హృదయాన్ని అహోరాత్రం సంక్షోభపరిచింది. మావిగున్న ఆలంబనాన్ని కోల్పోయిన మాధవీలతవలె ఆమె పూర్తిగా శుష్కించి పోయింది. ఆమె తనువు శుష్కించినకొద్దీ ఆమెలో ఒక నిశ్చయం ప్రబల సాగింది. భర్త అవలంబించిన సర్వసంగపరిత్యాగమార్గాన్నే అనుసరించి, ఆయన శిష్యురాలుగా జీవితపరమావధిని సాధించవలె నన్నదే. ఆ నిశ్చయం. రాజకుమారుడుగా రాజధానీనగరాన్ని విడిచి వెళ్లిన సిద్ధార్థుడు, ఎన్నో దీర్ఘ వత్సరాలతర్వాత, భిక్షువువలె తిరిగి కపిలవస్తుకు వస్తున్నాడు. ఆయన ఆగమన వార్త తెలిసినంతనే, యశోధర భర్తకు యెదురువెళ్లి, ఆయన దివ్యపాదాలకు ప్రణమిల్లుతున్నది. 'మీ అడుగు జాడలనే నన్ను అనుసరించనివ్వరా?' అని వేడుకొంటున్నది."

"అటు తిరగండి! అది బోధిసత్వుని దివ్యమూర్తి. ధ్యాననిమగ్నమై వున్న ఆ ప్రశాంత గంభీర నయనాలు భక్తిభావాన్ని పురికొల్పడం లేదా? ఆ విశాల ఫాలభాగం విశ్వవిశాల భావాలకు ప్రతీక కాదా? ఆ దీర్ఘకర్ణాలు ఆయన మహాత్ముడని చాటడం లేదా? అంగాంగంనుంచి ప్రదీప్తమౌతున్న ఆ కాంతి పుంజం శాంతి నివ్వడం లేదా, ప్రేమను కురియించడం లేదా, కారుణ్యాన్ని చిలకడం లేదా?"

ఈ విధంగా ఆంధ్రుల ప్రాచీన శిల్పసంపత్తిని చూచి, అన్యులు ఆనందిస్తున్నారు, ఆత్మోన్నతి పొందుతున్నారు. తమ శిల్పకళాసంపత్తి దాదాపు పూర్తిగా అన్యులకు పోగా, ఆంధ్రులకు మిగిలింది మట్టి గోతులు మాత్రం!

ఇదివరలో ఈ విషయమై జరిగిన అన్యాయం చాల దన్నట్టు ఇప్పుడు చివరికి నాగార్జునకొండ శిల్పాలను సయితం అన్యప్రాంతాలకు చేర్చడానికి ఆలోచిస్తున్నారు. దీన్ని సహించిన పక్షంలో ఆంధ్రజాతి వెన్నెముక లేనిదని లోకం తీర్మానించుకొనక తప్పదు గదా? ఈ సందర్భంలో వంగీయులైతే ఎలా ప్రవర్తించేవారో ఆంధ్రలోకానికి మేము సూచించవచ్చునా?

"ఇంపీరియల్ లైబ్రరీ'' ప్రస్తుతం కలకత్తా నగరంలో వున్నది. ఒకనాడు భారతదేశానికి కలకత్తా "ఇంపీరియల్ సిటీ" (రాజధానీనగరం) అందువల్ల అప్పటిలో "ఇంపీరియల్ లైబ్రరీ"ని అక్కడ స్థాపించారు. కాని, లార్డ్ హార్డింజ్ వైస్రాయిగా వుండగా, కలకత్తాకు మారుగా, ఢిల్లీ "ఇంపీరియల్ సిటీ" అయింది. "ఇంపీరియల్ సిటీ"తో పాటు "ఇంపీరియల్ లైబ్రరీ" మారడం సహజం, ధర్మం కూడా. అయినా, వంగీయులు తమ నగరంలోని అమూల్యా పుస్తకభాండాగారం మరొక నగరానికి మారడానికి సమ్మతించలేదు. వారి పట్టుదలవల్లనే నేటికి కూడా ''ఇంపీరియల్ లైబ్రరీ" కలకత్తాలో మిగిలింది.

తమది కానిదాని విషయమై వంగీయులు ఇంత పట్టుదల చూపించినప్పుడు తమదైన దాని విషయంలో ఆంధ్రులు పట్టుదల చూపకపోతే, వారిని "వెన్నెముకలేని జాతి" అని లోకం నిజంగానే నవ్వదా ?

[అక్టోబర్ 19, 1944]

* ప్రజోద్యమం ఫలితంగా నాగార్జునకొండలోని శిల్పకళాసంపత్తి దాదాపు పూర్తిగా అక్కడనే నిలిచింది.

రాజ వైద్యుడు

"అవతారంబుల దాల్చినాడు పది" అని శ్రీ మహావిష్ణువును ప్రస్తుతిస్తారు. ఆయనతో లార్డ్ వేవెల్* పోటీ చెయ్యబోతున్నాడు.

సైనికుడుగా లార్డ్ వేవెల్ జీవితాన్ని ప్రారంభించాడు. పిమ్మట "జనరల్స్ అండ్ జనరల్‌షిప్" అనే విషయంపై ప్రసంగాలద్వారా ఉపన్యాసకుడైనాడు. అటు పిమ్మట ఆలెంబీ జీవితాన్ని వ్రాయడంద్వారా జీవితచరిత్రకారుడైనాడు. తర్వాత భారత రాజప్రతినిధి పదవీస్వీకరణద్వారా రాజకీయవేత్త, పరిపాలకుడు అయినాడు. ఆ వెనుక "అదర్స్ ఫ్లవర్స్" అనే కవితాసంపుటికి సంపాదకుడై కవితాభిమాని అయినాడు. ఇక, నేడు కలకత్తాలో ఆకస్మికంగా ఆయన రాజవైద్యుని అవతారాన్ని ధరించాడు.

భారతదేశ రాజకీయ రుగ్మతను పరిశీలించి, దానికి తగు చికిత్సను పేర్కొనడానికి అపర ధన్వంతరివలె ఆయన ఈ ఉపన్యాసంలో ప్రయత్నించాడు. పాకిస్తాన్ శస్త్రచికిత్సతో ప్రస్తుతం అవసరం లేదని ఆయన అన్నాడు. ముందుగా ఇతర చికిత్సాపద్ధతు లన్నింటిని ప్రయత్నించడం శ్రేయస్కరమని కూడా ఆయన హెచ్చరించాడు. ఇంతవరకు ఆయనతో భారత జాతీయవాదు లందరు ఏకీభవించక తప్పదు.

"క్విట్ ఇండియా" కషాయ మేమి, సత్యాగ్రహగుళిక లేమి గుణ మివ్వ లేకపోయినవని అటు పిమ్మట ఆయన పేర్కొన్నాడు. 1942 ఆగస్టులో కాంగ్రెసు నాయకుల నందరినీ ఒక్కుమ్మడిగా అరెస్టు చెయ్యడంద్వారా, అసలు ఈ ఔషధప్రక్రియ ప్రయోగం జరగనే లేదు. ప్రయోగించడానికి అవకాశం లేకుండా చేసి, ఔషధంలో పటిమ లేదనడం సమంజసం కాగలదా?

---

* [1888_1950] ఇండియాలో వైస్రాయిగా 1943నుంచి 1947వరకు. అంతకు ముందు 1941-43 సంవత్సరాలలో ఇండియాలో సర్వసేనాని.

పాకిస్తాన్ ఆపరేషన్ కూడదని, సత్యాగ్రహం గుళికలు తగవని చెప్పిన ఈ రాజవైద్యుడు తాను తిరుగులేని మరొక మందును సూచించగలిగాడా అంటే అదీ కనబడదు. అసలు రుగ్మత ఏదీ లేదని ఒక క్షణం ఈ వైద్యశిఖామణి అంటున్నాడు. ''విశ్వాసం'' అనేది ఉత్తమ ఔషధమని మరొక క్షణం సలహా యిస్తున్నాడు. రుగ్మత లేకపోతే ''విశ్వాసం'' అనే మందుతో మాత్రం అవసర మేమిటి?

పైగా, ఈ ఔషధం కొత్తది కాదుగదా? గత యుద్ధంలో భారతదేశం "విశ్వాసం" అనే టానిక్కునే కొన్ని గ్రోసుల సీసాలమేరకు పుచ్చుకొన్నది. అందువల్ల కనబడిన గుణం మాంటెగ్యూ-చెమ్స్‌ఫర్డ్ విధానాన్ని అనుసరించి రాష్ట్రీయ ద్వంద్వపరిపాలన మాత్రమే. తిరిగి 1931 తర్వాత కొన్ని నెలల పాటు "విశ్వాసం" అనే టానిక్కు సేవను ఇండియా ప్రారంభించింది. ఈ సారికూడా ప్రయోజనం శూన్యమే అయిపోయి, 1935 నాటి వికృత భారత రాజ్యాంగచట్టం సిద్ధించింది.

ఈ గతానుభవాల తర్వాత ఇంకా తను "విశ్వాసం" టానిక్కునే నమ్ముకోవలసిందిగా లార్డ్ వేవెల్ కోరడం భావ్యమా? ఎంత ఉపయోగించినా గుణమివ్వని ఔషధంపై ఎవ్వరికైనా విసుగు పుట్టడం సహజం కాదా?

[డిసెంబరు 15, 1944]

28

ఉగాది

ఉగాది పెద్ద పర్వదినం ప్రజలకు, ప్రకృతికీ కూడా। చెట్లకు కొత్త చిగురు, కోయిలకు కొత్తపాట, ఆకాశానికి కొత్త రంగులు, ప్రకృతికి కొత్త శోభ, ప్రజలకు కొత్త ఆశ. ఈ కొత్తతనానికి వైతాళికుని గీతం వంటిదే ఉగాది.

కొత్త వేపపువ్వును కొత్త మామిడి పిందెలతోను, కొత్త బెల్లంతోను మేళవించి, మహాప్రసాదమని స్వీకరించడమే ఉగాది మహోత్సవానికి ఆద్యంతాలు కారాదు. పాతను మరచిపోవాలి; కొత్తకోసం అర్రులు చాచాలి. అప్పుడే ఉగాది పర్వదినానికి సార్థక్యం.

పాత మృత్యువుకు చిహ్నమైతే, కొత్త నవజీవనానికి చిహ్నం. ఇది పాతను నిరసించడం కాదు, దాన్ని తిరస్కరించడం కాదు. పాతనుంచే కొత్త వస్తుంది, ఒక పాత వడ్లగింజ నేలలో పడి చీకితేనే కాదా, పది కొత్త వడ్లగింజలు పుట్టుకురావడం!

పాతనుంచి కొత్తకు నిరంతర పరిణామం ఈ కారణంవల్లనే అనుల్లంఘనీయం. దీనికే మరొక పేరు జీవయాత్ర, లేదా విశ్వయాత్ర.

ఈ ఉగాదిసందేశంతో మానవకోటికి ఈనాడు కలిగినంత అవసరం ఇంతకు పూర్వ మెన్నడు కలుగలేదనడం అత్యుక్తి కాదు.

నేడు ఒక మహాసంగ్రామం సాగుతున్నది. ఇది ప్రపంచపరివ్యాప్తం. అన్ని ఖండాలు, సమస్త జాతులు దీనిలో పాల్గొంటున్నాయి. భూతలంపై నభోవీథిపై, మహాసముద్రాలపై, చివరికి సముద్రగర్భాలలో సయితం ఇది అహోరాత్రం సాగుతున్నది. వివిధ లక్ష్యాలు, విభిన్న శక్తులు, విరుద్ధ వ్యవస్థలు దీనిలో సంఘర్షిస్తున్నాయి. ఈ భీషణ ప్రపంచయుద్ధ ఫలితంగా పాత నశించగలదా, కొత్త మోసులెత్తగలదా?

ఒకజాతిపై మరొకజాతి పరిపాలన- ఇదే పాతప్రపంచం. ఒక వర్గంపై మరొకదాని ప్రాబల్యం - ఇదే పాత వ్యవస్థ. ఇది పోయి, సర్వజాతులకు సమాన స్వాతంత్ర్యంతో కొత్త ప్రపంచం ఏర్పడగలదా? అన్ని వర్గాలకు సమాన స్వత్వాలతో కొత్త వ్యవస్థ పాదుకొనగలదా? ప్రపంచయుద్ధ సమాప్తి సమీపిస్తున్న సూచనలు కానవస్తున్న ప్రస్తుత సమయంలో ఈ ప్రశ్నలే మానవ కోటిని కలవరపరుస్తున్నాయి.

అయితే కేవలం కలవరపాటు చెంది మిన్నకున్నందువల్ల ప్రయోజనం శూన్యం. తన పరిసరాలు సంకుచితమైనవే కావచ్చు. అయినా, ప్రతివ్యక్తి పాతకు స్వస్తి చెప్పి, కొత్తను ఆహ్వానించడంలో తనకు కూడినంత ప్రయత్నాన్ని కొనసాగించాలి. ఈ ఉద్బోధనే భగవద్గీత కింది పలుకులలో చేసింది :

నియతం కురు కర్మత్వం
కర్మ జ్యాయోహ్య కర్మణః

(నీ నియత ధర్మాలను నిర్వర్తించు. నిష్కర్మణత్వంకంటె కర్మ ఉత్తమ మైనది.)

ఈ ఉద్బోధను పాటించగలమని ఈ ఉగాదినాడు ప్రతి వ్యక్తి కృతనిశ్చయుడైన పక్షంలో పై ఉగాదినాటికే న్యాయబద్ధమైన ఒక ప్రపంచం, ధర్మసమ్మతమైన ఒక సాంఘికవ్యవస్థ ఏర్పడక పోవు; "లోకాస్సమస్తా స్సుఖినో భవంతు" అనేది కేవలం ఒక శుష్కవాంఛగా మిగిలిపోక, సుసాధ్య విషయంగా పరిణమించకపోదు.

[మార్చి 15, 1945]

30

బెర్లిన్ పతనం

"జర్మనీ రాజధాని బెర్లిన్‌నగరాన్ని పూర్తిగా పట్టుకున్నా"మని మార్షల్ స్టాలిన్ ప్రకటించాడు.

"మూడు వారాలలో మాస్కోలో!" అని రష్యాపై దాడి ప్రారంభించి నప్పుడు నాజీ నాయకులు ప్రగల్భాలు పలికారు. కాని, మాస్కో సరిహద్దులలో నైనా వారు అడుగిడలేకపోయారు.

నాటి సోవియట్ ప్రచారశాఖామంత్రి విషిన్‌స్కీ ఒక ప్రకటన చేస్తూ, "నెపోలియన్ మాస్కోనగరాన్ని కనీసం కళ్లారా చూడగలిగాడు. హిట్లర్ కేవలం మాస్కో ఫోటోలను చూచి సంతృప్తి పడవలసిందే!" అని అన్నాడు. విషిన్‌స్కీ అన్నట్టే అక్షరాలా జరిగింది.

ఈ సంవత్సరం రెడ్ ఆర్మీ వేసవిముట్టడిని ప్రారంభించినంతనే "బెర్లిన్ పైకి పురోగమనం" అని "ప్రావడా" సింహనాదం చేసింది. ఇది ప్రగల్భం కాదనడానికి బెర్లిన్‌పై నేడు విజయదర్పంతో ఎగురుతున్న సోవియట్ అరుణ పతాకే తార్కాణం.

మిత్రరాజ్యాలకు ఆసన్నమైన సంపూర్ణవిజయానికికూడా బెర్లిన్ పతనమే ఒక ప్రబల నిదర్శనం. జర్మన్ ప్రభుత్వానికి బెర్లిన్ కేంద్రం మాత్రమే కాని, అది జర్మన్ జాతి అంతరాత్మను ప్రతిఫలించే నగరం కాదని జర్మనీలో అమెరికన్ పత్రికా విలేఖరిగా పనిచేసిన టామ్ యబ్రా అభిప్రాయం. బ్రిటిష్ దీవులకు లండన్ గుండెకాయ. ఫ్రాన్సుకు పారిస్ ఆయువుపట్టు. ఆస్ట్రియాకు వియన్నా శిరోభూషణం. సోవియట్ ప్రజానీకంలోని బాహ్యాంతర్గత పరివర్తనలకు మాస్కో ప్రతిబింబం. ఇక జర్మనీకి బెర్లిన్ కేవలం ప్రభుత్వ కేంద్రం మాత్రమే.

మార్షల్ స్టాలిన్ ఈనాడు బెర్లిన్ నగరాన్ని జర్మనీ మ్యాపునుంచి చెరపివేసినా - అట్టి చర్యను ఆయన జరపడు - ఆర్థిక, పారిశ్రామిక దృష్టిలో

గాని, వైజ్ఞానిక, సాంస్కృతిక దృక్పథాలనుంచిగాని, జర్మనీకి సంభవించగల నష్టం అంత ఉపద్రవకరమైంది కాబోదు.

జర్మన్ పారిశ్రామికులకు ప్రధానకేంద్రం రుర్ పరగణా కాని, బెర్లిన్ కాదు. యబ్రా పలుకులలో, రుర్‌లోని బ్రహ్మాండమైన కర్మాగారాల మధ్య, వాటిలోని యంత్రాల భీకర ఘోషలలో, వాటి బ్లాస్ట్ ఫర్నేస్‌ల ప్రచండ జ్వాలాగ్నులలో జర్మనీ రాక్షసబలసంపత్తిని, దాని భీకర స్వరూపాన్ని సందర్శించవచ్చుగాని, బెర్లిన్‌లో కాదు.

ఇక, జర్మన్ నౌకాకర్మాగారాలకు ఆయుపుపట్టు హాంబర్గ్ కాని, బెర్లిన్ కాదు. (ఈ నగరం మిత్రసేనల వశమైనదని నేడే వార్త వచ్చింది) గత యుద్ధంలో నేమి, తిరిగి ప్రస్తుత యుద్ధంలో నేమి, బ్రిటన్ నౌకాబల ప్రాబల్యాన్ని నిరోధించవలె నని జర్మనీ యత్నించింది ఈ హాంబర్గ్‌నుంచే.

పోతే, జర్మన్ సంగీతకళకు, దాని సారస్వతానికి, దాని తత్త్వశాస్త్రాలకు, దాని సంస్కృతికి వైమార్, కోనిన్స్‌బర్గ్, మ్యూనిక్ మొదలైనవి కేంద్రాలుగాని, బెర్లిన్ కానేకాదు. చివరకి జర్మన్ సమరోత్సుకతకైనా తూర్పు ప్రష్యా నిలయం కాని, బెర్లిన్ కాదు.

ప్రభుత్వ కార్యాలయాలతో, ఉద్యోగస్థుల నివాసాలతో, నాటక, చలనచిత్రప్రదర్శనశాలలతో, పురావస్తుమందిరాలతో, ఇట్టి హంగులు మరికొన్నింటితో జర్మన్‌జాతి అంతరాత్మతో సంబంధం లేకుండా వృద్ధిచెందినట్టిదే బెర్లిన్.

ఫ్రెంచి చరిత్రను చూస్తే పారిస్ పతనం చెందినంతనే ఫ్రాన్సు పరాజయాన్ని చెందినట్లు కనబడుతుంది. బెర్లిన్ పతనం చెందినంతనే నేడు జర్మన్ సైన్యాలు శరణుజొచ్చడం లేదంటే, బెర్లిన్ జర్మనీ కాదన్న సత్యాన్ని అది ధృవపరుస్తున్నది.

బెర్లిన్‌లో బేతోవెన్‌కు స్థానం లేకపోయింది కాని, అది ఇదివరలో బిస్మార్క్‌కు, ఇటీవల హిట్లర్‌కు కార్యస్థానం కాగలిగింది. బిస్మార్క్ యూరప్‌పై జర్మన్ ఆధిపత్యాన్ని స్థాపించగోరితే, హిట్లర్ ప్రపంచాన్నే పాదాక్రాంతం చేసుకొనగోరాడు. జర్మన్ సామ్రాజ్య సంస్థాపనకై తహతహలాడినవారికి బెర్లిన్ మూలపీఠం. ఈ దృష్టిలో చూస్తే, దాని పతనానికి విశేష ప్రాధాన్యం వున్నది.

[మే 4, 1945]

32

నాయకత్వం

ఉత్తమవంశంలో జన్మించడంవల్ల నాయకత్వం సంప్రాప్తించదు. జనరలిజ్మో చాంగ్ కై - షేక్ అతి సామాన్య కుటుంబంలో జన్మించాడు.

అందచందాలను చూచిగాని, విగ్రహపుష్టికి అలరిగాని నాయకత్వం వచ్చి వరించదు. ఆస్ట్రియాకు ఛాన్సలర్‌గా పనిచేస్తువుండగా, హిట్లర్‌చే హత్యచేయించబడిన డోల్ఫూస్ కేవలం వామనమూర్తి.

విద్యవల్ల నేమి, పాండితి కారణంగా నేమి నాయకత్వం లభించదు. బ్రిటన్‌లో నేడు మిస్టర్ చర్చిల్‌కంటె మిన్నగా ఎన్నవలసిన విద్యాధురీణు లేమి. పండితప్రకాండు లేమి పెక్కుమంది వున్నారు.

వక్తృత్వంవల్ల నాయకత్వం సిద్ధించదు. మార్షల్ స్టాలిన్‌లో పెక్కు ప్రజ్ఞావిశేషా లున్నవి గాని, వక్తృత్వం వాటిలో ఒకటి కాదు.

ధనరాసులవల్ల నాయకత్వయోగం పట్టదు. ప్రెసిడెంట్ రూజువెల్ట్ పేదవాడని అనలేము గాని, రాక్‌ఫెల్లర్, హెన్రీ ఫోర్డ్ మొదలైనవారి సంపత్తిలో ఆయన ఆస్తిపాస్తులు శతాంశమైనా కావు.

కుతంత్రంవల్ల నాయకత్వం అబ్బినా, అది ఎంతోకాలం నిలవదు. జర్మనీలో ఫాన్ పాపెన్ జీవితం, ఫ్రాన్స్‌లో పీర్ లావాల్ అనుభూతులు ఇందుకు ప్రబల తార్కాణాలు. పశుబలంతో నాయకత్వాన్ని సాధించవచ్చు. గాని, దాన్ని పశుబలంతోనే నిలబెట్టుకోవాలి. ఏనాడు దాని ప్రయోగశక్తి విలుప్త మౌతుందో, ఆనాడే దానిద్వారా సంప్రాప్తించిన నాయకత్వం సయితం మటు మాయమై పోతుంది. నెపోలియన్, ముసోలీనీ, హిట్లర్ జీవితచరిత్రలే ఇందుకు ఉత్తమ నిదర్శనాలు.

అదృష్టంవల్ల నాయకత్వం ప్రాప్తించవచ్చు. కాని, ఇట్టివారు-ప్రెసిడెంట్ ట్రూమన్ వలె - నూటికి కోటికి ఎక్కడో ఒక్కరు మాత్రమే; అదైనా ప్రజా స్వామ్యాలలో రాజ్యాంగ చట్టాన్ని అనుసరించి నాయకుని నియామకం జరిగే సందర్భాలలోనే !

దాన్ని ఆశించడంవల్లనేమి, దానికై దుగ్ధవల్లనేమి, నాయకత్వం చేజిక్కదు. డాక్టర్ సున్ యాట్-సెన్ స్థానంలో చైనాకు నాయకుడు కావాలని పరితపించిన వాంగ్ చింగ్-వే చివరికి జపానువారి పంచకుచేరి, "ఛీ! మాతృ ద్రోహి! " అని స్వదేశస్థులచే అనిపించుకొని, దిక్కులేని చావు చావవలసి వచ్చింది.

అంచేత ఏయే అనుకూల పరిస్థితులవల్ల, ఏయే గుణగణాలవల్ల, ఏయే ప్రతిభావిశేషాలవల్ల నాయకత్వం లభించగలదో చెప్పడం కష్టం. నిజానికి నాయకత్వం వ్యక్తిగత స్థితిగతులనుబట్టి కాక, శక్తిసామర్థ్యాలనుబట్టి కాక, చరిత్ర పరిణామంవల్లనే సిద్ధిస్తుంది.

ఒక్కొక్క యుగసంధిలో ఒక్కొక్క నాయకుడు తలయెత్తుతాడు. కేవలం కాలప్రభావాన్నిబట్టి, దేశపరిస్థితులనుబట్టి, చరిత్రపరిణామాన్ని అనుసరించి, అందుకు అనుగుణమైన వ్యక్తి నాయకుడు కావడం సంభవిస్తుంది.

మన దేశంనుంచే ఇందుకు ఉదాహరణలను పేర్కొనవచ్చు. 19వ శతాబ్ది మలిభాగంలో బ్రిటన్ వాగ్దానాలపైనేమి, దాని చిత్తశుద్ధిపైనేమి మనకు శంక ఏర్పడలేదు. మన కోర్కె న్యాయసమ్మతమైనదని నిరూపించుకొనడంవల్ల మనకు స్వరాజ్యం సిద్ధించగలదని అప్పటిలో మనం నమ్ముకున్నాము. మన చరిత్రలో ఈ పరిణామానికి అనుగుణంగానే మనకు అప్పటిలో దాదాభాయ్ నౌరోజీ, ఫెరోజ్‌షా మెహతా, గోపాలకృష్ణ గోఖ్లే మొదలైనవారు నాయకులైనారు.

తర్వాత మనకు విజ్ఞప్తులవల్ల స్వరాజ్యం లభించదనే విశ్వాసం ఏర్పడింది. వెంటనే మన దేశనాయకత్వంలో కూడా మార్పు వచ్చింది.

నాయకత్వానికి సంబంధించిన ఈ ప్రాథమిక సూత్రాల పరిజ్ఞానమైనా లేకపోయినదనే సర్ ఫిరోజ్‌ఖాన్ నూన్, గాంధి ఇక నాయకత్వంనుంచి తప్పుకొని, నెహ్రూకు దాన్ని కట్టబెట్టాలని ప్రతిపాదించాడు.

నెహ్రూపట్ల ప్రేమాభిమానాలు గలవాడు కాబట్టి, అతడి ధీశక్తిలో విశ్వాసం గలవాడు కాబట్టి, తను విరమించిన పిదపనో, తన తదనంతరమో గాంధి తన స్థానాన్ని నెహ్రూకు యివ్వగోరవచ్చు. ఇస్తానని ఆయన అంటున్నాడు కూడా! కాని, భావిని గాంధి అయినా శాసించలేడు. నెహ్రూకే తన స్థానం లభించాలనడం గాంధి అభిమతమైనా, భారతచరిత్ర భావి పరిణామం అన్యథా నిర్ణయించవచ్చునేమో - అది ఎవరి కెరుక ?

సర్ ఫిరోజ్ చేసిన శుష్క ప్రతిపాదనకు కొంతవరకు అనవసర ప్రాధాన్యమిచ్చి, "నెహ్రూను మీరు చెరసాలనుంచి విడిపించగలిగితే, నేను రాజకీయరంగంనుంచి తప్పుకోగలను. విడిపించలేకపోతే, మీరు మీ ఉద్యోగానికి రాజీనామా పెట్టగలరా?" అని గాంధి ప్రశ్నించాడు.

ఇందుకు "నా సూచన ఉత్తమమైనదైతే దాన్ని ఆమోదించాలి గాని, దాని విషయమై షరతులు పెట్టడం దేనికి?" అని సర్ ఫిరోజ్ ప్రత్యుత్తర మిచ్చాడు. దీన్ని చూచిన మీదట గాంధి రంగంనుంచి వైదొలగితే, నెహ్రూ కారాగార బద్ధుడైవుంటే భారత ప్రజానాయకత్వం ఇక తనదే అని సర్ ఫిరోజ్ ఆశపడుతున్నాడా అని అనుమానించవలసి వస్తున్నది.

ఇట్టి ఆశ సర్ ఫిరోజ్‌కు నిజంగా వుంటే, ఆయన పగటి కలల్ని కంటున్నాడనే చెప్పవలసి వస్తుంది.

గాంధికి భారత ప్రజానాయకత్వం ఒకరిచ్చిందికాదు, ఒకరు తొలగించ గోరితేపోయేదీకాదు. చివరికి తనకు తానుగా ఆయనైనా దాన్ని త్రోసిపుచ్చలేడు. చరిత్రే ఆయనను ఎన్నుకొన్నది; చరిత్రే ఆయన చేత తన ఇచ్ఛాపరిపూర్తి చేయించుకొంటున్నది. చరిత్ర సంకల్పాన్ని - దీన్ని భగవత్సంకల్పమని కొంద రనవచ్చు - చివరికి గాంధి సయితం అతిక్రమించలేడు.

[ఆగస్టు 8, 1945]

యుగపురుషుడు

అది మల్లయుద్ధమే కానీయండి, మహాసంగ్రామమే కానీయండి; దానికి ప్రాతిపదిక కింది సూత్రత్రయమే: (1) దెబ్బ కాచుకోవడం; (2) దెబ్బ కొట్టడం (3) కదలిపోవడం.

బాల్జాక్ ఒక నవలలో తాను సృష్టించిన ఒక సైన్యాధికారినిగురించి వ్రాస్తూ, "యుద్ధంలో దెబ్బ తినకుండా, దెబ్బ కొట్టడానికి అతడు ప్రయత్నించే వాడు. వాస్తవానికి యుద్ధసందర్భంలో దెబ్బ తినకుండా ఎలా దెబ్బ కొట్టడ మనేదే ఎవరైనా యెదుర్కొనవలసిన ఏకైక సమస్య" అన్నాడు. దెబ్బ తిన కుండా కాచుకొనవలెనన్నా, దెబ్బపై దెబ్బ తీయవలెనన్నా స్తబ్ధంగా నిలవడం తగదు. ఈ సందర్భంలోనే కదలికకు ప్రాధాన్యం ఏర్పడుతున్నది.

మన పురాణాలలోని భీష్మ, ద్రోణాచార్యులేమి, కర్ణార్జునులేమి, ఇతర అతిరథ, మహారథులేమి, పాశ్చాత్యచరిత్రలోని అలెగ్జాండర్, హానిబాల్, మార్ల్‌బరో, నెపోలియన్, వెల్లింగ్టన్, మొల్ట్‌కె, ఫోష్ మొదలైన వారేమి, మొన్నటి ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామంలో విఖ్యాతినందిన రోమెల్, రుండ్‌స్టెడ్, కెస్సెల్‌రింగ్, టిమొషెంకో, ఝుకోవ్, కోనీవ్, అలెగ్జాండర్, మాంట్‌గోమరీ, ఐసెన్‌హోవర్, మెకార్థర్, ప్రభృతులేమి యుద్ధనిర్వహణలో సాధించిన విజయాల కీలకం దెబ్బ కాచుకొంటూ దెబ్బ తీయడమే!

దెబ్బ కాచుకొనడానికి ఉపకరించేది. - కవచం. దెబ్బ తియ్యడానికి సాధనం, - ఆయుధం. ఆదినుంచి నేటివరకు యుద్ధచరిత్రను పరిశీలిస్తే, దాని సారాంశం - అంతకంతకు దుర్భేద్యమైన కవచాన్ని, అంతకంతకు విధ్వంస కరమైన ఆయుధాన్ని కనిపెట్టడానికి నిరంతర సంశోధనే అని స్పష్టపడు తుంది. సర్వ దుర్భేద్య కవచంకోసం, సర్వవిధ్వంసక మారణాయుధంకోసం సాగిన - సాగుతున్న - నిరంతర సంశోధనలో త్వరితగమనాన్ని సాధించ డానికి యత్నం జరిగింది, జరుగుతున్నది కూడా.

ఆదిలో మానవుడు కేవలం మల్లయుద్ధమే చేసివుండవచ్చు. తర్వాత వడిసెల; ఆ తర్వాత గద, గండ్రగొడ్డలి; ఆటుతర్వాత కత్తి, ఈటె; పిమ్మట విల్లంబులు; ఆపిమ్మట తుపాకి, ఫిరంగి; ఆ వెనుక రైఫుల్, మరతుపాకి, ట్రెంచ్ మోర్టార్, భారీ ఫిరంగి; ఇప్పుడు టామీగన్, ఆటొమాటిక్ రైఫుల్. సెల్ఫ్‌ప్రొపెల్డ్ గన్ - ఈవిధంగా అంతకంతకు దూరంనుంచి, అంతకంతకు త్వరితంగా, అంతకంతకు ప్రచండంగా ప్రయోగించడానికి అనువైన ఆయుధాలు వినియోగంలోకి వచ్చాయి.

మేజర్ జనరల్ జె. యఫ్. సి. ఫుల్లర్ పేర్కొన్నట్టు, ఆయుధాల ప్రయోజనాలు "చంపడం, గాయపరచడం, భయంతో పణికించడం". నిన్నటి ఆయుధాలకంటె నేటివి ఈ ప్రయోజనాలను ఇతోధికంగా సాధిస్తున్నవి; రేపటివి నేటివాటికంటె కూడా ఇతోధికంగా వీటిని సాధించగలవు.

ఇక, కవచం విషయంలో ఈనాటికి అంతిమపరిణామం నేటి యుద్ధనౌక అని చెప్పవచ్చు. నేటి యుద్ధనౌకకు పన్నెండు అంగుళాలకు పైగా మందపు మేలురకం ఉక్కురేకు కవచంగా వుంటున్నది. కాగా, గమనంవిషయంలో ఇప్పటికి అంతిమ పరిమితి నేటి సరికొత్త యుద్ధవిమానాలే; నేడు ధ్వని ప్రసారంకంటె వేగంగా పయనించగలుగుతున్న రాకెట్ బాంబులే.

యుద్ధసాధనంగా టాంక్ ప్రత్యేకత ఏమిటని విచారిస్తే, ఎవరికైనా తోచగల విషయాలు ఈ కిందివే: కవచం కలదు గనుక, అది దెబ్బ కాచుకో గలదు; ఫిరంగి, మరతుపాకులు వున్నందున అది దెబ్బ తీయగలదు; గంటకు దాదాపు 30 మైళ్ల వేగంతో అవసరాన్ని బట్టి అది ముందుకో, వెనుకకో, పక్కకో త్వరితంగా కదలిపోగలదు. ఈ విధంగా యుద్ధవిద్యకు ప్రాతిపదికలైన సూత్రత్రయాన్ని అంతర్భూతం చేసుకొనడమే టాంక్ ప్రత్యేకత.

ఇక, సూపర్ ఫోర్ట్రెస్ విమానం ప్రత్యేకతను ఆలోచిస్తే, దానికి ఫైటర్ విమానానికున్న వేగం లేకపోయినా, ఏ ఫైటర్ ఎగిరి వెళ్లలేనంతటి యెత్తున ప్రయాణం చేస్తూ, వేలకొలది పౌనుల తూకంగల బాంబులను అది వేసి రాగలదు.

"ఎంత మేరకు విస్తరింపజేయడానికి వీలు కలదో అంత మేరకు విస్తరింపజేయబడిన దౌర్జన్యపూర్వక చర్యే యుద్ధం" అని ఆధునిక యుద్ధపద్ధతులకు మూలపురుషుడని పేర్కొనదగిన కార్ల్ ఫాన్ క్లాజెవిట్ ఉద్ఘాటించాడు. వడిసెలద్వారా రాళ్లు ఎంత మేరకు వెళ్లగలవో అంత మేరకు విస్తరింపజేయబడిన దౌర్జన్యపూర్వక చర్య ఆటవికమానవుని యుద్ధం. టాంకులు, భారీ ఫిరంగులు, నలభై, యాభై వేల టన్నుల యుద్ధనౌకలు, సూపర్ ఫోర్ట్రెస్ విమానాలు, రెక్కల బాంబులు, రాకెట్ బాంబులు మొదలైనవాటికి ఎంత "రేంజి" కలదో అంత మేరకు విస్తరింపజేయబడిన దౌర్జన్యపూర్వక చర్య ఆధునికమానవుని యుద్ధం.

కాని, ఇంతటితో కూడా ఇది ఆగలేదు. కడిచిన రెండు, మూడు నెలలలోనే దీని సీమలు ఊహాతీతంగా వ్యాప్తి చెందిపోయాయి. హిరోషిమాపై ప్రయోగించబడిన ప్రళయం బాంబుతో పోల్చితే టాంకులు, భారీ ఫిరంగులు, యుద్ధనౌకలు, జెట్ విమానాలు, రాకెట్ బాంబులు మొదలైనవి వడిసెలరాతితో సమానమైనాయి. ఇంతే కాదు కూడా. హిరోషిమాపై ప్రయోగించబడినప్పుడు ఆ జాపనీస్ నగరాన్ని, దాని అశేషప్రజను నామరూపరహితం చేసివేసిన ప్రళయం బాంబు. ఆ తర్వాత నిర్మించబడినవాటిముందు కేవలం ఒకనేల టపాకాయ మాత్రమే!

అయితే, ఇంతటితోనైనా ఇతోధిక విధ్వంసక మారణాయుధాలకై సంశోధన ఆగిపోగలదని ఆశించలేముగదా? పరమాణుశక్తికంటె ప్రచండమైనట్టిది యుద్ధనిర్వాహణకు అలంబనం కావచ్చుగదా? అయినప్పుడు ఏ ఒక్క కిరణాన్నో ప్రసరింపజేసినంతనే మానవకోటి మలమల మాడిపోవచ్చుగదా?

దీన్ని కేవలం అతిశయోక్తిగా త్రోసిపుచ్చడం కంటె ఉన్మాదం వుండబోదు. ఏడాది క్రితం - ఆరునెలల క్రితం కూడా - చివరికి మూడునెలలనాడు సయితం - ప్రళయం బాంబును పోలిన భీషణ మారణాస్త్రం సుసాధ్యమని ఎందరు ఊహించగలిగారు? అంచేత ప్రళయం బాంబే మారణాస్త్రాలలో తుట్టతుద దని భావించరాదు. యుద్ధపిపాసాపరితృప్తికై వడిసెలలో రాయిని పెట్టి గిరగిర త్రిప్పి విసరడంనుంచి, పరమాణువులలో అంతర్భూతమైవున్న ప్రచండశక్తితో మహానగరాలను కనురెప్పపాటులో భస్మీపటలం చేసివేయడం వరకు వచ్చిన మానవుడు దేశాలకు దేశాలనే, ఖండాలకు ఖండాలనే తుడిచిపెట్టగల నూతనాయుధాలను కనిపెట్టడా?

కాని, ఇది ప్రపంచాన్ని ఏ దిశకో తీసుకొని పోతున్నది ? సర్వవిధ్వంసం దిశకే కాదా, స్వరూపవినాశదిశకే కాదా ?

ఈ యుగసంధ్యలో - సర్వవినాశపు టంచున - విలయప్రాంగణంలో ప్రపంచం నిలిచివున్న ఈనాడు గాంధి శాంతిసందేశానికి మరింత ప్రత్యేకత, ఇతోధిక విశిష్టత లేవా ?.

''అహింసా పరమోధర్మః'' అని హిందువుల ఉపనిషత్తులు ఉద్ఘోషించాయి. ఈ సందేశాన్నే గౌతమబుద్ధుడిచ్చాడు. ఈ ఉద్బోధనే ఏసు క్రీస్తు చేశాడు. నేడు గాంధి ఈ పురాతన ధర్మసూత్రాన్నే—ఈ మహిమాన్వితసూక్తినే - కేవలం పునశ్చరణచేయడం లేదు. దానికి ఆయన ఒక కొత్త స్వరూపం కూర్చాడు; ఒక కొత్త అర్థాన్ని కల్పించాడు; ఒక కొత్త శక్తిని ఆపాదించాడు. ఆ కొత్త స్వరూపం సత్యాగ్రహం; ఆ కొత్త అర్థం సహాయనిరాకరణ; ఆ కొత్త శక్తి శాంతిసమరం.

ఈ శాంతి సమరానికి కావలసింది బాహుబలం కాదు, ఆత్మబలం; శతఘ్నులు కావు, సౌజన్యం; విమానాలు కావు, వినయం; కాల్బలాలు కావు, కారుణ్యం; ప్రళయం బాంబులు కావు, ప్రపంచ క్షేమాభిలాష.

ఇక, దీనిలో విజయం ఎవరి కెక్కువ మారణాయుధా లున్నవో వారిది కాదు, ఎవరి కెక్కువ సత్యనిరతి గలదో వారికే; ఎవ రెక్కువ రక్తపాతం జరపగలరో వారికి కాదు, ఎవ రెక్కువగా ఆత్మార్పణం చేయగలరో వారికే; ఇట్టి శాంతిసమరం విజేతనువలె పరాజితుని కూడా విశిష్టుని చేస్తుంది !

అన్యాయాన్ని ఎదుర్కొనడానికి, అధర్మాన్ని ప్రతిఘటించడానికి, దాస్యశృంఖలాలను ఛేదించడానికి ఆయుధబలాన్ని కాక, ఆత్మబలాన్ని వినియోంచినప్పుడు-మారణాస్త్రాలనుకాక, సత్యాగ్రహాన్ని ప్రయోగించినప్పుడు-రాటర్ డాం, కంవెన్ట్రీ, బెల్‌గ్రేడ్, కెస్సినో, బెర్లిన్, హిరోషిమా మొదలుగా గల శ్మశానాలు ప్రతీకార వాంఛను నాటడానికేమి, మరింత భయానక యుద్ధపు విషవృక్షాలను పెంచడానికేమి మిగలవు. ఈ సత్యాగ్రహ విధానాన్ని ప్రపంచం స్వీకరించగలదా, లేదా ? ఈ అహింసా సిద్ధాంతాన్ని మానవకోటి శిరోధార్యంగా భావించగలదా, లేదా ?

ఆయుధబలంతో, అధికారదర్పంతో ఈనాడు కన్నుమిన్ను గానకున్న పాశ్చాత్యప్రపంచం గాంధి సందేశాన్ని పెడచెవిని పెట్టవచ్చు. కాని, బౌద్ధ మతంవలె గాంధీజం కూడా ప్రాచ్యఖండానికి - ముఖ్యంగా పీడిత ప్రజాకోటికి— శిరోధార్యం కాగలదనే తోస్తున్నది.

ఇందు కొక సూచనే నిన్న ఇండొనీసియా ప్రజానాయకుడు - రిపబ్లిక్ ప్రెసిడెంట్ - చేసిన ప్రకటన. ఈ ప్రకటనలో డాక్టర్ సుకర్ణో తాను ఇండొనీసియా స్వాతంత్ర్యాన్ని అహింసాపద్ధతులపై సాధించ గోరుతున్నానని ఉద్ఘాటించాడు. గాంధి నాయకత్వంకింద అఖిల భారత కాంగ్రెస్ అనుసరిస్తున్న సూత్రాలను తాను హృద్గతం చేసుకొన్నానని ఆయన పేర్కొన్నాడు కూడా : దాస్యవిముక్తికై, జాతీయస్వాతంత్ర్యానికై భారత ప్రజలతోపాటు ఇండొనీసియన్ ప్రజానీకం కూడా సత్యాగ్రహాన్నే-శాంతిసమరాన్నే-సాధనం చేసుకొనబోతున్నదని డాక్టర్ సుకర్ణో ప్రకటన తాత్పర్యం. నేడు కాకపోతే రేపైనా బర్మా మలయా, ఫ్రెంచి ఇండో-చైనా ప్రజలు సయితం ఇండొనీసియనుల అడుగుజాడలనే అనుసరించక తప్పదు.

తను ఏ సిద్ధాంతవ్యాప్తికై, ఏ ధర్మబోధకై, ఏ మతప్రచారానికై తన జీవితాన్ని అంకితం చేశాడో, అది భారతదేశపు సరిహద్దులను దాటి, అన్యజాతుల హృదయాలలో సయితం స్థానం ఏర్పరచుకొంటున్నట్టు ప్రప్రథమంగా సూచించిన డాక్టరు సుకర్ణో ప్రకటనకంటె గాంధికి, ఆయన 76వ జన్మదినోత్సవ సందర్భంలో, ప్రియమైన ఉపాయనం - విలువైన కానుక - సౌరభవంతమైన పూజాపుష్పం - వుండగలవా?

[అక్టోబర్ 2, 1945]

భారత మిత్రుడు

ఇప్పటికైనా సరే ఇండియాపట్ల బ్రిటన్ న్యాయంగా, ధర్మంగా ప్రవర్తిస్తే, దాని సంపూర్ణస్వాతంత్ర్యాన్ని, స్వయంనిర్ణయాధికారాన్ని నిర్నిబంధంగా గుర్తిస్తే, కలకాలంవరకు సామరస్యపూర్వకమైన ఇండో - బ్రిటిష్ సంబంధ బాంధవ్యాలు నెలకొనడం అసంభవం కానక్కరలేదు. ఇట్టి పరిస్థితిని కల్పించడంలో ఎంతో తోడ్పడిన ఎడ్వర్డ్ థాంప్సన్* నాలుగైదు రోజులనాడు చనిపోవడం ఇండియాకు ప్రత్యేకించి సంతాపకారణం.

థాంప్సన్, తక్కిన పెక్కుమంది బ్రిటిష్‌వారివలె భుక్తికోసం ఇండియాకు వచ్చినవాడే. కాని, బెంగాల్‌లోని బంకూరా కాలేజి ప్రిన్సిపాల్‌గా తన ఉద్యోగధర్మాన్ని నిర్వర్తించడంతోనే సంతృప్తి చెందక, తాను ఏ దేశం ఉప్పు పులుసు తింటున్నాడో దాని ప్రజల స్నేహం చేయడానికి, వారి సంస్కృతిని అరం చేసుకొనడానికి, వారి సాధకబాధకాలను తెలుసుకొనడానికి ప్రయత్నించాడు. ఈ ఆయన కారణంగానే ఆయనకు గాంధి, టాగూర్, నెహ్రూ మొదలైనవారితో సన్నిహితస్నేహం కుదిరింది; దీని ఫలితంగానే ఆయన భారతసమస్యలపై అనేక గ్రంథాలను రచించడం సంభవించింది; ఇందుమూలంగానే ఉద్యోగంనుంచి విరమించి, - స్వదేశానికి మరలి పోయిన తర్వాతకూడా భారతదేశంలో పర్యటనకై ఆయన అనేక పర్యాయాలు రావడం జరిగింది.

భారతీయ చరిత్రను, సారస్వతాన్ని, సంస్కృతిని, జాతీయోద్యమాలను బ్రిటిష్‌వారికి ఎరుకపరచడానికి థాంప్సన్ చేసిన రచన అనేకం. 1857 నాటి భారత స్వాతంత్ర్యసమరాన్నిగురించి బ్రిటిష్ చరిత్రకారులు వ్రాసిన అసత్యాలను ఖండించడానికి "ది అదర్ సైడ్ ఆఫ్ ది మెడల్" అనే గ్రంథాన్ని రచించాడు. భారతదేశ పునరుద్ధరణకు జరగవలసిన కృషిని వివరించడానికి

* [1886 - 1946]

"ది రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఇండియా" అనే పుస్తకాన్ని వ్రాశాడు. మొన్నటి ప్రపంచ మహాసంగ్రామ సందర్భంలో భారత ప్రజల హృదయపూర్వక సహకారాన్ని సంపాదించదగు మహదవకాశం జారవిడవబడుతున్నందుకు బాధపడి "ఎన్‌లిస్ట్ ఇండియా ఫర్ ఫ్రీడం" అనే రచనచేశాడు.

ఇక రవీంద్రుని జీవితాన్ని గురించి, బెంగాలీ సాహిత్యాన్నిగురించి ఆయన వ్రాసిన గ్రంథా లెన్నో. ఇంతే కాదు. ఆధునిక భారతజాతి జీవితాన్ని, ముఖ్యంగా తనకు సన్నిహితంగా తెలిసిన వంగప్రజల జీవితాన్ని ప్రతిబింబిస్తూ ఆయన కొన్ని నవలలను రచించాడు. "కృష్ణకుమారి" అనే నాటికను సయితం రచించాడు.

థాంప్సన్ రచనలను ఉత్తమ సాహిత్యంగా ఎన్నగలమా, లేదా అనే విషయమై విభిన్నాభిప్రాయా లుండవచ్చుగాని, ఇండియాకు జరుగుతున్న అన్యాయాలను తొలగించాలని, ఇండియా, బ్రిటన్‌లమధ్య సుహృద్భావాన్ని పెంపొందించాలని ఆయన చేసిన కృషి అమూల్యమైన దనడంలో భేదాభిప్రాయానికి తావే లేదు.

ఈ విశిష్టతనయుని కోల్పోయినందుకు బ్రిటన్ ఏ పాటిగా బాధపడుతున్నదో తెలియదుగాని, ఈ చిరమిత్రుని పోగొట్టుకొన్నందుకు ఇండియా దురపిల్లుతున్నది.

[మే 5, 1946]

హెచ్. జి. వెల్స్

విద్య వ్యాపిస్తున్నది, విజ్ఞానం వికసిస్తున్నది, వివేకం వృద్ధిచెందుతున్నది; స్వాతంత్ర్యావధులు విస్తరిస్తున్నవి, సంస్కృతి ఒక ఉత్తమ పరిణతికి వస్తున్నది, ఇందువల్ల మరి రానున్నది సువర్ణయుగం - ఇది అర్ధశతాబ్ది నాటి ప్రబల విశ్వాసం.

నాటికంటె నేడు విద్యాలయాల సంఖ్య అధికమే. నాటికంటె నేడు వైజ్ఞానికశాస్త్ర పరిజ్ఞానం అధికమే. కాని, నాటికంటె నేడు మానవుడు వివేకవంతుడా? నాటికంటె నేడు అతడు అధిక స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నాడా? నాటికంటె నేడు అతడు ఉత్తమ సంస్కృతీపరుడా? ఈ అన్నింటినీ మించి, రానున్నది సువర్ణయుగ మన్న ప్రబలవిశ్వాసం ఈ నాడు ఎంతగా మిగిలింది?

నాటికి, నేటికీమధ్య ప్రథమ, ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామాల అశ్రువాహిను లున్నాయి; రక్తస్రవంతు లున్నాయి. ఇందువల్లనే నాటి ఆశ నేడు లేదు, నాటి విశ్వాసం నేడు లేదు, నాటి ఉత్సాహం నేడు కానరాదు.

నాడు ఎంతో ఆశతో, విశ్వాసంతో, ఉత్సాహంతో జీవితాన్ని ప్రారంభించి, నేడు అంతులేని నిరాశతో, అనేక సంశయాలతో, నిస్పృహ ఆవరిస్తుండగా, ఖిన్నుడై జీవితాన్ని చాలించిన ప్రపంచప్రసిద్ధ వ్యక్తి హెచ్. జి. వెల్స్. *

ఆయన పుట్టింది పేదరికంలో, పెరిగింది పేదరికంలో. ఆయన స్వయంకృషితో విద్య నభ్యసించాడు, విజ్ఞానాభివృద్ధి చేసుకొన్నాడు. తన మేధాశక్తి ప్రబలినకొలది, తన భావనాపటిమ పెంపొందినకొలది, తన విచక్షణ నిశితమైనకొలది, తన దృక్పథం విశిష్టమై, విశాలమైనకొలది, శాంతికి నిలయమై, సంపత్తికి ఆకరమై, సుఖప్రదమై, సంస్కృతీవిరాజితమై శోభిల్లగల నూత్నప్రపంచాన్ని గురించి ఆయన కలలుగన నారంభించాడు.

---

* [1866 - 1946]

తనవలె ప్రతి వ్యక్తీ నూత్నప్రపంచం విషయమై కలలు గనక పోవడానికీ, దానికోసం కలవరించక పోవడానికీ, కలత చెందకపోవడానికీ, ఆయనకు తోచిన కారణం విద్యతో సమానంగా విజ్ఞానం పెరగకపోవడమే. తనకు స్పష్టమైనది ఇతరులకు అస్పష్టంగా తోచడ మేమి, తనకు పరమ లక్ష్యంగా, అనుల్లంఘనీయ గమ్యస్థానంగా కానవస్తున్నట్టిదానిపట్ల ఇతరులు తూష్ణీంభావం వహించడమేమి, ఏ విజ్ఞానభాగ్యం తనకు లభ్బిందో అది ఇతరులకు లబ్బకపోవడంవల్లనే అని ఆయన విశ్వసించాడు. తన ఈ విశ్వాసంతోనే విజ్ఞానప్రచారాన్ని - తాను వాస్తవికమైనదని నమ్మిన విజ్ఞానప్రచారాన్ని - వెల్స్ తన కర్తవ్యంగా చేసుకొన్నాడు. కథలు, నవలలు వ్యాసాలు, కరపత్రాలు, చారిత్రకగ్రంథాలు మొదలైనవి ఎన్నో రచించాడు. భావిచిత్రణకు భూతవర్తమానాల పరిజ్ఞానం అత్యావసరమని దాన్ని ఆయన సాధించాడు. ఆ పరిజ్ఞానం ఆధారంగా ద్రష్టవలె భావికి ఆయన రూపకల్పన చేయగలిగాడు, మోటారుకారు, విమానం, చంద్రగోళయాత్ర మొదలైన అనేక విషయాలనుగురించి ముందుగా జోస్యం చెప్పింది ఆయనే.

ఈ జోస్యాలు ఒక్కదాని వెమ్మట మరొకటి వాస్తవం కాగా, తాను ఊహిస్తున్న - తాను లక్షిస్తున్న – భావిప్రపంచం అవతరణవిషయమై ఆయనకు విశ్వాసం మరింత బలపడింది.

ఆ ప్రపంచం అవతరణలో విలంబనకు కారణం మానవుని పరిణామం, చరిత్ర, సంస్కృతి మొదలైనవాటినిగురించి ప్రజాబాహుళ్యంలోని అజ్ఞానమే మూలమని భావించి, దాన్ని తొలగించవలెనన్న పట్టుదలతో "మానవసంస్కృతీ వేదం" రచనకు ఆయన పూనుకొన్నాడు. ఈ పూనిక ఫలితమే ప్రపంచ చరిత్రనుగురించి, మానవజాతి, ఆర్థిక, సాంఘిక వ్యవస్థలనుగురించి, సుఖప్రద జీవనవిధానాన్నిగురించి, భావిప్రపంచ స్వరూపాన్నిగురించి ఆయన వ్రాసిన నాలుగు ఉద్గ్రంథాలు.

''జీవితం ఒక సజీవస్రవంతి. దాని ప్రవాహం సర్వదా ముందుకే. అది అంతకంతకు విశాలమౌతున్నది, అంతకంతకు గంభీరమౌతున్నది, అంతకంతకు ఉత్తమపరిణతికి వస్తున్నది"- ఈ సందేశ మివ్వడానికే ఆయన ప్రయత్నించాడు. ఈ సందేశాన్ని వ్యాపింపజేస్తే, దీన్ని ప్రపంచం హృద్గతం చేసు

కొంటే మానవజాతిలో చెలరేగ గల మానసికవిప్లవమే "ఆదర్శజగత్తు"ను ("యుటోపియా"ను) అవతరింపజేయగలదని ఆయన విశ్వసించాడు.

ప్రథమ ప్రపంచమహాసంగ్రామం ఆయన ఈ ఆశలను కొంతవరకు కుంగదీసింది, ఆయన ఈ కలలను కొంతవరకు కరిగింపజేసింది. ఇక ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామంతో ఆయన ఆశలు పూర్తిగా నిరాశలై పోయినవి; ఆయన కలలు పూర్తిగా పీడకలలై పోయినవి. మానవుని మేధాశక్తి జరా భరంతో శిథిలమై పోయిందనీ, అతడికి సర్వవినాశం తప్పక పోవచ్చుననీ భయపడుతూ ఆయన తనువు చాలించాడు.

అంతటి ఆశావాది ఇంతటి నిరాశావాదిగా మారిపోవడాన్ని, అంతటి పరమవిశ్వాసి ఇంతటి నిస్పృహమూర్తిగా కన్నుమూయడాన్ని తన కొక హెచ్చరికగా మానవజాతి పరిగణించలేకపోతే దానికి సర్వవినాశం తథ్యమే కాగలదు!

[ఆగస్టు 19, 1946]

నిత్యసమరం

"మన స్వాతంత్ర్యసమరం ఇంకను ముగిసిపోలేదు"- ఇది అఖిల భారత విద్యార్థి మహాసభలో పండిట్ జవాహర్‌లాల్ నెహ్రూ చేసిన మహోపన్యాస సారాంశం.

"మనం స్వాతంత్ర్యసౌధ ప్రాంగణంలోకి వచ్చాము. కాని, ఆ సౌధంలో ఇంకా ప్రవేశించలేదు. కోట గోడలవద్దకు చేరడం కోటలో అడుగు పెట్టడం కానేరదు. కోటగోడలను చేరిన పిమ్మటనే, కోటను పట్టుకోడానికి అతి తీవ్ర సమరం అవసరం కావచ్చు" అని కూడా ఈ ఉపన్యాసంలో పండిట్ నెహ్రూ హెచ్చరించాడు.

ఈ హెచ్చరిక భారత విద్యార్థిలోకమే కాకుండా సమస్త భారత ప్రజానీకం గుర్తించదగినట్టిది.

బ్రిటిష్‌వారు ఇండియానుంచి వైదొలగి పోతామని అన్నారే గాని, వైదొలగి పోలేదు. భారతప్రజాభిమతానికి విరుద్ధంగా భారతదేశాన్ని మరి పరిపాలించ లేమని వారికి స్పష్టంగా తెలుసు. కాని, తాము వైదొలగి పోవడంలో వీలైనంత విలంబన చేయడానికి వారు ప్రయత్నిస్తున్నారు. విజాతీయ పరిపాలకుల ఉనికి తమ మనుగడకు అవసరమని భావించే భారతీయులను - నీచ స్వార్థపరులైన భారతీయులను- తమకు అండగా వారు సమీకరిస్తున్నారుకూడా. ఇండియాలో బ్రిటన్ ఆడుతున్న ఈ కపటనాటకాన్నే ఇండో - చైనాలో ఫ్రాన్సు ఆడుతున్నది; ఇండొనేసియాలో హాలెండ్ ఆడుతున్నది. ఇందువల్ల మన దేశంలోనే కాకుండా, ఇండో - చైనా, ఇండొనేసియాలలో కూడా స్వాతంత్ర్య సమరం ఇంకను ముగిసిపోలేదని చెప్పవచ్చు.

వాస్తవానికి స్వాతంత్ర్యసమరం ఎక్కడైనా - ఎప్పటికైనా - ముగిసేది కాదు. అప్రమత్తత స్వాతంత్ర్యానుభూతికి మానవుడు చెల్లించవలసిన నిత్య మూల్యం. స్వాతంత్ర్యాన్ని కోల్పోడానికి విదేశీ దండయాత్ర సాగనక్కర లేదు;

విదేశీయ పరిపాలన కొనసాగ నవసరం లేదు. హిట్లర్, ముసోలీనీలు విదేశీయ విజేతలు కారు. కాని, వారి పరిపాలనాకాలంలో జర్మనులు, ఇటాలియనులు స్వాతంత్ర్యాన్ని అనుభవించినారని ఎవ రనగలరు? స్పెయిన్‌పై నేడు విదేశీయ పరిపాలన కొనసాగడం లేదు. కాని, శ్పానిష్ ప్రజలు నేడు అనుభవిస్తున్నది దాస్యబాధే కాదా!

స్వాతంత్ర్యానికి "రాజకీయ స్వాతంత్ర్యం" అని సంకుచితమైన అర్థాన్ని చెప్పుకొనడం పొరపాటు. సాంఘిక, ఆర్థికాది విషయాలలో లోపంలేకుండా చేయని రాజకీయ స్వాతంత్ర్యం శుష్కమైనట్టిదే. క్షుధార్తునికి ఓటు వల్ల ప్రయోజన మేమిటి? – దాన్ని ఎన్నికల సమయంలో ఎక్కువ పాట పెట్టగల వానికి అమ్ముకొని, ఆ పూట గడుపుకొనడం తప్ప! విద్యావిహీనునికి ఓటు వల్ల ప్రయోజన మేమిటి? – ఆకర్షణీయమైన నినాదాలతో ఎవరు తనను ఎక్కువ మోసగించగలరో వారికి దాన్ని వేయడం తప్ప। సంఘదురాచారాలచే, మత మౌఢ్యాలచే అంధప్రాయుడైనవానికి ఓటువల్ల ప్రయోజన మేమిటి? – తన దురాచారాలను, తన మౌఢ్యాలను బలపరచగలవారి పక్షాన దాన్ని నమోదు చేయడం తప్ప। అందువల్ల రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా విద్యా విషయకంగా సర్వతోముఖాభివృద్ధిని చెంది, ప్రతిమానవుడు తన వ్యక్తిత్వాన్ని సంపూర్తిగా వికసింప జేసుకొనడానికి సమస్తావకాశా లిచ్చేదే వాస్తవికమైన స్వాతంత్ర్యం.

ఇట్టి స్వాతంత్ర్య సంరక్షణకోసం రాజకీయస్వాతంత్ర్యం అనుభవిస్తున్న దేశాలలో సయితం ప్రతి పౌరుడు అప్రమత్తతను నిత్యమూల్యంగా చెల్లిస్తుండ వలసిందే. అయితే, రాజకీయ స్వాతంత్ర్యం లేని ఇండియా, ఇండో – చైనా, ఇండొనీసియా మొదలైన దేశస్థులు చెల్లించవలసిన మూల్యం, రాజకీయ స్వాతంత్ర్యం వున్న దేశస్థులు చెల్లించవలసినదానికంటె మరింత అధికమైనది; మరింత కఠోరమైనది. దీన్ని ప్రతి భారతపౌరుడు గుర్తించాలి; రాజకీయ స్వాతంత్ర్యాన్ని పొందడానికి, దాన్ని సర్వతోముఖమైన వాస్తవిక స్వాతంత్ర్యం కింద పరిణమింప జేసుకొనడానికి తగు మూల్యం చెల్లింపుకు సంసిద్ధుడు కావాలి.

[జనవరి 2, 1947]

వినాశకర వ్యవస్థ

"అన్నమో రామచంద్రా!" - ఈ ఆర్తనాదమే నేడు సర్వత్రా వినవస్తున్నది. విస్తృతక్షామం ఏ దేశంలోనూ లేకపోవచ్చు. కాని, ముప్పొద్దుల కడుపు నిండుగా తిండి దొరకనివారు కోటానుకోట్లు.

కాగా, ఆకలిమంటలకు తాళలేక ఏ నుయ్యో గొయ్యో చూచుకొంటున్న వారు అన్ని దేశాలలోను ఎందరో కొందరు ఈ నాటికీ కానవస్తూనే వున్నారు. మొన్ననే అనంతపురం సమీపంలో ఇట్టి హృదయవిదారక సంఘటన జరిగింది.

మగడు మంచం పట్టగా, అతడు తెచ్చే కూలిడబ్బులుకూడా లేకపోయినందున, గుక్కెడు గంజి కాచి పిల్లలకు పోయడానికైనా ఒక దారి లేకపోగా, ఆకలికి మలమల మాడిపోతున్న తన ముగ్గురు బిడ్డల బాధ మరి చూడలేక, వారిని ఒక తల్లి నూతిలో పారవేసింది. తానుకూడా ప్రాణం తీసుకోవాలని ఆమె నూతిలో ఉరికింది.కాని, ఆమెను మృత్యుదేవతకూడా చిన్నచూపే చూచింది!

ఒక్క ఇండియాలోనే కాదు; నేడు జపాన్‌లో, జర్మనీలో, చైనాలో, మరికొన్ని ఇతరదేశాలలో కూడా ఇంతటి ఘోర సంఘటనలే జరుగుతున్నాయి.

అసలు కూడు దొరకడం లేదనో, దొరికినా కడుపునిండా దొరకడం లేదనో ప్రపంచప్రజ దురపిల్లుతుండగా, ధరలు పడిపోవచ్చునన్న భయంతో యునైటెడ్ స్టేట్సులో పదిలక్షల టన్నుల బంగాళాదుంపలను పెంటపోగుపై పారబొయ్యడానికి తీర్మానించుకొన్నారని నేడు వార్త వచ్చింది.

ఈ వార్త విన్నంతనే "ఇది నాగరిక యుగమేనా?", "మనం నాగరిక మానవులమేనా?" అని సందేహం కలగకమానదు. ఒక విధంగా ఇది నాగరిక యుగమే; మనం నాగరిక మానవులమే. ఒక్కొక్క సంవత్సరం గడచిన కొద్దీ మన విజ్ఞానం వృద్ధి చెందుతున్నది, మన దృక్పథం విశాలమౌతున్నది, మన సంస్కృతి విశిష్టమౌతున్నది.

గత శతాబ్దంనాటి మన తాత, ముత్తాతలకంటె అన్నివిధాల మనం శ్రేష్ఠ మానవులమే. కాని, మానవసంస్కృతితో పాటు మానవుని ఆర్థికవ్యవస్థ స్వభావం మారడం లేదు.

కొన్నివేల - కాదు, కొన్ని లక్షల - యేళ్లనాడు ఏ చెట్టుకొమ్మమీదనో, ఏ కొండగుహలోనో ఆటవికస్థితిలో మానవుడు నివసిస్తున్నప్పటివలె నేడు కూడా మన ఆర్థికవ్యవస్థకు ప్రాతిపదిక స్వలాభమే.

ప్రకృతి రహస్యాలను మానవుడు తెలుసుకొనడంవల్ల నేమి, ప్రకృతి శక్తులను మానవుడు వినియోగించుకొన గలుగుతున్నందువల్ల నేమి, సకల సంపదలతో తులదూగడానికి నేడు మానవునికి ప్రతిబంధకం - అతని స్వార్థం తప్ప అన్యం ఏదీ లేదు.

ఈ స్వార్థం కారణంగానే పంటలను పండించడమైనా, ఫ్యాక్టరీలను నడిపించడమైనా! వస్తూత్పత్తి వినియోగం నిమిత్తం కాక, లాభార్జన నిమిత్తమే కొనసాగుతున్నది. "లాభార్జనకై ఉత్పత్తి" మన ఆర్థికవ్యవస్థకు ప్రాతిపదిక కావటమే ప్రపంచంలోని అనర్థాలలో పెక్కింటికి ప్రధాన కారణం.

ఒకవైపున ''అన్నమో రామచంద్రా!'' అని కోటానుకోట్లు అలమటిస్తుండగా నోటిదగ్గరి కూటిని పెంటపోగుపై పారబోయనిదే నిలవలేని ఈ వికృత- ఈ విపరీత - ఈ వినాశకర - ఆర్థిక వ్యవస్థకు స్వస్తిచెప్పగలితేనే, మానవునికి శాంతిసౌఖ్యాలైనా, క్షేమాభివృద్ధులైనా!!

[ఫిబ్రవరి 11, 1947]

అరుణోదయం

ఎన్నేళ్ళుగా ఎదురుచూస్తున్నాము! ఎంతకాలంగా కలలు కంటున్నాము! ఎంతగా తహతహలాడుతున్నాము! ఎప్పు డెప్పుడని ఎంతగా ఉవ్విళ్ళూరుతున్నాము!

మనం దాస్యంలో వున్నామని గమనించనంతవరకు బాధ లేకపోయింది; దాస్యం సిగ్గుచేటని గుర్తించనంతవరకు ఆవేదన లేకపోయింది. కాని, ఆ తర్వాత ప్రతినిత్యం బాధే కాదా? అనుక్షణం ఆవేదనే కాదా?

ఈ దారిద్ర్యం, ఈ దైన్యం మనకు దేనికి? మన దేశదాస్యంవల్లనే. ఈ అవిద్య, ఈ అజ్ఞానం మనకు దేనికి? మన జాతి పారతంత్ర్యంవల్లనే. ఈ అగచాట్లు, ఈ అవమానాలు మనకు దేనికి? మన సంఘ బానిసత్వంవల్లనే. బ్రతుకే మనకు భారమైపోవడం దేనికి? మనకు స్వాతంత్ర్యం లేకపోబట్టే!

ఈ ప్రశ్నలు, ఈ ప్రత్యుత్తరాలు మనకు స్ఫురించని దినం లేదు, గడియ లేదు. అడుగడుగున ఇవి మనలను కలత పెట్టినవి, కల్లోల పరచినవి, ఆగ్రహపరచినవి, ఆవేశపరచినవి, సిగ్గిల జేసినవి, చింతాక్రాంతుల్ని చేసినవి, ఉన్మత్తుల్ని చేసినవి.

మనకు సైన్యం లేదు, సైన్యాధికారులు లేరు, ఆయుధాలు లేవు, ఆర్థిక స్తోమతైనా లేదు. ఒక మహాసామ్రాజ్యశక్తిని ఏ విధంగా ప్రతిఘటిస్తాము? స్వాతంత్ర్యాన్ని ఏవిధంగా సాధిస్తాము? ఉత్తచేతులతో పోరాడగలమా? ఉరికంబాల నెక్కగలమా? ఇందుకు ఎంత లక్ష్యశుద్ధి కావాలి, ఎంతటి ధైర్య సాహసాలు కావాలి! దాస్యంవల్ల శారీరకంగానే కాకుండా, మానసికంగానే కాకుండా, నైతికంగా కూడా పతనంచెందిన జాతినుంచి ఇంతటిని ఆశించగలమా?

ఈ విధంగా ఎన్ని శంకలు, ఎన్ని సందేహాలు, ఎంతగా డోలాందోళన? కాని, మన నైరాశ్యంనుంచే ఒక నాధుడు ఉద్భవించాడు, మన నిస్పృహనుంచే ఒక నాయకుడు అవతరించాడు. మన బాధలు ఆయనను

కంపింపజేసినవి; మన అవమానాలకు ఆయన నేత్రయుగ్మంనుంచి విస్ఫులింగాలు రాలినవి; మన ఆశలు ఆయనలో జ్వాలాశిఖలైనవి; మన మూకవేదన ఆయనలో అగ్నిపర్వతమైంది. మట్టిముద్దలనుంచి ఆయన మహావీరులను సృష్టించాడు. ఒక ప్రజాసంస్థను సమకూర్చుకొన్నాడు; ఒక శాంతి సైన్యాన్ని సన్నద్ధం చేసుకొన్నాడు. తను ముందుకు నడిచాడు. ఒక జాతికి జాతినే ముందుకు నడిపించాడు. ''ఆత్మార్పణ చేయండి" అన్నాడు, "ఆశయసిద్ధిని పొందండి" అన్నాడు.

అపూర్వమైనవాడు ఈ నాయకుడు, అపూర్వమైనవి ఆయన పద్ధతులు. కొందరు నవ్వారు, కొందరు వెక్కిరించారు, కొందరు ఎగతాళి చేశారు, కొందరు పెదవి విరిచారు, కొందరు నొసలు ఎగరవేశారు. నిరసనను పాటించనట్టే, ప్రతిఘటనను కూడా లక్ష్యపెట్టకుండా ఆయన మాత్రం ముందుకు నడిచాడు; తన వెంట ఒక జాతికి జాతినే నడిపించాడు.

ఈ నడకలో ఆయన అప్పుడప్పుడు ఆగకపోలేదు. అయితే, ఆయన ఆగడం తాను అలసిపోయినందువల్ల కాదు; తను చలించిపోయినందువల్ల కాదు. తనవెంట నడుస్తున్నవారు సేద తీర్చుకోడానికే, దారి తప్పుతున్నవారిని కూడ గట్టుకు పోవడానికే, మరొక మజిలీతో గమ్యస్థానానికి మరింత దగ్గరగా చేరడానికే!

ఇక చివరి మజిలీని చేరవలసి వున్నదని తలచినంతనే "క్విట్-ఇండియా'' అని ఆయన శంఖారావాన్ని చేశాడు; "కరో, యా మరో!" అని సమర నినాదాన్ని చేశాడు.

ఇది శుష్క నినాదమని అన్నవా రున్నారు; ఇది వ్యర్థయత్నమని పలికినవారున్నారు; ఇదివ్యర్థశ్రమే అని హెచ్చరించినవారున్నారు. కాని, ఆయన మాత్రం ముందుకే నడిచాడు. ఒక జాతికి జాతినే తనవెంట ముందుకు నడిపించాడు.

ఆ నడకకు భూమ్యాకాశాలు దద్దరిల్లినవి; బ్రిటిష్ సామ్రాజ్య మహాసౌధపు పునాదులు కదలినవి. అయినా ఎన్నో పోటీలు పెట్టారు; పుట్టకోటలు కట్టారు.

తా మేమి చేసినా, ఇక ఇండియాలో తమ సామ్రాజ్యసౌధం నిలవబోదని తెలిసి పోయినందున, ఈ నాటికి "1948 జూన్‌లోగా మీ దారి మీదే; మా దారి మాదే" అని చెప్పివేశారు.

దాదాపు రెండు శతాబ్దాలనుంచి దాస్యాన్ని అనుభవిస్తున్నాము ఇంకొక్క పదహారు నెలలలో మనకు ఈ దాస్యం తొలగిపోతుంది; మనం స్వతంత్రుల మౌతాము; మన బాధలు పోతాయి; మనం సుఖ పడతాము; నలుగురిలో తల యెత్తుకు తిరగ గలుగుతాము, లోకంచేత ఔననిపించుకొంటాము.

అయితే, ఈ లోపుగా ఎంతో విజ్ఞత, ఎంతో సామరస్యం, ఎంతో దూర దృష్టి మనం ప్రదర్శించాలి. మనలను ఇంతవరకు నడిపించుకువచ్చిన మన నాయకుడు తూర్పు బెంగాల్ కుగ్రామాలలో - నవకాళీ క్రౌర్యాలమధ్య - ఏకాంతంగా నివశిస్తూ, మనకు చూపించగోరుతున్న సౌభ్రాత్రమార్గంవెంట నడవాలి, సమైక్యతాపథాన్ని మెట్టాలి.

ఇన్నేళ్ళుగా మన రక్తమాంసాలను పిండుతున్న బ్రిటిష్‌జాతి - ఇంత కాలంగా మనల్ని దోచుకుతింటున్న బ్రిటిష్‌జాతి - ఇప్పటికీ తన ఆశలను పూర్తిగా చంపుకోలేదు; తన పట్టును పూర్తిగా వదలలేదు. ఏదో ఒక పేచీ పెట్టాలని, ఏదో ఒక మెలిక వెయ్యాలని, తాను పైదొలగినా, తనకు కొంత పలుకుబడి మిగలాలని అది ప్రయత్నిస్తున్నది.

"1948 జూన్ నెలలోగా భారతీయులకు సంపూర్ణప్రాతినిధ్యం వహించ గల ప్రజాపరిషత్తు ఒక రాజ్యాంగ విధానాన్ని నిర్మించజాలని పక్షంలో ఇప్పుడు మేము పెడుతున్న ఈ గడువునాటికి బ్రిటిష్ ఇండియాలో కేంద్ర ప్రభుత్వాధికారాన్ని ఎవరికి అప్పగించాలన్న సమస్యను బ్రిటిష్ ప్రభుత్వం పరిశీలించవలసి వుంటుంది. బ్రిటిష్ ఇండియాపై గల అధికారాలను ఏదో ఒక రూపంలో వున్న కేంద్ర ప్రభుత్వానికే మొత్తంగా అప్పగించడమా, లేక కొన్ని ప్రాంతాలలో ఆక్కడ అధికారంలో వున్న రాష్ట్రీయ ప్రభుత్వాలకు ఈ అధికారాలను అప్ప గించడమా, లేక అతిసమంజసమైనదని, భారత ప్రజల యోగక్షేమాలకు అను

గుణమైనదని తోచిన మరొక పద్ధతిని అవలంబించడమా అని ఈ సందర్భంలో బ్రిటిష్ ప్రభుత్వం ఆలోచించి, ఒక నిర్ణయానికి రావలసివుంటుంది" అని ప్రధాని అట్లీ చేసిన ప్రకటనలో ఏదో పేచీ - ఏదో మెలిక - లేకపోలేదు.

కాని, మన మతమౌఢ్యాలను, పాక్షిక ప్రయోజనాలను, వర్గస్వార్థాలను, వ్యక్తిగత అహంకారాలను మన దేశక్షేమంకోసం తాత్కాలికంగానైనా మనం విస్మరించగలిగితే, ఈ పేచీ లేమి, ఈ మెలిక లేమి మనలను బాధ పెట్టలేవు. అప్పుడు 1948 జూన్ వరకు కూడా ఆగకుండా, ఈ లోపుగానే మనకు స్వరాజ్యం, మనకు స్వాతంత్ర్యం !

భావి మన దైనప్పటికీ ఇప్పుడిక బాధ్యత మనది; కలలపంట మన దైనప్పటికీ ఇప్పుడిక కర్తవ్యపరిపాలన మనది.

సమయానికి తగిన సామరస్యశక్తులను మనం సమీకరించుకోగలమా? ఫలసిద్ధికి వలసిన పరిణతప్రజ్ఞను మనం ప్రదర్శించగలమా?

ఇదే నేడు ముఖ్యమైన ప్రశ్న. ఈ ప్రశ్నకు మన ప్రత్యుత్తరాన్నిబట్టే భావి చరిత్రకారుడు మీకు - మాకు - మనలో ప్రతి వ్యక్తికీ విలువ కడతాడు.

[ఫిబ్రవరి 22, 1947]

నవప్రాచ్యం

రెండు, మూడు శతాబ్దాలుగా ఆసియాఖండం సుషుప్తావస్థలో పడిపోయి వుండవచ్చు, స్తబ్ధత చెందివుండవచ్చు, జీవచ్ఛవంవలె మనివుండవచ్చు. కాని పండిట్ నెహ్రూ నిన్న ఉద్ఘోషించినట్లు, పెక్కు వేల సంవత్సరాలపాటు మానవజాతి పరిణామంలో ఆసియా ఖండమే ప్రముఖపాత్ర వహించింది. వాస్తవానికి మానవసభ్యతకు జన్మస్థాన మిదే. కొన్ని సందర్భాలలో ఆమోమయంగా, మరికొన్నింట ఆశ్చర్యకరంగా, వేరొక కొన్నింట అద్భుతంగా, ఒకొక్కప్పుడు భయానకంగా, వేరొకొక్కొక్కప్పుడు విలయసూచకంగా తనకు కానవచ్చిన తన పరిసరప్రకృతి బహిఃస్స్వరూపాన్ని చీల్చి, దాని నిగూఢ రహస్యాలను కనుగొనడానికి మానవుడు ఓంప్రథమంగా సాహసించింది ఈ ఆసియాఖండంలోనే. ప్రకృతిని తాను అర్థంచేసుకొన్నకొలదీ, దానిపై ప్రాబల్యాన్ని సాధించినకొలదీ, సభ్యతాపథంవెంట అంతకంతకు పురోగమించి, తన మహోజ్వలసంస్కృతి దివ్యప్రభాద్యుతులతో సమస్త ప్రపంచానికి మానవుడు వెలుగుదారులను చూపించిందికూడా ఈ ఆసియాఖండంలోనే.

ఇట్టి ఆసియాఖండం ఈ మధ్య కొన్ని శతాబ్దాలపాటు కళలు తగ్గిపోవడానికేమి, దాస్యానికి, దారిద్ర్యానికి దైన్యానికి గురికావడానికేమి ముఖ్యకారణం దానిలో సంతృప్తి అధికం కావడమే, సంతుష్టి బలిసిపోవడమే.

"విజ్ఞానావధులను నేను అందుకొన్నాను; సంస్కృతీశిఖరాలను నేను అధిరోహించాను; సంశోధించవలసింది ఇక లేదు; అభ్యసించదగింది మరి లేదు; నా రాజకీయ, ఆర్థిక, సాంఘిక వ్యవస్థలే సర్వోత్తమమైనవి" – ఈ ధోరణిలో ఆసియాఖండం పడిపోయింది.

అంతట దాని దృష్టిలో తీక్షత తగ్గింది; దాని రక్తనాళాలలో ప్రవాహం మందగించింది; దాని శరీరంలో పాటవం చచ్చింది. అందువల్లనే నవచైతన్యంతో,

నవశక్తితో, నవనవోన్మేష దీప్తితో ప్రాశ్చాత్యప్రపంచం తన ప్రాంగణంలోకి వచ్చినంతనే దానికి పాదాక్రాంతమై పోయింది.

అయితే, ఇటీవల పాశ్చాత్య ప్రపంచానికి ఎంతగా పాదాక్రాంతమై పోయినా, శారీరకంగా, మానసికంగా, నైతికంగా ఎంత అధఃపతనాన్ని చెందినా, ఆసియాఖండం తన ఆత్మను మాత్రం కోల్పోలేదు. అందుచేతనే అది తిరిగి చైతన్యపూరిత మైంది; తిరిగి శక్తివిలసిత మైంది; తిరిగి స్వాతంత్ర్యాన్ని పొందడాని కేమి, తిరిగి మానవచరిత్రకు రూపురేఖలను దిద్దడాని కేమి సమాయత్తపడుతున్నది.

ప్రబుద్ధమైన ప్రాచ్యప్రపంచం తన భావిని, మానవజాతి భావిని నిర్ణయించుకొనడానికి ప్రారంభమైనట్టిదే అఖిల ఆసియా మహాసభ. భారతదేశం దీనికి రంగస్థలం కావడం భారతీయు లందరికీ సంతోషకారణం.

విశ్వాసంతో, భావనాపటిమతో, విజ్ఞతతో, విశాలనయనాలతో పరికించ గలవారికి "పురాణఖిల్లా" పురాతన కుడ్యాలమధ్య నవప్రాచ్యం – స్వతంత్ర ప్రాచ్యం – మహోజ్జ్వల ప్రాచ్యం – అంతే కాదు – ఒక నూతనప్రపంచమే – ఆవిర్భవించడం పొడగట్టగలదు.

[మార్చి 25, 1947]

ఆసియా మహాసభ

పాశ్చాత్యులు ఏ అంతర్జాతీయ సమావేశాన్ని జరిపినా, అది మాస్కోలో ప్రస్తుతం జరుగుతున్న విదేశాంగమంత్రుల సభవలె నాలుగుదేశాల ప్రతినిధులతో కూడినట్టిదే. అయినప్పటికీ అనుక్షణం ఏదో ఒక ప్రశ్నపై విభేదాలే, ఏదో ఒక సమస్యపై కలతలే, ఏదో ఒక విధానంపై కలహాలే. అందువల్లనే ఆ సమావేశాలకు అడుగడుగుకు ఏదో ఒక అవాంతరమే! అది ఎట్టి సమావేశమైనా పరిసమాప్తి చెందే లోపల ప్రతిష్టంభన ఏర్పడినట్టు కనీసం ఒక పదిసార్లు, ప్రతిష్టంభన విడిపోతున్నట్టు మరొక పదిసార్లు, అంతలోనే అది తిరిగి ఘనీభవించినట్టు మరొక పదిసార్లు వార్తలు రావడం కద్దు.

పాశ్చాత్యఖండంలో ఏ అంతర్జాతీయ సమావేశం జరిగినా, ఇది పరిపాటిగా పరిణమిస్తున్న సమయంలోనే, దాదాపు 30 దేశాల ప్రతినిధులు పాల్గొన్న అఖిల ఆసియా మహాసభ ఎట్టి విభేదాలు లేకుండా, కలతలు లేకుండా, ఆదినుంచి అంతంవరకు నిర్విఘ్నంగా కొనసాగిపోవడం ప్రత్యేకంగా గమనార్హమైన విషయం కాదా?

అవి పాలకరాజ్యాలైతే, ఇవి పరిపాలిత రాజ్యాలు కావడమే ఇందుకు కారణమా? అవి సర్వసంపత్తితో తులదూగుతుండగా, ఇవి అతిదుర్భర దారిద్ర్యంతో గాసిల్లడమే ఇందుకు కారణమా? వాటికి కాపాడుకోనవలసిన స్వార్థాలుండగా, వీటికి అవి లేకపోవడమే ఇందుకు కారణమా? ఇంత స్వల్పమైనవే ఇందుకు కారణాలని మేము భావించము.

ప్రాచ్యఖండంనుంచి మతం, శాస్త్రం, విజ్ఞానం, సంస్కృతి, సభ్యత మొదలైనవాటి నన్నింటిని పాశ్చాత్యప్రపంచం పరిగ్రహించింది. వాటిని తన ప్రవృత్తి ప్రకారం, పరిసరాల ప్రకారం, చరిత్ర ప్రకారం అభివృద్ధి పరచుకొన్నది.

అయితే, ప్రాచ్య విజ్ఞానంనుంచి, ప్రాచ్య సంస్కృతినుంచి ప్రాపంచిక సంపత్తి కేమి, సౌఖ్యాని కేమి తాను ప్రాతిపదికలుగా గ్రహించినవాటిని అభివృద్ధి పరచుకొన్నంతగా, అన్యవిషయాలకు సంబంధించినవాటిని ఆది అభివృద్ధి చేసుకోలేదు సరిగదా, వాటికి వికృత రూపాల నిచ్చింది. అందువల్లనే గాంధీజీ నిన్న చెప్పినట్టు, ప్రాచ్యఖండంనుంచి వెళ్ళిన క్రైస్తవమతం పాశ్చాత్య ప్రపంచాన్ని చేరగానే స్వస్వరూపాన్ని పూర్తిగా కోల్పోయి, వికృతమైపోయింది.

సంపత్తి కావలసిందే. కాని, నైతిక పతనానికి అది దోహదం కానంత వరకే. సౌఖ్యం కావలసిందే. కాని, భోగలాలసత్వాన్ని అది ప్రేరేపించనంత మేరకే. సర్వసంగ పరిత్యాగాన్ని చెయ్యమనడం సమంజసం కాకపోవచ్చు. కాని, ప్రాపంచికభోగాలే జీవితసర్వస్వం అనుకొనడం మాత్రం తగదు. అయినా ఈ ప్రమాదంలోనే పాశ్చాత్యప్రపంచం పడింది.

వ్యక్తులుగా పాశ్చాత్యులు ఉత్తములే కావచ్చు. అయినా, ఒక జాతిగావారు పోని ఆశలేదు, చేయని మోసం లేదు, జరపని దౌష్టం లేదు. జాతి స్వార్థం, జాతిప్రాబల్యం అనే సరికి ఎన్ని అబద్ధాలకైనా, ఎన్ని అన్యాయాలకైనా, ఎంతటి పశుకృత్యాలకైనా వారు సంసిద్ధులే.

అందువల్లనే వారిలో వారికి అన్ని కలతలు, అంతగా కలహాలు; అందువల్లనే వారు ఒకదాన్ని మించగల మరొక భీషణ మారణాస్త్రాన్ని సృష్టించుకొనడం; అందువల్లనే వారు అంతకంతకు మహావిధ్వంసకరమైన యుద్ధాలకు దిగడం.

ఇది ఆగడం అసత్యం స్థానాన్ని సత్యం ఆక్రమించినప్పుడే; దురాశ స్థానంలో త్యాగానికి పట్టాభిషేకం జరిగినప్పుడే; విద్వేషంస్థానంలో ప్రేమ రాజ్యం చేసినప్పుడే! ఇదే నిన్న ముగిసిన ఆసియా మహాసభ ప్రపంచానికిచ్చిన సందేశం.

[ఏప్రిల్ 4, 1947]

భాషాప్రయుక్త రాష్ట్రాలు

భాషాప్రయుక్త రాష్ట్రవిభజన ఆవశ్యకతను కాంగ్రెసు గుర్తించింది. ఇంతే కాదు. కాంగ్రెసు వ్యవస్థకు సంబంధించినంతవరకు భాషాప్రయుక్త సిద్ధాంతాన్ని పూర్తిగా అనుసరించింది కూడా. అయినా, ప్రభుత్వవ్యవస్థలో ఈ శిష్ట సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టడం విషయంలో కాంగ్రెసు అగ్రనాయకులు కొంత ఔదాసీన్యాన్ని ప్రదర్శించారు.

ఇదివరలో ఏమి జరిగినా, ఇప్పుడు భాషాప్రయుక్త రాష్ట్ర విభజనను కొనసాగించడానికి మన రాజ్యాంగ పరిషత్తు తగు సన్నాహం ప్రారంభించడం ముదావహం.

మరికొన్ని ప్రభుత్వోద్యోగాల కోసమో, మరికొన్ని మంత్రి పదవుల కోసమో ప్రారంభమైనట్టిది కాదు, భాషాప్రయుక్త రాష్ట్ర విభజనోద్యమం, అట్టి సంకుచిత లక్ష్యాలతోనే ప్రారంభమైనదైతే, ఈ ఉద్యమం సమర్థనీయమైనది కాబోదు సరిగదా, గర్హనీయమైనది కాగలదు కూడా.

ఏక భాష, ఏక సారస్వతం, ఏక సంస్కృతి - ఇవి జాతి, మత, వర్ణ, వర్గ, కుల విభేదాలను అధిగమించి, ఒక ప్రజలో సన్నిహితత్వాన్ని కూర్చగల అమోఘశక్తులు. ఈ శక్తులను ఛిన్నాభిన్నం చేసివేయడానికే ఏక భాషా ప్రాంతాన్ని బ్రిటిష్‌వారు విభిన్న రాష్ట్రాలలో చేర్చగా, లేదా, విభిన్న భాషా ప్రాంతాలను ఏక రాష్ట్రంగా చెయ్యగా, ఈ శక్తులను సమీకరించి, జాతీయ సమైక్యతకు దోహద మివ్వడానికే భాషాప్రయుక్త రాష్ట్ర విభజనోద్యమాన్ని ప్రారంభించాము.

భాషాప్రయుక్త రాష్ట్రవిభజనను మనం కోరడానికి మరొక బలీయమైన కారణం కూడా లేకపోలేదు.

విజ్ఞాన సముపార్జనకు విద్య దోహద మివ్వగలదనడం నిస్సందేహం. కాని, విద్య నేర్చిన ప్రతివాడు విధిగా వివేకి కాడు వ్యవహారదక్షతకు విద్య

ప్రోది చేస్తుందనడం నిర్వివాదం. అయితే, ప్రతి విద్యావంతుడు వ్యవహార దక్షుడు కాడు. కాని, ప్రస్తుతం మన దేశంలోని కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా వివేకం కలవారైనా, కాకపోయినా, వ్యవహార దక్షత వున్నవారైనా, లేని వారైనా విద్యనేర్చినవారికి - ముఖ్యంగా ఆంగ్లేయ భాషను అభ్యసించినవారికి- సంఘనాయకత్వం సంక్రమించింది. ఇదే నేటి మన జాతీయజీవితంలో కానవచ్చే లోపాలలో, నూరింట 90 వంతులకు ముఖ్యకారణం.

నేటి మన పరభాషావిద్య ప్రజాసామాన్యంనుంచి మనలను వేరుచేసి వేస్తున్నది. అంతే కాదు. మన సంస్కృతినుంచి, సంప్రదాయాలనుంచి, మన సమస్యలనుంచి, సాధకబాధకాలనుంచి మన దృష్టిని అది మరల్చివేస్తున్నది.

ఈ దుస్థితి తొలగిపోవాలంటే, కొత్త నాయకులు రావాలి; వారు ప్రజా బాహుళ్యంనుంచి - ముఖ్యంగా గ్రామసీమనుంచి - రావాలి. మన జాతీయ జీవితంనుంచి మనలను వేరుచేసే పరభాషలోకాకుండా, మన ప్రాంతీయ భాషల లోనే మన వ్యవహారాల నిర్వహణ కొనసాగాలి. ఇంగ్లీషులో నూటికి 35 మార్కులు సంపాదించినవారు కాక, చూచి రమ్మంటే కాల్చిరాగలవారికి సంఘ నాయకత్వం సంక్రమించాలి.

మాతృభాషలోనే విద్యాభ్యాసం, మాతృభాషలోనే దేశవ్యవహారాల నిర్వహణ - ఈ సదుపాయాలు లేకపోతే, ఉదాహరణకు, మిస్టర్ బెవిన్ ఈ నాడు బ్రిటనుకు విదేశాంగమంత్రి అయివుండేవాడా? ఏమో, సందేహమే!

జాతిని సమైక్యపరచగల శక్తులను సమీకరించి, జాతికి కొత్త నాయకులను సమకూర్చడమే భాషాప్రయుక్త రాష్ట్రవిభజనోద్యమ లక్ష్యం.

సరిహద్దుల నిర్ణయం విషయంలో అనేక వాదోపవాదాలు తప్పకపోయినా, అనతికాలంతో ఆంధ్ర, తమిళ, కేరళ, కర్ణాటక రాష్ట్రాలు అవతరించగలవని, భారత జాతీయసౌధానికి అవి మూలస్తంభాలు కాగలవని ఆశిస్తున్నాము.

[జూన్ 13, 1947]

స్వాతంత్ర్యభానూదయవేళ

మరి తొమ్మిది పగళ్లు, తొమ్మిది రాత్రులు గడిస్తే చాలు – భారత స్వాతంత్ర్య భానూదయం జరుగుతుంది.

మన స్వాతంత్ర్యానికి తొలిఘాత 1757 ప్లాసీ యుద్ధభూమిలో తగిలింది. కాని, దీన్ని నాడు మన జాతి గుర్తించలేదు. ప్లాసీ యుద్ధానంతరం రాజుతర్వాత రాజు – రాష్ట్రంతర్వాత రాష్ట్రం – బ్రిటిష్‌వారి దాస్యంకిందికి పోతున్నా, స్వాతంత్ర్య వంచితులమై పోతున్నామనే ఆవేదన మనలో పుట్టలేదు.

ఈ ఆవేదన ఓంప్రథమంగా రేకెత్తడం 1857 ప్రాంతాల. దీని ప్రత్యక్ష ఫలితమే – 1857లో ప్రజ్వలించిన ప్రథమ భారత స్వాతంత్ర్యసంగ్రామం. ఈ సంగ్రామంలో పరాజం పొందినపిమ్మట జాతిలో నైరాశ్యం, నిస్పృహ జనించాయి.

ఇది కొంత తొలగి, తిరిగి మన జాతి స్వాతంత్ర్యాన్ని గురించి కలలుగనడం 1880 ఛాయలలో. ఈ కలలు ఒక నిర్దుష్టరూపాన్ని ధరించడం, దేశదాస్యాన్ని లజ్జాకరమైనదిగా మనం పరిగణించడం 1905 నాటినుంచి. ఇక, బానిసత్వపు బ్రతుకు దుస్సహమనే భావం మనలో ప్రబలింది 1917నుంచి.

కడచిన ముప్ఫయి సంవత్సరాలలో స్వాతంత్ర్య భానూదయం ఎప్పుడెప్పుడని మనం ఎదురుచూడని రోజు లేదు. మరి తొమ్మిది పగళ్ళు, తొమ్మిది రాత్రులు గడిస్తే చాలు, – ఆ శుభసమయం వస్తుంది. అయినా, ఈ తొమ్మిది పగళ్లు, ఈ తొమ్మిది రాత్రులు మనకు పద్దెనిమిది యుగాలవలె తోస్తున్నవి.

దాదాపు రెండు శతాబ్దాలు దాస్యబాధతో కుమిలినవారికి తొమ్మిది పగళ్లు, తొమ్మిది రాత్రులు ఇంత దుస్సహంగా పరిణమించడం వింతగా తోచవచ్చు. కాని, నిజానికి దీనిలో వింత లేదు. ప్రియాగమనానికై అనేకాబ్దాలు వేచివున్న

వానికి తుది కొలది గడియలే అతి దుర్భరం; యావజ్జీవ కారాగారవాస శిక్ష పడినవానికి బంధవిముక్తిపూర్వపు కొలది క్షణాలే అత్యంత దుస్సహం.

జాతీయస్వాతంత్ర్యం ఎట్టిదో మనకు తెలియదు, మన తండ్రులకు తెలియదు, మన తాతలకు తెలియదు. అంతకు పూర్వపువారికి అది కొంత వరకు తెలుసునేమో! మనకు తెలిసింది కేవలం పారతంత్ర్య బాధే! ఈ బాధ విరగడై పోవడమేమి, మనకు స్వాతంత్ర్యం సిద్ధించడమేమి, ఒక వినూత్నాను భూతి కాబోతున్నది, ఒక విశిష్టానుభవం కాబోతున్నది.

ఇది ప్రస్తుతం మనం ఊహించుకొని పలసినట్టిదే ! ఇది మనకు అనుభ వైకవేద్యం కావడం ఆగస్టు 15 వ తేదీని స్వాతంత్ర్య భానూదయమైన వెనుకనే.

ఈ వినూత్నానుభూతికోసం, ఈ విశిష్టానుభవంకోసం మన హృదయం ఆరాటపడుతున్నది. కాని, ఇదే సమయంలో విభిన్న, విరుద్ధ భావాలు మన హృదయాన్ని కలిచి వేస్తున్నాయి కూడా. జాతీయస్వాతంత్ర్యం సిద్ధిస్తున్నా భరతవర్షం అఖండత్వం భగ్నమై పోయిందని విచారం ఒక వైపున. అధినివేశ ప్రతిపత్తితో ప్రారంభమౌతున్న మన రాజకీయ స్వాతంత్ర్యం ఎంత శీఘ్రంగా, సమగ్రంగా సంపూర్ణస్వాతంత్ర్యంగా పరిణమించగలదనే వేగిర పాటు మరొక వైపున. స్వాతంత్ర్య సముపార్జనకై తమ జీవితాలను అంకితం చేసినవారిలో అనేకులు దాన్ని అనుభవించడానికి నేడు లేరుగదా అని ఆవేదన వేరొక వైపున. పరప్రభుత్వం తొలగడంతోపాటు మన దారిద్ర్యబాధ కూడా తొలగి శాంతిసుభిక్షాలు నెలకొనగలవా అన్న సంకోచం ఇంకొక వైపున.

ఈ విభిన్న, విరుద్ధ భావాల కారణంగా మన హృదయాన్ని నేడు సంతోష సంభ్రమోద్వేగాలతోపాటు భయ సంశయ విచారాలు కూడా రాజ్యం చేస్తున్నాయి. భవిష్యత్తునుగురించి మన విశ్వాసం దృఢమైనదే, ధ్రువమైనదే. ఆత్మశక్తిలో మన విశ్వాసం నిస్తులమైనదే, నిశ్చలమైనదే. అయితే, మహోజ్వల భవిష్యత్తుదిశలో మన పురోగమనానికి ఎన్ని ప్రతిబంధకాలు కలవో, ఎంతటి ప్రతి

ఇంతకాలు కలవో - మనకు తెలుసు. అందువల్లనే ఆనందోత్సవానికి సన్నద్ధపడుతూనే మనం ఆత్మపరీక్ష చేసుకొంటున్నాము.

స్వాతంత్ర్య భానూదయంతో నవశకం ప్రారంభం కానున్న ఈ శుభసమయంలో ఇట్టి ఆత్మపరీక్ష మన భవితవ్యాన్ని పదిలపరచుకొనడానికి ముఖ్యావసరం.

[ఆగస్టు 6, 1947]

2

జాతీయస్వాతంత్ర్యం అకారణంగా పోదు, అవలీలగా రాదు, అప్రయత్నంగా నిలవదు.

మనం జాతీయ స్వాతంత్ర్యాన్ని కోల్పోతే, దానికి ప్రబలమైన కారణాలు అనేకం లేకపోలేదు యూరోపియనులు మన దేశానికి వచ్చినప్పుడు దీన్ని జయించవలెనన్న ఉద్దేశం వారికి లేదు. దీన్ని తాము జయించగలమని వారు కలలోనైనా అనుకోలేదు కూడా. వారిక్కడికి కేవలం వర్తక వ్యాపారాలకోసం వచ్చారు. ఆ రావడంకూడా అతి భయభక్తులతో, వినయ విధేయతలతో వచ్చారు. వాణిజ్య సౌకర్యాలను కల్పించవలసిందిగా, వర్తక కేంద్రాలను నిర్మించుకొనడానికి అనుమతించవలసిందిగా వినతులతో వచ్చారు, విజ్ఞాపనలతో వచ్చారు, సలాములు పెడుతూ వచ్చారు. సాష్టాంగపడుతూ వచ్చారు.

అప్పటికి ఉత్తరాన మొగల్ సామ్రాజ్యం మహోచ్ఛస్థితిలో వున్నది, దక్షిణాన విజయనగర సామ్రాజ్యం శక్తిమంతంగా వున్నది. దేశంలోని తక్కిన భాగాలలో కూడా మొగల్‌పాదుషాకు సామంతులుగానో, స్వతంత్రరాజులుగానో వివిధ పరిపాలకులు ధీరతతో రాజ్యచక్రాన్ని తిప్పుతున్నారు. అందువల్ల ఆ నాడు యూరపియన్ దేశస్థులెవరైనా భారతదేశ జైత్రయాత్రను తలపెడితే, అది కేవలం పిచ్చివాని పగటి కలవలెనే తోచివుండేది.

అయితే నాటి భారతదేశదీప్తి, దాని పాటనం పై మెరుగులే! అసూయలు, అంతఃకలహాలు, ప్రజాపీడన, పాపపూరిత జీవితం - ఇట్టి దుష్టగుణాలతో దుర్మార్గ వర్తనతో - నాటి భారతదేశ పరిపాలకులు కేవలం "మేడిపండు" వలె వున్నారు. దీన్ని యూరోపియనులు గ్రహించడానికి కొంతకాలం పట్టింది. పైగా, ఒక్కసారిగా కాకుండా క్రమక్రమంగా వారు ఈ విషయాన్ని గుర్తించ గలిగారు.

భారతదేశం శత్రుభీకరంగా పైకి కనబడినా, ఒక్క గట్టి ఊపు ఊపితే పండిన పండువలె అది తమ ఒడిలో రాలగలదని గుర్తించినందునే, యూరోపియనులు దాన్ని జయించడానికి తమలో తాము గట్టిగా పోటీ పడ్డారు. ఈ పోటీలో డచ్‌వారు, పరాసువారు, పోర్చుగీస్‌వారు ఓడిపోగా విజయ మేమి, దాని భోగ మేమి బ్రిటిష్‌వారికి దక్కింది.

మన విశాలదేశాన్ని జయించడానికి బ్రిటిష్‌వారు తమ సైన్యాలను గాని, తమ ధనాన్నిగాని దాదాపు వినియోగించలేదు. వారు మన దేశాన్ని జయించింది మన సిపాయిలతోనే మన డబ్బుతోనే. జయించినదాన్ని ఇంతకాలంగా వారు భుక్త పరచుకొన్నది కూడా మన సహాయంతోనే.

మన దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యానికి పునాదులు వేసిన క్లైవ్, వాటిని నేలమట్టంపైకి లేపిన వారన్ హేస్టింగ్స్, వాటిపై గోడలను కట్టిన ఇతరులు సేనాధిపతులు కాదు, రాజ్యాంగవేత్తలు కారు, వ్యవహారదక్షులైనా కాదు. సమకాలిక బ్రిటిష్ సంఘంలో వారు వ్యర్థులుగా భావించబడినట్టివారు, భ్రష్టులుగా పరిగణించబడినట్టివారు. అట్టివారే మన దేశంలో బ్రిటిష్ పతాకను ప్రతిష్ఠించ గలిగినా రంటే, నాడు శారీరకంగా, మానసికంగా, నైతికంగా మన ప్రజ లేమి, మన పరిపాలకు లేమి ఎంత అధోగతిలో వున్నారో మనం సులభంగా ఊహించుకోవచ్చు.

మేజర్ బి. డి. వసు వ్రాసిన "ది రైజ్ అఫ్ ది క్రిష్టియన్ పవర్ ఇన్ ఇండియా" అనే చారిత్రకగ్రంథాన్ని ఆసాంతంగా చదివితే, బ్రిటిష్‌వారి బల దర్పాలుగాని, వారి శక్తిసామర్థ్యాలుగాని, వారికి మన దేశాన్ని కట్టబెట్టలేదని, ఇందుకు కారణాలు మనవారి ధనలోభం, అధికారవ్యామోహం, స్వామిద్రోహం,

కపటవర్తన మొదలైనవే అని ఎవ్వరికైనా స్పష్టంగా తెలుస్తుంది. ఇండో - బ్రిటిష్ చరిత్రలో ఏ ముఖ్య యుద్ధాన్ని చూచినా, దానిలో ఎవరో ఒకరు, ఎంతో కొంత స్వామిద్రోహం చేయబట్టే, బ్రిటిష్‌వారు విజయం సాధించినట్టు కానవస్తుందనడంలో అత్యుక్తి ఎంతమాత్రం లేదు.

జాతిక్షేమాన్ని కానక, వ్యక్తిగత ప్రయోజనాలను కాంక్షించడం; జాతీయగౌరవ రక్షణను లక్షించక, ఏదో స్వార్థంకోసం శరీరాన్ని, ఆత్మను అమ్ముకొనడం - ఇంత హీనంగా, ఇంత హేయంగా మన రాజు లేమి, ప్రజ లేమి వర్తించినందుననే మనం స్వాతంత్ర్యాన్ని కోల్పోయాము. ఈ హీనబుద్ధినుంచి, హేయవర్తననుంచి కొంతవరకు బయటపడబట్టే ఈనాడు "మరి ఎనిమిది పగళ్ళు, ఎనిమిది రాత్రులు గడిస్తే, స్వాతంత్ర్యభానూదయం జరుగుతుంది." అని మనం ఆగస్టు 15 వ తేదీకి ఎదురు చూడగలుగుతున్నాము. ఈ హీనబుద్ధినుంచి, ఈ హేయవర్తననుంచి పూర్తిగా బయటపడితేనే కలకాలంవరకు ఆగస్టు 15 వ తేదీ మనకు స్వాతంత్ర్యదినోత్సవం కావడం!

[ఆగస్టు 7, 1947]

3

బ్రిటిష్‌వారు మన దేశాన్ని జయించడానికి మన జాతి నైతికపతనం ప్రధాన కారణమైనట్టే, బ్రిటిష్‌దాస్యంనుంచి మనం విముక్తి పొందడానికి నైతికంగా మన జాతి పునరుజ్జీవనమే ముఖ్యసాధన మైంది. నైతికపతనం ఎంత సులభమో, నైతిక పునరుజ్జీవనం అంత కష్టసాధ్యం మొదటిది కొండ దిగడమైతే, రెండవది కొండపై కెక్కడం! స్వల్ప నైతికపతనంనుంచి తప్పించుకొనడమే అతికష్టం. ఇక, ఆ పతనం అధఃపాతాళానికే అయినప్పుడు, దానినుంచి బయల్పడ్డం ఎంత కష్టమో వేరుగా చెప్ప నవసరంలేదు. మనపై బ్రిటిష్‌వారి ఆధిపత్యం నెలకొన్ననాటికి మనం నైతికంగా అధఃపాతాళంలోనే వున్నాము.

నాటికి మనకు మిగిలినవి మతవిశ్వాసాలు కావు, మతమౌఢ్యాలు! నాటికి మనం అనుసరిస్తున్నవి సాంఘికాచారాలు కావు, సాంఘికదురాచారాలు! నాటికి

మన కున్నవి విశాలలక్ష్యాలు కావు, నీచస్వార్థాలు ! ఈ ఘోరదుస్థితికి ఆనాటి ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులు కారణమై ఉండవచ్చు.

ఇస్లాం ఆదిలో ఒక మహా ఝంఝామారుతంవలె భారతదేశంపై విరుచుకుపడి, తన మార్గంలో నిలిచిన ప్రతిదాన్నీ కూకటి వేళ్లతో పెకలించి వేయడానికి ప్రయత్నించింది. ఇట్టి ప్రయత్నం ఎంత తీవ్రంగా జరిగితే, దాన్ని ప్రతిరోధించే కృషి అంత తీవ్రంగానూ జరగడం సహజం. ఈ సహజపరిణామ ఫలితంగానే హిందూసంఘం విభిన్నసిద్ధాంతాలను, సంప్రదాయాలను, సంస్కృతులను అంతర్లీనం చేసుకొనగల తన శక్తిని కోల్పోయింది; కాలగతినిబట్టి పరివర్తనం చెందగల తన ప్రజ్ఞను పోగొట్టుకొనింది; దురాచారాలని తెలిసినా, పరదా, బాల్యవివాహాలు మొదలైనవాటిని అనుసరించింది. ఆత్మరక్షణ నిమిత్తం హిందూసంఘం తన చుట్టూ పెద్ద పెద్ద గోడలను కట్టుకొనగా, వాటిని పడగొట్టివేయాలన్న నిష్ఫల యత్నంలో ముస్లిములు తమ తొలి శక్తినీ, పాటవాన్నీ కోల్పోయారు. పైగా, పాలన యంత్రాంగం సయితం క్రమంగా బానిసులంతస్థుకు దిగజారడం కద్దు. రాచరికాన్ని అనుసరించివుండే భోగలాలసత నైతికపతనానికి దారితీయడం సయితం సహజమే. ఈ అన్ని కారణాలవల్లనే బాబర్, హుమయూన్, అక్బర్‌లను పోలిన ధీరులు ఉద్భవించిన మొగల్‌వంశంలోనే ఆలంగీర్ పాదుషా తదనంతరం నిర్వీర్యులైనవారు, నిస్తేజులైనవారు జనించారు.

బ్రిటిష్ ఆధిపత్యం మన దేశంపై నెలకొన నారంభించిననాటికి హిందువుల వలె ముస్లిములుకూడా నైతికంగా అధఃపాతాళంలో వున్నారనడానికి ఇండో-బ్రిటిష్ చరిత్రే ప్రత్యక్ష తార్కాణం. బ్రిటిష్‌వారు పరిపాలకులుగా మన దేశంలో కాలూనడానికి తొలి అవకాశాన్ని కల్పించినవాడు ఆర్కాట్ నవాబు. ఈ అవకాశాన్ని విస్తరింపజేసుకొనడానికి తోడ్పడినవాడు ఖురాన్‌పై ప్రమాణం చేసిన తర్వాతకూడా సురాజుద్దౌలాపట్ల స్వామిద్రోహానికి పాల్పడిన మీర్ జాఫర్.

అయితే, బ్రిటిష్‌దాస్యంలో మనం పడిపోవడానికి ముస్లిములే కారణం అనడం కంటె మహాపచారం లేదు. ఈ విషయంలో హిందువులే అధికంగా దోషులు. హిందూదేశాన్ని బ్రిటిష్‌వారికి జయించిపెట్టిన సైనికులలో అధిక సంఖ్యాకులు హిందువులే.

దేశదాస్యాన్ని అనివార్యంచేసిన ఈ నైతికపతనంనుంచి మన జాతి బయల్పడ్డానికి దాదాపు ఒక శతాబ్దిపాటు ఎందరో మహాపురుషులు విభిన్న రంగాలలో అహర్నిశలు అశేషకృషిని చేయవలసివచ్చింది.

మన దేశం స్వాతంత్ర్యం పొందడానికి మన రాజకీయసమరాలే కారణమనిగాని, మన రాజకీయనాయకులే కారకులనిగాని భావించడంకంటె పొరపాటు లేదు. ఇది స్థూలదృష్టికి బహు వింతగా తోచవచ్చునేమోగాని, నిజానికి మన రాజకీయ స్వాతంత్ర్యానికి పునాదులను వేసినవారు రాజా రామమోహన్ రాయ్, దయానంద సరస్వతి, కేశవచంద్ర సేన్, వివేకానంద మొదలైన మత సంస్కర్తలు; ఈశ్వరచంద్ర విద్యాసాగర్, మహాదేవ్ గోవింద రణడే, సర్ సయ్యద్ అహమ్మద్‌ఖాన్, కందుకూరి వీరేశలింగం పంతులు మొదలైన సంఘసంస్కర్తలు; బంకిమచంద్రఛటర్జీ, రవీంద్రనాద్ టాగోర్, సర్ మహమ్మద్ ఇక్బాల్ మొదలైన కవులు, రచయితలు.

ఇందరు, ఇన్ని రంగాలలో, ఇంతగా కృషిచేయడంవల్ల క్రమక్రమంగా మన జాతి నైతికపునరుజ్జీవనాన్ని పొందినమీదటనే ఒక తిలక్, ఒక గాంధి, ఒక జిన్నా, ఒక నెహ్రూ మన రాజకీయరంగంలో తలయెత్తడం సంభవమైంది.

అయితే, ఈ రాజకీయనాయకులలో గాంధిస్థానం విశిష్టమైనదే కాక విభిన్నమైనదికూడా. ఆయన మన జాతి నైతికపునరుజ్జీవనం కారణంగా తలయెత్తినవాడు మాత్రమే కాదు; నైతికపునరుజ్జీవనోద్యమానికి స్వయంగా నాయకత్వం వహించి, దాన్ని రాజకీయాలకు ప్రాతిపదికగా చేసి, దానికి విప్లవదీప్తి కూర్చి స్వాతంత్ర్య సముపార్జనరూపంలో దాన్ని ఒక పరిణతికి తెచ్చినవాడు. భారత నైతికవిప్లవకారులలో గాంధి అసామాన్యుడు గనుకనే, భారత స్వాతంత్ర్యనిర్మాతలలో ఆయనస్థానం అసామాన్యమైనట్టిది.

గాంధి ప్రారంభించిన ఈ నైతికవిప్లవం పరిపూర్తి చెందితేనే, మనకు మరి ఏడు రోజులలో సంక్రమించనున్న స్వాతంత్ర్యం సార్థకం కావడమైనా, సుస్థిరత్వాన్ని పొందడమైనా.

[ఆగస్టు 8, 1947]

4

నైతికపతనమే మనం స్వాతంత్ర్యవంచితులమై పోవడానికి మూలహేతువని ఆమోదిస్తే, నైతికపునరుజ్జీవనమే తిరిగి మనం స్వాతంత్ర్యం పొందడానికి ప్రధానకారణ మౌతున్నదని అంగీకరిస్తే, మన స్వాతంత్ర్యరక్షణకు ముఖ్యావసరం నైతికబలమే అని వేరుగా చెప్పవలసిన పనిలేదుగదా?

మన దేశపు సరిహద్దుల వెలుపలనుంచి దండయాత్ర ప్రమాదం సంభవిస్తే, దానినుంచి కాపాడుకొనడానికి నైతికబలం ఎంత అవసరమో, మన దేశం సరిహద్దుల లోపల ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు విరుద్ధంగా దుష్టశక్తులు ప్రబలితే, వాటినుంచి మన స్వేచ్ఛను కాపాడుకోడానికి కూడా అంత నైతికశక్తి అవసరం.

స్వాతంత్ర్య సంరక్షణకు ప్రధానావశ్యకత – నిత్యజాగరూకత. తన ఆస్తిపాస్తులవిషయంలో, తన యోగక్షేమాలవిషయంలో, తన బంధుమిత్రుల విషయంలో సర్వసాధారణంగా ప్రతి వ్యక్తి జాగరూకుడయ్యే వుంటాడు. కాని, స్వాతంత్ర్యరక్షణకు కావలసింది ఇంతకంటె విస్తృతమైన జాగరూకత; ఇంతకంటె విశిష్టమైన జాగరూకత.

సంఘం పదిలంగా వున్నప్పుడే పౌరులు పదిలం. జాతి పురోభివృద్ధి చెందితేనే వ్యక్తులకు పురోభివృద్ధి. పౌరులతో కూడినదే సంఘ మనడం నిజం. వ్యక్తులు లేనినాడు జాతి లేదనడం కూడా నిజమే. అయితే, ప్రాధాన్యం పౌరులకు, వ్యక్తులకు కారాదు; సంఘానికే, జాతికే కావాలి.

ప్రతి పౌరుని, ప్రతి వ్యక్తిని కాపాడ్డమే, అతనికి కలిమిని, బలిమిని చేకూర్చడమే సంఘలక్ష్యం కావాలి; అదే జాతికి ఆశయం కావాలి. అయితే సంఘాభివృద్ధికి, జాతిక్షేమానికి ప్రతిబంధకంగా నిలిచే ఏ వ్యక్తినీ, ఏ పౌరునీ సహించరాదు; క్షమించరాదు.

అట్టి దృక్పథం అలవడ్డానికి ఎంతో నైతికబలం కావాలి. ఈ నైతికబలం కొరవడినందునే పెక్కు దేశాలలో స్వాతంత్ర్యం నామమాత్రంగా – కాదు,

అపహాస్యంగా - పరిణమిస్తున్నది. ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామంలో పరాజయానికి పూర్వం జర్మనీ, ఇటలీ, జపానులపై ఏ విదేశానికీ అధిపత్యం లేదు. కాని, వాటిని స్వతంత్ర్యరాజ్యా లనడం ఆ పదాన్నే అపభ్రంశం చేయడమై వుండేదికాదా? ఈ దేశాల పౌరులు కేవలం స్వీయక్షేమాన్నే అతి ప్రధానంగా యెంచుకొన్నారు. దీని ఫలితంగానే ఫాసిస్టులు ప్రాబల్యంలోకి రావడమైనా, అందరి క్షేమానికి భంగం కలగడమైనా! ఉదాహరణకు, జర్మనీలో హిట్లర్ పదవిలోకి వచ్చిన కొత్తలో యూదీయులను నాజీలు ఏమి బాధలు పెడితే తమ కేమని తక్కినవారు మిన్నకున్నందునే, యూదీయుల దుస్థితికి అనతికాలంలో తక్కిన వారందరు దిగజారి పోయారు.

ఈ నగ్నసత్యాన్ని దృష్టిలో పెట్టుకొని మన జాతి ఇతోధిక నైతిక బలాన్ని సంపాదించుకొనకపోతే, మరి ఆరు రోజులలో మనం పొందనున్న స్వాతంత్ర్యం నిలవదు; నిలిస్తే నామమాత్రంగానే!

[ఆగస్టు 9, 1947]

5

ఇంకొక అయిదు రోజులలో బానిసత్వం పోనున్నది; స్వాతంత్ర్యం రానున్నది. ఇది అందరికి ఆనందోత్సవానికి సమానకారణమే అయినా, స్వాతంత్ర్యంవిషయమై వివిధ వ్యక్తులకు - విభిన్న వర్గాలకు - విరుద్ధాభిప్రాయా లుండక తప్పదని మనం గుర్తించాలి.

పరజాతి పరిపాలన తొలగిపోవడమే స్వాతంత్ర్యమైతే, స్వాతంత్ర్యాన్ని గురించి ద్వివిధాభిప్రాయాలకు తావే లేదు. కాని, స్వాతంత్ర్యం అంత పరిమితార్థం గలది కాదు; అంత పరిమిత ప్రయోజనం కలదికూడా కాదు. పైగా, పరజాతి పరిపాలన నిశ్చయంగా బానిసత్వమైనప్పటికీ, స్వజాతిపరిపాలన అన్ని సమయాలలో విధిగా స్వాతంత్ర్యం కాదు కూడా. కొన్ని కొన్ని ఘట్టాలలో స్వజాతిపరిపాలన పరజాతిపరిపాలనకంటె దుస్సహ బానిసత్వంగా పరిణమించ

వచ్చుకూడా! కనుక స్వాతంత్ర్యానికి మనం పరజాతి పరిపాలనకు స్వస్తిని మించిన విశేషార్థాన్ని, అంతకంటె విశిష్టమైన నిర్వచనాన్ని చెప్పుకోవాలి.

మనం కోరదగిన - మనం కోరవలసిన - స్వాతంత్ర్యం స్వరూపాన్ని నిర్ణయించుకొనే సందర్భంలో మన దేశపరిస్థితులను దృష్టిలో పెట్టుకోవాలి. మనది పేదదేశం- అతి పేద దేశం. ప్రపంచంమొత్తంపై మన దేశాన్ని మించి దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నది మరి లేదు. ఈ దుర్భర దారిద్ర్యంవల్లనే మన దేశంలో ఆయుఃప్రమాణం అతి స్వల్పం, మరణసంఖ్య అత్యధికం. శిశుమరణాల రూపంలో గర్భశోకం మన దేశంలో వున్నంతగా మరి దేనిలోనూ లేదు.

తిను తిండికి, కట్టుబట్టకు, నిలవనీడకు, తాగడానికి నీళ్ళకు కూడా మనకు కరవే! అయినప్పుడు మనకు ఆరోగ్య మెక్కడిది, ఆనంద మెక్కడిది? నిజానికి మనది జీవితం కాదు, మనుగడ. మనం బ్రతకడం లేదు; దాన్ని ఎలాగో వెళ్ల మార్చుకొంటున్నాము.

అశేష ప్రజానీకం ఇంతటి ఘోర దీనావస్థలో వుండగా, కొద్దిమంది—బహుకొద్దిమంది - రాజాధిరాజులలో సయితం అసూయను రేకెత్తించగలపాటి ఐశ్వర్యంతో తులతూగుతున్నారు. దుర్భర దారిద్ర్యంవలెనే భోగభాగ్యాలు కూడా మన దేశంలో కానవచ్చినంతగా మరెక్కడ కానరావు. ఈ వైపరీత్యాన్ని తొలగించ లేనిది స్వాతంత్ర్యం కాగలదా?

బ్రిటిష్‌వారితోపాటుగా కొన్ని వర్గాలవారు మన ప్రజలను ఇంత కాలంగా యథేచ్ఛగా దోచుకొన్నారు. ఈ దోపిడీకి అంతకట్టగలిగినప్పుడే, దీనితోపాటు మొత్తం జాతీయసంపత్తిని దశగుణంగా - కాదు, సహస్రాధికంగా - అభివృద్ధి చేసి, దానిలో ప్రతిపౌరుని భాగస్వామిగా చేసినప్పుడే, మనకు వాస్తవంగా స్వాతంత్ర్యం సిద్ధించినట్టు!

ఆకలిగొన్నవానికి భగవంతుడు సాక్షాత్కరించవలసింది అన్నంరూపంలోనే అని ఒక సందర్భంలో గాంధీజీ పలికివున్నారు. మన జాతికి జాతి ఆకలి గొనివున్నది. దానికి స్వాతంత్ర్యం సాక్షాత్కరించవలసింది అన్నంరూపంలోనే.

మనది వెలితి బ్రతుకు. మనకు స్వాతంత్ర్యం ప్రసన్నంకావలసింది సుభిక్షం, సమృద్ధి రూపాలలోనే!

పెట్టుబడిదారులకు మరింతగా లాభాలు, చదువుకొన్న వారికి మరికొన్ని ఉద్యోగాలు, పదవీవ్యామోహంగలవారికి దాని పరితృప్తికై బహుళావకాశాలు—ఇంతే కానుంటే, ఆగస్టు 15వ తేదీని జరుగనున్నది స్వాతంత్ర్యభానూదయం కాదు.

[ఆగస్టు 10, 1947]

6

అన్ని రోజు లెట్టివో, పండుగ రోజు లట్టివే. ఒకటి పండుగరోజు కావడానికి దానికి మనం ఆపాదించుకొనే ప్రత్యేకతే కారణం, దానికి మనం సమకూర్చుకొనే వైశిష్ట్యమే కారణం.

ఇదే శకాలకు కూడా వర్తిస్తుంది. ఒకటి పాత శకం కావడం, మరొకటి క్రొత్తది కావడం. ఒకటి అంధకారభరితమైనది కావడం, మరొకటి మహోజ్జ్వలమైనది కావడం కాలగతిపై ఆధారపడివుండదు. శకాల స్వరూపాన్నీ, స్వభావాన్నీ నిర్ణయించేది కేవలం మానవ ప్రయత్నమే.

మానవుడు మార్పు చెందనంతవరకు అది పాత శకం. మార్పు చెందితే అది నవశకం. అతడు అభ్యున్నతి పథాన మెట్టితే, అది మహాశకం, అధోగతిపాలైతే అది హీనశకం. మరి నాలుగు రోజులలో ఒక పాత శకం అంతరించి, ఒక కొత్త శకం ప్రవేశిస్తున్నదని విశేషానంద సంభ్రమోద్వేగాలను చెందుతున్న మనం ఈ విషయాన్ని ఎంతమాత్రం విస్మరించరాదు. అప్రయత్నంగా మనకు రాజకీయ స్వాతంత్ర్యం లభించనట్టే, అప్రయత్నంగా నవశకం ప్రవేశించబోదు. బానిస బ్రతుకుకు, స్వాతంత్ర్యజీవితానికి ఎంతో అంతరం వున్నది. స్వాతంత్ర్యం వల్ల కొన్ని హక్కులు సిద్ధించడంతోపాటు ఎన్నో బాధ్యతలు సంక్రమిస్తాయి. వాటిని గుర్తెరిగి, తదనుగుణ్యంగా వర్తించగలిగితేనే మనకు వాస్తవంగా

స్వాతంత్ర్యం లభించినట్టు, అప్పుడే వాస్తవంగా నవశకం ప్రవేశించినట్టు! స్వాతంత్ర్యసిద్ధితో మనలో ముఖ్యంగా మానసిక విప్లవం రావాలి. పూర్వ పద్ధతులపై ఆలోచించడం మానినప్పుడే, పూర్వపద్ధతులలో ప్రవర్తించడాన్ని మానివేయగలము. ఒకడు ఎక్కువ, మరొకడు తక్కువ; ఒకడు యజమాని, మరొకడు బానిస - ఇట్టి భావాలు మనలో లోతుగా వేళ్లు తన్ని వున్నాయి. వీటిని పూర్తిగా పెకలించివేస్తేనే కాని, మనకు అభివృద్ధి లేదు, అభ్యుదయం. లేదు.

మనలో పాతభావాల ప్రాబల్యానికి మనం నిత్యంచేసే అనేక పదప్రయోగాలే తార్కాణం. "శ్రీ జిల్లా కలెక్టర్‌గారు", "శ్రీ శ్రీ శ్రీ జమీందారువారు", "చిత్తగించండి", "దివ్యచిత్తానికి తేవాలి", ఫలానావారు "విచ్చేశారు", "చేసుకునే మనవి ఏమనగా'" - మర్యాద అనుకొని, ఈ విధంగా ఒకరికి లేనిపోని అధిక్యత నివ్వడం, మనకు లేనిపోని న్యూనత ఆపాదించుకొనడం - ఇది మనకు పరిపాటి అయిపోయింది. దీనినుంచి బయటపడకపోతే సర్వజనులకు సమాన స్వత్వాలతో, సమస్తపౌరులకు సమానవకాశాలతో సముజ్జ్వలమైన నూతన సాంఘికవ్యవస్థ అవతరించదు?

"పెట్టి పుట్టినవాడు", "పూర్వజన్మసుకృతం" మొదలైన భావాలు కూడా ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు విరుద్ధమైనవే. స్వతంత్రదేశంలో - ప్రజాస్వామ్య రాజ్యంలో - ప్రతి ఒక్కరు పెట్టిపుట్టినవాడే కావాలి; ప్రతి ఒక్కడు పూర్వజన్మలో సుకృతం చేసుకొన్నవాడే కావాలి. ఒకనికి భోగభాగ్యాలు, మరొకనికి దుర్భర దారిద్ర్యం లలాటలిఖితాలని నమ్మేది కాని - చెప్పేది కాని - స్వతంత్ర దేశం కాదు, ప్రజాస్వామ్యసంఘం కాదు.

ఈ అన్ని విషయాలను గుర్తించినపక్షంలో మనలో అగస్టు 15 వ తేదీతో ఎంతటి తీవ్ర మానసికవిప్లవం ప్రారంభం కావలెనో తెలుస్తుంది.

[అగస్టు 11, 1947]

7

స్వాతంత్ర్యానుభూతికి ప్రథమార్హత - ఆత్మవిశ్వాసం. ఆత్మవిశ్వాసం లేనివాడు స్వతంత్రుడైనప్పటికీ బానిసతో సమానుడే. ఆత్మవిశ్వాసం అహంకారంగా పరిణమించగల ప్రమాదం లేక పోలేదు. నిజానికి ఆ రెండింటికీ భేదం తరతమాలలోనే. అహంకారి ఆత్మవిధ్వంసనాన్ని కోరి తెచ్చుకొంటాడు. అయితే అహంకారిగా సర్వవిధ్వంసనం సయితం ఆత్మవిశ్వాసరహితమైన నిస్తేజ నిర్వీర్య నీరస జీవితంకంటె ఎంతైనా వాంఛనీయం.

ఆత్మవిశ్వాసాన్ని - దానితోపాటు సహజంగా ఆత్మగౌరవాన్ని - కోల్పోయినందున మన జాతి బానిసత్వానికి లోనుగావలసివచ్చింది. ఆత్మవిశ్వాస ప్రదీప్తివల్లనే అది మరి రెండు రోజులలో స్వాతంత్ర్యాన్ని పొందబోతున్నది. ఈ స్వాతంత్ర్యం పదికాలాలపాటు నిలవడం మనలో నేడు కానవస్తున్న ఆత్మ విశ్వాసం ద్విగుణీకృతమైనప్పుడే.

హనుమంతుడు సర్వశక్తి సంపన్నుడేకాని, అతడికి ఆత్మవిశ్వాసంలేదట. ఎవరో ఒకరు ప్రోత్సహించనిదే ఏ పనికీ అతడు పూనుకోలేడట. ఇందువల్లనే తన బలసంపత్తికారణంగా వానరరాజు కావలసిన హనుమంతుడు తన కంటె ఎంతో హీనబలుడైన సుగ్రీవునికి బంటు కావలసివచ్చిందట. ఇండియా హనుమంతుడని, ఇంగ్లండ్ సుగ్రీవుడని అనుకొన్నపక్షంలో గడిచిన రెండు శతాబ్దాలలో భారతదేశపు బానిసత్వకారణం ఇట్టే తెలిసిపోతుంది.

మనకు ఇంతటి అంగబలం కలదని, అంతటి అర్థబలం కలదని గొప్పలు చెప్పుకొంటే ప్రయోజనం శూన్యమే ! ఆత్మవిశ్వాస సమేతమైతేనే ఈ అంగబలం, ఈ అర్థబలం జాతీయసంపత్తిగా మారడమైనా, దాన్ని మనం భోగించడమైనా.

ఒకనాడు మన దేశస్థులు తెరచాప పడవలపై మహాసముద్రాలను దాటి వెళ్లారు. తమ ఢాకా మజ్లీలను, తమ కలంకారీ అద్దకాలను మాత్రమేకాకుండా, తమ గాజుపెంకులను కూడా దేశదేశాలలో అమ్ముకువచ్చారు. ఆనాటి మన

వ్యాపారంలో ఇతరులను దోచుకొనడం ఒక భాగమైతే, ఆ దోపిడిని వర్జించాలి. కాని, ఆనాటి ఆత్మవిశ్వాసం తిరిగి మన సొత్తు కావాలి. లేకపోతే, మన దేశం నుంచి అవిద్య తొలగదు, అజ్ఞానం తొలగదు, దారిద్ర్యం తొలగదు, దైన్యం తొలగదు.

ఎవరికి వారిచ్చుకొనగల విలువకంటె అన్యులు ఎక్కువ విలువ నివ్వబోరు. అంతే కాదు. తాను చేతకానివాడి నని భావించుకొనేవాడు ఏ పని చేయలేడు.

ఆత్మనిందను, మరొక దృష్టితో చూచి, ఆత్మవంచన కూడా అనవచ్చు. స్వోత్కర్ష చేసుకొనే వ్యక్తి, పల్లవ్యుడు కాకపోతే, కనీసం కొన్ని సందర్భాలలోనైనా తనను గురించి తాను చెప్పుకొనే మాటలలో కొన్నింటికైనా తాను అర్హుడనని నిరూపించుకోవలసివుంటుంది. ఇక, ఆత్మనింద చేసుకొనే వ్యక్తి పడిపోగల అగాధానికి అంతు లేదు.

"ప్రపంచంలో ఏ జాతికీ మనం తీసిపోము. అన్యులకు సాధ్యమైంది మనకు అసాధ్యం కాబోదు. నా కృషికి, నా విజయానికి అవధి నేను నిర్ణయించుకొనవలసినట్టిదే" - ఇంతటి ఆత్మవిశ్వాసం మనలో ప్రదీప్తం కాకపోతే, ఆగస్టు 15 వ తేదీనాడు మనం వెలిగించుకొనేవి చిరుగాలికైనా ఆరిపోగల మట్టి పమిదెల దీపాలే!

[ఆగస్టు 13, 1947]

8

మరి ఒక పగలు, ఒక రాత్రి గడిస్తే చాలు - కేవలం 24 గంటలు నడిస్తే చాలు - స్వాతంత్ర్య భానూదయం జరుగుతుంది.

దాదాపు రెండు శతాబ్దాలపాటు పారతంత్ర్యం గాఢాంధకారంలో గడిపిన పిమ్మట మరి 24 గంటలలోపల స్వాతంత్ర్యకాంతిపుంజాలను చూడగలమని విశ్వసించడం కష్టమైన పనే! అయినా, చీకటినుంచి వెలుగులోకి మనం అడుగిడుతున్న మాట నిజం. చీకటికి అలవాటుపడిన కళ్లకు వెలుగును చూడ్డం

ఆదిలో కష్టమే కావచ్చు. కాని, బానిసత్వపు చీకటి దాదాపు ఒక శతాబ్దినుంచి మనకు బాధాకరమైనందున, గత అర్ధశతాబ్దిలో అది అహరహం మనకు దుస్సహమైనదిగా పరిణమించినందున, స్వాతంత్ర్య భానూదయం మనకు మహా పర్వం కాగలదనడం నిస్సందేహం.

ఈ పర్వదినాన్ని సభలతో, సమావేశాలతో, ఉత్సవాలతో, ఊరేగింపులతో, జరుపుకొనడం చాలదు. ఒక విషయాన్ని – ఒక అతిముఖ్య విషయాన్ని – రేపు మనం మన హృదయాలపై హత్తించుకొనడానికి ప్రయత్నించాలి.

నేటివరకు దేశం మనది, ప్రభుత్వం మరొకరిది. నేటివరకు ప్రజలము మనము, ప్రభువులు మరొకరు. రేపటినుంచి దేశం మనదే, ప్రభుత్వం మనదే; రేపటినుంచి ప్రజలము మనమే, ప్రభువులము మనమే!

మనకు కూడు తక్కువైనా, గుడ్డ కరవైనా, మనం చదువుకు నోచుకోనక పోయినా, మందులకు దిక్కులేకపోయినా – ఒక్క మాటలో – మనకు ఏది లోపమైనా ఈనాటివరకు మనం పర ప్రభుత్వాన్ని నిందిస్తూవచ్చాము. మన దేశ పరిపాలనాబాధ్యత పరప్రభుత్వానిది కనుక, జీవితావశ్యకాలంటు లోపం లేకుండా చేయడం ఏ ప్రభుత్వానికైనా ప్రథమ బాధ్యత కనుక. మన కష్టాలన్నింటికీ మన క్లేశాలన్నింటికీ నేటివరకు మనం ప్రభుత్వాన్ని నిందించివుండడంలో ఏమీ తప్పులేదు కూడా.

కాని, రేపటినుంచి ప్రజలమైనా, ప్రభువులమైనా మనం ఒక్కరమే కాబట్టి, ప్రభుత్వనింద ఆత్మనిందగానే పరిణమిస్తుంది. రేపటినుంచి ఏమి తప్పు జరిగినా, అది మన తప్పేకాగలదు కాబట్టి. ఎట్టి లోపం లేకుండా అన్నింటినీ చక్కబెట్టుకొనడం మనలో ప్రతి ఒక్కరి బాధ్యత.

నేటివరకు ప్రభుత్వమన్నా, దానితో సంబంధమన్నా అది చెద్ద పీడగా తోచింది. ప్రభుత్వోద్యోగి, అతడెవడైనా సరే, మనకు పీడాకరుడుగానే తోచాడు. ఈ భావనను రేపటినుంచి మనం మన మనోఫలకంపైనుంచి పూర్తిగా చెరిపివేసుకోవాలి. ఇకమీదట ప్రభుత్వోద్యోగులు ఒక విజాతీయ, నిరంకుశ ప్రభుత్వపు ఏజెంట్లు కారు; వారు మన భృత్యులు. వారి విధి మనకు సేవ చేయడం; మన కర్తవ్యం వారిచే సేవ చేయించుకోవడం.

విదేశీయ ప్రభుత్వానికి ఏజెంట్లు అయినందువల్లనే కాక, మన చేతలవల్ల కూడా మన దేశంలో ప్రభుత్వోద్యోగులలో పెక్కుమంది హృదయంలేని అవినీతి పరులైపోయారు. స్వలాభాన్ని కోరి, వారి ప్రాపకాన్ని సంపాదించుకొనడంకోసం వారిని ఆశ్రయించడం, ముఖస్తుతి చెయ్యడం, ముడుపులు చెల్లించుకొనడం మొదలైన పాడుపనులను మనం మానివెయ్యాలి. వారిని తృణీకరించడం, ధిక్కరించడం తగదుగాని, వారికి లేనిపోని అధిక్యత నివ్వరాదు. వారు తమకు లేని అధికారాన్ని చెలాయించగోరితే, దాన్ని సహించరాదు. ఇదే సమయంలో ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణలో వారితో పూర్తి సహకారాన్ని నెరపాలి. ఇదివరలోవలె ఇకముందుకూడా భారతీయ ప్రభుత్వోద్యోగులు అసమర్థతకు, అవినీతికి, నిరంకుశత్వానికి పెట్టింది పేరుగా నిలిస్తే, అది మనకే కళంకం. ఈ విషయా లన్నింటిని పూర్తిగా గుర్తించి, ఇందుకు అనుగుణంగా మనం వర్తిస్తేనే, మన దేశపరిపాలన సరిగా సాగడమైనా, మన సమస్యలు సవ్యంగా పరిష్కారం కావడమైనా, మన స్వాతంత్ర్యం సార్థక్యత గాంచడమైనా!!

[ఆగస్టు 14, 1947]

9

దాస్యాంధకారం తొలగింది; స్వాతంత్ర్య భానూదయం జరిగింది. మన పారతంత్ర్యం శృంఖలాలు ఘల్లుమని తెగిపోయాయి; తిరిగి మనం స్వతంత్ర్య ప్రజలమైనాము.

ఘోర జాతీయకళంకం తొలగింది. ఇక, మనం దివ్యప్రభలతో వెలుగొందవచ్చు.

పంజరం తలుపు తెరచుకొన్నది. ఇక, దివ్యాంబరపథాలలోకి ఎగసిపోయి, స్వేచ్ఛావిహారం చెయ్యకపోతే, తప్పు మనదే.

ఎంత శుభదిన మిది! ఎంత సంతోషదిన మిది! ఎంత పర్వదిన మిది! ఎంతటి చారిత్రాత్మకదిన మిది!

మన దేశచరితలోనే కాదు; ప్రపంచ చరిత్రలోనే ఇది చారిత్రాత్మక దినం!

నలభై కోట్ల ప్రజ - మానవజాతిలో అయిదవవంతు - నేడు స్వాతంత్ర్యాన్ని పొందింది; ఇక ప్రపంచచరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగు మహత్తర దినం కాకపోతే, మరి ఏది కాగలదు ?

ఈ దినాన్ని చూడగలగడం మన అదృష్టం ! ఇట్టి అదృష్టం అందరికీ పట్టదు ! !

ఈ పుణ్యదినాన్ని చూడాలని ఎందరు ఆతురత చెందలేదు ? ఎందరు ఆవేదనపొందలేదు ?

దాదాభాయ్ నౌరోజీ, సురేంద్రనాథ్ బెనర్జీ, ఫెరోజ్‌షా మెహతా, డి. ఇ. వాచా, ఆనందాచార్యులు, గోపాలకృష్ణ గోఖ్లే, జి. సుబ్రహ్మణ్య అయ్యర్, బదురుద్దీన్ త్యాబ్జీ, కృష్ణనాథ్ తింబక్ తెలాంగ్, డబ్లియు. సి. బెనర్జీ, న్యాపతి సుబ్బారావు, మోచర్ల రామచంద్రరావు మొదలైన కాంగ్రెసు పితామహులు నేడు సజీవులై వుంటే ఆనందబాష్పాలతో వారి కన్ను చెమ్మగిలివుండేదికాదా ?

బాలగంగాధర తిలక్, లజపత్‌రాయ్, చిత్తరంజన దాస్, మోతీలాల్ నెహ్రూ, అన్సారీ, అజ్మల్ ఖాన్, సేన్ గుప్త, మదనమోహన మాలవ్యా ప్రభృతులు కాలధర్మం చెందివుండకపోతే, నేడు సంతోషాతిరేకంచేత వారు పులకాంకితులై వుండేవారు కారా ?

ఖుదీరామ్ బోస్, సత్యేంద్రనాథ్ బోస్, అమీర్ చంద్, విష్ణు గణేశ పింగళే, రాంప్రసాద్ బిస్మిల్, భగత్‌సింగ్, అవధ్ బిహారీ మొదలైన అశేష విప్లవవర్గనాయకులు ఉరికంబానికి బలికాకుండా వుంటే, నేడు ఎంత పొంగిపోయి వుండేవారో !

కాశీనాధుని నాగేశ్వరరావుపంతులు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం, శ్రీనివాస అయ్యంగార్, సత్యమూర్తి మొదలగువారు నేడు మనమధ్య వుంటే, ఎంతగా సంతషోద్విగ్నులై వుండేవారో !

వీరే కాదు ; మరి ఎందరో - వారు కీర్తి ప్రతిష్ఠలు పొందివుండవచ్చు, లేదా, విస్మృతిలో అణగిపోయివుండవచ్చు - స్వాతంత్ర్య సమరరంగంలో

తమ అసువులను కోల్పోయారు. జీవితకాలంలోవలె మరణసమయంలో కూడా దేశ దాస్యవిముక్తి ఒక్కటే వారి హృదయాన్ని తీవ్రంగా సంక్షుభితపరచింది. వీరందరు ఏ రోజును చూడ్డానికై జీవించారో, దేన్ని చూడ లేకుండానే మరణించారో, దాన్ని చూడగల మహద్భాగ్యం మనకబ్బింది. ఇది సామాన్యమైన అదృష్టమా ?

అదృష్టం అబ్బడంకంటెకూడా, అది అబ్బినట్టు గుర్తించడం ముఖ్యం. అదృష్టం అబ్బినట్టు గుర్తించినంతమాత్రాన చాలదు; అది ప్రాతిపదికగా కొత్త సీమలకు, కొత్త దిక్చక్రాలకు విస్తరించాలి; కొత్త శిఖరాలను అందుకోవాలి. అప్పుడే నేటి ఈ స్వాతంత్ర్యానికి తగు పరిణతి; అప్పుడే దీని సాధనలో ప్రాణత్యాగంచేసినవారందరికీ ఆత్మశాంతి !

సమస్త ప్రపంచం నేడు మనవంక దృష్టిని సారిస్తున్నది. ముఖ్యంగా ప్రాచ్యజాతి మనపై కొండంత ఆశ పెట్టుకొన్నది. మన స్వాతంత్ర్యం తమ దాస్యవిముక్తికి నాంది కాబోతున్నట్టు సింహళం, బర్మా, మలయా, వియత్‌నామ్, ఇండొనేసియా, కొరియా మొదలైన ఆసియన్‌రాజ్యాలెన్నో ఆశిస్తున్నాయి. వాటి ఆశను నిరాశ చేస్తే మన పురోభివృద్ధికి తీవ్ర ప్రతిబంధకాలు తప్పవు.

ఈ చారిత్రాత్మక సమయంలో మనం చారిత్రాత్మకంగా వర్తించాలి. మన చిక్కులను మనం విప్పుకోవాలి; మన యిల్లు మనం చక్కబెట్టుకోవాలి; బలిమిని, కలిమిని మనం సంపాదించుకోవాలి; శక్తిని, దీప్తిని మనం సాధించాలి. ఇదే సమయంలో ప్రతి పరతంత్రదేశానికి, ప్రతి స్వాతంత్ర్యవంచిత సంఘానికి మనం తోడునీడగా నిలవాలి.

కేవలం ఆసియా ప్రజలే కాదు; ఆఫ్రికావాసులు, అమెరికన్ నీగ్రోలు శ్వేతేతరజాతులకు చెందిన అన్యులు మన నాయకత్వంకోసం, మన నైతిక సహాయంకోసం ఎదురుచూస్తున్నారు. ఈ విషయంలో వారికి ఆశాభంగాన్ని కలిగిస్తే, అది పీడితప్రజాకోటిపట్ల మహాద్రోహమే కాగలదు.

నేడు మనకు అబ్బుతున్న భాగ్యం ఎంత అధికమైనదో, అంతకంటె కూడా నేటినుంచి మనపై పడనున్న బాధ్యత అధికమైంది. అందుచేత ఇదివరలో

కంటె ఇకముందే మనం ఎక్కువ దీక్ష చూపాలి, ఎక్కువ త్యాగం చెయ్యాలి, ఎక్కువ ధైర్యసాహసాలు ప్రదర్శించాలి, ఎక్కువ విజ్ఞతతో ప్రవర్తించాలి.

ఇతోధిక కృషికే కాని విశ్రాంతికి ఇది సమయం కాదు.

ద్విగుణీకృత ధీరతకే కాని విరామానికి ఇది తరుణం కాదు.

ప్రపంచ ప్రధానరాజ్యాల శ్రేణిలో నిలిచినప్పుడే - కాదు, ఆ శ్రేణిని అధిగమించినప్పుడే - మనకు విరామం, అప్పుడే మనకు విశ్రాంతి ! !

"వందేమాతరం !"

"జైహింద్ ! !"

"ఇన్క్విలాబ్ జిందాబాద్ ! ! !"

[అగస్టు 15, 1947]

ఇది మౌఢ్యమే కాదా?

కొందరు దేవాలయాలలో పూజలు చేయవచ్చు; మరికొందరు మసీదులలో నమాజ్ చేయవచ్చు; వేరొక కొందరు చర్చిలలో ప్రార్థనలు చేయవచ్చు; ఇంకొక కొందరు గురుద్వారాలలో గురుగ్రంథ సాహెబ్‌ను పఠించవచ్చు. కాగా, కొందరు నిరీశ్వరవాదులైనా కావచ్చు. అయినా మనది ఇండియా. మనం పుట్టేదీ, గిట్టేదీ ఈ గడ్డపైనే. పుట్టడానికీ, గిట్టడానికీ మధ్యకాలంలో మనకు కూడు పెట్టవలసిందీ, గుడ్డ నివ్వవలసింది ఈ గడ్డే! దీని బాగే మన బాగు; దీని ఓగే మన ఓగు!

ఈ విషయాన్ని గుర్తించడమే జాతీయత; ఇందుకు అనుగుణంగా నడచుకొనడమే దేశభక్తి.

స్వీయమతాభిమానానికి జాతీయత విరుద్ధమైంది కాదు, పరమత విద్వేషాన్ని వర్జించాలని మాత్రమే జాతీయత కోరుతుంది. స్వీయసంఘ వికాసాభిలాషకు దేశభక్తి ప్రతిబంధకం కాదు; సమష్టిక్షేమానికి స్వీయసంఘాభివృద్ధిని ఆనుషంగికం చేసుకొనాలని మాత్రమే దేశభక్తి నిర్దేశిస్తుంది.

ఒక చిన్న లక్ష్యాన్ని పెద్ద లక్ష్యానికి ఆనుషంగికం చేయడం — ఇదే నిజానికి మానవసభ్యతకు పునాది.

సృష్ట్యాదిలో (పరిణామ సిద్ధాంతం ప్రకారం వానరజాతినుంచి మానవ జాతి చీలిపోవడం ప్రారంభమైనప్పటిలో) ఏ వ్యక్తికి ఆ వ్యక్తి తన పొట్ట నింపుకొనడమే, తన ప్రాణాలను కాపాడుకొనడమే ప్రధానంగా పరిగణించేవాడు. దీని నుంచి పైమెట్టు — వ్యక్తులు కుటుంబాలుగా ఏర్పడ్డం. ఆ పైమెట్టు — కొన్ని కుటుంబాలు చేరి, ఒక తెగ కావడం. దానికి పైమెట్టు — తెగలు సంఘాలు కావడం. అంతకంటె పైమెట్టు - సంఘాలు జాతులుగా పరిణమించడం.

అయితే, సభ్యమానవుని చరమలక్ష్యం కేవలం జాతీయతే కాదు, కారాదు. ఇంకొక మెట్టు పైకి వెళ్ళి, అంతర్జాతీయతను అతడు అందుకోవాలి.

అంతర్జాతీయతకు పైమెట్టు ఏది కాగలదనే ప్రశ్న ప్రస్తుతం అనవసరం. ఆ మెట్టుపైకి ఎక్కిన తర్వాత ఆ విషయాన్ని నిర్ణయించుకోవచ్చు.

జాతీయతనుంచి పైమెట్టుకు మానవుడు ఎగబ్రాకలేక పోతున్నందునే ప్రపంచయుద్ధాలు సంఘటిస్తున్నాయి.

అంతర్జాతీయత అవతరించనందున ప్రపంచయుద్ధాలు తప్పడం లేదని ప్రతి విజ్ఞుడు నేడు పరితపిస్తుండగా, జాతీయతనైనా నెలకొల్పుకొనలేక, మన దేశంలో మనం అంతఃకలహాలకు దిగడం మనకు తలవంపులపని కాదా ?

మన మతమౌఢ్యమే ముస్లిం లీగ్ సృష్టికి కారణమైంది. ఇదే హిందూ మహాసభ స్థాపనకు దారితీసింది. ఇదే అకాలీదళ్ అవతరణకు మూలమైంది. పరదాస్యంనుంచి విముక్తిసాధనలో విలంబన తప్పక పోవడానికి, ఆ విముక్తి సందర్భంలో దేశవిభజన అనివార్యంకావడానికి, ఆ విభజన రక్తస్రవంతుల మధ్య పూర్తికావడానికి, అన్నిటినీ మించి, గాంధిహత్య జరగడానికి ఒకే ఒక హేతువు తిరిగి మన మతమౌఢ్యమే !

ఈ మౌఢ్యాన్ని ఎట్టకేలకు గుర్తించినందువల్లనే, హిందూ మహాసభ తన కార్యప్రణాళికనుంచి రాజకీయాలను తొలగించుకొనడానికి నిర్ణయించుకొన్నది. కొన్ని రోజులుగా సిమ్లాలో సమావేశ మౌతున్న అకాలీదళ్ కార్యవర్గం మాత్రమే కాకుండా, నేడు మద్రాసులో సమావేశం ప్రారంభించిన ముస్లింలీగ్ సయితం ఈ పాటి విజ్ఞతను ప్రదర్శించగలదనే ఆశించవచ్చునా ?

[మార్చి 11, 1948]

సముద్రాధిపత్యం

సాగరం అపారమైనదే కావచ్చు, అగాధమైనదే కావచ్చు, భీకరమైనదే కావచ్చు. "నా ముందు మానవుడు ఎంతటి అల్పుడు!" అని అది నిరంతరం గర్జించవచ్చుకూడా.

అయితే, ఈ గర్జనకు మానవుడు ఎన్నడూ భయపడలేదు. సాహస కృత్యాలకు పిలుపుగానే దీన్ని అతడు సర్వదా భావించాడు; తన ఘనతను నిరూపించుకొనడానికి ఒక ఆహ్వానంగానే దీన్ని అతడు సర్వదా పరిగణించాడు.

"జలధి ఎంత విశాలమైనదైనా, నా ఊహల అంచులకు దాటి పోగలిగింది కాదు"— ఇదే ఎల్లప్పుడు అతడి ధీమా. "పాథోరాశి ఎంత ప్రచండమైనదైనా, నా మేధాపటిమను ధిక్కరించ గలిగింది కాదు"— ఇదే ఎల్లప్పుడు అతడి ధైర్యం. "ఆకసాన్ని అంటుతూ, అవల శూన్యమే అని నన్ను మోసగించ డానికి నీవు ప్రయత్నిస్తున్నా, నీ అవలి ఒడ్డునుంచి నన్ను పలుకరిస్తున్న నా సోదరమానవుని పిలుపు నాకు వినబడుతూనే వున్నది"— ఇదే ఎల్లప్పుడు అతడి ఉద్ఘాటన!

అందువల్లనే మానవుడు ఏనాడో వారాశిని జయించగలిగాడు; అందువల్లనే నాలుగు కొయ్య ముక్కలను చేర్చి, వాటికి ఒక తెరచాప కట్టి, అంబుధిపై తన అధిపత్యాన్ని స్థాపించుకోగలిగాడు. మానవుని ఈ సముద్రాధిపత్యం అతని కల్పనాచాతురికి మాత్రమే కాకుండా, అతని ధీరోదాత్తతకు కూడా నిదర్శనం. అది అతని హస్తనైపుణ్యానికే కాకుండా, పరాజయాన్ని గుర్తించని అతడి సాహస ప్రవృత్తికి కూడా తార్కాణం.

సముద్రంపై అధిపత్యంకోసం మానవుడు చేసిన ప్రయత్నాలకు ఒక ప్రధానరంగం మన భారతదేశం. ఈ ప్రయత్నాలలో ప్రాచీనకాలంలోనే అధిక విజయాలను సాధించిన దేశాలలో ఒకటి తిరిగి మన భారతదేశమే?

నౌకారాజ్యాలుగా నేడు ప్రసిద్ధికెక్కినవాటిలో పెక్కింటి ప్రజలు చేపలు పట్టుకొనడానికి పనికి వచ్చే తెప్పలను మించి కట్టుకొనలేని స్థితిలో వున్నప్పుడే మన దేశం నౌకలు నేల నాలుగు చెరగులను చుట్టివస్తుండేవి. ఇట్టి మన దేశంలో దాదాపు వెయ్యేళ్లక్రితం సముద్రయానం మహాపాప మన్న మూఢ విశ్వాసం ప్రబలింది.

మన దేశంలో పుట్టి, సముద్రాంతరాలకు వ్యాపించిన బౌద్ధమతాన్ని మన దేశం సరిహద్దుల లోపల నశింపజేసినా, అన్య బౌద్ధదేశాలతో పూర్తిగా సంబంధం తెగగొట్టుకొనక పోతే, ఆ మతం తిరిగి ఇక్కడ మోసులెత్తగలదన్న భయమే ఇందుకు కారణమై వుండవచ్చు. లేదా, తమ వ్యవస్థనుగురించి, తమ విజ్ఞానాన్ని గురించి, తమ సంస్కృతినిగురించి, తమ సర్వజ్ఞతనుగురించి — ఒక్క మాటలో —తమ విషయమై తమకు ఏర్పడిన అహంకారమే ఇందుకు కారణమై వుండవచ్చు.

ఏమైనా, సముద్రయానం నిషేధించబడిన సమయమే మన పురోభివృద్ధి నిలిచిపోయిన సమయం కూడా. ఇంచుమించు వెయ్యేళ్లనాడు ప్రారంభమైన మన జాతీయపతనం బ్రిటిష్‌వారి రాకనాటికి దాదాపు పరిపూర్ణమైంది. అందుచేతనే అంతవరకు కొంతగానైనా మిగిలిన మన నౌకానిర్మాణమేమి, నౌకా వ్యాపార మేమి, వారి పరిపాలనలో పూర్తిగా అడుగంటిపోయాయి.

బ్రిటిష్‌వారి పరిపాలన అంతం కావడంతో మన పతనావస్థ సయితం అంతం కావాలని మనం చూపుతున్న పట్టుదలకు నిదర్శనమే — మన దేశంతో, మన సామగ్రితో, మన కార్మికులు నిర్మించగా, ఖండ ఖండాంతరాలతో తిరిగి మనకు సన్నిహిత సంబంధాన్ని కూర్చడానికి మొన్న విశాఖపట్నంలో జల ప్రవేశం చేసిన "జలఉష నౌక."

భారత దేశంలో ప్రారంభమైన నవశకానికి ఒక చిహ్నంగా భావించదగు ఈ నౌకానిర్మాణం ఆంధ్రతీరంలో జరగడ మేమి, ఆంధ్రతీరంలో అది జల ప్రవేశంచేయడ మేమి ఆంధ్రులమైన మనకు ప్రత్యేకంగా సంతోషకారణం. సముద్రాధిపత్యంలో ఒకనాడు మనది అగ్రస్థానం : దాన్ని తిరిగి మనం సంపాదించుకోవాలి.

[మార్చి 17, 1948]

రాజీ, రాజీ, రాజీ

నేటి మన ప్రభుత్వవిధానాలకు - రాష్ట్రాలలో నేమి, కేంద్రంలో నేమి ఒక్కటే కీలకం. అది - రాజీ. అది చిన్న సమస్య కావచ్చు, లేదా పెద్ద సమస్య కావచ్చు. అయినా, దాని పరిష్కారానికి అనుసరించబడుతున్న విధానానికి కీలకం రాజీయే. అది తక్షణసమస్య కావచ్చు, లేదా అంత తక్షణ సమస్య కాకపోవచ్చు. అయినా, దాని పరిష్కారానికి అనుసరించబడుతున్న విధానానికి కిటుకు మరల రాజీయే. అది జాతీయసమస్య కావచ్చు, లేదా, అంతర్జాతీయ సమస్య కావచ్చు. అయినా దాని పరిష్కారానికి అనుసరించబడుతున్న విధానానికి తిరిగి మర్మం రాజీయే.

ఏమైనా సరే రాజీదారినే తొక్కాలంటే, జాగు తప్పదు. విభిన్న దృక్పథాలను - పూర్తిగా కాకపోయినా, కొంతవరకైనా - సంతృప్తిపరిచినప్పుడే రాజీ కుదరడం. అందుచేత ఏదో ఒక రాజీనే కోరితే, ఏ పనిలోనైనా జాగు జరిగి తీరుతుంది. రాజీ కొన్ని సందర్భాలలో మంచిదే కావచ్చు; తొందరపాటు అన్ని సందర్భాలలోనూ తగనిదే కావచ్చు. కాని, ఏదో రాజీ లేకుండా - ఎంతో కొంత జాగు లేకుండా - ఏ పనీ జరగరాదనడం తగునా? ఉదాహరణకు, అన్యాయంతో, అక్రమంతో, అసత్యంతో, అధర్మంతో రాజీ తగునా? లేక జాతిక్షేమానికి, సంఘశ్రేయస్సుకు, ప్రజాభివృద్ధికి ప్రాణాంతకమైన శక్తులతో రాజీ తగునా?

బ్రిటిష్‌వారితో, ముస్లింలీగ్‌తో రాజీపడి మనం దేశస్వాతంత్ర్యాన్ని సంపాదించుకొన్నాము. ఆ రాజీకి రక్తంతో, అశ్రువులతో, బాధతో, దైన్యంతో, అవమానాలతో, కళంకాలతో మూల్యాన్ని చెల్లించాము.

ఔను! ఖూనీలు, దోపిడీలు ఈ రాజీకి మనం చెల్లించిన మూల్యమే కాదా? గృహదహనాలు, స్త్రీలమానభంగాలు ఇందుకు మనం చెల్లించిన మూల్యమే కాదా? గాంధిని కోల్పోవడం సయితం ఇందుకు మనం చెల్లించిన మూల్యమే కాదా?

రాజీతో ప్రారంభమైన మన స్వతంత్రజాతీయజీవితం రాజీ ద్వారానే నేటికీ కొనసాగుతున్నది. సంస్థానాలను అన్నింటినీ బ్రిటిష్ యింపీరియలిస్టులు సృష్టించివుండక పోవచ్చు. కాని, వాటిని కాపాడినవారు ఆ యింపీరియలిస్టులే. లేనిచో, యూరప్‌లో ఫ్యూడల్ స్టేట్స్ విలుప్తమైపోయినట్టే, మన దేశంలో కూడా ఈ సంస్థానాలు ఏనాడో మటుమాయమై పోయివుండేవి. ఇంతవరకు స్వాతంత్ర్య సముపార్జనకు ప్రతిబంధకంగా నిలిచినట్టే, ఇకమీదట జాతీయసమైక్యతకు ఈ సంస్థానాలు అడ్డుగా నిలవడం తథ్యం. అయినప్పుడు వీటిని పూర్తిగా మన మ్యాప్‌పైనుంచి చెరిపివేయకుండా కొన్నింటిని నిలపడం దేనికి? వాటితో రాజీ బేరాలు దేనికి?

ప్రజల నిలువుదోపిడిలో జమీందారులు బ్రిటిష్‌యింపీరియలిస్టు ఏజెంట్లు. ఇది అందరికీ తెలిసిన విషయం. అందుచేత వారిని తొలగించడం మంచిదే. కాని, శతాబ్దికిపైగా వారు సాగించిన దోపిడి చాలదన్నట్టు ఏ పాటి నష్టపరిహారం చెల్లించుకోవాలని వారితో రాజీ గొడవ దేనికి?

తినడానికి తిండి లేదు; కట్టడానికి బట్ట లేదు; కాపురం చెయ్యడానికి కొంప లేదు; మూడవకంటిని పోలిన చదువు లేదు, అన్ని భాగ్యాలను మించిన ఆరోగ్యం అసలే లేదు. ఈ దౌర్భాగ్యస్థితినుంచి మన జాతి బయటపడాలంటే, జాతీయ పునరుజ్జీవన కార్యక్రమాలకు కొన్ని వేల కోట్ల రూపాయలను వెచ్చించాలి. పన్నులద్వారా ఇంత మొత్తాన్ని కూర్చగల తాహతు ప్రజలకు లేదు. ఇప్పటికే వారు నడుం విరిగివున్నారు. అందువల్ల దాదాపు అన్ని ముఖ్య పరిశ్రమలను జాతీయంచేయడమే శరణ్యం. అయినా, అడుగడుగునా పెట్టుబడి దారులతో రాజీ మాటలు దేనికి?

మన గడ్డపై బ్రిటిష్‌వారి పరిపాలన ఎంత అన్యాయమైనదో, దానిపై ఫ్రెంచి, పోర్చుగీస్ పతాకాలు ఎగరడం అంత అసహజమైనదని వేరుగా చెప్ప వలసిన పని లేదు. అయినా ఫ్రెంచి, పోర్చుగీస్ ప్రభుత్వాలతో రాజీకి దేవులాట దేనికి? ప్రతి విషయంలో ఇదే దేవులాట తప్పకపోతే, మన స్వాతంత్ర్యం నామ మాత్రం కాదా? మన ప్రజలలో అసంతృప్తి ప్రబలిపోదా?

మన ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ, కాంగ్రెస్‌నుంచి చీలిపోతున్న సోషలిస్టులనే కాకుండా, స్వాతంత్ర్య సంసిద్ధితో నవశకం జాజ్వల్యమానంగా ప్రారంభం కాగలదని ఆశించిన ప్రతి భారతజాతీయవాదిని ఏదో అసంతుష్టి - ఏదో ఆందోళన - ఏదో నిరాశ - ఏదో నిస్పృహ, నేడు ఎంతో కొంతగా ఆవహించలేదా ? దీని ఫలితంగా ఒక్కపెట్టున మన దేశాన్ని మహోన్నత శిఖరాలకు తీసుకుపోవలసిన - తీసుకుపోగల - ప్రజాశక్తులు నీరసించి పోవడంలేదా ? స్వాతంత్ర్య సముపార్జన రేకెత్తించిన సంతోషసంరంభాలతో మనం వెంటనే సాధించలేకపోతున్న పురోభివృద్ధిని, ఇవి చల్లారిన పిదప, ఒక అర్ధశతాబ్దింలోనైనా సాధించగలమా ? రాజీ తగని - జాగు కూడని - ఘట్టాలు ప్రతి దేశచరిత్రలో కొన్ని కానరావా ? అట్టి ఘట్టంలో నేడు మన దేశం లేదా ?

[మార్చి 23, 1948]

ఇండియా, జపాన్

"పొట్టివానికి పుట్టెడు బుద్ధు" అని సామెత. జపాను పొట్టివారి దేశం; జపాను దేశస్థులు పుట్టెడు బుద్ధులు కలవారు కూడా. అందుచేతనే ఇండియా, చైనాలను పోలిన మహాదేశాల సమేతంగా దాదాపు మొత్తం ఆసియాఖండం గత శతాబ్దంలో పాశ్చాత్యుల ధాటకు లొంగిపోగా, ఒక జపానువారు మాత్రం తలయెత్తుక నిలువగలిగారు.

అయితే, జపానువారిలో ఒక పెద్ద లోపం వున్నది. ఆ లోపం, – అనుకరణ. చైనా ఉచ్ఛస్థితిలో వుండగా వారు దాన్ని అనుకరించారు; ఆ తర్వాత యూరప్‌ను అనుకరించారు.

ఈ అనుకరణ యుక్తాయుక్త విచక్షణతో కూడినదైతే, అది సంతసించదగు విషయమే కాగలదు. తెలియని విషయాలను తెలిసినవారినుంచి తెలుసుకొనడంలో తప్పు లేదు. నిజానికి ఏ జాతి అభివృద్ధికైనా ఇది అత్యావసరం. ఒక దేశంనుంచి మరొక దేశం – ఒక జాతినుంచి మరొక జాతి – మంచి విషయాలను నేర్చుకోనకపోతే, మానవ నాగరికతకు విస్తరణ లేదు, మానవ సంస్కృతికి వికాసం లేదు. అయితే, జపానువారి కున్న పెద్ద జాడ్యం యుక్తాయుక్త పరిశీలన లేని అనుకరణ. అందువల్లనే పాశ్చాత్యులనుంచి మంచితోపాటు చెడుగును కూడా వారు నేర్చుకొన్నారు.

పాశ్చాత్య ప్రపంచంలో వారు ప్రత్యేకించి గురుతుల్యంగా యెంచుకొన్నట్టి దేశం – గ్రేట్ బ్రిటన్. అది యూరప్‌ఖండం పశ్చిమదిశలో ఒక ద్వీపసమూహమైతే, తమ దేశం ఆసియాఖండం తూర్పుదిక్కున మరొక ద్వీపసమూహం. ఆ ద్వీపసమూహంవారు నౌకబలపాటవంవల్ల, పారిశ్రామికాభివృద్ధివల్ల ఒక మహాసామ్రాజ్యాన్ని నిర్మించుకొనగా, వారి అడుగుజాడలలో నడిస్తే, అట్టి విజయం తనకు మాత్రం ఎందుకు లభ్యపడదు? ఈ ఉద్దేశంతోనే జపానువారు బ్రిటిష్‌వారిని వీలైనంతవరకు తు. చ. తప్పకుండా అనుసరించ నారంభిం

చారు. దీని ఫలితంగా వారు తమ దేశాన్ని ఆసియాఖండం మొత్తంపై మహా శక్తివంతమైన రాజ్యంగా చేయగలిగారు. అయితే, ఇదే సమయంలో వారు తమ దేశాన్ని లోకకంటకంగా చేసుకొన్నారు కూడా. పట్టు విడుపులు బ్రిటిష్ వారికి చక్కగా తెలుసు. ఇదే వారిని ఇంతవరకు కాపాడింది. ఈ విద్యలో ప్రవేశం లేనందునే జపానువారు మహోచ్చస్థితికి వచ్చినట్టే వచ్చి, అధః పతితులై పోయారు.

గత యుద్ధంలో ఎంత గట్టి దెబ్బ తిన్నప్పటికీ, అనేక విషయాలలో ముఖ్యంగా పరిశ్రమలలో, ఆసియాఖండం మొత్తంపై ప్రథమస్థానం ఇప్పటికీ జపానువారిదే. పారిశ్రామికాభివృద్ధికై జపానువారు అనుసరించిన కొన్ని పద్ధతులు మనకు అనుసరణీయాలు. ఇంటిలో చేయగల పనిని ఫ్యాక్టరీలో నేమి, చేతితో చేయగల పనిని యంత్రంద్వారానేమి చేయకపోవడం – ఇదే ముఖ్యంగా వారినుంచి మనం నేర్చుకోవలసిన పద్ధతి. ఈ పద్ధతిద్వారా మనకు సమృద్ధిగా గల అంగబలం (మ్యాన్ పవర్) చాలావరకు సద్వినియోగమౌతుంది.

ఇంతే కాక, పారిశ్రామిక, వాణిజ్యరంగాలలో పరస్పర సహకారం ఇండియా, జపానులు రెండింటికీ ఇప్పటిలో ఎంతైనా లాభకారి కాగలదు కూడా. జపానువారికి యంత్రా లుంటే, ముడివస్తువులు లేవు; మనకు ముడివస్తువు లుంటే యంత్రాలు లేవు. అందువల్ల జపానుకు మన ముడివస్తువులను పంపించి, దాని యంత్రాలను పనికల్పించాలని మా తాత్పర్యం కాదు. మన ముడివస్తువు లిచ్చి, దాని యంత్రాలను మనం తెప్పించుకోవాలి.

దాదాపు ఇట్టి ఉద్దేశంతోనే జపానునుంచి వచ్చిన ఒక వాణిజ్య రాయబార వర్గం ప్రస్తుతం మన దేశంలో పర్యటన చేస్తున్నది. ఈ పర్యటననుంచి పూర్తి ప్రయోజనాన్ని పొందడానికి మనం ప్రయత్నించాలి.

[మే 8, 1948]

అంతులేని దోపిడి

దారులు కొట్టేవారే బందిపోటు దొంగలు కారు; వర్తక వ్యాపారాల పేరుతో ప్రజల కడుపుకొట్టేవారు కూడా బందిపోటు దొంగలే. కోరలున్నవారే రాక్షసులు కారు; దొంగలాభాలకోసం ప్రజల రక్తమాంసాలను పిండేవారు కూడా రాక్షసులే.

దారులు కొట్టకుండా ప్రజలను దోచుకొనే బందిపోటు దొంగలేమి, కోరలు లేకపోయినా ప్రజల రక్తమాంసాలను పిండుకు లాగి పొట్టలు పెంచుకొంటున్న రాక్షసులేమి ఈ నాడు మన దేశంలో హెచ్చు పెరిగినందునే ప్రజాసామాన్యానికి కూడు, గుడ్డల కింతగా కటకట తప్పకపోవడం.

కంట్రోల్సు అమలు జరుగుతుండగా కూడా దోపిడి తప్పలేదు: నెత్తురు కూటికై నాలుక జాచడం తప్పలేదు. కాని, అప్పటికీ ఆశ తగ్గలేదు, ఆకలి ఉడగలేదు. అందువల్లనే కంట్రోల్ తొలగింపుకు ఆందోళన చేసి, తమ పట్టుదల నెగ్గించుకొన్నారు. అంతటితో అసలే హద్దు మీరిపోయారు.

దీన్ని చూడగా కడుపు భగభగమండిపోబట్టే, వస్త్ర సమస్యపై మొన్న న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో ప్రధాని నెహ్రూ "రక్తపిపాసులు", "రాక్షసులు" మొదలైన కఠిన పదప్రయోగాలను చేయడానికి అణుమాత్రమైనా సంకోచించలేదు.

కంట్రోల్సు తొలగించబడిన తర్వాత వస్త్రపారిశ్రామికులేమి, వ్యాపారస్థులేమి, నూరుకోట్ల రూపాయల మేరకు దేశాన్ని నిలువు దోపిడి చేశారట. జనవరి, జులై నెలల లోపల అపనపు దొంగలాభాల రూపంలో నూరుకోట్ల రూపాయలను వీరు దోచుకున్నది ఎవరినుంచి? చిరిగిన గుడ్డనైనా పారవేయడానికి చేతులు రాక - కాదు, ఓపికలేక, దాన్ని కుట్టి కుట్టి, కట్టుకునేవారినుంచి కాదా? కట్టుడు చీర ఆరే లోపల కట్టుకోడానికి మరొక పాతకూడా లేనందున, సగం చీర మొలనుండగా మిగిలిన సగాన్ని ఉతికి ఆరబెట్టుకొనేవారినుంచి కాదా? "ఛీ! పీనుగుపై కప్పిన గుడ్డ కాదా?" అనే బెరకు సయితం లేకుండా చీకటి

మరుగున గోరీలను తవ్వుకొనేవారినుంచి కాదా? చలికాలం మూడు నెలలు జైలుకు పోతే, కడుపుకింత కూడు, కట్టుకోడానికి గుడ్డలే కాకుండా, కప్పుకోడానికి వెచ్చటి కంబళికూడా దొరుకుతుందని కొద్దిశిక్ష పడగల నేరాన్ని దేనినైనా కావాలని చేసేవారినుంచికాదా? మనది పేదదేశం: దీనిలో పట్టెడు మెతుకులకోసం, చారెడు గుడ్డకోసం ఎంతమంది ఎంతగా అల్లాడుతున్నారు! అయినా, కొందరు ఎంతగా దోపిడి చేస్తున్నారు!! ఏమి దోపిడి చేస్తే మాత్ర మేమి? ఒక దేవాలయం కట్టిస్తే, రెండు సత్రాలు పెట్టిస్తే, నాలుగు సంతర్పణలు చేస్తే, స్వర్గద్వారాలు తమకై విప్పుకోగలవు గదా ?

వస్త్రవ్యాపారులు గడచిన అయిదారు నెలలలో గడించిన దొంగలాభాలను కక్కిస్తామని మొన్నటి న్యూఢిల్లీ సమావేశంలో పండిట్ నెహ్రూ హెచ్చరించాడు. కాని, న్యాయంగా చెల్లించవలసిన పన్నులనే ఎగవేయగల సమర్థులు తాము దిగమింగినదాన్ని తేలికగా కక్కబోరుగదా?

వస్త్రాల ప్రస్తుతపు విపరీతపుధరలను తగ్గించడానికి మొన్న ప్రభుత్వం నిర్ణయించిన విధానం అంతగా జయప్రదం కాకపోవచ్చు. వస్త్రాలకు సరసమైన ధరలను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం, వాటిని ప్రత్యేకపు షాపులద్వారా నిర్ణీతపు ధరలకు రాష్ట్ర ప్రభుత్వాలు అమ్మించడం- ఇవే కొత్తగా నిర్ణయించిన విధానానికి ప్రధాన ప్రాతిపదికలు.

కొత్తవిధానం జయప్రదం కాకపోవచ్చునేమో అని మేము శంకించడానికి ఈ ప్రాతిపదికలు శుష్కమైనవనడం కారణం కాదు. ఉన్నంతవరకు ఈ విధానం మంచిదే కావచ్చు. కాని, దొంగలాభాలపై మమకారం ఒక మహాజాడ్యంగా పరిణమించింది. దాన్ని అరికట్టా లంటే. కూడు గుడ్డలకు ప్రజలను కటకట పెట్టి దొంగలాభాలు గడించేవారికి ఉరిశిక్షను- కనీసం ద్వీపాంతరవాస శిక్షను- వేస్తామనడం అవసరం కాదా?

[జూలై 24, 1948]

విభిన్న ప్రభావాలు

బొంబాయిలో లోకమాన్య తిలక్ స్మారక సభ, సిమ్లాలో లాలా లజ్‌పత్‌రాయ్ శిలావిగ్రహ ప్రతిష్ఠాపనకై తీర్మానం, గురుదేవ్ టాగోర్ శాంతి నికేతనంలో ప్రపంచ శాంతివాదుల సభకు ఏర్పాట్లు, ఢిల్లీలో పండిట్ నెహ్రూ ప్రసంగం, గాంధి జీవితరచన యత్నసందర్భంలో ఇండియాకు లూయీ ఫిషర్ ఆగమనం — నేటి వార్తలలో కానవచ్చిన ఈ వివిధాంశాలే ఈ నాటి మా సంపాదకీయానికి ప్రేరణ.

నౌరోజీ, గోఖ్లే, మాలవ్యా, లజపత్‌రాయ్, గాంధి, తిలక్, టాగోర్, ఇక్బల్, నెహ్రూ ప్రభృతు లందరు దేశభక్తులే.

దేశస్వాతంత్ర్యవాంఛలో, దేశాభ్యుదయకాంక్షలో వీరు ఒకరి కొకరు తీసిపోనివారే, లేదా ఒకరి నొకరు మించిపోగలవారే.

అయితే, సమాన లక్ష్యసాధనలో వీరి వైఖరులు భిన్నం; విధానాలు భిన్నం. ఇందుకు వీరి విభిన్న ప్రవృత్తులే కాకుండా, వీరి జీవితాలపై ప్రసరించిన విభిన్నప్రభావాలు కూడా కారణం.

ఉదాహరణకు, దాదాభాయి నౌరోజీ, గోపాలకృష్ణ గోఖ్లేలు బ్రిటిష్ లిబరలిజం ప్రభావంచే సమ్మోహితులైనవారు. లాక్, బెంథామ్, బ్రయిట్, మిల్, మోర్లేలు వీరికి గురువరేణ్యులు. స్వేచ్ఛ, విజ్ఞానం: ఇవి రెండే సకల సంఘారిష్టాలకు దివ్యౌషధాలని బ్రిటిష్ లిబరలిజం ప్రతిపాదించింది. సమానావకాశాలిచ్చినప్పుడు సమస్త మానవులు సమానాభ్యున్నతిని సాధించ గలరని కూడా ఆది ఉద్ఘోషించింది.

మానవుడు వక్రంగా ఎందుకు ప్రవర్తిస్తాడు? వక్రంగా ఆలోచిస్తాడు గనుకనే. అతనికి విద్య చెప్పండి; విజ్ఞానం గరపండి; అతనితో వాదించండి;

అతని జ్ఞాననేత్రం తెరవండి. అంతటితో అతడు ఉత్తమపౌరు డౌతాడు. పౌరులు ఉత్తము లైనంతనే సంఘం కూడా ఉత్తమమైనదే కాగలదు — ఇదే బ్రిటిష్ లిబరలిజం సిద్ధాంతాల సారాంశ మని చెప్పవచ్చు.

ఈ సిద్ధాంతాలను పూర్తిగా ఆస్వాదించినవా రైనందువల్లనే నౌరోజీ, గోఖ్లేలు ఇండియాపట్ల బ్రిటిష్‌వారి వైఖరికి వారి అజ్ఞానమే కారణమని భావించారు. దాన్ని మన వాదబలంతో తొలగిస్తే, స్వరాజ్యసంసిద్ధి తథ్యమని విశ్వసించారు.

నౌరోజీ, గోఖ్లేవర్గానికి చెందినవారే ఫెరోజ్‌షా మెహతా, భూపేంద్రనాథ్ వసు, డబ్లియు. సి. బెనర్జీ మొదలైనవా రందరు.

బాలగంగాధర్ తిలక్, లజపత్‌రాయ్, మదనమోహన మాలవ్యాలు వేరొక వర్గంవారు. వీరిలో అధికంగా కానవచ్చేది హిందూసంస్కృతిప్రభావమే.

హిందూసంస్కృతి బహుముఖమైనది. అందువల్ల హిందూసంస్కృతిప్రభావం వీరిపై సమానంగా పడినా, దాని ఫలితం వేర్వేరుగా పరిణమించింది.

హిందూసంస్కృతిలోని క్షాత్రం - ఆర్యసమాజంద్వారా వ్యక్తమైనట్టి క్షాత్రం - లజపతిరాయ్‌ని వశీకృతుని చేసుకొన్నది. స్వీయసంస్కృతిపట్ల ప్రేమతోపాటు, అన్య సంస్కృతులపట్ల కొంత అసహనం, కొంతవరకు విద్వేషం దీనిలో భాగాలే. జాతీయతాభావప్రాబల్యంవల్లనేమి, ఆధునికప్రపంచ పరిణామాల పరిజ్ఞానం వల్లనేమి, లజ్‌పత్‌రాయ్ ఆర్య సమాజంద్వారా వ్యక్తమైన హిందూక్షాత్రధర్మంలోని అసహనాన్ని, విద్వేషాన్ని జయించడానికి ప్రయత్నించకపోలేదు. ఈ ప్రయత్నంలో కొంతవరకు కృతకృత్యుడైనా, తన జీవితంపై బాల్యంలోనే పడిన ఆర్యసమాజ ప్రభావానికి ఆయన పూర్తిగా అతీతుడు కాలేకపోయాడు.

హిందూ సంస్కృతిలోని క్షాత్రభాగ ప్రభావమే తిలక్‌పైకూడా పడింది. అయితే, అది ఆర్యసమాజ ప్రేరితం కాదు, మహారాష్ట్రచరిత్ర ప్రేరితం; వేద సంస్కృతి ప్రేరితం కాదు, భగవద్గీతబోధనల ప్రేరితం. అందువల్ల దానిలో

కార్యాసక్తి కానవస్తుంది; సమదృష్టి ప్రస్ఫుటమౌతుంది; స్థితప్రజ్ఞ ద్యోతక మౌతుంది.

హిందూక్షాత్రానికి తిలక్ ఒక ప్రతినిధి అయినప్పటికీ, ముస్లిముల విశ్వాసానికి ఆయన పాత్రుడు కాగలడానికి కారణ మిదే. ప్రత్యక్షసంఘర్షణ కేమి, వీలుపడితే బలప్రయోగానికేమి సిద్ధాంతరీత్యా విముఖుడు కాకపోయినా, కార్యసాధనకు ప్రాధాన్య మిచ్చి, సమయానుకూలంగా వర్తించడానికి (రెస్పాన్సివ్ కోపరేషన్‌కు) ఆయన సంసిద్ధుడు కావడానికి కూడా కారణ మిదే

ఇక, పండిట్ మాలవ్యా విషయంలో హిందూసంస్కృతిలోని క్షాత్రభాగం కంటె, ఆ సంస్కృతి ఎన్ని శతాబ్దాలలో ఎన్ని దెబ్బలు తిన్నా, చెక్కుచెదర కుండా నిలవడానికి తోడ్పడిన దాని పునాదుల (ఆచారాలు, సంప్రదాయాలు మొదలైనవని మా తాత్పర్యం) ప్రభావం అధికం. కనుక ఆయన పురోగామి కావడంతోపాటు పూర్వాచారపరాయణుడు; సంస్కరణాభిలాషి కావడంతోపాటు సంప్రదాయాలకు వ్యతిరేకంగా పోలేనివాడు.

పోతే, తిలక్‌వలె గాంధికూడా భగవద్గీతపట్ల భక్తి కలవాడే; దాన్నే తన జీవితానికి ఆలంబనగా పరిగణిస్తున్నానని చెప్పినవాడే. అయితే, స్థితప్రజ్ఞ విషయంలో తప్ప గాంధి జీవితంపై భగవద్గీత ప్రభావం తక్కువ. ఆయనకు హిందూ సంస్కృతితో కంటె బౌద్ధ, జైన, క్రైస్తవ మతసిద్ధాంతాలతో సన్నిహితత్వం అధికం. తనకు గురుతుల్యులలో రస్కిన్, కార్పెంటర్, టాల్‌స్టాయ్ లను గాంధి పేర్కొన్నాడు. వీరు క్రైస్తవ మతప్రబోధితులుగాని, హిందూ సంస్కృతివల్ల రూపొందినవారు కారు. దీన్నిబట్టి కూడా అది స్థితప్రజ్ఞ కిచ్చిన ప్రాధాన్యంవల్లనే భగవద్గీత గాంధిని ఆకర్షించినట్టు భావించవచ్చు. అన్య విధాల అది తనను ఆకర్షించలేక పోయినందునే భగవద్గీత అహింసను ప్రబోధిస్తున్నదని దానికి విపరీత వ్యాఖ్యానాన్ని ఆయన చేయడం తటస్థించింది కూడా.

నిజానికి గాంధి ఏ ఒక మతానికి, ఏ ఒక సంస్కృతికి చెందనివాడేమో; అన్ని మతాల, అన్ని సంస్కృతుల సమన్వయాన్నే ఆయన లక్షించినట్టు కనబడు

తుంది. ఈ సమన్వయ యత్నంలో ప్రేమకు, కారుణ్యానికి, నిరాడంబరత్వానికి, నిష్కామానికి ఆయన ప్రాధాన్య మిచ్చాడు.

రవీంద్రనాథ్ టాగోర్ కూడా వివిధ మతాల, విభిన్న సంస్కృతుల సమన్వయాన్ని లక్షించినవాడే. ఆయన అట్టి సమన్వయాన్ని లక్షించిన బ్రహ్మ సమాజంలో పుట్టి పెరిగినవాడు. అయితే, అన్యవిధాల గాంధిదృష్టినుంచి ఆయన వైఖరి పూర్తిగా భిన్నం. గాంధివలె ఆయన యంత్రయుగానికి విరోధి కాడు. గాంధివలె ఆయన కాయకష్టానికి అత్యధిక ప్రాధాన్య మివ్వడు, ఆధునిక నాగరికత ఆయన దృష్టిలో విద్వేషించవలసిన ఒక రుగ్మత కాదు, మానవ పరిణామంలో మరొక మెట్టు. ఉపవాసాలద్వారా, బ్రహ్మచర్యంద్వారా ఇంద్రియాలను జయించాలని ఆయన చెప్పడు. ఇంద్రియనిగ్రహ యత్నం ఎవరో కొందరు మహాత్ముల విషయంలో తప్ప, సాధారణంగా వెర్రితలలు వేయడం కద్దు. కనుక విశృంఖలంగా వర్తించకుండా, జీవితాన్ని పూర్తిగా అనుభవించాలనే ఆయన బోధిస్తాడు. ఆయన నిర్దేశించినట్టిది భోగానికీ, త్యాగానికీ మధ్యమమార్గం.

టాగోర్ వలె ఇక్బాల్ కూడా సౌందర్యోపాసి. ఆయనవలె ఈయన కూడా విశ్వప్రేమను కీర్తించినవాడే. కాని, క్రమంగా ఇక్బాల్‌లో జాతీయభావం నశించింది, మతదురభిమానం ప్రబలింది. సూఫీ తత్వబోధకుడుగా ఆయన జీవితాన్ని ప్రారంభించాడు; పోనుపోను ముస్లింలీగ్ మూలస్తంభాలలో ఒకడుగా పరివర్తనచెందాడు.

పోతే, నెహ్రూపై వివిధ మతాల ప్రభావం ఎంత స్వల్పమో, వివిధ సంస్కృతుల ప్రభావం అంత ఘనం. ఆయనకు ఒక మతం వుంటే, అది సోషలిజం. అయితే, విశ్వాసాలవల్ల సోషలిస్టు అయినా, గాంధి ప్రభావానికి పూర్తిగా లోనైనవాడు. మానసిక విశ్వాసాలు ఒక వైపుకు, గాంధిపట్ల భక్తిప్రేమలు మరొక వైపుకు లాగగా, ఏదో ఒక రాజీ చేసుకోవడం ఆయన ప్రవృత్తిలో ఒక భాగమైపోయింది.

ఈ విధంగా వివిధప్రభావాలకులోనై విభిన్నమార్గాల మన దేశస్వాతంత్ర్య సాధనకై కృషిచేసిన అనేకమంది నాయకులు తమద్వారా మనపై ప్రసరింప

జేసిన ప్రభావాలకు ఈ నాడు మన దేశం క్రీడారంగం. ఏకసమయంలో విభిన్న దిశలలో నడవడానికి మనం ప్రయత్నం చేస్తున్నామనే అభిప్రాయం కలగ డానికి కారణ మిదే. కాని, ఈ నాయకు లందరి లక్ష్యం ఒక్కటే అని, అది దేశ సౌభాగ్యమే అని గుర్తిస్తే, ఎన్ని దిశలలో నడిచినా, మనం ఒకే గమ్యం చేరగలుగుతాము.

[ఆగస్టు 15, 1947]

౧౫

తిరిగి ఆగస్టు 15వ తేదీ వచ్చింది

ఒక ఏడాదినాడేనా మనకు జాతీయస్వాతంత్ర్యం లభ్యమైంది? లాల్ ఖిల్లాపై నుంచి యూనియన్ జాక్‌ను దించివేసి, త్రివర్ణపతాకను ఎక్కించడం పన్నెండు నెలల క్రితమేనా జరిగింది? అయినా, ఇది పన్నెండేళ్లనాటి సంఘటన వలె మనకు తోస్తున్నదేమి?

నేడు అప్రయత్నంగా స్ఫురిస్తున్న ప్రశ్న ఇదొక్కటే కాదు. ఇది శుభ దినం గదా! అయినా, గత సంవత్సరంలోవలె శోభాయమానంగా కానరాదేమి? ఇది ఆనందోత్సవసమయం కాదా? అయినా, వికసిత వదనాలపై విషాద ఛాయలు కూడా ద్యోతకమౌతున్న వేమి? ఇది మనకు చారిత్రాత్మకదినం కాదా? అయినప్పటికీ హృదయం ఉప్పొంగ దేమి? లజ్జాభరమేదో మనలను క్రుంగదీస్తున్న దేమి?

ఈ ప్రశ్న లన్నింటికి ఒక్కటే ప్రత్యుత్తరం. అది ఈ సంవత్సర కాలంలో జరిగిన హత్యాకాండ.

పంజాబ్ రాష్ట్రంలో హత్యలు; ఢిల్లీలోను, దాని పరిసరాలలోను హత్యలు; యు. పి. లోను, ఇతరప్రాంతాలలోను హత్యలు. పైగా, ఇవి మతంపేరిట జరిగిన హత్యలు, దేవునిపేరిట జరిగిన హత్యలు.

వీటినిమించి అమానుషత్వం లేదని తోచవచ్చు. ఇంతకుమించి మానవుడు అధమాధముడు కాలేడని కూడా తోచవచ్చు. కాని, మరింత ఘోరం సయితం జరిగింది. అది – గాంధి హత్య.

నరహత్యలతో పాటు ఇతర హత్యలు సయితం జరుగుతున్నాయి. అవి జీవితపు విలువల హత్యలు!

నీతినిజాయితీల హత్య, దయాధర్మాల హత్య, ప్రేమ కారుణ్యాల హత్య - అబ్బబ్బ ! - ఈ హత్యాకాండకు అంతూ పంతూ లేదు.

ఎవని బాగు వానిది, ఎవని బలుపు వానిది. తన బాగుకోసం, తన బలుపుకోసం. ఎవరి కడుపు కొట్టవలసివచ్చినా తగ్గడు !

ఎవని క్షేమం వానిది, ఎవని స్వార్థం వానిది. తన క్షేమంకోసం, తన స్వార్థంకోసం ఎందరి కొంప తియ్యవలసివచ్చినా తడబడడు !

తాను కొనవలసిన ప్రతి వస్తువు ధర మండిపోతున్నదని రైతు వాపోతాడు. కాని, తాను పండించిన ధాన్యాన్ని బ్లాక్ మార్కెట్టుకు పట్టిస్తాడు.

తను తినదగు ప్రతివస్తువు ధర విపరీతమైపోయిందని వర్తకుడు విలపిస్తాడు. కాని, తను బ్లాక్ మార్కెట్ రేట్లపైనేగాని వ్యాపారం సాగించడు.

ప్రతివర్గ మింతే; ప్రతిసంఘ మింతే. ఇందువల్లనే పేదలు నిరుపేదలౌతున్నారు; భాగ్యవంతులు మహాభాగ్యవంతు లౌతున్నారు. అన్నాతురులు మరింత క్షుత్పీడితు లౌతున్నారు; భోగపరాయణులు మరింత భోగలాలసు లౌతున్నారు.

నీతి నియమాలు - కాదు, మానవత్వమే - విలుప్తమై పోయినట్టు కానవస్తున్న ఈ సమయంలో పరిస్థితులను చక్కబరచడానికి ఏమి చర్య జరిపినా అది ప్రయోజనశూన్యమే అయిపోతున్నది.

కంట్రోల్స్ నిలిపితే కొంత దోపిడి, వాటిని తొలగిస్తే మరింత దోపిడి !

ప్రభుత్వోద్యోగులను నమ్మితే, వారు తమ జేబులు నింపుకోవడం; ప్రజలపై భారం పెడితే, వారు పాతకక్షలు సాధించుకోవడం !

ఎంత శోచనీయం ఈ పరిస్థితులు ! ఎంత సిగ్గుచేటు ఈ స్థితిగతులు ! !

కాని, నిరాశ చెందరాదు, నిస్పృహను ఆవరించనివ్వరాదు.

రెండు శతాబ్దాలకు పైగా మన దేశం బానిసత్వంలో నిలిచింది. అప్పుడు మనం బ్రతికింది అబద్ధపు బ్రతుకు.

ఈ రెండువందల సంవత్సరాలలో మన జాతీయజీవితంలో కొండలాదిగా పేరుకొన్న కశ్మలం, విప్లవంద్వారా మనకు స్వాతంత్ర్యం సిద్ధించివుంటే, దాని జ్వాలాశిఖలలో భస్మీపటలమై పోయివుండేదేమో! అట్లు జరగనందునే నేడు ఒక్కుమ్మడిగా అవినీతి వెల్లువలై పారుతున్నదేమో!

ఏమైనా, ప్రస్తుత పరిణామాన్ని చూచి, భవిష్యత్తు విషయమై నిరాశచెందవ మేమి, నిస్పృహను జనించనివ్వడమేమి ధీరలక్షణం కాదు.

అంతే కాక, అనేక సంతాపకర సంఘటనలమధ్య మరుగున పడిపోతున్నా, లక్షణమే వాటి ఫలితాలు తెల్లం కాకపోతున్నా, భావి పురోభివృద్ధికి కొన్ని పునాదులు పడుతున్నాయి. ఈ పునాదులు కొన్ని సరిగా త్రవ్వినవి కాకపోవచ్చు; కొన్నింటికి ఉపయోగించిన ఇటుక, సున్నం సరియైనవి కాకపోవచ్చు; మరి కొన్ని వంకరటింకరగా పడివుండవచ్చు. అయినా, వాటిలో కొన్ని తిన్ననివి వున్నాయి; గట్టివి వున్నాయి.

కాగా, ఒక జాతి జీవితంలో ఒక సంవత్సరం మహాసముద్రంలో ఒక నీటిబిందువుతో సమానం. పరిమితమైన మానవజీవితంలోనే ఈ సంవత్సరంలో జరిగిన పొరపాట్లను మరు సంవత్సరంలో దిద్దుకొనడానికి అవకాశం వుంటుంది. అయినప్పుడు, ఒక జాతిగా మనం గతసంవత్సరంలో జరిగిన ప్రమాదాలను సవరించుకొనలేమా?

ఇందుకు కావలసింది ఒక్కటే. అది - వ్యష్టిదృష్టిని మాని, సమష్టి క్షేమాన్ని లక్షించడం.

సమష్టిక్షేమానికి ప్రాధాన్యం రావడం సామాన్యప్రజలు సమైక్యంగా వర్తించినప్పుడే.

క్షుద్బాధాపీడితులు విడివిడిగా నిస్సహాయులే. కాని, ఏకమైనప్పుడు వారిని ఏ శక్తీ అడ్డగించలేదు.

సంఘవంచితులు విడివిడిగా బలహీనులే. కాని, కలిసి నడిచినప్పుడు వారిని ఎంతటివారైనా ఆటంకపరచలేరు.

కడిచిన సంవత్సరంలో మనం ఎదుర్కొన్న తుపానులు తక్కువ కావు. వాటినుంచి ప్రాణాలతో బయల్పడ్డంలో మనం చూపిన పాటవం సామాన్య మైనది కాదు. కాని, ముమ్ముందు మరింత తీవ్రమైన తుఫానులు మనకు తప్పక పోవచ్చు.

వీటిని అధిగమించా లంటే, మనకు ముఖ్యావసరమైనది ధీర, సత్య, త్యాగ, సంకల్పబలాలతో కూడిన సమైక్యతే.

స్వాతంత్ర్య సాధనకు అవసరమైన దానికి శతాధికమైన సమైక్యత మన కిప్పుడు కావాలి.

ఇట్టి సమైక్యతను మన ప్రజాసామాన్యం ప్రదర్శించినప్పుడు నిజాం సమస్య ఒక సమస్యగా మిగలదు; కాశ్మీర్‌నుంచి పాకిస్థాన్ పరుగుతీయగలదు; లంచగొండి, బ్లాక్‌మార్కెటీర్ మొదలైన సంఘ విద్రోహులు రూపుమాసి పోగలరు.

ధీర, సత్య, త్యాగ, సంకల్పబలాలతో కూడిన సమైక్యతాసాధన - ఇదే నేడుభారతప్రజాసామాన్యం పట్టవలసిన దీక్ష !

[అగస్టు 15, 1948]

౧౪

అప్పుడు, ఇప్పుడు

"స్వతంత్రభారత పౌరులమని గుర్తించండి; స్వతంత్రభారత పౌరుల వలె వర్తించండి" - ఇదే మన గవర్నర్ జనరల్ చక్రవర్తి రాజగోపాలచారి దక్షిణ భారత పర్యటన సందర్భంలో చేస్తున్న వివిధోపన్యాసాల సారాంశం.

1947 ఆగస్టు 15 వ తేదీ పూర్వానికి, ఆ పిమ్మటికి సంబంధం తక్కువ. అప్పుడు మనది బానిసదేశం; ఇప్పుడు స్వతంత్రభూమి. అప్పుడు మన ప్రభుత్వం మనది కాదు; ఇప్పుడు మనదే. అప్పుడు మనకు ఎగ్గు జరిగితే, దాని బాధ్యత ఇతరులది; ఇప్పుడు మనదే. అప్పటి పరిస్థితికి, ఇప్పటిదానికి ఇంత మార్పు వచ్చిన సంగతిని పెక్కుమంది గుర్తించనేరక పోవడమే ప్రస్తుత శోచనీయపరిస్థితులకు ప్రధానకారణం.

అప్పటివలె ఇప్పుడు కూడా, అప్పటికంటె ఇప్పుడే ఎక్కువగా, దేశంలో దారిద్ర్యదేవత తాండవిస్తున్నదనడం నిజమే. అప్పటివలె ఇప్పుడు కూడా, అప్పటికంటె ఇప్పుడే ఎక్కువగా, ప్రజాసామాన్యానికి బ్రతుకు భారమైనదనడం నిజమే. అప్పటివలె ఇప్పుడు కూడా, అప్పటికంటె ఇప్పుడే ఎక్కువగా, అన్యాయం, అవినీతి, అశాంతి విజృంభించినవనడం నిజమే.

అయినా, పాత వైఖరి ఇప్పుడు తగదు; పాత విమర్శ ఇప్పుడు కూడదు; పాత విధానాలు ఇప్పుడు పనికిరావు. "నాకు సౌఖ్యానందాలను కూర్చలేక పోతున్న ఈ ప్రభుత్వంతో నే నెందుకు సహకరించాలి?" అనే వైఖరి ప్రస్తుతం సమంజసం కాదు. ప్రభుత్వం ఏ చర్య జరిపినా, దేన్ని జరపకపోయినా, ఏదో దురుద్దేశాన్ని దానికి అంటగట్టడం ప్రస్తుతం కూడదు. "ప్రభుత్వాన్ని ముందు కూలద్రోయాలి; ఆపైనే తక్కిన విషయాలన్నీ!" అని తీర్మానించుకొని, తదనుగుణమైన విధానాలను అనుసరించడం అసలే తగదు.

ప్రస్తుతం ప్రభుత్వాన్ని విమర్శించరాదని దీని తాత్పర్యం కాదు. కాని, జరిగే విమర్శ నిర్మాణాత్మకమైనది కావాలి. దాన్ని ప్రతిఘటించడం అనివార్య

మైతే, రాజ్యాంగబద్ధంగా ప్రతిఘటించాలి. ఒక్కమాటలో, "ఇది నా ప్రభుత్వం" అనే భావం ప్రబలాలి.

ఈ భావం ప్రబలినప్పుడు "ఈ ప్రభుత్వాన్ని నిలబెడుతున్నది నేనే! కోరితే, దీన్ని మార్చగలిగినవాడిని కూడా నేనే!" అన్న ఆత్మవిశ్వాసం ఏర్పడుతుంది. అట్టి ఆత్మవిశ్వాసం గట్టిగా ఏర్పడినంతనే బాధ్యతాయుతంగా ప్రవర్తించడం సంభవిస్తుంది.

కాని, "ఇది 'నా ప్రభుత్వం" అనే భావం ప్రబలడమైనా ఇంతవరకు జరగలేదు. అందువల్ల దేశం స్థితిగతులను చక్కబరచడం విషయంలో ప్రజా బాహుళ్యంలో దీక్షకు మారుగా ఔదాసీన్యం కానవస్తున్నది; ధీరతకు బదులుగా నిస్పృహ ద్యోతకమౌతున్నది. ప్రజాబాహుళ్యపు ప్రస్తుత మనఃప్రవృత్తి పూర్తిగా పరివర్తనం చెందకపోతే, ఏ ప్రభుత్వం - అది ఎన్ని సదుద్దేశాలతో కూడినదైనా, ఎంత సామర్థ్యాన్ని చూప గలదైనా - ఏమీ సాధించలేదు.

ఒక్కసారిగా ప్రజ లందరు దేవతామూర్తులై పోవడం అసంభవం. ఇట్టి పరివర్తనను కోర నవసరంలేదు కూడా. కాని, సూటిచూపు అవసరం; తిన్నని నడక అవసరం; తలయెత్తుకు తిరగగలడం అవసరం; ఎవ్వరూ వేలెత్తిచూపలే నట్టుగా మెలగడం అవసరం. ఈ విధమైన మానసికవిప్లవం కావాలనే రాజాజీ ప్రతి ప్రసంగంలో ఉద్ఘోషిస్తున్నాడు.

ఈ విప్లవం రాకపోతే ఇప్పటి ప్రభుత్వంద్వారా ఏమీ మేలు జరగదు సరిగదా, దీని స్థానంలో మరొకదాన్ని స్థాపించుకోవా లన్నా, అది సాధ్యం కానేరదు. మానసిక పరివర్తన, లేదా మరింత అధోగతి - ఈ రెండింటిలో ఏదో ఒకదాన్ని భారతజాతి ఈనాడు ఎన్నుకొనక తప్పదు. ఇది నగ్నసత్యం. దీన్నే రాజాజీ ఉద్ఘాటిస్తున్నాడు.

[ఆగస్టు 25, 1948]

నవప్రపంచం

"ప్రపంచం యూరప్, అమెరికా ఖండాలే కాదు" అని పాశ్చాత్య రాజకీయ వేత్తలకు పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ పారిస్‌నుంచి చేసిన హెచ్చరిక ఎంతో సముచితమైంది.

క్రీస్తుశకం పదహారవ శతాబ్దంనుంచి, ఇంచుమించుగా ఇరవయ్యో శతాబ్ది ప్రారంభంవరకు ప్రపంచప్రాబల్యం యూరప్ ఖండానిదే. పదహారవ శతాబ్ది ప్రారంభంలో ఒక కొత్త ఆశ యూరప్‌లో చిగిరించింది; ఒక కొత్త శక్తి దాన్ని ఆవహించింది; ఒక కొత్త గొంతు దాన్ని పిలిచింది; ఒక కొత్త గమ్యం దాన్ని కదిలించింది.

నాటినుంచి, నిన్న మొన్నటివరకు అది వెనుదిరిగి చూడలేదు. ముందుకు, ముమ్ముందుకు, అది సాగిపోయింది. కొండలు, అడవులు దాన్ని ఆపలేవు. నదులు, సముద్రాలు దాన్ని అడ్డలేదు. దాని పురోగతి భూమండలం అవధులతోనైనా ఆగలేదు; గగనమండలంలోకి కూడా అది విస్తరించింది; సముద్ర గర్భంలోకి సయితం అది చొచ్చుకుపోయింది.

ఈ మూడు శతాబ్దాలలో ఆర్థిక, సాంఘిక, వాణిజ్య, పారిశ్రామిక, రాజకీయ, వైజ్ఞానిక, సాంస్కృతికాది వివిధరంగాలలో ప్రపంచనాయకత్వం నిస్సందేహంగా యూరప్‌దే. ఆ నాయకత్వాన్ని అది స్వార్థసిద్ధికై క్రూరంగా వినియోగించి వుండవచ్చు. అయినా, ఈ సమయంలో దాని ప్రపంచనాయకత్వాన్ని కాదనలేము.

స్వార్థం, నైచ్యం, క్రౌర్యం, జాత్యహంకారం, రాక్షసత్వం మొదలైనవి యుద్ధానికి, రక్తపాతానికి దారితీయడం సహజం. అందువల్లనే యూరోపియన్ దేశాలమధ్య అనేక యుద్ధాలు తప్పలేదు, అశేష రక్తపాతం తప్పలేదు. అయినప్పటికీ ఇటీవలివరకు యూరప్ పలుకే ప్రపంచానికి శాసనం.

కాగా, ఇరవయ్యో శతాబ్దంలో యూరప్ తన స్వార్థకపటాలవల్ల, క్రౌర్య నైచ్యాలవల్ల అనివార్యంచేసుకొన్న రెండు ప్రపంచ యుద్ధాలతర్వాత ప్రపంచ ప్రాబల్యం అమెరికా ఖండానికి దక్కింది. అయితే, ఈ పరిణామం ఇటీవలిదైనందున, ఇది నేటికీ పరిణతిచెందనందున, ప్రపంచనాయకత్వంలో యూరప్‌కు ఈనాడు కూడా కొంత భాగం లేకపోలేదు.

ప్రపంచంలో నేడు తమ మాటకు తిరుగులేనందునే యూరప్, అమెరికాలు తామే ప్రపంచమన్న దుర్భ్రమలో పడుతున్నాయి. యూరప్, అమెరికాలు పోగా మిగిలిన ప్రపంచం విస్తీర్ణమే అధికమైనదికావచ్చు. యూరోపియనులను, అమెరికనులను తీసివేయగా, మిగిలిన మానవాళిసంఖ్యే అధికమైనది కావచ్చు. అయినా, యూరోపియన్, అమెరికన్ రాజకీయవేత్తలు తమ ఖండాలే ప్రపంచమైనట్టు వాటి సమస్యలే ప్రపంచ సమస్యలైనట్టు భావిస్తున్నారు, తదనుగుణంగానే ప్రవర్తిస్తున్నారు.

ఈ ఖండాలకు చెందిన చరిత్రకారులు రచించిన ప్రపంచ చరిత్రలను చూడబోయినా, వాటిలో తమ రెండు ఖండాలకున్న ప్రాధాన్యంలో శతాంశమైనా మిగిలిన ప్రపంచానికి దొరకదు. తుదకు హెచ్. జి. వెల్స్‌ను పోలిన విజ్ఞుడు సయితం ఈ దోషానికి అతీతుడు కాలేకపోయాడు.

ఇంతవరకు ఏమి జరిగినా, ఇకముందు తామే ప్రపంచమైనట్టు యూరప్, అమెరికాలు సంచరిస్తే, వాటికి అధోగతి తప్పదు. ఈ హెచ్చరిక మేము చేస్తున్నట్టిది కాదు; ప్రపంచ చరిత్రలోనే ఇది గర్భితమైవున్నది. బాబిలోనియన్, ఈజిప్షియన్, గ్రీక్, రోమన్ మొదలైన నాగరికతలు నశించిపోవడాని కేమి, చైనీస్, ఇండియన్ సభ్యతలు కళలు తరగడాని కేమి తామే ప్రపంచమన్న దుర్భ్రమే, లేదా దురహంకారమే కారణం.

పైగా, పదహారవ శతాబ్దిలో యూరప్‌ను పునరుజ్జీవింపజేసిన నవశక్తులు నేడు ఆసియాలో తలయెత్తుతున్నాయి. ఈ కారణాన కూడా యూరప్, అమెరికాలు తామే ప్రపంచమైనట్టు సంచరించడం విరమించకపోతే, అది ముప్పును చేజేతుల కొనితెచ్చుకొనడమే కాగలదు!!

[నవంబర్ 2, 1948]

ప్రభుత్వోద్యోగులు

ఒక ప్రభుత్వం పోయింది, మరొకటి వచ్చింది. ఒక వ్యవస్థ గతిస్తున్నది, మరొకటి క్రమంగా నెలకొంటున్నది. దేశం పాతదే కావచ్చు గాని, కాలం కొత్తది, పరిస్థితులు కొత్తవి. అయినా ఈ విషయాన్ని ప్రభుత్వోద్యోగులు, ఏ కొందరు బుద్ధిమంతులనో విడిచిపుచ్చితే, సరిగా గుర్తించినట్టు తోచదు.

పాత భావాలు, పాత పద్ధతులు, పాత సంప్రదాయాలు వారిలో జీర్ణించి పోవడమే ఇందుకు కారణం కావచ్చు. పాత ప్రభుత్వం ప్రజల దోపిడికి, ప్రజా పీడనకు ఉద్దేశించబడిన ఒక యంత్రం. ప్రభుత్వోద్యోగులు దానికి చక్రాలు, ఇరుసులు, బోల్టులు, బెల్టులు వగైరాలు. వారికి స్వాతంత్ర్యం లేదు, వ్యక్తిత్వం లేదు, పరప్రభువుల కనుసన్నల ప్రకారం మెలగడమే వారి పరమ కర్తవ్యం. ప్రజలు ఏమౌతున్నారనిగాని – ఏమనుకోగలరనిగాని – ఈషణ్మాత్ర సంకోచమైనా వారికి తగదు. అట్టి సంకోచంవచ్చినవాడు ఉత్తమ ప్రభుత్వోద్యోగి కానే కాడు.

ఉత్తమ ప్రభుత్వోద్యోగికి మరికొన్ని లక్షణాలు కూడా ముఖ్యావసరాలే. ప్రతి కాగితాన్ని వీలైనన్ని రోజులు తొక్కిపట్టగలిగి వుండాలి; రిమార్కుపై రిమార్కు వ్రాస్తూ, సవాళ్లకు అడ్డు సవాళ్లు వేస్తూ, ఏ పనీ తెమలకుండా చెయ్య గలిగివుండాలి బల్లకింద ఒక చేయి పెట్టి, రెండవ చేతిని బల్లపై వుంచి పనిచేయ గలిగిన "సవ్యసాచిత్వం" అభ్యసించాలి. పరప్రభువులవద్ద తనకు నిత్యానుభవాలైన దూషణ తిరస్కారాలకు క్రుంగిపోక, వాటిని తనవద్దకు వచ్చే ప్రజలకు "ట్రాన్స్‌ఫర్" చేయగల నేర్పు సంపాదించాలి. రెండు వందల సంవత్సరాలకు పైగా ఈ పరిస్థితుల ప్రకారం మెలగినతర్వాత వీటి ప్రాబల్యం నుంచి తప్పించుకొనడం సులభమా ? స్వాతంత్ర్యసంసిద్ధి తర్వాత ఎన్నెన్నో విషయాలలో ప్రజాసామాన్యానికి ఆశాభంగాలు, తప్పకపోయినమాట నిజమే.

వారికి కలిగిన అశేషమైన ఈ ఆశాభంగాలలో ప్రథమంగా పేర్కొనవలసింది చివరికి తాలూకా ఆఫీసు బంట్రోతు ధోరణిలో సయితం ఏమీ మార్పు కానరాక పోవడమే !

ఈనాటికి కూడా సర్కార్ కచ్చేరీతో పని పెట్టుకొంటే, కాళ్ల బలపాలు కట్టవలసిందే. ఈనాటికికూడా ప్రభుత్వంద్వారా చిన్న మెత్తు పని జరగాలంటే, ఎవరికో ఒకరికి లంచం ముడుపు కట్టుకోవలసిందే. ఈనాటికికూడా గవర్నమెంట్ ఉద్యోగస్థులతో వ్యవహారం పెట్టుకొంటే, ''ఛీ'', ''ఛా'' అనిపించుకోవలసిందే. "తెల్లదొరలు పోయి, నల్లదొరలు రావడం మినహాగా మనకు వొరిగిం దేమిటి?" అనే మాట కొందరి నోట నేడు వినవస్తున్నదంటే, అందుకు కారణం ప్రభుత్వం మారినా, ప్రభుత్వోద్యోగుల ప్రవర్తన మారకపోవడమే. ఈ మార్పు రానంతవరకు ప్రభుత్వం ఏమి చేసినా - ఎంత చేసినా - అది రాణించబోదు. ఈ ప్రమాదాన్ని గుర్తించే కాబోలు, మద్రాసు ప్రభుత్వంవారు "పరిస్థితులు మారిపోయినవని గుర్తించండి. ఇప్పుడు మీరు ప్రజాసేవకులని గమనించండి. ప్రజలపట్ల మర్యాదగా ప్రవర్తించండి." అని తమ ఉద్యోగస్థులకు హెచ్చరిక చేశారు. ఇది హర్షించదగు హెచ్చరిక. కాని, ఎంతవరకు ఇది ఫలప్రదం కానున్నదో తెలియదు.

[డిశంబర్ 4. 1948]

విద్య, విజ్ఞానం

మన దేశంలో మాత్రమే కాక, ప్రపంచం మొత్తంపైనే నేటి విద్యా విధానం లోపభూయిష్టమేమో! ఎంతగా చూచినా దీన్ని మించి నేటి ప్రపంచ దుస్థితికి మరొక కారణం కానరాదు.

విద్యాప్రచారాని కేమి, విజ్ఞానప్రబోధాని కేమి నేడున్న అశేషావకాశాలు ప్రపంచచరిత్రలో మున్నెన్నడు కానరావు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఎన్నెన్ని అన్యవిద్యాకేంద్రాలు నేడు లేవు? ముద్రణయంత్రం, వార్తాపత్రిక, గ్రామఫోన్, సినిమా, రేడియో, టెలివిజన్ ఎన్నెన్ని విజ్ఞాన వ్యాపకసాధనాలు నేడు లేవు?

పది శతాబ్దాల క్రితంవారికి ఈ సాధనసంపత్తి పూర్తిగా ఊహాతీతమైనది కాదా? ఇట్టిది సంభవం కాగలదని నాడు ఎవరైనా పలికివుంటే, అతడిని పగటి కలలుకంటున్నవానిగా భావించేవారు కాదా? ఇంతే కాదు. "నీ పగటి కలలు నిజమైతే, మరి స్వర్గాన్ని కోరే వారెవరు?" అని అవహేళన సంయుతం చేసివుండే వారు కాదా?

నాటి పగటికలలు నేడు నిజాలైనాయి. అయినా, భూతలం స్వర్గధామం కావడానికి మారుగా, అశాంతితో కళపెళ ఎందుకు ఉడుకుతున్నది?

పోనీ, ఇదివరకటికంటె ప్రపంచంలో ఈనాడు అధికసంతృప్తి కానరాక పోయినా, అధికానందానుభూతి కానరాకపోయినా, కనీసం పాతకాలపు సంతుష్ట్యానందాలైనా కొరవడుతున్నాయేమి?

ఏది ఉత్తమోత్తమ నాటకమనే ప్రశ్నించుకొనేసరికి గ్రీసులో సోఫోక్లిజ్ వరకు, బ్రిటన్‌లో షేక్స్‌పియర్ వరకు, ఫ్రాన్సులో మొలియర్ వరకు, ఇండియాలో కాళిదాసువరకు వెనకకు పోవలసిన అగత్యం కలుగుతున్నదేమి?

ఏవి ఉత్తమోత్తమ శిల్ప, చిత్రకళలని పృచ్ఛించుకొనే సరికి ఏథెన్స్, రోమ్, పర్సెపోలిస్, బోరోబదూర్, అంకార్, అమరావతి, నాగార్జునకొండ, అజంతా, ఎల్లోరా మొదలైన కేంద్రాలలోని శిథిలావశేషాలు ముందుగా స్ఫురణకు ఎందుకు వస్తున్నాయి ?

గతించిన కాలమే గొప్పదని, ప్రపంచం అంతకంతకు అధోగతి పాలై పోతున్నదని చెప్పడానికి ఇది మా ప్రయత్నం కాదు గాని, గతించిన కాలాన్ని అటవికయుగంగా ఎన్నడానికి చాలిన సాధన సంపత్తిని సమకూర్చుకోగలిగి కూడా, ఆధునిక మానవుడు పరిపూర్ణవికాసాన్ని ఎందుకు పొందలేక పోతున్నాడని ప్రశ్నించుకొనక తప్పదు.

ప్రస్తుతం మనం అభ్యసిస్తున్న విద్య సమగ్రమైనది కాకపోవడం ఇందుకు కారణమా ? అది విషయపరిజ్ఞానానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని హృదయపరిపక్వత కివ్వకపోవడం ఇందుకు మరొక కారణమా ? సంస్కృతీవిజ్ఞానాల ప్రచారానికై మనకుగల అశేష సాధనసంపత్తిని మనం క్షణికమైన వినోదంకోసం, ఉద్రేకం కోసం దుర్వినియోగం చేయడం ఇందుకు వేరొక కారణమా ?

ఇవన్నీ కూడా నిస్సందేహంగా ప్రస్తుత శోచనీయస్థితికి కారణాలే.

ఏది శాశ్వతం, ఏది క్షణికం? ఏది సుందరం, ఏది వికృతం? ఏది శ్రావ్యం, ఏది కర్ణకఠోరం ? ఏది జగత్కళ్యాణం, ఏది లోకకంటకం? తుదకు వ్యక్తిపరంగానైనా, ఏది శుభోదర్కం, ఏది తద్భిన్నం? — ఈ విచక్షణాజ్ఞానాన్ని నేటి విద్య మనకు గరపడం లేదు; నేడు మనకున్న విజ్ఞాన ప్రచారకసాధనాలు ఇందుకోసం వినియోగం కావడంలేదు. ఇందువల్ల ఆధునిక మానవునికి అక్షర జ్ఞానమే కాని, ఆత్మజ్ఞాన మబ్బడంలేదు; అతడు విభిన్న విషయ పరిజ్ఞానవంతు డౌతున్నాడే కాని, సంస్కృతీశోభితుడు కావడం లేదు.

అయినప్పుడు, ఒక ఆనంద కుమారస్వామి, ఒక సింజన్ ఆర్విన్ నేటి విద్యావంతులలోకంటె విద్యావిహీనులైనవారిలోనే అధికంగా సంస్కృతి కలదనడం అబ్బురం కాదుగదా !

స్వార్థంతో, ద్వేషంతో, అహంకృతితో ఆత్మవిధ్వంసనదిశకు శీఘ్రగతిని పురోగమిస్తున్న మానవజాతి రక్షణకు నేడు ప్రధానంగా కావలసింది విశిష్టమైన విద్య, వివేకాన్ని పెంచగల విజ్ఞానం.

ఈ హెచ్చరికనే నేడు ఆంధ్ర విశ్వకళాపరిషత్తు స్నాతకోత్సవంలో మద్రాసు గవర్నర్, ప్రధాని, అర్థికమంత్రి ప్రభృతులు చేయడం ముదావహం.

[డిశంబర్ 12, 1948]

1324

గ్రామీణనాయకత్వం

భాషాప్రయుక్త రాష్ట్రాల సమస్యసందర్భంలో అప్రస్తుతవిషయాలను తడవడం జరుగుతున్నది. "జాతీయత ఘనీభవించకముందే ప్రాంతీయాభిమానాలను రెచ్చగొట్టడం తగునా?" అని ధర్మమ్ముద్ర పట్టేవారు కొందరు. "ఇప్పటికే అధికంగానున్న పరిపాలన వ్యయాన్ని మరింతగా పెంచడం భావ్యమా?" అని ముక్కుపై వేలు వేసుకొనేవారు మరికొందరు. "ఇది పదవులకోసం ప్రాకులాట మాత్రమే!" అని పెదవి విరిచేవారు వేరొక కొందరు. "సరిహద్దుల వివాదాలు చెలరేగితే, కొంప మునిగిపోదా!" అని రొమ్ము బాదుకొనేవారు మిగిలిన ప్రబుద్ధులు!

వీరందరు ఒక ముఖ్య విషయాన్ని మరిచిపోతారు. మనం సాధించుకొన్న స్వరాజ్యం సార్థకం కావడమేమి, మనం లక్షిస్తున్న ప్రజాస్వామ్యం అవతరించడమేమి, దేశపరిపాలనలో ప్రజలు - ముఖ్యంగా గ్రామీణ ప్రజలు - అడుగడుగున - క్షణక్షణం - పాల్గొన్నప్పుడే.

వీరు నిన్న, మొన్నటివరకు "గ్రామీణ భారతదేశమే వాస్తవిక భారత దేశం" అని ఏకరవు పెట్టినవారే; "గ్రామోద్ధరణే దేశోద్ధరణ" అని చిలకపలుకులు పలికినవారే; "స్వరాజ్యసౌధానికి గ్రామ పంచాయతీ పునాది కావా"లని శ్రీరంగనీతులు చెప్పినవారే.

నేటికైనా వీరు ఈ విషయాలను కాదనరు. కాదంటే తమకు పుట్టగతులుండబోవని వీరికి చక్కగా తెలుసు. అందువల్ల పాతనినాదాలను మానకుండానే భాషాప్రయుక్త రాష్ట్రవిభజనను ప్రతిఘటించడానికి కుంటి సాకులను, గుడ్డి సాకులను వీరు వెదకుతున్నారు.

వీరి మాటలకు మోసపోక ప్రజలు - ముఖ్యంగా గ్రామాలకు చెందిన ప్రజలు - వీరికి వేయవలసిన కొన్ని ముఖ్య ప్రశ్నలివి :

"మాకు తెలియని భాషలో - అది నేటివలె ఇంగ్లీషు కావచ్చు; రేపు జరగనున్నట్టు ఏ హిందీయో, హిందూస్థానీయో కావచ్చు - మీరు శాసనాలు చేసినా, ప్రభుత్వాన్ని నడిపినా, అది మాకు అడవిగోల మాత్రమే కాదా?"

"ఏదో ఒక పరభాషలో ప్రవేశం ఉన్నవారే రాజనీతిజ్ఞతను, వ్యవహార దక్షతను గుత్తగొన్నవారనడం సబబు కాగలదా?"

"ఏదో ఒక పరభాష రాదన్న మాత్రంచేత మమ్ము మేమే పాలించుకొనగల సదవకాశం మాకు లేకుండాచేయడం మీకు తగునా?"

"మార్షల్ స్టాలిన్‌కు రష్యన్ తప్ప మరొక భాష తెలియదు; మార్షల్ చాంగ్‌కు తెలిసింది చైనీస్ మాత్రమే. దేశ పరిపాలనాబాధ్యత నిర్వహణకు పర భాషాపరిజ్ఞానం రష్యాలోను, చైనాలోను ముఖ్యావసరమని భావించివుంటే, ఈ ఇద్దరు నేడు తాము నిర్వహిస్తున్న పదవులను రాగలిగేవారా?"

"మాలో నూటికి 90 మందికి చదువురాదు; మాలో నూటికి ఒక్కరికైనా పరభాష తెలియదు. ఇందువల్ల మేము శాసననిర్మాణంతో జోక్యం పెట్టుకొనరాదనడం స్వరాజ్యమే కాగలదా?"

భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణాన్ని ప్రతిఘటిస్తున్నవారిని రాష్ట్రపతి డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య నిన్న సాయంత్రం చెన్నపురి ఆంధ్ర మహాసభవారు తనకు చేసిన సన్మానం సందర్భంలో ఇట్టి ప్రశ్నలనే, ఇంతకంటె నిశితంగా, ఇంతకు మించిన ప్రాగల్భ్యంతో అడిగినందుకు సంతోషిస్తున్నాము.

డాక్టర్‌గారు తెగవేసి చెప్పినట్టు "ప్రస్తుతం మనకు రాజ్యం వచ్చిందిగాని, స్వరాజ్యం రాలేదు. చేజిక్కిన రాజ్యం స్వరాజ్యంకావడం భాషాప్రయుక్తంగా దేశవిభజన జరిగినప్పుడే."

మన గ్రామసీమలలో ఎందరో చాణక్యు లున్నారు, యుగంధరు లున్నారు, తిమ్మరుసు లున్నారు. అక్షరజ్ఞానం లేకపోయినా, వీరు యుక్తాయుక్తాల నెరిగిన

వారు; పరభాషాప్రవేశం లేకపోయినా, వీరు ప్రజ్ఞాదురంధరులు. అవకాశ మిస్తే, వీరు దుర్నిరీక్ష్యంగా రాజ్యచక్రాన్ని తిప్పగలరు; అవసరం వస్తే, ధర్మదేవత ముఖాన్ని చూచి, తప్పు చేసిన కన్నకొడుకునైనా దండించగలరు.

ఈ రాజ్యతంత్రజ్ఞుల - ఈ ధర్మదేవతల—సేవాభాగ్యాన్ని మన దేశం పొందగలగడం ప్రతి ఒక ప్రాంతం పరిపాలన ఆ ప్రాంతీయభాషలో జరిగి నప్పుడే. ఈ సత్యాన్ని కానలేనివారు అంధులైనా కావాలి, అజ్ఞానులైనా కావాలి. ఈ పరిణామాన్ని నిరోధించేవారు మూర్ఖులైనా కావాలి, ముష్కరులైనా కావాలి.

[జనవరి 14, 1949]

భారతనారి

ఒక జాతి పతనానికి ముందు దాని స్త్రీజనపతనం చెందడంకద్దు. ఇందుకు మన దేశచరిత్రే తార్కాణం.

భారతనారికి స్వాతంత్ర్యాన్ని నిరాకరించినతర్వాత భారత జాతీయ స్వాతంత్ర్యం ఎక్కువ కాలం నిలవలేదు. ఆమెకు చదువు కూడదన్న తర్వాత దేశంలో అజ్ఞానం ప్రబలడానికి ఎక్కువ కాలం పట్టలేదు. ఆమెను మూఢాచార పరాయణగా మార్చిన పిదప సంఘజీవితం కుశించుకు పోవడానికి ఎక్కువ కాలం అవసరం కాలేదు.

ఏ జాతిపతనమైనా దాని స్త్రీజనపతనంతో అది ప్రారంభం కావడంవల్లనే కాబోలు, జాతీయ పునరుజ్జీవనోద్యమాలు సర్వసాధారణంగా సంఘసంస్కరణ యత్నంతోనే మొదలౌతాయి. మన దేశంలోకూడా ఇంతే జరిగింది.

స్థూలదృష్టితో చూచినప్పుడు రాజా రామమోహన్ రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, బి.ఎం.మలబారీ, మహాదేవగోవింద రణడే, కందుకూరి వీరేశలింగం ప్రభృతులు కేవలం సంఘసంస్కర్తలే. కాని, జిజ్ఞాసాదృష్టితో పరికించినప్పుడు భారత జాతీయ స్వాతంత్ర్యోద్యమానికి వీరే పితామహులు.

వారు చల్లిన విత్తనాలే గాంధి చేసిన విశేష దోహదంతో వేళ్ళు తన్ని, ఆకు తొడిగి, మొదలు కట్టి, కొమ్మలు వెళ్ళి, మొగ్గలు వేసి, పువ్వులు పూసి, చివరికి స్వాతంత్ర్యఫలాన్ని అందించాయి.

పెక్కుమంది ఆశించినదానికంటె సత్వరంగా భారత స్వాతంత్ర్యసంసిద్ధికి ప్రధాన కారణం - పెక్కుమంది ఆశించినదానికంటె సత్వరంగా భారతనారి ఆత్మస్వరూపాన్ని గుర్తించడమే, ఆత్మశక్తిని గ్రహించడమే.

ఆత్మస్వరూపాన్ని గుర్తించిన భారతనారి - ఆత్మశక్తిని గ్రహించిన భారతనారి-గాంధి పిలుపు విని, జాతీయరంగంలో పాదం పెట్టింది. నాటినుంచి

నేటివరకు ఆమె చూపు ముందుకే పోతున్నది కాని, వెనుకకు మరలడం లేదు; ఆమె అడుగు ముందుకే పడుతున్నది కాని వెనుకకు తిరగడంలేదు.

కడచిన నూరేళ్లలో పాశ్చాత్యాంగన సాధించలేకపోయిన పురోగతిని గతించిన ముప్పై సంవత్సరాలలో భారతనారి సాధించగలిగింది. శీఘ్రగతినే కాకుండా నిరాటంకంగా కూడా ఈ పురోగమనం కొనసాగింది.

ఓటింగ్ హక్కుకోసం పాశ్చాత్యాంగన సత్యాగ్రహాన్ని చేయవలసి వచ్చింది. భారతనారికి అట్టి ఆగత్యం కలగలేదు. అన్ని పదవులకు అన్ని పాశ్చాత్యదేశాల స్త్రీలకు ఈనాటికీ అర్హత లేదు. కాని, భారతమహిళ పొంద జాలని పదవి ఏదీ లేదు.

ఇంతకుమించికూడా భారతనారి మున్ముందు పురోగమించ గలదనడానికి నిన్న మన పార్లమెంటులో ఆమె హక్కులకు సంబంధించిన ఒక బిల్లు అయిదు నిమిషాలలో ఆమోదాన్ని పొందడమే ప్రత్యక్షనిదర్శనం.

ఆర్థిక, రాజకీయ, పారిశ్రామికాది రంగాలలో జరగవగు పరివర్తనలు నేడు జరగకపోవచ్చు; జరిగినా, శీఘ్రంగా జరగకపోవచ్చు, సమగ్రంగా జరగక పోవచ్చు. అయినా, భారతనారి స్వత్వాలకేమి, ప్రతిపత్తికేమి సంబంధించిన విషయాలలో కానవస్తున్న శీఘ్రపురోగమనంతర్వాత మన భవితవ్యాన్నిగురించి నిరుత్సాహ పడవలసిన పని లేదు.

స్త్రీ శక్తిస్వరూపిణి. ఆమె ప్రతిపత్తి పదిలపడిననాడు, ఆమె ప్రతిష్ఠ యినుమడించిన పిమ్మట, ఆమె పురోగమించ నారంభించిన తర్వాత, ప్రతి రంగం నూతన జీవచ్ఛక్తి విలసితం కాకతప్పదు. అంపుమీదట ఎట్టి సంస్కరణ లైనా సులభంగా జరుగుతాయి, ఎన్నిమార్పులైనా శీఘ్రంగా వస్తాయి.

భారతనారితో పాటుగా పతనమైన భారతదేశం తిరిగి ఆమెతోపాటు తల యెత్తుతుంది. ఇది తథ్యం.

[ఫిబ్రవరి 13, 1949]

ఏది దేవాలయం?

దేవాలయానికి దేవత్వం అక్కడ ప్రతిష్ఠించిన శిలావిగ్రహంద్వారా రాదు; దానికి జరిగే ధూపదీపనైవేద్యాలద్వారా కూడా రాదు.

దేవాలయం నిజంగా దేవునికి ఆలయం కావడం మానవుని దేవతల మార్గంవెంట నడిపించడానికి అది తోడ్పడినప్పుడే. ఇట్టి తోడ్పాటు ఒకనాడు దేవాలయంద్వారా లభించేది.

అప్పు డది దేవాలయమే కాక, విద్యాలయం కూడా. దాని మండపాలు వేదవేదాంగోపనిషత్తుల నిరంతరాధ్యయనంతో ప్రతిధ్వనించేవి.

అప్పు డది దేవాలయమే కాక, కళాలయం కూడా. దాని ప్రాకారా లేమి, గోపురా లేమి, మండపా లేమి, కుడ్యాలేమి శిల్ప, చిత్ర సుశోభితాలై, సామాన్య పౌరుల జీవితాలను కళాశోభితం చేయడమే కాకుండా, శిల్పాచార్యులకు, చిత్రకారులకు తమ ప్రాగల్భ్య ప్రదర్శనానికి మహదవకాశాన్ని కల్పించేవి.

అప్పు డది దేవాలయమే కాక, నాట్యాలయం కూడా. అనుదినం సాయం సంధ్యాసమయంలో అక్కడ భరతనాట్య ప్రదర్శనం జరుగుతుండేది.

అప్పు డది దేవాలయమే కాక, గానాలయం కూడా. మంగళతూర్యాలతో అక్కడి చీకటి విచ్చుకునేది, అక్కడి నాగసరం మున్నగు వాయిద్యాలు పౌరులకు మేలుకొలుపులు పాడేవి, అక్కడి భజనలు, సంకీర్తనలు మొదలైనవి పామరుని బ్రతుకును సయితం గానమధురిమం చేసేవి.

అప్పు డది దేవాలయమే కాక, వైద్యాలయం కూడా. పూజారులే సర్వసాధారణంగా వైద్యులై వుండేవారు. ప్రతిఫలాన్ని కాంక్షించి కాక, ప్రజా సేవను లక్షించి. వ్యాధినివారణకు వారు పాటుపడుతూవుండేవారు.

అప్పుడది దేవాలయమే కాక, "కర్మాలయం" కూడా. కంసాలి, కంచరి, కమ్మరి, కుమ్మరి, మొదలైన కర్మకారులకు అది పని కల్పిస్తుండేది. దైవసేవకు పంచపాత్ర, ఉద్ధరణి, శఠకోపం, జేగంట, ఛత్రచామరాలు మొదలుకొని, గరుడ, నందీశ్వరాది వాహనాలవరకు, పుష్ప, రజత, సువర్ణాది దివ్యాలంకారాలు మొదలుకొని, ఆకాశాన్ని అంటగల దివ్యరథాలవరకు సమస్తాన్ని సమకూర్చడమనే పేరుతో సమస్త కర్మకారుల సంపూర్ణ వికాసాభ్యుదయాలకు ఉపకరించేది.

అప్పుడది దేవాలయమే కాక, "వినోదాలయం" కూడా. ఊరేగింపులు, ఉత్సవాలు, సంతర్పణలు, సమారాధనలు, భగవత్కథలు, ఇతర కాలక్షేపాలు, తీర్థాలు, తిరునాళ్లు మొదలైనవాటిని పరంపరగా కల్పించి, దైనందిన సాధక బాధకాలను విస్మరింపజేసి, ప్రజానీకం జీవితాన్ని ఆనందపులకితం చేసేది.

అప్పుడది దేవాలయమే కాక, "రక్షణాలయం" కూడా. శత్రు, చోరభయాలు కలిగినప్పుడు ప్రజలు దాని ప్రాకారాలలోపల చేరి, ప్రాణరక్షణ చేసుకొనేవారు. ఇందు కొక తార్కాణమే "ఇంటికంటె గుడిపదిల" మనే లోకోక్తి.

ఇంత దేనికి ? ఒకప్పుడు దేవాలయం హిందూసంఘజీవితానికి కేంద్రం. ఊరుమధ్యనే కాక, బ్రతుకుమధ్యలో అది నిలిచివుండేది.

కాని, ఈనాడో ?

అది బ్రతుకుమధ్యనుంచి దాని చివరికి ఇప్పుడు కదిలింది. పది మంది కడుపు కొట్టి, వారి బ్రతుకు బుగ్గిచేసి మూటకట్టిన పాపము సొమ్ములో ఇప్పుడది కొంత భాగాన్ని పంచుకొంటున్నది.

ఇట్టి ఘోర దుస్థితిలో పడినందునే ఒకనాడు బౌద్ధస్థూపాలు, విహారాలు "లంజదిబ్బలు"గా మారాయి.

ఈ విషాద పరిణామంనుంచి దేవాలయాలను కాపాడాలనే సదుద్దేశంతో మద్రాసు ప్రభుత్వం దేవాలయ, ధర్మాదాయ సంస్థల చట్టానికి సవరణ తలపెట్టేసరికి ధార్మికవిషయాలలో ఇది జోక్యమని, ప్రాథమికస్వత్వాలకు ఇది భంగకరమని, మతపవిత్రతకు ఇది కళంకమని, ఆస్ట్రేలియా రాజ్యాంగ విధానానికి ఇది విరుద్ధమని ఎందుకు కొందరు ఆందోళన ప్రారంభించారో దురూహ్యం.

దేవాలయం తిరిగి సాంఘికజీవితానికి కేంద్రంకావాలని మేము కోరబోము; కాగలదన్న ఆశ సయితం మాకు లేదు. కాని, అట్టి ప్రయత్నం ప్రారంభంకాగా దేవాలయాలపై భక్తిప్రపత్తులున్నవారు దాన్ని ఆహ్వానించడానికి బదులు నిరసించడం దేనికి? దేవునిపేరు చెప్పి, తమ పొట్టలు నింపుకొనడానికి ప్రతిబంధకం కలగబోతున్నదనేనా? తాముచేస్తున్న పాపాలకు తేలికగా "చెల్లుచీటి" దొరికే అవకాశం పోగలదనా? యుక్తాయుక్తాలను, ధర్మాధర్మాలను కానలేనంతగా మూఢాచారాలు తమపై ప్రాబల్యం వహించడంవల్లనా?

[ఫిబ్రవరి 16, 1949]

కుటీరపరిశ్రమలు

కుటీరపరిశ్రమలకు మన జాతీయ ఆర్థికవ్యవస్థలో స్థానం వున్నది. అయితే. అది ప్రధాన స్థానం కాదు, కారాదు కూడా. వీలైనన్ని భారీ పరిశ్రమలను - వీలైనంత త్వరగా - మనం స్థాపించుకు తీరాలి. వీటికై యంత్ర పరికరాలను విరివిగా వినియోగించుకోవాలి. లేకపోతే మన దారిద్ర్యం తొలగదు, మనకు సుభిక్షం లభించదు, మన స్వాతంత్ర్యాన్ని కాపాడుకొనగలగడం సయితం జరగబోదు. శాంతిరంగంలో వలె యుద్ధభూమిలో కూడా పారిశ్రామిక పాటవంగల రాజ్యానిదే గెలుపైనా, బలుపైనా.

ఇది యంత్రయుగ మని గుర్తించనేరక, భారీ పరిశ్రమలపట్ల వైముఖ్యాన్ని ప్రదర్శించడం అనర్థదాయకం కాగా, కుటీరపరిశ్రమలను నిర్లక్ష్యం చేయడం అనాలోచితచర్య. బ్రిటన్, జర్మనీ, జపానులను పోలిన పారిశ్రామికదేశాల నుంచి కుటీరపరిశ్రమలు నేటికీ అంతరించలేదు. యంత్రయుగంలో సయితం కుటీరపరిశ్రమలకు తగు స్థానం కలదనడానికి ఇంతకంటె నిదర్శనం కావాలా? ఈనాడు మన పారిశ్రామికాగారాలు అందరికీ పని కల్పించలేవన్న కారణానే కాకుండా, యునైటెడ్ స్టేట్సు-సోవియెట్ యూనియన్‌ల సరసను పారిశ్రామిక ప్రపంచంలో మన దేశం స్థానం సంపాదించగలిగినపిమ్మట సయితం, కుటీర పరిశ్రమలకు జాతీయార్థికవ్యవస్థలో గల ప్రత్యేక స్థానందృష్ట్యా. వాటిని సముచితరీతిని పోషించుకోవాలి.

చేయి చేయ గల ప్రతి పనిని యంత్రం చేయలేదు; చేసినా, అంత అందంగా చేయలేదు. చేతిలో జీవం వున్నది, చేతిలో ఇంద్రజాలం వున్నది. ఏ యంత్రం మన బందరు కలంకారీని తయారు చెయ్యగలదు? ఏ యంత్రం మన తిరుపతి చందనపు దేవతాప్రతిమలను మలచగలదు? ఏ యంత్రం మన విశాఖపట్నం కొమ్ము బొమ్మలను చెక్కగలదు? ఏది మన కొండపల్లి బొమ్మలను చేయగలదు? నిజాంలోని బీదర్‌పని, మైసూర్‌లోని దంతపుపని యంత్రాల

వల్ల జరగగలదా? కాశ్మీర్ రత్నకంబళాలను, జయపూర్ జరీని యంత్రాలు ఉత్పత్తి చేయగలవా? చిదంబరం, మధుర మొదలగుచోట్ల ఈనాటికీ పోత పోయబడుతున్న నటరాజు, బాల సుబ్రహ్మణ్యం మొదలైన కాంస్య విగ్రహాలను చేయడం బర్మింగ్‌హామ్, షెఫీల్డ్ వగైరా పారిశ్రామిక కేంద్రాలకైనా అసాధ్య విషయం కాదా? కొయ్య ముక్కలను ఏనుగు, పులి, సింహం మొదలైనవాటిగాను, చందనం చెక్కలను లక్ష్మి, సరస్వతి, వేణుగోపాలకృష్ణుడు, సీతారామలక్ష్మణులు మున్నగువారి మూర్తులుగాను రూపొందించడం యంత్రాలతరం కాదు గదా? యంత్రాగారాలు ఉత్పత్తి చేయలేని అశేషవస్తుసంపదను రూపొందించడం కుటీరపరిశ్రమలకే సాధ్యం.

ప్రజావరణ దాదాపు పూజ్యమైనప్పటికీ ఎన్నెన్నో కుటీరపరిశ్రమలు ఈనాటికీ మనకు మిగలడానికి మన సంస్థానాధీశులు చాలావరకు కారణం. అన్యవిధాల వారు దేశంపట్ల ఎంతగా మహాపచారం చేసినా, కుటీరపరిశ్రమలను కాపాడ్డంద్వారా వారు కొంత మేలు చేశారు. కుటీరపరిశ్రమలను వారు పోషించడం ఆడంబరం కోసమే కావచ్చు. అయినా, కుటీరపరిశ్రమలు నేటికీ చావకుండా మిగలడానికి వారే చాలావరకు బాధ్యులు. ఎన్నదగు కుటీరపరిశ్రమ లన్నీ విశేషంగా స్వదేశసంస్థానాలలోనే ఈనాడు కానవస్తున్నాయి కూడా.

"కులవృత్తి" అనే అభిమానంవల్లనే కావచ్చు; "కూలి నాలికి పోకుండా గౌరవంగా బ్రతుకు వెళ్లమార్చుకోవచ్చు" అనే భావంతో కావచ్చు; మరొక దారి కానరాకపోవడం వల్లనే కావచ్చు: ఏమైనా మన కర్మకారకుటుంబాలవారు కడుపు కాలుతున్నా, తమ విద్యను, తమ కళలను కాపాడుకొంటున్నారు. దంతం గొల్లభామ ఖరీదు చూచి, "అబ్బో! రెండువందల రూపాయలే!" అని ఆశ్చర్యాన్ని ప్రకటించేవారికి దాన్ని చేసినవానికి సగటున రోజుకు రెండురూపాయల కూలి కూడా కిట్టదన్న సంగతి తెలియదు. ఆ చెక్కడం ఆ ధరకు అమ్మకానికి రావడం దాన్ని చేసినవారు ఒంటిపూట కూటితో సరిపెట్టుకోవడంవల్లనే అని తెలియదు. ఏమైనా, అన్యదేశాలు అసూయ పడదగినట్టి కుటీరపరిశ్రమలు మనకు మిగలడం మన భాగ్యవిశేషం. ఈ గృహ పరిశ్రమలను మనం సద్వినియోగం చేసుకొనగలపక్షంలో మనకు కటకటగా వున్న డాలర్లు వగైరా లభించగలవు.

కూడా. ఇక్కడ రెండు, మూడు రూపాయలపైగా మనం కొననట్టి కొమ్ము కొంగను అమెరికాలో కళ్ల కద్దుకుని, మూడు, నాలుగు డాలర్లను (డాలర్ దాదాపు మూడున్నర రూపాయలు) చెల్లిస్తారట !

వీటిని విదేశాలలో అమ్మించడంవల్ల మనకు డబ్బు రావడమే కాకుండా, మన దేశం పేరుప్రఖ్యాతులు పెరగగలవు కూడా. విదేశాలలోని మన రాయబారుల కార్యాలయాలలో మన కుటీరపరిశ్రమలద్వారా ఉత్పత్తి చేయబడుతున్న వస్తువుల ప్రదర్శనానికి ఏర్పాటులు జరిగినవట. ఇది సంతసించదగు విషయం. ఇంతే కాక, న్యూఢిల్లీలో వీటి విక్రయకేంద్ర మొకటి ప్రారంభం కానున్నట్టు నేడే వార్త చేరింది. ఇది కూడా హర్షించ దగు విషయమే.

[ఫిబ్రవరి 19, 1949]

హిందూసంఘ సంస్కరణ

రాజకీయసంస్థలు సాంఘికవిషయాలలో ఎంతమాత్రం జోక్యం పెట్టుకో రాదట. ఇది జగద్గురు శంకరాచార్యుల సూక్తి! ఇదే రాష్ట్రపతి భోగరాజు పట్టాభి సీతారామయ్య సుభాషితం. జగద్గురువుల సంగతి ముందు కొంత పరామర్శించి, ఆ తర్వాత రాష్ట్రపతివద్దకు రావచ్చు.

శంకరాచార్య పీఠాలు మొత్తం నాలుగు కాబోలు వున్నాయి. ఈ నాల్గింటి అధిపతులు జగద్గురువులే. జగతి ఒక్కటే కాగా, జగద్గురువులు నలుగురు కావడం వింత కాదా? వీరు నలుగురైనా, నాలుగు నలుగురైనా, వీ రందరు చేరి, జగత్తు మొత్తానికి గురువు లైతే, అదొక అందం, చందం. కాని, వీరి "ధర్మసామ్రాజ్యం" సరిహద్దులు ఇండియాకు పరిమితం. ఇండియాలోనైనా హిందూమతానికి పరిమితం. హిందూమతంలో తిరిగి అద్వైతవాదులకు పరిమితం. అద్వైతవాదులలో కూడా పాతకాలపు పరమఛాందసాన్ని పట్టుకుని ప్రాకులాడుతున్న వారికి పరిమితం.

ఈ జగద్గురువుల "ధర్మసామ్రాజ్యం" ఇంత పరిమితమైనది కాగా. వీరి "దృక్పథసామ్రాజ్య" వైశాల్యం దీనిలో శతసహస్రాంశమైనా కాదు.

ఈ "జగద్గురువులే" రాజా రామమోహనరాయ్, దయానంద సరస్వతి, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, కందుకూరి వీరేశలింగం మొదలైనవారి నందరినీ నిరసించారు.

ఖర్మం చాలక వీరి మాట చెల్లివుంటే, సముద్రయానం నేటికీ దూష్యమై వుండేది; సహగమనం నేటికీ సాగుతుండేది; వితంతువివాహాలు నేటికీ వర్జ్యనీయమై వుండేవి; బాల్యవివాహాలు నేటికీ సదాచారమై వుండేవి; స్త్రీలకు విద్య గరపితే,వారు విటులకు లేఖలను వ్రాయగలరన్న నీచవాదం జరుగుతుండేది; లెక్క లేనన్ని ఇతర అంధవిశ్వాసాలకు, దురాచారాలకు మన సంఘం క్రీడారంగంగా నిలిచివుండేది.

జగద్గురువులను వారి జానెడు, బెత్తెడు జగత్తులోనే విడిచి పుచ్చి, సంఘం ముందడుగు వేసినందునే ఈనాడు దేశం ఈ పాటిగానైనా వున్నది. అయినా, "తగుదుమమ్మా" అంటూ ఈ జగద్గురువులే ఈ నాడు మనకు సంఘసంస్కరణ తగునో, తగదో చెప్పడానికి సాహసిస్తున్నారు.

రాజకీయసంస్థ సాంఘికవిషయాలలో జోక్యంకలిగించుకొనడం తగదని జగద్గురు శంకరాచార్యులలో ఒకరు ప్రవచించడంలో అబ్బురం లేదు. కాని, రాష్ట్రపతి పట్టాభిసీతారామయ్యా సయితం సరిగా ఇదే వాదాన్ని చేయడం ఆశ్చర్యకరం.

జాతీయజీవితాన్ని సాంఘిక, ఆర్థిక, రాజకీయ, పారిశ్రామికాది రంగాల కింద విభజించడం సాధ్యమా? సాంఘికంగా పతనమైన జాతి రాజకీయంగా స్వాతంత్ర్యాన్ని నిలుపుకొనగలదా? పారిశ్రామికవ్యవస్థ స్వరూపాన్ని ఆర్థిక విధానాలు నిర్ణయించవా? కేవలం వ్యవహారసౌలభ్యంకోసం సాంఘిక, ఆర్థిక, రాజకీయ, పారిశ్రామికాది రంగాలని భావించుకొనడమే కాని, జీవితం ఎల్లలులేని ఏకసంద్రం కాదా?

పైగా, ఆయన ఏ రాజకీయసంస్థ సాంఘికవ్యవహారాలలో జోక్యం కలిగించుకొనరాదని పేర్కొంటున్నాడో, అది ఇండియన్ యూనియన్ పార్లమెంట్. భారత రాజ్యాంగపరిషత్తు రూపంలో ఈ తరానికే కాక, ముందు తరాలకు కూడా జాతీయజీవిత స్వరూపాన్ని నిర్దేశించడంలో ప్రస్తుతం ఆ సంస్థ నిమగ్నమై వున్నది. అయినా, జాతీయజీవితంలో కేవలమొక భాగమైన విశేషించి, ఒకస్వల్పభాగమైన-సాంఘికరంగంలో అది జోక్యాన్ని పెట్టుకోరాదటం అయినప్పుడు దాన్ని "సావెరన్" ("సర్వసత్తాక") సంస్థ అనడం దేనికి? కేవలం అలంకారార్థమా?

కాంగ్రెసు నాయకులలో ఒక్క డాక్టర్ భోగరాజు పట్టాభిసీతారామయ్యా మాత్రమే కాకుండా మరికొందరు ప్రముఖులుకూడా సాంఘిక, రాజకీయ రంగాలను వేరుచేయాలనే వాదిస్తున్నారు. ఇది అత్యంత శోచనీయం. "సాంఘిక విషయాలలో జోక్యం పెట్టుకోము" అనే ధర్మపన్నాలు పలికి, సంఘాభివృద్ధిని-తద్వారా జాతీయవికాసాన్ని - అరికడుతున్నారని నిన్న మొన్నటివరకు,

బ్రిటిష్‌వారిని విమర్శించినవారే నేడు బ్రిటిష్‌విధాన సమర్థకులు కావడం శోచనీయం కాక మరేమిటి?

[మార్చి 8, 1949]

2

ఏ సంఘం న్యాయసూత్రాలైనా ఎల్లకాలం ఏకవిధంగా వుండవు. ఒకప్పుడు ఏనాడోకాదు, పద్దెనిమిదవ శతాబ్దంలోనే, బ్రిటన్‌లో ఫోర్జరీచేస్తే ఉరిశిక్ష; గొర్రెలను దొంగలించినా ఉరిశిక్ష. ఒకప్పుడు,ఏనాడోకాదు; ఒక శతాబ్ది క్రితం వరకు, ఇండియాలోని కొన్ని ప్రాంతాలలో చేనుపై దొంగతనంచేస్తే శిరచ్ఛేదం.

నాడు ఇవన్నీకూడా న్యాయసూత్రాలే. కాని, నేటికీ ఇవి న్యాయసూత్రాలు కాగలవా? దేశ కాల పరిస్థితులతోపాటు న్యాయశాస్త్రాలు సయితం మారాలి. ఈ సత్యాన్ని ఈనాడు హిందూ సంఘనాయకులమని చెప్పుకొంటున్న కొందరు గట్టిగా కాదనవచ్చు. కాని, ఇతఃపూర్వపు నాయకులు ఇట్టి "బుద్ధిజాడ్య జనితోన్మాదం" ప్రదర్శించలేదు. పరాశరస్మృతి, యాజ్ఞవల్క్యస్మృతి, మనుస్మృతి, గౌతమ ధర్మసూత్రాలు, ఆపస్తంభసూత్రాలు మొదలైనవి మన కెన్ని లేవు? వీటి సంఖ్య నూటికి పైమాట కాదా? కలకాలానికీ ఒకే స్మృతి సరిపోతే, ఇన్ని రూపొందడం జరిగేదా?

ఇదివరలో నూరుసార్లకుపైగా హిందూధర్మస్మృతులు మార్పుచెందినప్పుడు అవి మరొకసారి ఎందుకు మారరాదు? నిజానికి ఈ మార్పువిషయంలో ఇప్పటికే కొన్ని శతాబ్దాల విలంబన జరగలేదా?

పైగా, ఇదివరలోకంటె ఈనాడు ఇదిమనకు ముఖ్యావశ్యకత కాదా? ఇదివరలో ప్రాంతానికొక రాజ్యం, రాజ్యానికొక న్యాయశాస్త్రం. ఇంతే కాదు. సంఘానికొక శాస్త్రం; కులానికొక తప్పు; శాఖకొక ఆచారం. ఇంతేకాక, ఒకేనేరానికి విభిన్నవ్యక్తులకు విభిన్నశిక్షలు కూడా.

ఈ న్యాయసూత్రా లన్నింటిని ఈ నాడు మనం పరిపాలిస్తున్నామా? వీటి నన్నింటిని పరిపాలించనప్పుడు వీటిలో కొన్నింటి విషయమై పట్టుదల భావ్యమా? పైగా, ఒక్కొక్క మతంవారి కొక న్యాయసూత్రం కారణంగా న్యాయాన్యాయనిర్ణయంలో పెక్కు చిక్కులు రావడంలేదా?

వివిధ మతాలవారి న్యాయసూత్రావళిని సమైక్యం చేయడం ప్రస్తుతానికి అసంభవ విషయం. అయినప్పుడు, కనీసం హిందూసంఘానికైనా ఏక న్యాయ సూత్రావళి పరమావశ్యకత కాదా? ఇంతైనా జరగకపోతే, జాతీయ సమైక్యత మన లక్ష్యమని చెప్పుకొనడం శుష్కప్రియం కాబోదా?

హిందూధర్మశాస్త్ర క్రోడీకరణ జరప గోరుతున్నవారు పాత న్యాయ సూత్రాలలో ఘోరాన్యాయమైనవిగా పరిణమించిన వాటిని కొంతవరకు సంస్క రించడం వినా, చెల్లాచెదురుగా వున్న న్యాయసూత్రాలను ఒక క్రమానికి తెచ్చి పరస్పర వైరుధ్యాలున్నచోట వాటిని సవరించడం వినా, అన్యాన్ని లక్షించడం లేదు. అయినా, ఈ పాటికే కొంప మునిగిపోతున్నట్టు కొందరు ఎందుకు గగ్గోలు చేస్తున్నారో దురూహ్యం.

ఈ గగ్గోలు చేస్తున్నవారు కేవలం ఛాందసులైతే, "మతిలేనివారి మితిలేని గోల" అని పోనీ సరిపెట్టుకోవచ్చు. కాని, కొందరు కాంగ్రెస్ ప్రముఖులే ఈ ప్రతికూలాందోళనలో చేరుతున్నారు. ఇట్టివారు ఒక ప్రశ్నకు జవాబు చెప్పకతప్పదు. ఇదివరలో హరిజనులకు దేవాలయ ప్రవేశమివ్వడానికి శాసనాలు జరగడాన్ని వీ రెందుకు సమర్థించారు? అది గాంధీ అభిమతమనేనా? కేవలం గాంధీ మెప్పుకోసమే ఆనాడు హిందూ ధర్మశాస్త్ర సవరణకు సమ్మతించినవారే ఈ నాడు అందుకు ప్రాతికూల్యాన్ని ప్రదర్శిస్తుంటే, వారి చిత్తశుద్ధిని- వారినైతిక బలాన్ని - శంకించక తప్పదుగదా?

[మార్చి 9, 1949]

3

"జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అని కీర్తించిన హిందూ సంఘమే "నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అనే అధోగతికి వచ్చింది ఇటీవలి

కొన్ని శతాబ్దాలలోనే. కొంచెం జిజ్ఞాసతో భారతదేశ చరిత్రను చదివితే, స్త్రీజన పతనంతో పాటుగానే మన జాతీయపతనం కూడా ప్రారంభమైనట్టు స్పష్టంగా కనబడుతుంది.

హిందూసంఘం ఇటీవలి శతాబ్దాలలో స్త్రీజనానికి చేసిన ఘోరాన్యాయాలను కొన్నింటిని కొంతవరకు సవరించడాన్ని మాత్రమే హిందూధర్మశాస్త్ర క్రోడీకరణ బిల్లు లక్షిస్తున్నది. దాంపత్యం దుర్భరమై పోతే, స్త్రీ విడాకులు కోరవచ్చు; సవతిపోరుకు ఆమె నిరాకరించవచ్చు; ఆస్తిపాస్తుల విషయంలో కొన్ని హక్కులను ఆమె పొందవచ్చు-ఇంతకుమించి హిందూసంఘంలో డాక్టర్ అంబేడ్కర్ బిల్లు తీసుకురాగల మార్పు లేమీ లేవు. అయినా, ఏదో మహా విప్లవమే జరగనున్నట్టు ఛాందసులు ఆక్రోశపడుతుండగా కాంగ్రెసు నాయకులలోనే కొందరు వారికంటె మిన్నగా విలపిస్తున్నారు.

హిందూసంఘ పునరుజ్జీవనానికి ఈనాడు నిజంగా కావలసింది ఒక మహావిప్లవమే. మన పాత శంకరాచార్యులు, వారి శిష్య కోటి సమేతంగా పోవాలి; సంఘంపైకి వెల్లువగా పారి, దానిలోని కశ్మలాన్ని కడిగి పారవేయగల వరదలను పోలిన కొత్త శంకరాచార్యులు, ప్రతీపశక్తులను చెండాడగల శంకరాచార్యులు, సత్యసంశోధనలోను, ధర్మసంస్థాపనలోను విశ్రమించబోని శంకరాచార్యులు రావాలి.

అట్టి శంకరాచార్యులు ఎప్పుడు వస్తారో, అసలు వస్తారో, లేదో తెలియదు. ఈ లోపున హిందూసంఘ క్షేమాభిలాషు లందరి కర్తవ్యం డాక్టర్ అంబేడ్కర్ కృషిని సమర్థించడమే!

[మార్చి 10, 1949]

గాంధి, ఆయన అనుచరులు

సత్యవ్రతం, అహింసావలంబన కంటకావృతమార్గాలు. వాటివెంట నడవగోరితే అడుగడుగుకు త్యాగాలు చేయాలి, కష్టాలు భరించాలి, కడగండ్లపాలు కావాలి. ఇంతే కాదు, ప్రతిఫలాన్ని ఆశించరాదు, ప్రతీకారేచ్ఛను పొడసూప నివ్వరాదు, ఆత్మార్పణ చేయడానికి సంసిద్ధతను ప్రదర్శించాలి. దీన్నే మరొక విధంగా చెప్పాలంటే, బౌద్ధభిక్షువువలె, రోమన్ కేథలిక్ మిషనరీవలె "నేను" అనే భావాన్ని చంపుకోవాలి; "నాది" అనే మమకారానికి అతీతంగా నిలవాలి.

ఇతఃపూర్వపు వివిధ మతాచార్యులు కేవలం ఆముష్మిక విషయాలకే ఈ కఠోర సాధనను నిర్దేశించగా, ఐహిక విషయాలకు కూడా ఇదే సాధన అత్యవసర మని గాంధి పేర్కొన్నాడు. ఆముష్మిక లక్ష్యసాధన విధానాలనే ఐహిక రంగంలో సయితం ప్రవేశపెట్టనంతవరకు, దేవుడు దేవాలయాలలోనే మిగలగా, "సైతాన్" రాజ్యం చేస్తాడని ఆయన ప్రవచించాడు.

గాంధి అనుచరులలో దీన్ని అర్థంచేసుకొన్నవారు బహుకొద్దిమంది మాత్రమే; అర్థంచేసుకొన్నవారిలో దీన్ని మనోవాక్కాయకర్మలలో అనుసరిస్తున్నట్టివారు మరీ తక్కువ. ఇందుకు కాంగ్రెసువాదులను నిందించడం తగదు. గాంధిని ప్రేరేపించిన శక్తులు వారిని ప్రేరేపించలేదు. నైతికశక్తుల ప్రేరేపణతో గాంధి రాజకీయరంగంలో ప్రవేశించాడు. కాగా, ఆయన అనుచరులు దేశభక్తిచే - రాజకీయ స్వాతంత్ర్యకాంక్షచే — ప్రేరేపితులైనవారు.

అయినా, గాంధి నాయకత్వంకింద ఆయన కోరిన కష్టాలను వారు పడినారంటే, ఆయన చెప్పిన త్యాగాలను వారు చేశారంటే, తాము పడుతున్న ప్రతి కష్టం - తాము చేస్తున్న ప్రతి త్యాగం - గాంధి విశ్వవిశాల నైతిక లక్ష్యాన్ని మరింత దగ్గరికి తెస్తున్నదన్న తలంపుతో కాదు; తమ పరిమిత రాజకీయలక్ష్యాన్ని మరికొంత సన్నిహితం చేస్తున్నదన్న ఆశతోనే. దీన్నే మరొక విధంగా కూడా చెప్పవచ్చు. ఆధ్యాత్మికసాధకులుగా (వీరికి మహాత్ముని పేరు,

సత్యాగ్రహులు) కష్టాల కేమి, త్యాగాల కేమి మీరు సన్నద్ధపడండి" అని గాంధి చెప్పగా, కేవలం జాతీయ సైనికులుగా మాత్రమే ఆయన అనుచరులు వాటికి సన్నద్ధపడ్డారు.

ఆధ్యాత్మికసాధకుడు ఆత్మపరిపక్వతను తప్ప అన్యప్రయోజనాన్ని కాంక్షించడు. ఈ అగోచర ప్రయోజనం జాతీయసైనికుని ఎంతమాత్రం సంతృప్తిపరచలేదు. అందువల్లనే గాంధికి, ఆయన అనుచరులకు సమాన లక్ష్యమైన స్వరాజ్యం సిద్ధించగానే, ఆయన వారికి "సాధ్యాసాధ్యాల నెరుగని ఆదర్శవాది" అయినాడు; వీరు ఆయనకు "త్యాగపథాన్ని విస్మరించిన స్వార్థ చింతాపరు" లైనారు. పైగా, ఇక్కడ మరొకటికూడా గమనార్హమైన విషయమే. కాంగ్రెసువాదులుగా అనేక త్యాగాలను చేసినవారు - అష్టకష్టాలను పడినవారు - త్యాగనిరతిలో, కష్టసహిష్ణుతలో స్వభావసిద్ధంగా ఆసక్తికలవారు కాదు. దేశ స్వాతంత్ర్యసాధనకృషిలో కేవల మొక భాగంగా మాత్రమే, సాయుధ సైనికుడు గాయాలను తినడానికి ఆయత్తపడినట్లు, కష్టాలకు, త్యాగాలకు వారు సన్నద్ధులైనారు. సైనికుడు తన గాయాలను ప్రేమించలేనట్టే, వీరు కూడా తమ కష్టాలను, త్యాగాలను ప్రేమించలేకపోయారు. దీని తాత్పర్యం, - ధనం, సుఖం, భోగం మొదలైనవాటికి సంబంధించిన మానవసహజ వాంఛలను వీరు దేశభక్తి ప్రేరేపణ ప్రాబల్యంకొద్దీ తాత్కాలికంగా అణచివేసుకొన్నారుగాని, అసలే చంపివేసుకో లేదన్నమాట.

కోర్కెలను బలాత్కారంగా అణచివేసుకొన్నప్పుడు శతసహస్రోద్వేగంతో అవి పునర్విజృంభించడం కద్దు; ఒక్కొక్కప్పుడు అవి ఎన్నెన్నో వెర్రితలలను వేయడంకూడా కద్దు. దీన్ని కాదనేవారికి ఒక్కటే సమాధానం: "మీరు ఫ్రాయిడ్ పేరైనా వినలేదు". గాంధి అనుచరులైన పెక్కుమందివిషయంలో ఇదివరలో వారు లోలోపల అణచిపెట్టుకొన్నకోర్కెలు వెర్రితలలు వేయడమే ప్రస్తుతం జరుగుతున్నది.

[మే 26, 1949]

కాంగ్రెసు విప్లవస్వరూపం

గాంధి నాయకత్వంకింద భారతీయ జాతీయవిప్లవంలో పాల్గొన్నవారు ప్రధానంగా మధ్యవర్గాలవారే. బానిసత్వం వారికి అతిహేయంగా తోచింది; స్వాతంత్ర్యవిహీనమైన జీవితం వారికి దుస్సహం అనిపించింది. అయితే, వారిని జాతీయసమర సైనికులుగా ప్రేరేపించిన శక్తులు కేవలం ఇవి మాత్రమే కావు. బానిసదేశంలో పరిపూర్ణవికాసానికి వారికి తగు మార్గాలు కానరాలేదు. తమకు విద్యాబుద్ధు లున్నాయి, శక్తిసామర్థ్యా లున్నాయి, ప్రజ్ఞాప్రాభవా లున్నాయి.కాని, వాటి వినియోగానికి, వికాసానికి అవకాశాలే శూన్యం. ఒకవేళ ఏదైనా అవకాశం లభించినా, పరిమితంగానే, సంకుచితంగానే. తాము ఉత్తరువులు పుచ్చుకోవలసిన వారే కాని, వాటి నివ్వగలవారు కాదు; నిర్ణయాలను పాలించవలసినవారే కాని, వాటిని చేయగలవారు కాదు, కూడుగుడ్డలకు లోపం లేకుండా తమ బ్రతుకు వెళ్లమారితే, అక్కడికి అదే పదివేలని సంతోషించవలసినవారే కాని, జీవితభోగాలననుభవించగలవారు కాదు. ఒక్కమాటలో, తాము ఏ సుఖానికీ, ఏ భోగానికీ, ఏ తృప్తికీ అవకాశంలేని నిస్సారపు బ్రతుకు బ్రతకవలసినవారే.

దీనినుంచి విముక్తి సాధనకు ఒక్కటే మార్గం. అది-స్వరాజ్యం. అందువల్లనే పెక్కుమంది మధ్యవర్గాలవారి భావనలో స్వరాజ్యం సుఖజీవనానికి పర్యాయపదమై పోయింది.

మధ్యవర్గాలు సర్వదా తమకు గమ్యంగా పరిగణించే వర్గ మొక్కటే. అది-తమకు ఒక మెట్టు పైగా నిలిచిన వర్గం. ఆ వర్గంలో చేరడానికి తమకు తోడ్పడేవి రెండే సాధనాలు. వీటిలో మొదటిది-పదవి: రెండవది -సంపత్తి.

గాంధి నాయకత్వంకింద మన జాతీయవిప్లవంలో విశేషంగా పాల్గొన్నవారు మధ్యవర్గాల వారేనని, తమకు ఒక మెట్టు పైగా నిలిచిన వర్గమే వారికి సర్వదా గమ్యమని, అందుకు పదవీసంపత్తులే సాధనాలని అంగీకరించినపక్షంలో

1947 ఆగస్టు 15 తర్వాత కాంగ్రెసువారిలో ప్రబలంగా కానవస్తున్న చిత్తవృత్తి, అది ఎంత శోచనీయమైనదైనా, దురూహ్యమైనదిమాత్రం కాదుగదా ?

ఏ విప్లవ ఫలితాలైనా, ఆ విప్లవంలో పాల్గొన్నవర్గం స్వభావంపై ఆధార పడివుంటాయి. బ్రిటన్‌లో క్రామ్‌వెలియన్ విప్లవం మధ్యవర్గ విప్లవం, ఫ్రెంచి మహావిప్లవం కూడా మధ్యవర్గానిదే. ఈ రెండు విప్లవాలతర్వాత అధికారం, ఐశ్వర్యం మధ్యవర్గాల వారిదే అయింది. బ్రిటన్, ఫ్రాన్సులలోవలె అమెరికాలో (జార్జి వాషింగ్టన్ నాయకత్వాన) జరిగిన విప్లవం సయితం మధ్యవర్గ విప్లవ మైనప్పటికీ, అప్పటికి యునైటెడ్ స్టేట్సు జనసంకీర్ణత బహు స్వల్పమైన దేశమై నందున - పోగుజేసుకోగల వారికి పోగుజేసుకోగలిగినంతటి సంపత్తికి అది అవకాశ మిచ్చినందున-ఒక్క మధ్యవర్గంవారు మాత్రమే దానివల్ల బాగుపడ లేదు. అయినా, ఎక్కువ బాగుపడినవారు మాత్రం ముఖ్యంగా మధ్యవర్గంవారే.

ఈ చారిత్రక సంఘటనలదృష్ట్యాకూడా మన దేశంలోని పరిస్థితులు దురూహ్యమైనవి కావు. మన జాతీయవిప్లవం మధ్యవర్గంవారి విప్లవం, దాని విజయం వారి విజయం. అందువల్ల దానినుంచి అధికప్రయోజనం పొందడానికి వారే ప్రయత్నిస్తున్నారు, వారే దాన్ని పొందుతున్నారు.

[మే 27, 1949]

ఆత్మహత్యలు

ఏ పరిస్థితులలోనైనా ఆత్మహత్య శోచనీయం. అది ప్రకృతికి విరుద్ధం. ప్రతి ప్రాణీ జీవించాలనే కోరుతుంది; వీలైనంతకాలం - వీలైనంత సుఖంగా - జీవించాలని కోరుతుంది; జీవించడానికి పరిస్థితులు ప్రతికూలమైనప్పుడుకూడా జీవించగోరుతుంది; జీవితం బాధాకరమైనప్పుడుకూడా జీవించగోరుతుంది. మొండెంగా నిలపబడిన చెట్టు కొత్తరెమ్మలు, కొమ్మలు వేయడం ఈ జీవితేచ్ఛ కారణంగానే. రెండుగా మధ్యకు నరకబడిన వానపాము రెండు వానపాములు కావడం ఈ జీవితేచ్ఛకారణంగానే. క్షయను పోలిన ఘోరవ్యాధి ఒక్క అంగుళం ఊపిరితిత్తిని మిగిల్చినప్పటికీ, ప్రాణాలు బొందిని వీడకపోవడం ఈ జీవితేచ్ఛ కారణంగానే.

నిజానికి జీవితేచ్ఛ లేకపోతే సృష్టి లేదు; స్థితి లేదు; లయంలేదు. దేవత్వానికి అమరత్వం ఒక ప్రధానలక్షణం అకారణంగా కాలేదు. అమరత్వ వాంఛ ప్రతి ప్రాణిలో ఒక మహాశక్తివలె గర్భితమై వుంటుంది. శారీరకంగా అమరత్వం అసాధ్యవిషయం అయినందునే ప్రతివ్యక్తి తన వంశం అంతరించ రాదని కోరుకొంటాడు; అందువల్లనే అమరకీర్తి గడించుకోవాలని అతడు ఆరాటపడతాడు.

వంశాన్ని నిలబెట్టుకోవాలన్న ఆవేదన లేనినాడు సంఘాభ్యున్నతి లేదు. అమరకీర్తి సముపార్జనకై ఆరాటం లేనినాడు కవిత్వం లేదు, కళలు లేవు, శాస్త్రాలు లేవు, విజిగీష లేదు.

నిస్సందేహంగా ఆత్మహత్య ప్రకృతి విరుద్ధం. ఇంతే కాదు. ఆశపై నిరాశకు. మనోదార్ఢ్యంపై మనోదౌర్బల్యానికి, వివేచనాశక్తిపై తాత్కాలిక మౌఢ్యానికి, జీవచ్ఛక్తిపై జడత్వానికి ఆత్మహత్య కేవలం విజయమే:

ఇట్టి ఆత్మహత్య ఏ పరిస్థితులలోనైనా అతి శోచనీయం కాగా, స్వల్ప కారణాలకు జరిగినప్పుడు అది పూర్తిగా గర్హనీయం. ఇట్టి గర్హనీయమైన ఆత్మహత్యా వార్తలే ఇటీవల మన దేశంలో విశేషంగా వినవస్తున్నాయి.

ఉద్యోగం దొరకలేదని ప్రాణం తీసుకొనేవారు కొందరు; ప్రేమించిన పడుచును పెండ్లి చేసుకోలేకపోయినామని ప్రాణం తీసుకొనేవారు కొందరు; పరీక్షలలో తప్పిపోయినామని ప్రాణం తీసుకొనేవారు కొందరు (ఇట్టి ఒక ఆత్మహత్య నిన్ననే బొంబాయిలో జరిగింది); సొంతఖర్చుకు తల్లిదండ్రులు డబ్బులివ్వలేదని ప్రాణం తీసుకొనేవారు కొందరు; భర్త తనను పుట్టింటికి పోనివ్వలేదనో, అత్తమామలు ఈసడించినారనో, జూదంలో డబ్బు పోయిందనో (ఇట్టి ఆత్మహత్య రెండు మూడురోజులనాడు తిరిగి బొంబాయిలోనే జరిగింది), నీచమైనట్టిదిగా తాను భావిస్తున్న ఉద్యోగాన్ని ఉదరపోషణార్థం చేసుకొంటుండగా పరిచయస్థుల కంటబడవలసి వచ్చిందనో (మొన్న బెజవాడలో ఒక యువకుడు ఇందుకే ఆత్మహత్య చేసుకొన్నాడు), కోరిన నగలు అమరలేదనో ప్రాణాలు తీసుకొనేవారు కొందరు. ఇంతటి స్వల్పకారణాలకు ఆత్మహత్యలు జరగడం, పైగా వాటిసంఖ్య నానాటికి పెరుగుతున్నట్లు కానరావడం అత్యంత గర్హనీయం కాదా?

ఆత్మహత్యల సంఖ్య పెరగడం – ఒక జాతి మనోధైర్యాన్ని కోల్పోతున్నదనడానికి, నైతికంగా అది పతనం చెందుతున్నదనడానికి నిదర్శనం. ఆత్మహత్యల సంఖ్య పెరిగిన తర్వాతనే జర్మనీలో నాజీజం ప్రబలింది. ఆత్మహత్యల సంఖ్య ఆదినుంచీ ఎంతో హెచ్చు కనుకనే, జపాన్‌లో ఏనాడూ ప్రజాస్వామ్యం పాదుకొనలేదు.

ప్రతి ఆత్మహత్యను విధిగా ఖండించ నక్కరలేదు. ఉదాహరణకు, ప్రాణరక్షణకంటె మానరక్షణే ముఖ్యమైన పరిస్థితిలో ఆత్మహత్య జరిగితే, దాన్ని ఖండించరాదు. ప్రియునో, ప్రేయసినో కోల్పోయినందువల్ల కలిగిన దుఃఖోద్వేగం ఆత్మహత్యకు కారణమైతే, దాన్ని ఖండించరాదు. చికిత్సలేని దుర్భర వ్యాధిపీడితుడు జీవితాన్ని అంతం చేసుకొంటే, అతడు సానుభూతికే పాత్రుడౌతాడు.

కాని నిరాశ, నిస్పృహ, నిరుద్యోగం, జీవితం అర్థరహితమైనది కావడం, మానసికదౌర్బల్యం - ఇట్టివి ఆత్మహత్యా కారణాలుగా పరిణమించిన దేశం సాంఘిక వ్యవస్థలోనో, దాని సంస్కృతీసభ్యతలలోనో ఏదో లోపం కలదని తీర్మానించుకోవలసి వుంటుంది.

ఇటీవల ఇద్దరు ప్రముఖులు ఆత్మహత్య చేసుకొనేసరికి, తమ సాంఘిక వ్యవస్థలో ఎక్కడ, ఏమి లోపం కలదో తెలుసుకొనడానికి యునైటెడ్ స్టేట్స్ ప్రభుత్వం ఒక విచారణ సంఘాన్ని నియమించాలని ఆలోచిస్తున్నది. ఇట్టి సంఘం మన దేశంలో కూడా అవసరమేమో!

[జూన్ 10, 1949]

నిరశనవ్రతాలు

తపశ్శాలి దూషిస్తే, అది తిరుగులేసి శాపం కావచ్చు. తదితరు లెవరైనా ఆపనిచేస్తే అది నోరు పారవేసుకోవడమే కాగలదు.

ఇదే విధంగా మహామహు దెవడైనా అన్న పానీయాలను ముట్టకపోతే, అది నిరశనవ్రతం; తదితరు లెవరైనా ఆ పని చేస్తే, అది ఆలకకొద్దీ డొక్క ఎండగట్టుకోవడం.

మహత్కార్యసాధనకు మహాత్ముడైన గాంధి నిరశనవ్రతాలను చేస్తుండే వాడు. ఆయనను అన్యవిధాల అనుసరించడం చేతకాకపోయినా, ఆయనవలె నిరాహారదీక్షకు పూనుకొనడం రానురాను ఎక్కువైపోతున్నది.

పుస్తకం చేతబట్టకుండా సంవత్సరం పొడుగునా గాలిగా తిరిగి, సెలెక్షన్ పరీక్షలో తమను డిటెయిన్ చేస్తే, పొట్ట మాడ్చుకొనే విద్యార్థులు కొందరు.

సోమరిగానో, బాధ్యతారహితంగా ప్రవర్తించినందుకు కొలువునుంచి తప్పిస్తే, తిండి తినమనే ఉద్యోగులు కొందరు.

ఆశించిన పదవికి అర్హతలేనందున అది తమకు లభించకపోయినప్పటికీ అన్నంపై అలిగేవారు కొందరు.

నిరశనవ్రతం ప్రారంభించడానికి పూర్వం గాంధి ఎంతో మధనపడేవాడు. ఒక్కొక్కప్పుడు వరసగా కొన్ని నెలలపాటు ఆత్మసంశోధన చేసుకొనేవాడు. అంతర్వాణి ప్రబోధిస్తేనే తప్ప, ఆ తీవ్రచర్యకు గడంగేవాడు కాదు. ఇంత చేసి కూడా, తన నిరశనవ్రతాలలో కొన్ని తొందరపాటుతో కూడినవని ఆయన ఒప్పుకోవలసి వచ్చింది.

నిరశనవ్రతాల విషయంలో ఆయనను అనుసరిస్తున్నామని భ్రమిస్తున్న వారు నిజానికి ఆయన పవిత్రస్మృతికి ఘోరాపచారం చేస్తున్నారు.

ఉదాహరణకు ఒక బొంబాయి సంఘటననే చూడండి: అక్కడ ఒక బడినుంచి ఇద్దరు పంతుళ్లను తీసివేశారట వారిపట్ల సానుభూతిగా వారి తోటి ఉపాధ్యాయులు ఆరుగురు నిరశనవ్రతం ప్రారంభించారట. ఈ చర్య తగదని వారికి నచ్చచెప్పడానికి వారి తోటిఉపాధ్యాయులు మరొక పధ్నాలుగుమంది కూడా నిరాహారవ్రతం మొదలు పెట్టినారట! ఈ తంతు నిరశనదీక్షను కేవలం నగుబాట్లు చేయడమే కాదా?

కొందరు నిరశనదీక్షావలంబన మాత్రమే చాలదన్నట్టు ఆమరణ నిరాహార వ్రతాన్నే ప్రారంభిస్తున్నారు కూడా. కాని చిత్రమేమంటే, ఈ ఆమరణ నిరాహారవ్రతావలంబులలో మరణించినవారు ఇద్దరు, ముగ్గురు తప్ప లేరు. వీరిలో కొందరు ఆమరణ నిరశనవ్రతాన్ని ప్రారంభించడమేమి, దాన్ని విరమించడమేమి ఒక్క పూటలోనే జరిగిపోవడం సయితం కద్దు. నిన్న జయపూర్‌లో అక్షరాల ఇంతే జరిగింది. తమ రాజస్థాన్ ప్రభుత్వంనుంచి అవినీతిని తొలగించి, దాన్ని పునీతం చేయడానికి మహరాజ్ ద్వారకాప్రసాద్ ప్రభుత్వ ప్రధానకార్యాలయం సమ్ముఖంలో నిన్న మధ్యాహ్నం ఆమరణ నిరశనవ్రతాన్ని ప్రారంభించాడు. రాజస్థాన్ హోంశాఖామంత్రి జోక్యం కలిగించు కొనేసరికి నిన్న సాయంత్రానికే ఆయన తన ఆమరణదీక్షను విరమించాడు.

మహరాజ్ ద్వారకాప్రసాద్ చిత్తశుద్ధిని మనం శంకించనక్కర లేదు. విశిష్టలక్ష్య ప్రేరితుడయ్యే ఆమరణనిరశనదీక్షను ఆయన ప్రారంభించి వుండవచ్చు; తన లక్ష్యం నెరవేరనున్నదన్న విశ్వాసంతోనే దాన్ని ఆయన విరమించి వుండవచ్చు. కాని, ఆయన చర్యవల్ల నిరశనవ్రతం మరి కాస్త చౌక కాలేదా అన్నదే మా ప్రశ్న.

"ఉపవాసం" అంటే భగవత్సమీపంలో వాసం చేయడం. ఈ పని చేయగలవారే నిరశనదీక్షకు తగినవారు. అన్యులు దానికి ఉద్యమించడం కొన్ని సందర్భాలలో గర్హనీయం; అన్ని సందర్భాలలోను శోచనీయం.

[జూన్ 26, 1949]

పోలీసు జులుం

అనాగరికం, అమానుషం, అవాచ్యం – ఇవి ఎంతటి తీవ్ర పదాలైనా కావచ్చు. అయినప్పటికీ, కృష్ణాజిల్లా గ్రామాలపై ఇటీవల పోలీసులు జరుపుతున్న దాడుల ఘోరస్వరూపాన్ని ఇవి వర్ణించలేవేమో !

పక్షం రోజులనుంచి ఆ జిల్లాకు చెందిన అనేక గ్రామాలనుంచి ఈ దురంతాల వార్తలు మా కార్యాలయానికి చేరుతున్నాయి. ముందు యలమర్రు నుంచి, తర్వాత కాటూరునుంచి, అటుపిమ్మట పెదసనగల్లునుంచి; పోతే రేపు మరెక్కడనుంచో చెప్పలేము.

ఏ గ్రామంనుంచి వచ్చినా, అది ఒకే విధమైన నికృష్టగాథ. గ్రామస్థులందరినీ ఒకచోట చేర్చడం; చిన్నా పెద్దా లేకుండా, మంచీ చెడ్డా లేకుండా, అందరినీ చావమోదడం; కొందరిని దిగంబరులను చేయడం; దిగంబరులను చేసినవారిని వీధులవెంట తిప్పడం.

ఇంతే కాదు. దీన్ని మించిన మహాపచారం మరొకటికూడా కనీసం ఒక గ్రామంలో జరిగింది. అది – దిగంబరులను చేసినవారితో గాంధి శిలావిగ్రహానికి మొక్కించడం. ఆ మహాత్ముని దివ్యవిగ్రహానికి, ఆ కారుణ్యమూర్తి పవిత్ర స్మృతికి దీన్ని మించిన అగౌరవాన్ని ఊహించగలమా ?

ఇతరులు హద్దుమీరకుండా కాపాడవలసిన పోలీసులే ఇంతగా హద్దుమీరి సంచరించడం మన ప్రభుత్వాని కేమి, ఏ సంస్థ పేరున ఆ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తున్నదో, ఆ కాంగ్రెసుసంస్థ కేమి సిగ్గుచేటుపని కాదా?

కృష్ణాజిల్లాలో కమ్యూనిస్టులు కిరాతకంగా ప్రవర్తిస్తున్నమాట నిజం. వారు దోపిడీలు చేస్తున్నారు; ఖూనీలు చేస్తున్నారు; ఇతర ఘోరకృత్యాలను కొనసాగిస్తున్నారు. ఈ ఘోరకృత్యాలను ప్రభుత్వం నిరోధించితీరాలి; వీటిని కొన

సాగిస్తున్న వారిని హతమార్చితీరాలి. కాని, ఇందుకు మార్గం విచక్షణలేకుండా గ్రామాలపై దాడులు చేయడం కాదు; ఉచితానుచితాలు పాటించకుండా అందరినీ హింసించడం కాదు; కమ్యూనిస్టులే నయమనిపించడం కాదు.

ఇట్టి చర్యలవల్ల కలిగే ఫలితం కమ్యూనిస్టులను అణచివేయడం కాబోదు. అది కాంగ్రెసు సంస్థపై జుగుప్స పుట్టించడమే కాగలదు. ఇందువల్ల కాంగ్రెస్ ప్రభుత్వంపై భక్తిప్రపత్తులు పెరగవు; పోయిన బ్రిటిష్‌రాజ్యమే ఇంతకంటె మెరుగన్న భావం ప్రబలుతుంది.

ఈ ప్రమాదం విషయమై కృష్ణాజిల్లా కాంగ్రెసువాదులే కొందరు హెచ్చరికలు చేశారు కూడా. యలమర్రు గ్రామకాంగ్రెస్ అధ్యక్షుడు ఈ హెచ్చరిక చేశాడు; గుడివాడ తాలూకా కాంగ్రెస్ సంఘాధ్యక్షుడు ఈ హెచ్చరిక చేశాడు; ఒక మాజీ కాంగ్రెస్‌మంత్రి ఈ హెచ్చరిక చేశాడు.

కృష్ణాజిల్లా కాంగ్రెసువాదులే కాక, ఇండియా ప్రధానమంత్రి స్వయంగా ఈ హెచ్చరిక చేశాడు. నిన్న రాష్ట్రీయ ప్రధానుల సభలో ప్రసంగిస్తూ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ "విద్రోహకర చర్యలను కఠినంగా నిరోధించవలసిందే కాని, అనవసరంగా పౌరస్వత్వాలను సంకుచితపరచవద్ద"ని హెచ్చరించాడు.

అయినా, ఈ నాడు కృష్ణాజిల్లాలో కమ్యూనిస్టులను అణచివేసే ప్రయత్నంలో పౌరస్వత్వాలను సంకుచితపరచడం మాత్రమే కాక, భారతీయపౌరులై జన్మించినందుకు లజ్జించవలసిన పరిస్థితులను కల్పిస్తున్నారు.

ఈ ఘోర పరిస్థితులను వెంటనే అరికట్టడం చాలదు; వీటికి బాధ్యులైన వారిని విచారించి, వారిపై తగుచర్య తీసుకోవాలి. ఎక్కడ, ఎప్పుడు, ఎందు నిమిత్తం పోలీసు కాల్పులు జరిగినా, వాటి విషయమై విచారణ జరిపించాలని కాంగ్రెసు అధ్యక్షుడు ఆ మధ్య సూచించాడు. ఈ సూచనను పండిట్ నెహ్రూ తన కలకత్తా ఉపన్యాసంలో బలపరిచాడు. ప్రస్తుతం కృష్ణాజిల్లాలో పోలీసు కాల్పులు జరిగివుండక పోవచ్చు; ఎవ్వరి ప్రాణాలు పోయి వుండకపోవచ్చు,

కాని, ప్రాణాన్ని మించిన మానాన్ని పెక్కుమంది స్త్రీ పురుషులు కోల్పోవలసి వచ్చింది. అందువల్ల విధిగా విచారణ జరగాలి. కమ్యూనిస్టుల ప్రతికూలురముగానే మేము ఈ విచారణ కోరుతున్నాము; కాంగ్రెసు సమర్థకులముగానే మేము ఈ విచారణను కోరుతున్నాము; మద్రాసు ప్రభుత్వం గౌరవ ప్రతిష్ఠలను ఉపలక్షించే మేము ఈ విచారణ కోరుతున్నాము.

[ఇట్టి దౌష్ట్యాలు జరిగి వుండవని, ఇది కమ్యూనిస్టుల దుష్ప్రచారం కావచ్చునని మంత్రి మాధవ్ మీనన్ చెప్పినట్లు ఇప్పుడే తెలిసింది. ఆయన ఊహ సరైనది కాదు. మా కార్యాలయానికి యలమర్రు సంఘటనలను గురించి వ్రాసినవా రందరు కాంగ్రెసువాదులే. ఆ గ్రామానికి స్వయంగా వెళ్లి విచారణ జరిపిన మీదటనే వీరు మాకు వ్రాశారుకూడా.]

[జులై 26, 1949]

ప్రాచ్య, పాశ్చాత్యాలు

ప్రపంచం జనాభా ఇంచుమించుగా రెండు వందల పధ్నాలుగున్నర కోట్లు.

ఈ జనాభాలో సగానికిపైగా ఒక్క ఆసియాఖండంలోనే వున్నది. ఆసియా జనాభా (సోవియట్ రష్యాలో గల ఆసియన్ భూభాగాలలోని ప్రజను కలుపుకొనకపోయినా) నూట పదకొండు కోట్లకు పైగా.

పైగా, ఈ అంకె ఈ నాటిది కాదు; 1939 నాటి నానాజాతిసమితి వార్షిక నివేదికలోనిది. నాటికీ, నేటికీ ఆసియా జనాభా మరింత పెరిగింది. ఒక్క ఇండియాలోనే సాలుకు అరకోటి చొప్పున జనాభా పెరుగుతున్నట్టు అంచనా వేస్తున్నారు. చైనాలో సాలుకు మరొక అరకోటి చొప్పున జనాభా పెరుగుతున్నదట. ఇండియా, చైనాలలోనే కాక, ప్రతి ప్రాచ్యదేశంలోను జననాల సంఖ్య అత్యధికమే. కాగా, పాశ్చాత్యదేశాలలో జననాల సంఖ్య నానాటికి తగ్గిపోతున్నది. ఇందువల్ల ఈనాడు ప్రపంచం జనాభాలో ఆసియావాసుల సంఖ్య మూడింట దాదాపు రెండు వంతులు కావచ్చునేమో !

మానవాళిలో అత్యధికభాగం — మూడింట దాదాపు రెండు వంతులు — ఆసియాకు చెందినదైనప్పటికీ, మిత్రరాజ్య సమితి అంచనాల ప్రకారం 1948వ సంవత్సరానికి ప్రపంచాదాయంలో ఆసియావంతు నూటికి పదకొండు వంతులు మాత్రమే. దీని తాత్పర్యం :— ప్రాచ్యజాతికి చెందిన ఒక వ్యక్తికంటె పాశ్చాత్యజాతికి చెందినవాడు పద్దెనిమిది రెట్లు ఎక్కువ సంపత్తిని అనుభవిస్తున్నాడని. ప్రాచ్యజాతితో పోల్చినప్పుడు పాశ్చాత్యజాతి పొందిన పురోభివృద్ధిలే కాక, దీనిపట్ల అది చేసిన ఘోరాన్యాయానికి కూడా ఇది తార్కాణమే.

ఇంచుమించు నాలుగైదు వందల సంవత్సరాలక్రితంవరకు ప్రపంచాదాయంలో అధిక భాగం ప్రాచ్యజాతిదే. అటు తర్వాత ఈ పరిస్థితి తారుమారు కావడానికి ఒక ముఖ్యకారణం — సంతృప్తి. ప్రాచ్యజాతిసంపత్తి దానికి సంతృప్తి కలి

గించింది. శారీరక సౌఖ్యాలవిషయమై, ప్రాపంచిక భోగాలవిషయమై సంతృప్తి అభిలషించదగిందే, హర్షించదగిందే. లేకపోతే. మానవ జీవితం తీరని ఆకలిగా - ఉడగని దాహంగా—ఆరని మంటగా—వ్యథాభరితమై పోతుంది. కాని, బహుముఖమైన జీవితరంగంమొత్తానికే సంతృప్తి ప్రాతిపదిక కారాదు. ఇది అలసత్వానికి ఆహ్వానం, అహంకారానికి పట్టాభిషేకం, సంశోధనకు సెలవు చీటీ, సాహసానికి స్వస్తి, ప్రగతికి వజ్రాఘాతం, ప్రాభవానికి విడాకులు. ఒక విషవ్యాధివలె ప్రాచ్యజాతి ప్రతి రక్తాణువులోను జీతించిపోయిన సంతృప్తే దాని పతనానికి దారితీసింది.

నల్లమందువలె సంతృప్తి ప్రాచ్యజాతిని నిద్రపుచ్చిన సమయానికే కోడి కూతవలె అసంతృప్తి పాశ్చాత్యజాతిని జాగరితం చేసింది. నాలుగైదు వందల సంవత్సరాలనాడు పాశ్చాత్యజాతిని ఆవహించిన ఈ అసంతృప్తే ఒక బేకన్, ఒక లవాజే, ఒక న్యూటన్, ఒక ఫారడే, ఒక మదాం కూరీ, ఒక రూథర్ ఫర్డ్ రూపాన్ని ధరించి, ఆధునిక వైజ్ఞానికశాస్త్రాలను సృజించింది.

ఈ అసంతృప్తే ఒక స్టీవెన్‌సన్, ఒక ఎడిసన్, ఒక రైట్ సోదర ద్వయం, ఒక మార్కోని రూపాన్ని ధరించి, వైజ్ఞానిక శాస్త్రాలను మానవాళికి సౌఖ్యసాధకాలుగా పరిణమింపజేసింది.

ఈ అసంతృప్తే ఒక కొలంబస్, ఒక వాస్కోడగామా, ఒక కుక్, ఒక లివింగ్‌స్టన్ రూపాన్నిధరించి, భూమండలం స్వరూపాన్ని ఆధునిక మానవునికి తెలియజెప్పింది.

ఈ అసంతృప్తే ఒక ఎలిజబెత్, ఒక పిట్, ఒక ఫ్రెడరిక్, ఒక పీటర్, ఒక మాకియవిలీ, ఒక నెపోలియన్, ఒక వాషింగ్టన్, ఒక గారిబాల్డీ, ఒక బిస్మార్క్ రూపాన్నిధరించి, పాశ్చాత్య ప్రాగల్భ్యసౌధాన్ని నిర్మించింది.

ఈ అసంతృప్తే ఒక షేక్స్‌పియర్, ఒక మోలియర్, ఒక షెల్లీ, ఒక ఇబ్సెన్, ఒక స్ట్రిండ్‌బర్గ్, ఒక గొథే, ఒక టాల్‌స్టాయ్ రూపాన్ని ధరించి, పాశ్చాత్య సాహిత్యానికి ప్రపంచగౌరవం కూర్చింది.

ఇదే విల్బర్‌ఫోర్స్, వాల్టేర్, రూసో, దిదిరో, లింకన్ మొదలైనవారి రూపాన్ని ధరించి, పాశ్చాత్య సంస్కృతికి విశిష్టతను కూర్చింది కూడా.

పాశ్చాత్యజాతిని ఇన్ని విధాలుగా మహోచ్ఛస్థితికి తెచ్చిన అసంతృప్తే డూప్లే, క్లైవ్ మున్నగువారిని సృజించి ప్రాచ్యజాతిని దాస్యానికీ, దైన్యానికీ లోనుజేసింది.

పాశ్చాత్యజాతి కళ్లలో వెలుతురుతో పాటు, దాని గోళ్లకు రక్తం జీర లున్నాయి. పాశ్చాత్యజాతి నడకలో ఊపు వున్నది కాని, అది వేసుకొన్నవి మేకుల బూట్లు.

దాని గోళ్ళనుంచి కారుతున్న రక్తం ఒక్క ప్రాచ్యజాతిదే కాదు; అమెరికన్ రెడ్ ఇండియనులదీ, ఆఫ్రికన్ నీగ్రోలదీ, ఆస్ట్రేలియన్ బుష్ మెన్‌లదీ కూడా. దాని మేకుల బూట్లకింద ప్రాచ్యజాతికంటె మిన్నగా అమెరికన్, ఆఫ్రికన్, ఆస్ట్రేలియన్ ఆదివాసులే నలిగిపోయారు.

పరపీడనను స్వీయోన్నతికి ఒక ప్రాపుగా చేసుకొన్నందునే పాశ్చాత్య జాతి గతించిన అర్ధ శతాబ్దంలో రెండు ప్రపంచయుద్ధాలలో చిక్కుకొనవలసి వచ్చింది. ఇందువల్లనే అది మానవజాతి స్వరూపనాశనానికే కారణభూతం కాగలదేమోనన్న మూడవ ప్రపంచయుద్ధానికి సన్నద్ధపడుతున్నది.

ఈ పరిస్థితిలో మానవకోటికి రక్షణమార్గం ఒక్కటే. అది — ప్రపంచా దాయం పంపకంలో ప్రస్తుతం వున్న విపరీతపు వ్యత్యాసాన్ని తొలగించడమే. ప్రపంచాదాయం పంపకం అన్నప్పుడు, కేవలం రూకల పంపకమని భావించ రాదు. ఆరోగ్యం, ఆయుస్సు, శాంతి, సుభిక్షం, ప్రగతి, ప్రాభవం - సమస్తం దీనిలో గర్భితమై వున్నాయి.

[జులై 31, 1949]

కుంటిసాకులు

"మనది మతాల ప్రసక్తిలేని సెక్యులర్ రాజ్యం. హిందూ ధర్మశాస్త్ర సంస్కరణకు మన ప్రభుత్వం ఉద్యమించడం ఈ సెక్యులర్‌రాజ్య లక్ష్యానికే పూర్తిగా విరుద్ధం."

"మన ఎన్నికల ప్రణాళికలో సంఘసంస్కరణను మనం ప్రత్యేకించి పేర్కొనలేదు. అందువల్ల ప్రజల సమ్మతిని విస్పష్టంగా పొందనిదే హిందూ ధర్మశాస్త్ర సంస్కరణకు పూనుకోరాదు."

"హిందూ సాంఘికవ్యవస్థ - విశేషించి, సమష్టికుటుంబపద్ధతి - సర్వోత్కృష్టమైనది. దాన్ని సంస్కరించగోరడమే మహాపరాధం."

డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారి సమేతంగా, హిందూ ధర్మశాస్త్ర క్రోడీకరణ బిల్లును ఇండియన్ యూనియన్ పార్లమెంటులో ప్రతిఘటిస్తున్న పెద్దలు నిన్న, మొన్న పేర్కొన్న ప్రధానమైన అభ్యంతరాలివే.

సెక్యులర్ రాజ్యం "నీవు ఈ దేవునే ఆరాధించు, ఆ దేవుని ఆరాధించవద్దు" అని చెప్పరాదు. "దైవారాధన ఈ పద్ధతిలోనే జరగాలి, మరొక పద్ధతి తగదు" అని శాసించరాదు. అంతే కాని, సంఘసంస్కరణతో సయితం ప్రసక్తి పెట్టుకొనరాదనడం భావ్యమా ?

సంఘసంస్కరణతో సెక్యులర్‌రాజ్యానికి ఎంతమాత్రం నిమిత్తమే కూడదని ఈనాడు వాదిస్తున్నవారే అస్పృశ్యతానిర్మూలనను ఎందుకు సమర్థించారు ? అంటరానివారికి దేవాలయ ప్రవేశార్హతను ఎందుకు కల్పించారు ? అస్పృశ్యత హిందూమతంలో ఒక భాగం కాదనడం వీరి నమ్మకం కావచ్చు. కాని, అది హిందూమతంలో ఒక భాగమని, ఒక ప్రధాన భాగమని, వీరు నేడు ఏకరవు

పెడుతున్న కొన్ని స్మృతులే ఘోషిస్తున్నవి కదా? అస్పృశ్యత తమ మతంలో ఒక భాగమని హిందూవులలో పెక్కుమంది ఈనాటికీ దృఢంగా విశ్వసిస్తున్నారు గదా?

పోతే, ఇప్పుడు ఈ సెక్యులర్‌రాజ్యం వాదాన్ని లేవనెత్తిన పెద్దలే మద్యనిషేధాన్ని ఎందుకు సమర్థించారు? మద్యం దేవతల పానీయమని (సోమ రసమని), అది దేవతలకు అత్యంత ప్రీతికరమైనదని హిందువుల దృష్టిలో అపౌరుషేయాలైన వేదాలు వేనోళ్ల ఉగ్గడిస్తున్నవికదా? శాక్తేయులైనవారిలో కొందరికి సురలేనిదే దేవతాపూజ జరగదుకదా? అయినప్పుడు మద్యపాన నిషేధాన్ని ప్రవేశపెట్టడం మతస్వాతంత్ర్యానికి భంగం కలిగించడం తప్ప అన్యం కాగలదా?

పోతే, కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికలో పేర్కొనడం జరగలేదు కనుక, హిందూధర్మశాస్త్ర సంస్కరణకు ఇప్పటి పార్లమెంటుకు హక్కు లేదనడం కూడా పరిశీలనకు నిలవలేని వాదమే.

కొన్ని తరాలవరకు-బహుశా కొన్ని శతాబ్దాలవరకే-మన జీవితక్రమాన్ని, నూతన రాజ్యాంగ విధానాన్ని రూపొందించడం ద్వారా, మన ఇప్పటి పార్లమెంటు (రాజ్యాంగ పరిషత్తు రూపంతో) నిర్ణయించివేసింది. ఇట్టి సర్వసత్తాక సంస్థకు సంఘసంస్కరణకు హక్కులేదనడం పొడికాగలదా? ఇక, హిందూసాంఘిక వ్యవస్థ సర్వోత్కృష్టమైన దనడం, దాన్ని సంస్కరించడానికి యత్నించడం మహాపచారంకాగల దనడం అర్థంలేని మాట. ఈ ధోరణిలో మాట్లాడుతున్న వారు రాజా రామమోహన్‌ రాయ్‌ని నిరసిస్తున్నారనే చెప్పవచ్చు; దయానంద సరస్వతిని నిందిస్తున్నారనే చెప్పవచ్చు; ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌ను ధిక్ అంటున్నారనే చెప్పవచ్చు; వీరేశలింగాన్ని తెగనాడుతున్నారనే చెప్పవచ్చు; హరవిలాస్ శారదాను తూలనాడుతున్నారనే చెప్పవచ్చు; చివరికి గాంధీనే ధర్మభ్రష్టునిగా భావిస్తున్నారని చెప్పవచ్చు.

ఈనాటి హిందూసాంఘిక వ్యవస్థలోని క్రౌర్యానికి, కర్కశత్వానికి ఒక ఉదాహరణే చాలు అది, - అంటరానితనం. పార్లమెంటులో హిందూధర్మశాస్త్ర సంస్కరణను ప్రతిఘటిస్తున్నవారు సయితం అంటరానితనాన్ని బహుశా

సమర్థించబోరు. కాని, హిందూ సమష్టికుటుంబం వైశిష్ట్యాన్ని గురించి, హిందూ సాంఘికవ్యవస్థలోని సోషలిజాన్ని గురించి వీరు కేవలం కవిత్వాన్నే చెబుతున్నారు. వీరికి మేము కొన్ని ప్రశ్నలు వేయగోరుతున్నాము.

ఏ దేశచరిత్రను పరికించినా, సమష్టికుటుంబపద్ధతి ఫ్యూడల్ వ్యవస్థకు ప్రాతిపదికగానున్నట్టు కానరాదా ? మీరు ఏ దేశచరిత్రను చదవలేదా? లేక, ప్రజాస్వామ్యంపట్ల పైకి భక్తిశ్రద్ధలను ప్రదర్శిస్తూ, ఫ్యూడల్ వ్యవస్థనే నిలపాలని మీరు ఉద్దేశిస్తున్నారా ? కొందరికి చదువును, మరికొందరికి ఊడిగాన్ని, వేరొక కొందరికి కుక్కలకంటె హీనమైన బ్రతుకును ప్రజాస్వామ్యంపేరుతో మీరు స్థిరపరచగోరుతున్నారా ?

జీవితరంగాలలో కొన్నింటిలోనే ముందడుగు వేసి, మిగిలినవాటిలో అంగుళమైనా ముందుకు సాగలేని అపరిపక్వ మనఃప్రవృత్తే ఇప్పటి ప్రతి ఘటనకు కారణం. దీన్ని కప్పిపుచ్చుకొనడానికి గొప్పగా ధ్వనించే ఏయే సాకులను వెదికినా, అవి సారంలేని కుంటిసాకులే.

[డిశెంబర్ 15, 1949]

మేధ, హృదయం

"మీ భావికార్యక్రమ మేమిటి ?": గవర్నర్-జనరల్ పదవినుంచి విరమించిన చక్రవర్తి రాజగోపాలాచారిని* ప్రతివారు వేయగోరుతున్న ఈ ప్రశ్ననే నిన్న ఆయన మద్రాసు చేరినంతనే పత్రికావిలేకరులు వేశారు,

జవసత్వాలుడిగినవాడు కాకపోయినా, ఆయన వయోవృద్ధుడు. రాజ్యాంగ చట్టానికి లోబడే కావచ్చు, లాంఛనప్రాయంగానే కావచ్చు, ఏమైనా రాజ్యాధిపతి ("హెడ్ ఆఫ్ స్టేట్") పదవిని నిర్వహించి, దానినుంచి విరమించాడు. ఈ పరిస్థితులలో మరొక రుంటే "మరి విశ్రాంతి పుచ్చుకోగలడు" అని తీర్మానించుకొనడమే సహజంగా జరిగేది.

కాని, రాజాజీ మరొకరివంటివాడు కాదు. కోరినా, విశ్రాంతి గైకొనలేనట్టిది ఆయన ప్రవృత్తి. ఇదివరలో రెండు, మూడుసార్లు రాజకీయాలనుంచి విరమిస్తున్నానని ఆయన ప్రకటించాడు. భగవన్నామస్మరణతో జీవితశేషాన్ని గడపనున్నట్టుగా ఆయన సూచించాడు. కాని, ప్రతి ఒక్కసారి ఈ నిర్ణయం సడలిపోవడానికి ఎంతోకాలం పట్టలేదు.

జీవితసమరాంగణంలో పోరు ముమ్మరంగా సాగుతున్నచోట నిలవలేకపోతే, కొందరికి జీవితమే లేదు. అట్టివారిలో రాజాజీ మిన్నగా ఎన్నదగువాడు. అందువల్లనే ఆయనవిషయంలో "మీ భావికార్యక్రమ మేమిటి ?" అనే ప్రశ్న అందరికీ అప్రయత్నంగా తోస్తున్నది.

ఢిల్లీలో జరిగిన ఒక వీడ్కోలు సభలో ప్రసంగిస్తూ, తన మహోదాత్తతకారణంగా జవహర్‌లాల్ నెహ్రూ భారతప్రజలకు ప్రేమపాత్రుడౌతున్నా

* [1879 - 1972]

దని రాజాజీ పేర్కొన్నాడు. తన కార్యదక్షతమూలంగా వల్లభ్‌భాయ్ పటేల్ విశ్వాసపాత్రు డౌతున్నాడని కూడా రాజాజీ అదే సందర్భంలో వక్కాణించాడు. ఇదే ధోరణిలో చెప్పగోరితే, తన మేధవల్ల రాజాజీ గౌరవపాత్రు డౌతున్నాడని మనం అనవచ్చు.

మహోదాత్తత హృదయానికి సంబంధించినవిషయం కాని, మేధకు సంబంధించినట్టిది కాదు. రాజాజీ మేధావి ఆయనకు హృదయం లేదనము. కాని, ప్రతి మేధావంతునివలె ఆయన తన హృదయాన్ని కళ్ళెంలేని గుర్రంవలె త్రుళ్ళింత లాడనివ్వడు. అది మేధకు లోబడవలసిందే, అది చెప్పినట్టు నడవ వలసిందే. మేధ కట్టుదిట్టాలకు ఇంతగా హృదయాన్ని లోబడజేసినందునే కొన్ని కొన్ని ఘట్టాలలో హృదయంలేనివానివలె రాజాజీ కనిపించడం !

మేధ కొరవడిన వ్యక్తి కార్యదక్షుడు కాలేడు. కాని, ప్రతి మేధావి కార్య దక్షుడు కాడు. నిజానికి ఎక్కువ మేధాశక్తి కార్యదక్షతకు అడ్డు వస్తుంది. వేయవలసిన ముందుకెత్తులు కనీసం రెండు, మూడైనా తెలియనిదే వ్యవహర్తగా రాణించడం కష్టం. కాని, అంతకుమించి వెళ్లితేమాత్రం, వ్యవహర్త చూపవలసిన తెగింపుచూపడం సామాన్యంగా జరగదు. అందువల్లనే అత్యధిక మేధాసంపన్ను లైనవారు తెగువగా ఏ పనీ చేయలేరు.

మేధ పదునైన కత్తి. ఎంత మెలకువగా వినియోగించినా, అది తగల రానిచోట తగలడం కద్దు. అందువల్ల మేధావి చిరమైత్రిని సాధించడం చాలా చెదురు, స్థిరవిశ్వాసాన్ని పొందడం బహు అరుదు.

మేధ ఎక్స్‌రేను పోలింది కూడా. దాని పరీక్షకు లోనైన వ్యక్తి తన అంతరంగమే నగ్నం చేయబడుతున్నట్టు ఒకవిధమైన లజ్జాభయాలకు లోను గావడం కద్దు. ఇందువల్లకూడా అశేష మేధావంతుడు సామాన్య శక్తిసంపన్ను లను, వారి శక్తియుక్తులకు తగినట్టు, తన కార్యసాధనకై వినియోగించుకొన గలగడం కష్టం.

ఎంత గౌరవభాజనుడైనా ప్రజల ప్రేమవిశ్వాసాలను విశేషంగా చూర గొనలేనివాడు కనుకనే, రాజాజీ తమిళనాడు నాయకత్వాన్ని కోల్పోయాడు.

ఇందువల్లనే ఆయన మద్రాసు ప్రధానిగా ఆశించినంతగా రాణించలేదు. కాని, బెంగాల్ గవర్నర్‌గా, ఇండియా గవర్నర్ - జనరల్‌గా ఆయన అందరి మన్ననలను పొందగలిగాడు. ఈ రెండు ఉన్నతపదవుల నిర్వహణలో ఆయన వహించినపాత్ర - గాంధి జీవితకాలంలో వహించినట్టిదే సలహాలు చెప్పి, చిక్కులను విడదీయడమే ఈ పాత్ర. ఇదే మేధావికి తగు పాత్ర.

గవర్నర్- జనరల్ పదవినుంచి విరమించినా, రాజాజీ సలహాలు తమకు యథాప్రకారం లభించగలవనే జవహర్‌లాల్ నెహ్రూ ఢిల్లీ వీడ్కోలు సభలో ఆశించాడు. ఇదే మనందరి ఆశ కూడా.

[జనవరి 29, 1950]

అడవులు

అడవుల విషయమై సర్దార్ పటేల్ చేసిన హెచ్చరికను (దీన్ని నిన్న ప్రచురించాము) "ఏదో అడవి గోల" మనకు దేనికి లెండి! అని నిర్లక్ష్యం చేస్తే దేశానికి ముప్పు తప్పదు.

అడవులను చూచినవారు మనలో బహు కొద్దిమంది. వాటిలో పిచ్చిచెట్లు, యెచ్చిచెట్లు చిక్కురొక్కురుగా పెరిగివుంటాయి. వాటిలో దారీడొంకా వుండదు. పులులు, సింహాలు, ఎలుగులు, ఏనుగులు, నక్కలు, తోడేళ్లు, కోతులు, కొండముచ్చులు వగైరాలు వాటిలో తిరుగుతూవుంటాయి. కోయలు, చెంచులు మొదలైనవారికి అవి నివాసాలు. వారికి పుట్టతేనె, వెదురుబియ్యం, రేగుపళ్లు, నెమలికళ్లు కొల్లలుగా దొరుకుతూవుంటాయి - ఇంతే అడవులనుగురించి బహు జనాభిప్రాయం.

అడవులనుగురించి, వాటి ప్రాముఖ్యాన్నిగురించి అంతగా తెలియనందు వల్లనే, మన జనాభా చకచక పెరిగిపోతున్నదని, జనాభాతోపాటు పంటలు పెరగడం లేదని హెచ్చరించినంతనే "కొండలను పిండి చేస్తాము, అడవులను నరికి వేస్తాము. ఇంతకు మరింత సాగు చేస్తాము, మన రైతు మహారాజు బాగుండాలే కాని, మనకు కూడు తక్కువౌతుందా!" అని కొందరనడం కద్దు.

ఈ మాటలు వింటుంటే వొళ్లు పొంగి, వారికి నివ్వాళి యెత్తాలని అనిపిస్తుంది. కాని, వారిని తమ ప్రతాపం చూపనిస్తే, ఒక చిన్న చిక్కు వచ్చి పడుతుంది. కొండలను పిండి చేసిన వెనక, అడవులను నరికివేసిన తర్వాత, కోరినంత కొండ్రను సాగుచేసుకోవచ్చుగాని, చల్లినవిత్తు మొలవడానికీ, నాటిన మొక్క బ్రతకడానికీ వానలే కరువౌతాయి. ఇది జరిగిననాడు కొత్తపొలంతోపాటు పాతదికూడా పండేది చవుడు మాత్రమే.

ఇప్పటికే మనకు వానలు అంతంత మాత్రంగా వున్నాయి. అయితే అతి వృష్టి, లేకపోతే అనావృష్టి. "ఉత్తర చూచి ఎత్తరగంప", "మృగశిర ఉరిమితే, ముసలెద్దు రంకె వేస్తుంది", "మఖలో కురిస్తే, మడుపుమీది గింజైనా మొలుస్తుంది". మొదలైన సామెతలు ఈనాడు చాలావరకు అబద్ధాలై పోతున్నాయి. ఇప్పుడున్న అడవులనుకూడా కొట్టివేస్తే, వర్షాకాలంనుంచి వేసవి, శీతాకాలాలు చెరొక రెండు నెలలు పంచివేసుకోగలవు.

రాజులు వేటకు వెళ్లడానికే కాక, వానలు సరిగా కురవడానికి కూడా అడవులు కావాలి. అడవులగుండా వెడుతున్నప్పుడు అవి మన కిచ్చే చల్లదనాన్నే వాటిపైగా వెడుతున్నప్పుడు మబ్బులకు అడవు లిస్తాయి. ఇట్టి చల్లదనం లేకపోతే, వాన చినుకైనా రాలదు.

ఇది నూరేళ్ల ఈలోపల ఒకసారి యునైటెడ్ స్టేట్స్‌కు పూర్తిగా ఆకళింపుకు వచ్చింది. ఎకరానికి నాలు గెకరాలు సాగు చెయ్యాలని కొన్ని పరగణాలలో పేరుకైనా మిగలకుండా అడవులను తుడిచిపెట్టేసరికి ఆ పరగణాలు ఎడారులై పోయాయి. నేలలో జిగి చప్పగా చచ్చిపోగా. అక్కడ రేగడం మొదలుపెట్టిన దుమ్ముకు తట్టుకోలేక, పల్లెలను విడిచిపెట్టి, కొంపలను పాడుపెట్టి, ఆ పరగణాలనుంచి లేచిపోవలసివచ్చిందికూడా, అవి తిరిగి నివాసయోగ్యమైంది నదులకు ఆనకట్టలు కట్టి, నేలను నీటితో ముంచెత్తి, ఒండును పేరుకొననిచ్చి, విరివిగా చెట్టుచేమలను నాటి, వాటిని ఏపుగా పెరగనిచ్చినమీదటనే.

చెట్టుచేమలు కేవలం వానలు సరిగా కురవడానికే కాక, వరదల తీవ్రతను ఆపడానికీ, నేల కోసుకుపోకుండా అరికట్టడానికీ ముఖ్యావసరమే. అయినా, మన అడవులు అంతకంతకు తరిగిపోతున్నాయి సరిగదా, పచ్చపచ్చగా వుండే పల్లెపట్టులుకూడా తమ పచ్చతనాన్ని నెమ్మది నెమ్మదిగా కోల్పోతున్నాయి.

ఇప్పుడు మన దేశంలోగల అడవుల విస్తీర్ణం 1,71,000 చదరపు మైళ్ళు మాత్రం. ఇది చాలదు. ఈ విస్తీర్ణం కనీసం 2,50,000 చదరపు మైళ్లవరకైనా పెరగాలి. ఇందుకు మారుగా ఇప్పటి అడవులనే నరికివేసుకోవడం జరుగుతున్నది. ఇది చేటుతెచ్చే పని.

అడవులను ముట్టుకొనవడమే జరగరాదని ఎవ్వరూ చెప్పరు. వెదురు కోసం, కలపకోసం, వంటచెరకుకోసం అడవులను నరకవలసిందే. అడవుల ద్వారా, సంస్థానాలను విడిచిపుచ్చగా, మన రాష్ట్రంలోనే మనకు ప్రస్తుతం సాలుకు పదిన్నర కోట్ల మేరకు ఆదాయం వస్తున్నది. ఈ ఆదాయాన్ని మనం పోగొట్టుకోరాదు. పైపెచ్చు, మున్ముందు దీన్ని మరింత పెంచుకోవాలి.

అయితే, ఒకసారి అడవిని నరికివేసినతర్వాత అది తిరిగి పెరిగి రావడానికి ఒక తరం పడుతుంది. "ఈ పంట పోతే, మరి మూడు నెలలకో, ఆరు నెలలకో మరొక పంట" అని అడవుల విషయంలో అనుకోడానికి వీలు లేదు. అందువల్ల అడవులను చిత్తం వచ్చినట్టుకాక, క్రమబద్ధంగా వినియోగించుకోవాలి. ఒక మొక్కను నరికితే, దానిస్థానంలో రెండింటిని నాటాలి.

సర్దార్ పటేల్ చేసింది ఈ హితబోధనే. ఈ ''అడవిగోల''ను మనం పట్టించు కొనకపోతే, జ్యేష్ఠాదేవి మన గోలను తప్పక పట్టించుకొంటుంది.

[ఏప్రిల్ 5, 1950]

ప్రజల సహనం

"తమ తమ నెలవులు తప్పిన తమ మిత్రులె శత్రులౌట" మాత్రమే కాక, తమ పలుకులు హాస్యాస్పదం కావడంకూడా తథ్యమే.

చుంకింగ్‌లో ప్రవాసిగానున్న రోజులలో తాను నాన్‌కింగ్‌కు తిరిగి వెళ్లనున్నానని మార్షల్ చాంగ్ కై - షేక్ చెప్పగా, దాన్ని ధీరోదాత్తుని ధీర వచనంగా లోకం పరిగణించింది. ఆయనే ఈనాడు ఫార్మోజానుంచి "నాలుగేళ్లలో నాన్‌కింగ్‌కు తిరిగి వెళ్లగల"ననే సరికి "లేస్తే మనిషిని కా" నన్న సుంకర కొండాయ చప్పున జ్ఞప్తికి వస్తున్నాడు.

తనపై కొండంతగా ఆశలు పెట్టుకొన్న వారికి అప్పటికే ఎన్ని విషయాల లోనో ఆశాభంగాన్ని కలిగించినా, చుంకింగ్‌లో ప్రవాసిగానున్న రోజులలో మార్షల్ చాంగ్ చైనాకు అగ్రనాయకుడే. చివరికి కమ్యూనిస్టులైనా అప్పటిలో ఆయనను త్రోసివేయగల స్థితిలో లేరు.

చాంగ్ ప్రభుత్వం ఎన్ని అవకతవకలు చేసినా, లేక ఎంతటి అన్యాయాలకు ఒడిగట్టినా, అప్పటిలో వాటిని ఆయన తాబేదారులకే అంటగట్టేవారు. చాంగ్ స్వయంగానే తప్పుదారిని పోతున్నట్టు కనబడినప్పుడుకూడా చెడుగు సలహాదారులే ఆయనను తప్పుదారిని పెడుతున్నట్టు సంభావించేవారు. పట్టిన దుష్టగ్రహాలు వీడినంతనే తమ జనరలిజ్మో కేవలం పేరుకే కాక, నిజంగా జనరలిజ్మో కాగలడని విశ్వసిస్తుండేవారు.

జపాన్‌పై విజయాన్ని సాధించినపిమ్మటనే, మార్షల్ చాంగ్ చెప్పినట్టు నాన్‌కింగ్‌కు ఆయన ప్రభుత్వం తిరిగి చేరుకొన గలిగినమీదటనే, ఈ ఆశ లన్నీ పటాపంచలై పోయాయి; ఈ విశ్వాసా లన్నీ వమ్మైపోయాయి. చిరకాలం కంటిని కప్పివున్న ఏదో ఒక తెర హఠాత్తుగా తొలగిపోయింది; చాంగ్ - కై షేక్ ఒక మహాపురుషునివలె కాక, ఒక దిష్టిబొమ్మవలె కనబడ నారంభించాడు. కమ్యూ

నిస్తుల సాయుధ బలాలకంటె మిన్నగా చైనీస్ ప్రజలకు కలిగిన ఈ కనువిప్పే చాంగ్ పరాజయానికి ముఖ్యకారణం.

ప్రభుత్వంలో అసమర్థతపట్ల, అవినీతిపట్ల బంధుప్రీతిపట్ల, నిరంకుశత్వం పట్ల ప్రజాసహనం ఇంతంత కానట్టుగా సర్వసాధారణంగా తోస్తుంది. కాని, అంతులేనిదిగా తోచే ఈ సహనమే ఏదో ఒక ఘట్టంలో ఆకస్మికంగా - తలవని తలంపుగా - అంతమైపోతుంది. ఆదిసహనం ఎంత ఆశ్చర్యకరమో, పిమ్మటి సహనాంతంకూడా అంత విస్మయకరమే! చైనీస్ ప్రజాకోటి మనస్తత్వంలో వచ్చిన ఈ విస్మయకర పరిణామమే, చైనా నడిగడ్డపై మరి నిలవలేక, చాంగ్ కై - షేక్ ఫార్మోజాకు తరలిపోవడానికి కారణం.

అయితే, ఈ నాటికైనా చాంగ్ ప్రవృత్తిలో ఎన్నదగు మార్పు వచ్చి నట్టు కనబడదు. ఇప్పటికీ ఆయన కళ్ళు మూసుకొన్నట్టే నడుచుకొంటున్నాడు. చైనాకు మార్షల్ చాంగ్ ఒక నూతన రాజ్యాంగవిధానాన్ని, దానికి లోబడి ఒక నేషనల్ అసెంబ్లీని ఏర్పాటు చేశాడు. ఈ అసెంబ్లీ సభ్యులు మొత్తం 3,045 మంది. వారు సమావేశం కావలసింది ఆరేళ్ల కొకసారి మాత్రం. దీన్నిబట్టే చైనాకు ఎట్టి ప్రజాస్వామ్యప్రభుత్వాన్ని చాంగ్ ప్రసాదించాడో సువిదితం.

జాతీయంగా మహాక్లిష్టపరిస్థితు లేర్పడినప్పుడు నేషనల్ అసెంబ్లీ సమావేశాన్ని ఆరేళ్లలోపునే జరపవచ్చునని రాజ్యాంగవిధానంలో ఒక సూత్రం కలదట. దీనిప్రకారం ఫార్మోజాలో నేషనల్ అసెంబ్లీ సమావేశం జరగనున్నట్టు చాంగ్ ప్రకటించాడట. అయితే, అసెంబ్లీ సభ్యులలో 1,090 మంది మాత్రమే ప్రస్తుతం ఫార్మోజాలో వున్నారట. చైనా నడిగడ్డపై నిలచిన తక్కిన సభ్యులకు మీటింగ్ నోటీసులు అందగల దారి లేదట. అయినా, కోరం చాల లేదన్న సాకుపై అసెంబ్లీ సమావేశాన్ని చాంగ్ వాయిదా వేశాడట!!

ఇంత విడ్డూరంగా ప్రవర్తించే ఈ ప్రబుద్ధుడు దేశాధిపతిగా తిరిగి నాలుగేండ్లకు కాదు, నలభై యేళ్లకైనా నాన్‌కింగ్‌లో ప్రవేశించగలడా? ఒకవేళ ప్రవేశించడమే సంభవిస్తే, అదిఅమెరికన్ బాయొనెట్లు తనకు చేయగల దారివెంటనే, స్వదేశస్థుల శవాల కుప్పలపైగానే!

[సెప్టెంబర్ 7, 1950]

ఆధునిక ఋషి

నోబెల్ బహుమానాన్ని తన కిచ్చినప్పుడు "పోయిన యేడాది నే నొక్క పుస్తకమైనా వ్రాసిన పాపాన పోలేదు. చూడగా నేను నోరు కట్టివేసుకొనడమే లోకానికి మహోపకారమైనట్టు భావిస్తున్నట్టున్నారు. నాకు మీ బహుమానం వద్దు పొండి" అని జార్జి బెర్నార్డ్ షా అన్నాడు. మిత్రుల ప్రోద్బలంపై చివరికి ఆ బహుమానం మొత్తాన్ని (ఇంచుమించు లక్షన్నర రూపాయలు) పుచ్చుకొన్నా, దాన్ని బ్రిటన్, స్వీడన్‌లమధ్య సాంస్కృతిక సంబంధాలను పెంపొందించడానికి వినియోగించవలసిందిగా ఆయన తిరిగి యిచ్చివేశాడు.

"ఏనాడో నాకు జరగవలసిన ఈ గౌరవాన్ని ఈనాడా జరపడం?" అని చెప్పడమే షా పలుకుల నిగూఢార్థం. బెర్ట్రెండ్ రస్సెల్* మొన్న నోబెల్ బహుమానాన్ని అందుకొన్నాడు గాని, ఆయనకు కూడా ఏనాడో ఈ గౌరవం జరగవలసింది. రస్సెల్ కివ్వబడిన నోబెల్ బహుమానం సాహిత్యపరమైనదైనా, ఆయన ప్రధానంగా తత్త్వవేత్త. ఆయన వచనం జిగీ బిగీ కలిగిందే కావచ్చు; వచనరచనలో సారళ్యతారళ్యాలు ఆయన సొత్తు కావచ్చు; గంభీర వదనంతో అతిగంభీరమైన విషయాలనుగురించి ప్రస్తావిస్తూనే సందర్భోచితంగా సున్నితమైన హాస్యోక్తిని జారవిడవడం ఆయన ప్రత్యేకత కావచ్చు; ఒక్క మాటలో, కొరకరాని కొయ్యగా సామాన్యజనులకు నిస్పృహ కలిగించే తత్త్వశాస్త్రాన్ని కథాసాహిత్యంవలె కమనీయం చేసిన ఘనత ఆయనది కావచ్చు. అయినా, రస్సెల్ పసిడిపంట తత్త్వశాస్త్రకేదారంలోనే; దాని గట్లపై పెంచిన వంగలు, బెండలు, బీరలను పోలినవే సాహిత్యపరంగా ఆయన సాధించిన విజయాలు.

---

* [1872 - 1970]

అగ్రశ్రేణి తత్త్వశాస్త్రవేత్తగా రస్సెల్ ప్రధానగ్రంథా లన్నీ పాతికేళ్లకు పూర్వమే ప్రచురితమైనాయి. ఆయన తాత్త్విక గ్రంథాలలో ప్రథమగణ్యమైంది ''ది ప్రిన్స్‌పిల్స్ ఆఫ్ మేథమిటిక్స్.'' దీన్ని ఆయన 1903 లోనే తొలిసారిగా ప్రకటించాడు. తర్వాత పదేళ్లకు విస్తృతరూపంలో (డాక్టర్ ఎ. యన్. వైట్‌హెడ్ సహకారంతో) దాన్నే ఆయన ''పిన్స్‌పియా మేథమెటికా'' పేరుతో పునః ప్రకటించాడు. రస్సెల్ దృష్టిలో కూడా ఇదే తన రచనలలో అతి ముఖ్యమైంది. తనకు తొంభై యేండ్లు నిండి, 1962 జూన్ 1వ తేదీని తాను కాలధర్మం చెందినప్పుడు తననుగురించి "లండన్ టైమ్స్" ఏమి వ్రాయగలదో ఊహచేసి, దాన్ని 1937లో "లిజనర్" లో ఆయన ప్రచురించాడు. ఆయన ఊహప్రకారం "టైమ్స్" వ్రాయగల దాని సారాంశ మిది. ''ప్రిన్సిపియా మేథ మెటికా'' వెలువడినప్పుడు దాన్ని మహావిలువైనదాన్నిగా విద్వత్ప్రపంచం పరిగణించింది. అయితే, డాక్టర్ వైట్‌హెడ్ సహకారంవల్లనే ఆ పుస్తకానికి అంత విలువవచ్చినట్టు చెప్పవచ్చు. రస్సెల్ కేవలం హేతువాది కాబట్టి, వైట్‌హెడ్‌వలె ఆధ్యాత్మికశిఖరాలను అందుకోలేక పోయాడు. వాక్చమత్కృతివినా, రస్సెల్‌లో అన్యప్రతిభలేదు. అయన లోతులేనివాడు.'' రస్సెల్ హాస్యచతురతకు, వ్యంగ్య వైభవానికి ఇదొక తార్కాణం.

గణితశాస్త్రంద్వారా తాత్త్వికరహస్యాలను సంశోధించడానికి ప్రయత్నించిన ఈ మహాగ్రంథం తర్వాత, ఆయన రచనలలో ప్రత్యేకంగా గణన కెక్కినవి మరి మూడు వున్నా యనవచ్చు. వాటిలో మొదటిది ''ది ప్రాబ్లెమ్స్ ఆఫ్ ఫిలాసఫీ.'' దీని ప్రచురణ 1911లో. ఇక, రెండవ దానిపేరు ''అవర్ నాలెడ్జ్ ఆఫ్ ది ఎక్స్‌టర్నల్ వరల్డ్.'' ఇది 1914లో వెలువడింది. పోతే, మూడవది – ''ది ఎనాలిసిస్ ఆఫ్ ది మైండ్.'' 1921లో దీని ప్రచురణ. ఇతర తత్త్వశాస్త్ర గ్రంథాలను పెక్కింటిని ("ఇంట్రడక్షన్ టు మేథమెటికల్ ఫిలాసఫీ", ''యాన్ ఔట్‌లైన్ ఆఫ్ ఫిలాసఫీ", ''హిస్టరీ ఆఫ్ వెస్టరన్ ఫిలాసఫీ" వగైరాలను) ఆయన వ్రాసినా, అవన్నీ తాను మొదట చెప్పిన విష యాలకు పెట్టిన మెరుగులే. దీన్నిబట్టి కనీసం పాతిక సంవత్సరాలనాడే రస్సెల్‌కు నోబెల్ బహుమానం ముట్టివుండవలసిన దనడం సుస్పష్టం.

అయితే, పాలికేళ్ల ఈలోపున రస్సెల్ ఎన్నదగు రచనలను ఏమీ చేయలేదనడం ఆయనపట్ల మహాపచారాన్ని చెయ్యడమే కాగలదు. హేతువాదం కరదీపికగా అనవరత సత్యసంశోధనను జీవితధర్మంగా చేసుకొన్నవాడు కనుక, ఆయన ఏమి వ్రాసినా, అది మనపై, మన ప్రపంచంపై ఏదో కొత్త వెలుగును ప్రసరింపజెయ్యగలిగిందే అవుతుంది. చివరికి ''మానసికపు మలబద్ధకం'', ''సోమరితనం ప్రశంస'' మొదలైన విషయాలనుగురించి ఆయన వ్రాసినా, ఆ రచనలలోనూ నూతన భావోద్దీపనశక్తి తొణికిసలాడుతూ వుంటుంది.

సత్యసంశోధనను జీవితలక్ష్యంగా చేసుకొన్న వ్యక్తి ఏదో ఒక రంగానికి పరిమితం కాలేడు. అందువల్ల తత్త్వశాస్త్రంతోనే సంతృప్తిచెందక, విద్యావిధానం, వివాహవ్యవస్థ, వైజ్ఞానికదృష్టి, వ్యక్తిస్వాతంత్ర్యం, ప్రభుత్వాధికారం, నవసంఘం మొదలైన అశేష సమస్యలనుగురించి ఆయన స్వతంత్రంగా ఆలోచించాడు; ఆ స్వతంత్రాలోచన ఫలితాలను ఇప్పటికి దాదాపు నలభై గ్రంథాలరూపంలో లోకానికి అందించాడు.

పుట్టింది అగ్రవంశంలో. పితామహుడు లార్డ్ జాన్ రస్సెల్ బ్రిటన్‌కు ప్రధానిగా ఎన్నికైనవాడు. అయినా వంగడాన్నిబట్టి, జాతినిబట్టి ఒక వ్యక్తి కంటె మరొకడు అధికుడు కాడని నమ్మినవాడు కనుక, రస్సెల్ తన ''ఎర్ల్" హోదాను ఉపయోగించుకోడానికి ఎంతమాత్రం సమ్మతించక, "మిస్టర్ బెర్ట్రెండ్ రస్సెల్" అనే సామాన్యపు పేరుతోనే చెల్లుతున్నాడు. శాంతివాది కనుక, ప్రథమ ప్రపంచమహాసంగ్రామంలో ఆయన తన ప్రభుత్వాన్ని వ్యతిరేకించి, కారాగారవాస క్లేశాలను చవిచూచాడు. హిట్లర్ నాజీజం వికృత స్వరూపాన్ని గమనించినతర్వాత దానిపై యుద్ధంజరపకపోతే మానవసభ్యతకే ముప్పు తప్పదని గుర్తించినా, జర్మనులపట్ల క్రౌర్యాన్ని నిర్ద్వంద్వంగా ఆయన ఖండించాడు. ఇంతే కాక, ఆయన ఆసియాప్రజల స్వాతంత్ర్యాన్ని హృదయపూర్వకంగా కాంక్షించినవాడు. పాశ్చాత్యసభ్యతకంటె చైనాసంస్కృతి కొన్ని విధాల ఉత్తమ మైనదని నిర్భీకంగా చాటినవాడు. రస్సెల్ ఒక మహాతత్త్వవేత్త మాత్రమే కాడు, ఒక మహాపురుషుడుకూడా.

వైజ్ఞానికరంగంలో ఆధునిక మానవుడు సాధించిన విజయాలతర్వాత, ప్రకృతిశక్తులపై అతడి ఆధిపత్యం తర్వాత, నేడు కానవస్తున్నదానికంటె ఎక్కువ హేతుబద్ధంగా అతడు ఎందుకు జీవించలేకపోతున్నా డనేదే రస్సెల్ నిరంతరావేదన. ఆయన ప్రతిపాదించిన తాత్త్వికసత్యాలు చివరికి నిలిచినా, నిలవకపోయినా, ఆయన మౌలికభావుకుడు, ఆధునికఋషి.

[నవంబర్ 17, 1950]

వెలుగు నీడలు

నేడు పాదం పెట్టింది క్రీస్తుశకంలో మరొక సంవత్సరం మాత్రమే కాదు; ఆ శకంలో ఇరవయ్యోశతాబ్ది ఉత్తరార్థంకూడా నేడు ప్రవేశించింది.

ఒక వ్యక్తిజీవితంలో అర్ధశతాబ్ది అధికభాగం కావచ్చు, అత్యధికభాగమే కావచ్చు. కాని, ప్రపంచజీవితంలో అదొక స్వల్పభాగమే. మొత్తం క్రీస్తుశకంకంటె సభ్య ప్రపంచచరిత్ర కనీసం మూడు, నాలుగురెట్లు దీర్ఘమైంది. మొత్తం క్రీస్తుశకంకంటె నరుని చరిత్ర కొన్ని లక్షలరెట్లు సుదీర్ఘమైంది.

ఒక అర్ధశతాబ్ది ప్రపంచజీవితంలో ఎంత స్వల్పమైనదైనా, ఇరవయ్యో శతాబ్ది పూర్వార్ధానికి మానవచరిత్రలోగల ప్రాధాన్యం మరొక అర్ధశతాబ్దికి దేనికీ లేదనడం అన్యాతోక్తికాదు సరిగదా, అత్యుక్తి సయితం కాదు.

ఆటవిక స్థితినుంచి, అనాగరిక వ్యవస్థనుంచి బయటపడిన తర్వాత మానవుడు కనిన కలలలో నిన్నటితో ముగిసిన అర్ధశతాబ్దిలో నిజమైనన్ని ఇంతకు ముందెన్నడు నిజం కాలేదు.

మన ప్రాచీనులు కామధేనువునుగురించి, కల్పవృక్షాన్నిగురించి కలలుగన్నా, అన్యదేశాలవారు "యాంబ్రోజియా", "మన్నా"లను గురించి కలలుగన్నా, అది కేవలం అన్నపానీయాలకై పడవలసిన నిరంతరాందోళననుంచి విముక్తికోసమే. ఇరవయ్యో శతాబ్ది పూర్వార్ధంలో పూర్ణపరిణతికి వచ్చిన పారిశ్రామికవిప్లవం ఈ విముక్తిని సుసాధ్యం చేసింది.

"తమసోమా జ్యోతిర్గమయ" అనే ప్రార్థనతో తపోవనాలు ఒకప్పుడు ప్రతిధ్వనించి వున్నా, "లైట్ మోర్ లైట్" అని ఒక పాశ్చాత్య మహాకవి తపన పడినా, అది కేవలం ఆధ్యాత్మిక సంబంధమైన వెలుగుకోసమే కాదు. నిశీథిని మానవునిదృష్టిలో మృత్యువుకు సర్వదా చిహ్నమే; తమస్సు దాన

వత్వానికి సర్వత్రా ప్రతిరూపమే. ఇందువల్లనే రాత్రిని పగలుగా మార్చవలెనన్న ప్రయత్నం సభ్యపథంపై మానవుడు తొలి అడుగు పెట్టిననాడే ప్రారంభమైంది. ఆ ప్రయత్నం విద్యుచ్ఛక్తిని కనిపెట్టడంద్వారా గతశతాబ్దిలోనే సఫలీకృత మైనా, ఆ వరప్రసాదం గ్రామాలకు సయితం లభించనారంభించింది ఇరవయ్యో శతాబ్ది పూర్వార్ధంలోనే.

భూతలంపై, సముద్రోపరిభాగంపై పయనంతో మానవుడు సంతృప్తి చెందలేకపోయాడు. అంతరిక్షంలో కూడా విహరించడానికి ఆరాటం చెందాడు. ఇందునిమిత్తం వాయుస్తంభనాది దివ్యశక్తులకోసం ప్రాకులాడాడు. రెక్కల గుర్రాలను ("మ్యాజిక్ హార్సెస్") గురించి, పుష్పక విమానాలనుగురించి ఎన్నెన్నో ఊహాకల్పనలను చేసుకొన్నాడు. ఖేచరత్వాన్ని దేవత్వానికి ప్రధాన లక్షణంగా పరిగణించుకొన్నాడు. ఈ ఖేచరత్వం మానవునికి సుసాధ్యమైంది ఇరవయ్యోశతాబ్ది పూర్వార్ధంలోనే.

దూరశ్రవణ శక్తికోసం, దివ్యదృష్టి కోసం మానవుని తపన సయితం ఈనాటిది కాదు. ఈ రెండింటిలోకూడా అతడి స్వప్నాలు సత్యాలైంది కడచిన యేబది సంవత్సరాలలోనే. దూరశ్రవణాన్ని రేడియో సాధ్యంచేసింది. టెలి విజన్‌ద్వారా, భూత భవిష్యాలకు సంబంధించినంతవరకు కాకపోయినప్పటికి, వర్తమానానికి సంబంధించినంతవరకు దివ్యదృష్టి లభ్యమైంది. పరమాణు విచ్ఛిత్తిద్వారా సూర్యుని వాకిటబంటుగా కట్టివేసుకోగల పాటవం సిద్ధించింది.

వైజ్ఞానిక, సాంకేతిక రంగాలలో ఇవి నిశ్చయంగా అద్భుత విజయాలు, అపూర్వవిజయాలు. కాని, మా దృష్టిలో వీటికంటె ముఖ్యమైనది మరొకటి వున్నది. ఇదివరలో ఏక ప్రపంచలక్ష్యం మహాకవుల గీతాలకు ప్రేరణకూర్చిన ఒక దివ్యాకాంక్ష, మత ప్రవక్తల ప్రబోధాలకు దీప్తిని కూర్చిన ఒక సుమధుర స్వప్నం. చిత్తశుద్ధితో మనం ప్రయత్నించేస్తే, ఇకమీదట అది సఫలం కాగల లక్ష్యం.

ఇంతగా ప్రపంచాన్ని ఏకకుటుంబం చేసిన ఈ కాలంలోనే, ఇంతగా మానవాళిని ఏకోదరులుగా మార్చిన ఈ సమయంలోనే రెండు ప్రపంచయుద్ధాలు జరిగాయి; మూడవదాని లోహపదఘట్టాలు వినవస్తున్నాయి.

యాభై సంవత్సరాలనాడు రష్యా జార్ చక్రవర్తుల క్రూరాతి క్రూర నిరంకుశత్వంకింద కూడుగుడ్డలకు సయితం ముఖం వాచిపోతూ, దారిద్ర్య దైన్యాలతో క్రుంగిపోతున్న రాజ్యం. అప్పుడు చైనా మంచూ చక్రవర్తుల ఏలుబడికింద ప్రతి పాశ్చాత్యరాజ్యం తాపులను తింటూ నోరు మెదపడానికి కూడా గుండెలులేకుండా బ్రతుకుతున్న దేశం. నాడు ఇండియా, బర్మా, సింహళం, ఇండొనీసియా, ఫిలిప్పీన్స్‌లు బ్రిటిష్, డచ్, ఫ్రెంచి, అమెరికన్ సామ్రాజ్యాధినేతల అడుగుంకు మడుగులొత్తుతున్న సీమలు. ఒక్కమాటలో అప్పుడు కేవలం పాశ్చాత్యులదే రాజ్యం, వారిదే భోగం; తక్కినవారిది ఘోర దాస్యపు బ్రతుకు, అతిహేయపు మనుగడ.

పాశ్చాత్యరాజ్యాలలోనైనా ఎవరో కొందరుమాత్రమే పెట్టి పుట్టినవారన్న సిద్ధాంతం ఈనాడు చెల్లడం లేదు. రాజకీయ స్వాతంత్ర్యం చాలదని, సాంఘిక న్యాయం జరిగితీరాలని పట్టుదల కానవస్తున్నది. కేపిటలిజం పునాదిగాగల దేశాలలో సయితం ప్రజ అందరికీ అన్నవస్త్రాల నివ్వడం, విద్య గరపడం, వైద్యసౌకర్యాలను సమకూర్చడం, ప్రభుత్వపు కనీసధర్మాలుగా గుర్తించబడుతున్నాయి.

సందేహం లేదు - నేడు ఎంతటి మహావిపత్తుసమ్ముఖంలో నిలిచివున్నా, 1901 పాదంపెట్టిననాటి ప్రపంచంకంటె ఈ నాటి ప్రపంచంబహుభంగుల భిన్నమైనది, ఉత్తమమైనది. అయితే, నేటి ప్రత్యేక పరిస్థితులనుబట్టి ఇప్పుడు మనం ఒక్క తప్పటడుగు వేసినా, సర్వవినాశనం తప్పదు. జీవనమో, మృత్యువో, స్వర్గమో, నరకమో నిర్ణయం కావలసిన సమయం అంతకంతకు దగ్గర పడుతున్నది. అందువల్లనే ఈనాడు ఆలోచనాశక్తిగల ప్రతివాని హృదయం కొంత తొట్రుపడుతున్నది. రెండు దారులలో దేనినో ఒకదానిని ఈ నాడు ప్రపంచం నిర్ణయించుకోవలసివున్నది. ఒకటి చర్చిల్, హిట్లరుల దారి; రెండవది గాంధి, లెనిన్‌ల దారి.

గత ప్రపంచయుద్ధంలో చర్చిల్, హిట్లర్‌లు ప్రత్యర్థులై వుండవచ్చు. కాని, వారి దృక్పథాలమధ్య వైరుధ్యం తక్కువ. చర్చిల్ ప్రజాస్వామ్యవాది కావచ్చు; హిట్లర్ పచ్చిఫాసిస్ట్ కావచ్చు. అయినా చర్చిల్, ప్రజాస్వామ్యం శ్వేత జాతికి పరిమితం. ఆ శ్వేతజాతిలోనైనా ప్రజాస్వామ్యం రాజకీయరంగాన్ని

దాటి, ఆర్థికరంగానికి విస్తరించరాదు. ఒక విధంగా చూస్తే, చర్చిల్ మనస్తత్వం వేసిన వెర్రితలలే హిట్లరిజం.

ఇక గాంధి, లెనిన్‌ల ప్రధాన లక్ష్య మొక్కటే. అది - సకలమానవ సౌభ్రాత్రం. అయితే, ఆలక్ష్యసాధనకై వారి పద్ధతులు మాత్రం పరస్పర విరుద్ధం. పద్ధతులు ఎట్టివైనా సరే, లక్ష్యసాధనమాత్రమే ముఖ్యమని నమ్మినవాడు లెనిన్. లక్ష్యం ఎంత మహోత్కృష్టమైనదైనా, దుష్టసాధనలు దుష్టఫలితాల నివ్వడం తథ్యమని విశ్వసించినవాడు గాంధి.

ప్రపంచచరిత్రను చూస్తే, మహోన్నత లక్ష్యాలతో ప్రారంభమై, రొష్టులతో, రోషాలతో, రక్తపాతాలతో, ''రియాక్షన్''తో ముగిసిన రాజకీయ విప్లవాలన్నీ లెనిన్‌విశ్వాసాన్ని స్పష్టంగా ఖండిస్తున్నట్లు కనబడుతుంది. కాగా, రెండువేలసంవత్సరాలు గడిచిపోయినా ఈనాటికైనా వాటి పటిమను కొంతవరకైనా నిలుపుకొనగలుగుతున్న గౌతమబుద్ధ, సోక్రటీస్, ఏసుక్రీస్తు మొదలుగాగలవారి నైతికవిజయాలు గాంధివిశ్వాసాన్ని సమర్థిస్తున్నట్టుగా కన్పిస్తుంది. అయినప్పుడు ఎవరి అడుగుజాడలలో నడిస్తే ప్రపంచానికి భవిష్యత్తు కలదో వేరే చెప్పాలా !

[జనవరి 1, 1971]

స్వయంకృతాపరాధం

ఒక విధంగా చూస్తే పార్లమెంటు పరిశీలనలో వున్న కొత్త పత్రికా శాసనం పత్రికల స్వయంకృతాపరాధ ఫలితమే!

జాతీయ స్వాతంత్ర్యసాధన ప్రధానలక్ష్యాన్ని సతతం దృష్టిలో పెట్టు కొని, ఆ లక్ష్యసాధనకై పాటుపడుతున్నట్టివా రన్న కారణాన కాంగ్రెసువాదులను సమర్థించడాన్నే ఇదివరలో దాదాపు అన్ని పత్రికలు పనిగా పెట్టుకొన్నాయి ఇంతే కాదు; కాంగ్రెసువాదులు తప్పుదారిని పోయినప్పుడైనా, వారిని గట్టిగా విమర్శిస్తే, జాతీయోద్యమానికే దెబ్బ తగలవచ్చునన్న తలంపుతో చూచీచూడ నట్టు సరిపెట్టుకొంటూ పోయినవి. ఏడాది, రెండేళ్ళు, మూడేళ్ళు కాక దాదాపు మూడు దశాబ్దాలపాటు ఇంతే జరిగింది.

తాము అందుకు పాత్రులైనా, కాకపోయినా, జాతీయస్వాతంత్ర్య సమర ప్రత్యేక పరిస్థితులను పురస్కరించుకొని వరుసగా పెక్కేళ్ళు పత్రికలనుంచి కేవలం ప్రశంసలను అందుకొన్నందునే ఈనాడు తమపై ఏ కొంచెం విమర్శ ఎంత సహేతుకంగావచ్చినా అది కాంగ్రెసువాదులకు కంటగింపుగా వుంటున్నది.

"నీవు ఇంద్రుడవు, నీవు చంద్రుడవు" అని పెక్కు సంవత్సరాలు అదే పనిగా పొగడ్తలందుకొన్న వారు తాము నిజంగా ఇంద్రులమని, చంద్రుల మని నమ్మడం సహజం. కాంగ్రెసువాదులను ప్రస్తుతం పీడిస్తున్న జాడ్య మిదే. ఒక మహానాయకుడు (గాంధి), ఒక మహోద్యమం (స్వాతంత్ర్యసమరం) తమకు కూర్చిన కాంతిని స్వయంప్రకాశమని వారు భ్రమపడుతున్నారు. ఒక ప్రత్యేకపరిస్థితిలో పత్రికలు తమనుగురించి చేసివున్న ప్రశంసలు స్వీయప్రతిభ రాబట్టిన జోహారులని వారు భ్రమపడుతున్నారు.

ఇదివరలో పత్రికలు తమను విమర్శించకపోవడం రణరంగంలో నిలిచిన సైనికుని విమర్శించడం పాడికాదన్న ధర్మసూక్ష్మంపైనే అని వారు గ్రహించలేకున్నారు; తమపై ఒకచెణుకు చెణికినా అది దేశ ద్రోహమన్నట్టు వారు తీంద్రిస్తున్నారు.

జాతీయ స్వాతంత్ర్య సమరానికి ఎక్కడ ఏమి విఘాతం వాటిల్లగలదో అన్న సంకోచం లేకుండా మొదటినుంచీ కాంగ్రెసువాదులను సహేతుకమైన అన్ని సందర్భాలలో పత్రికలు విమర్శించి వుండే, వారిలో ప్రస్తుత చిత్తవృత్తి బలిసివుండేది కాదు; ప్రస్తుతపు పత్రికాశాసనం ప్రసక్తి వచ్చేదీ కాదు. ఇందువల్లనే ఇప్పటి పత్రికాశాసనం పత్రికల స్వయంకృతాపరాధ ఫలితమని మే మనడం!

ఏమైనా, ఇప్పటి శాసనంవల్ల ప్రమాదం కేవలం పత్రికల స్వాతంత్ర్యానికే కాదు; ప్రజలక్షేమానికి కూడా! ప్రభుత్వశాసనాలను, ప్రభుత్వాధికారుల చర్యలను వేటినైనా పత్రికలు ఈ నాడు విమర్శిస్తే, ఏదో ఒక విమర్శ చెయ్యాలన్న తాపత్రయంవల్ల కాదు; ప్రజాహితానికి దోహదం కూర్చవలెనన్న సదుద్దేశంతోనే. ఇందువల్ల ఏమేరకు పత్రికలు తమ విమర్శన స్వాతంత్ర్యాన్ని కోల్పోగలవో, ఆ మేరకు ప్రజల క్షేమానికి ముప్పు తప్పదు.

ఈ ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొనే పార్లమెంటు సభ్యులలో కొందరు, ముఖ్యంగా కాంగ్రెసేతరసభ్యులు, హోంమంత్రిరాజాజీ ప్రవేశపెట్టిన ప్రెస్ బిల్లును, తీవ్రంగా ప్రతిఘటించారు. దీని ఫలితంగా సెలెక్ట్ కమిటీలోనైనా బిల్లులో సముచితమైన మార్పులు జరగవచ్చునని మేము ఆశించాము. కాని, ఏవో కొన్ని నామమాత్రపు సవరణలు మాత్రమే జరిగాయి. ఈ రూపంలోనే ఈ బిల్లు చట్టమైతే, అది మన రాజ్యాంగం మూలస్తంభాలలో ఒకదాన్ని పెకలించడమే కాగలదు.

[సెప్టెంబరు 9, 1951]

ఆంధ్రరాష్ట్రం

ఆంధ్రరాష్ట్ర నిర్మాణంవిషయమై పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వైఖరిని మేము ముందెన్నడు హర్షించలేదు; ఇప్పుడు దాన్ని హర్షించడం మాకు మరింత కష్టం. భాషారాష్ట్రాల అవతరణకు తాను విముఖుడైనా, ఆంధ్రరాష్ట్ర నిర్మాణంమాత్రం తనకు ఆమోదకరమే అని జవహర్‌లాల్ ప్రకటిస్తున్నాడు. కాని, ఈ ఆమోదం ఆమోదంగానే మిగులుతున్నదే తప్ప, ఆచరణకు రావడం లేదు.

భాషారాష్ట్రాలనిర్మాణం జరగాలంటే వివాదగ్రస్తమైన ముఖ్యవిషయాలపై ప్రధానపక్షాలమధ్య స్థూలంగానైనా ఒడంబడిక కుదరవలెనన్న సూత్రం సమర్థనీయం కాదు. ప్రతి పెద్ద సమస్యాపరిష్కారానికి దీన్ని ఒక షరతుగా పెడితే మనదేశ సమస్యలన్నీ అపరిష్కృతంగా మిగిలివుండవలసిందే.

ఏమైనా, నెహ్రూ స్వయంగా అంగీకరిస్తున్నట్టు, ఆంధ్రరాష్ట్ర సమస్యకు సంబంధించినంతవరకు ముఖ్యసమస్యలపై సయితం ఇప్పటికే చాలావరకు ఏకాభిప్రాయం వున్నది. విభిన్నాభిప్రాయాలు ఏవైనా కొన్ని బెదురుగా వినవస్తుంటే అవి చెన్నపురి, రాయలసీమలనుగురించి. ఇవి ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి ప్రతిబంధకాలుగా నిలవదగినట్టివి కావు.

''సమస్యకు సంబంధించిన ప్రధానపక్షాలన్నింటిమధ్య ఏకాభిప్రాయం'' అనగానే ఈ "ప్రధానపక్షాలేవి?" అనే ప్రశ్న వెంటనే వస్తుంది. ముందు పటేల్ - నెహ్రూ - పట్టాభి కమిటీవారేమి, అటుతర్వాత నెహ్రూ విడిగానేమి ఇందుకు చెప్పిన సమాధానం. "ఆంధ్ర, తమిళ, కన్నడ ప్రదేశ్ కాంగ్రెసులు, మద్రాసు ప్రభుత్వం" అని.

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చెన్నపురినిగురించి, రాయలసీమనుగురించి తన అభిప్రాయాన్ని అసందిగ్ధంగానే ప్రకటించింది. ఈ సంగతి పండిట్ నెహ్రూకు తెలియనిదికాదనే అనుకొంటాము. ఆంధ్ర కాంగ్రెసు నాయకుల రాయబారానికి నెహ్రూ చెప్పిన సలహాను అనుసరించే, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ మొన్నటి ఎన్నికలకుముందు నెల్లూరులో సమావేశమై విభజనసంఘం నిర్ణయాల ప్రాతిపదికపై ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి తాను సమ్మతిస్తున్నట్టు తీర్మానించింది.

విభజన సంఘం నిర్ణయాలను మొత్తంపై ఆమోదిస్తూ కన్నడ ప్రదేశ్ కాంగ్రెస్ సయితం అప్పుడే ఒక తీర్మానాన్ని చేసింది. ఇట్టి తీర్మానలాంఛనాన్ని ఇంకా పాలించకపోయినా, తమిళప్రదేశ్ కాంగ్రెసుకేమి, మద్రాసుప్రభుత్వానికేమి విభజనసంఘం నిర్ణయాలు అమోదకరమైన వనడం జగద్విదితం. నిజానికి వాటి అభిమతాలనే ఆ నిర్ణయాలు అధికంగా ప్రతిఫలిస్తున్నాయి. అయినప్పుడు ప్రధాన పక్షాలమధ్య చెన్నపురి, రాయలసీమలనుగురించి ఏకాభిప్రాయం పొసగవలసి వున్నదనడం సమంజసం కాగలదా?

విభజనసంఘం నిర్ణయాలను ఆమోదిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ సంఘం తీర్మానించినప్పుడు, రాయలసీమకు, నెల్లూరుకు చెందిన కొందరు సభ్యులు దాన్ని ఖండిస్తూ ఒక ప్రకటన చేశారనుకోండి. కాని, నెహ్రూ చెప్పిన సలహాలో "ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఆమోదం" అని మాత్రమే కలదుగాని, దాని "ఏకగ్రీవామోదం" అని లేదుగదా? మెజారిటీ అభిప్రాయాన్ని మైనారిటీ మన్నించాలనడం ప్రజాస్వామ్యానికి కీలకం. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రజాస్వామ్యసంస్థ. అందువల్ల మైనారిటీ అభిమతం ఏదైనా మెజారిటీ తీర్మానాన్ని గౌరవించితీరాలి. ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాయలసీమ ప్రముఖుడైనందున ఆ తీర్మానాన్ని మరింతగా గౌరవించాలి.

అయినా, చెన్నపురిని, రాయలసీమను ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి ఇంకను అభ్యంతరాలుగానే పేర్కొనడం "ప్రకాశంగారు అభ్యంతరం చెప్పి వుండక పోతే, ఆంధ్రరాష్ట్రం ఎప్పుడో వచ్చివుండేది" అనడం వలెనే వున్నది. విభజన సంఘం నిర్ణయాలకు అభ్యంతరం చెప్పినవారు ఆ సంఘసభ్యులలో ప్రకాశంగారొక్కరే. తక్కిన సంఘసభ్యుల - ఇంతే కాక, సంఘంలోని తక్కిన

1524

ఆంధ్రసభ్యుల - ఏకగ్రీవాభిప్రాయాన్ని త్రోసిపుచ్చి, ఒక్కరి అభ్యంతరానికే విలువనిచ్చినామనడం ఏ ప్రజాస్వామ్య సిద్ధాంతం ప్రకారమో దురూహ్యం. ఇదే విధంగా ప్రతి ఒక్కరి సమ్మతి లభించిన తర్వాతనే ఆంధ్రరాష్ట్ర నిర్మాణమంటే, అది బ్రహ్మకల్పాంతవరకు వేచివుండవలసిందే!

అయితే, ఇంకొక విషయాన్ని కూడా ఇక్కడ మేము స్పష్టపరచాలి. ఆంధ్రరాష్ట్ర నిర్మాణంవిషయంలో నెహ్రూ వైఖరిని ఎంతగా విమర్శించినా, స్వామి సీతారాం ప్రారంభించిన సత్యాగ్రహాన్ని మేము సమర్థించలేము. ఏ దృష్టినుంచి చూచినా, సత్యాగ్రహానికి ఇది సమయం కాదు. కాంగ్రెస్‌వారు దీన్ని ఖండిస్తున్నారు, కమ్యూనిస్టులుకూడా దీన్ని వాయిదా వేయవలసిందిగానే చెప్పారు. ఆంధ్రరాష్ట్రస్థాపక సంఘంలోనే దీన్నిగురించి ఏకాభిప్రాయం లేదని వింటున్నాము. అయినా, స్వామి సీతారాం సత్యాగ్రహాన్ని ప్రారంభించడం పరాజయాన్ని ఆహ్వానించడమే పరిహాసాన్ని ఆహ్వానించడమే! అట్టి పరాజయంవల్ల, పరిహాసంవల్ల, ఆంధ్రరాష్ట్రోద్యమానికే గట్టి దెబ్బ తగలవచ్చు.

[మార్చి 1, 1952]

కంట్రోల్స్

కంట్రోల్స్ ఈనాడు అవినీతికి మరొక పేరు, అన్యాయానికి పర్యాయ పదం, కష్టాలకు హేతువు, నైచ్యానికి మూలం. కంట్రోల్స్‌వల్ల పంటను పండించే రైతు మొదలు, పండిన గింజలను కొనుక్కొని కాలక్షేపం చేసే గృహస్థులవరకు అందరిదీ ఈనాడు అబద్ధపు బ్రతుకైపోయింది. పోతే, కంట్రోల్స్‌ను పెద్ద పండుగగా భావిస్తున్న వారు చాటుమాటుగా నిల్వలు చేస్తున్న వారు, చీకటిబజారులో పీఠం పెట్టినవారు, చేతిని బల్లకిందికి పోనిస్తున్న వారు మాత్రమే !

ఇది కర్కోటకపు కాలమని, ముక్కుకు సూటిగా పోతే మాడు పగులు తుందని, పండిన పంటలో కొంత రైతు దాచిపెడుతున్నాడని అందరికీ తెలుసు. "ఊరుపై ఊరుపడినా కరణంపై కాసు పడదు" కాబట్టి, వీలు చిక్కినప్పుడే నాలుగు డబ్బులు కళ్లజూడాలన్న ఆరాటంతో గ్రామాధికారులు పంటల అంచనాలను సందర్భానుసారంగా సిద్ధపరుస్తారని అందరికీ తెలుసు. రైస్ మిల్లర్లు, వర్తకులు, వీరిపై పెత్తనం చెలాయిస్తున్న అధికారులు ఎవ రేమి చేస్తున్నదీ అందరికీ తెలుసు. కొట్టులో బియ్యాన్ని కొన్నమీదటనే కుండను పొయ్యిపైకి ఎక్కించు కొనవలసినవారు రేషన్ మెతుకులతోనే సరిపెట్టుకోవడం లేదనికూడా అందరికీ తెలుసు.

అయినా, ఎవరికి వారే ప్రస్తుతపు పరిస్థితులలో ఏదో ఒక విధంగా సరి పెట్టుకు పోవడం కంట్రోల్స్ రద్దువల్ల మరింతటి ఘోరపరిస్థితులు ఏర్పడగల వేమోనన్న భయసంకోచాలవల్లనే.

ఈ భయసంకోచాల కారణంగా కంట్రోల్స్ విధానంలోని దోషాలను సహిస్తూ మిన్నకుండరాదని తీర్మానించగలిగినందునే మద్రాసుప్రభుత్వపు కొత్త ఆహారవిధానం ధైర్యంతో కూడిందని మేము భావిస్తున్నాము.

తలవనితలంపుగా ఒడుదుడుకు లేర్పడి, చెడ్డ చిక్కులు రాకుండా కొత్త విధానంలో ఎక్కడికక్కడ పెక్కు రక్షణ లున్నాయి. మొత్తం రాజధానిని ఆరు

మండలాలుగా విభజించడం, తరుగు జిల్లాల పోషణబాధ్యతను, మిగులు జిల్లాలలో ఒకదానికో, రెండింటికో అప్పగించడం, మొదటికే మోసంగావున్న ప్రాంతాల పోషణకు దిగుమతి ధాన్యాలను కేటాయించడం, కొంతకాలంపాటు చౌక ధాన్యండిపోలను నడపడం, ఇప్పుడు చేతిలోవున్న సరుకును అత్యవసర పరిస్థితు లేర్పడగలపక్షంలో వాటిని ఎదుర్కొనడానికి అట్టే పెట్టడం – ఇట్టి వన్నీ కూడా రక్షణలుగా ఉద్దేశించబడినవే.

ఇన్ని రక్షణలు ఈ కొత్తవిధానంలో కానవస్తున్నా, ఇది జయప్రదం కావడానికి రెండు విషయాలు ముఖ్యం. ఒకటి, – ప్రస్తుతం సర్వత్రా విశ్వసించబడుతున్నట్లు, ప్రభుత్వపు అంచనాలలో కనబడుతున్నదానికంటె చాలా హెచ్చు పంట రాష్ట్రంలో కలదనడం నిజం కావాలి. రెండు, – కంట్రోల్స్ పోనేపోయినవి కదా అని దురాశాపూర్వకంగాను, పాపభయరహితంగాను ఎవరికి వారు విచ్చలవిడిగా సంచరించరాదు. ఈ రెండవది నిజానికి చాలా పెద్ద ప్రమాదం. ఇందువల్లనే ఈ విషయమై రాజాజీ ప్రత్యేకించి ఒక విజ్ఞప్తిచేసి, సద్వర్తన, దేశభక్తి, పాపభీతి కొత్త ఆహారవిధానం జయప్రదం కావడానికి ముఖ్యావసరాలని హెచ్చరించాడు.

ఎంత ఎక్కువ కాలం నిల్వచేస్తే, అంత ఎక్కువ ధరకు అమ్ముకొన వచ్చునని రైతులు పాతరలను, గరిసెలను కదల్చకుండా మిగిల్చినా, రవాణాకు ఒడుదుడుకులు కల్పిస్తే, తమకు ఇబ్బడిగా లాభాలు రాగలవని మిల్లర్లు అవకతవకలు చేసినా, తిరిగి ఎప్పటికో ఇంతటి అవకాశమని వర్తకులు దురాశలకు పోయినా, ఎన్నాళ్ల కెన్నాళ్లకు మళ్లీ కోరినన్ని బియ్యమని తలొక ఇష్టం, పండించొప్పున బియ్యం కొని గృహస్థులు నిల్వచేసుకొన్నా, కొత్త ఆహారవిధానం విఫలమైపోవడమూ తప్పదు; కంట్రోల్స్, వాటికి సంబంధించిన అన్ని వికారాల సమేతంగా, తిరిగి రావడమూ తప్పదు.

[జూన్ 8, 1952]

తెలుగువాడా!

ఎన్నాళ్లనుంచి కలలు కంటున్నావు "రాష్ట్రం, రాష్ట్రం" అంటూ! ఎన్నాళ్లనుంచి ఎదురుతెన్నులు కాస్తున్నావు నీ ప్రత్యేక రాష్ట్రంకోసం! నీ కలలు పండినట్టే సంబరపడి, మళ్లీ అంతలోనే ఎన్నిసార్లు నీవు ఆశాభంగంలో కుంగిపోలేదు! "ఇదుగో - వచ్చింది రాష్ట్రం" అనుకొని సంతోషంగా ఎదురువెళ్లి, హతాశుడవై నీవు ఎన్నిసార్లు కుప్పగా కూలిపోలేదు? చివరికి నీకు ప్రత్యేక రాష్ట్రం కోసం నీ ప్రియసోదరు డొకడు కఠోరదీక్ష పూని, ప్రాణత్యాగం చేయవలసి వచ్చింది!

అట్టి నీకు ఇప్పుడే, తక్షణమే రాష్ట్రం కావలెనా? తగవులు లేకుండా రాష్ట్రం కావలెనా? అయితే. దాన్ని తీసుకో! నెహ్రూ దాన్ని నీకు యిస్తానంటున్నాడు. దాన్ని తీసుకొంటావా? లేక, నోటివద్ద మృష్టాన్నాన్ని మట్టి కలుపుకొంటావా?

మాకు గట్టిగా తెలుసు-తక్షణమే రాష్ట్రం కావాలని నీ కున్నదని! మాకు తెలుసు - తెగేవరకు తిరిగి లాగకుండా ఈసారైనా రాష్ట్రలబ్ధిని పొందడమే నీ అభిలాష అని!! మరి ఆలస్యం తగదని మొన్నటి కృష్ణ ఆనకట్ట ప్రమాదం నివేదిక నీకు వేయి నోళ్లతో చెబుతున్నది. ఈ అవకాశాన్నికూడా జారవిడుచుకొంటే, నీ సంతానానికి కూడా ప్రతి రెండు, మూడు సంవత్సరాలకు దుర్భిక్షం తప్పకపోవచ్చునని ఖోస్లా కమిటీ నివేదిక నీ చెవిని ఇల్లు కట్టుకొని పోరుతున్నది.

కాని, తగవును చంపడాన్ని కాక, దాన్ని పెంచడానికి చూచే చౌక బారు ప్లీడరు ప్రవృత్తిగల మన రాజకీయ ప్రముఖులు కొందరు నిన్ను తప్పుదారిని పెట్టడానికి చూస్తున్నారు. పౌరుషాలకు పెనగులాడే ప్రజానాయకులు కొందరు తమ ప్రతిష్ఠ నిలుపుకొనడంకోసం నిన్ను రెచ్చగొట్టడానికి కుతంత్రాలు పన్ను

తున్నారు. వీరి కుతంత్రాలను కానలేకపోతే నీవు స్వరాష్ట్రంలేని - వ్యక్తిత్వం లేని, పురోభివృద్ధిలేని - క్షణికోద్రేకి ఆంధ్రుడవుగానే మిగిలిపోతావు.

వ్యవహారదక్షతకు పేరొందిన యుగంధరుడు, తిమ్మరుసు నీ వారని జ్ఞాపకం పెట్టుకో! నీ రాష్ట్రాన్ని పుచ్చుకొనడానికి ముందుకు రా: నీకు అడ్డుగా నిలుస్తున్నవారిని నెట్టివేస్తూ ముందుకు రా: రావయ్యా, రా: ముందుకు రా!!

[డిశంబర్ 12, 1952]

ఎన్నికల పాఠాలు

ఎన్నికల ఫలితాల ప్రకటన దాదాపు ముగిసింది కాబట్టి, ఇక మన మద్రాసు రాష్ట్రానికి, విశేషించి ఆంధ్ర ప్రాంతానికి, సంబంధించినంతవరకు ఎన్నికలపాఠా లేవో తెలుసుకొనడానికి మనం ప్రయత్నించవచ్చు.

శని, ఆదివారాలలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ న్యూఢిల్లీలో జరిపిన సమావేశాల ప్రధానోద్దేశం ఎన్నికల గుణపాఠాల పరిశీలనే. ఈ సమావేశాలకు మన రాష్ట్ర ప్రతినిధులు సమర్పించిన నివేదికలు ఏ ధోరణిలో కలవో, వాటిపై చర్చ ఏ సరణిలో నడిచిందో మనకు తెలియదు. కాంగ్రెస్ కార్యక్రమాన్ని ద్విగుణీకృతోత్సాహంతో కొనసాగించడం, ప్రజాబాహుళ్యంతో ఇతోధిక సన్నిహిత సంబంధాన్ని కాంగ్రెస్ కూర్చుకొనడం – ఇంతకుమించి వర్కింగ్ కమిటీ ఏమి నిర్ణయాలను జరిపిందో కూడా మనకు రూఢిగా తెలియదు. అయినా, మన రాష్ట్ర పరిస్థితులు మనకు తెలియనివికావు కాబట్టి, న్యూఢిల్లీ చర్చలు, నిర్ణయాల ప్రసక్తిలేకుండానే ఎన్నికల ఫలితాలపై స్థూలంగానైనా కొన్ని ముఖ్యమైన తీర్మానాలకు – నిర్వివాదమైన నిర్ణయాలకు – మనం రావడానికి వీలున్నది.

ఎన్నికల ఫలితాలను చూచీ చూచినంతనే ఎంతటి మందమతికైనా వెంటనే స్ఫురించే విషయం కాంగ్రెసుపట్ల ప్రజలకు విశ్వాసం సడలిందని.

పూర్తిగా ఎన్నికల ఫలితాలు వచ్చిన తమిళజిల్లాలలో కాంగ్రెస్ 185 అసెంబ్లీ స్థానాలకు పోటీచేయగా, అది గెలిచింది 96 స్థానాలను మాత్రం. దీని తాత్పర్యం దాని విజయం నూటికి 52వంతులకు లోపుగానే అని.

ఆంధ్ర ప్రాంతంలోను, మలబార్‌లోను కాంగ్రెసు విజయం ఇంతకంటె కూడా తక్కువ. ఇంకను తెలియవలసిన అదు ఫలితాలను విడిచిపుచ్చి, వెలు

వడిన ఫలితాలపైనే అంచనాకడితే,ఆంధ్రప్రాంతంలో కాంగ్రెస్ విజయం నూటికి 30 వంతులు మాత్రం. ఇది మలబార్‌లో మరింత తక్కువ. అక్కడ కాంగ్రెస్ గెలుపు నూటికి పధ్నాలుగు వంతులైనా కాదు.

పోతే, ఒక్క దక్షిణ కెనరాలోనే కాంగ్రెస్ వెనుకటి రోజులలోవలె పూర్తి విజయాన్ని పొందగలిగింది. అది ఇక్కడ 11 స్థానాలకు పోటీచేసి తొమ్మి దింటిని గెలుచుకొన్నది. దీన్నిబట్టి అక్కడ కాంగ్రెస్ విజయం ఇంచుమించుగా నూటికి 82 వంతులు.

కాంగ్రెస్ పేరుచెప్పి, చివరకు పూచికపుల్లను నిలబెట్టినా, అది గెలిచిన రోజులతో పోల్చుకొంటే, ఇప్పటి ఈ ఫలితాలు కాంగ్రెస్, సంస్థపట్ల ఈనాటికీ అచంచల విశ్వాసంకలవారిని సయితం అమితంగా కలవరపెట్టగలపాటి వనడం నిస్సందేహం. దేశం మొత్తంపై ఫలితాలకు ఇవి విరుద్ధమైనవి కావడం సయితం ఈ సందర్భంలో ప్రత్యేకించి గమనార్హమే !

మన దేశం మొత్తానికి ప్రస్తుతం 22 లెజిస్లేటివ్ అసెంబ్లీలు వున్నాయి. వాటిలో 14 అసెంబ్లీలలో - బొంబాయి, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్, అస్సాం, హైదరాబాద్, మైసూర్, సౌరాష్ట్ర, మధ్యభారత్, హిమాచల ప్రదేశ్, అజ్మీర్, భోపాల్, కూర్గ్, ఢిల్లీ, అసెంబ్లీలలో — తక్కిన అన్ని పార్టీలపై కాంగ్రెస్‌కు మెజారిటీ వచ్చింది. పంజాబులో కూడా ఇంతే జరగ నున్నట్టు అక్కడి ఎన్నికల ఫలితాలు ఈసరికే సూచిస్తున్నాయి. యు. పి. లో కూడా బహుశా ఇందుకు భిన్నం కాబోదని అనుకోవచ్చు. మధ్యప్రదేశ్‌నుగురించి ఇంతలోనే ఏమీ చెప్పలేము. పెప్సూ, రాజస్థాన్‌లలో మాత్రం కాంగ్రెస్ విజయం అనుమానాస్పదం. కాగా, కచ్చితంగా కాంగ్రెసుకు మెజారిటీ లేనట్లు తేలింది తిరువాన్కూర్ - కొచ్చిన్ యూనియన్, మద్రాసు రాష్ట్రం, ఒరిస్సాలలో మాత్రమే.

కాంగ్రెస్‌కు విజయం సందేహాస్పదమైన తక్కినప్రాంతాలలో ముఖ్యంగా ఒరిస్సా, రాజస్థాన్, పెప్సూలలో - మాజీ సంస్థానాధిపతులు, జాగీర్‌దారులు మొదలైనవారు ఎక్కువగా గెలవగా, చెన్నరాష్ట్రంతోను, తిరువాన్కూర్-

కొచ్చిన్ యూనియన్‌లోను, కాంగ్రెస్‌తర్వాత ఎన్నదగువర్గంగా కమ్యూనిస్టులు గెలిచారు. దీన్నిబట్టి ఈ రెండు ప్రాంతాలు కమ్యూనిజంవైపుకు మొగ్గు చూపడం ప్రారంభించినట్టు అనుకోవచ్చునా?

ఈ మాటను కమూనిస్టులే అనడం లేదు. తమకు సిద్ధించిన విజయాలలో నాల్గవవంతైనా లభించగలదన్న ఆశతో వారు ఎన్నికల రంగంలోకి దిగలేదు. నిజానికి, కమ్యూనిస్టు విజయానికి ఎక్కువగా ఆశ్చర్యపడుతున్నవారు కమ్యూనిస్టులే! ఎన్నికల పర్యవసానాన్ని ముందుగా ఏ మాత్రంగానైనా వారు ఊహించగలిగి వుంటే, మరెన్నో స్థానాలకు వారు తప్పక పోటీచేసి వుండేవారే! ఏమైనా, కమ్యూనిజంపట్ల ప్రజలలో కొత్తగా పుట్టుకువచ్చిన సుహృద్భావంకాక కాంగ్రెస్‌పట్ల ఏర్పడిన విముఖత్వమే తమ విజయానికి ప్రధాన కారణమని ఒక ఆంధ్ర కమ్యూనిస్టు ప్రముఖుడు స్వయంగా చెప్పివున్నాడు. ఈ కారణాన ప్రస్తుత సమీక్షలో మనం పరిశీలించవలసింది కమ్యూనిస్టు పార్టీకి ప్రాబల్యం ఎందువల్ల సిద్ధించినదని కాక, కాంగ్రెస్ పలుకుబడి ఎందుకు సన్నగిల్లింది అని మాత్రమే.

ముఖ్యంగా ఆంధ్రదేశానికి సంబంధించినంతవరకు కాంగ్రెస్ పలుకుబడి ఎంతగానో పలచబడివుండక పోతే, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు, దాని ఉపాధ్యక్షు లిద్దరు, దాని ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శు లిద్దరు, మొత్తం ఏడుగురు పార్లమెంటరీ బోర్డు సభ్యులు, వారు తమ రహస్యమంతనాల సందర్భంలో సలహాకు పిలిచిన ప్రముఖులు మరిద్దరు, ఒక రిద్దరు మినహాగా ఎన్నికలలో పోటీచేసిన అందరు రాష్ట్రకాంగ్రెస్ కార్యవర్గసభ్యులు-ఒక్కమాటలో ప్రదేశ్ కాంగ్రెస్ సంఘానికి సంఘమే - ఎన్నికలలో పరాజయం చెందడం సంభవించేదా?

ఇంతగా తెలుగునాట కాంగ్రెస్ పలుకుబడి తగ్గిపోవడానికి కారణా లేవో పరిశీలించడానికి వరసగా కొన్ని సంపాదకీయాలు అవసరం.

[ఫిబ్రవరి 5, 1952]

2

కాంగ్రెస్ బలహీనతలలో మొట్టమొదటిగా పేర్కొనవలసింది దాని లోని విభేదాలు. ఏ పెద్దసంస్థలోనూ అన్ని సమస్యలపై, అన్ని సందర్భాలలో, అందరిమధ్య ఏకాభిప్రాయం వాంఛనీయమైనా కాదు. అది "విన్నన్న చెప్పింది వేదం." అనే మనస్తత్వానికి నిదర్శనం. వ్యక్తిగతాభిప్రాయాలు పూజ్య మన డానికి తార్కాణం. కాని, సంస్థలోవచ్చే భేదాభిప్రాయాలు సిద్ధాంతాలకు సంబంధించినవి కావాలి; ఇందుకు మారుగా అవి వ్యక్తులపై కేంద్రీకృతమైపోతే సంస్థ దెబ్బతింటుంది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌విషయంలో ఇంతే జరిగింది. దానిలో వ్యక్తిగత విభేదాలు మితిమీరి, వైరితలలు వేసి, పరస్పర నిందారోపణల వరకు - చివరికి పరస్పరదూషణలవరకు కూడా - అవి వెళ్ళిపోయాయి. ఇందువల్ల మొత్తం సంస్థే ప్రజలదృష్టిలో చులకనకావడం తటస్థించింది.

వ్యక్తిగతమైన విభేదాలు కాంగ్రెస్ సంస్థలో రాష్ట్రసంఘంనుంచి, గ్రామ సంఘంవరకు పెచ్చుపెరిగిపోవడంతో పూర్వపు సేవాధర్మం మరుగున పడి పోయింది; కాంగ్రెస్ సంఘాల కార్యకలాపాలు వాటి కార్యకర్తల ఎన్నికల సమయానికి పరిమితమైపోయాయి. ఇది ఆంధ్రప్రాంతంలో కాంగ్రెస్‌కు ఏర్ప డిన రెండవ బలహీనత.

ప్రజాసేవానురక్తి మందగించినా, స్వార్థదృష్టి ప్రబలకపోతే, అది గుడ్డిలో మెల్లగానైనా వుండేది. కాని, దురదృష్టవశాన కాంగ్రెస్‌సంస్థతో తమ సంబంధాన్ని, దానిలో తమస్థానాన్ని స్వప్రయోజనాలకు వినియోగించుకొనడం పెరిగింది. "ఇంతకుముందు మేము చేసిన అశేషత్యాగాలకు మేము ఏ కొద్ది గానో ప్రతిఫలం కోరడం దోషమా?" అని కొందరు బాహాటంగానే వాదించ నారంభించారు. కాంగ్రెస్ బలహీనతలలో ఇది మూడవది.

ఈ సందర్భంలో రాజకీయబాధితులకు భూదానం ప్రత్యేకంగా పేర్కొన దగింది. దేశసేవకు జీవితాన్ని అంకితంచేసి, కూడుగుడ్డలకు ముఖం వాచి,

పోరులో దూకినవారికి కొద్ది భూవసతిని చూపించి. జీవనాధారం కల్పించడం నిరాక్షేపణీయమే. కాని వారివారి ఆర్థికస్థితిగతులతో ఎంతమాత్రం నిమిత్తం లేకుండా, కాంగ్రెస్ పక్షాన కారాగారవాసం చేయడాన్నే భూదానానికి అర్హతగా చేయడమేమి, ఆర్థికస్తోమత నిజంగాలేనివారిని మొత్తంపై అశ్రద్ధచేసి, కాంగ్రెస్ సంస్థలో పలుకుబడిగలవారికి విలువైన భూములను కట్టబెట్టడమేమి, కొందరికి భూదానం పేరుతో మునిసిపల్ సరిహద్దులలో ఇళ్లస్థలాలుగా మారగల భూములను కేటాయించడమేమి ఈ విధానంపట్ల సర్వేసర్వత్రా ఏహ్యభావాన్ని పుట్టించింది.

ఇంతే కాదు. పెక్కుచోట్ల ఇది పాటకపుజనాన్ని కాంగ్రెస్‌కు బద్ధవిరోధులను చేసిందికూడా. సైన్యంలో పనిచేసివచ్చినామని, లేదా అధికోత్పత్తిని సాధించగలమని బంజరుల సాగుకు అర్జీలు పెట్టుకొని, ఎంతో కష్టపడి వాటిని బాగుజేసుకొని, రెండు, మూడు, పంటలను పండించుకొన్నవారిని తొలగించి, ఆ భూములను కాంగ్రెసువాదులకు అప్పగిస్తే, కాంగ్రెస్ పైనే కడుపుమంట పుట్టుకు రావడం సహజమే కాదా?

మరొక విధంగాకూడా ఇందువల్ల అపకారమే జరిగింది. కాంగ్రెస్‌ను సమర్థించినవారికి కాంగ్రెస్‌ప్రభుత్వం భూములివ్వడాన్ని కళ్ళారా చూచినవారు "ఇప్పుడు మమ్ము బలపరిస్తే, మా ప్రభుత్వం వస్తే, మీకు భూములు'' అని కమ్యూనిస్టులు చెప్పిన మాటలను నమ్మడం సహజంగానే జరిగింది.

గత యుద్ధ సమయంలో చర్చిల్ బ్రిటిష్ ప్రజలకు చేసిన వాగ్దానాన్ని మించినదాన్ని – "రక్తం, స్వేదం, అశ్రువులు" వాగ్దానాన్ని మించినదాన్ని ఎన్నడు చేయకపోయినా, "కో" అనగానే "కోకో" అంటూ కోటానుకోట్లు మారు పలికిన కాంగ్రెస్‌కు ఈనాటి ఎన్నికలలో తన తరపున ప్రచారం చేయడానికి మనిషికి రోజుకు రెండురూపాయలచొప్పున కూలియివ్వవలసిన దుర్గతి అక్కడక్కడ పట్టడం ఎంతటి మచ్చ!

[ఫిబ్రవరి 6, 1952]

3

కాంగ్రెస్ పరాజయానికి కారణభూతమైన ప్రభుత్వ విధానాలలో ప్రథమగణ్యమైంది మద్యనిషేధం. ఈ నిషేధం గాంధికి ప్రియతమమైనదే కావచ్చు. గాంధి నాయకత్వం వహించిననాటినుంచీ దీనికి కాంగ్రెస్ నిర్మాణ కార్యక్రమంలో స్థానం కలదనడం నిజమే కావచ్చు. దీన్ని అమలు పరచడంలో సామాన్య ప్రజల యోగక్షేమాలనే ప్రభుత్వం కోరినదనడం నిర్వివాదం కావచ్చు. అయినప్పటికీ ఈ సంస్కరణ ఏమీ సత్ఫలితాల నివ్వలేకపోయింది.

శాసనం ప్రకారం మద్యనిషేధం పూర్ణంగా అమలు జరిగితే, ఆదిలో ఎందరికి ఎంతగా కోపతాపాలు కలిగినా, క్రమక్రమంగా ప్రభుత్వానికి ప్రజా మోదాన్ని పొందగలిగేదేమో! కాని నిషేధం సక్రమంగా అమలు జరగనందున ప్రభుత్వవిధానం తమ మేలుకోసమే ఉద్దేశింపబడినట్టు పాటకప్రజనం గుర్తించ గల పరిస్థితులు రాలేదు. నేరిడిగా త్రాగేవారు చాటుగా త్రాగడం, సిసలైన సరుకుకు బదులుగా కల్తీది దొరకడం, అణా ఖర్చుచేయవలసినచోట రెండు అణాలు చెల్లించవలసిరావడం – పాటకప్రజనానికి కనబడిన మద్యనిషేధఫలితాలు ఇవి మాత్రమే.

పైగా, పెక్కుచోట్ల దొంగతనంగా కల్లు, సారాయిలను అమ్ముతున్న వారిని విడిచిపెట్టి, వాటిని తాగినవారిని పట్టుకొని శిక్షించడం కూడా జరిగింది. ఈ దొంగవ్యాపారం చేసేవారు సాధారణంగా కలవారు కాగా, శిక్షలు పడినవారు లేనివారు. ఇందుమూలంగా కలవారిదే రాజ్యమన్న అభిప్రాయం ప్రబలింది కూడా.

ఇంతేకాక వర్షాలు లేనిచోట్ల పైర్లు దెబ్బతినడంవల్ల తిండిగింజలకు కటకట తప్పక పోగా, పండినచోట కనీసపు అవసరాలకైనా తగినంత మిగల్చకుండా ఊడ్చుకుపోవడం వల్ల కటకట యేర్పడింది. రేషన్‌లో బియ్యం పరిమితి అంతకంతకు తగ్గింది. కొద్దిపాటి రేషన్ బియ్యంలో కూడా ఇన్ని రాళ్లూ, అన్ని రప్పలూ! ఏ చచ్చుగింజలో, పుచ్చుగింజలో, అవైనా కొన్ని కొన్ని చోట్ల వేళకు

దొరకవు. ఈ కష్టాలన్నీ మరీ హెచ్చుగా వెళ్ళబోసినవారు తిరిగి పాటకపు జనులే. ఇందువల్ల కష్టనష్టాలను సర్వజనులు సమానంగా పంచుకొనడం లేదన్న నమ్మకం వారిలో ప్రబలింది.

ఇక, రైతు లందరికి ధాన్యం ధరలవిషయమై కొంత అసంతృప్తి కలగగా, వారిలో సన్నకారువారికి విచక్షణలేని ధాన్యసేకరణ విధానం దుస్సహమైంది. రైతులకు కిట్టుబాటు ధరలు పుట్టడం లేదని మన రాష్ట్రప్రభుత్వం అంగీకరిస్తూనే వచ్చినా, వాటిని పెంచడానికి కేంద్రాన్ని తగినంతగా ఒత్తిడి పెట్టలేక పోయింది. చాలా ఆలస్యంగా హెచ్చింపును సాధించినా, అది బహుకొద్దిగా మాత్రమే.

వస్త్రసమస్య విషయంలోకూడా (బాధ్యత చాలావరకు కేంద్ర ప్రభుత్వానిదే కావచ్చు గాని), అవక తవకలు అనేకం జరిగాయి. చేనేత పరిశ్రమకు నూలు సరఫరాను ఎంతమాత్రం సరిగా సాగించనందున ఆ పారిశ్రామికు లందరు కాంగ్రెస్ ప్రతిపక్షాలను బలపరచడం తటస్థించింది.

[ఫిబ్రవరి 7, 1952]

4

కాంగ్రెస్ ఆ తప్పు చేసిందని, ఈ తప్పు చేసిందని వ్రాస్తుంటే “అది చేసిన ఒప్పులే లేవా?” అన్న ప్రశ్న ఉదయించడం సహజం. కాని, మన రాష్ట్రంలో కాంగ్రెస్ పొందిన అతిఘోరపరాజయం తర్వాత కావలసింది అది సాధించిన విజయాల సమీక్ష కాదు. అట్టి సమీక్ష ప్రస్తుతఘట్టంలో ఎంతమాత్రం కూడని ఆత్మసంతృప్తికి దారి తీస్తుంది. ఆత్మసంతృప్తికి మారుగా ప్రస్తుతం కావలసింది ఆత్మసంశోధన. “మనపట్ల ప్రజావిశ్వాసం ఎందువల్ల సడలింది?” అని కాంగ్రెస్‌వాదులు ఇప్పుడు ప్రశ్నించుకొనలేకపోతే కాంగ్రెస్‌సంస్థకు మరి భవితవ్యమే లేదు. ఎప్పుడో ఒకప్పుడు ఏవో కొన్ని తప్పులను చేయని రాజకీయ పక్షం వుండదు. కమ్యూనిస్టు పార్టీనే చూడండి. పోయిన పదేళ్ళలోనే అది

ఎన్నెన్నో తప్పులను చేసింది. వాటిలో చిట్టచివరిదీ, అతి ఘోరమైనదీ హత్యాకాండకు ఉద్యమించడం. ఈ దుష్టవిధానాన్ని ఆ పార్టీ అనుసరించిన ఘట్టంలో అది ఇంతింతనరాని ప్రజానిందకు లోనైంది.

ఇంత ఘోరమైన తప్పిదాన్ని చేసినపిమ్మట కమ్యూనిస్టు పార్టీ ఈ ఎన్నికలలో నోడెలోకైనా రాకుండా పోవలసింది. కాని ప్రతిపక్షులు చేసిన తప్పిదాన్ని తనకు అనుకూలంగా మార్చుకోగల రాజకీయవిజ్ఞతను కాంగ్రెసు చూపలేక పోయినందున, కలగవలసిన ప్రయోజనం దానికి కలగకపోగా, నష్టం ఎదురైంది.

''కాంగ్రెసుకే మీ వోటు'' అని ప్రచారం చేయడానికి తూర్పు కృష్ణా జిల్లాలో కొన్ని గ్రామాలకు వెళ్ళినపుడు ''వోటు వేస్తాము. కాని, గుడ్డలు కట్టుకువచ్చి వెయ్యమంటారా, లేక, విడిచివచ్చి వెయ్యమంటారా?'' అని గ్రామస్థులు వేసిన ప్రశ్నలద్వారా ఈ నష్టమేమిటో తెలుస్తుంది. అతి బాధాకరమైన విషయమైనందున దీన్ని గురించి ఇంతకంటె నేడు మేము వ్రాయగోరడం లేదు.

శాంతిభద్రతల పరిరక్షణకై తగు తీవ్రమైన చర్యలను గైకొనలేని ప్రభుత్వం ప్రభుత్వమే కాదు. కాని, శాంతి భద్రతల పరిరక్షణపేర విచక్షణారహితమైన నిర్బంధాలకు నేరస్థులతోపాటు అమాయకులను సయితం గురి చేయడం పాడికాదు. కమ్యూనిస్టు దౌర్జన్యాల ప్రతిఘటనలో ఇంతే జరిగింది. కనుకనే వారు చేసిన తప్పులు పూర్తిగా మరుగునపడిపోయి, కాంగ్రెసు నిందపాలు కావలసివచ్చింది.

ఏమైనా, మేము ఈ శీర్షికలోని తొలి సంపాదకీయంలోనే చెప్పినట్టు, కాంగ్రెసుకు వ్యతిరేకంగా వోటుచేసినవారు కమ్యూనిజంపై అభిమానంకొద్దీ ఆపని చేయలేదు; కాంగ్రెసుపై తాత్కాలికంగా కలిగిన అసంతృప్తివల్లనే ఆగ్రహంవల్లనే. వీటిని తొలగించగలిగితే, తిరిగి ఎన్నికలు వచ్చేనాటికి కాంగ్రెసు పతాకచ్ఛాయక్రిందికి ప్రజాబాహుళ్యం మరల చేరుతుంది.

పూర్తి ప్రజావిశ్వాసానికి పూర్వంవలెనే పాత్రం కావడానికి కాంగ్రెసు అవలంబించదగు సమగ్రకార్యక్రమాన్ని సూచించడం సులభంకాదు గాని, ఇకముందు కాంగ్రెసు ఏ దిక్కుగా నడవాలో స్థూలంగా నిర్దేశించవచ్చు.

సిద్ధాంతాలపై విభేదాలు లేకపోయినా, అన్యకారణాలవల్ల కాంగ్రెసు సంస్థ నుంచి ఇటీవల వైదొలగినవారి నందరినీ తిరిగి కూడగట్టుకు రావడానికి గట్టి ప్రయత్నం జరగాలి.

తాము కాంగ్రెసుకు చెందివుండికూడా ఈ ఎన్నికలలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కాంగ్రెసుకు వ్యతిరేకంగా ప్రచారం చేసినవారి నందరినీ సంస్థ నుంచి చెదపురుగులవలె ఏరివెయ్యాలి.

కాంగ్రెసులో తమ కున్న పలుకుబడిని ధనార్జననిమిత్తం దుర్వినియోగం చేసినవారిని వెలివెయ్యాలి. కాంగ్రెసువాదులు - ముఖ్యంగా కార్యకర్తలు - పర్మిట్లు, కోటాలు వగైరాలను పుచ్చుకొనడాన్ని నిషేధించాలి. బంధుమిత్రుల పేర ఈ పని చాటుమాటుగా జరుగకుండా తగు జాగ్రత్తలను తీసుకోవాలి. రాజకీయ రంగంలోనివారు నీతిపరులు కావడం మాత్రమే చాలదని, నీతిపరులని ప్రజలు చెప్పుకోగల స్థితిలో మెలగాలని గుర్తుపెట్టుకోవాలి.

రాజకీయబాధితులుగా భూములను పుచ్చుకొన్న కాంగ్రెసువాదులలో కూడు, గుడ్డలకు లోపంలేనివా రందరు ఆ భూములను విడిచిపెట్టాలి. ప్రజల కష్టనిష్ఠురాలలో కాంగ్రెసువారు భాగంపంచుకోవాలి. తాము పతితజనోద్ధరణ చేస్తున్నామన్న మనస్తత్వం పోవాలి; దాని స్థానంలో వాస్తవమైన సౌభ్రాత్రం నెలకొనాలి.

ఆదర్శాలకై అర్రులను జాచే యువతీయువకులను కాంగ్రెసుసంస్థలోకి ఆకర్షించగలగాలి. ఈనాటి కాంగ్రెసు సభ్యులలో నూటికి ఇద్దరు ముగ్గురు చొప్పునైనా పాతిక సంవత్సరాలలోపు వయస్సువారు లేకపోవడంలో కాంగ్రెసు సంస్థకున్న ఘోరప్రమాదాన్ని ఇప్పటికైనా తెలుసుకొనాలి.

"శ్రేయోరాజ్యం" లక్ష్యాన్ని మన రాజ్యాంగవిధానం పుటలకు పరిమితం చేయక, దాని అవతరణకు అనవరతకృషి ప్రభుత్వంద్వారానే కాకుండా, కాంగ్రెసు సంస్థద్వారా కూడా జరపాలి.

ఇవన్నీ జరగకపోతే ఎన్నికల పాఠాలను కాంగ్రెసు నేర్చుకోననట్టే!!

[ఫిబ్రవరి 8, 1952]

5

కాంగ్రెసువలె తక్కిన పార్టీలుకూడా అన్ని అసెంబ్లీ సీట్లకు పోటీ చేస్తే, వాటి గెలుపునుగురించిన సగటు అంచనాలు ఇప్పటి వాటికంటె తక్కువై వుండేవి. ఉదాహరణకు, కమ్యూనిస్టు పార్టీనే చూడండి. చెన్నపురి మినహాగా తక్కిన తెలుగు ప్రాంతాలలో కాంగ్రెసువలె కమ్యూనిస్టు పార్టీ కూడా మొత్తం 140 స్థానాలు అభ్యర్థులను పెట్టివుంటే, ఇప్పటి 39 తో పాటు మరొక 39 స్థానాలకు దానికి లభించేవని ఒక వేళ అనుకొన్నా, దాని గెలుపు మొత్తంలో నూటికి 56 వంతుల లోపు మాత్రమే అయివుండేది. కాని, అది 61 స్థానాలకు మాత్రమే పోటీచేయడంవల్ల దాని గెలుపు సగటు అంచనా నూటికి యించుమించు 66 వంతులుగా కనబడుతున్నది.

కొన్ని స్థానాలకే పోటీ చెయ్యడంవల్ల గెలుపు సగటు అంచనా పెద్దదిగా కనబడగల అవకాశం పైన చూపిన విధంగా వున్నప్పటికీ, కిసాన్ మజ్‌దూర్ ప్రజాపార్టీ, కృషికార్ లోక్‌పార్టీల గెలుపు సగటు అంచనాలు కాంగ్రెసు దానికంటె తక్కువైనవే.

ప్రజాపార్టీ 78 స్థానాలకు మాత్రమే అభ్యర్థులను నిలిపింది. వీరిలో గెలిచినవారు 20 మంది. దీని తాత్పర్యం ఈ పార్టీ గెలుపు నూటికి దాదాపు 26 వంతులు మాత్రమే అని.

ఇక కృషికార్ లోక్ పార్టీ 58 స్థానాలకు పోటీచేసి, 15 చోట్ల మాత్రమే గెలిచింది. ఈ గెలుపుకూడా యించుమించుగా నూటికి 26 వంతులే.

కాంగ్రెసుకు సంబంధించినంతవరకు ఈ అంచనా నూటికి 30 వంతులు కాబట్టి, కాంగ్రెసుతో పోల్చినపుడు ఈ రెండు పార్టీలు దానికంటె కూడా తక్కువ విజయాన్నే సాధించగలిగినవని చెప్పవలసివుంటుంది.

ఈ మాట చెప్పినట్టే మరొకదాన్ని కూడా చెప్పవచ్చు. కాంగ్రెసువారుగాను, మాజీ కాంగ్రెసువారుగాను కాకుండా, ఏకోన్ముఖులై వీరందరు ప్రజా సమ్ముఖంలో నిలబడివుండేమాత్రం కేవలం నూటికి 30 వంతులు, లేదా 26 వంతులు గెలుపును కాక, ఇందుకు తేలికగా రెట్టింపునైనా వీరు పొందగలిగి వుండేవారు.

ఏ కారణాలవల్లనైతేనేమి, పోయిన అయిదు సంవత్సరాలలో ఆంధ్ర కాంగ్రెసువాదులలో వచ్చిన విభేదాల వల్ల కాంగ్రెసువలె కాంగ్రెసునుంచి చీలిన వారు కూడా నష్టపడినట్టు ఈ అంచనాలనుబట్టి అనుకోవచ్చు.

పోయిన అయిదేండ్లలో వచ్చిన ఈ చీలికలకు విధానాలలోని వైరుధ్యం కాక, మనస్తత్వాలలోని వైరుధ్యమే ప్రధాన కారణం కాబట్టి, కొంత చిత్తశుద్ధిని, ఔదార్యాన్ని పరస్పరం ప్రదర్శించుకొనగలిగితే కాంగ్రెసు, మాజీ కాంగ్రెసు వాదులమధ్య విభేదాలను తొలగించుకోడానికి ఇప్పటికైనా అవకాశం కలదేమో!

ఈనాటి ఎన్నికల ఫలితాలవల్ల మరొక విషయంకూడా స్పష్టపడుతున్నది. అది స్వతంత్రులకు సంబంధించినట్టిది.

మద్రాసు అసెంబ్లీలో నేడు స్వతంత్రుల సంఖ్య 63. కాంగ్రెసువారి సంఖ్య తర్వాత ఇదే పెద్దది కాబట్టి, ఇది ఘనమైనదిగానే కనబడవచ్చు. కాని, రాష్ట్రంమొత్తంపై స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికలలో పోటీచేసినవారు 304 మంది. వీరిలో గెలిచినవారు 63 మంది. దీన్నిబట్టి వీరి గెలుపు నూటికి 21 వంతులు మాత్రం. రాష్ట్రం మొత్తానికికాక ఆంధ్రప్రాంతాలకు మాత్రమే అంచనా కడితే, స్వతంత్రుల విజయం నూటికి 16 వంతులే.

స్వతంత్రులుగా నిలిచినవారిలో కమ్యూనిస్టు పార్టీ సానుభూతిపరుల సంఖ్య స్వల్పమైంది కాదు. ఇప్పటి 63 మంది స్వతంత్రులలో పది హేడుగురు తమ వారే అని కమ్యూనిస్టు వర్గాలవారు పేర్కొంటున్నారు. ఈ పదిహేడు గురిని కూడా తగ్గిస్తే, రాష్ట్రం మొత్తంమీద స్వతంత్రులుగా గెలిచినవారు నూటికి 21 వంతులమంది కాక, 16 వంతుల మంది మాత్రమే. ఇంతే కాదు. ధరా వత్తులు పోయినవారిలో స్వతంత్ర అభ్యర్థులసంఖ్యే హెచ్చు.

దీన్నిబట్టి స్వతంత్రంగా నిలబడేవారికి ఎన్నికలలో అవకాశం తక్కువని విదితమౌతున్నది దీనికితోడు ఏదో ఒక పార్టీకి తగినంత పెద్ద మెజారిటీ రానిపక్షంలో సుస్థిర ప్రభుత్వస్థాపన సమస్య క్లిష్టతరం కాగలదని కూడా ఈనాడు మనకు ప్రత్యక్షంగా కనబడుతూనే వున్నది.

ఇది కూడా ఈ ఎన్నికల ఫలితాలనుంచి మనం నేర్చుకోవలసిన ఒక ముఖ్యగుణపాఠమే.

[ఫిబ్రవరి 9, 1947]

6

చచ్చు లేకుండా— కుండ బద్దలు గొట్టినట్టు— నడివీధిలో నిలబెట్టి తెలుగునాడు మొన్నటి ఎన్నికలలో ఒకమాట చెప్పింది.

ఏ సందేహాలకు తావులేకుండా-ఎట్టి సంకోచాలకు ఆస్కారాన్ని మిగల్చ కుండా— అప్పీలుకు వెళ్ళడానికి రవ్వంతైనా అవకాశ మివ్వకుండా- ఆంధ్ర దేశం మొన్నటి ఎన్నికలలో ఒక తీర్పు నిచ్చింది.

ఈ మాట, లేదా ఈ తీర్పు— ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు నాయకత్వంలో తనకు అణుమాత్రమైనా విశ్వాసంలేదని.

చేపల వేటకు బయల్దేరిన "అనగనగ.... ఒకరాజు" కొడుకులవలె ఆంధ్ర పార్లమెంటరీబోర్డులో ఏడుగురు సభ్యు లుంటే, వారు వెళ్ళిన ఏడు రేవులలో చివరికి చితుకుచేపకూడా వారికి చిక్కలేదు.

"ఎన్నికలు ఒక గాలిపాటు-ఏ క్షణానికి ఏ దిక్కుకు అది మళ్ళుతుందో, ఎన్ని సుళ్ళు తిరుగుతుందో" అని ఈ ఫలితాన్ని చులకనచేస్తే, అది ఆత్మవంచన కాగలదు. "వోటు వెర్రివాడి చేతిరాయి" అని పెదవి విరిస్తే, అది ప్రజా స్వామ్యానికే ద్రోహం కాగలదు. "ప్రజలు ఏమి తీర్పు చెబితే మన కేమి? మన సంస్థకు మనపట్ల విశ్వాసం నేటికీ వున్నదికదా?" అని సరిపెట్టుకొంటే, ప్రజా సంస్థగా కాంగ్రెసుకు మరి మంగళహారతి పాడవచ్చు.

కాంగ్రెసు పుట్టింది ప్రజలకోసమని, పెరిగింది ప్రజలమధ్యనే అని, మన గలిగింది ప్రజల ప్రేమవిశ్వాసాలకు అది పూర్తిగా పాత్రంకాగలవరకే అని కాంగ్రెసు నాయకులైనవారు ఆంధ్రదేశంలో చాలవరకు మరచిపోబట్టే ప్రజానీకం మధ్యకు వెళ్ళి ఎన్నికలసభలను జరపలేని దుస్థితి కొన్ని తావులలో వారికి పట్టింది.

[ఫిబ్రవరి 27, 1952]

ఎవరెస్ట్

రూపాయ, అణా, పైసలుతప్ప బ్రతుకులో మరి ఎట్టి విలువలు లేని వారికి ఎవరెస్ట్‌ను ఎక్కడానికి జరిగిన ప్రతిప్రయత్నం తిని కూర్చోలేక లేని పోని పని కల్పించుకొనడమే, హాయిగా బ్రతకలేక లేనిపోని ముప్పు కొనితెచ్చు కొనడమే! పది ప్రయత్నాలు విఫలమైన తర్వాత, పదకొండవసారి తిరిగి ప్రయత్నించి, ఎట్టకేలకు శిఖరాన్ని అందుకోగలిగామని సంతోషించడం వారి దృష్టిలో కేవలం వెర్రితనమే!!

ఘోర తపస్సుచేసి భగీరథుడు చివరికి తన లక్ష్యాన్ని సాధించాడంటే, అదొక అందం, చందం. ఆయన తపస్సు ఫలితంగా గంగావతరణం జరిగింది. కాగా, ఎవరెస్ట్ శిఖరాన్ని అందుకొనడానికి జరిగిన "భగీరథయత్నం" ఫలిత మేమిటి? సర్ జాన్ హంట్ నాయకత్వాన వెళ్ళిన జట్టులోని వారిద్దరు-టెన్‌సింగ్ నార్కీ, సర్ ఎడ్మండ్ హిల్లరీలు-శిఖరంపైకి వెళ్ళి దానిపై నాలుగు పతాకాలను ప్రతిష్ఠించి, కొన్ని నిమిషాలలోపలనే అక్కడినుంచి హుటాహుటిగా దిగిరావడం - ఇంతే కాదా?

రూపాయ, అణా, పైసలలోతప్ప బ్రతుకుకు విలువను కట్టలేనివారి దృష్టిలో ఎవరెస్ట్ శిఖరాధిరోహణ ఒక విశేషం కాకపోవచ్చుగాని, వీరి మనః ప్రవృత్తి ప్రాబల్యం వహించివుంటే, నరుడు నేటికీ వానరునిస్థితిలోనే మిగిలి వుండేవాడు.

ఆ పొలిమేరకు ఆవల ఏమున్నది? ఆ కొండకొనపై ఏమున్నది? ఆ నది అద్దరిని ఏమున్నది? తిని కూర్చోలేక ఈ విధంగా మధనపడ్డాడు కాబట్టే, మానవుడు పురోగామి కాగలిగాడు.

చేప ఈదగలుగుతున్నది, నే నెందుకు ఈదలేను,? పక్షి యెగర గలుగుతున్నది, నే నెందుకు ఎగరలేను? తిని కూర్చోలేక ఈ విధమైన తపన చెందాడు కాబట్టే, మానవుడు నాగరికుడు కాగలిగాడు.

పగలుతర్వాత రాత్రి, రాత్రితర్వాత పగలు ఎందుకు వస్తున్నది? చంద్రునికి వృద్ధిక్షయా లెందువల్ల? చెట్టుపైనుంచి పండు నేలమీదికే ఎందుకు రాలాలి, ఆకాశంలోకి ఎందుకు ఎగసిపోరాదు? గిన్నెపై సిబ్బెని కదిలిస్తున్న ఆవిరి యంత్రాలచక్రాలను కదలించలేదా? తిని కూర్చోలేక కొందరు వేసుకొన్న ఇట్టి ప్రశ్నలే మన వైజ్ఞానికశాస్త్రాలన్నింటికీ మూలం.

తిని కూర్చోవడమే బ్రతుకు కాదనుకొన్నవాడే మానవజాతిని ముందుకు నడిపించాడు. తిని కూర్చోవడం జంతులక్షణమని నమ్మినవాడే మానవజాతి వికాసాన్ని సాధించాడు. అయోమయమైన ప్రతిదీ మానవునిబుద్ధికి ఒకసవాలు; అసాధ్యమైనది ప్రతిదీ మానవుని ధీరోదాత్తతకు ఒక సవాలు. అగాధాలు అతడిని ఎల్లప్పుడు గొంతెత్తి పిలుస్తాయి; సుదూరాలు అతడిని చేయెత్తి ఆహ్వానిస్తాయి; ఔన్నత్యాలు అతడిని నిత్యం "ఛాలెంజి" చేస్తాయి. ఆ పిలుపును విన్నప్పుడే; ఆ ఆహ్వానాన్ని అంగీకరించినప్పుడే, ఆ "ఛాలెంజికి" వెనుదీయనప్పుడే అతడు సృష్టిలో తన ప్రత్యేకస్థానానికి నిజంగా అర్హుడౌతాడు.

ఇట్టి పిలుపే, ఇట్టి ఆహ్వానమే, ఇట్టి "ఛాలెంజే" ప్రపంచంలోని పర్వతాలన్నింటికంటె ఉన్నతోన్నతమైన ఎవరెస్టు హిమశిఖరంనుంచి మానవునికి చిరకాలంగా వస్తున్నది. దానికి అతడు బధిరుడు కాలేకపోయినాడు కనకనే, పది ప్రయత్నాలు విఫలమైనా, పదకొండవసారి ప్రయత్నించి, అతడు ఎవరెస్టు శిఖరంపై తన పతాకను ప్రతిష్ఠాపనచేశాడు.

ఈ విజయం దాన్ని సాధించిన కొందరిది మాత్రమే కాదు; ఇది పరాజయాన్ని గుర్తించని మానవతకే విజయం! అందువల్లనే హంట్, టెన్‌సింగ్, హిల్లరీలకు జరుగుతున్న అఖండసన్మానాలకు ఆ ముగ్గురికంటె మిన్నగా బ్రతుకు విలువలు రూపాయ, అణా, పైసలకు పరిమితం కావని భావించే ప్రతివ్యక్తి పొంగిపోతున్నాడు.

[జులై 1, 1953]

ఫలసిద్ధి

బాపట్లనుంచి కర్నూలుకు ఎన్ని మైళ్లో తెలియదుకాని యేళ్లమాత్రం నిండుగా నలభై. ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రం కావాలనే తీర్మానం 1913 లో బాపట్లలో ప్రథమాంధ్ర మహాసభలో జరిగింది. ఆ తీర్మానం 1953 లో కర్నూలులో ఫలసిద్ధిని పొందుతున్నది.

నాడు సమధికోత్సాహంతో బాపట్లమహాసభలో పాల్గొన్న వారిలో పెక్కు మంది నేడు కర్నూలు మహోత్సవాన్ని సంతృప్తితో తిలకించగలిగింది స్వర్గ ధామంనుంచి మాత్రమే ! మన అదృష్టంవల్ల నాటి మహాసభలో పాల్గొన్నవారు నేటికీ కొందరు మనమధ్య మిగిలివున్నారు కాని, నాడు వారు యౌవనులు కాగా, నేడు వయోవృద్ధులు. ఉద్యమ ప్రారంభం ఒక తరంలో, దాని లక్ష్యపరిపూర్తి మరొక తరంలో :

తిలక్, బెసెంట్, మాలవ్యా, గాంధి ప్రభృతుల సమేతంగా పెద్ద లందరు ఆమోదించారు, ఆశీర్వదించారు; అయినా, ఆంధ్రోద్యమ ప్రారంభంతర్వాత నలభై సంవత్సరాల పిమ్మటగాని, ఆంధ్రరాష్ట్రావతరణ జరగడం లేదు. విశిష్ట మైన ఒక ప్రజాకాంక్ష, వివాదాస్పదంకాని ఒక మహత్తరాదర్శం, విభిన్న వర్గాల సహాయ సహకారాలను పొందిన మహోద్యమం విజయప్రాప్తి నందడానికి ఇంతకాలం పట్టడం ప్రపంచచరిత్రలోనే అరుదైన సంఘటన!

ఇంతటి దీర్ఘకాలంతర్వాత, ఇంతటి గొప్ప త్యాగంతర్వాత ఆంధ్రరాష్ట్రా వతరణ జరుగుతున్నది కాబట్టే, నేడు యావదాంధ్రజాతికి ఒక మహాపర్వదినం. ఇంతే కాదు. ఆంధ్రజాతి చరిత్రలోనే ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగు మహి మాన్విత పుణ్యదినం.

అయితే నేడు ఆనందంతో ఆత్మావేదన కూడా పెనవైచుకొని వున్నది. ఆంధ్రభీష్మ న్యాపతి సుబ్బారావు పంతులు, సర్ బి. యన్. శర్మ, దేశభక్త కొండ వెంకటప్పయ్య పంతులు, దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య మొదలైన పెద్దలు ఆంధ్రరాష్ట్రాన్ని కళ్లారా చూచుకొనడానికి లేకపోయినారు గదా అనే విచారం ఈనాడు ఏ ఆంధ్రునికి వుండదు? ప్రత్యేకరాష్ట్రాన్ని పొందగలిగినా, పొట్టి శ్రీరాములును పోగొట్టుకొన్నామే అన్న బాధ ఈనాడు ఏ ఆంధ్రుని పీడించదు?

నేటి సంతోషసంరంభాలమధ్యనే ఒక పెద్ద అసంతృప్తి ప్రతి ఆంధ్రుని హృదయంలో దాగివుండగలదు కూడా! నేడు అవతరిస్తున్నది సమగ్రాంధ్ర రాష్ట్రం కాదు. తెలంగాణా దాని వెలుపలనే ఇంకా మిగిలివున్నది. గంజాం, కోరాపుట్టి జిల్లాలు, బస్తర్, చాందాలు దాని అక్కున చేరనేలేదు. సేలం, చెంగల్పట్టు, ఉత్తర ఆర్కాటు జిల్లాలలోని తెలుగు ప్రాంతాలు దానినుంచి వేరై వున్నాయి. కోలారు, తుమ్‌కూరు జిల్లాలు దానిలో అంతర్భాగాలు కాలేదు. మన బళ్లారి మనకు కాకుండా పోయింది. ఒక మాటలో నేడు ఏర్పడుతున్నది ఆంధ్రరాష్ట్రమే కాని, విశాలాంధ్ర కాదు. విశాలాంధ్రనిర్మాణం జరగనంతవరకు ఆంధ్రోద్యమ విజయం అసంపూర్ణమైనట్టిదే!

ఏక భాష, ఏక సంస్కృతి—ఇదే ఆంధ్రోద్యమానికి ప్రాతిపదిక. అయినప్పుడు, ఆంధ్రమే మాతృభాషగా గలవారు లక్షలాదిగా ఆంధ్రరాష్ట్రం సరిహద్దుల వెలుపల మిగిలివుండగా, ఆంధ్రోద్యమం పూర్తివిజయాన్ని పొందినట్టు ఏ విధంగా సంతృప్తిచెందగలము? ఇంతే కాక, విశాలాంధ్ర లేనిదే ఆంధ్రజాతి సర్వతోముఖాభివృద్ధి సులభసాధ్యం కాగలదా?

సందేహం లేదు—ఆంధ్రుల సర్వతోముఖాభివృద్ధికి విశాలాంధ్ర అత్యవసరం, కాదు, ప్రాణావసరం. అయితే, ఆ విశాల లక్ష్యాన్ని మనం చేరుకొనగలగడం ఆంధ్రరాష్ట్రాన్ని త్వరలో—అతి త్వరలో—ఒక స్థాయికి తెచ్చుకోగలిగితేనే! పోయిన నలభై సంవత్సరాల కృషితర్వాత నేటికి ఒక రాష్ట్రాన్ని తెచ్చుకొనడం ఒక యెత్తుకాగా, వచ్చే నాలుగు సంవత్సరాలలో కాలు నిలదొక్కు-

కొనడంలో పడవలసిన శ్రమ ఒక్కటీ ఒక యెత్తు. నేడు కర్నూలులో జరగ వలసింది కంకణవిసర్జన కాదు; పునః కంకణధారణ. ఆంధ్రరాష్ట్రాభ్యుదయ సాధనకు, విశాలాంధ్ర నిర్మాణానికి నేడు ప్రతి ఆంధ్రుడు తిరిగి కంకణం కట్టుకోవాలి.

ఆంధ్రరాష్ట్రం సరిహద్దుల వెలుపల మిగిలిన సోదరాంధ్రులపట్లనే కాక కన్నడ, కేరళ, మహారాష్ట్ర ప్రజలపట్ల కూడా తమకు గురుతర బాధ్యత కలదని ఆంధ్రపౌరులు ఒక్క క్షణమైనా విస్మరించరాదు. భాషారాష్ట్రాల మహోద్యమాన్ని ప్రారంభించినవారు ఆంధ్రులు. దాన్ని పెంచి, పెద్ద చేసిన వారు ఆంధ్రులు. ఆ మహోద్యమానికి తమ నాయకత్వాన్ని నిలుపుకోవాలంటే, భాషాప్రయుక్తంగా దేశవిభజన పూర్తిగా కొనసాగడానికి వారు సంపూర్ణ దోహద మివ్వాలి. నేటి పరిస్థితులలో వారివ్వగల దోహదం, దేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత ప్రప్రథమంగా ఏర్పడుతున్న తమ భాషారాష్ట్రాన్ని విజయ వంతం చేసుకొనడం! లేకపోతే, మరొక భాషారాష్ట్రం అవతరించడమే అనుమానం!

ఔను! నేడు తిరిగి కంకణం ధారణ చేయాలి; విజిగీషతో ముందుకు—మున్ముందుకు—పురోగమించాలి; ఆంధ్రరాష్ట్రావతరణను సార్థకం చేసుకొని, విశాలాంధ్రను సాధించాలి!! ఈ కృషిలో నాయకులు, అనుచరులు అనే భేదం తగదు. ఇది అందరికీ పరీక్షాసమయం; ఇది అందరిపైగల బాధ్యత. అభ్యుదయపథంలో నేడు మనం పెడుతున్నది మొదటి అడుగు మాత్రమే!

[అక్టోబర్ 1, 1953]

విశాలాంధ్ర

ఆంధ్రరాష్ట్రావతరణ మహోత్సవసందర్భంలో ఒకే ఒక అపశ్రుతి వినవచ్చింది అది, — విశాలాంధ్ర సమస్యపై కర్నూలులో పత్రికావిలేకరుల గోష్ఠిలో భారతప్రధాని చేసిన ప్రకటన.

"నేడు శుభదినం. ఒక నూతన రాష్ట్రం నేడు అవతరిస్తున్నది" అంటూ ఆంధ్రరాష్ట్రానికి ప్రారంభోత్సవం చేసినప్పటికీ, భాషారాష్ట్రోద్యమం ఆశయాలను పండిట్ నెహ్రూ ఇప్పటికీ సరిగా అర్థం చేసుకోలేదని - సరిగా అర్థంచేసుకొనడానికి కనీసం ప్రయత్నమైనా చేయడంలేదని - విశాలాంధ్ర సమస్యపై ఆయన చేసిన ప్రకటననుబటి అనుకోవలసివస్తున్నది.

ప్రజాస్వామ్యానికి సామర్థ్యం ప్రజల సహాయసహకారాలతో ప్రభుత్వం కొనసాగినప్పుడే. అంధప్రాయంగా కాక, విచక్షణతో, వివేకంగా ఈ సహాయ సహకారాలు లభ్యంకావడం ప్రజలభాషలో పరిపాలన కొనసాగినప్పుడే. మన దేశంలో ఒకే భాష ప్రచారంలో వుండివుంటే, భాషారాష్ట్రాల ప్రశ్న వచ్చి వుండేదే కాదు. సువిశాలమై, దాదాపు ఒక ఖండాన్ని పోలిన మన దేశంలో (జాతీయభాషగా హిందీ గుర్తించబడిన పిమ్మట కూడా) వేర్వేరు ప్రాంతాలలో వేర్వేరు భాషలు విధిగా ప్రచారంలో వుండక తప్పదు. ఇది కాదనరాని సత్యం కాబట్టి, హిందీని జాతీయభాషగా నిర్ణయిస్తూనే భారతరాజ్యాంగం ప్రధాన మైన దేశభాషలుగా మరి కొన్నింటిని గుర్తించింది. అయినప్పుడు, ఈ ప్రధాన భాషలవారు తమ ప్రాంతాల ప్రభుత్వాలు తమ భాషలలోనే కొనసాగాలని కోరడం ఏ విధంగా తప్పు కాగలదు? వారి కోర్కెను తిరస్కరించి, ప్రజా బాహుళ్యానికి తెలియని భాషలో రాష్ట్ర ప్రభుత్వాలను కొనసాగిస్తే, ప్రజా

స్వామ్యమే ప్రాతిపదికగాగల భారత రాజ్యాంగం ఏ విధంగా లక్ష్యసంపూర్తిని పొందగలదు?

భాషారాష్ట్రాలు వినా భారతదేశంలో ప్రజాస్వామ్యవ్యవస్థ వేరుదన్న దానికే వీలులేదు. అయినా, భారత జాతీయతకు భాషారాష్ట్రాలవల్ల విఘాతం కలగగలదని కొందరు పెద్దలే అనుమానించడం శోచనీయం. భాషా ప్రయుక్తంగా కాంగ్రెసుసంస్థ వ్యవస్థీకరణ జరిగిన పిమ్మటనే అది వాస్తవికమైన ప్రజాసంస్థగా రాణించగలిగింది. అయినా, భాషారాష్ట్రాల నిర్మాణంపట్ల వైముఖ్యాన్ని ప్రదర్శించడం శోచనీయమేకాక, ఆశ్చర్యకరం కాదా?

మరొక విషయం: భాషాప్రయుక్త రాష్ట్రవిభజన సూత్రాన్ని కొత్తగా మనమే అమలుపరచబోవడంలేదు. సోవియెట్ రష్యా ఏనాడో దాన్ని పూర్తిగా ఆచరణలో పెట్టింది. అందువల్ల అది ఎంతమాత్రం బలహీనపడలేదనడానికి నిదర్శనం, – ప్రపంచ చరిత్రలోనే కని, విని యెరుగని విధంగా హిట్లర్ ముట్టడి జరిపినప్పటికీ రష్యన్ జాతీయతాభావం చెక్కుచెదరకుండా నిలపడమే;

ప్రజాస్వామ్య సార్థక్యానికి ప్రజాభాషలలో పరిపాలన కొనసాగడం ముఖ్యావసరమని గుర్తించిన పిమ్మట ఎంత త్వరలో భాషా రాష్ట్రాలను నిర్మిస్తే, దేశానికి అంత క్షేమం, ప్రజలకు అంత పురోగతి. భారత ప్రధాని నేడు చెన్నపురిలో వివరించినట్టు, ప్రజలకు అన్నవస్త్రాల లోపాన్ని తీర్చడం, వారి జీవనప్రమాణాన్ని పెంచడం మొదలైనవి ముఖ్యసమస్యలే. కాని, ఈ శారీరకావసరాలను తీర్చడంతోపాటు, "ఈ ప్రభుత్వం నాది" అనే మానసిక సంతృప్తిని కలిగించడంకూడా అతిముఖ్యము. మానసికమైన ఈ సంతృప్తి లేకపోతే జాతీయపునర్నిర్మాణ కార్యక్రమం కుంటుపడిపోవడం తథ్యం.

నిన్న అవతరించినట్టిది అసమగ్రమైన ఆంధ్రరాష్ట్రమైనా అది ఎంతటి ఉత్సాహాతిశయాలను రేకెత్తించిందో భారతప్రధాని కర్నూలులో ప్రత్యక్షంగా చూచివున్నాడు. "నా రాజ్యం ఇక నాది" అనే భావం వెల్లువలా పెల్లుబుకడాన్ని నిన్న స్వయంగా చూచిన పిమ్మట కూడా మన "విశాలాంధ్ర" నినాదం వెనుక

దురాక్రమణోద్దేశ ప్రేరితమైన సామ్రాజ్యతత్త్వం గర్భితమై వున్నదని ఆయన పలకడం చాలా వింతగా వున్నది. ఆంధ్రోద్యమానికి పరాకాష్ఠ విశాలాంధ్ర. ఆ మహోద్యమం న్యాయమైనదని గుర్తించి, ఆంధ్రరాష్ట్రాన్ని నిర్మించిన మరుక్షణంలోనే విశాలాంధ్రను ఖండించడం - చాలా మృదువుగా చెప్పాలంటే - బహుచిత్రంగా వున్నది.

ఏమైనా, ఆంధ్రరాష్ట్రాన్ని సాధించిన లక్ష్యశుద్ధే, ఆ త్యాగనిరతే విశాలాంధ్రను కూడా త్వరలో నిజం చేయగలదన్న విశ్వాసం మాకు పరిపూర్ణంగా వున్నది.

[అక్టోబర్ 3, 1953]

కళాపోషణ

ప్రాచీనభారత శిల్పకళావైభవాన్ని ఘనంగా ప్రస్తుతించే సందర్భంలో పెక్కుమంది ఒక ముఖ్యవిషయాన్ని విస్మరించడం కద్దు. అజంతాచిత్రాలేమి, అమరావతి శిల్పాలేమి సమకాలికకళలుగా చెల్లిన సమయమొకటి కలదనేదే ఆ ముఖ్యవిషయం.

గతించిన ఆ కాలంవారు ఆ కాలంనాటి కళాకారులను ఆహ్వానించారు, ఆదరించారు, ప్రోత్సహించారు, పోషించారు. వీటి నన్నింటిని మించి, గౌరవించారు. అందువల్లనే నాటి శిల్పులు, స్థపతులు, చిత్రకారులు, ఇతర కళాకారులు నేటికికూడా సమస్తప్రపంచాన్ని సమ్మోహితం చేయగలుగుతున్న అపూర్వ కళాఖండాలను సృష్టించగలిగారు. ఉపాధిలేనిదే ఉపజ్ఞ వికసించదు; ప్రోత్సాహం లేనిదే ప్రతిభ పరాకాష్ఠను పొందలేదు. ఈ నగ్నసత్యాన్ని సమకాలిక భారతీయసంఘం గుర్తించడం లేదు కాబట్టే, ప్రాచీనభారత కళావైభవాన్ని ప్రస్తుతించుకొనడంతోనే మనం సంతృప్తి చెందవలసి వస్తున్నది.

అమరావతి శిల్పులు నేడు లేకపోవచ్చు. కాని, ఆ శిల్పనైపుణి దేశంలో చచ్చిపోయిందని అనలేము. అజంతా చిత్రకారులు కాలగర్భాన కలిసిపోయి వుండవచ్చు. కాని, ఆ చిత్రకళావైదగ్ధ్యం దేశంనుంచి మటుమాయమై పోయిందని అనలేము. ఆ నైపుణ్యం, ఆ ప్రతిభ నేటికీ మిగిలి వున్నాయి. అయితే, తగు దోహదం లేక అవి కృశిస్తున్నాయి. పోషించగల నాథుడుంటే, అవి తిరిగి చిగుర్చుతాయి, కొనలు సాగి, ననలు తొడిగి, దేశాన్ని పూలతోటగా మార్చివేస్తాయి.

కళాపోషణకు నేడు రాజులు లేనిమాట నిజం. అయితే, పోయినవారు రాజులే కాని, ప్రభుత కాదు. కాబట్టి ప్రభుతను సంక్రమింపజేసుకొన్న ప్రజలే, ప్రజాప్రభుత్వాలే ఇప్పుడిక కళాపోషణబాధ్యత వహించాలి.

ఇతర బాధ్యతలు అనేకం తనపైవున్నా, మన ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కళాకారుల పోషణవిషయంలో ప్రజాప్రభుత్వాల ఈ విధ్యుక్తధర్మాన్ని గుర్తుపెట్టుకొని, ఈ విషయమై రాష్ట్రప్రభుత్వాలకు ఒక ప్రత్యేక సందేశాన్ని పంపించడం హర్షనీయం. ప్రభుత్వాలు తాము నిర్మించే పెద్ద భవనాలను అలంకరించడంలో వీలైనంతవరకు భారతీయ చిత్రకారులను వినియోగించాలని ఆయన సూచించాడు. భవనాల నిర్మాణానికి కాగల వ్యయంలో వాటిని శోభాయమానంగా చేయడానికి కాగల ఖర్చు ఒక వీసమైనా కాదని ఆయన విశదపరచాడు. బహుపరిమితమైన అట్టి అదనపు ఖర్చుకు సంకోచించరాదని ఆయన హెచ్చరించాడు. ఆయన ఈ సందేశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలన్నీ ఆచరణలో పెట్టగలవనే విశ్వసిస్తున్నాము.

పాశ్చాత్యదేశాలలో ఏ పెద్ద భవనాన్ని చూచినా, దానిలో ఏవో కొన్ని చిత్రాలు, శిల్పాలు కనబడతాయి. జెనీవానగరంలోని నానాజాతిసమితి సభామందిరంలో గొప్ప కుడ్యచిత్రాలున్నాయి; అక్కడనే అంతర్జాతీయ కార్మికసంస్థ ప్రాంగణంలో అద్భుత శిల్పాలున్నాయి. కామన్సుసభాభవనంలో, దాని వెలుపల (లండన్) ఒక పెద్దమ్యూజియంవలె చిత్రాలు, శిల్పాలు విశేషంగా వున్నాయి. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన షెల్డోనియన్ థియేటర్‌లోను - దీన్ని ప్రత్యేక స్నాతకోత్సవాలకు వినియోగిస్తారు. దానికిచెందిన కొన్ని కళాశాలలలోను అనేక ఉత్తమ చిత్రాలను చూడవచ్చు. రోమ్, పారిస్ నగరవీధులలోనేమి, అక్కడి ఉద్యానాలలోనేమి, జీవకళ ఉట్టిపడుతున్న శిల్పాలు అసంఖ్యాకం. మన పబ్లిక్ బిల్డింగులు, పార్కులు మొదలైనవాటిని ఇదే విధంగా కళాక్షేత్రాలుగా మార్చుకొనడానికి ఇకనైనా గట్టి ప్రయత్నం జరగాలి.

కేవలం ప్రభుత్వాలే కాక, ప్రజా సంస్థలు సయితం కళాపోషణను తమ విధ్యుక్తధర్మాలలో ముఖ్యమైనదాన్నిగా భావించాలి. ప్రత్యేకించి దేవాలయాలు చర్చిలు, మసీదులు ఈ విషయంలో తగు శ్రద్ధ వహించాలి. అమరావతి, నాగార్జునకొండ, అజంతా, ఎల్లోరా, ఎలిఫెంటా మొదలైన వన్నీ నేడు శిథిల ప్రదేశాలైనా, ఒకనాడు ఆరాధనమందిరాలే. నిజానికి ఇండియా, ఇండో-చైనా, ఇండొనీసియా మొదలైన ఆసియాదేశాలలో నేమి, గ్రీసు, ఇటలీ, మొదలైన పాశ్చాత్య దేశాలలో నేమి శిల్ప, చిత్రకళలు మతసంస్థల ప్రాపులోనే మహోచ్చస్థితికి పోగలిగాయి.

కలవారుకూడా కళాపోషణ తమ పరమధర్మంగా భావించాలి. లక్షరూపాయలతో గృహనిర్మాణాన్ని చేసి, దానిలో నూరురూపాయలకు ఒక "ఒరిజనల్ పెయింటింగ్" ఖరీదుచేసి పెట్టడానికి లోభించేవారు మన శ్రీమంతులలో ఎందరు లేరు? తాము తమ గోడలకు తగిలించే చౌకబారు కేలండరు బొమ్మలు తమ సంస్కారదారిద్ర్యాన్ని లోకానికి వేనోళ్ళ చాటుతాయని వీరికి తోచనైనా తోచదు!

అన్ని సంస్థలనుంచి, అందరు వ్యక్తులనుంచి, మన కళలకు లభించవలసిన పోషణ పూర్తిగా లభించిననాడు మన కళాసంపత్తి ఏవో కొన్ని ప్రాచీన శిథిల ప్రాంతాలకు పరిమితంకాక, వాడవాడకు, వీధి వీధికి - దిష్టిపిడతలను పోలిన సిమ్మెంట్ బొమ్మల రూపంలో కాక - అమరావతీరీతులలోను, అజంతా తీరులలోను వ్యాపిస్తుంది!

[సెప్టెంబర్ 28, 1954]

భాషావిద్వేషాలు

జవహర్‌లాల్ నెహ్రూ రాజకీయవేత్త మాత్రమే కాదు; రచయిత కూడా. సాహిత్య, రాజకీయరంగాలలో ఆయనవలె సమాన ప్రతిభావంతులైన ప్రపంచప్రముఖులు - మాకు జ్ఞాపకం వున్నంతవరకు - ఈనాడు మరి యిద్దరే. వీరిలో మొదటి వ్యక్తి చర్చిల్; రెండవ వ్యక్తి మావో. గ్రంథకర్తగా చర్చిల్ ఇటీవలనే నోబెల్ బహుమానం పొందాడు. మావో చక్కని కవిత్వం చెప్పగల డని ప్రతీతి.

రచయితగా రాణించినవాడు కాబట్టే, భాషాసమస్యలపై నెహ్రూ వెల్లడించే అభిప్రాయాలలో కేవలం రాజకీయవేత్తలైనవారు చేసే ప్రకటనలలో కంచుకాగడాతో వెదకినా కానరాని సౌమ్యత, సహనం, వివేకం, చారిత్రకదృష్టి, వాస్తవికపరిజ్ఞానం మొదలైన సలక్షణాలు గోచరిస్తాయి. స్వప్రయోజనాల సాధనకోసం భాషావిభేదాలను దుర్వినియోగపరచడానికి వెనుదీయని రాజకీయ ప్రముఖులు పెక్కుమంది కానవస్తున్న ప్రస్తుత సమయంలో భాషాసమస్యలపై మన ప్రధాని ప్రకటనలకు ఎంత బహుళప్రచారం జరిగితే, దేశభవిష్యత్తుకు అంత భద్రత.

తమకు రాజకీయాలతో ప్రసక్తివున్నా, లేకపోయినా, రచయితలైనవారందరు నిన్న న్యూఢిల్లీలో మరాఠీ సాహిత్యపరిషత్తు వార్షిక సమావేశంలో నెహ్రూచేసిన ఉద్బోధప్రకారం భాషావైషమ్యాల నివారణకు శక్తివంచనలేని కృషి జరపాలి. మన సువిశాల దేశంలో ప్రధానమైన దేశభాషలు పన్నెండు, పదమూడు మాత్రమే. అవి సమానంగా, సర్వతోముఖంగా వికాసం చెందడానికి కూడా సదవకాశా లున్నాయి. ఇండియాలోని ఒక పెద్దరాష్ట్రంతోనైనా పరిపోలని స్విట్జర్లెండ్‌లో (దాని జనాభా 40 లక్షలు మాత్రం) నాలుగు భాష లున్నాయి జర్మన్, ఫ్రెంచి, ఇటాలియన్, రొమాన్ష్ — ఇవే ఆ నాలుగు భాషలు.

అక్కడ వీటిమధ్య ఏ విధమైన వైమనస్యం లేదు. దేశభాషలుగా ఈ నాల్గింటికి గుర్తింపు వున్నది, స్థానికప్రభుత్వ వ్యవహారాలు స్థానికభాషలోనే కొనసాగుతున్నాయి. ఫెడరల్ పార్లమెంట్‌లో ఈ నాలుగు భాషలలోనూ ప్రసంగించవచ్చు. ప్రతిపౌరుడు తన మాతృభాషతోపాటు కనీసం మరొక దేశభాషను అభ్యసిస్తాడు. అభ్యసించి తీరాలన్న ప్రభుత్వ నిబంధన కలదుకూడా. అందువల్లనే కొద్దిపాటి స్విట్జర్లెండ్ దేశంలో నాలుగు భాష లున్నా, వాటి మధ్య కలహాలు లేవు, కార్పణ్యాలు లేవు. నాలుగు భాషలే కాక, అక్కడ రెండు జాతులు (లాటిన్, నార్డిక్), రెండు క్రైస్తవమతశాఖలు (కేథలిక్, ప్రొటస్టెంట్) వున్నాయికూడా. అయినా, ఆ దేశంలోని జాతీయసమైక్యత మరెచ్చట కానరాదు. నిజంగా స్విట్జర్లెండ్‌నుంచి, స్విస్ పౌరులనుంచి మనం నేర్చుకొనదగింది ఎంతైనా వున్నది.

స్విట్జర్లెండ్‌లోవలె ఇక్కడ అన్ని దేశభాషలకు రాజభాష ప్రతిపత్తి కూర్చడానికి ఇక్కడి ప్రత్యేక పరిస్థితులనుబట్టి వీలులేదు. కాని, రాజభాషగా గుర్తించబడిన హిందీకి ప్రత్యేకమైన ఆధిక్యంకాని, తక్కినవాటికి న్యూనతకాని (నెహ్రూ హెచ్చరించినట్టు) లేదు. ఏదైనా ఒక భాషాభివృద్ధి, ప్రపంచంలో దాని ప్రతిపత్తి, దాన్ని మాట్లాడేవారి సంఖ్యాధికతపైకాక, దానిలో వెలువడే సాహిత్యంపై, ఆ సాహిత్యం సంపాదించుకొనే గౌరవంపై ఆధారపడివుంటాయి. కాబట్టి. స్వభాషాసేవకు ఉత్తమమార్గం – దానిలో ఉత్తమోత్తమ సాహిత్యసృష్టికి తపస్సు కాని, పరభాషావిద్వేషం కాదు.

భాషావిద్వేషాలలో దేశభవితవ్యానికే ప్రమాదం గర్భితమైవున్నది. దాన్ని తొలగించడానికి కృషి చేయవలసిన బాధ్యత (మన ప్రధాని హెచ్చరించినట్టు) ప్రత్యేకించి రచయితలదే !

[అక్టోబర్ 3, 1954]

ఏది ప్రగతి?

కృత, ద్వాపర, త్రేతాయుగాలు ఎన్నడో గతించిపోయినవని, ఇప్పుడు కలి నడుస్తున్నదని, పోనుపోను మరింతగా అధర్మమేమి, అరిష్టాలేమి తప్పవని శుద్ధఛాందసులు తప్ప మరెవ్వరు ఈనాడు నమ్మరు. మన దేశంలోనే కాక, అన్ని దేశాలలోను ఆధునికకాలంలో జరిగిన మహత్తర భావవిప్లవ మిదే! స్వర్ణయుగాన్ని చేరాలంటే, ముందుకు కాక, వెనకకు నడవాలనేవాని మానసిక స్వాస్థ్యాన్ని ఈనాడు శంకిస్తున్నారు, అతని చిత్తశుద్ధిని ఈనాడు ప్రశ్నిస్తున్నారు.

సృష్టిపరిణామాన్నిగురించి డార్విన్ గతశతాబ్దిలో అత్యంత ప్రతిభావంతంగా రూపొందించిన సిద్ధాంతాల ప్రత్యక్షఫలితమే ఆధునికకాలంలో కానవచ్చే ఈ భావవిప్లవం. ధర్మం నాలుగుపాదాలతో నడిచిన యుగంనుంచి పోనుపోను మానవుడు హీనస్థితికి దిగజారిపోవడంలేదు సరిగదా, కాలం గడిచినకొద్దీ అతడు మరింత వికాసాన్ని పొందుతున్నట్టుగా డార్విన్ ఎన్నెన్నో సాక్ష్యాధారాలతో నిరూపించాడు. సత్యాన్ని చూడలేనివారుతప్ప మిగిలినవా రందరు ఆయన సిద్ధాంతాలను నేడు పూర్తిగా ఆమోదిస్తున్నారు.

ప్రకృతి—దానితోపాటు మానవసంఘం కూడా—ప్రగతిశీలాబద్ధమైనవన్న ఈ సూత్రాన్ని అంగీకరించిన వారు కేవలం కమ్యూనిస్టులే కాకపోయినా ప్రగతిని తామే గుత్తగైకొన్నట్లు వారు నిరంతరప్రచారం కొనసాగిస్తుంటారు. వారి ప్రచారం ప్రకారం కమ్యూనిజాన్ని వ్యతిరేకించే ప్రతి ఒక వ్యక్తి అభివృద్ధినిరోధకుడే! డార్విన్ తెచ్చిన భావవిప్లవ కారణంగా "అభివృద్ధి నిరోధకుడు" అనే దూషణ దానికి పాల్పడజేయబడిన వ్యక్తిపట్ల ఎంతటి వైముఖ్యాన్ని ప్రజలలో—వారికి అవ్యక్తంగానే కూడా—పుట్టించగలదో కమ్యూనిస్టులకు బాగా తెలుసు. అందువల్లనే తమతో ఏకీభవించలేక పోయినవా రందరిపై ఆ బ్రహ్మాస్త్రాన్ని వారు సంధిస్తారు.

ప్రగతికి కమ్యూనిజం ఒక్కటే మార్గమైననాడు కమ్యూనిజాన్ని వ్యతిరేకించడం ప్రగతిని నిరోధించడమే కాగల దనడంలో సందేహం లేదు. కాని, ప్రగతికి ఎన్నో మార్గా లున్నాయి. ప్రతికక్షుల హృదయపరివర్తనద్వారా నవసమాజనిర్మాణాన్ని లక్షించే గాంధీయిజం అందు కొక మార్గం. పార్లమెంటరీ డెమోక్రసీద్వారా (రక్తపాతంతో నిమిత్తంలేకుండా) సోషలిస్టువ్యవస్థ సంస్థాపన యత్నం అందుకు మరొక మార్గం. అయినప్పుడు కమ్యూనిజానికీ, ప్రగతికీ అవినాభావ సంబంధం ఏదో కలదనడం కేవలం కమ్యూనిస్టులకు మాత్రమే తగు ప్రచారం!

ప్రగతికి కమ్యూనిజం ఏకైక మార్గం కాదు సరిగదా, వాస్తవికమైన ప్రగతి దానిద్వారా సాధ్యమా అనే ప్రశ్న కూడా వున్నది. జాతి, మత, కుల, వర్గ విభేదాలకు అతీతమైన వ్యవస్థ సంస్థాపించాలనే దాని లక్ష్యం సంస్తవనీయమైనదే. ఆర్థికన్యాయాన్ని కలుగజేయాలనే దాని ఆదర్శం శిరోధార్యమైనదే. నిజానికి గాంధి ఈ లక్ష్యాలసాధన కోసమే మరణించాడు; నెహ్రూ వీటికోసమే జీవిస్తున్నాడు. అయితే, కమ్యూనిజం వ్యక్తిని భౌతికంగా సముద్ధరిస్తూ, నైతికంగా అతడిపై దెబ్బతీస్తుంది.

ఉత్తమమైన లక్ష్యసాధనకు కమ్యూనిజం వినియోగించే అధమ పద్ధతుల వల్ల ఈ దుష్ఫలితం తప్పదు. ప్రేమకు మారుగా ద్వేషాని నమ్ముకొన్నట్టిది కాబట్టే, కమ్యూనిజం వర్గసామరస్యానికి మారుగా "వర్గయుద్ధాన్ని" (క్లాస్ వార్) ప్రోత్సహిస్తుంది. అహింసకు మారుగా హింసను నమ్ముకొన్నట్టిది కాబట్టే, శాంతియుత విప్లవానికి మారుగా రక్తపాతానికి కమ్యూనిజం ప్రోద్బలం చేస్తుంది. మానవప్రవృత్తి స్వతః విశిష్టమైనదని కాక, అధమాధమమైనదని కమ్యూనిజం నమ్ముతుంది కాబట్టే వ్యక్తిస్వాతంత్ర్యాన్ని ప్రోత్సహించడానికి మారుగా, మొత్తం దేశాన్నే అది ఒక జెయిలుగా మార్చుతుంది. ఇందువల్లనే ప్రగతికాములైనవారు కూడా కమ్యూనిజాన్ని వ్యతిరేకించడం. ఇట్టివారిలో మన దేశానికి సంబంధించినంతవరకు అగ్రగణ్యులు గాంధి, నెహ్రూలు. వీ రిద్దరు అభివృద్ధి నిరోధకులైతే, వీరిపై కమ్యూనిస్టులు విసిరే రాళ్ళు ఇతరులకు తగిలినా అందుకువారు విచారించ నక్కరలేదు; సిగ్గిలవలసిన అవసరం అసలే లేదు.

[జనవరి 5, 1955]

2

వ్యక్తిస్వాతంత్ర్య లక్ష్యాన్ని అవహేళన చేయడానికి కమ్యూనిస్టులు తమ ఎన్నికల ప్రచారంలో కొన్ని ప్రశ్నలు వేస్తున్నారు. "జమీందారు రైతులను దోచుకొనడం వ్యక్తి స్వాతంత్ర్యమా ?" అని వీరి మొదటి ప్రశ్న. ఇది వ్యక్తిస్వాతంత్ర్య మని ఎవ రన్నారు? రైతులను జమీందారు దోచుకొనరాదనే కదా, జమీందారీల రద్దును కాంగ్రెసు శాసనం చేసింది? స్వాధీనం చేసికొన్న జమీందారీలకు నష్టపరిహారం చెల్లించవచ్చునా, కూడదా అనే ప్రశ్నపై అభిప్రాయ భేదాలకు తావు వుండవచ్చు. అసలు చెల్లింపు తగదని, చెల్లించినా నామమాత్రంగానే చెల్లించాలని కాంగ్రెసువాదులలో పెక్కుమంది నిశ్చితాభిప్రాయం. తక్కిన రాష్ట్రాలలోకంటె అవిభక్త మద్రాసు రాష్ట్రంలో జమీందారీలకు చెల్లించిన నష్టపరిహారం తక్కువైనా, అదికూడా ఎక్కువేనని వ్యక్తిస్వాతంత్ర్యం ఒక ప్రాథమికస్వత్వమనే కాక, ఆది లేనినాడు జీవితం దుర్భరంకాగలదని నమ్మే తెలుగు పత్రికలు ఆందోళన చేశాయి. అయినప్పుడు, వ్యక్తిస్వాతంత్ర్యాన్ని కోరడం జమీందారులకు దోపిడిచేసే హక్కును కట్టుబెట్టవలసిందిగా కోరడమే కాగలదని కమ్యూనిస్టులు ఎలా అనగలరో వారికే తెలియాలి.

"భూమిని కష్టపడి పండించి, తిన తిండిలేకుండా మలమల మాడడం వ్యక్తిస్వాతంత్ర్యమా ?" అని కమ్యూనిస్టుల రెండవ ప్రశ్న. ఇదే వ్యక్తిస్వాతంత్ర్యమని ఎవ రన్నారు? కష్టం ఒకరిది కాగా, ఫలితం మరొకరిది కారాదనే కాదా భూస్వామ్యసంస్కరణలకోసం నెహ్రూ ప్రభుత్వం తాపత్రయ పడుతున్నది? ఈ విషయంలో మరి విలంబన తగదని ఈ మధ్యనే ప్లానింగ్ కమిషన్ రాష్ట్రప్రభుత్వాలను హెచ్చరించింది కూడా! ఇప్పటివరకు ఈ సంస్కరణ విషయంలో ఆలస్యం జరగడం నిస్సందేహంగా శోచనీయం. అయితే, కమ్యూనిస్టురాజ్యంలోవలె తలలను ఉత్తరించడానికి సంసిద్ధపడకపోతే, ఇట్టి సంస్కరణలను అములుపరచడంలో కొంత ఆలస్యం తప్పదు. ఏమైనా, అసలు సంస్కరణనే వ్యతిరేకిస్తున్నా రనడానికీ, సంస్కరణను తీసుకురావడంలో ఆలస్యంచేస్తున్నా రనడానికీ భేదం లేదా? భూస్వామ్య సంస్కరణలనే కాదు, వానికంటె విస్తృతమైనవాటిని కూడా వాస్తవికమైన ప్రజాస్వామ్యం ద్వారా సాధించవచ్చు. ఇందుకోసం వ్యక్తిస్వాతంత్ర్యాన్ని ఆహుతించే కమ్యూనిస్టువ్యవస్థే విధిగా ఏర్పడ నక్కరలేదు.

"ఆకలికి తాళలేక ఈ కాంగ్రెసురాజ్యంలో ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. ఇది వ్యక్తిస్వాతంత్ర్యానికి చిహ్నమా ?" అని కమ్యూనిస్టుల మూడవ ప్రశ్న. ఇదే వ్యక్తిస్వాతంత్ర్యమని ఎవ రంటున్నారో కూడా ఈ ప్రశ్న వేస్తున్న వారికే తెలియాలి. కూడుగుడ్డలకు ఎవ్వరికీ లోపంలేని—చదువు సంధ్యలకు ఎవ్వరూ దూరంకాని—మంచి ఆవాసానికీ, ఆరోగ్యానికీ ఎవ్వరూ పరాయివారు కాని—సాంఘికవ్యవస్థను నెలకొల్పడంకోసమే నెహ్రూ ప్రభుత్వం కృషిచేస్తున్నది. ఇట్టి శ్రేయోరాజ్యస్థాపనే భారతరాజ్యాంగ లక్ష్యం; ఇందుకోసమే సోషలిజం నవభారత సమాజానికి పునాది కావాలని ఈ మధ్యనే పార్లమెంటు చేసిన తీర్మానం; ఇందుకోసమే పంచవర్షప్రణాళికలు. అయినప్పుడు, క్షుదార్తిని బాపడానికి కమ్యూనిజం ఒక్కటే మార్గం కానక్కరలేదు గదా ? మరొక విషయం: అక్కడక్కడ బహు చెదురుగా మన దేశంలో క్షుదార్తి ఆత్మహత్యలకు దారితీసిన మాట నిజమే కావచ్చు. కాని, వ్యక్తిస్వాతంత్ర్యాన్ని కోల్పోయిన ఫలితంగా—ప్రభుత్వయంత్రంలో ఒక చీలగా బ్రతకవలసివచ్చినందున — నియంతృత్వవ్యవస్థలో స్వతంత్ర్యంగా వ్రాసే, స్వతంత్రంగా వ్యవహరించే హక్కును వదులుకొనవలసివచ్చినందున—జీవితంపై అసహ్యభావం పుట్టి, ఆత్మహత్య చేసుకొన్నవారు కమ్యూనిస్టు రాజ్యాలలో ఎందరు లేరు ?

ఇలా ఆత్మహత్యలు చేసుకొన్నవారు ఇతరుల దోపిడికి తమకు అవకాశాలు పోయినవని బ్రతుకును రోసినవారు కారు; విశృంఖలంగా, నీతిబాహ్యంగా, సంఘవిద్రోహులుగా సంచరించడానికి తమకు మరి వీలు లేదని జీవితంపై విసుగుపుట్టినవారు కూడా కారు. ఇదే భాష అనీ, ఇదే సాహిత్యం అనీ, ఇదే చిత్రకళ అనీ, ఇదే సంగీతం అనీ, ఇందుకు భిన్నంగా వెళ్లడం బూర్జువా మనస్తత్వం అనీ, విప్లవానికే విరుద్ధం అనీ నియంతృత్వప్రభుత్వం అనుదినం ఆదేశాల నిస్తుండగా—పైగా, భాషాస్వరూపాన్ని గురించి కాని, కళాహృదయాన్ని గురించికాని అభిప్రాయాలను వెలిబుచ్చడానికి ఎట్టి అర్హతలేనివారితో కూడిన నియంతృత్వం ఇట్టి ఆదేశా లిస్తుండగా—ఈ వ్యవస్థలో జీవితంకంటె మరణమే మేలని నమ్మినవా రెందరో (ప్రపంచసంస్కృతీవికాసానికి తాము చేయగల సేవ ఎంతో వుండగా కూడా) తమ చేతులతోనే తమ నిండుప్రాణాలను

తీసుకొన్నారు: పేగు లెండినందువల్ల ఆత్మహత్యలు తప్పని సంఘం ఎంతో ఘోరమైంది కాగా, ఎదద లెండిపోయినందున ఆత్మహత్యలు తప్పని వ్యవస్థ ఘోరమైందే కాక, మహానికృష్టమైంది కూడా!

వ్యక్తిస్వాతంత్ర్యం ఒక ప్రాథమిక స్వత్వమైనా, అది కొన్ని పరిమితులకు లోబడినట్టిదే! సమష్టిక్షేమానికీ, శ్రేయోరాజ్యసంస్థాపన కృషికీ భంగం కలగనివ్వనంతవరకే వ్యక్తిస్వాతంత్ర్యం ప్రాథమికస్వత్వం. ఈ పరిమితులకు లోబడిన వ్యక్తిస్వాతంత్ర్యాన్ని కూడా సమష్టిక్షేమం పేరుతో, శ్రేయోరాజ్య స్థాపన పేరుతో కమ్యూనిస్టువ్యవస్థ హరించివేస్తుంది. అందువల్లనే కమ్యూనిజం వాస్తవికమైన ప్రగతిశీలంతో కూడింది కాదు.

సాంఘికన్యాయాన్ని సాధించడానికి నియంతృత్వం ఒక్కటే మార్గం కాదు; సమష్టిక్షేమంకోసం వ్యక్తిస్వాతంత్ర్యాన్ని విధిగా బలిపెట్టనక్కరలేదు. ఈ సత్యాలను కమ్యూనిస్టులు గుర్తించరు కాని, వాస్తవికమైన ప్రగతిశీలు రందరు తప్పక గుర్తిస్తారు.

[జనవరి 11, 1955]

3

వాక్స్వాతంత్ర్యాన్ని, పత్రికాస్వాతంత్ర్యాన్ని, సమావేశస్వాతంత్ర్యాన్ని –పేరు, పేరున చెప్పడం దేనికి?–సర్వస్వాతంత్ర్యాలను కమ్యూనిస్టు రాజ్యాంగం గ్యారంటీ చేస్తుందని ఆ పార్టీవారు ఉద్ఘాటిస్తున్నారు. కమ్యూనిస్టు దేశాల రాజ్యాంగ ప్రణాళికలనుంచి ఏవో కొన్ని భాగాలను తమ వాదాన్ని బలపరచు కొనడానికి ఉదాహరిస్తున్నారుకూడా.

నిజమే! కమ్యూనిస్టు రాజ్యాంగం అన్ని స్వాతంత్ర్యాలను గ్యారంటీ చేస్తుంది. అయితే, కేవలం కమ్యూనిస్టులకు మాత్రమే: వారిలోనూ అధికారంలో గల వర్గానికి మాత్రమే: ఆ వర్గమే ప్రసంగాలను చేస్తుంది, అదే పత్రికలను నడుపుతుంది, అదే సభలను, సమావేశాలను ఏర్పాటు చేస్తుంది. ఇందుకు తగు

సర్వస్వాతంత్ర్యాలను - నిజమే - అధికారవర్గం పూర్తిగా కలిగివుంటుంది. పోతే, ప్రతిపక్షం ఈ స్వాతంత్ర్యాలలో దేన్ని కోరినా, అది దేశద్రోహం, ప్రజాద్రోహం, విప్లవానికి వెన్నుపోటు !!

తాము ప్రయోగించే ప్రతిపదాన్ని కమ్యూనిస్టులు ఒక పరిమితార్థంలోనే, ఒక ప్రత్యేకార్థంలోనే ప్రయోగిస్తారు. "ప్రజలు" అన్నప్పుడు వారు ఉద్దేశించేది కేవలం తమ పార్టీ సభ్యులను, దాని సానుభూతిపరులను మాత్రమే! "విప్లవం" అన్నప్పుడు కేవలం కమ్యూనిస్టు విప్లవాన్ని మాత్రమే. "ప్రగతి" అన్నప్పుడు కేవలం కమ్యూనిస్టు నియంతృత్వం దిశలో పురోగతిని మాత్రమే. ఇదే విధంగా "స్వాతంత్ర్యం" అనేది కూడా కమ్యూనిస్టులకు, వారి సానుభూతిపరులకు స్వాతంత్ర్యం మాత్రమే.

తమకే అన్ని స్వాతంత్ర్యాలు ఎందుకు పరిమితం కావాలనే ప్రశ్నకు కమ్యూనిస్టులు చెప్పే సమాధానం ఒక్కటే. తక్కినవా రెవరు? కమ్యూనిస్టు వ్యవస్థను, లేదా అధికారంలో నున్న కమ్యూనిస్టు వర్గాన్ని, వ్యతిరేకించే వారే కారా? ఆ ప్రజాకంటకులకు, ఆ దేశద్రోహులకు, విప్లవాన్ని వెన్నులో పొడిచే ఆ నరరూపరాక్షసులకు, స్వాతంత్ర్యం, ఎందు కివ్వాలి?

అయితే, వాస్తవికమైన ప్రజాస్వామ్యవాదులు ''స్వాతంత్ర్యం" అనే దానికి చెప్పుకొనే అర్థం ఇంతటి సంకుచితమైనదీ కాదు, ఇంతగా అసహనప్రేరిత మైనదీ కాదు. "నీ అభిప్రాయాలను నేను అమోదించలేను కాని, వాటి ప్రకటనకు నీకుగల హక్కును రక్షించడానికి నా ప్రాణా లొడ్డుతాను'' అనేది వాల్టేర్ దృక్పథం. వాస్తవికమైన ప్రజాస్వామ్యానికి తగు దృక్పథ మిదే! వాస్తవికమైన ప్రజాస్వామ్య సిద్ధాంతాలను గౌరవించేది కాబట్టి, నెహ్రూ ప్రభుత్వ దృక్పథం సయిత మిదే ! ఇందువల్లనే కమ్యూనిస్టులు నెహ్రూ నాయకత్వానికి, ఆయన ప్రభుత్వానికి విరుద్ధంగా యథేచ్ఛగా ప్రచారం కొనసాగించ గలుగుతున్నారు. పరిస్థితులు తలక్రిందులై, కమ్యూనిస్టుప్రభుత్వమే అధికారంలోకి వస్తే, దానికి విరుద్ధంగా బాహాటంగా ప్రచారం కొనసాగనీయడంమాట అటుంచి, చాటుమాటుగా నైనా అసంతృప్తిని వారు వెల్లడించనిస్తారా? కమ్యూనిస్టు వ్యవస్థలో గోడలకే

చెవులు మొలుస్తాయి; ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిద్రలో కలవరించినా, ''కాన్‌సెన్‌ట్రేషన్ క్యాంపు"కు గెంటడం తప్పదు!

రష్యా, చైనా ప్రజలు తమ కమ్యూనిస్టు వ్యవస్థలను హర్షిస్తే, అది వారికి సంబంధించిన విషయం. ఆ కారణాన వారిపై మనకు విరోధభావం కూడదు. కమ్యూనిజంపై ధర్మయుద్ధం జరపాలనడం అసలే కూడదు. కాని, కమ్యూనిస్టు వ్యవస్థ మన దేశానికి తగునా, తగదా అనే ప్రశ్న వచ్చినప్పుడు రష్యా, చైనాల ప్రసక్తి తీసుకురావడం ఒక్కొక్కసారి తప్పదు. ఆ దేశాలు భూతలస్వర్గాలని మన దేశం కమ్యూనిస్టులు దివారాత్రాలు కొనసాగిస్తున్న ప్రచారంవల్లకూడా వాటి ప్రసక్తి అనివార్యమౌతూవుంటుంది. అనివార్యమైన ఇట్టి పరిస్థితులలోనే రష్యా, చైనాలలో గల పత్రికాస్వాతంత్ర్యాన్ని గురించి నేడు కొంత ప్రస్తావించక తప్పదు.

రష్యాలో పత్రికాస్వాతంత్ర్యం లేదనడం ''పచ్చి అబద్ధ"మనీ (కమ్యూనిస్టుల మాటలన్నీ కూడా ఇలా "పచ్చి పచ్చి"గానే వుంటాయి), ఆ దేశంలో "ప్రావదా" పత్రికకు ఎవరైనా సరే పరిపాలనవిషయమై తమ కేవైనా ఫిర్యాదులుంటే, లేఖలు వ్రాసుకోవచ్చుననీ, ఇక్కడి కమ్యూనిస్టులు అంటున్నారు. దీన్ని బట్టి పత్రికాస్వాతంత్ర్యం అంటే, పార్టీతరఫునో, ప్రభుత్వం తరఫునో వెలువడే పత్రికకు సంపాదకుని పేర లేఖలను వ్రాసుకొనే హక్కుమాత్రమే అనుకోవలెనా? ఔను, అనుకోవలసిందీ ఇంతే; వాస్తవ పరిస్థితికూడా ఇంతే! నేడి భారత ప్రభుత్వస్థానంలో తమ ప్రభుత్వ స్థాపనకోసం ఆందోళన కొనసాగించడానికి ఇక్కడ కమ్యూనిస్టులు పత్రికలను ప్రారంభించి నడుపుతున్నట్టుగా రష్యాలో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పత్రికలను నడపనిస్తే, అప్పుడే అక్కడ నిజంగా పత్రికాస్వాతంత్ర్యం వున్నట్టు! కాని అదే పూజ్యం!!

సిడ్నీ, బియాట్రిస్ వెబ్‌లు సోవియట్ రష్యాపట్ల సుహృద్భావం కలవారు. ఈ బ్రిటిష్ ఫేబియన్ సోషలిస్టులు సోవియట్ రష్యాపై తాము వ్రాసిన విపులగ్రంథానికి ''సోవియట్ కమ్యూనిజం-ఎ న్యూ సివిలిజేషన్" అని పెట్టిన పేరును బట్టే, వీరికి ఆ దేశంపైగల సుహృద్భావం తెలుస్తున్నది. ఇట్టివారే

తమ పుస్తకంలో పరిపాలనలోని లోపాల విమర్శను దృష్ట్యాలో నిరోధించరు. సరిగదా, దాన్ని ప్రోత్సహిస్తారని, అయితే ప్రాథమిక సాంఘిక సమస్యలను గురించికాని, సాంఘికవ్యవస్థ పునర్నిర్మాణానికి కమ్యూనిస్టు విధానాలే కాక, అన్యవిధానాలు కూడా కలవనే విషయాన్ని గురించి కాని, స్వతంత్రాలోచనకు ఎంతమాత్రం అవకాశ మీయరని స్పష్టంగా వ్రాశారు.! స్వతంత్రంగా కొత్త ఆలోచనలు చేయగల హక్కుపైనే, ఆశ్చర్యకరమైన కొత్త సిద్ధాంతాలను సయితం ప్రతిపాదించగల హక్కుపైనే మానవజాతిప్రగతి ఆధారపడివుంటుందని కూడా వారిద్దరు హెచ్చరించారు.

అయినా, కమ్యూనిస్టువ్యవస్థలో ఈ హక్కు-పూజ్యం. ముందు కొంతకాలం కమ్యూనిజానికి పూర్తిగా వ్యామోహపడి, నెమ్మదిమీద నిజాన్ని తెలుసుకొన్న విఖ్యాత ఫ్రెంచి రచయిత ఆంద్రీ జీడ్ పలుకులలో "సోవియట్ యూనియన్‌లో అన్ని విషయాలపై- అది ఎట్టి విషయమైనా సరే – ఏకాభిప్రాయానికే తప్ప ద్వివిధాభిప్రాయానికి తావే లేదు. ప్రతి ఉదయం "ప్రావడా" పత్రిక ప్రజలకు వారు ఏమి తెలుసుకోవాలో, ఏమి నమ్మాలో, ఏమి ఆలోచించాలో చెబుతుంది. పోతే "ప్రావడా" ఏమి నమ్మాలో, ఏమి వ్రాయాలో క్రెమిలిన్‌లోని మూల విరాట్టులు తేలియజేస్తుంటారు. స్పెయిన్‌లోని అంతర్యుద్ధాన్ని గురించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చేవరకు "ప్రావడా" ఒక్క ముక్కకూడా వ్రాయలేదని జీడ్ పేర్కొన్నాడు.

ఇక, చైనాలో పత్రికాస్వాతంత్ర్యం సంగతిచూడబోతే, ఈ మధ్య తాను ఆ దేశంలో పర్యటన చేసినప్పుడు బాహ్యప్రపంచంలో ఏమి జరుగుతున్నదీ తాను అక్కడి మన రాయబారకార్యాలయంద్వారా తెలుసుకొనవలసి వచ్చిందని, ఆ పర్యటనమంచి తిరిగి రాగానే ఒక ప్రసంగంలో భారత ప్రధాని చెప్పాడు.

ఇదే కమ్యూనిస్టు సాంఘికవ్యవస్థలోని పత్రికాస్వాతంత్ర్యం! ఇదే దానిలోని ప్రగతిశీలం! సిడ్నీ, బియాట్రిస్ వెబ్‌ల పలుకులలో స్వతంత్రాలోచనకు అవకాశం లేనిచోట మానవజాతికి ప్రగతి లేనే లేదు. అయినా, కమ్యూనిస్టు వ్యవస్థలో స్వతంత్ర్యాలోచన "ప్రజాద్రోహం"!! అయితే ప్రజ లెవరని అడిగితే మాత్రం మళ్లీ మొదటికే రావలసి వస్తుంది.

[జనవరి 12, 1955]

జాతీయ విప్లవం

భావవిప్లవాన్ని సాధించనినాడు కర్మక్షేత్రంలో విప్లవం సాధ్యంకాదు. ఏదో ఒక వర్గంలోకాక, అన్ని వర్గాలలోను భావవిప్లవాన్ని సాధించి, మొత్తం జాతినే విప్లవపథంవెంట నడిపించడమే కాంగ్రెసు లక్ష్యం కాబట్టి, వర్గవిప్లవానికి కాక, జాతీయవిప్లవానికి అది నాయకత్వం వహిస్తున్నది.

ఏదో ఒక వర్గంలోనే కాక, అన్ని వర్గాలలో భావవిప్లవాన్ని సాధించడానికి ఎక్కువ కాలం పట్టగలదని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. ఏదో ఒక వర్గాన్ని కాక, అన్ని వర్గాలను విప్లవపథంవెంట నడిపించడం ఎక్కువ ప్రయాసతో కూడనిపని కాబట్టి, అట్టి సందర్భంలో పురోగతి కొంత మందంగా కొనసాగక తప్పదని వ్రాయవలసిన అగత్యం సయితం లేదు. అయితే, అన్యవర్గాలను హతమార్చనిదే వర్గవిప్లవం కొనసాగదు కాబట్టి, హింసతో తప్ప, విధ్వంసకాండతో తప్ప, అది కొనసాగదు. ఇంతే కాదు. వర్గ నియంతృత్వంలేనిదే ఆ విప్లవానికి రక్షణ లేదు. హింసతో అది కర్మక్షేత్రంలోకి వస్తుంది; హింసాత్మకమైన నియంతృత్వంద్వారా అది స్థిరత్వాన్ని సాధిస్తుంది; ఎప్పుడైతే హింసాత్మకవిధానాలలో అణుమాత్రంగానైనా చలిస్తుందో అప్పుడే అది పతనోన్ముఖమౌతుంది.

ఏదో ఒక వర్గం తోడ్పాటుతో కాక, అన్ని వర్గాల సహాయంతో-లేదా వీలైనన్ని వర్గాల సహాయంతోను, తక్కినవాటి తాటస్థ్యంతోను - పురోగమిస్తుంది కాబట్టి, జాతీయవిప్లవాన్ని కొనసాగించడానికి హింస, రక్తపాతం మొదలైన సాధనాలు అవసరం కావు. ఆ విప్లవరక్షణకు నియంతృత్వం స్థాపించనక్కరలేదు. అహింసద్వారా దాన్ని కొనసాగించవచ్చు; ప్రజాస్వామ్యంద్వారా దాన్ని రక్షించవచ్చు. అట్టి విప్లవనాయకుల కేమి, దానిలో పాల్గొనే జాతి కేమి,

ఎటుచూచినా కుట్రలే కనబడవు, ఎటుచూచినా గూఢచారులే ఎదురుపడరు; "ఇదుగో పులి" అంటే, "అదుగో తోక" అనే ధోరణిలో వారు కలత నిద్ర చెందరు.

చీకటిలో దొంగపోటుగా కాక, పట్టపగలు రాజవీధివెంట ప్రయాణంవలె జాతీయవిప్లవం సాగుతుంది. విద్వేషాన్ని, రక్తపిపాసను పురికొల్పడంద్వారా కాక, సంకుచిత బుద్ధిగలవారిలో కూడా, దురాశాపరులైనవారిలో కూడా నిద్రాణమైవుండే ఉత్తమగుణాలను జాగరితం చేయడంద్వారా జాతీయవిప్లవం పురోగమిస్తుంది. ఒక దుష్టుని వధించినప్పుడు అతడి దుష్టత్వంతోపాటు, సక్రమ పద్ధతులలో ప్రయత్నం చేస్తే, అతనిలో ఏ మూలనో - ఎంతో కొంతగా - దాగివుండే శిష్టత్వం కూడా నశిస్తుంది. దుష్టత్వం అణువణువులో జీర్ణించి పోయిన వ్యక్తివిషయంలోనైనా అతడి నైతికపునరుజ్జీవనాన్నిగురించి ఒక బుద్ధుడు, ఒక క్రీస్తు, ఒక గాంధి నిస్పృహ చెందడు. వీరి అంతస్తుకు రావడం సామాన్యమానవులకు అసాధ్యమైనా, అసలు నైతికపునరుజ్జీవనకృషి నిరర్థకమని భావించడం మానవప్రవృత్తిని సరిగా అర్థం చేసుకొనలేకపోవడమే. ప్రతిభా హీనులైన నాటకకర్తలు మానవస్వభావాన్ని సరిగా అర్థం చేసుకొనలేక, ఒక బాల్చీ సున్నాన్ని, మరొక బాల్చీ తారును సిద్ధపరచుకొని, కొన్ని పాత్రలను సున్నంలోను, మరికొన్నిటిని తారులోను ముంచెత్తుతారని బెర్నార్డ్ షా వ్రాశాడు. నైతిక పునరుజ్జీవనసూత్రంపట్ల ఎంతమాత్రం నమ్మకంలేని వర్గవిప్లవకారులను బెర్నార్డ్ షా పేర్కొన్న ఈ నాటకకర్తలతో పోల్చవచ్చు.

వర్గవిప్లవం కాక, జాతీయవిప్లవమే ఆదినుంచీ కాంగ్రెసు లక్ష్యం కాబట్టి, కొందరు ముందడుగు వేసినా మరికొందరు కొంత వెనుకబడినా, అందరినీ కూడగట్టుకొంటూ, అహింస సాధనంగా, అది అప్రతిహత పురోగమనాన్ని సాధించగలుగుతున్నది. ఈ పురోగతిలో ఒక నవఘట్టం మొన్నటితో జయ ప్రదంగా ముగిసిన ఆవడి మహాసభతో ప్రారంభమైంది. సోషలిజం ప్రాతి పదికగాగల నవభారత సమాజస్థాపన కృషిలో భాగస్వాములు కావలసిందిగా అన్నివర్గాలను ఈ మహాసభ ఆహ్వానించింది. రాజకీయ స్వరాజ్యంతర్వాత భారతజాతి చేరవలసిన గమ్యం ఆర్థికస్వరాజ్య మని అన్ని వర్గాలను అది ప్రబోధించింది.

సోషలిజం తమ ప్రస్తుత ప్రతిపత్తిని విలుప్తం చేసివేయగల వర్గాల వారు ఆవడి ఆహ్వానాన్ని ఎలా అంగీకరించగలరని, దాని ప్రబోధాన్ని ఎలా హర్షించగలరని ప్రశ్నించే వర్గవిప్లవకారులకు ఇటీవలి భారతచరిత్రే ప్రత్యుత్తరం. ఇండియాలో లీనీకరణకు సంస్థానాధిపతులు సమ్మతించడం తమ ప్రభుతకు తామై స్వస్తిచెప్పుకొనడమైనా అందుకు వారు సమ్మతించలేదా ? ఇలాగే జమీందారులుకూడా తమ జమీందారీల రద్దుకు అంగీకరించలేదా? "అయితే భరణాల కింద, నష్టపరిహారాలకింద వీరికి చెల్లిస్తున్న కోట్ల రూపాయల మాటేమిటి ?" అనే ప్రశ్న కొందరినుంచి వెంటనే వస్తుందని మాకు తెలుసు. కాని, ఆవడి కాంగ్రెసు మహాసభ వేదికపైనుంచి పండిట్ నెహ్రూ వివరించినట్టు, అన్య మార్గాలను అనుసరించడంద్వారా హింసరూపంలోను, కల్లోలరూపంలోను చెల్లించ వలసివచ్చే మూల్యంకంటె ఇది తక్కువైంది. ఇంతే కాదు. కలవారికీ, లేనివారికీ అంతరాన్ని నామమాత్రంచేయలేనిది సోషలిజం ప్రాతిపదికగాగల నవ సమాజం కానేరదు. ఈ అంతరాన్ని తగ్గించడానికి ఇప్పటికే మరణసుంకాలు మొదలైన శాసనాలు అనేకం జరిగాయి. ముమ్ముందు ఇట్టివి మరెన్నో జరగగలవు. అందువల్ల శాంతియుతమైన జాతీయవిప్లవానికి చెల్లించవలసిన మూల్యం ఇప్పుడు ఒకవేళ నిజంగా భారమైనదైనా, మరొక పదేళ్లకు భారంగా అది మిగలబోదు.

బలప్రయోగంతోకాక, సమ్మతిపై - విధ్వంసనద్వారా కాక, ప్రతికక్షుల నైతిక పునరుజ్జీవనద్వారా - పశుత్వంతో కాక, ప్రజాభిప్రాయ ప్రాబల్యంతో - కొనసాగే జాతీయవిప్లవాన్ని ఒక నూతన ఘట్టంలో ప్రవేశపెట్టింది కాబట్టి, ఆవడి కాంగ్రెసుమహాసభ (పండిట్ నెహ్రూ ఉద్ఘాటించినట్టు) "చిరస్మరణీయ-మైనట్టిది" కాగలదు.

[జనవరి 25, 1955]

పత్రికల భాష

నోటి దురుసుతనాన్నే గడసరితనంగా యెంచుకొనేవారు కొందరుంటారు. నోరు పారవేసుకొనకపోతే, పేరు ప్రఖ్యాతులు రావని నమ్మేవారు సయితం వుంటారు. అట్టివారిని పలకరించడమే పాపం. కుశలప్రశ్న వేసినా, వీరినుంచి వచ్చేది వంకర జవాబే. నొప్పించగల మేరకే తమమాటకు ఒప్పిదమన్నట్టు వీరు ప్రవర్తిస్తారు. గోష్ఠికి పిలిస్తే, వీరు తూలనాడనివారుండరు. ఉపన్యాసానికి ఆహ్వానిస్తే, వీరు ఉల్లంఘించని సభామర్యాద వుండదు. సందర్భాసందర్భాలను గుర్తించకపోవడమే వీరి ఘనత; ఉచితానుచితాలను పాటించకపోవడమే వీరి ప్రత్యేకత.

అయినా, ఇట్టివారికి పెద్దరికమిచ్చేవారుండే, అవి వారి "ఖర్మ" అని సరిపెట్టుకోవచ్చు. కాని, రేడియోను పోలిన ఒక ప్రభుత్వసంస్థ ఇట్టి వ్యక్తులను ఆహ్వానించి, తమ చిత్తంవచ్చినట్టు వీరు ప్రసంగించడానికి అవకాశ మివ్వడం తగునా ?

ఆలిండియా రేడియో విజయవాడకేంద్రంవారు ఇదే చేశారు. ఉగాదికి ప్రత్యేకకార్యక్రమంగా వారు ఏర్పాటుచేసినరచయితలగోష్ఠిలో "గద్యరచన" పై చర్చ జరగడానికి మారుగా, తెలుగు పత్రికలపై దుమ్మెత్తి పోయడం జరిగింది. గోష్ఠిలో పాల్గొన్నవారందరు ఈ పనిని చేయనిమాట నిజం. కాని, తెలుగు పత్రికారచయితలను తోటకూరకాడ పురుగులకంటెకూడా హీనంగా, హేయంగా తీసి పారవేస్తూ కనీస మిద్దరు ప్రబుద్ధులు ప్రసంగించారు. తెలుగు పత్రికలలో పనిచేస్తున్నవారెవ్వరికీ తెలుగు సరిగా రాదట. ఇంగ్లీషులో ఆలోచించి, వీరు తెలుగులో వ్రాస్తారట. ఇంగ్లీషుమాటలకు తెలుగు తెలియకపోతే, ప్రక్కవారినెవరినైనా అడుగుతారట. వారేదో చెప్పగా వీరేదో వ్రాస్తారట. ఇంగ్లీషు పదాలకు సరైన తెలుగు మాటలు కుదరకపోతే, దాన్ని తెలుగుభాష దౌర్బల్యం కింద జమ కడతారట. ఇంగ్లీషులోకి అనువదించడానికి వీలులేని తెలుగుమాటలు ఎన్నో వున్నాయని ఈ మందబుద్ధులకు తెలియదట. మాతృభాషాపరిజ్ఞానం లేని ఈ తెలుగు పత్రికారచయితల కారణంగాను, వీరు సృష్టిస్తున్న కృతకభాష కారణంగాను ఆంధ్ర సాహిత్యానికే మహాపచారం జరుగుతున్నదట.

సరిగా ఈ పలుకులలో కాకపోవచ్చుగాని, ఈ ధోరణిలో నడిచిన ఈ ప్రసంగాలు ఆంధ్రపత్రికాప్రపంచానికి అవమానకరమైనవనడం నిస్సందేహం. మహోజ్జ్వలమైనది తెలుగుపత్రికల చరిత్ర. దానికి అంకురార్పణ చేసినవారిలో శ్రీ కందుకూరి వీరేశలింగంవంటి మహామహు లున్నారు. దాన్ని బహుముఖంగా వ్యాపింపజేసినవారిలో శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు, శ్రీ ముట్నూరి కృష్ణారావు, శ్రీ సురవరం ప్రతాపరెడ్డివంటి ప్రజ్ఞానిధు లున్నారు. నేటి పత్రికారచయితలు ఈ పెద్దలు చూపిన దారివెంటనే చిత్తశుద్ధితో, శక్తివంచన లేకుండా నడవడానికి ప్రయత్నిస్తున్నారు. తిరిగి మనమధ్యకు ఒకసారి వస్తే, ఈ పెద్ద లెవ్వరు తాము విడిచిపెట్టి వెళ్లిన పత్రికారంగాన్ని చూచి సిగ్గుపడవలసింది ఏదీ లేదు. అయినా, మొన్నటి గోష్ఠిలో కొందరికి మాత్రం ఆధునికాంధ్ర పత్రికారంగంలోని పరిస్థితులు లజ్జాకరమైనవిగా తోచడం చిత్రం కాదా? వీరు ఈ విధంగా ప్రసంగించడానికి విజయవాడ రేడియో అధికారులు అవకాశమివ్వడం కేవలం విడ్డూరమే కాదా?

పత్రికలభాష కృతకమైనదట, దుర్బలమైనదట. స్వాతంత్ర్య సమరరంగాలలోకి ఉరకడానికి వేలాది ఆంధ్రులను ఉత్సహింపజేసిన భాష కృతకమైనదైతే, మరేది జీవద్భాష? వివిధ జాతులకు, విభిన్న సాంఘికవ్యవస్థలకు సంబంధించిన గంభీర రాజకీయవిషయాలలో సామాన్యుడైన ఆంధ్రుడు సయితం విశేషపరిజ్ఞానాన్ని ప్రదర్శించగలిగినాడని ఈమధ్యనే కదా సమస్తప్రపంచం ప్రస్తుతించింది? ఇట్టి గంభీరవిషయాల ప్రచారానికి తోడ్పడిన భాష దుర్బలమైనదైతే, ఏది శక్తివంతమైన భాష?

పత్రికలపై, పత్రికారచయితలపై మొన్నటి గోష్ఠిలో నోరు పారవేసుకొన్నవారు కన్ను తెరవకముందే పత్రికలు పుట్టినవని, వీరిని లోకం మరచిపోయినతర్వాత కూడా పత్రికలు వర్ధిల్లగలవని మేము హెచ్చరించగోరుతున్నాము. ప్రతి పత్రిక ఈ హెచ్చరికను చేయగలదనే మేము విశ్వసిస్తున్నాము. ఇంతే కాదు. తెలుగు పత్రికాప్రపంచాన్ని నిందించడానికి అవకాశ మిచ్చిన విజయవాడ రేడియోకేంద్రంవారి చర్యను సయితం ప్రతి పత్రిక తీవ్రంగా గర్హించగలదని ఆశిస్తున్నాము.

[మార్చి 27, 1955]

గౌతమ బుద్ధుడు

శాక్యసింహా! కపిలవస్తులో కన్ను తెరచిన నీవు కుసీనగరంలో కన్ను మూసి నేటికి రెండున్నర వేల సంవత్సరా లైంది. అయినా, నీ మూర్తి చెన్ను తగ్గలేదు; నీ సందేశం వన్నె తరగలేదు; కోటానుకోట్లకు నీ విప్పటికీ తెన్ను చూపుతున్నావు; మిన్నువాకకంటె మిన్నగా నీలోని కారుణ్యా సింధువు ఎన్నెన్నో జీవితక్షేత్రాలలోకి ప్రవహించి పసిడిని పండిస్తున్నది.

నీ తండ్రి నిన్ను శాక్యరాజ్యాధిపతిని చేయగోరాడు. కాని, ఆ గణరాజ్య వైశాల్య మెంత, దాని వైభవ మెంత? నిన్ను కన్నట్టి మహాభాగ్యం అబ్బివుండక పోతే, నాటి గణరాజ్యాలు పెక్కింటివిషయంలో జరిగినట్టు దాని పేరు సయితం ఎన్నడో విస్మృతిగర్భంలో కలిసిపోయివుండేది.

నీ తండ్రి నీకు కట్టబెట్టగోరిన అల్ప శాక్యరాజ్యంస్థానంలో నీ వొక అమరరాజ్యాన్ని - అనంతకోటి మానవహృదయాలపై తన అధికారాన్ని ప్రతిష్ఠాపనచేసిన ధర్మసామ్రాజ్యాన్ని — సంస్థాపించావు.

నీవు సంస్థాపించిన ఈ ధర్మసామ్రాజ్యం సరిహద్దులు శాక్యరాజ్యాన్ని దాటి, భారతావనిని దాటి, బర్మా, ఆఫ్ఘనిస్తాన్, మధ్య ఆసియా, సింహళం, టిబెట్, కాశ్మీర్, నేపాల్, సిక్కిం, భూటాన్, ఇండో-చైనా, ఇండొనీసియా, చైనా, కొరియా, జపాన్, మంచూరియా, మంగోలియా మొదలైన అనేక దేశాలకు విస్తరించాయి. ఇంతటి విస్తృతసామ్రాజ్యం నీకు తప్ప ప్రపంచ చరిత్రలోనే మరెవ్వరికీ లేదు.

సిద్ధార్థా! నిజంగా నీవు సిద్ధార్థుడవు. సారనాథ్‌వద్ద మృగదావంలో నీద్వారా ప్రారంభమైన ధర్మచక్రప్రవర్తనం ఈనాటికీ అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్నది. నీ జన్మస్థానమైన భారతదేశంలో నీ పేర ప్రసిద్ధమైన మతం - గమతం - అదృశ్యమైనా, నీ ప్రభావం జాతీయజీవితంలో ఒక అంతర్వా

హినిగా ప్రవహిస్తూనే వున్నది, ప్రజాహృదయంపై ఒక అసదృశశక్తిగా పని చేస్తూనేవున్నది.

"నా మతం నాతర్వాత అయిదువందల యేండ్లకు మించి మిగలదేమో!" అని ఒకానొక సందర్భంలో నీ వన్నట్టు ప్రతీతి. నీవు మహాపరినిర్వాణాన్ని చెంది 2,500 సంవత్సరాలైంది. అయినా, నీమతం మిగలని దేశాలలో సయితం నీ ధర్మం నేటికీ ఎంతో కొంత, ఏదో ఒక రూపంలో, నిలిచే వున్నది.

తథాగతా! ఎంత కృత్రిమమైనది - ఎంత కఠోరమైనది - నీవు అవతరించిననాటి భారతసంఘం! దానిలో కారుణ్యానికి తావు లేదు. క్రతువులపేర జంతుబలులతోపాటు నరబలులు సయితం కొనసాగుతుండేవి. కుల వర్ణ వ్యవస్థలు మానవతకే మచ్చగా వుండేవి. అజ్ఞానానికి ప్రోదిచేస్తూ, హింసాకృత్యాలను ప్రోత్సహిస్తూ పురోహితుడు సామాన్యప్రజలను పీల్చిపిప్పిచేస్తూ వుండేవాడు.

సమతలేని ఆ సంఘంలో నీవు సామాన్యమానవునికి పట్టాభిషేకం చేశావు. క్రౌర్యం రాజ్యంచేస్తున్న జీవితాలపై నీవు కారుణ్యాన్ని చిలికి, వాటిని పునీతంచేశావు.

కారుణ్యమూర్తీ! సోదరమానవులకే కాక, సకల జీవకోటికి పరివ్యాప్తమైనట్టిది నీ కారుణ్యం. ఎక్కడ, ఏ రూపంలో, ఎంత స్వల్పంగా దుఃఖం కనబడినా, నీ మనస్సు చివుక్కు మనేది, నీ గుండెలు గాయపడేవి, నీ కన్నులు చెమ్మగిలేవి, నీలోని ప్రత్యణువు ద్రవీభూత మయ్యేది. మహాసంబుద్ధి తర్వాత దుఃఖనివారణకై నీవు కనుగొన్న మార్గాన్ని అన్యులకు కేలెత్తి, ఎలుగెత్తి, చాటడానికే నీవు జీవించావు; అందుకోసమే మరణించావు. ఇది పొరపాటు, నీవు మరణించలేదు. నీ ప్రేమసందేశం లోకంలో మిగిలివున్నంతవరకు - మానవహృదయంలో కారుణ్యానికి స్థానం వున్నంతవరకు - నీకు మరణం లేదు. అందువల్లనే నీ మహాపరినిర్వాణ దినాన్ని నేటి ప్రపంచం నీ "జయంతి" గా కాక, నీ "వర్ధంతి"గా జరుపుకొంటున్నది!

గౌతమబుద్ధా! రెండున్నరవేల సంవత్సరాలనాడు మమ్ము వీడి వెళ్లినప్పటికీ నీవు మామధ్యనే వున్నావు, మాకోసమే పరితపిస్తున్నావు, మాపై కారుణ్యామృతాన్ని చిలుకుతున్నావు, మాకు నీ అహింసాసందేశాన్ని వి

న్నావు. నీ మతానికి నీ మాతృభూమిలో స్థానం మిగలకపోయినా, నీ సందేశానికి మేము బధిరులము కాము, నీ దివ్యజ్యోతికి మేము అంధులము కాము, మా హృదయాలనుంచి మేము నిన్ను వెలివేయలేదు.

నీ సిద్ధాంతా లన్నింటిని మేము పాలించడం లేదనడం నిజం. నీవు నిరసించిన జాతి, మత, వర్ణ, కుల వ్యవస్థలు తిరిగి నీ మాతృదేశంలో తలయెత్తినవని మేము అంగీకరిస్తాము. కాని, వాటిని చూచి మేము ఈ నాడు గర్వపడ్డం లేదు; సిగ్గిలుతున్నాము. ఇలాగే అన్యవిషయాలలో కూడా।

నీ అహింసాసిద్ధాంతం కొంతవరకైనా మా రక్తంలో జీతించిపోయింది. అందువల్లనే నీతర్వాత ఇరవై అయిదువందల సంవత్సరాలకు మామధ్య మరొక అహింసామూర్తి - మరొక కారుణ్యమూర్తి-గాంధి అవతరించడం తటస్థించింది. ఆ మహాత్ముని హత్యాపరాధానికి మా జాతి పాల్పడినా, ఆయన నీ మాతృదేశంలోనే తలయెత్తడానికి నీ ప్రభావమే కారణ మనడంలో సందేహం లేదు।

మహాత్మా। ఈ అణ్వస్త్రాలయుగంలో నీ అహింసాసందేశం ఆవశ్యకత. నీ కారుణ్యామృతం ఆవశ్యకత అత్యధికంగా పెరిగింది; ఆధునిక యుగానికి తగు కొన్ని మార్పులతో నీవు ప్రతిపాదించిన "పంచశీల" వినా నేటి ప్రపంచానికి శరణం లేదు. అందువల్లనే "సంఘం శరణం గచ్ఛామి" అనని బౌద్ధేతరులు సయితం, "బుద్ధం శరణం గచ్ఛామి" అననివారు సయితం, "ధర్మం శరణం గచ్ఛామి" అంటూ, నీ పాదపద్మాల శరణుజొచ్చుతున్నారు. నీ కివే మా జోహారులు!!

[మే 24, 1956]

భూస్వామ్య సంస్కరణలు

భూస్వామ్య సంస్కరణలు తగునా, తగవా అనేది ఈ నాడు చర్చ నీయాంశం కానేకాదు. ఆ సంస్కరణల కార్యక్రమం ఇదివరలోనే ప్రారంభ మైంది. ఒక్క మన దేశంలోనే కాక, ఫ్యూడల్ యుగంనుంచి ఆధునిక యుగా నికి పురోగమించడానికి యత్నిస్తున్న ప్రతిదేశంలో - సాంఘిక న్యాయాన్ని సమ కూర్చని రాజకీయస్వాతంత్ర్యం గుడ్డిగవ్వపాటికూడా చెయ్యదని నమ్ముతున్న ప్రతిదేశంలో - ప్రజాసామాన్యం సహాయసహకారాలతో సమతాస్వాతంత్ర్యా లేమి, శాంతిసుభిక్షా లేమి ప్రాతిపదికలుగా నవసంఘనిర్మాణాన్ని లక్షిస్తున్న ప్రతిదేశంలో - భూస్వామ్య సంస్కరణల కార్యక్రమం కొంతకాలంగా దీక్షతో కొనసాగుతూనేవున్నది.

అయినా, ఏ సోవియట్ రష్యానో ఒక బూచిగా చూపించి, భూస్వామ్య సంస్కరణలు తగవని ఇప్పుడు ప్రచారాన్ని ప్రారంభించడం చరిత్రగతికి అడ్డుగా నిలవడానికి ప్రయత్నించడమే! భూస్వామ్య సంస్కరణలు అమలు జరిగింది కమ్యూనిస్టు దేశాలైనా రష్యా, చైనాలలోనే కాదు; నాన్, కమ్యూనిస్టు రాజ్యాలైన ఈజిప్టు, బర్మా, థాయ్‌లెండ్, జపాన్‌లలోకూడా వాటి అమలు జరిగింది. చివరికి ఫార్మోజాలో సయితం (కమ్యూనిజం వినాశనాన్నే ప్రస్తుతం తన జీవితలక్ష్యంగా పెట్టుకొన్న మార్షల్ చాంగ్-కై షేక్ పరిపాలనలో వున్న ఫార్మోజాలో సయితం) భూస్వామ్య సంస్కరణలను ప్రవేశపెట్టక తప్పలేదు.

అయినా, భూసామ్య సంస్కరణలను ప్రవేశపెట్టడం కమ్యూనిస్టు వ్యవస్థను పరోక్షంగా ప్రతిష్ఠాపించడమే కాగలదని, కర్షకులను బానిసలుగా మార్చడానికే ఆ సంస్కరణలు ఉద్దేశించబడినవని ఎవరైనా ప్రచారం ప్రారం భిస్తే, ప్రపంచచరిత్రలోని నూతన పరిణామాలకు సంబంధించినంతవరకు వారు కుంభకర్ణనిద్రలో మునిగివున్నారనే మనం తీర్మానించుకొనవలసివస్తుంది.

భూస్వామ్య సంస్కరణలను అమలుపరచడం కమ్యూనిజాన్ని ఆహ్వానించడం కాదు; సాంఘికన్యాయాన్ని లక్షించడం. సాంఘికన్యాయం లేనిచోటనే కమ్యూనిజం పాదుకొంటుంది; అక్కడనే అది గట్టిగా వేళ్ళు తన్నుతుంది, అక్కడనే అది చిలువలు పలువలుగా పెరుగుతుంది, అక్కడనే అది చేదుకాయలను కాస్తుంది. ఈ సత్యాన్ని గుర్తించనేరక, సాంఘికన్యాయ సంస్థాపనే పరమ ప్రయోజనంగాగల భూస్వామ్య సంస్కరణలను నిరసించడం కమ్యూనిజాన్ని ఆహ్వానించడమే కాగలదు, లేదా ఫాసిజాన్ని అభిమానించడమే కాగలదు.

ఏమైనా భూస్వామ్య సంస్కరణల మంచిచెడ్డలనుగురించిన చర్చలోకి ఇప్పుడు దిగవలసిన ఆవసరమే లేదు. ఈ సంస్కరణలు కొనసాగాలని నిర్ణయించడమే కాక, వీటిని భారతప్రభుత్వం అప్పుడే కొంతవరకు అమలుపరచింది. జమీందారీల రద్దు ఈ సంస్కరణలో ఒకభాగం. ఈనాముల రద్దు వీటిలో మరొకభాగం. భూ వసతికి ఒక గరిష్ఠ ప్రమాణాన్ని నిర్ణయించడమేమి, భూస్వాములకు, కట్టుబడిదారులకు ఎట్టి సంబంధబాంధవ్యాలు తగునో నిర్దేశించడమేమి చివరి భాగం. ప్రస్తుతం మనం ఈ చివరి ఘట్టంలోనే వున్నాము. పెక్కు రాష్ట్రాలలో – ఢిల్లీ, బొంబాయి, పంజాబ్, రాజస్థాన్, హిమాచలప్రదేశ్, అస్సాం, మధ్యప్రదేశ్, ఒరిస్సా, కచ్, పెప్సు లలో – ఈ చివరి ఘట్టానికి సంబంధించిన కార్యక్రమంకూడా కొంతవరకు ముగిసింది. ఆంధ్రప్రదేశ్‌లో రేపు ఒకభాగం కానున్న తెలంగాణాలో సయితం భూస్వామ్య సంస్కరణలు అమలులోకి వస్తున్నాయి. అయినా, ఆంధ్రరాష్ట్రంలో ఈ విషయమై తాత్సారం జరగడం శోచనీయం.

ఒక దేశంలోవలె మరొకదానిలోగాని, ఒకరాష్ట్రంలోవలె మరొకదానిలో గాని తు. చ. తప్పకుండా ఒకే ఫక్కీని భూస్వామ్య సంస్కరణలు అమలు జరగడానికి వీలు లేదనుకోండి. ఒక చోటవున్న పరిస్థితులు మరొక చోట వుండవు. అందువల్ల ఒకే ప్రాతిపదికపై భిన్నప్రదేశాల సమస్యలను పరిష్కరించడం సాధ్యం కాదు. అయితే, సమస్య ఒక్కటే అయినప్పుడు, లక్ష్యం కూడా ఒక్కటే అయినప్పుడు, పరిష్కార విధానానికి సంబంధించిన వివరాల విషయమై ఏవో కొన్ని స్వల్ప భేదా లుండవచ్చుగాని, మూలసూత్రాలలోనే భేదాలకు వీలులేదు.

[జులై 14, 1956]

గాంధీ జయంతి

బాపూజీ మనమధ్య జన్మించాడు. మన స్వాతంత్ర్యంకోసం, మన సముద్ధరణకోసం విధివిరామంలేకుండా కృషిచేశాడు. ఆయన కృషి సగమైనా సఫలం కాకముందే ఆయనను మనమే బలిగొన్నాము. ఆయన భౌతికావశేషాలు మనకే మిగిలివున్నాయి. అయితే, ఆయన మన దేశానికే, మన కాలానికే చెందినవాడు కాడు; గౌతమ బుద్ధునివలె, ఏసు క్రీస్తువలె ఆయన దేశదేశాలకు, యుగయుగాలకు చెందినవాడు.

దేశ కాల పరిస్థితులు తక్కిన ప్రపంచ మహాపురుషుల విషయంలోవలె గాంధివిషయంలో కూడా ఆయన కార్యరంగాన్ని కొంతవరకు పరిమితం చేసిన మాట నిజమే. నిజానికి ఏసు క్రీస్తు, గౌతమ బుద్ధుల కార్యరంగాలు గాంధి దాని కంటె కూడా చాలా చిన్నవి. ఏసుక్రీస్తు పాలస్తీనాను దాటి వెళ్లినట్టు చెప్పడానికి బలమైన ఆధారా లేవీ లేవు. గౌతమబుద్ధుడు పశ్చిమ, దక్షిణ భారతాలకు తన నవధర్మ ప్రచారం చేయడానికి వెళ్లిన నిదర్శనాలు లేవు. అయినా, ఈ మహామహుల ప్రభావం వీరి నిర్యాణానంతరం దేశ కాల పరిస్థితులను అధిగమించి, అఖిల ప్రపంచానికి విస్తరించింది; జాతి, మత, వర్ణ, వర్గ, కులాది విభేదాలతో నిమిత్తం లేకుండా తరతరాలను తరింపజేసింది; చేస్తున్నది. ప్రస్తుతం గాంధి విషయంలో సరిగా ఇంతే జరుగుతున్నది.

స్వరాజ్యసాధన, అస్పృశ్యతానివారణ, జాతి మత విద్వేషాల నిర్మూలన, కుటీరపరిశ్రమల పునరుద్ధరణ, మద్యపాన నిషేధం – ఇట్టివే గాంధి పట్టుదలతో సాధించిన కార్యక్రమాలు. ఈ కార్యక్రమాలు పరిపూర్తి చెందవచ్చు; లేదా, వీటికి గాంధి జీవితకాలంలో వున్న ప్రాధాన్యం మరికొంత కాలానికి లేకుండా పోయినా పోవచ్చు. కాని, అంతమాత్రంచేత మానవాళి జీవితాలకు రూపురేఖలను దిద్దడంలో గాంధిప్రభావం తగ్గదు సరిగదా, నానాటికి అది నిరవధికంగా పెరుగుతుంది.

గాంధేయ ప్రభావ విశ్వరూపం నిశితదృష్టిగలవారికి ఇప్పుడే దృగ్గోచర మౌతున్నది. రాజద్రోహాన్ని ప్రేరేపించడమే పనిగా పెట్టుకొన్న అర్ధ దిగంబర సన్యాసిగా ఆయనను ఒకనాడు నిరసించిన బ్రిటిష్‌వారు ఇప్పుడు తమ మాటలకు తామే సిగ్గు పడుతున్నారు. మానవాభివృద్ధి నిరోధకుడుగా, విప్లవశక్తులను వక్ర మార్గాలు పట్టిస్తున్న ఛాందసుడుగా ఆయనను నిన్న, మొన్నటివరకు చిత్రించిన కమ్యూనిస్టు రాజ్యాలవా రిప్పుడు తమ తప్పు దిద్దుకొంటున్నారు. అహింసా సిద్ధాంతం రాజకీయరంగానికి సంబంధించినంతవరకు అర్థరహితమైనదని ఇదివరలో అపహాస్యం చేసినవారే అణ్వస్త్రాలనిర్మాణానంతరం అంతర్జాతీయ రంగంలో సయితం అహింసాసిద్ధాంతాన్ని అనుసరించకపోతే, మానవజాతికి సర్వవినాశం తప్పదని ప్రస్తుతం అంగీకరిస్తున్నారు.

అశేషరూపాలలో, అగణిత ప్రజాకోటికి, అనంత కాలాలవరకు గాంధి ఇదే విధంగా సందేశ మివ్వగలడనడానికి నిన్న బి.బి.సి. ద్వారా ఆయనకు దేశ దేశాలవారు విభిన్నదృక్పథాలనుంచి అర్పించిన జోహారులే ఒక నిదర్శనం. ఈ రేడియోకార్యక్రమంలో ఎందరు పాల్గొన్నారో అందరికీ అన్ని రూపాలలో గాంధి దివ్యమూర్తి సాక్షాత్కరించింది. ఒకరికి ఆయన "మికీ మౌజ్"గా కన బడగా, మరొకరికి ఆయన అలౌకిక సౌందర్యగరిమతో కనబడ్డాడు. ఒకరికి సూక్ష్మబుద్ధిగల రాజకీయచతురుడుగా ఆయన తోస్తే, ఇంకొకరికి ఆధ్యాత్మిక చింత తప్ప అన్యమెరుగని ఋషిపుంగవునివలె తోచాడు. ఒకరికి ఆయన నెచ్చెలి, మరొకరికి గురుతుల్యుడు. ఇంకొకరికి తాతయ్య. ఒకరి దృష్టిలో ఆయన నిత్య సంతోషి; ఇంకొకరి కథనం ప్రకారం ఆయన నిరంతర పథికుడు. ఇందరి కిన్ని విధలుగా ఆయన దర్శన మివ్వడం తన వ్యక్తిత్వంలోని వైవిధ్యంవల్లనే కాదు; దానికున్న వైశిష్ట్యంవల్లకూడా.

నిశ్చయంగా ఏసు క్రీస్తు, గౌతమ బుద్ధుల కోవకుచెందినవాడు గాంధి. ఆయన జయంతి సమస్త ప్రపంచానికీ, సర్వ కాలాలకూ మహాపర్వదినం.

[అక్టోబర్ 3, 1956]

1857

నూరేళ్ల క్రితం సరిగా ఈనాడు — మే 10 వ తేదీని — మన దేశంలో ఒక మహావిప్లవం ప్రారంభమైంది. నిజానికి అది ఈ తేదీనాడు ప్రారంభం కావలసింది కాదు. మరొకనాటికి — మే 31 వ తేదీకి — అందుకు ముహూర్తం పెట్టబడింది. ఆనాటివరకు ఆగితే, ఆ విప్లవం బహుశా జయప్రదమైవుండేదే! కాని, మీరట్‌లోని సిపాయిలు తొందరపడ్డారు. వారి తొందరపాటుకు తగు కారణం లేకపోలేదు. కాని, తాత్కాలికావేశాన్ని చంపుకొని, నిగ్రహంతో వారు మే 31 వ తేదీవరకు వేచివుంటే, దేశం మొత్తంమీద విభిన్న ప్రాంతాలలో ఒకే సారి విప్లవం ప్రారంభమైవుండేది. ఆ పరిస్థితిలో బ్రిటిష్‌వారు గుక్కతిప్పు కొనడం బహుశా అసాధ్యమైవుండేది.

నాటి విప్లవవైఫల్యానికి ఇదొక్కటే కారణం కాదనుకోండి. శిఖులు బ్రిటిష్‌వారిపక్షాన నిలవడం, కాశ్మీర్, నేపాల్, బరోడా, గ్వాలియర్, హైదరాబాద్ మొదలైన సంస్థానాలు విప్లవంపట్ల వ్యతిరేకత చూపడం మొదలైన ఇతర కారణాలుకూడా వున్నాయి. దాని వైఫల్యం కారణా లేమైనా, కొందరు బ్రిటిష్ చరిత్రకారులు వ్రాసినట్లు, అది కేవలం సిపాయిలంపితూరీ కాదు! ఒక భారతీయ చరిత్రకారుడు (డాక్టర్ ఆర్. సి. మజుందార్) తాను కొత్తగా ప్రచురించిన పుస్తకంలో నిరూపించడానికి ప్రయత్నించినట్లు, అది ఒక వ్యూహంప్రకారం నడిచిన జాతీయవిప్లవం కాదనడానికి సయితం వీలు లేదు.

ఎక్కడైనా - ఎప్పుడైనా - ఓటమి పొందిన తిరుగుబాటును "పితూరి" అనడం సహజమే. ఎక్కడైనా - ఎప్పుడైనా - గెలుపొందిన పితూరీని "విప్లవం" అనడంకూడా సహజమే. 1942నాటి "క్విట్ ఇండియా" మహోద్యమ ప్రత్యక్షఫలితంగా మనకు స్వాతంత్ర్యం లభించివుండకపోతే, దాన్ని చులకన చెయ్యడానికి ఎంతమంది ముందుకు వచ్చివుండేవారో!

ఎవరు కాదన్నా, 1857లో మన దేశంలో చెలరేగినట్టిది నిస్సందేహంగా జాతీయవిప్లవం. ఆవు కొవ్వుతోను, పందికొవ్వుతోను తయారుచేసిన తూటాలను తమ మతవిశ్వాసాలకు విరుద్ధంగా ఉపయోగించవలసిందిగా నిర్బంధిస్తున్నందుకు కినిసిన హిందూ, ముస్లిం సిపాయిలు ప్రధానపాత్ర వహించినా, నాటి విప్లవం కేవలం వారికే పరిమితం కాలేదు. సంస్థానాధిపతులు పెక్కుమంది దానిలో చేరారు. వారికి నాటి కుంఫిణీ ప్రభుత్వంపై విడివిడిగా ఏవో కోపకారణా లున్నమాట నిజం. ఉదాహరణకు, ఝూన్సీ లక్ష్మీబాయికి తన దత్తపుత్రుని రాజ్యాధికారాన్ని గుర్తించనందుకు ఆగ్రహం కలిగింది. తనను పీష్వా బాజీరావు దత్తత చేసుకొన్నా, 1851లో ఆయన నిర్యాణానంతరం అప్పటివరకు ఆయనకు చెల్లిస్తున్న పించను తనకు నిరాకరించడం నానాసాహెబ్‌కు కినుక తెప్పించింది. ఏవో కుంటిసాకులు వెదకి, స్వదేశసంస్థానా లన్నింటిని కైవసం చేసుకొనడమే పనిగా పెట్టుకున్న డల్హౌసీ విధానం ఫలితంగా తన రాజ్యాన్ని కోల్పోయిన రాణా కున్వర్‌సింగ్‌కు ఏమి కోపకారణం కలదో ప్రత్యేకించి వివరించ నక్కరలేదు. ఈ విధంగా వీ రందరికి వ్యక్తిగత కోపా లున్నా, కష లున్నా, కేవలం వాటిని తీర్చుకొనడానికే వీరు విప్లవంలో చేరలేదనడానికి ఒక నిదర్శనం - వీ రందరు చేరి విప్లవనాయకత్వాన్ని నాటి ఢిల్లీ పాదుషా బహదూర్ షాకు అప్పగించడమే.

సిపాయిలు, సంస్థానాధిపతులు మాత్రమే కాక, పెక్కుచోట్ల సామాన్య ప్రజలు సయితం 1857నాటి పోరాటంలో పాల్గొన్నారు. ఈ విషయాన్ని "ఆక్స్‌ఫర్డ్ హిస్టరీ ఆఫ్ ఇండియా" సయితం అంగీకరిస్తున్నది. దానిలోని వాక్యా లివి : "అది ప్రధానంగా బెంగాల్ సైన్యం విద్రోహ మైనప్పటికీ, కొవ్వు పూసిన తూటాలే అది చెలరేగడానికి తక్షణ కారణ మైనప్పటికీ, అది కేవలం సైనికులకే పరిమితం కాలేదు. ప్రజాబాహుళ్యంలో కూడా అశాంతి అప్పటిలో ఎంతగానో పెచ్చు పెరిగివున్నది. ఆ కారణానే పెక్కుచోట్ల సైనికులకంటె ముందుగా ప్రజలే తిరుగుబాటు చేశారు."

నాటి తిరుగుబాటులో ప్రజలే ఇంతగా ముందడుగు వేయడంలో అబ్బురం లేదు. నిజానికి కుంఫిణీ పరిపాలనవల్ల ఎక్కువగా కష్టనష్టాలకు లోనైంది వారే.

కుంఫిణీవారి దోపిడితో వారు చప్పగా చితికిపోయారు. కూడుగుడ్డలకైనా నోచుకొనని దుర్భర దారిద్ర్యస్థితిలో వారు పడిపోయారు. పూర్వపు తమ వృత్తులన్నీ క్రమక్రమంగా నశించిపోగా, బికారులై వారు నిలవవలసివచ్చింది. అయినప్పుడు విప్లవరంగంలో వారే అనేకప్రదేశాలలో పురోగాములుకావడం ఆశ్చర్యకరమైన విషయం కాదుగదా ?

ప్రజలు సయితం ఈ విధంగా ముందుకువచ్చిన తర్వాత 1857 నాటి పోరాటాన్ని కేవల మొక సిపాయి పితూరీగా చిత్రించడానికి ప్రయత్నించడం తగునా ? దేశంలో దాదాపు సగం ప్రాంతంలో చెలరేగిన ఆ పోరాటం—హిందువులతోపాటు, మహమ్మదీయులు, సంస్థానాధిపతులతోబాటు వివిధ రాష్ట్రాల ప్రజలు పట్టుదలతో పాల్గొనగా పెక్కు నెలలపాటు అతితీవ్రంగా కొనసాగిన ఆ పోరాటం—ఒక వ్యూహ మేదో లేకుండా జరిగిందని పేర్కొనడం భావ్యమా ?

పరాజయం చెందినందునే నాటి విప్లవప్రాముఖ్యాన్ని తగ్గించడం (ఆదిలోనే మేము వివరించినట్లు) జరిగింది. అయితే, ఒక దృష్టినుంచి చూచినప్పుడు ఆ పోరాటం నిరర్థకమైందని అనడానికి వీలు లేదు. దాని ఫలితంగానే గుడ్డిలో మెల్లగా కుంఫిణీ ప్రభుత్వంపోయి, బ్రిటిష్‌పార్లమెంట్ పరిపాలన వచ్చింది.

నూరేళ్లక్రితం సరిగా ఈనాడు ప్రారంభమైన ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్రవహించిన నానాసాహెబ్, తాంతియా తోపే, కున్వర్‌సింగ్, అమర్‌సింగ్, ఝాన్సీ లక్ష్మీబాయి, బహదూర్ షా ప్రభృతులకే కాక, నాటి అసంఖ్యాక అజ్ఞాతవీరులకు సయితం స్వతంత్ర భారత పౌరులమైన మనం ఈనాడు భక్తిశ్రద్ధలతో చేయెత్తి నమస్కరించాలి.

[మే 4, 1957]

"జాతికే ముప్పు"

"మీకు కోర్కెగా వుంటే, మమ్ములను పదవీభ్రష్టులను చేయడానికి మీ శక్తికొలదీ ప్రయత్నించండి. కాని, దయచేసి ఆంధ్ర - తెలంగాణా విభేదాలను రెచ్చగొట్టకండి"—ఇది నిండుమనస్సుతో జరిగిన వినతి, గుండెలను చీల్చుకు వచ్చిన విజ్ఞాపన. ముక్కోటి ఆంధ్రులను ఒక ముడికి తేవాలని తరతరాలుగా ఆంధ్రనాయకులు పడిన ఆతురత ఈ విజ్ఞాపనకు బల మిస్తున్నది. కృష్ణ, గోదావరి, తుంగభద్ర నదులకు ఈవలావల రెండుగా, రెండు ప్రభుత్వాలక్రింద చీలివున్న తెలుగునేల ఎట్టకేలకు ఏకఖండమై పట్టుమని రెండు సంవత్సరాలైనా కాకముందే ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టడానికి పట్టుదలతో కొందరు చేస్తున్న ప్రయత్నాన్ని చూడగా సహజంగా కలిగే ఆవేదన ఈ విజ్ఞాపనలో వెల్లుబుకుతున్నది.

నిన్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి చేసిన ఈ విజ్ఞాపన కేవలం ఆయన పరంగా జరిగింది కాదు; ఇది ఆంధ్రజాతి పరంగా జరిగింది, ఆ జాతి యోగక్షేమాలపరంగా జరిగింది, దాని భవిష్యత్తు పరంగా జరిగింది. శ్రీ సంజీవరెడ్డి నేడు ముఖ్యమంత్రి కావచ్చు. రేపు కాకపోవచ్చు. వ్యక్తులు స్థిరం కారు, వ్యక్తుల పదవులైనా స్థిరం కావు. స్థిరంగా నిలిచేదీ - నిలవవలసిందీ జాతిమాత్రమే. ప్రాంతీయ విద్వేషాలవిషం రక్తనాళాలలో ప్రవేశిస్తే, ఏ జాతికైనా స్థిరత్వం లేదు, భవిష్యత్తు అంతకంటె లేదు. ఈ సత్యాన్ని హృద్గతం చేసుకోబట్టే శ్రీ సంజీవరెడ్డి "కోర్కెగావుంటే మమ్ములను పదవీభ్రష్టులను చేయండి. కాని, దయచేసి ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టకండి"అని పుట్టెడు ఆవేదనతో అభ్యర్థించాడు.

కొన్ని శతాబ్దాల ఎడబాటు తర్వాత పదహారు నెలలక్రితమే ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలు తిరిగి ఏకమైనాయి. విడివిడిగా వున్న ఈ సుదీర్ఘకాలంలో

వాటి ప్రభుత్వ వ్యవస్థలు వేరు; పరిపాలనావిధానాలు వేరు. ఈ వ్యవస్థలను మిశితం చేయడం, ఈ విధానాలను సమన్వయ పరచడం, పరస్పర విశ్వాసం వున్నప్పటికీ, సుహృద్భావం వున్నప్పటికీ, సులభసాధ్యం కాదు. ఇక అట్టి విశ్వాసమే, అట్టి సుహృద్భావమే కొరవడితే, అది అసాధ్యవిషయ మౌతుంది. ఈ సత్యాన్ని గుర్తించిన పక్షంలో గోరంతలు కొండంతలు చేసి, ఆవేశాలను పెంచుకొనడంకాని, ప్రాంతీయవిభేదాలను రెచ్చగొట్టే ఆందోళన కొనసాగించడం కాని జరుగదు.

ఒక వేళ నిజంగానే ప్రస్తుతపు నూతన వ్యవస్థలో తెలంగాణా ప్రాంతానికి అన్యాయాలు జరుగుతూవుంటే, వాటిని నివారించడానికి మార్గం నిరసన సభలను జరపడమూ కాదు, "నియంతప్రభుత్వ"మంటూ నినాదాలు చేయడమూ కాదు. నియంతప్రభుత్వంలో నిరసన సభలకు, నిందాపూర్వక నినాదాలకు అవకాశమే వుండదు; ప్రజాస్వామ్యవ్యవస్థలోనే ఇది సాధ్యం.

ఏమైనా, తెలంగాణాను ప్రభుత్వం నిజంగానే చిన్నచూపుచూస్తుంటే న్యాయ సాధనకు సముచితమైన అనేక మార్గా లున్నాయి, సాధన లున్నాయి. సభలను జరపడానికి ముందు ఖండన తీర్మానాలు చేయడానికి ముందు, "ఇదుగో! మాకు ఈ అన్యాయం జరిగింది" అని మొత్తం ప్రభుత్వానికి తెలియజెప్పాలి. అప్పటికీ అన్యాయం తొలగకపోతే, ప్రత్యేకించి తెలంగాణా మంత్రులను శ్రద్ధ వుచ్చుకోవలసిందిగా కోరాలి. అందువల్లకూడా ఫలితం శూన్యమైతే, పార్టీ సమావేశంలో ప్రసంగించాలి. అప్పటికీ ప్రయోజనం లేకపోతే, అప్పుడు శాసనసభకు తెలియజెప్పాలి. ఈ అన్ని సందర్భాలలోను అనుమానాలను వెల్లడించడం చాలదు, ఆధారాలను చూపించాలి; ఆందోళనను ప్రకటించడం చాలదు, అన్యాయ మేమి జరిగిందో సహేతుకంగా నిరూపించాలి. అయినా, లాభం లేకపోతే, అప్పుడు మాత్రమే ప్రజాందోళన ప్రారంభించాలి.

ఇందుకు భిన్నంగా ప్రస్తుతం కొందరు వ్యవహరించడం ఎంతైనా శోచనీయం. వీరికి ఇప్పటి మంత్రివర్గంపై, దాని నాయకునిపై, అసంతృప్తి వుంటే, ఆ మంత్రివర్గాన్ని పడగొట్టవచ్చు; దాని నాయకుని తొలగించనూవచ్చు. కాని,

తెలంగాణాకు ఏవేవో అన్యాయా లన్న పేరుతో ప్రాంతీయ విద్వేషాలకు ప్రాణం పోయడం మాత్రం ఆంధ్రజాతి భవిష్యత్తుకే ప్రమాదకరం.

ఆంధ్ర ప్రాంత మన్నా, తెలంగాణా ప్రాంత మన్నా, మనది ఒక్కటే తెలుగుగడ్డ. దీనిలో ఏ ప్రాంతం వెనుకబడివున్నా, మొత్తం రాష్ట్రం వెనుకబడి వున్నట్టే ; ఏ ప్రాంతానికి అన్యాయం జరిగినా, మొత్తం జాతికి అన్యాయం జరిగినట్టే ; ఈ విషయాన్ని ప్రస్తుత మంత్రివర్గం, దాని సభ్యులు, విశేషించి దాని నాయకుడు పదేపదే ఉద్ఘాటిస్తున్నా, దాన్ని కాదని, లేనిపోని ఆందోళనను లేవదీయడం మొత్తం జాతికే ముప్పు, సమష్టిక్షేమానికే గొడ్డలిపెట్టు !

[మార్చి 16, 1958]

విశ్వకవి

కాళిదాసు ఏ కాలం వాడు? క్రీస్తుకుపూర్వమే ఆయన వర్ధిల్లినాడా? లేక, క్రీస్తు తర్వాతనా?

భోగలాలసుడైన అగ్నివర్మ మరణంతో రఘువంశం అంతమైపోలేదు. కాళిదాసు అయినా, మహాకావ్యంగా రూపొందించిన రఘువంశచరిత్ర అగ్నివర్మ నిర్యాణంతో ఆకస్మికంగా సమాప్తి చెందుతున్నది. ఈ కారణాన కాళిదాసు అగ్నివర్మ సమకాలికుడనీ, క్రీస్తుకు పూర్వం ఎనిమిదవ శతాబ్దంవాడని తీర్మానించు కొనవచ్చునా?

"మాళవికాగ్నిమిత్ర" భరతవాక్యానికి సుంగ రాజవంశానికి చెందిన అగ్నిమిత్రుడు ఆ నాటకరచనాకాలంనాడు పరిపాలన చేస్తున్నట్టుగా మనం అర్థం చెప్పుకొనడానికి కొంత వీలున్నది. ఇంతేకాక, ఇప్పటి వర్ధాకు,ఉజ్జయినీనగరానికి మధ్య ప్రాంతాన్ని "మేఘదూత"లో వర్ణిస్తూ, విదిశాపురప్రసక్తి తెచ్చి, ప్రపంచ ప్రసిద్ధ రాజధానిగా కాళిదాసు దాన్ని ప్రశంసిస్తాడు. తన ప్రత్యేకాభిమానానికి పాత్రమైన నగరం కాకపోతే, అగ్నిమిత్రుని ప్రభుత్వకేంద్రంగా తప్ప, ఇతర విధాల అంత ప్రసిద్ధిలేని ఈ విదిశానగరాన్ని కాళిదాసు ఎందుకు ప్రశంసిస్తాడు? ఈ రెండు విషయాలను పురస్కరించుకొని ఆయన, క్రీస్తుకు పూర్వం రెండవ శతాబ్దానికి చెందినవాడని సిద్ధాంతీకరించవచ్చునా?

అభిజ్ఞాన శాకుంతలాన్ని ఓంప్రథమంగా ఇంగ్లీషులోకి అనువదించిన సర్ విలియం జోన్స్ అభిప్రాయంప్రకారం కాళిదాసు విక్రమశకాన్ని ప్రారంభించిన విక్రమాదిత్యుని ఆస్థానకవి. "జ్యోతిర్విదాభరణం" అనే గ్రంథం కాళిదాసు రచన అని కొందరి మతం. విక్రమాదిత్యునిపోషణలో నవరత్నాలను పోలిన మహాకవులు తొమ్మిదిమంది వుండేవారని అది చెబుతున్నది. ఆ తొమ్మిదిమంది కవులలో ఒకడు కాళిదాసు కావచ్చునని సర్ విలియం ఊహ. కాని, విక్ర

మాదిత్య శకం క్రీస్తుపూర్వం 56 వ సంవత్సరంలో ప్రారంభం కాగా, "జ్యోతిర్విధాభరణం"లో అటువెనుక చాలా కాలానికి జరిగిన కొన్ని సంఘటనల ప్రసక్తి వున్నది. ఆ గ్రంథం పేర్కొన్న తొమ్మిదిమంది కవులలో ఏ యిద్దరూ సమకాలికులని చెప్పడానికి ఎంతమాత్రం వీలు కనబడదు. అయినప్పుడు, సర్ విలియం సిద్ధాంతాన్ని ఎలా అంగీకరించడం ?

ఇక, ఎ. బి. కీత్ అభిప్రాయంప్రకారం కాళిదాసు విక్రమాదిత్య శకాన్ని ప్రారంభించిన విక్రమాదిత్యునికాలంవాడు కాక, "విక్రమాదిత్య" అనే బిరుదనామం గడించుకొన్న రెండవ చంద్రగుప్తుని ఆస్థానకవి. "విక్రమోర్వశీయం"లోని "విక్రమ"శబ్దం, "కుమారసంభవం"లోని "కుమార"శబ్దం రెండవ చంద్రగుప్తుని బిరుదనామాన్ని, యువరాజు కుమారగుప్తుని నిజనామధేయాన్ని తలపింపజేస్తున్నాయన్న వాదం కేవలం ఊహాగానం కానక్కరలేదు. పైగా, అశ్వఘోషుడు, భాసుడు తమ నాటకాలలో వాడిన ప్రాకృతంకంటె నిశ్చయంగా అర్వాచీనమైనదాన్ని కాళిదాసు తన నాటకాలలో వినియోగించాడు. దీన్నిబట్టి కూడా అశ్వఘోషునికి, భాసునికి కాళిదాసు తదుపరివాడని, బహుశా ఆయన క్రీస్తు తర్వాత నాల్గవ శతాబ్దానికి చెందినవాడని కీత్ చెప్పిన మాటను అంగీకరించవచ్చునా ?

ఈ సిద్ధాంతా లన్నింటికి భిన్నంగా ఒక జనశ్రుతి వెడుతున్నది. దీని ప్రకారం క్రీస్తు తర్వాత పదకొండవ శతాబ్దంలో ధారానగరం రాజధానిగా పరిపాలించిన భోజరాజు ఆస్థానంలోనివాడు కాళిదాసు మహాకవి.

ఈ విధంగా కాళిదాసు కాలాన్నిగురించి ఎన్ని సిద్ధాంత రాద్ధాంతాలున్నవో లెక్కలేదు. ఆయన ఏ ప్రాంతానికి చెందినవాడనే విషయమై కూడా అన్నీ వివాదాలే ! ఈ వివాదా లన్నింటిని పండితులకే విడిచిపెట్టడం ఉత్తమం. మనకు సంబంధించినంతవరకు కాళిదాసు ఏదో ఒక కాలానికి కాక, అన్ని కాలాలకూ చెందినవాడు ! ఏదో ఒక ప్రాంతానికి కాక, సమస్త ప్రపంచానికే చెందినవాడు. ''అభిజ్ఞాన శాకుంతలం'' మూలాన్ని చదువుకొనలేక పోయినా, మూలంనుంచి సరాసరిగా జరిగిన అనువాదాన్ని చదువు కొనలేకపోయినా, ఇంగ్లీషు అనువాదం నుంచి జరిగిన జర్మను అనువాదాన్ని చదివిన గొథే మహాకవి ''స్వర్గ, మర్త్య లోకాలను ఒక ముడిలోకి తీసుకురాగల నాటకం శకుంతల" అన్నాడు.

అందరు రసజ్ఞులు, ఎవరు ఏ దేశంవారైనా, ఎవరు ఏ కాలంవారైనా, కాళిదాసును ఈ విధంగానే గౌరవిస్తారు.

ఇట్టి విశ్వకవి కాళిదాసుకు ఉజ్జయినిలో నిర్మించనున్న స్మారక చిహ్నం బాధ్యతను ఒక్క మధ్యప్రదేశ్ ప్రభుత్వమే పూర్తిగా వహించడం తగదని, ప్రతి రాష్ట్రం ఇందుకు కాన్కలను సమర్పించాలని జవహర్‌లాల్ నెహ్రూ మొన్న చేసిన సూచన ఎంతైనా సముచితం.

[జనవరి 25, 1959]

వరకట్నాలు

తల్లికి పిల్లలు బరువు కారనడం పూర్తిగా నిజం కాదు. కనీసం అది వరకట్నాలున్న సంఘంలో నిజం కాదు. ఆడపిల్లలను కన్న తల్లి విషయంలో అసలే నిజం కాదు. కుమార్తెకు పెండ్లిచేసి పంపించగలిగినంతనే "అమ్మయ్యా! ఒక పిల్ల విరగడైంది." అనే మాట ఎందరు తల్లుల నోట మనం వినడం లేదు? "పీడ విరగడైంది" అన్నట్టుగానే "పిల్లవిరగడైంది" అనడాన్ని బట్టే వర కట్నాలు ఎంత పీడాకరంగా పరిణమించాయో మనం సులభంగానే ఊహించు కోవచ్చు.

వరకట్నాలను నిషేధించే శాసనాన్ని చేయడంకంటె, దానికి విరుద్ధంగా ప్రజాభిప్రాయాన్ని రూపొందించడం వెయ్యిరెట్లు ముఖ్యం. వరకట్నం కోరే వారిని, దాన్ని చెల్లించి అల్లుని కొని తెచ్చుకొనడానికి సంసిద్ధపడేవారిని సంఘం పూర్తిగా అసహ్యించుకొనే పరిస్థితి రానంతవరకు వరకట్నాల నిషేధానికి ఎంత కఠినశాసనాన్ని ప్రభుత్వం చేసినా, అది నిష్ప్రయోజనకరమైనదిగానే మిగిలివుంటుంది.

ఈ సందర్భంలో గమనించవలసిన ముఖ్యవిషయాలు మరి రెండుకూడా వున్నాయి. ఈ నాడు హిందూసంఘంలో వివాహసంబంధాల నిర్ణయ సందర్భంలో వధూవరుల కులం ఒక్కటే కావాలి; శాఖాంతరాలు పనికిరావు; జాతకాలు కలవాలి; ఆర్థిక స్థితిగతులు దాదాపు సమానమైనవి కావాలి; ఆచార వ్యవహారాలు రవ్వంతగానైనా భేదించరాదు; అందచందాలు తక్కువ కారాదు; చదువు సంధ్య లలోనైనా ఎక్కువ అంతరాలు తగవు. ఇన్ని గొంతెమ్మ కోర్కెలను కోరితే కట్నాల మార్కెట్టులో వేలంపాటకు సన్నద్ధపడక తప్పదు.

పోతే, రెండవ విషయ మిది; యువతీయువకులు పరస్పరాకర్షణతో పరిణయం చేసుకొనగల స్థితిలో కట్నం ప్రసక్తి రానేరాదు. నికృష్టమైన ధనాపేక్షకాక, ఉదాత్తమైన ప్రేమే అప్పుడు వారికి అనుబంధాన్ని కూర్చుతుంది. డబ్బును కోరికాక, ప్రేమను కోరి యువతీయువకులు పెండ్లి చేసుకొనగల పరిస్థితులను మన సంఘం కల్పించనంతవరకు వరకట్నపిశాచం ఏదో ఒకరూపంలో మనపై రాజ్యం చేస్తూనేవుంటుంది.

[ఏప్రిల్ 26, 1959]

ప్రాచ్యసంస్కృతి

త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రాచ్యసంస్కృతీకళాశాల నెలకొనగలదని మంత్రి శ్రీ కల్లూరి చంద్రమౌళి నిన్న ప్రకటించాడు. తిరుపతి దేవస్థానం వారి ఆర్థికసహాయం దీనికి లభించగలదని, శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీకి అనుబంధసంస్థగా బహుశా తిరుపతిలో ఇది ప్రారంభం కాగలదని ఆయన సూచించాడు.

ఈ నూతన కళాశాల సంస్థాపనవిషయమై ప్రత్యేక శ్రద్ధాసక్తులను ప్రదర్శిస్తున్న శ్రీ చంద్రమౌళిని మేము అభినందిస్తున్నాము. ప్రాచ్యసంస్కృతి పట్ల, విశేషించి భారతీయసంస్కృతిపట్ల, ఆయనకున్న అధిక ప్రేమ గౌరవాలు అందరికీ తెలిసినవే. ఈ సంస్కృతీచరిత్రను, దీని స్వరూపస్వభావాలను ఆకళింపు చేసుకొనడానికి ఆయన ప్రత్యేకించి కృషిచేశాడు; దీని వైశిష్ట్యాన్ని ఉగ్గడిస్తూ, ఆయన కొన్ని గ్రంథాలు ప్రచురించాడు కూడా.

ఏవో విశిష్టతలు కొన్ని కలవు కాబట్టే, ప్రాచ్యసంస్కృతి ఒకనాడు మహోచ్చస్థితి నందుకోగలిగింది. శాశ్వతమైన విలువలు ఏవో కొన్ని దానిలో వుండబట్టే గ్రీక్, రోమన్ సంస్కృతులవలె నవీనసంస్కృతులలో అంతర్లీనమై పోకుండా, నేటికీ ప్రాచ్యసంస్కృతి కొంతవరకు తన అస్తిత్వాన్ని కాపాడుకోగలుగుతున్నది.

అయితే, నిర్జీవం కాకపోయినా, దాదాపు వెయ్యేళ్ళక్రితంనాటికే ప్రాచ్యసంస్కృతి ఎందువల్ల నిస్తేజమైపోయింది? నాటినుంచి, నేటివరకు అది లవలేశంగానైనా వికాసాన్ని కాని, విస్తృతిని కాని ఎందువల్ల సాధించలేకపోయింది? తనపై యెత్తివచ్చిన ప్రతివిజాతీయశక్తికి అతిసులభంగా అది ఎందువల్ల లొంగిపోయింది? దాస్యంనుంచి, దారిద్ర్యంనుంచి దైన్యంనుంచి ప్రజాబాహుళ్యాన్ని

ఇంచుమించు ఒక వెయ్యి సంవత్సరాలపాటు కాపాడలేకపోయిన సంస్కృతిలో ఎక్కడో, ఏదో లోపం వుండాలికదా ?

"అప్రాచ్య" అనేపదం దూషణగా పరిణమించిననాటినుంచీ ప్రాచ్య సంస్కృతి అంతరాంతరాళాలలో దౌర్బల్యా లేర్పడినవేమో ! కళలు కులవిద్యలుగా రూఢమైననాడే, శాస్త్రాలు గురువునుంచి శిష్యునికి సంక్రమించవలసిన గుప్తవిద్యల స్థాయికి దిగజారిననాడే, సముద్రయానం నిషేధించబడిననాడే, ప్రాచీనమైన ప్రతి ప్రశస్తమైనది కాగా, అర్వాచీనమైనది సమస్తం అతినికృష్ట మైనదిగా పరిగణనలోకిరావడంప్రారంభమైననాడే ప్రాచ్యసంస్కృతి - ప్రత్యేకించి, భారతీయ సంస్కృతి - పటుత్వాన్ని కోల్పోవ నారంభించిందేమో !

ఏమైనా ప్రాచ్య సంస్కృతీకళాశాలను సంస్థాపించుకొనడం ప్రాచీన వైభవాన్ని సంస్మరించుకొని, ఉప్పొంగిపోవడం కోసం కారాదు. ప్రాచీన కాలంలో వైభవోపేతంగా వర్ధిల్లిన ఆ సంస్కృతి, మధ్యయుగంనాటికి ఎందుకు తన ప్రాభవాన్ని కోల్పోయిందో పరిశోధించి తెలుసుకొనడానికే ఆ కళాశాల ప్రధానంగా ఉపకరించాలి. ఇంతే కాదు, ప్రాచీనవైభవాన్ని, మించిన మహోచ్ఛ స్థితిని ప్రాచ్యజాతి తిరిగి సాధించుకొనడానికి ఏ యే మార్గాలు అనుసరించాలో ఆ కళాశాల స్థూలంగానైనా నిర్దేశించగలగాలి. అప్పుడే దానికి సార్థక్యం.

ఇంకొక విషయాన్నికూడా ఈ సందర్భంలో పేర్కొనడం ముఖ్యావసరం. సాంఘికవ్యవస్థకు అతీతమైనది కాదు, సంస్కృతి. సంఘమొక లత కాగా, దాన్ని సుశోభితంచేసే పుష్పగుచ్ఛమే సంస్కృతి. సాంఘిక వ్యవస్థకు సంస్కృతికి మధ్యగల ఈ జన్యజనక సంబంధాన్ని విస్మరించనినాడు, ప్రాచీన సాంఘిక వ్యవస్థను పునరుద్ధరిస్తే తప్ప, ప్రాచీన సంస్కృతి పునరుద్ధరణ జరగదన్న కఠోరసత్యం ఇట్టే బోధపడుతుంది.

నేడు మనం ఒక నూతన సాంఘిక వ్యవస్థను లక్షిస్తున్నాము. అది వేద కాలంనాటి వ్యవస్థకు భిన్నమైనది; పురాణాల కాలంనాటి దానికి విరుద్ధమైనది: మను, నారద, పరాశరాది ధర్మశాస్త్రాలలో నిర్దేశించబడినదానికి వ్యతిరిక్తమైనది; జాతి, మత, వర్గ, కుల, లింగాది సమస్తకృత్రిమవిభేదాలకు అతీతమై,

సమానత్వం, సమానావకాశాలు ప్రాతిపదికలుగాగల ఈ నూతన వ్యవస్థకు రూపకల్పన చేస్తున్న మన సరికొత్త "మనుధర్మశాస్త్రం" మన భారత రాజ్యాంగం. ఆరాజ్యాంగానికి అనుగుణమైన నూతన సాంఘిక వ్యవస్థ సంస్థాపనకు దోహదకరంగా ప్రాచ్యసంస్కృతిని ఏ విధంగా మలచుకొనవలెనో నిర్దేశించగలిగినమేరకే ప్రాచ్యసంస్కృతీకళాశాలలు ప్రయోజనకరం.

ఆంధ్రప్రభుత్వం త్వరలో స్థాపించనున్న ప్రాచ్యసంస్కృతీకళాశాల ఈ ప్రయోజనాన్ని బహుధా సాధించి, చరితార్థతగాంచగలదనే నమ్ముతున్నాము.

[జూలై 27, 1960]

విభేదాలు

జాతివిభేదాలు, మతవిభేదాలు, కులవిభేదాలు, వర్గవిభేదాలు, భాషావిభేదాలు— అంతూ, పొంతూ లేకుండా ఈ విధంగా మన దేశంలో ఎన్ని విభేదాలు లేవు! "అంతూ పొంతూ" లేకుండా అని కేవలం మాటవరసకు మేము అనడం లేదు. ఆటవికజాతుల మొదలుకొని, ఆంగ్లో - ఇండియన్ జాతివరకు దేశంలో ఎన్ని జాతు లున్నవో లెక్కకట్టడం సులభమా ? ఒక హిందూమతాన్నే తీసుకొన్నా, దాని ముక్కోటి దేవుళ్ళను ముక్కోటివిధాల పూజించే ముక్కోటి శాఖలు లేవా? కులాలసంఖ్య కొన్ని వేలలోకి వెళ్ళగా, ఒక కులంలోనే తిరిగి సహపంక్తిభోజనాలకు వీలులేని - పెళ్ళి సంబంధాలకు వీలులేని—అడ్డుగోడ లెన్ని లేవు? ఈ విధంగా ఎటు తిరిగినా—ఎటు చూచినా—కానవచ్చే విభేదాలు ఒక్కొక్కప్పుడు నిరాశ కలిగిస్తాయి, నిరుత్సాహాన్ని పుట్టిస్తాయి, నిస్పృహనే ప్రేరేపిస్తాయి.

ప్రత్యేకించి భాషావిభేదాల కారణంగా అస్సాంలో ఈ మధ్య చెలరేగిన కల్లోలాన్ని, ఆ కల్లోలంలో కొనసాగిన దౌష్ట్యాలను దృష్టిలోపెట్టుకొనే కావచ్చు, కేరళ గవర్నర్ శ్రీ వి. వి. గిరి ఇప్పటి రాష్ట్రాలు పది సంవత్సరాలలో అంతరించి పోగలవనే తాను ఆశిస్తున్నట్టు మొన్న కోయంబత్తూరులో ప్రసంగిస్తూ పేర్కొన్నాడు. భారత జాతీయతను బలహీనపరుస్తున్న ప్రస్తుతపు విభేదాలను నిరసించడంలో శ్రీ గిరికి ఏ విధంగానూ తీసిపోకపోయినా, వాటి నిర్మూలనకు ప్రస్తుతపు రాష్ట్రవ్యవస్థను రద్దుచేసి, దేశాన్ని అయిదు మండలాలకింద విభజించడం ఉత్తమమార్గం కాగలదని మాత్రం మేము అంగీకరించలేము.

భాషాసంబంధమైన విభేదాలు భాషాప్రయుక్తంగా దేశవిభజన జరిగిన తర్వాత కొత్తగా తలయెత్తినవి కావు. అవి చిరకాలంగా మనలను వెంబడించి వేధిస్తూనే వున్నాయి. నిజానికి, ఈ నాటికంటె విభిన్న భాషలవారు ఒకే

రాష్ట్రంలో కలిసివున్ననాడే అవి మరింత తీవ్రంగా వుండేవేమో ! ఇందుకు ఒక నిదర్శనంగా ఉమ్మడి మద్రాసురాష్ట్రాన్నే పేర్కొనవచ్చు. దానిలో తమిళులకు, తెలుగువారికిమధ్య ఎన్ని విద్వేషా లుండేవి కావు, ఎన్ని వివాదాలుండేవి కావు ? విడిపోయిన తర్వాత ఇవి సమసిపోలేదా, సౌమనస్యసహకారాలు నెలకొనలేదా ?

అస్సాం కల్లోలాన్ని, లేదా పంజాబ్‌సంఘటనలను దృష్టిలో పెట్టుకొని భారత జాతీయతకు అత్యధికప్రమాదం భాషావిభేదాలనుంచే వస్తున్నదని తీర్మానించుకొనలేమేమో ! నిశితంగా చూస్తే, ప్రశాంతంగా పరిశీలిస్తే, భాషావిభేదాలను మించి, మత కుల వర్గాది విభేదాలే భారతజాతీయతకు వేరుపురుగులుగా పరిణమిస్తున్నట్టు స్పష్టపడుతుంది. నేటి భాషారాష్ట్రాలకు స్వస్తిచెప్పి, దేశాన్ని అయిదు మండలాలుగా విభజించడంతో ఈ విభేదాలు ఎక్కడికి పోగలవు, ఎలా పోగలవు?

ఇప్పటి కృత్రిమ విభేదాలు ఎప్పటివరకు సమసిపోవో, అప్పటివరకు భారత జాతీయతకు, సమైక్యతకు భద్రత లేదనడం తిరుగులేని విషయమైనా ఆ విభేదాలతొలగింపుకు మార్గం రాష్ట్రవ్యవస్థను మార్చడం కాదు: ప్రజలదృష్టిని మార్చడం, వారి చిత్తవృత్తిని మార్చడం, వారి విశ్వాసాలను మార్చడం, అన్నిటికంటె ముఖ్యంగా, వారి హృదయాలను మార్చడం! ఇది ఒక్కనాటితో జరిగేపని కాదు. ఒక్క తరంలో జరిగేదికూడా కాదు. విద్యాభివృద్ధిద్వారా, విజ్ఞాన ప్రచారంద్వారా సంస్కృతీవికాసనంద్వారా రెండు మూడు తరాలలోతప్ప దీన్ని సాధించలేము. అయితే, ఈ లోపల భారత జాతీయతకు విఘాతం కలగకుండా, భారతదేశం ఛిన్నాభిన్నమైపోకుండా సాధ్యమైన సమస్తచర్యలను (పరిపాలనలో కట్టుదిట్టాల రూపంలో, పరిపాలకుల జాగరూకత రూపంలో) తీసుకోవాలి.

నెమ్మదిపై గాని, కాలక్రమాన గాని పరిష్కరించడానికి వీలులేని ఈ సమస్యను వెంటనే పరిష్కరించవలెనన్న తొందరపాటుకొద్దీ ప్రస్తుత రాష్ట్ర వ్యవస్థను కొట్టివేసి, దేశాన్ని అయిదు మండలాలుగా (రైల్వే జోనుల పద్ధతిలో) విభజిస్తే, ద్విభాషాప్రాంతంగా బొంబాయిని నిలపడానికి జరిగిన ప్రయత్నం తెచ్చినన్ని చేట్లను తిరిగి అది తెస్తుంది. ఇంతే కాక, ప్రభుత్వాధికారాల కేంద్రీ

కరణ, వికేంద్రీకరణల చిరసమస్య వుండనేవున్నది. దేశాన్ని అయిదు మండలాలుగా విభజిస్తే, కేంద్రమే ప్రభుత్వాధికారాలలో అత్యధికభాగాన్ని స్వయంగా స్వీకరిస్తే, పరిపాలన సమర్థంగా జరుగుతుందా? అప్పుడు ప్రజాసామాన్యానికి స్వపరిపాలనాధికారం స్థానికవ్యవహారాలలోనైనా మిగులుతుందా? ఇవి తేలికగా కొట్టిపారవేయదగు ప్రశ్నలు కావు.

ఇంకొక విషయాన్ని కూడా ఈ సందర్భంలో మరచిపోరాదు. యునైటెడ్ స్టేట్స్, సోవియెట్ యూనియన్ మొదలైన ఇతర సువిశాల దేశాలను చూస్తే, రాష్ట్రసంఖ్య అక్కడ తక్కువేమీ కాదని తెలుస్తుంది. కొత్తగా యునైటెడ్ స్టేట్సులో అంతర్భాగాలైన అలాస్కా, హవాయ్‌ల తర్వాత దానిలో ప్రస్తుతం 50 రాష్ట్రాలున్నాయి. సోవియట్ యూనియన్‌లో 16 రాష్ట్రాలున్నాయి. కాశ్మీర్ సమేతంగా మన దేశంలో నేడున్న రాష్ట్రాల సంఖ్య పదిహేనే. అయినప్పుడు ''అబ్బో! మనకు ఇన్ని రాష్ట్రాలా!'' అని ఎందుకు అనుకోవాలి? ఇవి భాషారాష్ట్రాలు కావడంవల్లనే జాతీయతకు భంగం వాటిల్లుతున్నదని ఎందుకు తీర్మానించుకోవాలి? సోవియట్ యూనియన్‌లో రాష్ట్రాలవిభజన పూర్తిగా భాషాప్రాతిపదికపైనే జరగలేదా?

ఈ విధంగా చూస్తే, మన దేశంలోకంటె యునైటెడ్ స్టేట్సులో వేయి మడుంగులుగా జాతి, మత, భాషాది విభేదా లుండాలి. ప్రతి యూరోపియన్ దేశంనుంచి, కొన్ని ఇతరదేశాలనుంచి కూడా, అక్కడికి విభిన్న మతాలతో, వివిధ భాషలతో విరుద్ధ సంస్కృతులతో, వలసకు వస్తూవుంటారు. ఈవిధంగా వలసకు వచ్చినవారితో కూడిందే యునైటెడ్‌స్టేట్సు జనాభా! అయినా, ఒకే మూసలో – "అమెరికన్ జాతీయత'' అనే మూసలో – కరిగి, నానాదేశాలవారు, నానాగోత్రాలవారు ఒకే అమెరికన్ ప్రజగా మారిపోతున్నారు. ఈ మహత్తర పరిణామాన్ని ప్రతిభావంతంగా చిత్రిస్తూ, జాంగ్విల్ అనే నాటకకర్త "ది గ్రేట్ క్రూసిబుల్'' అనే ఉత్తమ నాటకాన్ని వ్రాశాడు. విద్యద్వారా, విజ్ఞానంద్వారా, సంస్కృతిద్వారా, శాంతిద్వారా, సంపత్తిద్వారా, మన దేశం కూడా అట్టి క్రూసిబుల్‌గా మారినప్పుడే మనకు భవిష్యత్తు; అప్పుడే మనకు పురోగతి!!

[ఆగస్టు 10, 1960]

ఆగస్టు 15, 1960

ఈ నాడొక పండుగ, పెద్ద పండుగ, ప్రజల పండుగ. ఔను ! ఇది ప్రజల పండుగ; ప్రజావిజయాన్ని కీర్తించే పండుగ; ప్రజాస్వాతంత్ర్యాన్ని సంస్తవించే పండుగ; ప్రజాస్వామ్యానికి నీరాజనా లెత్తే పండుగ.

తక్కిన మన పండుగలు వైకుంఠాధిపతినో, కైలాసవాసినో అయోధ్యాప్రభువునో, ద్వారకాపురీశ్వరునో సంస్మరించేవి, సంస్తుతించేవికాగా, ఇది దేవుళ్ల పండుగ కాదు, దేవతల పండుగ కాదు, రాజుల పండుగ కాదు, రాణుల పండుగ కాదు. ఇది ఒక కొత్త పండుగ; ప్రజల పండుగ; తమమధ్య పుట్టి, తమతో పెరిగి, తమకు నాయకుడై, తమ కష్టసుఖాలను పంచుకొంటూ, తమ సేవకై సమస్తాన్నీ అర్పించి, తమను ముందుకు నడిపి, తమకు విజయాన్ని చేకూర్చిన గాంధి తమకు ప్రసాదించిన జాతీయ స్వాతంత్ర్య మహావర ప్రసాదాన్ని నలభైకోట్ల మంది తమ కళ్లకు అద్దుకొనడానికై పదమూడేళ్లనాడు ప్రారంభమైన పండుగ.

ఈనాడు మన స్వాతంత్ర్యప్రదాతను సంస్మరించడమే చాలదు ; ఆయనకు భక్త్యంజలిని ఘటించడమే చాలదు ; ఆయన నాయకత్వాన గెలుచుకొన్న స్వాతంత్ర్యాన్ని కలకాలానికీ నిలుపుకొనడానికి నేడు తిరిగి కంకణధారణ చెయ్యాలి. నిత్యజాగరూకత, స్వాతంత్ర్యరక్షణకు చెల్లించవలసిన మూల్యం. ప్రతితరం, ప్రతి పౌరుడు ఈ మూల్యాన్ని సముత్సాహంతో చెల్లించినప్పుడే స్వాతంత్ర్యానికి పరిరక్షణ. ఇది లేనప్పుడు ఏ రాజ్యాంగ విధానమైనా, ఏ సాయుధదళాలైనా, ఏ మిత్రరాజ్యసహాయమైనా జాతీయస్వాతంత్ర్యాన్ని పరిరక్షించ లేవు.

స్వాతంత్ర్యం ఒకరిచ్చేది, మరొకరు పుచ్చుకొనేది కాదు; ఒకరు కాపాడగా, మరొకరు నిలుపుకొనేదీ కాదు. అది ఎవరికి వారు తమ అంతరంగలో

ఒక అదృశ్యశక్తిగా - ఒక అమృత ఉత్తేజనంగా - ఒక అకలంకదీప్తిగా పదిల పరచుకొనవలసిన నైతికపువిలువ. ఆ విలువ అంతరంగంనుంచి విలుప్తమైనప్పుడు ఏ సాయుధబలాలు, ఏ బాహ్యశక్తులు స్వతంత్రప్రజగా ఎవ్వరినీ నిలప లేవు.

దీన్నే మరొక విధంగాకూడా చెప్పవచ్చు. దాస్యమైనా, స్వాతంత్ర్యమైనా ప్రధానంగా ఒక మనఃప్రవృత్తిమాత్రమే ! దాస్య మనఃప్రవృత్తిగలవారిని దేవుడైనా స్వతంత్రులను చేయలేడు; స్వతంత్ర మనఃప్రవృత్తిగలవారిని హిట్లరు, ముసోలినీలవంటి పోలినవారైనా బానిసలను చేయలేరు.

మనకు రాజకీయంగా స్వాతంత్ర్యం లభించినా, స్వతంత్ర మనఃప్రవృత్తి ప్రబల లేదు. అవి ప్రబలుతున్న సూచనలైనా లేవు. నిజంగా స్వతంత్రులైనవారి తలపులలో, పలుకులలో, నడకలో, నడవడిలో ఒక విధమైన నవ్యత కనబడాలి. ఎంతో ఉదాత్తంగా వారు వ్యవహరించాలి, సృజనాత్మకశక్తితో తమ జీవితరంగాన్ని జ్యోతిర్మయం చేసుకోవాలి.

ఇది నేడు కానవస్తున్నదా ? అప్రియవచనమైనా "లేదు" అనే ఇందుకు సమాధానం. దాస్యయుగంనాటి, అంధయుగంనాటి ఆలోచనలు, అభిరుచులు, అభిమానాలు. ఆచారవ్యవహారాలు ఈనాటికీ మన జీవితంలో అడుగడుగుకు ద్యోతకమౌతున్నాయి. ఈ విషయమై ఆత్మసంశోధన చేసుకొనడానికి ఈ స్వాతంత్ర్యదినోత్సవ మహాపర్వదినాన్ని మనం వినియోగించుకొనకపోతే, తక్కిన కొన్ని పర్వదినాలవలె ఇదికూడా అర్థరహితమైన ఆచార మౌతుంది, వ్యర్థవినోదంగా పరిణమిస్తుంది !

ఇంకను శైశవావస్థలోనున్న మన జాతీయస్వాతంత్ర్యానికి ఆంతరంగిక, బాహ్యశక్తులనుంచి ప్రమాదం స్పష్టంగా కనబడుతున్నది. వీటిలో మొదటిదానికి అస్సాంలో సంఘటనలను, రెండవదానికి ఉత్తర సరిహద్దులలోని పరిస్థితులను తార్కాణాలుగా పేర్కొనవచ్చు. ఈ ప్రమాదాలను తొలగించుకొనడానికి, అన్ని విరోధశక్తులనుంచి మన స్వాతంత్ర్యాన్ని అన్నివిధాల పదిలపరచుకొనడానికి ఈనాడు ప్రతి పౌరుడు ఏ మేరకు కృతనిశ్చయుడు కాగలడో, ఆ మేరకే నేటి పర్వదినానికి అందమైనా, అర్థమైనా, అమృతత్వమైనా !

[ఆగస్టు 15, 1960]

ఆసియా, ఆఫ్రికాలు

పరధ్యానంలో పడిపోయి, బ్రిటిష్‌వారు భారత మహాసామ్రాజ్యాన్ని సంస్థాపించారని ఎవరో ఛలోక్తిగా అన్నారు. ఛలోక్తిగా అన్నప్పటికీ దీనిలో కొంత నిజంలేకపోలేదు.

సామ్రాజ్య సంస్థాపనోద్దేశంతో బ్రిటిష్‌వారు మన దేశం రాలేదు. వర్తక వాణిజ్యాలకోసమే వారు వచ్చారు. ఆయుధాలతోకాక, అర్జీలతో వారు వచ్చారు; మహాసైన్యాలతో కాక, మహజర్లతో వచ్చారు; విజిగీషతో కాక విజ్ఞాపన పత్రాలతో వచ్చారు. అయినా, అనతికాలంలోనే ఒక మహాసామ్రాజ్యాన్ని ఇక్కడ స్థాపించగలిగారంటే, అది వారు అనుకోకుండా - వారికే ఆశ్చర్యకరంగా - జరిగిన పని.

ఇక్కడివారి ఆహ్వానంపై ఒకటి, రెండు అంతఃకలహాలలో ఎవరో ఒకరి పక్షం వహించేసరికి ఇక్కడివారి ధనంతోనే, ఇక్కడ సమకూర్చుకొన్న సైన్యంతోనే ఎంత సునాయాసంగా తాము పరగణాలకు పరగణాలనే చేజిక్కించుకొనవచ్చునో బ్రిటిష్ వర్తకులకు ("కుంఫిణీవారు"గా అప్పటిలో వారు చెల్లుతూ వుండేవారు) తేటతెల్లమైంది. అటు పిమ్మట మొత్తం దేశాన్ని వశపరచుకొనడం వారికి ఒక లెక్కగా తోచలేదు.

సర్ జాన్ సీలి "ది ఎక్స్‌ప్యాన్‌షన్ ఆఫ్ ఇంగ్లండ్" అనే గ్రంథంలో వివరించినట్టు, భారతదేశాన్ని బ్రిటిష్‌వారు జయించింది భారతీయ సంపత్తితోనే, భారతీయ సైనిక దళాలతోనే. దాన్ని వారు ఎంత సులభంగా జయించగలిగారో దాదాపు అంత సులభంగానే అది వారిచేతినుంచి జారిపోగలదని ఆయన ఎప్పుడో జోస్యం చెప్పాడుకూడా. "భారతీయులసహకారంతో మనం వారి దేశాన్ని జయించాము. వారి సహకారంతోనే దాన్ని పాలిస్తున్నాము. ఎప్పుడు వారు

తమ సహకారాన్ని నిరాకరిస్తారో, అప్పుడే ఆ దేశంనుంచి మనకు స్వస్తి" అని సరిగా ఈ మాటలలో కాదుగాని, ఈ అర్థంవచ్చే మాటలలో ఆయన ఎన్నడో హెచ్చరించివున్నాడు.

సర్ జాన్ సీలి ఎంత చెప్పాడో, చివరికి అంతే జరిగింది. "బ్రిటిష్ సామ్రాజ్యానికి అంత్యక్రియలు జరపడానికి నేను ప్రధానమంత్రిని కాలేదు" అని విన్‌స్టన్ చర్చిల్ ప్రగల్భాలు పలికిన తర్వాత కొన్నేళ్లలోపలనే భారతీయ ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా తామిక పరిపాలన సాగించలేమని గుర్తించి, బ్రిటిష్‌వారు చల్లగా సర్దుకున్నారు.

ఈ పాతకథను ఇక్కడ త్రవ్వడం ఒక్క ఇండియాలోనేకాక, ఆసియా, ఆఫ్రికా ఖండాలలో ఏవో కొన్ని స్వల్పభేదాలతో సరిగా ఇంతే జరిగిందని- జరుగుతున్నదని - జరగబోతున్నదని చెప్పడానికే! మనదేశం స్వాతంత్ర్యం పొంది పదిహేను సంవత్సరాలైనా పూర్తిగా నిండలేదు. అయినా, ఈ కొద్ది వ్యవధిలో ఆసియా, ఆఫ్రికా ఖండాలలో ఎన్ని దేశాలు స్వాతంత్ర్యాన్ని పొందలేదు? ఈ మధ్య మరీ వారాని కొక దేశం, నెల కొక దేశం స్వతంత్రరాజ్యంగా అవతరిస్తున్నది. మొన్న ఒక్కరోజునే - 14 వ తేదీ ఆదివారంనాడు - రెండు ప్రాంతాలు స్వతంత్రరాజ్యాలైనాయి. వీటిలో ఒకటి సైప్రెస్; రెండవది ఫ్రెంచి కాంగో. (సైప్రెస్ ఆఫ్రో - ఆసియన్ రాజ్యం కాకపోయినా, సామ్రాజ్య దేశాలపీడ దానికి చిరకాలంగా తప్పడం లేదు.)

కొంతవరకు అజ్ఞానం, చాలవరకు అహంకారం, ఇవి జతచేరినప్పుడు తప్పనిసరికాగల అంతఃకలహాలు - వీటివల్లనే ఆసియా, ఆఫ్రికా ఖండాలు పారతంత్ర్యంలో పడిపోయాయి. పారతంత్ర్యస్థితిలో ఆత్మాభిమానం చచ్చింది, ఆత్మవిశ్వాసం నశించింది. కాని నెమ్మది నెమ్మదిగా- క్రమక్రమంగా - తమ దుస్థితికి తామే కారకులమన్న సంగతి వాటికి ఆకళింపుకు వచ్చింది; తమ సముద్ధరణకు తామే యత్నించవలెనన్న పట్టుదల పెరిగింది. ఆత్మ విశ్వాసంగల దేశం - ఆత్మబలంపై ఆధారపడే జాతి, - ఎంతో కాలం దాస్యంలో మిగలదు. ఆసియా, ఆఫ్రికాఖండాలకు చెందిన అనేక దేశాలలో ఈ సత్యమే నేడు పదేపదే నిరూపితమౌతున్నది.

కటాంగాలో బెల్జియం ఏమి కుట్రలు చేసినా, అల్జీరియాను నిలుపుకో వాలని ఫ్రాన్సు ఎంతగా తాపత్రయపడినా, గోవానుంచి కదలనని పోర్చుగల్ ఎంత తీంద్రించినా, జాగరితమైన ఆసియా, ఆఫ్రికాలను తమ గుప్పిటిలో పెట్టుకొనడం యూరోపియన్ కలోనియల్ రాజ్యాలకు మరి సాధ్యంకాని పని. కొంచెం ముందుగానో, కాస్త వెనుకగానో, అవి మూటాముల్లె కట్టుకొని చక్కా పోవలసిందే: అలసిస్తే మూటాముల్లెకూడా దక్కవు.

కాలం మారిందని, పరిస్థితులు మారినవని గుర్తించి, తదనుగుణంగా సంచరించనందువల్లనే, భారతసామ్రాజ్యం పోయినా, భారతీయుల సద్భావాన్ని బ్రిటన్ మిగుల్చుకోగలిగింది. ఈ పాటి జ్ఞానంలేని ఇతర పాశ్చాత్యదేశాలు, కాలప్రభావాన్ని గుర్తించలేక, పరిస్థితుల ప్రాబల్యాన్ని గ్రహించలేక, అంధప్రాయంగా సంచరిస్తున్నాయి.

[ఆగస్టు 18, 1960]

విదేశాంగ మంత్రిగా నెహ్రూ

రాజ్యసభవలె లోకసభ కూడా మన విదేశాంగ విధానాన్ని ఆమోదిస్తూ మరొకసారి తీర్మానం చేసింది. మన పార్లమెంటులో ఒక వైపునుంచి కమ్యూనిస్టుపార్టీవారు, మరొక వైపునుంచి ప్రజా సోషలిస్టు పార్టీవారు కొన్ని కొన్ని విషయాలలో—కొంత కొంత వరకు—మన విదేశాంగవిధానం విఫలమౌతున్నదని విమర్శించవచ్చు. ఇతర విధాలైన అసంతృప్తులను సయితం అప్పుడప్పుడు వారు వ్యక్తం చేస్తూ వుండవచ్చు.

ఈపాటిగానైనా ప్రతిపక్షాలవారు విమర్శ చేయకపోతే, వారు ప్రతిపక్ష సభ్యులు కారు. అందువల్ల వారి అసంతృప్తులకైనా, ఆక్షేపణలకైనా ఎక్కువ విలువ నివ్వవలసిన పని లేదేమో! పాక్షికదృష్టినుంచి కాక, ప్రపంచదృష్టినుంచి చూచినప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వాన మన ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగవిధానం సర్వోత్తమమైనదని ఎవరైనా అంగీకరిస్తారు. దాని ఉత్కృష్టత, దాని వైశిష్ట్యం, జాతీయప్రయోజనాలకే పరిమితమైంది కాదు; వర్తమానానికే నిబద్ధమైందికాదు కూడా; అంతర్జాతీయంగా కూడా దాని ప్రభావం అశేషమైంది; భావికాలానికి అది స్వర్ణసేతువులను నిర్మిస్తున్నది.

విదేశాంగశాఖ మనకు కొత్త; విదేశాంగవిధానంతో మనకున్న పరిచయమైనా విస్తృతమైనదని చెప్పడానికి వీలులేదు. అయినా, ఇంత త్వరలో ఒక నిర్దిష్టమైన, నిర్దుష్టమైన విదేశాంగవిధానాన్ని మనం రూపొందించుకొన్నామంటే, ఆ ఘనత ప్రధానమంత్రి పదవితోపాటు, ఆదినుంచీ విదేశాంగమంత్రి పదవిని సయితం నిర్వహిస్తున్న మన నాయకుడు జవాహర్‌లాల్ నెహ్రూదే.

విదేశాంగమంత్రులుగా ప్రపంచం మొత్తంపైనే చిరకీర్తి నార్జించుకొన్న వారు బహు కొద్దిమంది మాత్రమే కానవస్తారు. వారిలో ప్రత్యేకించి చెప్పుకోదగువారు బ్రిటన్‌కు చెందిన కాజిల్‌రే (1769-1822), జార్జి కానింగ్ (1770-1827), పామర్‌స్టన్ (1784-1865), ఫ్రాన్సుకు చెందిన త్యాలీరాం (1754-1838), ఆస్ట్రియాకు చెందిన మెటర్‌నిక్ (1773-1859). ఈ అయిదుగురిలో చిట్టచివరి వ్యక్తికూడా దాదాపుగా నూరేళ్ల క్రితం కన్ను మూసినవాడే. పామర్‌స్టన్‌తర్వాత ప్రపంచం మొత్తంమీద ప్రతిభావంతుడైన విదేశాంగ మంత్రి ఎవరనే ప్రశ్నకు భావిచరిత్రకారుడు చెప్పగల సమాధాన మొకటే. అది,- ఇండియాకుచెందిన జవాహర్‌లాల్ నెహ్రూ.

మన నాయకుడు కనుక, మన ప్రధాని కాబట్టి ప్రేమవల్లనో, పక్షపాతం వల్లనో చెప్పేమాట కాదిది. పందొమ్మిదవ శతాబ్దిలో అంతర్జాతీయ రాజకీయాలపై తమ వ్యక్తిత్వాల ముద్రలను గట్టిగా వేసి, నాటినుంచి, నేటివరకు అశేష ప్రతిభావంతులైన విదేశాంగ మంత్రులుగా కీర్తించబడుతున్న కాజిల్‌రే, కానింగ్ పామర్‌స్టన్, త్యాలీరాం, మెటర్‌నిక్‌లకంటె, ఏ దృష్టినుంచి చూచినా, నెహ్రూ అధిక ప్రతిభావంతుడైన విదేశాంగమంత్రి.

"బ్యాలెన్స్ ఆఫ్ పవర్" అనే రాజనీతి సిద్ధాంతానికి (ఏ ఒక రాజ్యం కాని, రాజ్యకూటంకాని మరొక రాజ్యంకంటె, లేదా మరొక రాజ్యకూటంకంటె శక్తిసంపన్నమైనది కారాదనే సూత్రానికి) అత్యధిక ప్రాధాన్య మిచ్చి, తదనుగుణంగానే తమ విదేశాంగవిధానాన్ని తీర్చిదిద్దినవారు మేము పైన పేర్కొన్న అయిదుగురు విదేశాంగ మంత్రులు. ఇందుకు ఏ స్వల్పంగానో భిన్నంగా వెళ్ళి, అనేకదేశాలలో స్వాతంత్ర్యశక్తులకు, పురోగామివర్గాలకు కొంతవరకు బలం కూర్చిన విదేశాంగమంత్రి పామర్‌స్టన్ మాత్రమే.

నెపోలియన్ పతనంతర్వాత యుద్ధప్రమాద నివారణకు, ప్రపంచ శాంతి రక్షణకు "కాన్‌సర్ట్ ఆఫ్ యూరప్" ("యూరోపియన్ సమాఖ్య") అనే విధానంపై కాజిల్‌రే ప్రధానంగా ఆధారపడినా, దానికైనా ప్రాతిపదిక "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" మాత్రమే. ఆయన జీవితకాలంలోనే "కాన్‌సర్ట్ ఆఫ్ యూరప్"

విధానం భగ్నమైపోయింది. తుదకు తన ఉద్యోగధర్మాల భారాన్ని వహించలేక ఆయన ఆత్మహత్య చేసుకొన్నాడు కూడా.

కాజిల్‌రే తర్వాత విదేశాంగమంత్రిగా ప్రాముఖ్యంలోకి వచ్చిన కానింగ్ "పాత ప్రపంచంలో సమసిపోయిన బ్యాలెన్స్‌ను పునరుద్ధరించడానికి నేను నూతన ప్రపంచాన్ని సృష్టించాను" అని అమెరికా స్వాతంత్ర్యం పొందడానికి తానేదో చేశానని స్వయంగా గొప్ప చెప్పుకొన్నా, దక్షిణ అమెరికాలో యూరోపియన్ రాజ్యాల జోక్యాన్ని నిరోధించడానికి ఆయన చేసింది యునైటెడ్ స్టేట్సు అధ్యక్షుడు మన్రోను ప్రస్తుతం "మన్రో సిద్ధాంతం"గా చెల్లుతున్నదాన్ని ప్రకటించవలసిందిగా ప్రోత్సహించడం తప్ప అంతగా మరేమీ లేదు. కాజిల్‌రే పట్ల తనకున్న వైముఖ్యంవల్ల, విరోధంవల్ల, ఆయన విధానాలను తలక్రిందులు చేయడంద్వారా కానింగ్ సాధించింది బహుస్వల్పం.

పోతే, త్యాలీరాఁ కేవలం జిత్తులమారి నక్కలాంటివాడు. ఆవులించక పోయినా పేగులు లెక్కపెట్టగల ఘటికుడు. అతడి దుర్గుణాలలో లంచగొండితనం మొదటిదేకాని చివరిది కాదు. వియన్నా కాంగ్రెసులో కాజిల్‌రే, మెటర్‌నిక్‌లను పోలిన ప్రతిభావంతులను పిల్లిమొగ్గలు వేయించి, పరాజయ పరాభవాల నుంచి ఫ్రాన్సును కొంతవరకు కాపాడినా, ఆయన అంతర్జాతీయదృష్టి లేనివాడు. విదేశాంగమంత్రిగా పనిచేస్తూనే తనకు విరుద్ధంగా కుట్రలు పన్నుతున్నందుకు కోపం పట్టలేక నెపోలియన్ ఒకానొక సందర్భంలో అన్నట్టు త్యాలీరాఁ నిజంగా "అంగవస్త్రంలో ఆవుపేడ" వంటివాడు. ("కౌ డంగ్ ఇన్ ఎ సిల్క్ స్టాకింగ్")

మెటర్‌నిక్ కూడా "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" వర్గానికి చెందినవాడే. తాను ప్రగతిశీలుడనని చెప్పుకొన్నా, తన లక్ష్యాలను ఆచరణలో పెట్టగల ధీరోదాత్తత కొరవడిన వ్యక్తి. పందొమ్మిదవ శతాబ్దిలో ప్రాముఖ్యానికి వచ్చినా, ఆయన పద్దెనిమిదవ శతాబ్ది చిత్తవృత్తివున్నట్టి వాడు. భద్రతను, స్థిరత్వాన్ని సాధించడానికి విప్లవోద్యమాలను అణచివేయడం ఆయన తన పనిగా పెట్టుకొన్నాడు. అందువల్లనే ప్రజాగ్రహానికి తట్టుకోలేక, చివరికి ఒక ఘట్టంలో స్వదేశంనుంచి బ్రిటన్‌కు ఆయన పారిపోవలసివచ్చింది.

ఈ నలుగురికంటె మిన్నగా పేర్కొనదగువాడు పామర్‌స్టన్. అయితే, ఆయనైనా మన నెహ్రూవలె జాతీయ, అంతర్జాతీయ ప్రయోజనాలకు తన విదేశాంగవిధానంలో సమాన ప్రాధాన్య మిచ్చినాడని అనలేము; నేటి తన విధానం రేపటిని పదిలపరచవలెనన్న దూరదృష్టితో వ్యవహరించాడనీ అనలేము.

నెహ్రూ సమకాలికులైనందున ఆయన విదేశాంగవిధానం వైశిష్ట్యాన్ని పూర్తిగా గుర్తించలేకపోయినవారు సయితం ఇప్పుడే తమ అభిప్రాయాలను కొంతవరకు మార్చుకొనక పోవడం లేదు. ఇందుకు ఒక సరికొత్త సాక్ష్యం అమెరికా వైస్ ప్రెసిడెంట్ పదవికి రిపబ్లికన్‌పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న శ్రీ కాబెట్ లాడ్జ్ నెహ్రూ విదేశాంగవిధానాన్ని సంస్తవించడం!

[సెప్టెంబర్ 4, 1960]

యుగధర్మం

నానార్థాలున్న మాటలలో "ధర్మ" మొకటి. "శబ్దరత్నాకరము" వివరణ ప్రకారం ధర్మమంటే "పుణ్యము, న్యాయము, సామ్యము, స్వభావము, ఆచారము, అహింస, వేదోక్తవిధి, ఉపనిషత్తు, విల్లు." "శబ్దార్థచంద్రిక" ఇవి కాక, "యజ్ఞము, సత్కార్యము, నీతి" అని మరి మూడు అర్థాలను కూడా పేర్కొంటున్నది. మరొక నిఘంటువును చూస్తే, దానిలో మరికొన్ని అర్థాలు కనబడతాయనే అనుకోవచ్చు. ఏ నిఘంటువు పేర్కొనని అనేక అర్థాలలో ఈ పదాన్ని మనం నిత్యవ్యవహారంలో వినియోగించడం కద్దు కూడా. ఉదాహరణకు "దానం" అనే అర్థంతో దీన్ని మనం వాడతాము ("దానధర్మాలు") వేదోక్తమైనా, కాకపోయినా "విధి" ("డ్యూటీ") అర్థంలోకూడా దీన్ని మనం వాడతాము. "వర్ణాశ్రమధర్మా"లన్నచోట దీని అర్థం మరొకటి. ఇలాగే సందర్భం మారినప్పుడు, సమాసం మారినప్పుడు, దీనికి విభిన్నార్థాలు వస్తుంటాయి.

నానార్థాలు ఇంతగా వున్న ఈ పదప్రయోగం ఎక్కడ జరిగినా, ఏ అర్థంలో, ఏ ఉద్దేశంతో దీని ప్రయోగం జరిగిందని వెంటనే ప్రశ్నించుకోవలసి వుంటుంది. రాజకీయవేదికపై ఈ ప్రయోగం జరిగితే, ఈ పరిశీలనను మరింత క్షుణ్ణంగా చేయవలసివుంటుంది.

రాజాజీ ఇటీవల ఏ ప్రసంగం చేసినా, దానిలో ఎక్కడో ఒకచోట "ధర్మం" ప్రసక్తి వస్తున్నది. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు మొదలైన మన ప్రాచీనగ్రంథాల ప్రసక్తితో జోడించి, ఆయన ఈ మాటను, తరచు ప్రయోగిస్తున్నందున "సనాతనధర్మం" అనే అర్థంలోనే దీన్ని ఆయన వాడుతున్నాడని అనుకోవాలి. పోతే, శ్రీ కె. యం. మున్షీ ఎక్కడ "ధర్మం" ఊసెత్తినా, ప్రధానంగా ఆయన "వర్ణాశ్రమధర్మా"లనే మనస్సులో పెట్టుకొం

టున్నాడని తీర్మానించుకోవచ్చు. పోతే, జవహర్‌లాల్ నెహ్రూ "యుగధర్మం" అనే అర్థంలో తప్ప ఈ మాటను సాధారణంగా ప్రయోగించడు.

రాజా రామమోహన రాయ్‌ని "భారతావనిలో జన్మించిన తొలి అధునాతన మనీషి"గా ఒక రెవరో అభివర్ణించారు. నెహ్రూ ఆ శ్రేణిలో ద్వితీయుడని ఘంటా పథంగా చెప్పవచ్చు. స్వీయచరిత్రలో ఒకచోట తాను ఇటు ప్రాచ్యప్రపంచానికి కాని, అటు పాశ్చాత్య ప్రపంచానికి కాని పూర్తిగా చెందనని, ఆ రెండు ప్రపంచాలలో కూడా తాను సమానంగా ప్రవాసినని ఆయన వ్రాసుకొన్నాడు. కాని, ప్రాచ్య, పాశ్చాత్య ప్రపంచాలు రెండు విభిన్న, లేదా విరుద్ధ ప్రపంచాలుగా ఈ నాడు మిగిలిలేవు. ఆ రెండింటిలో విశేషమైన మార్పులు విస్తృతంగానే కాక, శీఘ్రగతిని జరుగుతున్నాయి.

విమానం, సినిమా, రేడియో, టెలివిజన్, రాకెట్, ఒక్కమాటలో— టెక్నాలజీ- ఈ పరివర్తనాన్ని సాధిస్తున్నది. కడచిన మూడు శతాబ్దాలలో మారినంతగా ప్రపంచం అంతకు ముందెన్నడు మారలేదు. గతించిన అర్ధశతాబ్దిలో మారినంతగా అతఃపూర్వపు మూడు శతాబ్దాలలో మారలేదు. ఈ మార్పు కారణంగా ప్రాచ్య, పాశ్చాత్య విభేదాలకు అతీతమైన ఒక కొత్త సంస్కృతి అద్భుతంగా, అతివేగంగా రూపొందుతున్నది, ఒక కొత్తప్రపంచమే ఆవిర్భవిస్తున్నది. ఈ కొత్త ప్రపంచానికి నాయకముఖులుగా పేర్కొనదగినవారిలో నెహ్రూస్థానం మొదటి రెండు, మూడింటిలోనే. అందువల్ల ప్రాచ్య, పాశ్చాత్య ప్రపంచాలు రెండింటిలోను ఆయన సమానంగా ప్రవాసి కాడు; ఆ రెండింటిమధ్య ఒక సువర్ణసేతువు నిర్మాత.

నేటి నూతనయుగానికి తగు నూతన ప్రపంచాన్ని రూపొందించడానికి యత్నిస్తున్న మహనీయులలో ఒకడు కనుకనే నిన్న న్యూఢిల్లీలో ఒక విద్యార్థుల సభలో ప్రసంగిస్తూ, యుగం మారిందని, యుగధర్మం మారిందని, ఇందుకు తగినట్టు యువకు లందరు మారాలని ఆయన ఉద్బోధించాడు. సనాతనధర్మాలు సనాతనకాలానికే కాని ఈ కాలానికి తగవు; వర్ణాశ్రమధర్మాలు త్వరగా లుప్తమై పోతున్న- లుప్తం కావలసిన- సంఘానికే కాని, మనం లక్షిస్తున్న నూతన

సాంఘికవ్యవస్థకు తగవు. పోతే, ఇప్పుడు కావలసింది మానవసమత, మానవ స్వేచ్ఛ - ఒక్క మాటలో - మానవత - ప్రాతిపదికగాగల నవధర్మం.

యువకులైనవారు యుగధర్మాన్ని పాటించకపోతే, అది దెబ్బ తినదు, తామే దెబ్బ తింటారు. అప్రతిహతంగా సాగిపోవడమే యుగధర్మ లక్షణం. దాన్ని అనుసరిస్తేనే వికాసం; దాన్ని వ్యతిరేకిస్తే వినాశం. వ్యక్తి విషయంలోనైనా జాతి విషయంలోనైనా ఇది ''రెండు రెళ్లు నాల్గు''ను పోలిన స్థిరసత్యం.

[నవంబర్ 11, 1960]

"త్రివిక్రముడు"

అహో! ఇదెంతటి గొప్ప వార్త! ఎంతటి అద్భుతవార్త!! అప్పుడే రెండు, మూడు రోజులుగా ఈ వార్తతో ప్రపంచం మారుమ్రోగిపోతున్నా, మాస్కో మౌనం కారణంగా "నిజమా?" అనే శంక కొంత పీడిస్తూ వచ్చింది కాని, మరి ఊహాగానం చేయనక్కరలేదు; అభిజ్ఞవర్గాలకథనాలపై ఆధారపడ నక్కరలేదు. మానవుడు రోదసిలో నిన్న పాదంపెట్టినట్టు ఇంతకు కొంచెం ముందే అధికారయుతంగా మాస్కోనుంచి ప్రకటన వెలువడింది! యాత్రను ముగించు కొని, భూమండలానికి అతడు దిగి వస్తున్నట్టుగా కొన్ని నిమిషాలక్రితమే మరొక వార్త చేరింది. ఈ సంపాదకీయరచన ముగిసేలోపలనే జయప్రదంగా ఆతడు యాత్రను పూర్తిచేసిన శుభవార్త అందవచ్చుకూడా!

రోదసిలోనికి తొలిమానవుని పంపించడం (ఆదిలో వచ్చిన వార్తలు సూచించినట్టు) మొన్న కాక, నిన్న జరిగింది. కొంచెం ముందుగానో, కొంచెం వెనుకగానో ఇట్టి వార్త వస్తుందని కొంతకాలంగా ప్రపంచం ఉత్సుకతతో - ఉత్సాహంతో - ఎదురుచూస్తున్నది. రోదసియాత్ర ప్రాణాపాయకరమైనది కాదన్న విషయం కూడా ఇదివరలోనే స్పష్టంగా నిరూపితమైంది. కోరితే, ఈ ప్రయోగం - ఈ ప్రయాణం - ఇంతకుముందే సాధ్యపడివుండేది. కాని, నిరపాయ కరంగా ఇది జరగాలన్న పట్టుదలతో అన్ని పరిశోధనలను సమగ్రంగా కొన సాగిస్తూ నిన్నటివరకు సోవియట్ యూనియన్ ఆగింది. (మేము ఆశించి నట్టుగా, మానవుని తొలి రోదసియాత్ర జయప్రదంగా ముగిసినట్టు ఇప్పుడే వార్త అందింది.)

రోదసిలో మానవుడు ప్రప్రథమంగా పాదంపెట్టడం - ఇదెంతటి మహత్తర విజయం! ఎంతటి మహిమాన్వితం సంఘటన!! నరుడెంత! అనంత విశ్వంతో పోల్చినప్పుడు సూక్ష్మాతిసూక్ష్మ ధూళిరేణువును కోటికోట్లతో విభజించగా వచ్చిన దానిలో అతడు కోటికోట్ల వంతుకూడా కాడు. అయినా, అతడు విశ్వాంతరాళాల రహస్యాలను భేదించడానికి ప్రయత్నించడం, సృష్ట్యాదిగా భూగోళంలో తనను బందీగా చేసివేస్తున్న గురుత్వాకర్షణను జయించి, రోదసీగర్భంలో విజేతగా ప్రవేశించడం - తలచుకొంటేనే హృదయాన్ని పులకింపజేసే మహత్తర విషయమిది!

ఎన్ని రంగాలలో ఎంతగా పురోభివృద్ధిని సాధించినా, నిన్నటివరకు మానవుడు వామనుడే! ఇకమీదట అతడు త్రివిక్రముడు! "ఇంతింతై, వటుడింతయై, మరియు దానింతై, నభోవీథిపై నంతై, తోయద మండలాగ్రమున కల్లంతై, ప్రభారాశిపై నంతై, చంద్రునికంతయై, ధ్రువునిపై నంతై, మహర్వాటిపై నంతై..." అన్నట్టుగా అతడిక మీదట ముల్లోకాలకే కాక, ఎన్ని లోకాలకైనా విస్తరించగలడు. సౌరకుటుంబాధిపత్యం అతడికి ఇకమీదట అందుబాటులోగల విషయం. సౌరమండలం సరిహద్దులను సయితం దాటి, పాలవెల్లిలోనే అతడు పాగా వేయగలడేమో! పాలవెల్లి పరిధిని సయితం అధిగమించి వెళ్లగలడేమో!!

ఈ అనంతవిశ్వంలో ఆధునిక మానవుని పురోగమనావకాశాలు నిజంగా అనంతమైనవే! కాని...కాని...విజ్ఞానాభివృద్ధికి తగు వివేకాన్ని అతడు ప్రదర్శించినప్పుడుకదా, అతడి పురోగమనం సవ్యంగా కొనసాగడం? ఈనాడు తన ఈ ప్రపంచాన్ని చక్కబెట్టుకొనలేకపోతున్న మానవుడు అన్యప్రపంచాలకు వెళ్లి ఏమి వెలగబెట్టగలడు? మొత్తం మానవాళినే స్వరూపనాశం చేసి, మానవవిజ్ఞానాన్ని, కళలను, సంస్కృతిని, సభ్యతను భూస్థాపితం చేసివేయగల అణ్వస్త్రాల నిర్మాణంలో నేడు ఎంత పోటీ జరగడంలేదు? అణ్వస్త్రాలతోపాటు విషక్రిములు, విషవాయువులు, మృత్యుకిరణాలు, మున్నగువాటిని సమకూర్చుకొనడానికై ఎంతగా పట్టుదలలు కానరావడం లేదు? అయినా, ఈ మారణాయుధాల నిర్మాణ

నిషేధానికై ఎన్నేళ్ళుగా చర్చలు జరుగుతున్నా నేటికీ అవి ఒక కొలిక్కి రాలేదు. ఈపరిస్థితిలో "రేపు" అనేది మానవునికి లేకపోవచ్చుగదా?

అటు స్వర్గం, ఇటు పాతాళం; అటు విశ్వవిశ్వేశ్వరత్వం, ఇటు స్వరూపనాశం; అటు జీవన్మరణ రహస్యభేదనం, ఇటు కాలగర్భంలో విలీనం! మానవుడు అటు వెళ్లి, త్రివిక్రముడౌతాడో, ఇటు వెళ్లి త్రెళ్లిపోతాడో!!

[ఏప్రిల్ 13, 1961]

చీలుదారులు

స్టాలిన్ అంటే "ఉక్కు మనిషి" అన్నట్టు, "మోలటావ్" అంటే సుత్తి" అన్నట్టు, రష్యన్ భాషలో "గగారిన్" అనే మాటకు "గగనవిహారి" అనే అర్థ మేదైనా కలదేమో మాకు తెలియదు. ఏమైనా, కేవలం ధ్వని సామ్యాన్నే తీసుకొన్నా, గగనగర్భంలోకి తొలి ప్రయాణంచేసిన వ్యక్తి "గగారిన్" కావడం ప్రత్యేకించి గమనార్హమైన విషయమే।

"గగనం అనే పదానికున్న నానార్థాలలో శూన్య మొకటి, సున్న మరొకటి, స్వర్గం వేరొకటి. గగారిన్ నిన్న శూన్యంలోనికి - వాయుశూన్యమైన మండలం లోనికి - పయనించి వచ్చాడు. సున్నలోనికి - బరువు సున్న అయిపోయే సీమ లోనికి - తొంగి చూచివచ్చాడు. ఒక విధంగా ఆయన స్వర్గానికి వెళ్ళివచ్చినట్టే చెప్పవచ్చునేమో కూడా। అపూర్వమైన, అద్భుతమైన ఒక దివ్యానుభూతిని తనకు సమకూర్చిన రోదసీగర్భంలోనికి వెళ్ళిరావడం స్వర్గానికి వెళ్ళిరావడంతో సమానం కదా?

మానవుడు నేడు చీలుదారులలో నిలిచియున్నాడు. వివేకంగా సంచరిస్తే, ఇప్పు డతడు స్వర్గాన్నే అందుకోగలడు; అది కొరవపడితే, పాతాళానికి క్రుంగిపోగలడు. అన్నివిధాల మానవచరిత్రలోనే ఇదొక అపూర్వ సందర్భం అద్వితీయ సన్నివేశం!!

యుఫ్రెటెజ్, టైగ్రిస్, నైల్, సింధునదీ తీరాలలో తొలి సభ్యమానవుడు గ్రహగతులను గమనించ నారంభించిన నాటినుంచే-సూర్యచంద్రుల ఉదయాస్త మానాలను చూచి, ఆశ్చర్యానందాలతో వాటిని కీర్తించ నారంభించిన నాటి నుంచే - రాశిచక్రాన్ని వేసుకొన నారంభించిన నాటినుంచే-గ్రహాంతరయానాన్ని గురించి అతడు కలలు కంటున్నాడు. ఆ గొప్ప కలలు నిజం కాగల సమయ మిప్పుడు వచ్చింది.

ఇదే విధంగా కొన్నివేల సంవత్సరాలనుంచి వజ్రాయుధాలనుగురించి, బ్రహ్మాస్త్రంనుగురించి మానవుడు కలలు కంటున్నాడు. అణ్వాస్త్రాలరూపంలో ఈకలలు కూడా ఈనాటికి నిజమైనాయి.

ఒకవైపున రోదసీనౌక, మరొకవైపున అణ్వస్త్రం : దేనివైపుకు మానవుడు మొగ్గుతాడు? ఈ ప్రశ్నముందు తక్కినవన్నీ అల్పమైనవే।

అణ్వస్త్రంవైపుకు కాక, రోదసీనౌకవైపుకే మానవుడు మొగ్గుచూపడం జరిగితే, ఎన్నెన్నో సృష్టిరహస్యాలను అతడు తెలుసుకోగలుగుతాడు. ప్రాణికోటి ఒక్క భూగోళంపైనే కలదా, అన్య గోళాలలోకూడా వున్నదా? అసలు గోళాలు ఏ విధంగా ఏర్పడుతున్నాయి? సృష్టికి ఆద్యంతాలు కలవా, లేవా? అనంతంలోనికి ఈ అనంతవిశ్వం అనంతంగా విస్తరిస్తున్నదనే సిద్ధాంతం ఎంతవరకు నిజం? ఇట్టిప్రశ్నలెన్నింటికో గ్రహాంతరయానంద్వారా ప్రత్యుత్తరాలను బహుశా తెలుసుకోవచ్చు. తన అల్ప సమస్యలతో, తన క్షుద్ర కలహాలతో ఈ మహదవకాశాన్ని మానవుడు జారవిడుస్తాడా? లేక దీన్ని సద్వినియోగం చేసుకొని, నూతన గోళాలలోనే కాక, నవీనయుగంలో ప్రవేశిస్తాడా?

[ఏప్రిల్ 14, 1961]

మేధావుల కర్తవ్యం

మరొక విషయంపైకి మనస్సును పోనీయనంతటి మహత్తర సంఘటన రోదసీకుహరంలోనికి యూరీ గగారిన్ జరిపివచ్చిన జైత్రయాత్ర. గగారిన్ సోవియట్ పౌరుడు కావచ్చు; ఆయన విజయం సోవియట్ వైజ్ఞానికశాస్త్రజ్ఞుల విజయం కావచ్చు. కాని, దీన్ని కేవలం సోవియట్ విజయంగా భావించడం ఒక విధంగా సంకుచితవైఖరి మాత్రమే కాగలదు. మానవ జాతి దౌర్భాగ్యంవల్ల ఆ సంకుచిత వైఖరే నేడు అంతర్జాతీయరంగంలో రాజ్యం చేస్తున్నందున చంద్ర, శుక్ర, అంగారకాది గ్రహాలలోనికి మానవుని ప్రయాణావకాశాలను గురించిన ఆలోచనలు – సౌరకుటుంబాధిపత్యాన్ని గురించిన స్వప్నాలు – ఎంతో ఉత్తేజపరచడానికి మారుగా, రోదసీగర్భంనుంచి భూతలంపై అణ్వస్త్రాల వర్షాన్ని గురించిన భయాందోళనలే ఎంద రెందరినో నేడు కలవరపరుస్తున్నాయి. ఈ కలవరపాటు అకారణమైనదని అనగలిగితే, నేటి ప్రపంచపరిస్థితులనుగురించి విచారాన్ని వెలిబుచ్చవలసిన ఆగత్యం వుండదు. అట్టి మాటను అనగల స్థితిలో లేము గనుకనే, అన్యగోళాల ప్రాంగణంలో నిలచిన ఆధునిక మానవునికి ఈ ప్రపంచంలో నూకలు నిండుకొనబోవడం లేదు గదా అని ప్రశ్నించుకోవలసి వస్తున్నది.

ఏ దృష్టినుంచి చూచినా, యుగసంధిగా చెప్పదగు ప్రస్తుత సమయంలో మానవాళి భవిష్యత్తును కేవలం రాజకీయవేత్తల చేతులలో విడిచిపెట్టడం తగదు. రాజకీయవేత్తలు దూరదృష్టిలేనివారని కాని, సమష్టిప్రయోజనాలను కాంక్షించని వారని కాని మా తాత్పర్యం కాదు. అయితే, తక్షణ ప్రయోజనాలను వారు పూర్తిగా త్రోసిపుచ్చలేరు. వ్యష్టిని కాదని, సమష్టికే పూర్తిప్రాధాన్య మివ్వడం అన్ని సందర్భాలలో వారికి సాధ్యం కాదు కూడా !

ఈ సంగతి సందర్భా లన్నింటిని దృష్టిలో పెట్టుకొని, ప్రపంచం భవిష్యత్తునుగురించి ప్రపంచప్రజలే ఇప్పుడు కొంతవరకైనా స్వయంగా బాధ్యత వహించితీరాలి. ఇది తమకు, తమ సంతతికీ సంబంధించిన విషయం; పుట్టివున్న వారికే కాక, పుట్టబోయే వారికి సంబంధించిన విషయం. అందువల్ల జీవితంలో ఎవరి అంతస్తు ఏదైనా, ప్రపంచప్రజ లందరు తమ భవితవ్య పరిరక్షణవిషయమై ఈ యుగసంధిలో ఎంతో కొంత ప్రత్యక్షబాధ్యత వహించాలి.

ప్రత్యేకించి మేధావులు ఇప్పుడు ఎక్కువ భారం వహించాలి. వారు కవులైనా, రచయితలైనా, సంపాదకులైనా, కళాకారులైనా, తత్త్వవేత్తలైనా, వైజ్ఞానిక శాస్త్రజ్ఞులైనా, సాంకేతిక నిపుణులైనా, రాజకీయాల గొడవ తమకు దేనికని ఔదాసీన్యం వహించరాదు. అంతే చేస్తే, మానవాళిపట్లనే వారు మహాపరాధం చేసినవారౌతారు. జవహర్‌లాల్ నెహ్రూ హెచ్చరించినట్టు, గగారిన్ విజయం "ప్రపంచశాంతికి విజయం" కావాలి. దేశదేశాలలోని మేధావు లందరు ప్రపంచశాంతి సాధనకు ఇప్పుడు కంకణధారులు కావాలి. ఇది వారి కనీస ధర్మం, వారి తక్షణకర్తవ్యం.

[ఏప్రిల్ 16, 1961]

మానసికపు పంజరాలు

మనది స్వతంత్రదేశం. అయినా, మనం స్వతంత్రప్రజలమా?

స్వతంత్రప్రజల స్వాతంత్ర్యం వ్యక్తంకావలసింది వారి రాజకీయ వ్యవహారాలలోనే కాదు, వారి ఆర్థిక, సాంఘిక జీవిత వ్యవస్థలలోనే కాదు, వారి మానసిక జీవితంలో కూడా.

మానసిక జీవితానికి సంబంధించినంతవరకు మన దేశం ఇరవయ్యో శతాబ్దిలో లేదు; పదవ శతాబ్దిలోనే ఈనాటికీ అది మిగిలివున్నది. మనలో చాలామంది మానసికజీవితం పదవ శతాబ్దంవరకైనా పురోగమించలేదు; అది వేదకాలాన్ని దాటి ఒక్క అడుగైనా ముందుకు వేయలేదు.

చదువు సాములు లేనివారిలోనే మానసిక వికాసం కానరాకపోతే, విద్యావ్యాప్తితో ప్రస్తుత దుస్థితి తొలగవచ్చునని ఆశించవచ్చు. కాని, ప్రధాని నెహ్రూ నిన్న జబల్పూర్‌లో ప్రసంగిస్తూ పేర్కొన్నట్టు, "మేధావులైనవారిలోనే, వైజ్ఞానిక శాస్త్రాలలో, తత్త్వశాస్త్రాలలో, కళలలో పండితులైనవారిలోనే" వారి చదువులకు, వారి నమ్మకాలకు ఏమీ సంబంధం కానరావడం లేదు.

గ్రహణంపట్టి, విడిచినంతనే గంగలో మునిగే ఖగోళశాస్త్రజ్ఞులు, "జంబూద్వీపే, భరతఖండే...." అనే మంత్రాన్ని పఠించే భూగోళశాస్త్రజ్ఞులు, బల్లి పలికిందని, నల్లపిల్లి యెదురువచ్చిందని ప్రయాణాలను ఆపుచేసుకొనే తత్త్వశాస్త్రజ్ఞులు, కుల మత విభేదాలను పాటించే మానవశాస్త్రజ్ఞులు — ఈ విధంగా ఎందరెందరు మహామేధావులు, ఎందరెందరు మహా మహాపండితులు మనకు లేరు? తెలియని మూర్ఖులనైనా సహించవచ్చు గాని, తెలిసిన ఈ మూర్ఖులను సహించలేము. అయినా, ఇట్టివారి సంఖ్య మన దేశంలో లక్షలలో కాదు, కోట్లలోనే!

ఈనాటి మన సంఘంలో నైతికపు విలువలు తక్కువకావడానికి మూల కారణాలలో విద్యకు, విశ్వాసాలకు సంబంధం లేకపోవడమే ప్రధానమైంది కావచ్చు. సూర్యచంద్ర గ్రహణాలకు రాహుకేతువులు కారకులు కారని తెలిసి కూడా గ్రహణశాంతికై స్నానాన్ని, జపాన్ని చేసే వ్యక్తి మాటకు, అతని చేతకు సంబంధం లేకపోవడం అబ్బురమా ? కుల, మత, వర్గవిభేదాలు కృత్రిమ మైనవని తెలిసికూడా వాటిని పాటించే వ్యక్తి రెండు నాల్కల వ్యవహారం చేయడం విడ్డూరమా ?

కొన్ని పూర్వాచారాలను మూఢాచారాలుగా తాము గుర్తిస్తున్నా, తమ తల్లిమనస్సును నొప్పించరాదనో, తండ్రికి కినుక తెప్పించరాదనో, భార్యపోరును తప్పించుకొనవలెననో, వాటిని తాము పాటించక తప్పడం లేదని ఈ ప్రబుద్ధు లలో కొందరు చెప్పడం కద్దు. తమవారిని తమ స్థాయికి తీసుకురావడానికి ప్రయత్నం చేయడానికి మారుగా తామే వారిస్థాయికి దిగిపోతే, తమ చదువులు దేనికి, తమ పాండిత్యం దేనికి, తమ డిగ్రీలు దేనికి ? తగలబెట్టడానికా ?

దేశంలో ఎంతగా విద్య వ్యాపించినా, ఎన్ని వైజ్ఞానికశాస్త్ర పరిశోధనా గారాలు వెలసినా, ఎందరు ఆధునికశాస్త్రిలలో ఎంత పెద్దపట్టాలు పుచ్చుకొన్నా, నెహ్రూ పలుకులలో, "మానసికపు పంజరాలనుంచి" మనం బయటపడితేనే తప్ప, ఇండియా నిజంగా స్వతంత్రదేశం కాబోదు !

[జులై 13, 1961]

దుష్టగ్రహాలు

అష్టగ్రహకూటమట, అందువల్ల ప్రపంచానికి ఘోరారిష్టాలు తప్పవట, జలప్రళయమే రావచ్చునట, ప్రపంచాన్నే అది తుడిచి పెట్టవచ్చునట; ఇట్టి పరమ మూఢ విశ్వాసాలతో భయవిహ్వలు లౌతున్న వారి ప్రపంచం నిజంగానే సర్వనాశమైపోతే, అంతకంటె వాంఛించదగు శుభపరిణామాన్ని మాముట్టుకు మేము ఊహించలేము!!

వైజ్ఞానికశాస్త్రిలు ఎంతగా పురోగమిస్తేనేమి? ఎన్నెన్ని సృష్టిరహస్యాలను సభ్యమానవుడు ఛేదిస్తేనేమి? చంద్రమండలయాత్రకై సన్నాహాలు సాగుతుంటే మాత్రమేమి? అంగారకగ్రహంలో అడుగుపెట్టడం సుసాధ్యమైన సమయం ఆసన్నమైతే మాత్రమేమి? పాత పంచాంగాలనే ప్రామాణిక శాస్త్రిలుగా పరిగణించేవా రున్నారు; మంత్రాలతో చింతకాయలు రాలగలవని విశ్వసించేవా రున్నారు. వారే అష్టగ్రహశాంతులను చేయిస్తున్నారు; ముప్పొద్దుల కడుపునిండుగా కూటికైనా నోచుకోనని ఈ పేదదేశంలో ఎంతో డబ్బును హోమగుండాలలో మసి చేస్తున్నారు. అందువల్ల అష్టగ్రహశాంతి జరిగినా, జరగకపోయినా, ప్రజామౌఢ్యాల పరిపోషణనే వృత్తిగా చేసుకొన్న దుష్టగ్రహ శాంతి జరగడం మాత్రం ముమ్మాటికీ నిజం!

దీన్ని నిశితవిమర్శగా భావిస్తుంటే, "కాదు" అని మా మనవి. గాంధిని పోలిన మహాపురుషుడు "జ్యోతిషం ఒక శాస్త్రమైతే, అది సందేహించదగు ప్రాధాన్యంతో కూడిన శాస్త్ర" మని ఉద్ఘాటించాడు. "అంతటి గొప్ప గ్రహాలకు మనవంటి అల్పజీవులపై విశేషమైన ఆసక్తి దేనికి?" అని జవహర్‌లాల్ ఎగతాళితో కూడిన ఒక ప్రశ్న వేశాడు. అయినా, విద్యావేత్తగా విజ్ఞానవంతుడుగా (మన దౌర్భాగ్యంవల్ల) చెల్లుతున్న శ్రీ సంపూర్ణానంద్ అష్టగ్రహకూటం

వల్ల ప్రపంచానికి ఘోరారిష్టాలు విస్తృతంగా వాటిల్లనున్నవనే వారిని బలపరచడానికి ముందుకు వస్తున్నాడు!

అయినప్పుడు మనకు వేధశాలలు దేనికి? ఖగోళశాస్త్రపరిశోధనలు దేనికి? ఇతర వైజ్ఞానికశాస్త్ర పరిజ్ఞానం దేనికి? ఇక "సైన్సు" పుస్తకాలన్నిటిని చించి పారవేయవచ్చు; నేషనల్ లాబొరేటరీ లన్నింటికి నిప్పు పెట్టవచ్చు; మంత్రాల మహిమతో బొందితోనే కైలాసానికి వెళ్ళవచ్చు.

ఏమైనా, రేపు ఫిబ్రవరి 5వ తేదీని (ఖగోళశాస్త్రజ్ఞులు చేస్తున్న ప్రకటనల ప్రకారం) సంపూర్ణ సూర్యగ్రహణాన్ని మించిన పెద్ద విడ్డూరం జరగబోవడం లేదు. కాని, రాహుకేతువులు రాక్షసులని, వారు సూర్యచంద్రులకు తాత్కాలికంగా కలిగించే ప్రమాదాలే గ్రహణాలని నమ్మేవారికి ఎవరేమి చెప్పినా ప్రయోజనం పూజ్యమే!

అష్టగ్రహకూటం దుష్టఫలితాల మాట అటుండగా, ఖగోళశాస్త్రజ్ఞులు కొందరు పేర్కొంటున్నట్టు, ఫిబ్రవరి 5వ తేదీని ఎనిమిది గ్రహాలు ఒకచోట సమావేశం కాబోవడం లేదు. ఆనాడు రెండే రెండు గ్రహాలు సూర్యచంద్రులకు కొంత చేరువగా వస్తాయి; మరి మూడు ఆ రాశిలో వుంటాయి. ఇంతే కాక, మన జ్యోతిశ్శాస్త్రం గ్రహాలుగా పేర్కొంటున్న వన్నీ గ్రహాలు కావు. ఉదాహరణకు, రవి ఒక గ్రహం కాదు; అది నక్షత్రం. భూమి, కుజుడు, అంగారకాది గ్రహాల వలె చంద్రమండలం గ్రహం కాదు. ఉపగ్రహం మాత్రమే. ఇంతటితోనైనా సరిపోలేదు. మన పంచాగకర్తలు సృష్టించిన గ్రహాలలో కొన్ని ఎంతటి దూరదర్శిని యంత్రసాధనాలకైనా అందనట్టి ఊహాజనిత గోళాలు. కొత్త ఖగోళ శాస్త్రం దారి ఒకటి కాగా, పాత పంచాగం నమ్మకాల దారి మరొకటి!

పోనీ, పాత పంచాంగాన్ని నమ్మేవా రందరు ఒకే విధమైన ఫలితాలను చెబుతున్నారా అంటే, అదీ లేదు. ఎందరు పంచాంగకర్త లుంటే, ఎందరు జ్యోతిశ్శాస్త్రవేత్త లుంటే, అన్ని విభిన్నాభిప్రాయాలు వినవస్తున్నాయి. ఇదెంత హాస్యాస్పద విషయమో తెలియజెప్పడానికే—"టైమ్స్ ఆఫ్ ఇండియా" పత్రిక నిన్న తన సంపాదకీయంలో ఉదాహరించినట్టు—పంచాంగకర్తలు ఎనిమిది దుష్టగ్రహా

లను సృష్టిస్తే, తాను పద్దెనిమిది శుభగ్రహాలను సృష్టించగలనని ఖగోళశాస్త్రంలో మహాపండితుడు, సింహళం ఖగోళశాస్త్రజ్ఞుల సంఘానికి ప్రెసిడెంట్ ఆర్థర్ సి. క్లార్క్ అన్నాడు.

ఈ విషయా లన్నింటిని మేము వ్రాయడం ఆగ్రహంతో కాదు, ఆవేదనతో, ఆవేశంతో కాదు, అన్యదేశాలవారు మనలను చూచి నవ్వవచ్చునన్న సిగ్గుతో, బాధతో; కాకమ్మకథలనే ఇంకా మనం నమ్మితే, పుక్కిటి పురాణాలనే ఇంకా మనం శాస్త్రగ్రంథాలుగా పరిగణిస్తే, ఎప్పటికైనా మన ఇండియానుంచి ఒక "లూనిక్" గ్రహాంతరయానానికి బయల్దేరగలదా? ఎన్నటికైనా మన ఇండియాకు చెందిన ఒక గగారిన్, లేదా ఒక టిటోవ్ రోదసీగర్భంలో భారతీయ శేముషీ పతాకను ప్రతిష్ఠాపించగలడా?

[జనవరి 30, 1962]

మ్లేచ్ఛప్రభావం

అష్టగ్రహకూటం అరిష్టాలను కలిగించి వుండకపోవచ్చు, అంతమాత్రం చేత పంచాంగాలను కాదంటారా? పుక్కిటిపురాణాలను నమ్మరానంటారా? శివ శివ! జ్యోతిశ్శాస్త్రంపట్ల ఇదెంతటి ఘోరాపచారం! మంత్రశాస్త్రాలపట్ల ఇదెంతటి న్యూనభావం!

నవగ్రహశాంతులను చేస్తే, యజ్ఞయాగాదులను జరిపితే, గంగాస్నానాలు చేస్తే, గుమ్మాలకు పంగనామాలను పెడితే, పూజారులకు, పురోహితులకు, దక్షిణలు చెల్లించుకొంటే అష్టగ్రహకూటంవల్ల కలిగే అరిష్టాలు పటాపంచలు కాగలవని శాస్త్రం చెప్పలేదా? దేశం మొత్తంమీద భక్తకోటి శాస్త్రం నిర్దేశించిన కర్మకాండనంతటిని శ్రద్ధాసక్తులతో కొనసాగించినందునే ఏ ఘోరారిష్టాలకు లోనుగాకుండా మన వేదభూమి మాత్రమేకాక, మన పుణ్యభూమి మాత్రమేకాక, సమస్త ప్రపంచం ఒక మహావిపత్తునుంచి బయటపడలేదా?

అయితే, ఎన్ని యజ్ఞయాగాదులు జరిపినా, ఎన్ని పూజాపురస్కారాలు జరిగినా, అష్టగ్రహకూట ప్రభావం అసలే కనబడకుండా పోయిందనగలమా? గంగానది నీటిమట్టం హఠాత్తుగా ఒకటిన్నర అడుగులు పెరిగింది. మద్రాసునగరంలో మబ్బులు ఎర్రగా కనబడ్డాయి. గంగానది నీటిమట్టం హఠాత్తుగా ఇదివరకెన్నడు పెరగలేదా అనడం అర్థంలేని ప్రశ్న. ఇప్పటి పెరుగుదల వరదమట్టానికి చాలా తక్కువకాదా అనడమైనా మన శాస్త్రగ్రంథాలపట్ల విశ్వాసంలేని పాషండులు వేయవలసిన వెకిలిప్రశ్న. మబ్బులు ఎర్రగా కనబడ్డంలో విశేషమేమిటని పృచ్ఛించడం కూడా మన ప్రాచీనసంస్కృతిపట్ల గౌరవలోపంతప్ప మరొకటి కాదు. మన శాస్త్రాలలో మన మహర్షులు, మన బ్రహ్మర్షులు దేన్ని వ్రాశారో అది శిలాక్షరం; దాన్ని శంకించడం క్షంతవ్యం కాదు.

పైగా, అష్టగ్రహకూటంవల్ల మహారిష్టాలు జరగనంతమాత్రంచేత జ్యోతిశ్శాస్త్రం ఘనతను సందేహించడం తగునా? ఆ శాస్త్రంలో మహాపండితులైన

వారిలో కొందరు అష్టగ్రహకూటంవల్ల మేలుమాత్రమే జరగనున్నదని, చెడుగు జరగబోదని చెప్పలేదా? మరికొందరు శుభాశుభ ఫలితాలు కలగాపులగమని చెప్పలేదా? దీన్నిబట్టి అసలు శాస్త్రంలో దోష మేమీ లేదని, అరిష్టాలు కలుగుతా యని హెచ్చరించినవారు దశలను, అంతర్దశలను లెక్కకట్టడంలో పొరపడి నారని స్పష్టంకావడం లేదా? ఒకరు "కలగబోయేబిడ్డ ఆడపిల్ల" అని, మరొ కరు "కాదు, మగపిల్లవాడు" అని చెబితే, వారిద్దరిలో ఒకరు చెప్పింది తప్పక నిజం కాగలదనే కొక్కిరాయి మాటలకు విలు వేమిటి?

మన జ్యోతిశ్శాస్త్రం పేర్కొనని యూరెనెస్, నెప్ట్యూన్, ప్లూటో గ్రహాలు కాక, సౌరమండలంలో చిన్నచిన్న గ్రహాలు (యాస్టరాయిడ్స్) లెక్కలేనన్ని కలవంటారు. దివ్యచక్షువులతో కాక, చర్మచక్షువులతో నభోమండలాన్ని పరి కించేమ్లేచ్ఛులు ఏమైనా అంటారు. వారి మాటలను విన్నా, నమ్మినా, మనకు మహాపాపం చుట్టుకొంటుంది; మనం రౌరవనరకంలో పడిపోతాము.

ఈ పుణ్యభూమిలో పుట్టిన వారిలోనే మ్లేచ్ఛుల దుష్ప్రభావం వల్ల కొందరిలో పూర్వశాస్త్రాలపై, పుణ్యగ్రంథాలపై, వేదవేదాంగాలపై నమ్మకం తగ్గుతున్నది. ఈ ప్రమాదంనుంచి జాతిని రక్షించాలంటే ఆధునిక వైజ్ఞానిక గ్రంథాలను బహిష్కరించాలి; టెలిస్కోపులు, మైక్రాస్కోపులు మొదలైన వాటిని తుత్తునియలుచేసి, సముద్రంలో పారవేయాలి; ఊరు కొక హోమ గుండాన్ని మంజూరుచేయాలి; దానిలో పోయడానికి రోజుకు కనీసం ఒక డబ్బా స్వచ్ఛమైన ఆవునెయ్యిని శాంక్షన్ చేయాలి; ప్రతి పార్కును ఒక తపోవనంకింద మార్చాలి. నిత్యసంతర్పణలకు కేంద్రప్రభుత్వం బడ్జెట్టులో కనీసం రెండువందలకోట్ల రూపాయలనైనా కేటాయించాలి; దక్షిణలకు విడిగా మరొక నూరుకోట్లు ప్రత్యేకించాలి. ఈ కనీసపు కోర్కెలకు అంగీకరించగల పార్టీవారినే రేపు ఎన్నికలలో ఎన్నుకోవాలి. లేకపోతే, పాపం కొండలాదిగా పెరిగిపోతుంది; జాతి భ్రష్టమైపోతుంది.

ఈ నాటిదా, నిన్నటిదా జ్యోతిశ్శాస్త్రం? అది వేదకాలంనాటిది. ఏదేశ్య నాటి శాస్త్రగ్రంథమైనా ఈనాడు పనికిరాకుండా పోతుందని ఆధునిక శాస్త్రవేత్త లనవచ్చు. కానివారి మాట ఆధునికశాస్త్రాలకే వర్తిస్తుంది. పూర్వశాస్త్రాలు ఋషిప్రోక్త మైనవి. ఈ నాటి లాబొరేటరీలు, మైక్రాస్కోపులు వగైరాలు ఋషుల దివ్యదృష్టిముందు, వారి మంత్రశక్తిముందు చిల్లిగవ్వపాటి చేస్తాయా?

ఇప్పటికైనా ఖగోళశాస్త్రం ప్రాథమిక దశలోనే కలదని పాశ్చాత్య వైజ్ఞానిక శాస్త్రవేత్తలు అనవచ్చు. భూమి పుట్టి దాదాపు 300 కోట్ల సంవత్సరాలు కాగా, భూమిపై జీవరాసులు పుట్టి 30 కోట్ల సంవత్సరాలు కాగా, నరుడు పుట్టింది మూడులక్షల యేళ్ళక్రితమని వారనవచ్చు. ఖగోళశాస్త్రం పుట్టి మూడువేల సంవత్సరాలు కాగా, ఖగోళశాస్త్రవికాస సాధనకై దూరదర్శిని (టెలిస్కోపు) సహాయం లభించింది మూడువందల యేళ్ళక్రితమే అని ఆ శాస్త్రవేత్తలు చెప్పవచ్చు. కాని, ఆ మ్లేచ్ఛులకు దివ్యదృష్టి వున్నదా? మంత్ర శక్తి వున్నదా? అందువల్లనే సూర్యుడొక గ్రహం కాదంటారు. చంద్రుడు ఉపగ్రహం కాని, గ్రహం కాదంటారు: రాహుకేతువులు ఛాందసుల మస్తిష్కంలోనే తప్ప, ఖగోళంలో లేవంటారు.

అసలే ఇది ధర్మం ఒంటికాలిపై నడిచే పాడు కలియుగం! ఇది అంతం కావడానికి మరి 4, 26, 963 సంవత్సరాలు గడవాలని మన శాస్త్రకారులు చెప్పివున్నా, ఇప్పటి పద్ధతిలో పాపం పెరిగిపోతే, అంతకు ముందే కలిపురుషుడు అవతరించవచ్చు. ఆ లక్షణాలు ఇప్పుడే కనపడుతున్నాయి. ఈమధ్య పెరూలో మంచుకొండ పెల్ల విరగడం, ఉత్తర హిందూస్థానంలో చలిగాడ్పులకు చాలామంది చనిపోవడం కాకతాళీయాలు కావు. తస్మాత్ జాగ్రత! జాగ్రత!

[ఫిబ్రవరి 9, 1962]

"అన్నగారు"

"బ్రహ్మయ్యగారు యువకులలో యువకుడు" అంటూ 1937 లో నంద్యాలలో జరిగిన ఆంధ్రరాష్ట్ర రాజకీయమహాసభకు అధ్యక్షుడుగా ఆయన ఎన్నికైన సందర్భంలో "కృష్ణాపత్రిక" తన సంపాదకీయాన్ని ప్రారంభించింది. ఆ గొట్టిపాటి బ్రహ్మయ్యగారే నేడు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసుకు అధ్యక్షుడుగా ఎన్నికైన సందర్భంలో ''పెద్దలలో పెద్ద'' అంటూ ''ఆంధ్రజ్యోతి" తన ఈ సంపాదకీయవ్యాసాన్ని ప్రారంభించడం సముచితం. నాటికీ, నేటికీమధ్య వయస్సులోనే కాక, పదవిలోనే కాక, అంతస్తులో కూడా శ్రీ బ్రహ్మయ్య పెరిగాడు. ఆంధ్రజాతికే "అన్న"గా ఈనాడు ఆయన మన్నన లందుతున్నాడు.

శ్రీ బ్రహ్మయ్య విగ్రహంవలె ఆయన వ్యక్తిత్వం కూడా నిండైనది. ఆయన నడకలోవలె నడతలో కూడా హుందాతనం కనబడుతుంది. ఏ విధమైన వెలితి లేనిది ఆయన జీవితం. అందువల్లనే ఆయన పెదవులపై తరచు చిరునవ్వు వెన్నెలలు చిందులాడతాయి. ఆయన చిరునవ్వుకంటె కూడా అలరించ గలిగినట్టిది ఆయన నవ్వు. తానొక ఛలోక్తిని విసిరినప్పుడు, లేదా ఇతరులు తనపై ఒక ఛలోక్తి విసిరినప్పుడు, ఆయన నవ్వితే నవరత్నాలొలికినట్టుగానే వుంటుంది. అప్పుడు ఆయన కళ్ళు, ఆయన ముఖం మాత్రమే కాక, ఆయన ఆజానుబాహువిగ్రహమే ఆ నవ్వులో కరిగి పోతున్నట్టుగా అనిపిస్తుంది. నవ్వి, నవ్వించగల అమృతహృదయుడైనందునే ఆయన అందరి ప్రేమాభిమానాలకు పాత్రుడు కాగలుగుతున్నాడు, ఆంధ్రజాతికే అన్నగా చెల్లుతున్నాడు.

ఏ సాహిత్యరంగంలోనో, కళారంగంలోనో కృషిచేసేవారు ఈ విధంగా సర్వజనప్రియులు కావడం పెద్ద విశేషం కాదు. శ్రీ బ్రహ్మయ్య ఇట్టి రంగాలకు చెందిన వ్యక్తి కాడు. అసూయలకు, ఈర్ష్యలకు, ఆశలకు, ఆశాభంగాలకు,

విద్వేషాలకు, ప్రతీకారేచ్ఛలకు ఎంతగానో అవకాశ మిచ్చే రాజకీయరంగంలోనే ఆయన జీవితంలో అత్యధికభాగం ప్రధానంగా నడిచింది. ఆ నడవడమైనా అనామకంగా కాదు. కొన్ని కొన్ని ఘట్టాలలో కాంగ్రెసుసంస్థలో కీలకమైన పదవులనే ఆయన నిర్వహించాడు. అప్పుడు కనీసం కొందరికైనా అప్రియమైన నిర్ణయాలను ఆయన చేయవలసివచ్చింది. అందుకు కినిసి, తాత్కాలికంగా ఆయనను విమర్శించిన వారైనా, అటు తర్వాత ఎంతో కాలంపాటు ఆయనపై పగ పెట్టుకొనలేదు. ఇందుకు కారణం, వ్యక్తిగతమైన రాగవిద్వేషాలతో కాక, ఏదో ఒక ధర్మసూత్రానికి కట్టువడి, లేదా కాంగ్రెసుసంస్థ యోగక్షేమాలకే ప్రాధాన్య మిచ్చి, శ్రీ బ్రహ్మయ్య వ్యవహరించినాడని (వెంటనే కాకపోతే, కొంత కాలానికైనా) గుర్తించక తప్పనందునే!

అందరి ప్రేమగౌరవాలకు ఇంత విశేషంగా పాత్రుడు కాగలిగినందునే శ్రీ బ్రహ్మయ్యను అయాచితంగా నేడు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవికి ఏకగ్రీవంగా ఎన్నుకొనడం జరిగింది. రాష్ట్ర కాంగ్రెసు చరిత్రలో ఆయన నాయకత్వం ఎంతైనా అవసరమైన సన్నివేశ మిది. మత, కుల, వర్గ, ప్రాంతీయ తత్వాలు కాంగ్రెసులో నేడు పొడసూపుతున్నాయనడం కాదనరాని విషయం. కాకపోతే, కాంగ్రెసు అభ్యర్థులను చిత్తుచేయడానికి కొందరు కాంగ్రెసువారే చాటుమాటుగా తాము చేయగల సమస్తాన్నీ చేయడం పెక్కు నియోజకవర్గాలలో జరిగివుండేదా? ఇంతే కాక, సంస్థలకంటె వ్యక్తులకు ప్రాధాన్య మివ్వడం, వ్యష్టికై సమష్టిని బలిపెట్టడం ప్రస్తుతం జరుగుతున్నది కూడా. తమ సంస్థపట్ల పదిహేను, ఇరవై సంవత్సరాలనాడు ప్రజల కున్న పరిపూర్ణ భక్తి విశ్వాసాలు నే డున్నట్టు కాంగ్రెసువాదులైనా చెప్పలేరు.

ఈ పరిస్థితులలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షత కేవలం ఒక ఉన్నత పదవి కాదు, కేవలం ఒక గౌరవస్థానమైనా కాదు; అది నేడొక గొప్ప బాధ్యత, పవిత్రధర్మం. శ్రీ బ్రహ్మయ్య ఆ దృష్టితోనే తన నూతన పదవిని భావించు కొనగలడని, ఆ దృష్టితోనే వ్యవహరించగలడని విశ్వసించవచ్చు.

[ఏప్రిల్ 19, 1962]

"స్వార్థచింత"

"నాకు ముక్తి, నాకు మోక్షం" ఇది స్వార్థచింత కాదా? ఈ ప్రశ్న వేసినంతనే పాపపుమాటలు వినరాదని పెక్కుమంది చెవులు మూసుకోగలరని మాకు తెలుసు. కాని సంప్రదాయసిద్ధమైన ధోరణిలో కాక, స్వతంత్రంగా ఆలోచించగలిగితే ఒక వ్యక్తి తనకు ముక్తి కావాలని, తనకు మోక్షం కావాలని కోరుకొనడం స్వార్థచింత ధరించే అనేక ఛద్మరూపాలలో ఒకటి మాత్రమే అని స్పష్టపడుతుంది.

తనకు ధనధాన్యాలు కావాలని, వస్తువాహనాలు కావాలని, ఇతర భోగభాగ్యాలు కావాలని, లేదా తనకు పదవి కావాలని, ప్రాబల్యం కావాలని, ప్రఖ్యాతి కావాలని కోరుకొనే వ్యక్తి ఇహలోకంలో సుఖాలను కోరుకొనగా, ముక్తిమోక్షాలను కోరే వ్యక్తి పరలోకంలో సుఖపడగోరుతున్నాడు. అది ఇహలోకమైనా, పరలోకమైనా ఉభయులకు కావలసినవి తమ సుఖాలే!

పరలోకంలో సుఖాలను కాంక్షించే వ్యక్తి ఇహలోకంలోనే వాటిని కోరేవారిని చులకనగాచూస్తే, ఇహలోకసుఖాలు పరిమితమైనవనే, అశాశ్వతమైనవనే. ఇక్కడనే అనంతసుఖాలు తనకు లభిస్తే, వాటిని ఇక్కడనే భోగించడానికి అతడికి బహుశా అభ్యంతరం వుండదు.

ముక్తిని, మోక్షాన్ని కోరడం స్వర్గలోకంలో సుఖాలను కోరడం కాదని ఆత్మ వెళ్లి పరమాత్మలో లీనం కావాలని కోరుకొనడమే అని కొందరు చెప్పవచ్చు. కాని పరమాత్మలో లీనం కావాలని కోరుకొనడమైనా ఆత్మోద్ధరణను, ఆత్మానందాన్ని కోరుకొనడమే కాదా?

ఇది విడ్డూరమైన మాటగా పెక్కుమందికి తోచినా, తనకు ముక్తి మోక్షాలు లభించాలని తపనచెందేవానికంటె తన బిడ్డలు పైకిరావాలని కోరుకొనే

తండ్రి అధికగౌరవపాత్రుడు. కారణం-అతడు కోరుకొనేది తన బిడ్డల బాగునే కాని, తన బాగును కాదు. వారి బాగుకై తన బాగును బలిపెట్టడానికి సయితం అతడు సంకోచించడు.

ఏమైనా, వ్యక్తి కోరవలసింది తనకు ముక్తి మోక్షాలు లభించాలని కాదు; తన సంఘానికి, తన జాతికి, మొత్తం మానవాళికే ముక్తిమోక్షాలు సిద్ధించాలని. సరిగా ఇదే హెచ్చరికను నిన్న లక్నోలో ఉత్తరప్రదేశ్ ఆర్యసమాజం వజ్రోత్సవసభలో ప్రసంగిస్తూ, జవహర్‌లాల్ చేశాడు. ప్రతి వ్యక్తి తన ముక్తి మోక్షాలను సాధించుకొనడానికి కృషిచేయాలని హిందూమతం హెచ్చరిస్తున్నా దాన్ని తాను హర్షించలేనని ఆయన వివరించాడు. తన ముక్తికి కాక, తన మోక్షానికి కాక, దారిద్ర్యంనుంచి, దైన్యంనుంచి, అవిద్యనుంచి, అజ్ఞానంనుంచి, సంఘానికి ముక్తిమోక్షాలను సాధించడానికి కృషి జరపడమే ఉత్తమోత్తమ ధర్మదీక్ష కాగలదని ఆయన ఉద్బోధించాడు.

"ధర్మం'' అనే మాటకు ''మతం'' అనే అర్థం వున్నా, మతంకంటె ''ధర్మం" విపులమైనదని, విశిష్టమైనదని నెహ్రూ తన లక్నో ప్రసంగంలో వివరించాడుకూడా. మతం అనే అర్థంలో ధర్మం ఏ హిందూధర్మానికో, బౌద్ధ ధర్మానికో పరిమితం కావచ్చు. ''యుగధర్మం'' అన్నప్పుడు మాత్రం ఆయా మతవిశ్వాసాలను అనుసరించేవారి అవధులను దాటి, అది విశ్వవ్యాప్తమౌతుంది. అందువల్ల మతధర్మంకంటె కూడా యుగధర్మమే ఉన్నతమైనదని, ఉదాత్తమైనదని నెహ్రూ చెప్పిన మాటను అత్యధికసంఖ్యాకులు హర్షించలేకపోవచ్చుగాని, విజ్ఞులదృష్టిలో అదే పరమసత్యం.

ధర్మాన్ని సంస్థాపించడానికి, అధర్మాన్ని వినాశంచేయడానికి భగవంతుడు యుగయుగంలో అవతరిస్తాడో, లేదో తెలియదుగాని, కాలాన్నిబట్టి ధర్మం మారుతుందని, ఏ కాలానికి చెందినవారు ఆ కాలానికి సంబంధించిన ధర్మాన్ని (తమ యుగధర్మాన్ని) పాటించడానికి, దాన్ని పరిపోషించడానికి దీక్ష వహించాలని నెహ్రూ లక్నోలో చెప్పిన మాటలు సయితం మననం చేసుకోదగినవే.

ఎవరికి వారు తమ యుగధర్మాన్ని గుర్తించి, గౌరవించి, శ్రద్ధాసక్తులతో దాన్ని పాటిస్తే, యుగానికొకసారి చొప్పున తన వైకుంఠాన్ని వదలి, మహీతలంపై జన్మించవలసిన అవసరం విష్ణుమూర్తికి కలగదు.

బౌద్ధమతగ్రంథాలు అవలోకితేశ్వరునిగురించి ప్రస్తావిస్తూ "ఈ అనంత విశ్వంలో చిట్టచివరి అణువుకు నిర్వాణం లభించేవరకు నాకు నిర్వాణం వలదు" అని ఆయన పలికినట్టు వివరిస్తున్నాయి. అవలోకితేశ్వరుని ఈ మహోదాత్త వైఖరిని పూర్తిగా అవలంబించలేకపోయినా, తన ముక్తి మోక్షాలకోసం కాక, సంఘోన్నతికై, సమాజోద్ధరణకై, ప్రతివ్యక్తి కొంతవరకైనా కృషిచేయాలి. అప్పుడే అతడు తన యుగధర్మాన్ని పాటించగలుగుతాడు, అప్పుడే అతని జన్మ సార్థకమౌతుంది.

[మే 15, 1963]

దేవీ పూజ

అన్ని దేశాలలోను, అన్ని కాలాలలోను మానవుడు శక్తిని ఉపాసిస్తూనే వున్నాడు. ఇందుకోసం అతడు అనేక సంకేతాలను పెట్టుకొంటున్నాడు. మన దేశంలో మనవారు అందుకు పెట్టుకొన్న సంకేతం - దేవి.

తక్కిన జీవకోటినుంచి వేరై, మానవుడు మానవుడుగా రూపొందింది సంకేతాలను పెట్టుకొనగల ప్రజ్ఞాప్రాభవాల కారణంగానే. నిజానికి, మానవభాషే సంకేతాల సముదాయం. ప్రతి అక్షరం ఒక సంకేతం, ప్రతి పద మొక సంకేతం. సంకేతంలేనిదే భావవ్యక్తీకరణ లేదు

అయితే, భాషద్వారా కూడా తాను సరిగా వ్యక్తీకరించలేని భావాలు మానవునిలో స్పందిస్తూవుంటాయి. వాటిని వెల్లడించడానికి సంకేతాలను తిరిగి ఆశ్రయిస్తాడు. ప్రపంచప్రసిద్ధ తత్త్వవేత్త వైట్‌హెడ్ పేర్కొన్నట్లు, భాషేతరసంకేతాలలో భావంకంటె ధ్వని హెచ్చు, వ్యక్తీకరణకంటె స్ఫురణ అధికం. "పదాలశక్తికి మించిన అనుభూతులపరిపుష్టికి సంకేతాలు వినియోగ పడతాయి."

భాష వ్యక్తీకరించగల భావాలకు సయితం స్పష్టరూప మివ్వడానికి, వాటికి పరిపుష్టి కూర్చడానికి భాషతోపాటు మానవుడు కొన్ని సంకేతాలను విని యోగించడం కద్దు. "నమస్కారం" అనడంతో అతడికి తృప్తి లేదు; చేతులను జోడించాలి. "ఔరా!" అనడం చాలదు; ముక్కుపై వేలు వేసుకోవాలి. ''ఛీ'' అంటే సరిపోదు; పళ్లు పటపట నూరాలి. ''సకల సౌభాగ్యరస్తు!'' అనడంతో దీవన పూర్తి కాదు, అక్షతలను చల్లాలి.

సంకేతాలను ఇంతగా ప్రేమిస్తాడు కనుకనే, ఇంతగా వాటిపై ఆధార పడతాడు కనుకనే, తాను ఉపాసించే శక్తికి సయితం మానవుడు కొన్ని

సంకేతాలను పెట్టుకొన్నాడు. "దేవి"కి ''శక్తి'' పర్యాయపదం కావడం దేవీ రూపంలో శక్తిని మానవుడు ఆరాధిస్తున్నందువల్లనే?

కలదానితో మానవునికి తృప్తి లేదు; అందుకే అతడు కలలు కనడం. నిలిచిన చోట మానవునికి శాంతి లేదు; అందుకే అతడు విశ్వాంతరాళంపై తన దృష్టిని కేంద్రీకరించడం. వ్యక్తతతో మానవునికి సంతుష్టి లేదు; అందుకే అతడు అవ్యక్తానికై నిరంతరాన్వేషణ చేయడం. ఎప్పటికప్పుడు తాను పొందలేనిదానికై, తాను చేరలేనిదానికై, తనకు అవ్యక్తంగానున్నదానికై మానవుడు పడే తపన తా నల్పుడనన్న భావాన్ని అతడికి కలిగిస్తుంది. తన అల్పత్వంపై విజయానికి మానవాతీతశక్తులను అతడు ఆకాంక్షిస్తాడు. శక్తిని మానవుడు ఉపాసించడానికి మూల మిదే.

అనాదికాలంగా శక్తిని ఉపాసిస్తున్నందునే మానవుడు క్రమానుగతంగా తన పరిసరాలపై విజయాన్ని సాధించగలిగాడు. చివరికి భూమండలం సయితం, దాని గురుత్వాకర్షణ సయితం తనను భూతలంపై బందీగా నిలపలేని స్థితికి ఈనా డతడు వచ్చాడు. ముందు చంద్రమండలంపై, తర్వాత తక్కిన ఉపగ్రహాలపై అతడు తన విజయపతాకను ప్రతిష్ఠాపన చేయడానికి మరెంతో కాలం పట్టదు. అజ్ఞానానికి, అహంకారానికి లోనై, అణ్వస్త్రాలతో ఆత్మవిధ్వంసన చేసుకొననిపక్షంలో సూర్యకుటుంబానికే అనతికాలంలో మానవుడు అధినాథుడు కాగలడు. జరపై, మృతిపై అతడు విజయాన్ని సాధించగల రోజు వచ్చినా రావచ్చు.

శక్తికి సంకేతంగా దేవిని ఆరాధించవలసింది కేవలం నవరాత్రులలోనే కాదు, నిరంతరాయంగా! ఆమె ఆరాధన కొనసాగవలసింది పుష్పం, ఫలం పత్రం, తోయంతో మాత్రమే కాదు; టెస్ట్‌ట్యూబ్, టెలిస్కోప్, మైక్రోస్కోప్, సైక్లోట్రాన్ మొదలైనవాటితో కూడా. ఆమెకు మొక్కవలసింది "నాకు ముక్తి" అని కాదు, ''నాకు మోక్షం" అని కాదు! "నా అల్పత్వాన్ని అధిగమించగల శక్తి నాకు ప్రసాదించవలసింది." అని మాత్రమే!!

అయితే, కేవలం మొక్కుబడులవల్ల మానవునికి అపారశక్తులు లభ్యం కావు. తన అల్పత్వాన్ని అధిగమించడానికి అతడు అవిద్యను పారదోలాలి; అజ్ఞానాన్ని నిర్మూలించాలి; అహంకారాన్ని చంపుకోవాలి; స్వార్థానికి కాక, లోక కళ్యాణానికి ప్రాధాన్యమివ్వాలి; శాస్త్రపరిశోధనలను మరింత విస్తృతంగా కొనసాగించాలి; ప్రకృతిరహస్యాలను మరింతగా తెలుసుకోవాలి; పరిసరాలపై ఆధిపత్యాన్ని మరింతగా సుస్థాపితంచేసుకోవాలి; అన్యగోళాలపై పాదం పెట్టాలి; సౌరమండలాన్ని దాటిపోవాలి; పాలవెల్లిలో పాన్పు పెట్టాలి; జరామరణాలను జయించాలి. అప్పుడే అతడు నిజంగా శక్తిని ఉపాసించినట్టు ! అప్పుడే అతడు నిజంగా దేవినుంచి తాను పొందదగు వరాలను పొందినట్టు ! !

[అక్టోబర్ 27, 1963]

సోషలిజం నిర్వచనం

ఎనిమిదేళ్లనాడే - ఆవడిలో శ్రీ యు. ఎన్. ఢేబర్ అధ్యక్షతన 1955లో జరిగిన 60 వ కాంగ్రెసు మహాసభలోనే - సోషలిజం ప్రాతిపదికగాగల నవ సమాజనిర్మాణం కాంగ్రెసు లక్ష్యంగా తీర్మానం జరిగింది. అయినా, ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు ఎ.ఐ.సి.సి. జయపూర్ సమావేశంలో సోషలిజంనిర్వచనకై తర్జనభర్జనలు జరగడమా? దీని తాత్పర్యం — సోషలిజం అంటే ఏమిటో స్పష్టంగా తెలియకుండానే, లేదా తేల్చుకొనకుండానే కేవల మొక నినాదంగా కాంగ్రెసు దాన్ని కడచిన ఎనిమిదేళ్లలో వినియోగిస్తూ వచ్చిందని కాదా? ఎవ రైనా ఈ విధంగా కాంగ్రెసును విమర్శించవచ్చు; నిజానికి ఈ పనిని కొన్ని పత్రికలు చేయకపోలేదుకూడా!

కాని, సోషలిజాన్ని నిర్వచించడం ఒక్కకాంగ్రెసు నాయకులకే కాదు. ఎవరికైనా చాలా కష్టమైన పని. లోకంలో ఎన్ని భిన్నమతాలు, మతవర్గాలు కలవో, అన్ని సోషలిస్టుభావాలు, భావభేదాలు వున్నాయనడం అత్యుక్తి కాదు. క్రిస్టియన్ సోషలిజం, గిల్డ్ సోషలిజం, ఫేబియన్ సోషలిజం, డెమొక్రాటిక్ సోషలిజం, నేషనల్ సోషలిజం, సైంటిఫిక్ సోషలిజం - ఈ విధంగా వీటికి అంతుపొంతులు లేవు. యాభై, అరవై సంవత్సరాలనాడు ఒక బ్రిటిష్ లిబరల్ నాయకుడు వెటకారంగా "ఇప్పుడు మన మందరం సోషలిస్టులమే!" అన్నా డట. నాడు ఆయన వెటకారంగా పలికిన పలుకు ఈనాడు అక్షరాలా నిజం. తరతమభేదాలతో ఈనాడు సోషలిస్టులు కానివారు లేరనే చెప్పవచ్చు. చివరికి ఫాసిస్ట్ నియంతలుకూడా తాము స్థాపించిన నిరంకుశవ్యవస్థలపై "నేషనల్ సోషలిజం" ముద్ర వేయవలసివచ్చింది.

తక్కినవారు ప్రతిపాదించేది అవకతవక సోషలిజం కాగా, తాము లక్షిస్తున్నదిమాత్రమే శాస్త్రీయమైనదని కమ్యూనిస్టులు ఉద్ఘాటిస్తారు. దానికి

వారి పేరు "మార్క్సిజం", లేదా, "సైంటిఫిక్ సోషలిజం". అయితే వారు శాస్త్రబద్ధమైనదిగా చెప్పుకొనే సోషలిజంవిషయమై కూడా కమ్యూనిస్టు నాయకులమధ్య ఏకాభిప్రాయం కానరాదు. ఇందుకు తార్కాణానికై స్టాలిన్, ట్రాట్స్కీలవరకు వెళ్లనక్కరలేదు; కృశ్చేవ్, మావోలమధ్య ప్రస్తుతం చెలరేగుతున్న తీవ్ర వాద, ప్రతివాదాలను పేర్కొంటే సరిపోతుంది. కెమిస్ట్రీ, ఫిజిక్స్ మొదలైన శాస్త్రాలవలె సోషలిజం ఒక శాస్త్రం కానేరదని, దీని విషయంలో స్థిరమైన, శాశ్వతమైన సూత్రాలు వుండడానికి వీలులేదని కృశ్చేవ్, మావోలు కొనసాగిస్తున్న చర్చలు మరొకసారి రుజువుచేస్తున్నాయి.

వైజ్ఞానికశాస్త్రాలవలె సోషలిజం ఒక శాస్త్రం కానందున ప్రతి దేశం, ప్రతి జాతి, ప్రతి పార్టీ దాన్ని తనకు తానుగా నిర్వచనం చేసుకోవాలి. ఏ నిర్వచనమైనా మార్పులకు వీలులేకుండా ఒకేసారి జరగరాదు. పరిస్థితుల పరిణామాలనుబట్టి, ఆ పరిణామాలద్వారా సిద్ధించిన అనుభవాలనుబట్టి ఎప్పటికప్పుడు కొత్త నిర్వచనాన్ని చేసుకోవాలి. ఏ ఘట్టంలో జరిగిన నిర్వచనమైనా చేర్పులకు, మార్పులకు అవకాశం మిగల్చాలి. అంతమాత్రంచేత నిర్వచనాన్ని పూర్తిగా అస్పష్టంగా, సందిగ్ధంగా మిగల్చరాదు కూడా. అంతే చేస్తే ఎంతో చెరుపు కలుగుతుంది.

మానవ స్వాతంత్ర్యాన్ని, సమతను, సాంఘికన్యాయాన్ని లక్షిస్తున్న మహనీయులను చిరకాలంగా స్పష్టంగానో, అస్పష్టంగానో, స్పష్టాస్పష్టంగానో ఉత్తేజపరుస్తున్నా, ఒక రాజకీయ, సాంఘికవ్యవస్థగా సోషలిజం ప్రపంచానికి చాలా కొత్త. "మార్క్సిజం" రూపంలో అది కమ్యూనిస్టు దేశాలలో అమలులో వున్నా, దేశానికి దేశానికిమధ్య దానిలో చిన్న పెద్ద వ్యత్యాసాలు అనేకం కానవస్తున్నాయి. కమ్యూనిస్టు ప్రపంచంలో ఈనాడు కృశ్చేవ్ కమ్యూనిజం, మావో కమ్యూనిజం, టిటో కమ్యూనిజం, గోముల్కా కమ్యూనిజం, కాస్ట్రో కమ్యూనిజం- స్థూలంగా ఇన్ని విభేదాలు కానవస్తున్నాయి. కాగా, నాన్-కమ్యూనిస్టు రాజ్యాలలో సోషలిజం తమ లక్ష్యంగా పెట్టుకొన్నవాటిలో ఇంతకంటె తక్కువ విభేదాలు లేవనే చెప్పాలి. ఉదాహరణకు, నాసర్ సోషలిజం,

నెహ్రూ సోషలిజం ఒక్కటే అనగలమా? సిరిమావో సోషలిజం, నెవిన్ సోష లిజం ఒక్కటే అనగలమా?

సోషలిజంవిషయమై ప్రపంచం మొత్తంపైనే భావాలు త్వరితగతిని పరి వర్తన చెందుతున్నాయి. పంధొమ్మిదవ శతాబ్దం మధ్యభాగంలో మార్క్స్ ప్రతిపాదించిన సోషలిస్టు భావాలు ఇరవయ్యోశతాబ్ది ప్రథమపాదంనాటికే పాత గిలిపోయినట్టు సిద్ధాంతీకరిస్తున్న మేధావు లెందరో వున్నారు. మార్క్స్‌భావాలు ''స్టీమ్''యుగానికి చెందినవి కాగా, ఈ శతాబ్ది ప్రారంభానికి ''ఆయిల్" యుగం స్థిరంగా నెలకొన్నది. ''ఆయిల్" యుగాన్ని వెనుకకు నెట్టి, ఇప్పుడు "అణుయుగం" పాదంపెట్టింది. విప్లవాత్మకమైన ఈ పరివర్తనవల్ల, ఈ పురోగతి వల్ల దేశదేశాలలో సోషలిజానికి కొత్త నిర్వచనాన్ని చెప్పుకొనవలసివస్తున్నది. బ్రిటిష్ లేబర్‌పార్టీనే చూడండి. ప్రధానపరిశ్రమలను జాతీయం చేయడమే అట్లీదృష్టిలో సోషలిజం; గెయిట్‌స్కెల్ విశ్వాసం సయితం ఇందుకు అంతగా భిన్నమైంది కాదు. కాని, గెయిట్‌స్కెల్ నిర్యాణంతర్వాత లేబర్‌పార్టీ నాయ కుడుగా ఎన్నికైన హెరాల్డ్ విల్సన్ అణుయుగాన్ని, దాన్ని ప్రవేశపెట్టిన సాంకేతిక శాస్త్రపురోగతిని అంచనాలోకి తీసుకొననట్టిది సోషలిజం కానేరదని ఉద్ఘాటిస్తున్నాడు.

ఈ విషయా లన్నింటిని దృష్టిలో పెట్టుకొన్నపక్షంలో "ఆవడి కాంగ్రెసు పిమ్మట ఎనిమిదేళ్లకు సోషలిజం నిర్వచనకై ఈనాడు ప్రయత్నమా?" అనే వెక్కిరింత ఎంత అర్థరహితమైందో స్పష్టపడుతుంది. ఆవడి పిమ్మట ఎనిమి దేళ్ళ తర్వాతనే కాదు, ఎనిమిది ఎనిమిదేళ్ళ తర్వాతకూడా సోషలిజం నిర్వ చనకై ప్రయత్నం జరగవలసిందే. సంఘానికి, జీవితానికి సంబంధించినట్టిది సోషలిజం. అందువల్ల వాటివలె అదికూడా నిత్యం మార్పుచెందాలి, నిత్యం పెరుగుతూవుండాలి. ఇట్టి సహజపరిణామానికి దూరమైనప్పుడు, అది ఒక నిర్జీవసిద్ధాంతమైపోయి, కాలికి గుదిబండగా, మెడకు ఉచ్చుగా పరిణమిస్తుంది.

జయపూర్ ఎ. ఐ. సి. సి. సమావేశంలో సోషలిజం స్వరూపంపై ఏ యిద్దరు ముఖ్యనాయకులు ఏకీభవించలేకపోవడం అబ్బురపడవలసిన విషయం

కాదు. సోషలిజం అంటేనే కల్పలతక్రీడ అని పెదవి విరవవలసిన విషయం సయితం కాదు; కడచిన ఎనిమిదేళ్ల అనుభవాన్ని, నేటి దేశపరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, మనం అనుసరించగోరుతున్న సోషలిజంస్వరూపాన్ని నిర్ణయించుకొనడానికి ప్రయత్నిస్తున్నామనే దాని తాత్పర్యం.

కమ్యూనిస్టు దేశాలవలె ప్రజాస్వామ్యానికి స్వస్తిచెప్పికాక, దాన్ని మన్నిస్తూనే, దాని ప్రాతిపదికపైనే సోషలిస్టు సమాజాన్ని స్థాపించాలని కాంగ్రెసు లక్షిస్తున్నది. అందువల్లనే దాన్ని "డెమొక్రాటిక్ సోషలిజం" అంటున్నాము. వ్యక్తిస్వేచ్ఛపై విధి నిషేధాలు అంతగా పెట్టనిది ప్రజాస్వామ్యం; సమష్టి క్షేమానికై వ్యక్తిస్వేచ్ఛను అవసరమైనంతవరకు అరికట్టడం తప్పదనేది సోషలిజం. వీటిలోని ఈ పరస్పర వైరుధ్యాన్ని అధిగమించడం సాధ్యమా? ఇది నేడు పుట్టిన ప్రశ్న కాదు; మానవుడు సంఘజీవిగా రూపొందిననాడే ఈ ప్రశ్న పుట్టింది. వ్యష్టికి-సమష్టికిమధ్య, స్వేచ్ఛకు, నియతికి(ఫ్రీడమ్ అండ్ కంట్రోల్) మధ్య అనివార్యమైన నిత్యసంఘర్షణలో ఒకటి మరొకదాన్ని కబళించకుండా కాపాడుకొనగలిగిన ఘట్టాలలోనే సంఘం పురోగతిని సాధించగలిగింది. అందువల్ల ''డెమొక్రాటిక్ సోషలిజం'' అనే సమాసంలో విశేషణానికి, నామవాచకానికి ఎంతమాత్రం పొత్తు కుదరని అనుకోనక్కరలేదు.

అయితే "డెమొక్రాటిక్ సోషలిజం'' అనేదాన్ని పూర్తిగా, జయప్రదంగా అమలు పరచిన దేశం ఈనాటికి ఒక్కటైనా లేదు. ఈ కృషిని ఒక మహాదేశంలో విస్తృతంగా ప్రారంభించేసింది మనమే. అందువల్ల ఈ లక్ష్యసాధనలో మన పురోగతికి వలసిన మార్గాలను మనమే నిర్మించుకోవాలి. గ్రీక్ జాతికి తమ ఏథెన్సు నగరం ప్రజాస్వామ్యపద్ధతులకు శిక్షణాలయమని పెరిక్లిజ్ సగర్వంగా చెప్పుకొన్నాడు. గర్వానికి పోకుండా డెమొక్రాటిక్ సోషలిస్టు వ్యవస్థ విషయంలో ప్రపంచానికే ఒక శిక్షణాలయంగా మన దేశాన్ని మనం రూపొందించుకోవాలి.

ఇది జరగడం కేవలం ప్రజానాయకులే కాక, ప్రజలు సయితం సోషలిజం స్వరూపస్వభావాలనుగురించి ఆలోచించినప్పుడే, అందుకు సంబంధించిన చర్చలలో పాల్గొన్నప్పుడే. ఏదో ఒక తీర్మానాన్ని త్వరపడి చేయక, సోషలిజం స్వరూప స్వభావాలనుగురించి ఒక ప్రకటననుమాత్రం సిద్ధంచేసి, దాన్ని చర్చించవలసిందిగా ప్రజలను ఆహ్వానించడంలో ఏ. ఐ. సి. సి. జయపూర్ సమావేశం హర్షించదగు పద్ధతిని అనుసరించింది. నగరాలలోనే కాక, గ్రామాలలో కూడా, సభలలోనే కాక, కుటుంబాలలో కూడా ఈ చర్చ సాగాలని మేము కోరుతున్నాము, సాగుతుందని నమ్ముతున్నాము

[నవంబర్ 6, 1963]

ఆగస్టు 15, 1964

"సుజలామ్, సుఫలామ్, మలయజ శీతలామ్" అని మనం కీర్తించుకొనే ఇండియా నేటిదో, నిన్నటిదో కాదు. దీని సరిహద్దులు కొన్ని సందర్భాలలో విస్తరించాయి; మరికొన్ని సందర్భాలలో కుంచుకుపోయాయి. కాబూల్ ఒకనాడు దీనిలో భాగం కాగా, ఈనాడు కరాచీసయితం పరరాజ్యంలో వున్నది. ఒకప్పుడు బర్మా దీనిలో భాగం కాగా, ఈనాడు తూర్పు బెంగాల్ కూడా అన్య రాజ్యం. సరిహద్దులలో ఈ విధమైన చిన్న, పెద్ద మార్పులతో నిమిత్తంలేకుండా కనీసం అయిదారువేల సంవత్సరాలుగా ఇది ఒక ప్రత్యేక దేశంగా ఒక విశిష్ట వ్యక్తిత్వంతో మనుతున్నది.

ఒకనాడిది హరప్పా, మొహంజొదారోల ఇండియా; తర్వాత వేద వేదాంగాల ఇండియా; పిమ్మట అయోధ్య, ఇంద్రప్రస్థల ఇండియా; ఆతర్వాత మగధ, పాటలీపుత్రల ఇండియా; అటుపిమ్మట ప్రతిష్ఠానపురం, ధరణికోటల ఇండియా; ఆ వెనుక ఉజ్జయిని, కనూజ్‌ల ఇండియా; క్రీస్తుశకంలో తొలి సహస్రాబ్దంతర్వాత కొంతకాలం ఓరుగల్లు, హంపి - విజయనగరాల ఇండియా; తర్వాత మొగల్ పాదుషాల పరిపాలనాకాలంలో ఢిల్లీ, ఆగ్రా, లాహోర్‌ల ఇండియా; బ్రిటిష్‌వారు రాజ్యం చేస్తుండగా కలకత్తా, ఢిల్లీల ఇండియా; ఏమైనా, ఎప్పుడైనా - తన ప్రత్యేక వ్యక్తిత్వాన్ని కోల్పోని ఇండియా.

చరిత్ర చూపుకు స్పష్టంగా అందనికాలంలో ఇది నాగ, ద్రవిడ, కిరాత, నిషాదాదిజాతుల ఇండియా. తర్వాత ఆర్యులు వచ్చారు, యవనులు వచ్చారు, శకులు వచ్చారు, కుషానులు వచ్చారు, హూణులు వచ్చారు, తురుష్కులు వచ్చారు, ఇతర జాతులవారు వచ్చారు. క్రైస్తవులు, యూదీయులు, పార్శీలు,

మహమ్మదీయులు మొదలైన వివిధమతాలకు చెందినవారు వచ్చారు. కొందరు దేశాన్ని జయించుకొనడానికి రాగా, మరికొందరు దోచుకుపోవడానికై వచ్చారు; కొందరు స్వీయమత రక్షణకై రాగా, మరికొందరు స్వీయమత ప్రచారానికై వచ్చారు. వివిధకాలాలలో, విభిన్నప్రేరణలతో వచ్చినవా రందరికి ఇండియా నీడ నిచ్చి, నిలకడ నిచ్చి, తన కన్నబిడ్డలను చేసుకొన్నది.

నేడు-ఆగస్టు 15 వ తేదీ-స్వాతంత్ర్యోత్సవం జరుపుకొనే సందర్భంలో, వాడవాడలలో, వీధి వీధిలో, ఇంటింటిపై త్రివర్ణపతాక యెత్తి, దానికి భక్తిశ్రద్ధలతో నమస్కరించే సందర్భంలో మనది అధునాతన దేశమే కాక, అనాది దేశమని జ్ఞాపకం చేసుకోవాలి. ఏదో ఒక జాతికి, ఒక మతానికి, ఒక కులానికి, ఒకవర్గానికి చెందిన దేశంకాక, అందరినీ సమానంగా ఆదరించిన దేశమని జ్ఞాపకం చేసుకోవాలి. చరిత్రదృష్టికి అందని కాలంనుంచీ ఎన్నో సంస్కృతులకు, నాగరికతలకు సంగమస్థానమైన దేశమని జ్ఞాపకం చేసుకోవాలి. కొన్ని శకాలలో మహోచ్చస్థితిని, మరికొన్నింట అతి దీనస్థితిని అనుభవించిన దేశమని జ్ఞాపకం చేసుకోవాలి. బ్రిటిష్ పరిపాలనలో కొన్నిరంగాలలో ముందుకు సాగినా పెక్కింటిలో పూర్తిగా శిథిలావస్థకు దిగజారిపోయి, తిరిగి తన స్థితిగతులను చక్కబెట్టుకొనడానికి ఈ మధ్యనే ప్రయత్నం చేస్తున్న దేశమని జ్ఞాపకం చేసుకోవాలి.

అవ్యవస్థలో వున్న దేశానికి గౌతమబుద్ధ — బింబిసారులు, చాణక్య-చంద్రగుప్తులు, సమర్థ రామదాస- శివాజీలు ఇంతకు పూర్వపు కాలాలలో దిక్కు అయినట్టుగానే, ఈ కాలంలో దానికి బాసటగా నిలచినవారు గాంధి-నెహ్రూలు. వారి ప్రవృత్తులు భిన్నం; వారి ప్రేరణలు భిన్నం; వారి జీవిత దృక్పథాలు భిన్నం; అయినా ఏకలక్ష్యాలకై -నిద్రాణమైవున్న దేశాన్ని జాగరితం చేయడానికై, దాస్యశృంఖలాబద్ధులైవున్న ప్రజలను స్వతంత్రులను చేయడానికై, శిథిలమైపోయివున్న జాతీయ జీవితవ్యవస్థను నవశక్తి విలసితం చేయడానికై-విరతిలేకుండా, విశ్రాంతిలేకుండా దివారాత్రాలు వారు కృషిచేశారు, ఆ కృషికే ఆహుతి అయిపోయారు. ఈ నవభారత నాయకు లిద్దరిలో గాంధిని మనం

1948 జనవరి 30 వ తేదీని కోల్పోగా, నెహ్రూను ఈ సంవత్సరం మే 27 వ తేదీని కోల్పోయాము.

ఇంతకు పూర్వం మనదేశంలో తలయెత్తిన మహామహుల బోధనలను పాటించి, వాటికి అనుగుణంగా మన జీవితాలను తీర్చిదిద్దుకొనడానికి శక్తివంచన లేని కృషిచేస్తూ వచ్చినందునే ఎకాడియెన్, అసిరియాన్, బాబిలోనియన్, హిట్టైట్, ఫెనీసియెన్, ఈజిప్షియెన్, మినోయెన్. గ్రీక్, రోమన్, మొదలైన నాగరికత లెన్నో కాలగర్భంలో విలీనమైపోయినా, హరప్పా, మొహంజొదారోల కాలంనుంచి భారతీయ నాగరికత ఒక అవిచ్ఛిన్న ప్రవంతివలె, ఒక మహా జీవనదివలె ప్రవహిస్తూ వస్తున్నది. ఇదే విధంగా ఇకముందుకూడా అది వర్ధిల్లాలందే గాంధి, నెహ్రూలు కలలుగన్న రీతిలో దేశాన్ని రూపొందించడానికి, సంఘాన్ని పునర్నిర్మించడానికి మనం అకుంఠితదీక్షతో కృషి చేయాలి.

నెహ్రూ మనమధ్య లేకుండా మనం జరుపుకొంటున్న ప్రథమ స్వాతంత్ర్య దినోత్సవ మిదే. నేడు ఆయన లాల్ ఖిల్లా బురుజులపై తన శాంత గంభీర మూర్తితో నిలబడడు; లక్షలాది ప్రజలసమక్షంలో త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించి, దానికి "సెల్యూట్" చేయడు; కర్తవ్యబోధ చేస్తూ, తన సహజ గంభీర ధోరణిలో ప్రసంగం చేయడు. ఈ కారణాన మనం ఆయన బోధనలను మరింత శ్రద్ధగా మననం చేసుకోవాలి; ఆయన నిర్దేశించిన మార్గాలలో మరింత నిశ్చలంగా నడవాలి; ఆయన లక్షించిన నవభారతవర్షాన్ని అవతరింపజేయడానికి మరింత చిత్తశుద్ధితో కృషిచేయాలి.

అంధవిశ్వాసాలకు, మూఢాచారాలకు, అన్య సంకుచితత్వాలకు తావులేని నవభారతాన్ని నెహ్రూలక్షించాడు. రాజకీయ స్వాతంత్ర్యంతోపాటు ఆర్థిక సమతకు, సాంఘికన్యాయానికి ప్రాధాన్య మిచ్చే నూతన సంఘనిర్మాణాన్ని ఆయన కాంక్షించాడు. ప్రాచీన సభ్యతలో, సంస్కృతిలో ఉత్తమమైనదాన్ని పరిగ్రహిస్తూ- తక్కినదాన్ని త్రోసిపుచ్చుతూ, నవసభ్యతను, నవీనసంస్కృతిని పెంపొందించుకోవాలని ఆయన అభిలషించాడు. అవిద్య, అజ్ఞానం, దారిద్ర్యం, దైన్యం: ఇవి తాండవిస్తున్న దేశాన్ని సముద్ధరించగలిగినవి సైన్స్, టెక్నాలజీలే

అని ఆయన ప్రబోధించాడు. జాతివిద్వేషాలకు, యుద్ధభయాలకు స్థానంలేని ప్రపంచంలోనే మానవాళి పురోగమించగలదని ఆయన ఉద్ఘోషించాడు.

ఈనాడు ఆయనను మనం చూడలేము; ఆయన వాణిని వినలేము. అంత మాత్రంచేత ఆయన సందేశాన్ని పెడచెవిని పెడితే ఆయనకు మనం ద్రోహం చేయడమేకాక, మనకు మనమే ద్రోహం చేసుకొంటాము; మన భవిష్యత్తుకు ద్రోహం చేసుకొంటాము.

[ఆగస్టు 15, 1964]

నెహ్రూ తాత్త్వికదృష్టి

ఆయన మనమధ్య నిలిచినట్టుగానే వున్నాడు; మందహాసం చేస్తున్నట్టు గానే వున్నాడు; మనలను పలకరిస్తున్నట్టుగానే వున్నాడు; మనకోసం కలలు కంటున్నట్టుగానే వున్నాడు; మన యోగక్షేమాలకోసం కృషి చేస్తున్నట్టుగానే వున్నాడు; మొత్తం మానవాళికోసం తపన పడుతున్నట్టుగానే వున్నాడు; అయినా, మన మధ్యనుంచి ఆయన వెళ్ళిపోయి అప్పుడే ఒక సంవత్సర మైంది; ప్రపంచంలోనే పెద్ద వెలితి మిగుల్చుతూ వెళ్ళిపోయి పన్నెండు నెల లైంది; మానవాళికే మనస్తాపాన్ని కలిగిస్తూ వెళ్ళిపోయి 365 రోజు లైంది!

సంవత్సరాలు ఇట్టే నిండి పోతాయి; నెలలు ఇట్టే తిరిగి వస్తాయి; రోజులు ఇట్టే దొర్లి పోతాయి. అయినా, పెక్కు శతాబ్దాలతర్వాతకూడా జవహర్‌లాల్ నెహ్రూ మూర్తి జరాభారరహితమైన అదే జీవకళతో, ఆలోచనామిళితమైన అదే మందహాసంతో, చిత్తశుద్ధి ప్రేరితమైన అదే సేవాకాంక్షతో, మానవ కళ్యాణ సాధనోత్సుకతతో కూడిన అదే దీప్తితో - చెదరక-చెరగక-చెన్ను తరగక-నిత్యమై నిలుస్తుంది! ఇది ముమ్మాటికీ నిజం. తరతరాలవరకు దాని తారళ్యం తరగదు; యుగయుగాలవరకు దాని శోభ సన్నగిల్లదు. తన జీవిత కాలంలోనే నెహ్రూ జాతీయచరిత్రలోనే కాక, అంతర్జాతీయచరిత్రలో కూడా ఒక మహోన్నత స్థానాన్ని సంపాదించుకొన్నాడు. కాలక్రమాన ఆ స్థానం విస్త రిస్తుంది, దాని ప్రాధాన్యం పెరుగుతుంది.

వీరపూజ ఒక వ్యసనంగా వ్రాస్తున్న వాక్యాలు కావివి; జాతీయాభిమానం ఒక జాడ్యం కాగా చేస్తున్న ప్రశంస కాదిది; వ్యక్తిగత ప్రేమానురాగాలతో ఘటిస్తున్న శ్రద్ధాంజలి కాదిది!! మాతోపాటు భావిచరిత్రకారులు సయితం

లింకన్, లెనిన్‌ల సరసను నెహ్రూను నిలబెడతారు; గాంధి, గారిబాల్డీల ప్రక్కన ఆయనకు పెద్ద పీట వేస్తారు!

మహాపురుషులైనవారిలో ఒక గొప్ప గుణ మేదో ప్రాబల్యం వహించి, ప్రస్ఫుటంగా కానవస్తుంది; లేదా కొన్ని గొప్ప గుణాలు వారి జీవితాలకు వైశిష్ట్యాన్ని కూర్చుతూవుంటాయి. ఏ ఒక్క గొప్ప గుణంలోనూ, లేదా ఏ కొన్ని గొప్ప గుణాల్లోనూ. నెహ్రూ ఇతర చారిత్రకపురుషులతో తులతూగకపోవచ్చు. కాని, బహుశా మరెవ్వరిలోను కానరానన్ని గొప్ప గుణాలు ఆయనలో పోగుపడి పోవడంలో ఆయన ప్రత్యేకత వున్నది, దానిలోనే ఆయన ప్రాశస్త్యం వున్నది.

ఆయన ఉద్విగ్నుడు మాత్రమే కాదు, ఉదాత్తుడు కూడా. ఆయన భావుకుడు మాత్రమే కాదు, కార్యవాది కూడా. ఆయన ఆదర్శవాది మాత్రమే కాదు, ఆచరణలో సాధ్యాసాధ్యాలను గుర్తించిన వాడు కూడా. అయన నాయకుడే కాదు, అనుచరుడు కూడా. ఆయన స్వాతంత్ర్యాకాంక్షి మాత్రమే కాదు, క్రమశిక్షణ విలువ గుర్తించినవాడు కూడా. ఆయన రాజకీయవేత్త మాత్రమే కాదు, కవిహృదయం వున్న రచయిత కూడా. ఆయన దేశభక్తుడు మాత్రమే కాదు, ప్రపంచసౌభాగ్యకామి కూడా.

ఆయన ప్రవృత్తిలో ఎన్నో పరస్పర వైరుధ్యాలు, ఆయన పుట్టి పెరిగిన పరిసరాలలో వైరుధ్యాలు, ఆయనపై పడిన ప్రభావాలలో వైరుధ్యాలు : ఇన్ని వైరుధ్యాలను అధిగమించి, ఒక స్థిరలక్ష్యాన్ని ఆయన నిర్ణయించుకో గలిగాడు; ఒక తాత్త్వికదృష్టిని కుదుర్చుకో గలిగాడు; ఒక సమైక్య వ్యక్తిత్వాన్ని ("ఇంటెగ్రేటెడ్ పర్శనాలిటీ"ని) రూపొందించుకో గలిగాడు. ఇది ఒక పెద్ద విశేషం, ఒక గొప్ప విజయం.

స్వాతంత్ర్య సమరయోధుడుగా, ప్రజానాయకుడుగా, ప్రభుత్వాధినేతగా సమకాలిక ప్రపంచప్రముఖులలో ఎన్నదగువాడుగా జవహర్‌లాల్ నెహ్రూ సాధించినవిజయాలు స్వల్పమైనవి కావు, సాధారణమైనవీ కావు. కాని, ఆయన కార్యరంగంలో సాధించిన విజయాలకంటె జాతీయ, అంతర్జాతీయపరిణామాలపై ఆయన వ్యక్తిత్వప్రభావం ఎంతో ముఖ్యమైంది. అనేక విషయాలలో-ముఖ్యంగా

ఆదిభౌతిక విషయాలలో, ఆర్థికసూత్రాలలో, వైజ్ఞానిక, సాంకేతికాది శాస్త్రాల ప్రాధాన్య, ప్రభావాల విషయంలో, వీటి నన్నింటిని వెరసి చేయగా రాగల "ఫిలాసఫీ ఆఫ్ లైఫ్" లో గాంధితో నెహ్రూ విభేదించినా, జీవితానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన విలువల సందర్భంలో ఆయన గాంధితో ఏకీభవించడమే కాక, వాటికి అనుగుణంగా తాను నడవడానికి చిత్తశుద్ధితో కృషి చేశాడు. గాంధికి తామే సిసలైన వారసులుగా ప్రస్తుతం చెప్పుకొంటున్నవా రందరికంటె గాంధేయతత్త్వ ప్రాతిపదికలను జవహర్‌లాల్ చక్కగా, ఎక్కువగా, అర్థం చేసుకొన్నాడు; విజ్ఞతతో సమర్థంగా వాటిని ఆధునికయుగ ప్రభావాలకు, పరిణామాలకు అనుగుణంగా రూపొందించడానికి కృషి చేశాడు.

నెహ్రూ పోయినా, ఆయన తాత్త్వికదృష్టిని మనం గట్టిగా అలవరచుకోవాలి. ఆయన జీవితసందేశాన్ని పూర్తిగా గౌరవించాలి. అదే ఆయనకు చిత్తశుద్ధితో, కూడిన శ్రద్ధాంజలి కాగలదు; అదే ఆయన అంతస్తుకు తగిన శాశ్వత స్మృతిచిహ్నం కాగలదు.

[మే 27, 1965]

దేశచరిత్ర

నిజమే - కేంద్ర విద్యామంత్రి శ్రీ ఎం. సి. చాగ్లా నిన్న సిమ్లాలో ఉద్ఘాటించినట్లు, భారతచరిత్రను తిప్పి వ్రాయవలసిన ఆగత్యం ఎంతైనా వున్నది. ఆయన ఆశిస్తున్నట్టుగా రానున్న అక్టోబర్ 20 వతేదీనుంచి సిమ్లాలోని రాష్ట్రపతి నిలయంలో "ది ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్వాన్స్‌డ్ స్టడీస్" అనే పేరుతో ప్రారంభంకానున్న నూతన పరిశోధనసంస్థ ఈ లక్ష్యసాధనకు తోడ్పడగలదనే విశ్వసిస్తున్నాము.

ఈ కొత్త సంస్థ పాఠ్యప్రణాళికల నిర్ణయానికై, పట్టభద్రులను ఉత్పత్తి చేయడానికై తన కాలాన్ని వినియోగించదు, తన నిధులను వెచ్చించదు. ఇది సనదుల నివ్వదు, సన్మానాలను చేయదు. మౌలికమైన ఆలోచన చేయగల ప్రతిభావంతులను, సత్యసంశోధనకై తమ జీవితాలను అంకితం చేయగల పండితులను ఒకచోట చేర్చడం, వారు తమ పరిశోధనలు కొనసాగించడానికి వలసిన సమస్త సదుపాయాలను సమకూర్చడం - ఇవే దీని ప్రధానలక్ష్యాలు.

కొత్తసంస్థ పాలకవర్గం ప్రథమ సమావేశం నిన్న జరిగినప్పుడు శ్రీ చాగ్లా వలె, మన వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ జాకిర్ హుస్సేన్ సయితం దానిలో పని చేసేవారికి పరిపూర్ణస్వేచ్ఛ నివ్వడం ఎంత ముఖ్యమో వివరించాడు కాబట్టి, ఆ విషయాన్నిగురించి మేము మరొకమారు నొక్కిచెప్పవలసిన అవసరం లేదు. నూతనసంస్థకు చెందిన పండితులు తమ పరిశోధనలసందర్భంలో మన జాతీయ దౌర్బల్యాలను విశదీకరించవలసివస్తే, వారు జాతీయగౌరవానికి కళంకం తెస్తున్నారన్న విమర్శ రారాదు; ఆ నెపంపై వారి నోటిని నొక్కివేసే ప్రయత్నాలు జరగరాదు. ఇంతే జరిగితే, నూతనసంస్థవల్ల ప్రయోజనం సున్నకు సున్న, హళ్ళికి హళ్ళి మాత్రమే కాగలదు!

జాతీయదృక్పథంనుంచి దేశచరిత్ర రచనకు చర్యలు గైకొనడం మన జాత్యహంకారానికి దోహదకల్పనకోసం కాదు, మనలను అంతర్ముఖులను చేయడంకోసం; ఇదివరలో మన పురోగతికి ఏయే శక్తులు తోడ్పడినవో, ఏవేవి మన పతనానికి దారితీసినవో తెలుసుకొని, మరింత విజ్ఞతాపూర్వకంగా మన భావిచరిత్రను రూపొందించుకొనడంకోసం.

మన పాత చరిత్రను తిప్పివ్రాయడం అనే పేరుతో చరిత్రకే కాదు, జాతికి కూడా అపకారం చేసినవారు, చేస్తున్నవారు నేడు కోకొల్లలుగానే వున్నారు. అతి సంకుచితదృష్టిగల ఈ ప్రబుద్ధులు, జాత్యహంకారపూరితులైన ఈ పండితమ్మన్యులు ప్రధానంగా ఈ కింది ఘోరాపచారాలను చేస్తున్నారు:

(1) అది స్వదేశాభిమానమన్న భ్రమతో పాశ్చాత్యపండితుల పరిశోధనలను, రచనలను చులకన చెయ్యడం.

(2) హిందూమతాన్ని సర్వోత్కృష్టమైనదాన్నిగా ఆకాశాని కెత్తుతూ, అన్య మతాలపై, పరసంస్కృతులపై నోరు పారవేసుకొనడం.

(3) ప్రాచీనతపై పిచ్చి వ్యామోహంకొద్దీ ఆధునికతను అన్ని సందర్భాలలో అవివేకంగా దుయ్యబట్టడం.

పంథొమ్మిదవ శతాబ్దిలో కొందరు పాశ్చాత్య పండితులు తమ పరిశోధనల పుణ్యమా అని తెలియజెప్పిన తర్వాతనే మన బ్రాహ్మీలిపిని తిరిగి చదవడం మనకు తెలిసింది. అంతకుముందు అది మనకు "బ్రహ్మలిపి"గా పరిణమించింది. "బ్రహ్మలిపి" అంటే "చదువుటకు వీలుకాని వ్రాత" అని మన నిఘంటువులు అర్థం చెప్పడం బ్రాహ్మీలిపిపరిజ్ఞానాన్ని మనం కోల్పోయిన కాలంలోనే జరిగి వుండాలి!

ఇదే విధంగా ఖరోష్ఠి లిపి పరిజ్ఞానాన్ని సయితం మనం కోల్పోయాము. ఈ రెండు లిపులను తిరిగి మనకు చదవడం నేర్పినవారు జేమ్స్ ప్రిన్సెప్, డాక్టర్ హల్ష్ అనే పాశ్చాత్య పండితులే! ఈ లిపులలోగల ప్రాచీన శాసనాలను వీరు మనకు చదివి చెప్పడానికి ముందు మనం మౌర్య, గుప్త, చాళుక్య,

పల్లవ వంశాలనుగురించిన వివరాలను మరచిపోయాము. అశోకచక్రవర్తి మన దేశంలో పుట్టినట్టు, ఆయన బౌద్ధమతాన్ని స్వీకరించినట్టు, దాన్ని ప్రపంచ మతంగా సుస్థాపితం చేయడానికి ప్రయత్నించినట్లు లీలామాత్రంగా నైనా జ్ఞాపకంలేని ఘోర స్థితిలో పడిపోయాము; అశోకచక్రవర్తికి బిరుదనామమైన "దేవానాంప్రియుడు" అనేదానికి "మూర్ఖుడు" అని మన నిఘంటువులలో అర్థం వ్రాసుకొనడానికి సిద్ధపడిన దుస్థితికి దిగజారిపోయాము.

ఎంతో లోతున పూడిపోయిన మన ప్రాచీనచరిత్రను త్రవ్వి, తిరిగి వెలికితెచ్చిన ఇట్టి పాశ్చాత్య పండితులపట్ల కృతజ్ఞత ప్రకటించడానికి మారుగా, వారికి చేయెత్తి నమస్కరించడానికి బదులుగా, మనలో కొందరు ప్రబుద్ధులు మన ప్రాచీనతను గుర్తించడం తమకు, తమ పాశ్చాత్యనాగరికతకు తలవంపులు కాగలదన్న దురుద్దేశంతో మౌర్యచంద్రగుప్తుడు అలెగ్జాండర్‌కు సమకాలికుడన్న అబద్ధాన్ని వారు కల్పించినారన్న అవకతవక వాదాన్ని లేవదీస్తున్నారు. ఇంతే కాదు. ఈ పరమ ఛాందసులు పురాతత్త్వశాస్త్రానికి భిన్నంగా వెళ్ళి, ఇతర శాస్త్రీయాధారాలకు వ్యతిరేకంగా పోయి, కేవలం మన పుక్కిటి పురాణాలపైనే ఆధారపడి, ఆర్యులు మన దేశంనుంచే అన్యప్రాంతాలకు వలసవెళ్లారని, అసలు మానవసృష్టి మన దేశంలోనే జరిగిందని, ఆ మాటకు వస్తే, ప్రాణికోటి మన సరస్వతీనదిలోనే ఆవిర్భవించిందని ఏవేవో వెర్రిమొర్రి వ్రాతలు వ్రాస్తున్నారు.

కాగా, మరికొందరు ఛాందసులు హిందూమతంపట్ల తమకున్న భక్తి గౌరవాలను పురస్కరించుకొని గౌతమబుద్ధునితో పాటు అశోకచక్రవర్తిని, శ్రీహర్షుని, బౌద్ధమతాన్ని అభిమానించిన ఇతర సార్వభౌములను నిరసించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నంలో ఒక భాగమే హిందూమత పునరుద్ధరణ జరిగిన గుప్తశకాన్ని మన దేశచరిత్రలో "స్వర్ణయుగం"గా చిత్రించడానికి జరిగిన, జరుగుతున్న ప్రయత్నం. నిష్పాక్షికంగా చరిత్రను పరిశీలిస్తేమాత్రం మౌర్యులు, శాతవాహనులు, రాష్ట్రకూటులు, పాండ్యులు, చోళులు మొదలైన వారిని మించి గుప్తరాజులు పెద్దగా వెలగబెట్టింది ఏమీ లేదని తెలుస్తుంది.

అశోకుని, శ్రీహర్షుని చేస్తున్నట్టుగానే సుప్రసిద్ధులైన కొందరు ముస్లిం పరిపాలకులను కూడా దిగదీయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. కొన్నేళ్ళుగా విస్తృతంగా కొనసాగుతున్న ఈ మూర్ఖయత్నానికి తార్కాణంగా "విష్ణుధ్వజ్ ఆర్ కుతుబ్‌మీనార్ ?" అనే పేరుతో డి. ఎన్. ద్వివేది వ్రాసిన పుస్తకాన్ని, "తాజ్‌మహల్ వజ్ ఎ రాజ్‌పుట్ ప్యాలెస్" అనే పేరుతో పి. ఎన్. ఓక్ ప్రచురించిన గ్రంథాన్ని పేర్కొనవచ్చు.

ఓక్ చేస్తున్న చిత్ర విచిత్ర వాదాల ప్రకారం, ఆదిలో తాజ్‌మహల్ ఒక రాజపుత్ర ప్రాసాదం. చాలాసార్లు చేతులు మారిన తర్వాత దాన్ని రాజా జయసింగ్ వద్దనుంచి షాజహాన్ స్వాధీనంచేసుకొని, ముంతాజ్‌మహల్ సమాధిగా మార్చివేశాడు. అది ఒక హిందూరాజప్రాసాదమనే సంగతిని మభ్యపరచడానికై దాన్ని ఆయన కొంత మార్చికట్టడం జరిగింది.

కేవలం తాజ్‌మహల్ మాత్రమేకాక, ఢిల్లీలోని ఎర్రకోట, ఆగ్రాలోని కోట మొగల్ నిర్మాణాలు కావట. వాటిని క్రీస్తుశకం నాల్గవ శతాబ్దిలో అనంగ్ పాల్ అనే రాజు నిర్మించాడట. తాజ్‌ను ఆదిలో నిర్మించినవాడుకూడా బహుశా ఈ అనంగ్‌పాల్ కావచ్చునట.

తాజ్ నిర్మాణం ప్రారంభాన్ని, దాని ముగింపును తాను తన కళ్ళతో చూచినట్టు షాజ్‌హాన్‌కాలంలో ఇండియాలో పర్యటించిన ఒక పాశ్చాత్యుడు – టావెర్నే – వ్రాస్తే మాత్రమేమి ? దాన్ని ప్రత్యక్షసాక్షి కథనంగా తీసుకోవాలని ఎక్కడున్నది ? ఆగ్రావైపుకు తొంగిచూడకుండానే అతడు కల్లబొల్లి కథలను వ్రాసివుండవచ్చుగదా ? హుమయూన్‌సమాధి పక్కలోనే తాజ్‌మహల్ నిర్మాణం జరిగిందని ఇతరులు వాదిస్తే, అది పసలేని వాదమే ! అసలు హుమయూన్ సమాధి కూడా మరొక రాజపుత్ర ప్రాసాదం ! దాన్నికూడా నిరంకుశులైన మొగల్ పాదుషాలు కైవసం చేసుకొని, ఒక సమాధికింద మార్చివేశారు ! ఓక్ కంటికి స్పష్టంగా కనబడుతున్న ఈ గుమ్మడికాయవంటి సత్యాలను ఇతరులు కానలేకపోతే, అది వారి దృష్టిమాంద్యంవల్లనే; వారికున్న పరమత, పరసభ్యతల వ్యామోహంవల్లనే !!

సిమ్లాసంస్థ రాణించాలంటే, అది ఈ విధమైన సంకుచితత్వానికి, దురహంకారానికి దూరంగా వుండాలి. సమగ్రదృష్టితో, సమన్వయకాంక్షతో సత్యసంశోధన చేయాలి; అవసరమైనప్పుడు అప్రియసత్యాలను వెల్లడించడానికైనా వెనుదీయరాదు. అప్పుడే ఈ కొత్తసంస్థ మన దేశానికి, మన జాతికి నిజమైన సేవ చేయగలుగుతుంది.

[అగస్టు 6, 1965]

విపత్కర ధోరణులు

ప్రజాస్వామ్యానికి మనం తగమని బ్రిటిష్‌వారు అనేవారు. ఈ మాట పచ్చి అబద్ధమని మనవారు అనేవారు. తమ వాదాన్ని బలపరచుకొనడంకోసం మనవారు పాత చరిత్రను తవ్విపోసేవారు. శాక్యులకు ప్రజాస్వామ్యవ్యవస్థ వుండేది కాదా? లిచ్ఛవులకు వుండేది కాదా? వృష్ణివంశీయులకు వుండేది కాదా? ఈ విధంగా మనవారు ప్రశ్నించేవారు. ఈ విషయమై మనవారు పెద్ద పెద్ద పుస్తకాలను వ్రాసి, బ్రిటిష్‌వారికి నాగరికతావాసనలైనా అబ్బని రోజులలోనే మన దేశంలో ప్రజాస్వామ్యవ్యవస్థలు వర్ధిల్లినవని నిరూపించడానికి ప్రయత్నించేవారు.

నిజమే! మన పూర్వీకులు చాలా గొప్పవారు; వారికి ప్రజాస్వామ్య వ్యవస్థ అపరిచితమైంది కాదు; బౌద్ధభిక్షుసంఘనిర్మాణం జరిగింది ప్రజాస్వామ్య సూత్రాలపైనే; రాచరికం నెలకొన్నతర్వాతకూడా, ప్రజారంజకంగా పాలించలేని రాజును చంపివేసే హక్కు ప్రజలకున్నట్టు మన ధర్మశాస్త్రాలలో కొన్ని ఉద్ఘోషించాయి. ఈ విషయాలన్నీ వాస్తవమైనవే కావచ్చుగాని, ఇది "మా తాతలు ముంతలతో నేతులు తాగేవా" రని చెప్పుకొనడమే కాదా? పొట్ట కూటికి గతిలేక పడరానిపాట్లు పడుతున్నవాని ఆకలిని అతని తాతముత్తాతల గొప్పతనం తీర్చుతుందా?

కొన్ని నెలలుగా - ముఖ్యంగా కొన్ని వారాలుగా - విశేషించి కొన్ని రోజులుగా - మన దేశంలో జరుగుతున్న అనేకశోచనీయ సంఘటనలు మనం ప్రజాస్వామ్యానికి ఎంతవరకు తగుదుమన్న ప్రశ్నను అనివార్యం చేస్తున్నాయి. ఇదివరలో బ్రిటిష్‌వారు చెబుతూవచ్చిన మాటను పూర్తిగా త్రోసివేయగలమా అనే సంశయాన్ని కలిగిస్తున్నాయి.

మనతోపాటు దాస్యవిముక్తిని పొందిన ఆసియన్, ఆఫ్రికన్ దేశాలు పెక్కింటిలో ప్రజాస్వామ్యవ్యవస్థ విలుప్తమై పోయినా, ఏవేవో మారు వేషాలతో అక్కడ నియంతృత్వ ప్రభుత్వాలు నెలకొన్నా, మన దేశం ప్రజాస్వామ్యంగానే నిలిచివున్నట్టు ఇటీవలివరకు మనం చాలా ప్రగల్భాలకు పోయాము! మన దేశంలో ప్రస్తుతం జరిగిన - జరుగుతున్న - సంఘటనల తర్వాత ఈ గొప్పలకు మరి పోగలమా?

ప్రజాస్వామ్యం అంటే కేవలం రాజు లేకపోవడం కాదు, నియంత లేకపోవడం కాదు; ఒక నిర్ణీతవ్యవధిలో పార్లమెంటుకు, శాసనసభలకు ఎన్నికలు జరగడమైనా కాదు. ఇవి ప్రజాస్వామ్యానికి కేవలం బాహ్యలక్షణాలు. వీటితో, పాటు కొన్ని అంతరంగిక లక్షణా లున్నది తప్ప నిజమైన ప్రజాస్వామ్యం కాదు. కానేరదు.

ఈ అంతరంగిక లక్షణాలలో అతిముఖ్యమైనట్టిది ఆత్మసంయమనం "ఆత్మసంయమనం" అంటే అదేదో ఆధ్యాత్మికసాధన కాదు; ఎవరికి వారు తమను తాము కొంత అదుపులో పెట్టుకొనడం మాత్రమే, కొన్ని అవధులను దాటకపోవడమే. ఒకరు నెత్తిపై మొట్టగా అదుపులో వుండడం, అవధులను దాటకపోవడం రాచరికవ్యవస్థకు తగిపోతుంది. అందువల్లనే మన దేశంలో రాజనీతికి మరొకపేరు "దండనీతి". "దండం" ముందు పుట్టగా, ఆ తర్వాత రాజు పుట్టినట్టు చెప్పే కొన్ని ధర్మశాస్త్రాలు మన కున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలోనైనా "దండం" (శిక్షాస్మృతి) తప్పదుగాని, అన్ని జాతులలో, అన్ని కాలాలలో వుండే కొద్దిమంది సంఘవిద్రోహులను విడిచిపుచ్చగా, మిగిలిన వా రందరు "దండం"తో నిమిత్తం లేకుండా, దండించేవారితో నిమిత్తం లేకుండా, తమ తమ పౌరధర్మాలను తాము నిర్వహిస్తూ వుండాలి. దీన్నే మరొక విధంగా చెప్పాలంటే, అన్ని వేళలలో, అన్ని పరిస్థితులలో పౌరులు తమను తామే అదుపులో పెట్టుకోవాలి, తమకు తామై కొన్ని అవధులను అతిక్రమించరాదు.

ప్రజాస్వామ్యానికి కావలసిన మరొక అంతరంగికలక్షణం మన శాసనాల పట్ల గౌరవం. ప్రజాస్వామ్యంలోని శాసనాలు పైనుంచి ఎవరో విధించేవి కావు; ప్రజలు తమ ప్రతినిధులద్వారా స్వయంగా చేసుకొనేవి మాత్రమే! ఏ

శాసనాలైనా తమకు మనస్కరించకపోతే, అవి తమకు బాధాకరమైతే, వాటిని మార్చవలసిందిగా ఆ ప్రజలే తమ ప్రతినిధులను కోరవచ్చు. వారు తమ మాట వినకపోతే, ఆ ప్రతినిధులస్థానంలో కొత్తవారిని ఎన్నుకోవచ్చు. అంతేతప్ప, శాసనాలధిక్కారానికి ఉద్యమించరాదు. ఒక అన్యాయశాసనంపట్ల అసహనంతో దాన్ని ధిక్కరించినపుడు, ముఖ్యంగా ఈ పని తరచు జరిగినప్పుడు, అసలు శాసనాలపట్లనే గౌరవం సన్నగిల్లుతుంది. అయితే, ఇదివరలో శాసనోల్లంఘనం రూపంలోనే మన జాతీయోద్యమం కొనసాగలేదా అని ఈ సందర్భంలో ప్రశ్నించవచ్చు. కాని, అప్పటి శాసనాలు మనం చేసుకొన్నట్టివి కావు, మనపై విజాతీయ ప్రభువులు విధించినట్టివి. ఇందువల్ల వాటివిషయంలో సమర్థనీయమైన పద్ధతి మనకై మనం చేసుకొన్న శాసనాలవిషయంలో సమర్థనీయం కాబోదు. తమకు బాధాకరమైన ప్రతి శాసనానికి విరుద్ధంగా ఆందోళన జరపడానికి ప్రజాస్వామ్యంలో పౌరులకు పూర్తి హక్కు వుంటుంది. ఇది లేనిది ప్రజాస్వామ్యమే కాదు. కాని ప్రజాస్వామ్యంలోని ఆందోళనాపద్ధతులు రాచరికంలోని వాటికి, నియంతృత్వవ్యవస్థలోనివాటికి భిన్నమైనవిగా వుండాలి.

ఇదే విధంగా ప్రజాస్వామ్యానికి కావలసిన అంతరంగిక లక్షణా లన్నిటిని గురించి చర్చించడం ఇక్కడ సాధ్యంకాదు గనుక, ఆ పని చేయబోము. కాని, కొన్నాళ్లుగా మన దేశంలో ప్రస్ఫుటమౌతున్న ధోరణులు మనం ప్రజాస్వామ్యానికి ఎంతవరకు తగుదు మని గట్టిగా ప్రశ్నించుకొనవలసిన పరిస్థితిని కల్గిస్తున్నా యనడంలో సందేహం లేదు. ఈ విపరీతధోరణులకు సరికొత్త నిదర్శనమే నిన్న ఢిల్లీలో చెలరేగిన అల్లకల్లోలం.

ప్రస్తుత ప్రభుత్వంపట్ల, దాని విధానాలపట్ల మరి సహించలేనంతటి విద్వేషమైనా నిన్నటి చర్యలకు – ముఖ్యంగా, ప్రభుత్వం ఆస్తిపాస్తుల విధ్వంసక చర్యలకు – సమర్థనీయమైన కారణం కాజాలదు. రైల్వే ఆస్తులను నష్టపరచితే, ఆ నష్టం ప్రజలకే కాని, ఎస్. కె. పాటిల్‌కు కాదు. తంతి, తపాలా సౌకర్యాలకు చెరుపు చేస్తే, ఆ చెరుపు ప్రజలకే కాని, సత్యనారాయణ సిన్హాకు కాదు. రేడియో స్టేషన్‌లకు చిచ్చుపెడితే, ఆ చిచ్చు తిరిగి ప్రజాక్షేమానికే కాని, రాజబహదూర్‌కు కాదు.

ఈ మంత్రులపట్ల, వారు ఏ ప్రభుత్వంలో సభ్యులో ఆ ప్రభుత్వవిధానాల పట్ల అసంతృప్తిని వెల్లడించడానికి ఉత్తమోత్తమమైన మార్గం వారిని, వారి

ప్రభుత్వాన్ని పదవీభ్రష్టులను చేసి, మరొక ప్రభుత్వాన్ని ఎన్నుకొనడం మాత్రమే. ముందెన్నడో కాక, మరి నాలుగు నెలలలోపలనే ప్రస్తుత ప్రభుత్వాన్ని కోరితే త్రోసివేయడానికి జనరల్ ఎన్నికలు జరగబోవడం లేదా? అయినప్పుడు, తమ వేలితో తమ కంటినే పొడుచుకొన్న చందాన వ్యవహరించడం తగునా?

ప్రస్తుతం ప్రభుత్వాన్ని వెనకవేసుకు రావడానికి మేము ప్రయత్నించడం లేదు. శాంతిభద్రతలను సంరక్షించడం ఏ ప్రభుత్వానికైనా ప్రథమ బాధ్యత. దానినైనా ఇది సరిగా నిర్వహించలేక పోతున్నప్పుడు దీన్ని వెనుకవేసుకు రావడానికి మేమెందుకు తాపత్రయపడాలి? కాని, ఈ ప్రభుత్వస్థానంలో మరొకటి వచ్చినా, మన శాసనాలను ఇప్పటివలె మనమే గౌరవించకపోతే, ఇప్పటివలె చీటికీమాటికీ విధ్వంసకచర్యలు కొనసాగిస్తే, ఇప్పటివలె సంఘవిద్రోహక శక్తులు చెలరేగడానికి అవకాశాలను కల్పిస్తూపోతే, ప్రజాస్వామ్యవ్యవస్థ మాట అటుండగా, మన దేశానికి స్వతంత్రప్రతిపత్తి సయితం మిగలబోదు!

చైనా, మన సరిహద్దులపై దండెత్తిననాటికంటె నేడు నిశ్చయంగా మన దేశం మరింత విపత్కర పరిస్థితిలో వున్నది. ఇది ప్రతి ఆలోచనాపరుని ఖిన్నునిచేసే ఘట్టం; ప్రతి జాతీయవాదిని కలవరపరచే సందర్భం; ప్రతి ప్రజాస్వామ్యవాది కంటికి నిద్రను దూరంచేసే సన్నివేశం!

[అక్టోబర్ 9, 1966]

రోదసిపై విజయం

ఒక నూరేళ్లతర్వాత ప్రపంచ చరిత్రకారుడు వెనుదిరిగి చూచినప్పుడు అతనికి 1957-67 దశాబ్దిలోని యుద్ధాలుగాని, క్షామాలుగాని, ఇతర సంక్షోభాలు గాని ముఖ్య సంఘటనలుగా తోచవు. వాటిని నిర్లక్ష్యంచేసి, ఈ దశాబ్దిని అతడు రోదసిపై మానవుని విజయానికి నాందిగా అభివర్ణిస్తాడు.

పదేళ్లక్రితం - 1957 అక్టోబర్ 4 వ తేదీని - సోవియెట్ యూనియన్ తన మొదటి స్పూట్నిక్‌ను ప్రయోగించింది. భూమ్యాకర్షణశక్తిపై అది మానవుని ప్రప్రథమ విజయం. అంతకుపూర్వం కాలికి ఒక సంకెలవలె భూమ్యాకర్షణశక్తి మానవుని ఈ పృథ్వికి కట్టివేసింది. ఆ సంకెలను మొట్టమొదటి సారిగా ఆనాడు అతడు తెంచివేసుకోగలిగాడు.

నాటికి అది ఘనవిజయమైనా, ఈ పదేళ్ళలోని అన్య విజయాలతో పోల్చినప్పుడు అది సామాన్యమైనదే. ఆ తొలి స్పూట్నిక్ గంటన్నర మాత్రమే భూప్రదక్షిణాలను చేసింది. పైగా, దాని గరిష్ఠకక్ష్య 560 మైళ్ళుమాత్రమేం కాగా, ఈ నాడు మానవుడు ప్రయోగించిన ఒక రోదసీనౌక సూర్యమండలం చుట్టు ఒక కృతిమోపగ్రహంగా పరిభ్రమిస్తున్నది.

ఈమధ్యకాలంలో మానవుడు స్వయంగా రోదసిలో పాదం పెట్టాడు. రోదసీనౌకను విడిచి, శూన్యం ("స్పేస్") లోకి వచ్చి, దానిలో విహరించాడు. ఇంతే కాదు, చంద్రమండలంలోనికి రోదసీనౌకలను ప్రవేశపెట్టాడు. మనకు కనపడని చంద్రగోళం అవతలిసగం ఫొటోలను తీశాడు; దాని ఉపరితలాన్ని గురించి, దాని శీతోష్ణ పరిస్థితులనుగురించి అనేక నూతనాంశాలను తెలుసుకొన గలిగాడు. ఈ విజయాలను రష్యా, అమెరికాలు సాధించినా, మానవవిజయాలు గానే వీటిని పరిగణించాలి.

మానవుని రోదసీయాత్రల చరిత్రలో రెండవదశాబ్ది ప్రారంభమైనంతనే (ఇది సరిగా ఒక పక్షంక్రితం ప్రారంభమైంది.) శుక్రగ్రహంలో రోదసీనౌక నిన్న ప్రవేశించింది. చంద్రమండలం భూమికి ఉపగ్రహం కాగా, భూగోళంవలె శుక్రగోళంకూడా సూర్యునికి ఉపగ్రహం. పైగా, భూమండలానికి, శుక్రమండలానికి ఇతరసామ్యాలు అనేకం వున్నాయి. ఈ రెండు మండలాలను ఖగోళ శాస్త్రజ్ఞులు అక్కచెల్లెళ్లతో పోల్చడం కద్దు. భూగోళంకంటె శుక్రగోళం కొద్దిగా చిన్నది. దీని వ్యాసరేఖకంటె దానిది నూటికి మూడువంతులు మాత్రమే తక్కువ. దీనికంటె అది దాదాపుగా 23 వంతులు మాత్రమే తేలిక. తక్కిన కొన్ని ఉపగ్రహాలు మరీ చిన్నవైనందున ఏ వాయువూ వాటిని ఒక పొరవలె ఆవరించివుండలేదు. శుక్రగ్రహం, భూమండలంవలె, ఉదజని (హైడ్రొజన్)సమేతంగా అన్ని వాయువులను, అవి శూన్యంలోకి చెదరిపోకుండా, నిలుపుకోగలుగుతున్నది.

ఈ సామ్యాల కారణంగా భూమండలంపైవలె శుక్రగ్రహంలో కూడా జీవకోటి వున్నదని భావించవచ్చునా? ఇందుకు అవకాశాలు తక్కువనే ఖగోళ శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. వాతావరణంలో విశేషంగా ప్రాణవాయువు (ఆక్సిజన్) లేనిదే జీవకోటి ఆవిర్భవించడానికి, ఆవిర్భవించిన తర్వాత జీవించడానికి వీలు లేదు. ఇప్పటివరకు జరిగిన పరిశోధనల ప్రకారం శుక్రగ్రహం వాతావరణంలో ప్రాణవాయువు దాదాపు నామమాత్రం కాగా, దానిలో బొగ్గుపులుసు గాలి (కార్బన్ డయాక్సయిడ్) కొన్నివేల రెట్లు అధికం. ఇట్టి వాతావరణంలో వృక్షకోటి సమేతంగా ఇతరజీవకోటి ఆవిర్భవించడానికి అవకాశం లేదు. శుక్రగోళంలో నీరు వుంటే, అది కేవలం ఆవిరిరూపంలోనే వుండవచ్చు.

ఇదివరకటి పరిశోధనల ప్రకారం శుక్రగ్రహంలో ఉష్ణోగ్రత 80 సెంటిగ్రేడ్ డిగ్రీలనుంచి 130 డిగ్రీలవరకు విస్తరిస్తూ వుంటుంది. శుక్రగ్రహంలో నిన్న దిగిన సోవియట్ రోదసీనౌక పంపించిన తొలి భోగట్టాప్రకారం ఈ అంచనాలు తప్పు. అక్కడి కనీసపు టెంపరేచర్ 40 సెంటిగ్రేడ్ డిగ్రీలు కాగా, గరిష్ఠపు టెంపరేచర్ 280 డిగ్రీలు. అయినప్పుడు శుక్రగ్రహంలో జీవకోటి - భూమండలంపైగల జీవకోటిని పోలినట్టిది - ఆవిర్భవించడానికి, పరిఢవిల్లడానికి అవకాశం లేదనే తీర్మానించుకోవాలి.

ఖగోళశాస్త్రజ్ఞుల సిద్ధాంతాల ప్రకారం భూమండల వాతావరణంలో ప్రాణ వాయువు హెచ్చుగాను, బొగ్గుపులుసుగాలి అత్యల్పంగాను వుండడానికి ముఖ్య కారణం ఇక్కడ వృక్షసంతతి విశేషంగా వుండడమే! వృక్షసంతతిని శుక్ర గ్రహంలో పెట్టగలిగితే కొన్ని కోట్ల సంవత్సరాలతర్వాత అది భూమండలంవలె మానవవాసయోగ్యమైన గోళంకాగలదా? ఇది వెర్రిపూహవలె తోచవచ్చు గాని, రోదసీయానం ఒకనాడు పెక్కుమంది తీర్పుప్రకారం కేవలం వెర్రిపూహ మాత్రమేకాదా?

మానవునికి, తక్కిన జీవకోటికి ఒకే ఒక ప్రధానభేదం వున్నది. మాన వునికి "కాన్‌సెప్‌చుయెల్ థింకింగ్" సాధ్యం. సూత్రాలను చేయగల, సిద్ధాం తాలను రూపొందించగల, సత్యాలను కనుగొనగల, ఒక సత్యంనుంచి మరొక దానికి పురోగమించగల తన మేధాపటిమతోనే మానవుడు నేడు ప్రకృతిరహస్యా లను తెలుసుకొంటున్నాడు; రేపు సృష్టిమూలాన్నే అతడు తెలుసుకోవచ్చు.

కాలం గడచినకొద్దీ వైజ్ఞానికశాస్త్రాలలో మానవుని పురోభివృద్ధి గమన వేగం హెచ్చుతున్నది. ఆధునిక వైజ్ఞానికశాస్త్రాలు తలయెత్తి. పూర్తిగా మూడు వందల సంవత్సరాలైనా కాలేదు. ఈ కొద్ది వ్యవధిలోని మొదటి రెండువందల సంవత్సరాలలో మానవుడు కనుగొన్న వైజ్ఞానిక రహస్యాలు, అతడు సాధించిన సాంకేతిక విజయాలు చివరి వంద సంవత్సరాలలోనివాటితో పోల్చినప్పుడు బహుస్వల్పం. తన సాంఘిక, రాజకీయజీవితాన్ని, తన మానసికజీవితాన్ని, తన "ఎమోషనల్" జీవితాన్ని, ఒక్కమాటలో తన బహిరంతరజీవితాన్ని మరింత సక్రమపద్ధతులపై, మరింత హేతుబద్ధంగా, మరికొంచెం ఉదాత్తంగా మానవుడు నడుపుకొన్న పక్షంలో, యుద్ధాన్ని ప్రపంచంనుంచి అతడు నిషేధించ గలిగిన పక్షంలో, అణు విజ్ఞానాన్ని ఆత్మహత్యకోసం అతడు వినియోగించని పక్షంలో, చంద్ర, శుక్ర గ్రహాలపైనే కాక, సౌరమండలంలోని ఇతర గ్రహాలకు సయితం అతడు స్వయంగా వెళ్లిరాగలరోజు త్వరలోనే వస్తుంది; ఆ గోళాలలో కనీసం కొన్నింటిలోనైనా వృక్షసంతతిని, ఇతర జీవకోటిని, అతడు ప్రవేశ పెట్టగలరోజు వస్తుంది; సౌరమండలాధిపత్యాన్ని అతడు సాధించగల రోజు వస్తుంది; సృష్టిమూలాన్ని ఆకళింపుచేసుకొని, అతడు ప్రతిసృష్టి చేయగలరోజు సయితం వస్తుంది.

మానవుడు కలకాలంగా ఊర్ధ్వముఖుడే : అయితే, అజ్ఞానదశలో అతడు ఊర్ధ్వదిశలో హిందువుగా స్వర్గాన్ని, బౌద్ధుడుగా తుషితలోకాన్ని, గ్రీక్‌గా ఈలిజియన్ ఫీల్డ్స్‌ను, నార్స్‌జాతివాడుగా వాల్హాలను, క్రైస్తవుడుగా హెవెన్‌ను, ఇతరమతస్థుడుగా ఇతరలోకాలను చూచాడు. కాని, ఈనాడు వైజ్ఞానిక శాస్త్రవేత్తగా, సాంకేతిక విద్యాప్రవీణుడుగా అతడు ఊర్ధ్వముఖుడై చూస్తున్నది కాలానికి, అవధికి అతీతమై నిత్యం విస్తరిస్తున్న విశ్వగోళాన్ని ("ది ఎక్స్‌పేండింగ్ యూనివర్స్"). తన భూగోళాన్ని విడిచి, తన సమీపంలోగల ఇతరగోళాలలో మానవుడు ప్రవేశించడం మరి రెండు, మూడేళ్ళలోనే జరగవచ్చు. ఈ సాహసికయాత్ర మానవజీవితానికే చరితార్థతను కూర్చబోతున్నది.

[అక్టోబరు 20, 1967]

త్యాగరాజు

మతం మానవులను విడదీస్తుంది. మరణానంతరం వివిధమతస్థులు వెళ్లేది విభిన్న స్వర్గాలకో, నరకాలకో.

ఇదే విధంగా రాజకీయాలు సయితం మానవులమధ్య కృత్రిమవిభేదాలను కల్పిస్తూవుంటాయి. మతవిద్వేషాలవలె. రాజకీయాలు సయితం అనేక సందర్భాలలో సంఘర్షణలకు, రక్తపాతానికి దారితీయడం కద్దు.

కాగా, మానవులను సాహిత్యం దగ్గరికి తెస్తుంది, సంగీతం వారిని దగ్గరికి తెస్తుంది, చిత్రకళ వారిని దగ్గరికి తెస్తుంది, ఇతర కళలు వారిదగ్గరికి తెస్తాయి. దేశ కాలాలతో నిమిత్తం లేకుండా, మానవులను ఏకంచేయగల మహత్తరశక్తి వాటి కున్నది.

కాళిదాసు భారతదేశంలో పుట్టి వుండవచ్చు, సంస్కృతభాషలో వ్రాసి వుండవచ్చు. అయినా ఆయన మన కవి మాత్రమే కాదు; ప్రపంచానికే కవి. ఇదే విధంగా షేక్స్పియర్ ఇంగ్లండులో పుట్టివుండవచ్చు; అయినా ఆయన ఇంగ్లీషువారి కవి మాత్రమే కాదు; మానవాళికే కవి.

మానవులను దగ్గరికితీయడంలో సాహిత్యంకంటె కూడా అమోఘమైనట్టిది సంగీతం. దాని రసాస్వాదనకు భాషాజ్ఞానంతో పని లేదు.

సంగీతం వివిధభాషలవారిని, విభిన్న సంస్కృతులవారిని ఎంత దగ్గరికి తీసుకురాగలదో ఇతర వాగ్గేయకారులవలె శ్రీ త్యాగరాజు కూడా నిరూపించాడు. ఆయన తన కీర్తనలను రచించింది తెలుగులో. అయినా, తెలుగువారికంటె మిన్నగా తమిళులు ఆయనపట్ల ప్రేమాభిమానాలను చూపుతున్నారు, భక్తిగౌరవాలను ప్రదర్శిస్తున్నారు. ఇదివరలో కాకపోయినా, కొంతకాలంగా భారతదేశం

మొత్తంమీదనే ఆయనపట్ల శ్రద్ధాసక్తులు ప్రస్ఫుటమౌతున్నాయి. ఇప్పు డిప్పుడే పాశ్చాత్యజాతులవారు భారతదేశానికి చెందిన హిందూస్తానీ, కర్ణాటక సంగీత రీతులలోని మాధుర్యాన్ని గ్రహించగలుగుతున్నారు. కాబట్టి మరికొంతకాలానికి బాక్‌వలె, మోజార్ట్‌వలె. బేతోవెన్‌వలె, హాండెల్‌వలె, షోపాన్‌వలె త్యాగరాజు కూడా ప్రపంచవాగ్గేయకారుడుగా ఖ్యాతి గాంచవచ్చు.

నూరేళ్లనాడు త్యాగరాజు శతజయంతి జరిగిందో, లేదో మనకు స్పష్టంగా తెలియదు. కాని, ప్రస్తుతం అయన ద్విశతజయంతి ఆయన జన్మస్థానంలోనేకాక, దేశం మొత్తంమీదనే ఘనంగా జరుగుతున్నది. మరొక నూరేళ్లనాటికి ఆయన త్రిశతజయంతి దేశదేశాలలో జరుగుతుందని విశ్వసించవచ్చు.

పోనుపోను త్యాగరాజు కీర్తి పెరగగలదని విశ్వసించడానికి ఆయనది రాజకీయరంగంలో సముపార్జించుకొన్న విఖ్యాతి కాదు. రాజకీయరంగంలో ఎంత త్వరగా పేరు ప్రతిష్ఠలు లభిస్తాయో, అంతత్వరగా అవి సమసిపోవడం కూడా కద్దు. గ్లాడ్‌స్టన్ విషయమై ఇంచుమించు అర్ధశతాబ్ది క్రితం వ్రాస్తూ, రాజకీయ విఖ్యాతి అస్థిరమైనది కాబట్టి, మరికొంతకాలం పోతే "గ్లాడ్‌స్టన్" అనగానే బ్రిటిష్ ప్రధానిగా కీర్తికెక్కిన ప్రజానాయకుడు కాక, "గ్లాడ్‌స్టన్" అనే పేరుతో చెల్లే తోలుసంచి (డాక్టర్లు వాడే సంచి) జ్ఞాపకం రావచ్చునని ఎ. జి. గార్డెనర్ అన్నాడు. ఈనాడు దాదాపుగా ఇంతే జరుగుతున్నది.

త్యాగరాజ ద్విశతజయంతి మహోత్సవాల సందర్భంలో సంగీతవిద్యలో ఆయన అనుపమ ప్రజ్ఞావిశేషాలకు కాక, ఆయన మతవిశ్వాసాలకు అనుచిత ప్రాధాన్య మిస్తున్నారు. మా దృష్టిలో ఇది బహుశోచనీయం. త్యాగరాజు హిందూ మతవిశ్వాసాలకు ప్రాధాన్య మివ్వడం ఆయనను హిందూమతపరిధికి పరిమితం చేయడమే కాగలదు. ఇందుకు మారుగా, ఆయనను ఒక మహావాగ్గేయకారుడుగా ప్రపంచానికి చాటి చెప్పినప్పుడు, మతవిభేదాలతో నిమిత్తంలేకుండా మొత్తం మానవాళి ఆయనను గౌరవిస్తుంది, సంస్తవిస్తుంది.

ఈ మధ్యనే త్యాగరాజ జీవితచరిత్రను ఇంగ్లీషులో వ్రాస్తూ, ప్రొఫెసర్ సాంబమూర్తి త్యాగరాజు మహిమలను గురించిన అనేక కట్టుకథలను అనవస

రంగా దానిలో చేర్చడంవల్ల త్యాగరాజు కీర్తిని ఆయన పెంచినట్టు చెప్ప లేము. ఆ గ్రంథాన్ని చదివే విదేశీయులు దానిలోని కట్టుకథలవలె గానకళలో త్యాగరాజు ప్రజ్ఞాప్రభావాలు సయితం కల్లబొల్లులని అనుకొనగల ప్రమాదం వున్నది. మన సాహిత్యవేత్తలను, సంగీతవిద్వాంసులను, శిల్పులను, చిత్రకారులను గౌరవించుకొనడంలో మనం కొంత విజ్ఞతను ప్రదర్శించాలి. అది కొరవడిన గౌరవం నిజమైన గౌరవం కాలేదు; అది అగౌరవమైనా కావచ్చు.

[జనవరి 20, 1968]

"నవమతం, నూతనవేదం కావాలి"

మానవుడు కొన్ని లక్షల సంవత్సరాలుగా భూమండలంపై నివసిస్తు న్నాడు. అన్ని లక్షల సంవత్సరాలలోను అతడు సాధించిన వైజ్ఞానిక ప్రగతి ఒక యెత్తు, కడచిన నూరు, నూటయాభై సంవత్సరాలలో అతడు సాధించ గలిగింది మరొక యెత్తు.

ముఖ్యంగా ఈ శతాబ్దంలో మానవవిజ్ఞానం అమితవేగంతో, అత్యాశ్చర్య కరంగా పెరిగిపోతున్నది. అందులోను, ప్రపంచ ప్రసిద్ధ ఖగోళశాస్త్రవేత్తలలో ఒకరైన హార్లో షేప్లీ ఇటీవల ఒక వ్యాసంలో పేర్కొన్నట్టు, మానవ విజ్ఞానం రెండు విభిన్న దిశలలో విభ్రాంతికరంగా పురోగమిస్తున్నది.

ఒకటి—రాత్రిపూట తలయెత్తి, కనులు విప్పి చూస్తే కనబడే అనంత విశ్వానికిసంబంధించిన విజ్ఞానం.

రెండవది — స్థూలదృష్టితోగాని, యంత్రపరికరాల సహాయంతోగాని ఏ విధంగాను చూడడానికి వీలులేని పరమాణుప్రపంచానికి సంబంధించిన విజ్ఞానం.

ఒకటి అతి స్థూలజగత్తుకు, రెండవది అతి సూక్ష్మజగత్తుకు సంబంధించి నట్టిది. ఈ రెండు దిశలలోను మానవుడు ముఖ్యంగా ఈ ఇరవయ్యో శతాబ్దిలో కనుగొన్న రహస్యాలు ఎట్టి అత్యద్భుత పరిణామాలను సాధ్యం చేయనున్నవో ఊహించడమైనా కష్టం.

17 నెలల క్రిందట అమెరికన్ రోదసీ యాత్రికుడు రిచర్డ్ గోర్డన్ తన జెమినీ-11 రోదసీనౌకనుంచి తీసిన కొన్ని ఛాయాచిత్రాల ద్వారా నక్షత్రా లెలా ఉద్భవించినవనే విషయం తెలియవచ్చునని శాస్త్రజ్ఞులు తలపోస్తున్నట్టు నిన్నటి ఒక వార్త సూచిస్తున్నది. "ఓరియన్" నక్షత్రమండలం మనకు 45 కోట్ల

కాంతిసంవత్సరాల దూరంలో వున్నది. దాన్ని 12కోట్ల కాంతిసంవత్సరాల వ్యాసం గల ఒక "ధూళిమేఘం" ఆవరించివున్నట్టు రిచర్డ్ గోర్డన్ తీసిన ఫోటోలు చూపుతున్నాయట. వేర్వేరు స్థలాలలో ఆ "ధూళిమేఘం" చిక్కదనాన్నిబట్టి ఒక కొత్త నక్షత్రం ప్రభవించడానికి అది ముడి పదార్థంగా అనిపిస్తున్నదని, దీన్నిబట్టి నక్షత్రగోళాలు ఏ విధంగా ఆవిర్భవించాయో తెలియరావచ్చునని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు.

ఇట్టి విశ్వరహస్యాలు ఎంత త్వరలో మనకు కరతలామలకాలు కాగలవో చెప్పలేము. కాని, ఇప్పటికి తెలియవచ్చిన విషయాలనుబట్టి కూడా మనం కొన్ని శతాబ్దాలుగా పెంచుకొన్న అనేక మూఢవిశ్వాసాలు పటాపంచలు అయిపోతున్నాయి. భూమి, దానిపై జీవరాశి, దానిలో మన స్థానం, మనపై మన పరిసరాల ప్రభావం, మన సౌరమండలం, దానిలోని గ్రహాలు, ఉపగ్రహాలు మొదలైన అనేకానేక విషయాలనుగురించి తరతరాలుగా, యుగయుగాలుగా మనం పెంచుకొన్న పెక్కు అజ్ఞానభావాలు, అంధవిశ్వాసాలు సడలిపోతున్నాయి.

ఇంతే కాదు. మన వైజ్ఞానికపురోగతిలో ఒక్కొక్క నూత్న విషయం ఆవిష్కృతమౌతున్నకొద్దీ మొన్నటి శాస్త్రవేత్తలు చేసిన సిద్ధాంతాలను నిన్నటివారు నిన్నటివారి పరిశోధనాఫలితాలను నేటివారు ఖండించివేస్తున్నారు. దీన్ని నిజానికి ఖండనమండనలదృష్టితో చూడరాదు; మానవవిజ్ఞానపురోగతిగా భావించాలి.

ఉదాహరణకు, కాంతికంటె వేగంతో (సెకండుకు ఒక లక్ష ఎనభై ఆరు వేల మైళ్ళు) ఏదీ ప్రయాణం చేయలేదని మహామేధావి ఐన్‌స్టీన్ విశ్వసించాడు. ఒకటి, ఒకటి కలిస్తే రెండు అన్నట్టు, తిరుగులేని శాస్త్రీయసత్యాలలో దీన్ని ఒకటిగా మనం పరిగణిస్తూ వచ్చాము.

అయితే, కొలంబియా యూనివర్సిటీకి చెందిన డాక్టర్ జెరాల్డ్ ఫేన్‌బర్గ్ ప్రతిపాదించిన ఒక నూత్న సిద్ధాంతాన్నిబట్టి కాంతికంటె వేగంగా, ఆ మాటకు వస్తే "పరిమితి లేని" వేగంతో (ఇన్‌ఫినిట్ స్పీడ్‌తో) పయనించే పరమాణు కణాలు (పార్టికిల్స్) వుండవచ్చునట. వాటిని ఆయన "టాక్యాన్స్" అని పేరు పెట్టాడు.

కొంతకాలం క్రితంవరకు జీవరాశి భూగోళానికే పరిమితమని శాస్త్రజ్ఞులు నమ్మేవారు. కాని, ఇప్పు డేమో "బహుశా" అనే సంశయానికి తావు లేదని అంటున్నారు. విశ్వంలో కోటానుకోట్ల నక్షత్రా లున్నాయి, సూర్యుని కున్నట్లే వాటికికూడా గ్రహా లున్నాయి. ఒక్కొక్క నక్షత్రం చుట్టూ ఒక్కొక్క గ్రహంలో జీవరాశి వున్నా, మన భూమినిపోలిన గ్రహాలు, ఏదో ఒక రూపంలో జీవరాశి కలిగిన గ్రహాలు, కొన్నికోట్లు వుండడానికి వీలున్నది.

ఇంతే కాదు. మన భూమిపై జీవరాశి ప్రాణవాయువు (ఆక్సిజన్) ఆధారంగా ఆవిర్భవించింది. బహుశా ఇతర గ్రహాలలో తద్భిన్నమైన మూలద్రవ్యాల ఆధారంతో పరిణామం చెందిన జీవరాసు లున్నాయేమో! మన భూమిపై జీవరాశిలో మానవుడు ఎన్నదగు పరిణామం చెందినవాడుగా కనబడుతున్నాడు. సుదూర గ్రహాలలో ఇంతకంటె ఉత్తమ పరిణామం చెందిన జీవు లున్నారేమో! వారి నాగరికత మనదానికంటె మరింతగా పరిణతి చెందినది కావచ్చునేమో! వీటిని కేవలం ఊహాగానాలుగా త్రోసివేయడానికి వీలు లేదని ఈ నాటి శాస్త్రజ్ఞులు ఉద్ఘాటిస్తున్నారు.

చంద్రగోళానికి మానవుడు చేరడానికి ప్రస్తుతం సన్నాహాలు జరుగుతున్నాయి. ఇది మరి రెండు, మూడేళ్ళలోనే సాధ్యం కావచ్చు కూడా. అది సాధ్యమైతే, సౌరకుటుంబంలోని ఇతర గ్రహాలకు ప్రయాణాలు సయితం త్వరలోనే సాధ్యం కావచ్చు.

చంద్రుడు మనకు అతి సమీపంలో వున్న గోళం. అక్కడికి వెళ్ళిరావడం అయిదారు రోజుల పని. ఇతర గ్రహాలకు చేరడం సాధ్యమైతే, అది కొన్ని నెలల పని. కాని, విశ్వాంతరాళంలో కొన్ని కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో గల గోళాలను చేరడం మానవసాధ్యం కాకపోవచ్చు. కనీసం ఇది ఈనాడు శాస్త్రవేత్తలు వెలిబుచ్చుతున్న నిరాశ.

కాని, ఫేన్‌బెర్గ్ సిద్ధాంతం ప్రకారం "టాక్యాన్స్" పరమాణుకణాలు నిజంగా వుంటే, అవి కాంతికంటె వేగంగా పోగలిగితే, వాటి శక్తిని వినియోగించు

కాని రోదసీనౌకలను అనంతవేగంతో నడపగలిగితే, దూరగోళాలను చేరడం సాధ్యమేమో! ఈ ఆశను ఫేన్‌బర్గ్ స్వయంగా వెల్లడించాడు.

అణుకేంద్రంలో వున్నవని డాక్టర్ ఫేన్‌బర్గ్ చెబుతున్న ''టాక్యాన్స్'' కణాలు నిజంగా వున్నవా, లేదా అని శాస్త్రవేత్తలు అనుమానిస్తున్నారు. వాటిని కనుగొనడానికి చేసిన ప్రయత్నాలు ఇంతవరకు ఫలించలేదు. కాని, 1920 ప్రాంతాలలో పి. ఎ. ఎమ్. డిరాక్ అనే శాస్త్రజ్ఞుడు కేవలం గణితశాస్త్రసహాయంతో ఊహించిన "పోజిట్రాన్" మొదలైన విలక్షణ అణుకణాలు (యాంటీ మేటర్) నిజంగా వున్నవని ఆటుపిమ్మట శాస్త్రవేత్తలపరిశోధనలలో తేలింది. ఇదే విధంగా, కాంతికంటె వేగంగా పయనించే ''టాక్యాన్స్'' కణాలను కూడా శాస్త్రవేత్తలు నెమ్మదిగా కనిపెట్టడం సంభవమేమో!

ఏమైనా, నిన్న మొన్నటివరకు శాశ్వత సత్యాలుగా వైజ్ఞానికశాస్త్రవేత్తలు స్వయంగా గుర్తించిన సిద్ధాంతాలు సయితం నూతన పరిశోధనల ఫలితంగా పూర్వపక్షమైపోతున్నాయి. అయినప్పుడు, కొన్ని వందల యేళ్ళనాటి, వేల యేళ్ళనాటి మన వేదాలపై, పురాణాలపై, ధర్మశాస్త్రాలపై, త్రిపిటకాలపై, బైబిల్‌పై, ఖొరాన్‌పై ఆధారపడిన మన విశ్వాసాలు, సిద్ధాంతాలు పూర్వపక్షం కావడంలో ఆశ్చర్యం లేదు.

జగత్తు పరిణామశీలమైనది. దేనికీ స్థిరత్వం లేదు. అణువునుంచి బ్రహ్మాండంవరకు సమస్తం - సతతం - పరిణామం చెందుతున్నది. ఒకే ఒక ఎలెక్ట్రాన్‌తో కూడిన హైడ్రొజన్ అణువునుంచి అతి సంకీర్ణమైన స్థూలజగత్తు యావత్తు పరిణామం చెందింది. ఒకే ఒక జీవకణం కలిగిన ప్రాణినుంచి మానవునితోసహా సర్వ జీవరాశి రూపొందింది. ఈ పరిణామం ఇంకా అనంతముఖాలుగా, అశేషరూపాలలో కొనసాగుతూనేవున్నది.

అయినప్పుడు, కొన్నివేల సంవత్సరాల నాటి విశ్వాసాలను శాశ్వతసత్యాలుగా పట్టుకొని ప్రాకులాడ్డం అవివేకం కాదా? మనపూర్వులు తమ పరిమిత విజ్ఞానం ఆధారంగా తమ విశ్వాసాలను సృజించుకున్నారు. వాటిని ఈ నాటి

వైజ్ఞానికశాస్త్రాలు అజ్ఞానజనితాలుగా నిరూపించాయి. అందువల్ల, ఆ పాతవిశ్వాసాలను ఒక పక్కకునెట్టి, ఈనాటి శాస్త్రీయవిజ్ఞానానికి తగు కొత్తవిశ్వాసాలను మనం సృజించుకోవాలి. కేవలం తాను, తన భూమి సర్వసృష్టికి కేంద్రమన్న విశ్వాసాన్ని విడనాడి, - ఒక నూతనదృక్పథాన్ని మానవుడు పెంపొందించుకోవాలి. వైజ్ఞానికశాస్త్రాల విస్తరణపై ఆధారపడిన నవ మతాన్ని, నూతన వేదాన్ని సృజించుకొని, వాటితోపాటు తాను సయితం పురోగమించాలి.

[ఫిబ్రవరి 18, 1968]

"అసత్యాగ్రహం"

చట్టానికి చుట్టాలు లేరు, పక్కాలు లేరు, చుక్కలనుంచి దిగివచ్చిన వారు లేరు. ఎవరైనాసరే చట్టాన్ని ధిక్కరిస్తే, శిక్షార్హులౌతారు. ఇందుకు భిన్నంగా జరిగితే అది చట్టంకాదన్నమాట; ఆ సంఘంలో న్యాయం, ధర్మం లేవన్నమాట.

అయినా చట్టాన్ని ధిక్కరించిన నలుగురు యం. పి. లను అరెస్టు చేసినందుకు లోకసభలో నిన్న (సోమవారంనాడు) అలజడి పెద్దగా ఎందుకు చెలరేగిందో మాకు తెలియడంలేదు. "సిగ్గు ! సిగ్గు !" అని ప్రతిపక్షాలవారు ఎందుకు కేకలు వేయవలసివచ్చిందో, వాయిదా తీర్మానాలకై ఎందుకు నోటీసు లివ్వవలసి వచ్చిందో అంతకంటె తెలియడంలేదు.

రాణా ఆఫ్ కచ్‌లో (కచ్ జాడువలో) ప్రవేశించరాదన్న ఉత్తరువును నిర్లక్షం చేయడంద్వారా నలుగురు పార్లమెంట్ సభ్యులు చట్టాన్ని ధిక్కరించారు. వారు ప్రతిపక్షాలలో ప్రముఖనాయకులే కావచ్చు; శ్రీ హేమ్ బరూవా, శ్రీ జగన్నాథరావు, శ్రీ మధులిమాయె. శ్రీ నాథ్‌పాయ్‌లను పోలిన హేమాహేమీలే కావచ్చు. అయినా, చట్టాన్ని ధిక్కరించినవారిని అరెస్టుచేసినందుకు ఎందుకు "సిగ్గు" పడాలి, ఎవరు "సిగ్గు" పడాలి?

కచ్ విషయమై అంతర్జాతీయ మధ్యవర్తిసంఘం చెప్పిన తీర్పును అమలు పరచడానికి ప్రభుత్వం చేసిన నిర్ణయం తమకు సమ్మతికరం కాకపోతే, ప్రతిపక్షనాయకుల కర్తవ్యం పార్లమెంటులో ప్రభుత్వాన్ని అభిశంసిస్తూ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టడం, లేదా పార్లమెంటరీ పద్ధతులకు అనుగుణమైన పద్ధతులలో ఇతరవిధాలైన ఆందోళన కొనసాగించడం. అయినా, పార్లమెంట్ సభ్యులైనవారే, శాసన నిర్మాతలే, శాసనధిక్కారానికి దిగడం ఎంతవరకు సమంజసం? శాసననిర్మాతలే ఈ పని చేస్తే, వారు చేస్తున్న శాసనాలపట్ల పౌరులకు ఏపాటి గౌరవం మిగులుతుంది, వారిపట్ల ఏ పాటి గౌరవం మిగులుతుంది?

బ్రిటిష్‌వారి పరిపాలనాకాలంలో శాసనోల్లంఘనలు జరిగినవంటే, ఆనాటి పరిస్థితులువేరు. అవి మనం నిర్మించిన శాసనాలు కావు, పర ప్రభుత్వం నిర్మించినట్టివి. అప్పటిలో మనం కోరుతూవచ్చింది శాసననిర్మాణాధికారంమనకే కావలెనని. ఇందువల్ల అప్పటిలో పరప్రభుత్వశాసనాల ధిక్కారం ప్రతి దేశ భక్తునికి, ప్రతి జాతీయవాదికి, ప్రతి స్వాతంత్ర్యప్రియునికి పరమధర్మమైంది.

ఇప్పటి శాసనాలు మనవే; వాటిని నిర్మించుకొన్నదికూడా మనమే. అయినప్పుడు, పాతకాలం ఆందోళనాపద్ధతులు ఇప్పుడు తగునా? అయినదానికీ, కానిదానికీ సత్యాగ్రహాలను ప్రారంభించడం, శాసనాలను ధిక్కరించడం భావ్యమా?

పైగా, సత్యాగ్రహాలు దురాగ్రహాల రూపాన్ని ధరించడం సర్వసామాన్యమైన పిదప, దౌర్జన్యకృత్యాలుగా, దహనకాండలుగా, చివరికి దోపిడీలుగా అవి ఇట్టే మారిపోతున్నపిమ్మట, సత్యాగ్రహాలప్రారంభం విజ్ఞత కాగలదా? సత్యాగ్రహపద్ధతులనే, వాటిని రూపొందించిన గాంధినే ఇది చులకనచేయడం కాదా?

ముఖ్యంగా ఈ కచ్ సత్యాగ్రహం ఎంతమాత్రం తగదని మా నిశ్చితాభిప్రాయం. గాంధి ఈనాడు జీవించివుంటే, ఆయన దీన్ని తీవ్రంగా ఖండించివుండేవాడు.

"పరమేశ్వరుడంటే సత్యం" అనే తన నిర్వచనాన్ని తర్వాత తర్వాత ''సత్యమే పరమేశ్వరుడు" అని గాంధి సవరించుకొన్నాడు. సత్యమే ఆయన దృష్టిలో పరమేశ్వరుడు కనుకనే తాను రూపొందించిన ప్రజోద్యమానికి ఆయన "సత్యాగ్రహం" అని నామకరణంచేశాడు.

ప్రస్తుతం ఈ కచ్‌సమస్య విషయంలో అంతర్జాతీయసంఘం తీర్పును విధిగా అమలు జరుపగలమని మన ప్రభుత్వం ముందుగానే వాగ్దానం చేసింది. అయినప్పుడు, ఆ సంఘం చెప్పిన తీర్పు మంచిచెడ్డలతో ఎంతమాత్రం నిమిత్తం లేకుండా, దాన్ని మనం పాటించవలదా? అయినా, దాన్ని పాటించరాదని చెప్పడానికి ప్రతిపక్షాలు సత్యాగ్రహాన్ని ప్రారంభిస్తే, దాన్ని "అసత్యాగ్రహం''గా పేర్కొనడం అనుచితం కాగలదా?

[ఏప్రిల్ 24, 1968]

మొహెంజొదారో

బుద్ధుడు కేవలం ఇండియాకు, సోక్రటీస్ గ్రీసుకు, ఏసు క్రీస్తు ఇజ్రాయెల్‌కు, మహమ్మద్ అరేబియాకు, లియొనార్డో డ విన్‌ఛి ఇటలీకి, షేక్స్పియర్ ఇంగ్లండుకు, వాల్టేర్ ఫ్రాన్సుకు, గొథే జర్మనీకి, టాల్‌స్టాయ్ రష్యాకు చెందరు. తమ మాతృదేశం ఏదైనా, వీరు ప్రపంచమహాపురుషులు.

ఇదే విధంగా ప్రపంచ చారిత్రకస్థలాలుగా, కళాక్షేత్రాలుగా, యాత్రా కేంద్రాలుగా పరిగణించదగినవి కొన్ని వున్నాయి. వాటి కోవకు చెందినదే మొహెంజొదారో.

హరప్పతోపాటు మొహెంజొదారో సింధులోయలో అతిప్రాచీనకాలంలో విలసిల్లిన ఒక మహానగరం. విస్మృతిగర్భంలో పడిపోయిన ఆ రెండు మహా నగరాలను 1921 తర్వాత సర్ జాన్ మార్షల్, ఆయన సహచరులు తిరిగి వెలుగులోకి తెచ్చారు. వారి కృషి ఫలితంగా భారతదేశచరిత్ర రెండు వేల సంవత్సరాలకుపైగా వెనుకకు జరిగింది.

హరప్ప, మొహెంజొదారోలు బయటపడ్డానికి ముందు భారతదేశ చరిత్రలో అతిప్రాచీనమైనది వేదఘట్టమే. ఆ ఘట్టంతోనే, భారతదేశానికి ఆర్యుల రాకతోనే, భారతచరిత్ర, ముఖ్యంగా భారత నాగరికతచరిత్ర, ప్రారంభమైనట్టు అంతకుముందు విశ్వసించేవారు. ఇది సరైన విశ్వాసం కాదని, ఆర్యుల రాకకు కనీసం రెండువేల సంవత్సరాలకు పూర్వమే ఇక్కడ ఒక గొప్ప నాగరికత పరిఢవిల్లిందని, ఈ నాగరికతకు చెందినవారితో పోల్చినప్పుడు ఆర్యులు అనాగరికులని హరప్ప, మొహెంజొదారోలు నిరూపించాయి.

వాటిలో మొహెంజొదారో ఒక చారిత్రక కేంద్రంగా మరెంత కాలమో మిగలగలదన్న భయం ఇప్పుడు కలుగుతున్నదట. చవుడు పుట్టి, అక్కడి

కట్టడాల గోడలు కూలిపోతున్నవట. వెంటనే చర్య గైకొనకపోతే, మొత్తం కేంద్రానికే ముప్పు వాటిల్లవచ్చునట.

ఈ ప్రమాదంనుంచి మొహెంజొదారోను తప్పించడానికి తనకు తగినంత ఆర్థికస్తోమత లేదని భావిస్తున్న పాకిస్తాన్ ప్రభుత్వం యునెస్కో సహాయాన్ని కొంతకాలంగా అభ్యర్థిస్తున్నదట. పరిస్థితిని పరిశీలించవలసిందిగా ఇదివరలో కొందరు ప్రత్యేక నిపుణులు పంపిన ఆ ప్రపంచసంస్థ త్వరలో మరికొందరు ప్రవీణులను పంపించనున్నదట.

కనీసం ఈసారి తన ప్రవీణులనివేదిక తన చేతికి వచ్చినతర్వాతనైనా, మొహెంజొదారో పరిరక్షణకు యునెస్కో పెద్దయెత్తున ప్రయత్నం చేయాలి. అస్వాన్ ఆనకట్ట కారణంగా నీటిలో మునిగిపోవలసిన అబూ సింబెల్ గుహాలయాల రక్షణ యునెస్కో సహాయంతోనే జరిగింది. అందుకు వెచ్చించినదానిలో ఒక వీసమైనా మొహెంజొదారో సముద్ధరణకు బహుశా సరిపోతుంది.

అయితే, చవుడునుంచి మొహెంజొదారోను కాపాడి అంతటితో సరిపుచ్చరాదు. అక్కడ జరగవలసిన త్రవ్వకాలు పూర్తిగా జరగనే లేదు. మొహెంజొదారో నగరంమధ్య ఒక పెద్ద దిబ్బపై ఒక ప్రాచీన బౌద్ధస్తూపం వున్నది. స్తూపాన్ని కదిలించవలసి వస్తుందన్న సంకోచంతో ఆ దిబ్బను త్రవ్వకుండా ఇదివరలో విడిచిపెట్టారు; ఇప్పుడేమో డబ్బులేదని విడిచిపెడుతున్నారు. ఇదే కాక, మొహెంజొదారో త్రవ్వి చూడవలసిన ప్రాంతాలు మరి కొన్ని వున్నాయి. పాక్షికంగానే త్రవ్వకాలు జరిగినా, సమకాలిక ప్రపంచంలో మొహెంజొదారో సాటిలేని మహానగరమని స్పష్టపడింది. త్రవ్వకాలు పూర్తిగా జరిగితే, మరెన్ని విశేషాలైనా బయటపడవచ్చు. మొహెంజొదారో ఈనాడు పాకిస్తాన్ సరిహద్దులలో వున్నా, పాక్ ప్రభుత్వంతో సమానంగా దాని పరిరక్షణవిషయమై మనం తాపత్రయపడాలి. యునెస్కోద్వారా మొత్తం ప్రపంచంనుంచి ఈ పరిరక్షణ కృషికి సహాయ సహకారాలను సంపాదించడంవిషయమై పాకిస్తాన్ పౌరులతో సమానంగా మనం సయితం సర్వవిధాల ప్రయత్నించాలి.

[మే 29, 1968]

జాతీయ విద్యావిధానం

నిన్ననో, మొన్ననో కాదు; పది, పదిహేను సంవత్సరాలనాడైనా కాదు; 1918లో లాలా లజపత్‌రాయ్ భారత జాతీయ విద్యావిధాన సమస్యను గురించి ఒక పుస్తకాన్ని వ్రాశాడు. దాని పేరు "ది ప్రాబ్లెమ్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా" అర్ధశతాబ్ది తర్వాతకూడా అది పాతగిలలేదు సరిగదా, నేటి మన విద్యాసమస్యలనుగురించి నేడు వెలువడిన గ్రంథంవలె అది భాసిస్తున్నది.

ఇందుకు రెండు కారణాలను మనం చెప్పుకోవచ్చు. ఒకటి, – లాలాజీ దూరదృష్టి. రెండు, – మన విద్యావిధానాన్ని మనమే నిర్ణయించుకొనగల స్వాతంత్ర్యాన్ని 1947 లో మనం పొందినా, ఈ నాటికికూడా సరైన విధానాన్ని రూపొందించుకొనడంలో మన వైఫల్యం. కమిషన్‌ల, కమిటీల నియామకం జరుగుతున్నది; అవి నివేదికలను సమర్పిస్తున్నాయి; ఒక్కొక్క నివేదిక తర్వాత ఏవో కొన్ని మార్పులను ప్రవేశపెడుతున్నారు; తరచుగా ప్రవేశపెడు తున్న ఈ మార్పులవల్ల చిక్కులు, చికాకులు పెరగడం తప్ప, అన్యప్రయోజనం అంతగా కానరావడంలేదు. చిల్లులుపడుతున్న వోటిపాత్రకు మాటిమాటికి మాట్లు వేయడం పద్ధతిలోనే మనం వ్యవహరిస్తున్నాము. ఇంతే తప్ప, ఈ నూతన యుగానికి, దీని నూతనావసరాలకు తగినట్టి ఒక నూతన విధానాన్ని నిర్ణయించు కొనడానికి, దాన్ని సమర్థంగా అమలుపరచడానికి ప్రయత్నించడం లేదు.

పెక్కేండ్లుగా అచ్చులో లేని లాలాజీ పుస్తకం భారతప్రభుత్వానికి చెందిన పబ్లికేషన్ డివిజన్‌వారి పుణ్యమా అని పునర్ముద్రణ పొందింది. దాన్ని చదివితే, వెనుకకు తప్ప ముందుకు చూడలేని ప్రబుద్ధుల మాట చెప్పలేముగాని, తక్కినవారందరు మన ప్రస్తుత విద్యావిధానం ప్రాతిపదికలలోనే ఎన్ని లోపా లున్నవో స్పష్టంగా గ్రహించగలుగుతారు.

రాజ్యాంగవిధానం అమలులోకి వచ్చిన తర్వాత పదేళ్లలోపల దేశంలోని ప్రతిబాలునికి, ప్రతిబాలికకు ఉచితంగానే కాక, విధిగా విద్యను గరపడానికి తగు చర్యలను తీసుకోవాలని మన రాజ్యాంగచట్టం నిర్దేశిస్తున్నది. ఈ విషయంతో మన వైఫల్యం కారణంగానే మన విద్యావిధానం విఫలం చెందలేదు; వైజ్ఞానిక సాంకేతిక, వృత్తి విద్యావిధానాలను పెంపొందించడంలో రాజ్యాంగచట్టం నిర్దేశాలను పూర్తిగా పాటించకపోయినందువల్లనైనా అది విఫలం చెందలేదు; నవయుగానికి తగు నవదృక్పథాన్ని పెంపొందించలేక పోవడంలోనే అది ప్రధానంగా విఫలంచెందింది. కాలం ముందుకు నడుస్తుంది, వెనుకకు కాదు. ఒక మనిషి కానివ్వండి, ఒక జాతి కానివ్వండి, కాలంతోపాటు పురోగమించా లంటే నడవవలసింది ముందుకు గాని, వెనుకకు కాదు. ముందుకు నడవాలంటే ముందుకే చూడాలి, ముందుకే అడుగువేయాలి. దీన్ని మనకు అలవరచ గలిగిందే లాలాజీ దృష్టిలో ఉత్తమమైన జాతీయ విద్యావిధానం.

ఒకనాడు మన దేశం, మన జాతి, ఎంతగానో శోభించినమాట నిజమే. ఈ విషయాన్ని గుర్తించడంలో లాలాజీ ఎవ్వరికీ వెనుదీయడు. కాని, ఇటీవల మనం వెనుకబడిపోగా, తక్కిన ప్రపంచం ముందుకు వెళ్ళలేదా ? ముఖ్యంగా వైజ్ఞానిక, సాంకేతిక రంగాలలో అది ఎంతగానో పురోభివృద్ధిని సాధించలేదా ? ఈ రంగాలలో పురోభివృద్ధికారణంగా ప్రపంచస్వరూపమే చాలా మారిపోలేదా ? "నన్ను ముట్టుకోకు, నా మాలకాకి !" అనే ధోరణిలో ఏ దేశమూ, ఏ జాతీ మరి బ్రతుకలేని పరిస్థితులు ఏర్పడలేదా? కలిసి బ్రతకలేకపోతే, కలిసి కాటిలో కలవవలసిన స్థితికి మానవసంఘం రాలేదా! ఈ ప్రశ్నలు మేము వేస్తున్నవి కావు; అర్ధశతాబ్దినాడు లాలాజీ వీటిని స్వయంగా వేశాడు. ప్రథమ ప్రపంచయుద్ధం తుదిఘట్టాలలో తన గ్రంథరచనను ప్రారంభించిన లాలాజీ "ఈ ప్రపంచయుద్ధం తర్వాత కాకపోతే, మరొక యుద్ధంతర్వాతనైనా" అంతర్జాతీయతకు ప్రాధాన్యమివ్వకపోతే, మానవజాతికి స్వరూపనాశన ప్రమాదం కలదని హెచ్చరించాడంటే, ఆయన ఎంతటి దూరదృష్టిగలవాడో మనం ఊహించుకోవచ్చు.

ఇంతటి దూరదృష్టిగల నాయకుడైనందుననే లాలాజీ ఒక జాతిగా మన చిత్తవృత్తిని మార్చడమే, ఒక సంఘంగా మన విశ్వాసాలను మార్చడమే, ఒక

దేశంగా మన ఆచారవ్యవహారాలను మార్చడమే మన విద్యావిధానం పరమలక్ష్యం కావాలని ఉద్ఘాటించాడు.

విజాతీయ ప్రభావాలు నానాటికి పెరుగుతున్నవని, జాతీయత మంటగలిసి పోతున్నదని వాపోతున్నవారు లాలాజీ వ్రాసిన ఈ క్రింది వాక్యాలను శ్రద్ధగా మననంచేయాలి: "ప్రాచీనమైన ప్రతిదీ ప్రశస్తమైనదని మనం తీర్మానించుకొనలేము. మన పూర్వీకులభావాలలో కొన్ని పూర్తిగా భ్రమాజనితమైనవని రుజువు అయింది; వాటిని మనం మార్చుకోవాలి. వారి పద్ధతులు కొన్ని అనుచితమైనవని తేలింది; వాటిని మనం చక్కదిద్దుకోవాలి. వారి వ్యవస్థలలో కొన్ని వారి కాలానికి, నాటి పరిస్థితులకు అనుగుణంగా వున్నా, ఇప్పుడు పనికిమాలినవని స్పష్టపడింది; వాటి స్థానంలో కొత్త వ్యవస్థలను మనం నిర్మించుకోవాలి. వారికి కేవలం నకళ్ళు కావాలని మనం కోరడం లేదు; వారికంటె ఉత్తమస్థితిలో వుండాలనేదే మన వాంఛ."

ఈ వాంఛ నెరవేరా లంటే, మన ప్రమాణాలనే, మన లక్ష్యాలనే పునః పరిశీలన చేసుకోవాలని, ఇందుకు మగటిమి ("మ్యాన్లీనెస్") కావాలని లాలాజీ పలుకుతున్నాడు. ఈ జగత్తు మాయ అనే విశ్వాసం పోవాలని ఆయన సూచిస్తున్నాడు. "ఎవరి ప్రారబ్ధాన్ని వారు అనుభవించక తప్ప"దన్న గుడ్డినమ్మకం తొలగిపోవాలని ఆయన ఉద్ఘోషిస్తున్నాడు. ఆర్యఋషులు ఎంతటి జ్ఞానులైనా కడచిన మూడువేల సంవత్సరాలలో ప్రపంచం ఎంతగానో పురోగమించినదన్న విషయాన్ని గుర్తించాలని ఆయన నొక్కిచెబుతున్నాడు. ఋషులు చెప్పినదే సత్యమని నమ్మి, వారి మాటనే పట్టుకుని వ్రేలాడితే మనకు అధోగతి తప్పదని ఆయన హెచ్చరిస్తున్నాడు.

ఇంతతో ఆగక మరింత ముందుకు వెళ్ళి, "అర్థశాస్త్రం", దాని రచన జరిగిన కాలానికి, ఉత్తమమైన రాజనీతిశాస్త్రం కావచ్చు గాని, ఈ నాడు కూడా అది ఉత్తమ రాజనీతిశాస్త్రమా అని లాలాజీ అడుగుతున్నాడు. "లీలావతి", అది వెలువడిన కాలానికి, ప్రథమశ్రేణి గణితశాస్త్రగ్రంథం కావచ్చు గాని, ఈ నాడు కూడా గణితశాస్త్రం ఆ స్థాయిలోనే మిగిలిందా అని లాలాజీ ప్రశ్ని-

స్తున్నాడు. ఇదే విధంగా ఆయుర్వేదం, యునానీలు ఒకనాడు ఎంతటి ఉపయోగకరమైన వైద్యవిధానాలైనా, పాశ్చాత్య విధానాన్ని త్రోసిపుచ్చడం విజ్ఞత కాగలదా అని లాలాజీ నిగ్గదీస్తున్నాడు. మను, నారద, గౌతమ, ఆపస్తంబాది ధర్మశాస్త్రాలను పట్టుకొని ఈనాడు మనం వ్రేలాడగలమా అని కూడా లాలాజీ పృచ్ఛిస్తున్నాడు.

ఈ ప్రశ్నలను వేయడంలో లాలాజీ ఉద్దేశం- ఒక నూతన చిత్తవృత్తిని, దానితోపాటు నూతన విశ్వాసాలను, నూతనమైన జీవితపు విలువలను మనకు ప్రసాదించగలిగిందే ఉత్తమమైన జాతీయ విద్యావిధానం కాగలదని నచ్చజెప్పడమే! కాని, మన ప్రస్తుత విద్యావిధానం ఈ విషయాలను ఎంతవరకు గుర్తిస్తున్నది, ఎంతవరకు గౌరవిస్తున్నది? మన మతమౌఢ్యాలను త్రుంచడానికి బదులుగా వాటిని అది బలపరచడంలేదా? మనకు నవదృక్పథాన్ని కలిగించడానికి మారుగా, పూర్వాచారపరాయణత్వాన్ని అది సమర్థించడంలేదా? పుక్కిటి పురాణాలను చారిత్రకసత్యాలుగా మన్ననచేయని పాఠ్యగ్రంథాలు నేడు మనకు ఎన్ని వున్నాయి? అణుశాస్త్రంలో వేదఋషులు ప్రత్యేకప్రవీణులన్న వెర్రిమొర్రి వాదాన్ని విని, ముక్కుపై వేలువేసుకొంటున్నవారు మన ఆచార్యవర్యులలో ఈనాడు ఎందరున్నారు?

ఆర్యసమాజం నాయకులలో లాలాజీ ఒక ప్రముఖుడు. ఆర్య సమాజికులకు వేదాలపైన, సంస్కృతభాషపైన గౌరవాభిమానాలు విశేషంగా వుంటాయి. అయినా, యుగధర్మాన్ని గుర్తించగల మహామహుడైనందున లాలాజీ సంస్కృతాన్ని బోధనాభాషగా చేయడంకంటె పిచ్చిపని వుండబోదని హెచ్చరించాడు. ఇంతే కాదు. భాషాపాండిత్యాన్ని అభిలషించేవారికి తప్ప, చారిత్రక పరిశోధనచేయగోరే వారికి తప్ప, సంస్కృతాన్ని బోధించరాదని ఆయన హెచ్చరించాడు. సంస్కృతంతో పోల్చినప్పుడు అరబిక్, పారశీక భాషలు ఎక్కువ ప్రయోజనకరమైనవని హెచ్చరించాడు. యూరప్‌లో గ్రీక్, లాటిన్ భాషలకున్న స్థానాన్ని మించింది మన దేశంలో సంస్కృతానికి ఈనాడు

లేదని, అంతకుమించి దానికి ప్రాధాన్య మివ్వరాదని హెచ్చరించాడు. అయినా, ఈ విషయాలను మన విద్యావేత్తలు ఎంతవరకు గుర్తిస్తున్నారు, ఏ మేరకు వీటిని గౌరవిస్తున్నారు?

లాలాజీ పుస్తకం పునర్ముద్రణకు పీఠిక వ్రాస్తూ రాష్ట్రపతి జాకిర్ హుస్సేన్ వివరించినట్టు, మన దేశం భవిష్యత్తుపట్ల శ్రద్ధాసక్తులున్నవా రందరు విధిగా చదవవలసిన గ్రంథ మిది. తక్కినవారికంటె ముఖ్యంగా మన విద్యా మంత్రులు, విద్యాశాఖాధికారులు విధిగా మననం చేయవలసిన పుస్తక మిది.

[జులై 9, 1968]

ఇరవయ్యో శతాబ్దిలో నరబలి

మనది నాగరిక దేశమేనా? మనం జీవిస్తున్నది ఇరవయ్యో శతాబ్ది లోనా? — ఇటీవల దేశంలో జరుగుతున్న కొన్ని అమానుష సంఘటనలతర్వాత ఇట్టిప్రశ్నలను పదేపదే వేసుకొనవలసివస్తున్నది.

ఇట్టి సంఘటనలలో సరికొత్తదే రాజస్థాన్‌లో నరబలి. ఏదో ఒక చెరువు త్రవ్వకాన్ని ప్రారంభించడానికి ముందుగా ఒక కంట్రాక్టరు పన్నెండు సంవత్సరాల బాలుని బలిగా నరకడమో, నరికించడమో జరిగింది.

మతంపేర, ఆచారంపేర ఒక జంతువును బలిచేయడమే సంస్కారులైనవారు, నాగరికులైనవారు ఏవగించుకొనవలసిన చర్య. అయినప్పుడు, నరబలి ఎంత విపరీతం, ఎంతటి ఘోరం, ఎంతగా జుగుప్సాకరం!

ఇట్టి దారుణ సంఘటనలతర్వాత మహావీరుడు మా వాడని, గౌతమ బుద్ధుడు మా వాడని, మోహన్‌దాస్ కరంచంద్ గాంధి మా వాడని చెప్పుకొనడానికి ఒక జాతిగా మనం సిగ్గుపడవలదా? ఇంతే కాదు. ఇట్టి కర్కోటక సంఘటనలతర్వాత గాంధి శతజయంతి మనం జరుపుకొనడానికి కాని, దాన్ని జరపవలసిందిగా ప్రపంచాన్ని కోరడానికి కాని, మనకు ఎంతవరకు అర్హతగలదన్న ప్రశ్న వేసుకోవలదా?

ఇవి చెదురుమదురు సంఘటనలని మాకు తెలుసు. నూటికి 99.9 మంది వీటిని నిరసిస్తున్నారని కూడా మాకు తెలుసు. అయినా, ఒక జాతిగా మన దృక్పథంలో, మన విశ్వాసాలలో మన జీవితవిధానంలో ఏదో లోపం లేకపోతే, ఎక్కడనో దౌర్బల్యం లేకపోతే, ఏ మూలనో కొంత కర్కశత్వం దాగి వుండకపోతే, చెదురు మదురుగానైనా ఇట్టి సంఘటనలు నేటికీ జరగగలవా? ఈ విషయమై మనం ఆత్మసంశోధన చేసుకోవలసిన అగత్యం లేదా?

జరిగిన నరబలికంటె కూడా మరింత హేయమైన విషయం, దానినుంచి రాజకీయ ప్రయోజనాన్ని సాధించడానికై కొందరు ప్రయత్నించడం ! అయినా, ప్రస్తుతం ఇదే జరుగుతున్నది. నరబలికి పాల్పడిన కంట్రాక్టరు ఇదివరలో కాంగ్రెసువారికి ధారాళంగా విరాళాలిచ్చి వున్నందున అతడిని కాపాడ్డానికి కాంగ్రెసు మంత్రులు ప్రయత్నం చేస్తున్నారని ప్రతిపక్షాలకు చెందినవారు ఆరోపిస్తున్నారు.

కాంగ్రెసు మంత్రులపట్ల మాకు ప్రత్యేకాభిమానం లేదు. వారిలో కొందరి ప్రవర్తన మా దృష్టిలో అతి నికృష్టం. అయినా, కాంగ్రెసు మంత్రులు నరబలిని కప్పిపుచ్చడానికి సిద్ధపడే స్థితికి దిగజారినారంటే మేము నమ్మలేకున్నాము. పైగా, ప్రధాని ఇందిరా గాంధి ఈ ఘోరకృత్యానికి పాల్పడినవారిని నిర్దాక్షిణ్యంగా శిక్షింపజేయాలని ప్రకటన చేసినతర్వాతకూడా ప్రతిపక్షాలవారు తమ ఆరోపణలను చేయడం శోచనీయం.

కాగా, ఈ రాజస్థాన్ సంఘటన, ఇట్టి అమానుషచర్యలలో చిట్టచివరిది కాకపోతే, ఒక నాగరికదేశంగా ఇప్పటికే దెబ్బతిన్న మన ప్రతిష్ఠ మరింత నీరసించిపోతుంది; ప్రగతిశీలశక్తులు, వాటితోపాటు మానవతావాదం మన దేశంలో, పెరగడానికి మారుగా, శుష్కించిపోవడం తటస్థిస్తుంది.

[సెప్టెంబర్ 19, 1968]

మద్యనిషేధం

సంపూర్ణ మద్యనిషేధం గొప్ప ఆదర్శమే కావచ్చు. అయినా ఒక్క శాసనంతో, ఒక్క కలంగీటుతో, దాన్ని అమలుపరచడం సాధ్యమా? శ్రీ మురార్జీ దేశాయి, డాక్టర్ సుశీలానయ్యార్ వంటివారు ఈవాస్తవాన్ని ఎందుకు గుర్తించలేకపోతున్నారు ?

వీరు మొత్తం దేశంలో మద్యనిషేధాన్ని విధించాలనే కాదు, దాని కొక గడువును కూడా తక్షణం నిర్ణయించాలని కోరుతున్నారు. వీరి దృష్టిలో ఇందుకు తగిన గడువు గాంధి శతజయంతి దినమైన 1969 అక్టోబరు రెండవ తేదీ.

గాంధి తన జీవితకాలంలో అనేక సాంఘిక దురాచారాలను తీవ్రంగా ప్రతిఘటించిన వ్యక్తి. మద్యపాన వ్యసనాన్ని నిర్మూలించడానికి ఆయన ఎంతో దీక్షగా కృషిచేశాడు. ఆయన నాయకత్వాన కల్లుదుకాణాల పికెటింగ్ దేశ స్వాతంత్రోద్యమంలో ఒక ముఖ్యభాగమైంది. అందుచేత ఆయన శతజయంతి నాటికి సంపూర్ణ మద్యనిషేధాన్ని అమలుపరచడం ఎంతైనా సముచితంకాగలదని డాక్టర్ సుశీలా నయ్యార్‌వంటివారి భావన కావచ్చు; గాంధిశతజయంతి పేరు తెచ్చినమీదట కాంగ్రెసుసంస్థ తమ ప్రతిపాదనను మరి కాదనలేదని వారి ఆలోచన కావచ్చు.

మంచిదే! కాని, ప్రస్తుతం దేశంలో మద్యనిషేధం పాక్షికంగా అమలులోనే వున్నది. ఇరవైయేళ్లకుపైగా దాదాపు అన్నిరాష్ట్రాలలో అమలులో వున్నది. అయినా! అది జయప్రదంగా అమలు జరిగినట్టు ఎక్కడా దాఖలా లేదు. ఇంతే కాక, అది పూర్తిగా విఫలమైనట్టు ప్రత్యక్షంగా కనబడుతున్నది. పాక్షిక నిషేధమే విఫలమైనప్పుడు సంపూర్ణనిషేధం సఫలం కాగలదా ?

మద్యనిషేధం విఫలం కావడానికి కారకు లెవరు? కారణా లేమిటి? ఈ ప్రశ్నలకు సమాధానం—కాంగ్రెసు ప్రభుత్వాలలో, వాటి అధికారులలో చిత్తశుద్ధి లోపించడమే. నిషేధాన్ని ప్రారంభించడం ఎంత చిత్తశుద్ధితో నైనా జరిగి వుండవచ్చుగాని, కొద్దినాళ్ళలోనే ఆ చిత్తశుద్ధిక చెదలు పట్టింది.

మద్యనిషేధంవల్ల ఎక్సయిజు సుంకంద్వారా ప్రభుత్వాలకు వచ్చే రాబడి పోయింది. నిషేధపుచట్టాన్ని అమలుచేయడానికి ఏర్పడిన విస్తృతయంత్రాంగం కింద అపారమైన ఖర్చు అదనంగా తగిలింది. ఈ రెండు విధాలా ప్రభుత్వ కోశాగారాలు విశేషంగా నష్టపడ్డాయి.

ధననష్టం మాత్రమే అయితే, పోనీ అనుకోవచ్చు; మద్యనిషేధం కారణంగా సంభవించిన పరోక్షదుష్ఫలితం—ప్రభుత్వ శాసనాలపట్ల ప్రజలలో తృణీకారప్రభావం పెరగడం; తమ శాసనాన్ని అమలు చేయవలెలన్న చిత్తశుద్ధి ప్రభుత్వాలకే లేనప్పుడు ప్రజల కెక్కడినుంచి వస్తుంది? ఈ ఒక్క చట్టంద్వారా మొత్తం చట్టాలనే ధిక్కరించే మనస్తత్వం ప్రజలలో పెచ్చు పెరిగింది.

మద్యనిషేధశాఖలు అవినీతికి నిలయాలుగా తయారైనాయి. పైనుంచి కిందివరకు వాటిలో లంచగొండితనం సర్వసామాన్యమై పోయింది. అధికార వర్గానికి లంచాల రూపంలోను, కల్లు వ్యాపారస్తులకు దొంగ సారాబట్టీల రూపంలోను లాభాలు సమకూర్చిపెట్టడానికే మద్యనిషేధం ఉపకరిస్తున్నది.

ఇంతే కాక, నిషిద్ధవస్తువుపట్ల ఎక్కడైనా, ఎప్పుడైనా ఆకర్షణ పెరుగుతుంది. పూర్వం ఏ కొద్దిమందో చాటుమాటుగా కల్లుపాకలకు, సారాదుకాణాలకు పోయి త్రాగివచ్చేవారు. వారిలో అందరికి కాక పోయినా, హెచ్చుమందికి తమ ఇరుగు పొరుగువారు ఏమనుకొంటారో అని బిడియమైనా వుండేది.

నిషేధంతర్వాత ఈ బిడియం మటుమాయమైంది. పూర్వంకంటె అధిక సంఖ్యాకులు నిషిద్ధపానీయాలకు ఈ నాడు అలవాటు పడ్డారు. చాటుమాటుగా కాక, బహిరంగంగానే ఈ వ్యసనానికి వారు దాసు లయ్యారు. సరైన పద్ధతులలో తయారైన మద్యాన్ని కాక, హానికరమైన పద్ధతులలో తయారైన విషపానీయా

లను సేవించి, ఆరోగ్యానికి, ప్రాణాలకు కూడా ముప్పు తెచ్చుకొంటున్నారు. ఈ విషయాలు డాక్టర్ నయ్యర్‌వంటి ఆదర్శవాదులకు తెలియవని అనగలమా? అయినా, వారికి ఆదర్శంమీదనే ఎందుకు మోజు?

మద్యనిషేధాన్ని కొన్ని కొన్ని రాష్ట్రాలు ప్రవేశపెట్టిన కొత్త రోజులలోనే మరి కొన్ని రాష్ట్రాలు దాన్ని వ్యతిరేకించాయి. అప్పటిలో అవి అన్నీ కాంగ్రెసు రాష్ట్రాలే. ఆ తర్వాత తమ వైఫల్యాన్ని గుర్తించి, మొట్టమొదటగా నిషేధాన్ని ప్రవేశపెట్టిన రాష్ట్రాలు కూడా కొన్ని దాన్ని రద్దుచేశాయి, లేదా సడలించాయి. వీటిని తిరిగి నిషేధానికి ఒప్పించడం సాధ్యమైనా, ఇప్పుడు కాంగ్రెసేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలు కొన్ని వున్నాయి; ఇంకా ముమ్ముందు మరి కొన్ని రావచ్చు. మద్యనిషేధం రాష్ట్రవిషయమైనప్పుడు అన్నింటిని అందుకు ఒప్పించడం సాధ్యమా?

ప్రస్తుతం పనాజీలో జరుగుతున్న అఖిలభారత కాంగ్రెసుమహాసభనుంచి వస్తున్న వార్తలనుబట్టి సంపూర్ణ మద్యనిషేధంపట్లగాని, దాని కొక గడువును నిర్ణయించడంపట్లగాని కాంగ్రెసు కార్యవర్గంలోనే పెక్కుమంది సుముఖులుగా లేరు. కాంగ్రెసు ముఖ్యమంత్రులు, కాంగ్రెసువాదులు పెక్కుమంది దాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఒక తీర్మానం చేసినంత మాత్రాన వీరందరు సంపూర్ణ మద్య నిషేధానికి అనుకూలురైపోతారా? వీరిని బలవంతాన ఒప్పించినంత మాత్రాన మద్యనిషేధాన్ని చిత్తశుద్ధితో అమలుచేయించడం సాధ్యమా? ఈ ఆదర్శాన్ని పట్టుకొని ప్రేలాడుతున్న కాంగ్రెసులోనే ఏకీభావం లేనప్పుడు, కాంగ్రెసేతర రాజకీయ పక్షాలను, వాటి ప్రభుత్వాలను ఇందుకు ఒప్పించడం సాధ్యమా?

గాంధి ప్రసక్తిని ఈ విషయంలో తీసుకురావడం ఒక ఎత్తుగడ తప్ప మరేమీ కాదు. ఆయన పేరు చెప్పి, వ్యతిరేకులను నిరుత్తరులను చేయగోరడమే ఈ ఎత్తుగడ. మద్యనిషేధ శాసనాలను ఇంకా కొనసాగించడం, లేదా వాటిని దేశవ్యాప్తం చేయబోవడం గాంధిస్మృతిని మనం గౌరవించడం కాదు, అగౌరవించడమే! ఆచరణలో తన ఆదర్శానికి తన అనుయాయులే పట్టించిన దుర్గతిని చూచి, ఆయన ఈనాడు సజీవులై వుంటే, ఈ కల్లబొల్లి చట్టాన్ని తుంగలో తొక్కవలసిందిగా చెప్పివుండేవాడు.

"చిత్తశుద్ధి లేని శివపూజ లేలరా?" అని వేమన అన్నట్టు, అమలు చేయడానికి ఎవరికీ ఆసక్తిలేని మద్యనిషేధాన్ని విస్తృతంచేయడానికి మారుగా దాన్ని ఉపసంహరించడమే ఈనాడు జరగవలసిన పని. దానివల్ల ఉపకారం కంటె అపకారం ఎక్కువగా జరుగుతున్నది. అది అనృతాన్ని పెంచుతున్నది, అక్రమాలకు దారి తీస్తున్నది, అవినీతిని రెచ్చగొడుతున్నది. ఈ యథార్థాన్ని కాంగ్రెసు, దాని ప్రభుత్వాలు గుర్తించలేకపోతే, కొన్ని తరాలవరకు అన్ని నైతికపు విలువులు మన దేశంలో భూస్థాపితం కాగలవు!!

[నవంబర్ 6, 1968]

చరిత్ర, సాహిత్య పరిశోధన

మన భాషకు, మన చరిత్రకు సంబంధించినంతవరకు పరిశోధన చాలా తక్కువ, చరిత్రపరిశోధకుల సంఖ్య చాలా పరిమితం. అన్యదేశాల సంగతి అటుంచి, మన దేశంలోనే అన్యరాష్ట్రాలతో, వాటి భాషలతో పోల్చితే, పరిశోధనారంగంలో, ముఖ్యంగా చరిత్ర, సాహిత్యాల పరిశోధనలో, మన మెంతగా వెనుకబడివున్నామో తెలుస్తుంది. బెంగాలీలో, హిందీ, గుజరాతీ భాషలలో వందలాది పరిశోధకులు అగ్రశ్రేణికి చెందినవా రున్నారు. వీరు తమ తమ భాషాప్రాంతాల రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, సాహిత్యచరిత్రలలో విశేషమైన పరిశోధనలు చేశారు; వందలకొలది ఉద్గ్రంథాలను రచించి, ప్రచు రించారు, ప్రచురిస్తున్నారు. ఈ గ్రంథాలలో అనేకం ఆయా ప్రాంతీయభాషలలోనే కాక, ఇంగ్లీషులో కూడా లభ్యమౌతున్నాయి. ఇందువల్ల ఆయా ప్రాంతాలను గురించి సమగ్రపరిజ్ఞానం అన్యప్రాంతాలవారికి కూడా కలగడానికి అవకాశం లభిస్తున్నది.

తెలుగులో తెలుగుజాతి చరిత్రనుగురించి, దాని సాహిత్య, సాంస్కృతిక చరిత్రలనుగురించి ఎన్నదగు పరిశోధన చేసినవారు పట్టుమని రెండు పదుల వరకైనా వున్నారో, లేదో: ఎన్నిసార్లు చెప్పుకొన్నా కందుకూరి వీరేశలింగం, కొమర్రాజు లక్ష్మణరావు, చిలుకూరి వీరభద్రరావు, వేటూరి ప్రభాకరశాస్త్రి, భావరాజు వెంకట కృష్ణారావు, రాళ్ళబండి సుబ్బారావు, మల్లంపల్లి సోమశేఖర శర్మ, మారేమండ రామారావు, నేలటూరి వెంకటరమణయ్య, నిడుదవోలు వెంకటరావు, రాయప్రోలు సుబ్రహ్మణ్యం, దిగవల్లి శివరావు మొదలైన కొద్ది మంది పేర్లుమాత్రం వినవస్తాయి.

తెలుగుజాతి చరిత్రనుగురించి, సంస్కృతినిగురించి తెలుగువారికి తెలియజెప్పడానికి ఏ కొద్దిగానైనా కృషి జరిగిందేమో కాని, అన్యభాషలవారికి

తెలియజెప్పడానికి ప్రయత్నం దాదాపుగా జరగలేదనే చెప్పాలి. మనలను గురించి మనమే చెప్పుకొనకపోతే, ఇతరులు ఏమి చెప్పుకొంటారు. ? చెప్పుకొనడానికి వారి కేమి తెలుస్తుంది? ఉదాహరణకు, ఇటీవల శ్రీ తారాచంద్ రచించిన "హిస్టరీ ఆఫ్ ఫ్రీడం మూవ్‌మెంట్ ఇన్ ఇండియా" రెండవ సంపుటం వెలువడింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ విషయమై వున్నది రెండే రెండు పేరాలు ! ఆ రెండు పేరాలలో మూడు తప్పులు!! అవి మూడూ పేర్లకు సంబంధించినట్టివే: వీరేశలింగం, కాశీనాథుని నాగేశ్వరరావు, కొమర్రాజు లక్ష్మణరావు: ఇంత సుప్రసిద్ధమైనవి తప్పుల తడకలుగా ముద్రితమైన ఆ పేర్లు!

ఇలాగే అన్యదేశాలలోగాని, మన దేశంలోనే అన్యరాష్ట్రాలలోగాని ఏ సాంఘిక, రాజకీయ, చారిత్రక, సాంస్కృతిక విషయానికి సంబంధించిన ప్రస్తావన వచ్చినా, ఆంధ్రులు అతి ప్రాచీనకాలంనుంచి, ఆధునికకాలంవరకు చేసిన సేవలను పూర్తిగా విస్మరించడమో, నిరాదరించడమో, నూటికో కోటికో వాటిని గుర్తిస్తే, తప్పులు దొర్లడమో జరుగుతున్నది. ఇందుకు పరులను నిందించనక్కర లేదు, మనల్ని మనమే నిందించుకోవాలి.

ఈ పరిశోధనకృషి న్యాయంగా మన విశ్వవిద్యాలయాలు బృహత్తర స్థాయిలో చేపట్టవలసింది. కలకత్తా యూనివర్సిటీ బెంగాలీభాషకు, సాహిత్యానికి, చరిత్రకు, సంస్కృతికి సంబంధించిన గ్రంథాలను వందలాదిగా ప్రచురించింది. అన్నామలై యూనివర్సిటీ ఇటీవలిదైనా తమిళ జీవితానికి, సంస్కృతికి సంబంధించిన పెక్కు గ్రంథాలను ప్రకటించింది. ధార్వార్‌లో కర్నాటక విశ్వవిద్యాలయ స్థాపనజరిగి ఇరవై ఏళ్ళయినా కాలేదు; కర్నాటకప్రాంత చరిత్రకు సంబంధించిన అనేక గ్రంథాలను అది ఈసరికే వెలువరించింది.

మన ఆంధ్రవిశ్వవిద్యాలయం ఈ విషయమై ఏమి చేసింది? నలభైరెండు సంవత్సరాలక్రిందటనే అది స్థాపితమైంది. ఈ దీర్ఘవ్యవధిలో అది ఎంత ఘన కృషినైనా చేసివుండవచ్చు, ఎంత మౌలికపరిశోధననైనా ప్రోత్సహించివుండవచ్చు. కాని, అది ప్రచురించిన చారిత్రకగ్రంథాలు పట్టుమని పదైనా వున్నవో, లేవో! తిరుపతిలోని వేంకటేశ్వర విశ్వవిద్యాలయం కేవలం హిందూమతసంబంధమైన గ్రంథాలపై తప్ప చారిత్రక గ్రంథాలపైకి తన దృష్టిని పోనివ్వడం లేదు.

మన తెలుగు, హిస్టరీ ప్రొఫెసర్లకు సరైన చారిత్రకదృష్టి వున్నట్టు కన బడదు. తాము స్వయంగా చేసినా, చేయకపోయినా, తమ విద్యార్థులచేతనైనా పరిశోధనలను సక్రమ పద్ధతులలో చేయించివుంటే, ఈపాటికి ఎన్నో అమూల్య విశేషాలతో కూడిన గ్రంథాలు వెలువడి వుండేవి. దురదృష్టవశాత్తు వీరికి తిక్కనశిల్పం, పోతనభక్తి, శ్రీనాథుని శృంగారం, కాకతీయుల పౌరుషం, విజయనగరంచక్రవర్తుల ఆంధ్రత్వంవంటి విషయాలుతప్ప అన్యం స్ఫురించవు.

దేశచరిత్ర, సాహిత్యచరిత్రలే కాదు; పరిశోధన జరగవలసినవి మరెన్నో వున్నాయి. ఉదాహరణకు, దాదాపు నూరేళ్ళకు విస్తరించిన ఆధునిక నాటకచరిత్ర మనకు వున్నది. అయినా, దీన్నిగురించి జరిగిన పరిశోధన బహు స్వల్పం అనే చెప్పాలి. అదే హిందీ, గుజరాతి, బెంగాలీ మొదలైన వాఙ్మయా లను తీసుకొంటే వాటిలో నాటకరంగాన్నిగురించిన పరిశోధన గ్రంథా లెన్నో కనిపిస్తాయి. మనకు నూటయాభై సంవత్సరాల జర్నలిజం వున్నది. అయినా, ఆ రంగంలో తొలిరోజులలో ఏమి కృషి జరిగిందో, దాని "పయనీర్స్"గా చెప్పదగిన మహామహులెవరో మనకు సరిగా, స్పష్టంగా తెలియదు. మేము పైన పేర్కొన్న ఆయా రంగాలలో పరిశోధన బొత్తిగా జరగలేదని కాదు గాని, జరగవలసినంతగా జరగలేదు. అది కూడా దోషభూయిష్ఠంగా జరిగింది, జరుగు తున్నది.

ఇందుకు మా దృష్టికి ఇటీవలనే వచ్చిన ఒక ఉదాహరణను చెప్ప గోరుతున్నాము. వేమననుగురించి మొట్టమొదటగా 1812 లో పేర్కొన్న పాశ్చాత్యపండితుడు యాబీ డూబ్వా, అయినా, సర్ విలియం జోన్స్ వేమ నను "ప్లేటో ఆఫ్ ఇండియా" అని ప్రస్తుతించినట్టు ఇటీవల ఒక తెలుగు చరిత్రపరిశోధకుడు వ్రాశాడు. 1794 లోనే మరణించిన జోన్స్‌కు వేమనను గురించి తెలియనే తెలియదు. మన తెలుగుపరిశోధకుడు ఈ విధంగా "దూడ" వేయడానికి కారణమేమని పరిశీలించగా, 1829 లో వేమన పద్యావళిని ఆంగ్లాను వాదంతో సహా ప్రచురించిన సి. పి. బ్రౌన్ తన ఉపోద్ఘాతంలో వ్రాసిన ఒక వాక్యం మా కంటబడింది. ఆ వాక్య మిది :

"Vemana was evidently, in philosophy of the Vedanta school, a disciple of Vyasa, whom Sir William Jones has entitled the Plato of India".

ఈ వాక్యంలో "ది ప్లేటో ఆఫ్ ఇండియా" అని జోన్స్ వర్ణించినట్టు బ్రౌన్ పేర్కొన్నది వేమనను కాదు, వ్యాసుడిని. దీన్ని సరిగా బోధ పరుచుకొనక వేమననే ప్లేటోతో జోన్స్ పోల్చినట్టు తప్పుగా భావించి, ఇటువంటి తప్పుడు వ్రాతలను చరిత్రపరిశోధనలుగా తెలుగువారిపై రుద్దే శోచనీయస్థితిలో మన చరిత్రపరిశోధకులలో కొందరున్నారు. మన ఖర్మం కాలి వీరు పెద్ద పెద్ద బిరుదులు తగిలించుకొంటున్నారు; వీరికి ప్రభుత్వసన్మానాలు జరుగుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురించిన "వెర్సెస్ ఆఫ్ వేమన" (బ్రౌన్ ఇంగ్లీషు అనువాదంతో) గ్రంథంపై నేడు ఒక ఆంగ్ల దినపత్రికలో వచ్చిన ఒక సమీక్ష సయితం వేమననే "ప్లేటో ఆఫ్ ఇండియా" అని జోన్స్ వర్ణించినట్టు పేర్కొన్నది. ఈ తప్పుడు వ్రాతకు ఆధారం అంతకు ముందు బ్రౌన్ ఇంగ్లీషు వాక్యానికి తప్పుడు అన్వయంతో చెప్పిన తప్పుడు అర్థమే కావచ్చు.

మన చారిత్రకపరిశోధనస్థాయి ఎంత తక్కువగా వుంటున్నదో చెప్పడానికే ఈ ఉదంతాన్ని మేము పేర్కొనవలసివచ్చింది. ఇట్టి అవకతవకలు, అపభ్రంశపు పనులు ఎన్నెన్నో జరుగుతున్నాయి. మన జాతికి చారిత్రకదృష్టి మొదటినుంచి లేకపోవడంవల్ల మన చరిత్ర ఎంతో ఖిలమైపోయింది. పాశ్చాత్య పండితుల ధర్మమా అని మనకు కొంతకాలంగా చారిత్రకాసక్తి కలగడం, పరిశోధనాకృషి ప్రారంభం కావడం జరిగింది. అయితే, ఇది సవ్యమైన శాస్త్రీయ పద్ధతులలో జరగాలి; సంకుచిత దృష్టిలోగాని, రాగద్వేషాలతోగాని జరగరాదు. దీనిలో అలసత్వం తగదు, అవలీలగా ప్రఖ్యాతి పొందాలన్న తాపత్రయం తగదు. సత్యాన్వేషణదృష్టితో కష్టించి పని చేయాలి. అటు తర్వాత తెలుగు వారికి తమ పరిశోధనా ఫలితాలను తెలియజేయడంతోనైనా సంతృప్తి చెందరాదు; అన్యప్రాంతీయులకు మన విషయమై తెలియజెప్పడానికి, ముఖ్యంగా ఇంగ్లీషులో చెప్పడానికి, ప్రయత్నించాలి. ఈ ప్రయత్నాన్ని ఇప్పటికైనా ప్రారంభించడంకంటె మన చరిత్రపరిశోధకులు తెలుగుదేశానికి చేయగల ఘన సేవ మరి లేదు.

[నవంబర్ 10, 1968]

కలం కన్నీటిలో ముంచి ....

కేవలం మానసికాందోళనతోనే కాక, హృదయావేదనతో నేటి మా సంపాదకీయాన్ని ప్రారంభిస్తున్నాము. కలాన్ని సిరాలో కాక, కన్నీటిలో ముంచి, దీన్ని వ్రాస్తున్నాము. నిజంగానే హృదయం సంక్షుభితం కావలసిన సందర్భ మిది, కన్నులనుంచి నీరు కాల్వలు కట్టవలసిన సన్నివేశ మిది.

మనది ఒకే భాష, ఒకే చరిత్ర, ఒకే సంస్కృతి, ఒకే వారసత్వం ప్రాంతీయవిభేదాలకు అతీతంగా నిలవదగినట్టిది మన రక్తబాంధవ్యం. నన్నయ్య రాజమహేంద్రవరం వాడైనా, పోతన ఓరుగంటివాడైనా, ఉభయులు ఒకే తెలుగులో వ్రాశారు. తాను కాకతీయుడైనా, తిక్కన ప్రార్థనపై మనుమసిద్ధి రక్షణ నిమిత్తం గణపతిదేవుడు తన సైన్యాలను పంపించాడు. అన్నపానీయాలు మొదలుకొని ఆచారవ్యవహారాలవరకు, జోలపాటలు మొదలుకొని వీరగాథల వరకు మనది ఒకే సంస్కృతి; అవి అమరావతి శిల్పాలైనా, ఓరుగల్లు విజయ తోరణాలైనా మనది ఒకటే వారసత్వం.

అయినా, మనలో ప్రాంతీయ విభేదాలు పెరగవలసిందేనా? కలతలు ప్రబలవలసిందేనా? సంఘర్షణలు చెలరేగ వలసిందేనా? ఈ విషాద పరిణా మానికి కారణాలను ఇప్పుడు మనం వెతకనక్కరలేదు. ఇందుకు ఎవరు బాధ్యు లన్న పరిశీలన చేయనక్కరలేదు. ఈ నాడు ఒకే ఒక ప్రశ్న మనం ప్రధానంగా వేసుకోవాలి.

రెండు, మూడువేల సంవత్సరాలకు విస్తరిస్తున్న మన తెలుగుజాతి చరిత్రలో రాజకీయంగా మనం పూర్తిగా ఏకంకాగలిగింది ఆంధ్రప్రదేశ్ నిర్మాణం తర్వాతనే. ఇది శాతవాహనులకాలంలో జరగలేదు, చాళుక్యుల కాలంలో జరగ లేదు, కాకతీయుల కాలంలో జరగలేదు, రెడ్డిరాజులకాలంలో జరగలేదు, విజయ

నగరసామ్రాజ్యకాలంలోనైనా జరగలేదు. మున్నెన్నడు కనివిని యెరుగని సమైక్యాన్ని ఆంధ్రప్రదేశ్ నిర్మాణంతో సంపాదించుకున్న తర్వాత, దానికి చేజేతుల విఘాతం కల్పించుకొనడం మనకు తగునా?

ఎన్నెన్నో కష్టాలు పడకుండా, త్యాగాలు చేయకుండా ఆంధ్రప్రదేశ్ సిద్ధించలేదు. ఆంధ్రరాష్ట్ర నిర్మాణమే బీహార్, ఒరిస్సాల, నిర్మాణానికి ఏడు వెనకలుగా జరిగింది. ఆటుపిమ్మట ఆంధ్రప్రదేశ్ అవతరణకు మరికొంత కాలం పట్టింది. మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, టంగుటూరి ప్రకాశం, అయ్యదేవర కాళేశ్వరరావు ప్రభృతులు ఏళ్లతరబడి, పూళ్లతరబడి కనిన కలల పంటగానే ఆంధ్రప్రదేశ్ నిర్మాణం జరిగింది.

దీని శాంతికి, దీని సౌభాగ్యానికి, దీని అస్తిత్వానికి, దీని భవిష్యత్తుకు ఎవరిద్వారా, ఏ దిక్కునుంచి ప్రమాదం సంఘటించినా, అది హృదయావేదన కలిగించగల శోచనీయ పరిణామమే, కన్నీరు తెప్పించగల విషాద సన్నివేశమే.

[జనవరి 30, 1969]

రేపు, రేపటితరం

విశాలజాతీయ దృక్పథమా ? సంకుచిత రాష్ట్రీయ దృక్పథమా ? ఏది ముఖ్యం ? ఏది అవసరం ?

తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు కనీసం ఒక సమస్యపై - నదీజలాల పంపకం సమస్యపై-జాతీయ ప్రయోజనాలకు, సమష్టి శ్రేయస్సుకు ప్రాధాన్యమిచ్చాయి. కొంతకాలంగా తమమధ్య నడుస్తున్న వివాదాన్ని స్వచ్ఛందంగా. సామరస్యపూర్వకంగా అవి పరిష్కరించుకొన్నాయి. ఇందుకు ఆ రెండు ప్రభుత్వాలను అభినందించాలి.

నదీజలాల వివాదాలు తమిళ, కేరళ రాష్ట్రాలమధ్యనే కాదు; దేశంలో మరికొన్ని రాష్ట్రాల మధ్యకూడా వున్నాయి. ఎన్నేళ్ళు దొర్లిపోతున్నా, ఎన్ని కడగళ్ళు తప్పకపోతున్నా, వాటిని తమలో తాము సామరస్యపూర్వకంగా పరిష్కరించుకొనలేకపోతున్న రాష్ట్రాలు ఇకనైనా సిగ్గుతో తలవంచుకోవాలి.

ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్, మైసూరు, మహారాష్ట్రలమధ్య కృష్ణా గోదావరీజలాల పంపకం తీవ్రమైన మనస్పర్థలకు కారణమైంది. మధ్యప్రదేశ్, గుజరాత్‌లమధ్య నర్మదానదీ జలాలవివాదం ఆవేశకావేషాలకు మూలమైంది. ఎవరు, ఎంతగా, ఎన్నిసార్లు ప్రయత్నించినా, ఇవి తెగనితగవులై కూర్చున్నందున, చివరికి వాటిని కోర్టులముందు పెట్టవలసి వచ్చింది.

నేడు తమిళనాడులో డి.యం.కె. ప్రభుత్వం వున్నది; కేరళలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం వున్నది. ఆ రెండు ప్రభుత్వాలమధ్య పార్టీ విభేదాలు, సిద్ధాంత వైరుధ్యాలు, తదితర వ్యత్యాసాలు ఎన్నో వున్నాయి. అయినా, అవి

పరాంబికులం, అలియార్, భవానీనదుల నీటిపంపిణీపై, ప్రాజెక్టులపై, ఒక సమాధానానికి రాగలిగాయి. కాగా, ఆంధ్రప్రదేశ్, మైసూరు, మహారాష్ట్ర, గుజరాత్‌లలో మొదటినుంచీ వున్నవి కాంగ్రెసు ప్రభుత్వాలే. కిందటి జనరల్ ఎన్నికలవరకు మధ్యప్రదేశ్‌ను అవిచ్ఛిన్నంగా పరిపాలించినట్టిది కాంగ్రెసు ప్రభుత్వమే ఈ ప్రభుత్వాలు ఒకే కాంగ్రెసుపార్టీ ఆదేశాలకు లోబడి నడుచు కొనేవే. వీటిమధ్య సిద్ధాంతపరంగా గాని, పార్టీ ప్రయోజనాలదృష్ట్యాగాని, ఎట్టి విభేదాలు వుండడానికి అవకాశం లేదు.

అయినా, ఇవి నదీజలాలవిషయంలో ఏకాభిప్రాయానికి రాలేకపోయాయి. ఏ నదీజలం ఎక్కడ వినియోగానికి వచ్చినా, అది దేశసౌభాగ్యానికే దోహదకారి కాగలదన్న ప్రాథమికసత్యాన్ని విస్మరించి ఒకే పార్టీకి చెందిన ఈ ప్రభుత్వాలు రచ్చకెక్కాయి.

దీన్నిబట్టి ఏమనుకోవాలి? తమిళనాడు, కేరళప్రభుత్వాలు తాము ఏ సమాధానం కుదుర్చుకొన్నా, తమ ప్రజలకు నచ్చచెప్పగలమన్న ధీమాతో, తమ వెనుక ప్రజల అండదండలు వున్నాయనే ఆత్మవిశ్వాసంతో వ్యవహరించాయనే కాదా? ఆంధ్రప్రదేశ్, మైసూరు మొదలైన రాష్ట్రాలలో కాంగ్రెసు ప్రభుత్వాలకు అట్టి ఆత్మవిశ్వాసం లోపించిందనే కాదా?

ప్రజాభిప్రాయాన్ని సరియైనమార్గంలో నడిపించడం నాయకత్వలక్షణం. ప్రజలకు ముందు నడవడం నాయకలక్షణం. దీనికి స్వస్తిచెప్పి ప్రజలకు వెనుక నడవడం, ప్రజల ఆవేశాలనుబట్టి నడుచుకోవడం ఏమి నాయకత్వం? కొన్ని సందర్భాలలో ఉదాహరణకు రాష్ట్రాలమధ్య సరిహద్దుతగవులు ఉక్కుఫ్యాక్టరీకి స్థలనిర్ణయం, మొదలైనసందర్భాలలో) ప్రజలను స్వయంగా రెచ్చగొట్టి, తమ పలుకుబడిని చాటుమాటునుంచి పెంచుకొనడానికి, తమ పదవిని కాపాడుకొనడానికి ప్రయత్నించిన నాయకులు కూడా వున్నారు. ఓట్లకోసం,తమ పదవుల సుస్థిరతకోసం దొడ్డిదారులనైనా పట్టడానికి, గడ్డిగాదరలనైనా కరవడానికి వెనుదీయనివారు నిజమైన నాయకులు కాగలరా?

"పొలిటీషియన్" రేపటినిగురించి మాత్రమే ఆలోచిస్తాడు; "స్టేట్స్‌మన్" రేపటి తరాన్ని గురించి ఆలోచిస్తాడు. మన దేశంలో "స్టేట్స్‌మెన్"గా చెప్పదగినవారు అరుదు; "పొలిటీషియన్స్" కోకొల్లలు. రేపటి తరాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రవర్తించేవారు తక్కువ; రేపటినిగురించే ఆలోచించేవారు ఎక్కువ. ఇదే మన దేశానికి ఈనాడు పట్టిన ఒక పెద్ద దౌర్భాగ్యం।

[మే 12, 1969]

మానవ విజయం

"ఆనాడు జీవించివుంటే..."—ఈ తలంపుతో ఎందరు, ఎన్నిసార్లు, ఎంతగా నిట్టూర్చలేదు ?

సుమేరియన్‌లు అక్షరాలకు తొలిరూపం దిద్దినప్పుడు; బాబిలోనియన్‌లు ఒకదానికంటె మహోన్నతంగా మరొక జిగూరత్‌ను నిర్మించినప్పుడు; వేద ఋషులు యజ్ఞవాటికలలో ఋక్కులను రచించినప్పుడు; హామురాబీ ప్రథమ ధర్మశాస్త్రాన్ని ప్రకటించినప్పుడు; రామ్‌సెస్ ది గ్రేట్ గుహాలయాలను అబూ షింబెల్‌లో తొలిపించినప్పుడు; గౌతమబుద్ధుడు ధర్మచక్రప్రవర్తనను ప్రారంభించినప్పుడు; సోక్రటీస్ ఏథెన్స్ వీధులలో యువకబృందంతో తాత్త్వికచర్చలు కొనసాగించినప్పుడు; చైనులో నగరకన్ ఫ్యూసియన్ నాగరికజీవితసూత్రాలను విప్పిచెప్పినప్పుడు; డారియస్ చక్రవర్తి పరిపాలనలో పర్షియా ప్రభ వెలిగిపోయినప్పుడు; అలెగ్జాండర్ మూడు ఖండాలలో దిగ్విజయయాత్రలను జరిపినప్పుడు; అశోక చక్రవర్తి శాంతి, కారుణ్య సందేశాలను ప్రపంచప్రజలకు చాటినప్పుడు; ఏసుక్రీస్తు పర్వతాగ్రంపై నిలిచి ధర్మబోధ చేసినప్పుడు; అజంతా గుహాలయాలలో చిత్రకారులు అలౌకిక సౌందర్యజగత్తును సృష్టించినప్పుడు; మహమ్మద్ మక్కాలో విజయప్రవేశం చేసినప్పుడు; కృష్ణదేవరాయలు "భువనవిజయం''లో నిండుపేరోలగం వున్నప్పుడు; షాజహాన్ పాదుషా తాజ్‌మహల్‌ను నిర్మించినప్పుడు; కొలంబస్, వాస్కోడిగామా, కుక్ ప్రభృతులు కొత్త సముద్ర మార్గాలను, కొత్త ఖండాలను కనిపెట్టినప్పుడు; వాషింగ్టన్, జెఫర్‌సన్ ప్రభృతులు ఫిలడల్ఫియాలోని "లిబర్టీహాల్"లో అమెరికా సర్వస్వాతంత్ర్య ప్రకటన పత్రంపై సంతకాలు చేసినప్పుడు; ప్యారిస్ పౌరులు "స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాత్రం" నినాదాలతో బ్యాస్టిలీని నేలమట్టం చేసినప్పుడు; ఫారడే విద్యుచ్ఛక్తిని కనిపెట్టినప్పుడు; ''ప్రపంచాన్ని కుదిపివేసిన పదకొండురోజుల"

విప్లవనాయకుడుగా లెనిన్ క్రెమ్లిన్‌లో పాదం పెట్టినప్పుడు; గాంధీ ఉప్పు సత్యాగ్రహానికై సబర్మతినుంచి దండికి ప్రయాణమైనప్పుడు; ఇట్టి అనేకానేక చరిత్రాత్మక సన్నివేశాలలో తాము జీవించి వుండలేదని ఎందరు-ఎన్నిసార్లు-ఎంతగా నిట్టూర్చలేదు? ఈ సన్నివేశాలలో తమకు ప్రత్యేకించి అభిమానపాత్రమైనదాన్ని తలచుకొని, ఆనాడు జీవించివున్న వారిదే అదృష్టమని ఎంతగా నిట్టూర్చలేదు ?

కాని, నేడు (క్రీస్తుశకం 1969 జులై 21 వ తేదీని) జీవించివున్న మనం-ఖండఖండాలలో, దేశదేశాలలో జీవించి వున్న మనం - ఎవ్వరినీ చూచి అసూయపడ నక్కరలేదు! గతకాలానికి చెందిన వారెవ్వరో మహాదృష్టవంతులని, మనం కాదని నిట్టూర్చనక్కరలేదు. మానవచరిత్రలోనే అపూర్వమైన ఒక సంఘటన జరిగిన ఈనాడు జీవించివున్న మన అదృష్టమే అదృష్టం ! !

తన ఈ మహాదృష్టాన్ని గుర్తించలేని వారు మనలో ఎవడైనా వుంటే, అతడు నిశ్చయంగా మూర్ఖశిఖామణి. ఆలోచించడానికి అతడు మెదడు లేనివాడు, ఉప్పొంగిపోవడానికి హృదయం లేనివాడు, తన ముక్కుకొనను దాటి చూడ్డానికి కళ్ళు సయితం లేనివాడు ! !

1970లోపల చంద్రలోకంలో నరుని ప్రవేశపెట్టడం అమెరికా జాతీయ లక్ష్యం కావాలని 1961 లో నిర్దేశించిన ప్రెసిడెంట్ కెనెడీ ఈనాడు జీవించి వుంటే, ఎంతగా పొంగిపోయి వుండేవాడో! ఈ గొప్ప రోజును తాను చూడలేనన్న అనుమానం ఏ కోశానో కొద్దిగా వున్నందునే కావచ్చు.—"చంద్రలోకంలో మానవుడు పాదంపెట్టిననాడు ఆ సంఘటనను చూడగల మహద్భాగ్యం నాకు అబ్బగలదో, లేదో ?" అని ఆయన అన్నాడట. "ఈ లోకంనుంచి కాకపోతే, మరొక లోకంనుంచైనా నేను దాన్ని తప్పక చూస్తా"నన్న విశ్వాసాన్ని ఆయన ప్రకటించాడట.

మరొక లోకంనుంచి నేటి మహాద్భుత సంఘటనను తిలకించడం ఎంతవరకు సాధ్యమో సందేహమే ! అయినప్పుడు, ఈనాడు ఈ మహద్భాగ్యం అబ్బిన మనం కెనడీకంటె ఎంత అదృష్టవంతులమో ! !

1524

చంద్రలోకానికి యాత్రవిషయమై కల కనినవారిలో కెనడీ మొదటి వాడు కాదు, చివరి వాడు కూడా కాదు. కొన్ని వేల సంవత్సరాలుగా మానవుడు ఈ తీయని కల కంటున్నాడు. చిట్టి చేతులను పైకెత్తి "చందమామ రావె! జాబిల్లి రావె!!" అని అల్లిబిల్లి పాటలను పాడే ప్రతి పిల్లవాడు ఒక చంద్ర లోక యాత్రాకాంక్షి! శైశవానికి సహజమైన అజ్ఞానావస్థవల్ల చంద్రుడు తన వద్దకు రావాలని కోరినా, జ్ఞానోదయ మైనంతనే చంద్రుడు తన వద్దకు రాడని, తానే చంద్రునివద్దకు వెళ్లాలని మానవుడు గుర్తిస్తాడు.

అయితే, ఇంతకుముందు యుగాలలో చంద్రలోక యాత్రాకాంక్ష కేవలం ఒక కలగానే మిగిలిపోయింది. వైజ్ఞానికశాస్త్రాలలో, సాంకేతికశాస్త్రాలలో మానవుడు కడచిన రెండు, మూడు శతాబ్దాలలో—ముఖ్యంగా కడచిన అర్ధ శతాబ్దిలో—సాధించిన అద్భుతపురోగతి ఫలితంగా వేలాది సంవత్సరాల నాటి ఈ కల ఈనాడు నిజమైంది.

అయితే, ఇది కేవలం వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్రాలకే విజయం కాదు. అసాధ్యం అనేదాన్ని గుర్తించని మానవాత్మకు కూడా ("స్పిరిట్ ఆఫ్ మ్యాన్" అని ఇంగ్లీషులో అనే దానికికూడా) ఇది విజయం. అసాధ్యానికి అర్రులుజాచడం మానవ ప్రవృత్తిలో ఒక భాగమై వుండకపోతే, అతడు తక్కిన జంతువులలో ఒక జంతువుగా మిగిలి పోయి వుండేవాడు; తనకు సన్నిహిత జ్ఞాతులైన వానరాలలో ఒక వానరంగానే మిగిలిపోయి వుండేవాడు!!

ఈ మాటను మతవాదులు వొప్పుకొనరు గాని, ఇది మతానికి కూడా ఒక ఘనవిజయం. అన్ని మతాలు ఊర్ధ్వలోకాలపై దృష్టి నిల్పడం మానవుని పరమ ధర్మమని ప్రతిపాదిస్తున్నట్టివే! అవి ప్రోత్సహించిన ఊర్ధ్వదృష్టే మానవుడు ఈనాడు చంద్రలోకంలో పాదం పెట్టడానికి ఒక ప్రధానప్రేరణ అయింది.

మతానికి, వైజ్ఞానిక సాంకేతిక శాస్త్రాలకు ప్రధాన భేద మిది: చచ్చిన తర్వాతగాని మీరు ఊర్ధ్వలోకాలను చేరలేరని మతం చెబుతుంది; చావ నక్కర లేకుండానే మీరు ఊర్ధ్వలోకాలను చేరగలరని చెప్పడంతో సరిపుచ్చక, తమ మాటను వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్రాలు నిజంచేసి చూపిస్తున్నాయి!

చంద్రగోళంపై కాలూనడం మానవుని ఊర్ధ్వయాత్రలో ప్రథమఘట్టం మాత్రమే! త్వరలోనే అతడు రోదసీగర్భంలోకి మరింతగా చొచ్చుకు వెడతాడు, తన పతాకను శుక్ర, కుజాది గ్రహాలపై ప్రతిష్ఠాపన చేస్తాడు, సౌర మండలాధిపత్యాన్ని సాధిస్తాడు!!

ఈ జైత్రయాత్రలో ఒక ముఖ్య భాగంగా మానవుడు ఈ అనంత విశ్వగోళం స్వరూపస్వభావాలను అవగతం చేసుకొనవచ్చు; జీవం ఏ విధంగా ఆవిర్భవించిందో ఆకళింపు చేసుకోవచ్చు. "టైమ్, స్పేస్"ల రహస్యాలను అర్థం చేసుకోవచ్చు.

నిస్సందేహంగా ఈనాడు మానవుడు తన చరిత్రలో ఒక అపూర్వాధ్యాయానికి శ్రీకారం చుట్టాడు. దీన్ని సాధ్యంచేసిన అమెరికా వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్రవేత్తలకే కాక, ఆ శాస్త్రవికాసానికై యుగయుగాలలో కృషిచేసిన ప్రతి మేధావికి మనం తలవంచి - చేయెత్తి - ఈనాడు నమస్కరించాలి. ఈనాడు జీవించివుండడమే ఒక గొప్ప అదృష్టంగా పొంగిపోతున్న మనకు ఈ మహాభాగ్యాన్ని కల్పించింది యుగయుగాలకు చెందిన ఆ మేధావులే!

[జులై 22, 1969]

మతకలహాలు

ఇది గాంధి శతజయంతి సంవత్సరం. మరి వారం పదిరోజులలో దేశ వ్యాప్తంగానే కాక, ప్రపంచవ్యాప్తంగా గాంధిశతజయంతి మహాసంరంభంతో జరుగబోతున్నది. హింసావిద్వేషాలతో కల్లోలభూయిష్ఠమైన మానవాళికి ప్రేమ సందేశాన్ని అందించిన ఈ మహితాత్ముని ఆనాడు దేశదేశాలవారు గౌరవభావంతో సంస్మరించనున్నారు.

ఈ సమయంలో భారతదేశంలో, ముఖ్యంగా ఆయన పుట్టి పెరిగిన గుజరాత్‌లో, అందులోను ఆయన రెండు దశాబ్దాలపాటు నివసించి తన అహింసా సందేశాన్ని ప్రపంచానికి చాటిన అహమ్మదాబాదులో హింసాకాండ విశృంఖలంగా చెలరేగడం ఎంత దారుణం, ఎంత విషాదకరం ! అహమ్మదాబాదులో, బరోడాలో, గుజరాత్‌లోని ఇతర పట్టణాలలో కడచిన అయిదారు రోజులుగా జరిగినవి సాధారణ కలహాలు కావు. అవి మతవిభేదాలను పురస్కరించుకొని ఉత్పన్నమైనట్టివి. అవి ఏదో పెద్ద కారణాన్ని పురస్కరించుకొన్నట్టివైనా కావు; అతి స్వల్పసంఘటన కారణంగా ప్రారంభమైనట్టివి.

చూస్తుండగానే అవి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ప్రాకడం, దోపిడులు గృహదహనాలు, హత్యలు సయితం యథేచ్ఛగా జరిగిపోవడం అమిత విషాదం కలిగిస్తున్నది. అధికారుల అంచనాల ప్రకారం 94 మంది మరణించారు. కాని, 200మందివరకు మరణించి వుండవచ్చునని అనధికారవర్గాల లెక్కలు తెలుపుతున్నాయి.

పరిస్థితిని అదుపుచేయడం పోలీసులకు కూడా శక్యం కాకపోవడంతో సైన్యాన్ని పిలిపించవలసివచ్చింది. హోంమంత్రి చవాన్ చెప్పినట్టు, దేశాన్ని బాహ్యశత్రువుల ప్రమాదంనుంచి కాపాడ్డానికి అయత్తమైవుండవలసిన సైన్యాన్ని

దేశంలోనే జాతీయసమైక్యానికి శత్రువులైన వారిని అణచివేయడానికి ఉపయోగించవలసిన ఆగత్యంకలగడం విచారకర వైపరీత్యం కాదా?

మతాలు వేరైనా మానవు లందరు ఒక్కటేనన్న మహాదర్శాన్ని గాంధి తన జీవితకాలంలో ప్రబోధించడమే కాక, దానికి అనుగుణంగా తన జీవితాన్ని తీర్చి దిద్దుకొనడమే కాక, దానికోసం తన ప్రాణాన్ని సయితం బలిదానంచేశాడు. ఆధునికకాలంలో తన జీవితంద్వారా, తన మృత్యువుద్వారా ఈ మహోన్నతాదర్శాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు మన దేశీయుడైనందుకు, మన మధ్య జీవించినందుకు మనం ఎంతో గర్వించవలసివుంది. అయినా, ఆయన మన దేశంలో జన్మించలేదన్నట్టు, ఆయన దివ్యవాణిని మనం వినలేదన్నట్టు, ఆయన ఏ మత సామరస్యపు ఆదర్శంకోసం తన ప్రాణాలను పరిత్యజించాడో అది మనకు తెలియనే తెలియదన్నట్టు, మనం ప్రవర్తించడంకంటె ఘోరాపచారం మరొకటి వుండగలదా?

గాంధి ప్రాణబలిదానం చేసి 21 సంవత్సరాలు దాటినా, నేటికీ మత కలహాలు అక్కడక్కడ జరుగుతూనే వున్నాయి. పెద్ద కారణం అక్కరలేదు. స్వల్పసంఘటనలు సయితం విస్తృత సంఘర్షణలకు దారితీస్తున్నాయి. సంఘర్షణలను మొగ్గలోనే త్రుంచివేయక జాప్యంచేయడంలో అధికారుల బాధ్యత కొంత వుండవచ్చు. కాని, ఇది కేవలం ప్రభుత్వాల బాధ్యతమాత్రమే అని చెప్పలేము. వివిధ రాజకీయపక్షాల, ఇతర ప్రజాహితసంస్థల బాధ్యత కూడా ఇందులో వున్నది. మతసామరస్య పరిరక్షణకు రాజకీయవిభేదాలకు ఏమీ సంబంధం లేదు. ఏ పార్టీ రాజకీయవిధానాలు ఎట్టివైనా, ఏ పార్టీ అధికారంలో వున్నా, లేదా ఏది ప్రతిపక్షంగా వున్నా, మతసామరస్యరక్షణ, దానిద్వారా శాంతిభద్రతల రక్షణ మన పవిత్రకర్తవ్యంగా మనం భావించుకోవాలి. రాజకీయాలకు అతీతంగా ఆ కర్తవ్యాన్ని మనం నిర్వర్తించాలి. దీన్ని నిర్వర్తించడంలో మన అలసత్వమే, వైఫల్యమే దేశంలో తరచుగా చెలరేగుతున్న మతకలహాలకు ముఖ్యకారణం.

సత్వర శాంతి సంస్థాపనకోసం, మత సామరస్యసాధనకోసం మురార్జీ దేశాయి, ఇందులాల్ యాజ్ఞిక్ నిరశనదీక్షలు జరుపుతున్నారు. రాజకీయోద్దేశా

లతో చేసే నిరాహారదీక్షలు ఖండించదగినవే. అవి వాటిని చేసేవారి సంకుచిత బుద్ధికి, స్వార్థాపేక్షకు సాధనాలు కాగా, సమాజం సమష్టి శ్రేయస్సు కోసంచేసే నిరశనదీక్షలు అవి చేస్తున్నవారి హృదయవేదనకు తార్కాణాలు. వారి ఆవేదనను అందరు గౌరవించాలి. వారు నిరశనదీక్షలు చేయవలసిన అవసరం కలిగించిన వారు అందుకు సిగ్గుపడి, నిరశనదీక్షల విరమణకు దోహదకరంగా తమ ప్రవర్తనను చక్కదిద్దుకోవాలి. గుజరాత్‌లో ఆ విధంగా జరగగలదనే ఆశిస్తున్నాము.

[సెప్టెంబర్ 24, 1969]

గురు నానక్

"హిందువు లేడు, ముస్లిం లేడు, నిజంగా వున్నది మానవుడు మాత్రమే" - ఈ సత్యాన్ని 15వ శతాబ్దిలో లోకానికిచాటినవాడు గురు నానక్. ఈ సత్యాన్ని చాటడానికి ఆనాడు ఏ పరిస్థితులు ఆయనను ప్రేరేపించాయో అవే పరిస్థితులు ఈనాడు కూడా వున్నాయి. కనుకనే ఆయన పలుకులు ఆనాటికే కాదు, ఈనాటికి కూడా వర్తిస్తాయి. ఆయన పలుకులలోని సత్యం మన రక్తంలో జీర్ణించనంత వరకు, అది మన జీవితాలలో అంతర్భాగంకానంతవరకు మానవుడు మానవుడుగా పెరగలేడు.

నానక్ జన్మించి అయిదువందల సంవత్సరాలైంది; ఆయన అయిదవ శతజయంత్యుత్సవాలు నేడు జరుగుతున్నాయి. కేవలం జయంత్యుత్సవాన్ని లాంఛనంగా జరుపుకొనడంలో సరిపుచ్చక, ఆయన, చాటిన సర్వమానవ సమానత్వ సందేశాన్ని మననం చేయడం కూడా ఈనాడు మన పవిత్ర విధి.

ఆయన కాలంనాటికి ఇండియాలో ముస్లిం పరిపాలన స్థిరపడిపోయింది. దేశంలో ఇస్లామ్ వ్యాపిస్తున్నది. దానితోపాటు హిందూ - ముస్లింభేదాలు విపరీతంగా వ్యాపిస్తున్నాయి. కొంచెం వెనుక ముందులుగా ఆ కాలంలో ఇటు హిందూసమాజంనుంచి, అటు మహమ్మదీయ సమాజంనుంచి కూడా మత సంస్కర్తలు పెక్కుమంది బయలుదేరి, మతభేదాలకు అతీతమైన పరతత్త్వం ఒకటి కలదని, మానవులు ఉపాసించవలసింది ఆ తత్త్వాన్నే కాని, చిల్లరమల్లర పేర్లలో చిల్లరమల్లర దేవుళ్లను కాదని ఉపదేశించారు. సంకుచిత కులమతాచారాలను పాటిస్తే మానవునిలోని మానవత పలచబడి పోగలదని చాటి చెప్పారు. కబీర్, రాయ్‌దాస్, దాదూ, చరణ్‌దాస్ మొదలైన వారెందరో ప్రభవించి కుల మత విభేదాలకు అతీతమైన ఏకమానవతాధర్మాన్ని ప్రబోధించారు; మతం పేరిట జరిగే దురాచారాలను ఖండించారు. భగవంతుడు ఒకడేనని, అన్ని మతాల గమ్యం అతడేనని, పూజలు, వ్రతాలు ఉపవాసాలు మొదలైన శుష్కాచారాలతో

కాక, తోటి మానవులను ప్రేమించడంద్వారా, వారికి సర్వవిధాల సేవచేయడం ద్వారా ఆ గమ్యాన్ని చేరుకోవచ్చునని ఉపదేశించారు.

వారి కోవకు చెందినవాడే గురు నానక్. హిందూమతానికి, ఇస్లాముకు, మరి ఏ మతానికి చెందినవాడైనా మానవుడు మానవుడేనని, అతడిని ప్రేమించడమే భగవంతుని ప్రేమించడమని ఆయన ఉద్బోధించాడు.

ఈ సందేశ ప్రాధాన్యం ఈనా డెంతగా వున్నదో వేరే చెప్పనక్కరలేదు. మానవులను ఏకంచేయవలసిన మతమే ఈనాడు వారిమధ్య అడ్డుగోడలను పెడుతున్నది; వారిమధ్య విద్వేషాలను పెంచుతున్నది. దీని దుష్ఫలితాలను మనం ఈనాడు మన దేశంలో అనుభవిస్తున్నాము. ఇటీవల గుజరాత్‌లో జరిగిన మతకలహాలే ఇందుకు తార్కాణం.

భిన్న మతాలకు, భిన్న సాంఘిక, రాజకీయవ్యవస్థలకు చెందిన దేశాలమధ్య ఈనాడు సహజీవనం కొనసాగుతున్నది. కేవలం మతాన్ని పురస్కరించుకొని స్నేహంగాని, విరోధంగాని పాటించడం తగదని, ఆధునికప్రపంచంలో మత విభేదాలపై ఆధారపడిన విధానాలకు తావు లేదని దాదాపుగా అన్ని దేశాలు గుర్తించాయి. అయినప్పుడు, ఏదైనా ఒక దేశంలో వివిధ మతాలమధ్య శాంతియుత సహజీవనం ఎందుకు సాధ్యం కారాదు. ఈ ప్రశ్నను మన దేశంలోని వివిధ మతాలవారు తమకు తాము వేసుకొన్నప్పుడు మతాన్ని పురస్కరించుకొని ఆవిర్భవిస్తున్న విభేదాలు, విద్వేషాలు మటుమాయం కాగలవు.

అయిదు శతాబ్దాలనాడు గురు నానక్ ప్రబోధించిన సత్య మిదే! మతాన్ని మించినట్టిది మానవత్వమని ఆయన తన కాలంవారికి గుర్తుచేశాడు. ఆయన జయంతిసందర్భంలో దాన్ని మరొకసారి గుర్తుచేసుకొనడమే ఆయన స్మృతికి మనం ఘటించగల శ్రద్ధాంజలి.

[నవంబర్ 23, 1969]

కాటన్ "పెట్టిన దీపం"

ప్రధాని నెహ్రూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు శంకుస్థాపన చేయడానికి వచ్చినప్పుడు ఒక రైతు ఆయనతో "ఇది మీరు పెట్టిన దీపమే!" అన్నాడు. నాగార్జునసాగర్ నెహ్రూ పెట్టిన దీపం కాగా, గోదావరి ఆనకట్ట అంతకు నూరేళ్ళకు ముందు సర్ ఆర్థర్ కాటన్ పెట్టిన దీపం. దక్షిణ భారతంలో కాటన్ పెట్టిన పెక్కు దీపాలలో అదొకటి.

కాటన్ ఆనాడు పెట్టిన దీపం తెలుగుగడ్డకు వెలుగు నిచ్చింది; తెలుగు బిడ్డకు అన్నం పెట్టింది. గంగను స్వర్గంనుంచి భగీరథుడు భూతలానికి తెచ్చి నాడన్న పురాణగాథ నిజమో, కాదో గాని, వృథాగా సముద్రం పాలైపోతున్న గోదావరీ జలాలను లక్షలాది ఎకరాల పంటపొలాలకు మళ్ళించిన అపర భగీరథుడుమాత్రం నిశ్చయంగా సర్ ఆర్థర్ కాటన్.

ఈనాడు అతి భాగ్యవంతమైన గోదావరి డెల్టా ఒకప్పుడు కరవు కాటకాలకు నిలయమై వుండే దంటే ఇప్పటివారికి ఆశ్చర్యం కలగవచ్చు. ఔను, 1846 వ సంవత్సరానికి ముందు (అప్పటిలో దాన్ని రాజమండ్రి జిల్లా అనేవారు.) ఆ ప్రాంతం మద్రాసు ప్రెసిడెన్సీలో ఎక్కువ వెనుకబడిన ప్రాంతాలలో ఒకటిగా వుండేది. అంతే కాదు. అక్కడ వరసగా కరవులే, కాటకాలే! అక్కడి నుంచి వరసగా వలసలే!! అక్కడినుంచి ఎక్కడికో కడుపు చేతపట్టుకొని లేచిపోకపోతే వరసగా చావులే!!

బ్రహ్మాండమైన గోదావరీనది ప్రవహిస్తున్న ఆ ప్రాంతం అంతటి దైన్యావస్థలో పడిపోవడం ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వానికి ఎంతో బాధ కలిగించింది. కరవు కాటకాలనుంచి ఆ ప్రాంతాన్ని సముద్ధరించడానికి మార్గాన్వేషణ జరుగుతుండగా సర్ ఆర్థర్ కాటన్‌కు గోదావరిపై ఆనకట్ట నిర్మించడం ఒక్కటే అందుకు తిరుగులేని మార్గమన్న భావం కలిగింది. 1844లో ఆయనకు కలిగిన ఈ భావం మరి రెండేళ్ళకు క్రియారూపం ధరించింది.

గోదావరినదిపై ఆనకట్ట నిర్మాణం 1846లో ధవళేశ్వరంవద్ద ప్రారంభ మైంది. 1852 నాటికి అది పూర్తిఅయింది. దానికి మొదటవేసిన ఖర్చు అంచనా చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. అది కేవలం 4,75,000 రూపాయలు. పని పూర్తిఅయ్యేసరికి ఖర్చు 15,34,000 రూపాయలకు దేకివుండవచ్చు. ఏమైనా, ఈ మొత్తానికి ఈనాడు ఒక మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు కూడా రాదు. ఆనాడు రూపాయి విలువ అంతటిది; ఆనాడు కూలిరేట్లు అంత కారు చౌక.

సర్ ఆర్థర్ కాటన్ ఆనాడు అంత కొద్దిపాటి వ్యయంతో నిర్మించిన గోదావరి ఆనకట్ట బ్రిటిష్ ఇండియాలోనే ఇంజనీరింగ్ నైపుణ్యానికి అత్యద్భుత మైన చిహ్నంగా విశేష ప్రశంసలు పొందింది. నిజానికి దానికి ఎవ్వరూ ప్రత్యే కించి యోగ్యతాపత్రా లివ్వనక్కరలేదు. 1852 లో పూర్తిఅయిన ఆ నిర్మాణం నూరేళ్ళకు పైగా చెక్కుచెదరకుండా నిలిచివుండడమే దానికి తిరుగులేని యోగ్యతాపత్రం. పన్నెండు లక్షల ఎకరాలకు పంటనీటిని అందించడమే కాక, కాకినాడనుంచి చెన్నపట్నంవరకు పడవలు నడవడాని వీలుకలిగించడం దానికి అసలైన యోగ్యతాపత్రం.

1846లో రాజమండ్రి జిల్లా జన సంఖ్య 5,61,041 వుండేది. 1891 నాటికి అది 20,78,782 కు పెరిగింది. 1844 లో రాజమండ్రి జిల్లానుంచి లభించే అన్ని రకాల రెవెన్యూ 17,25,841 రూపాయలు వుండేది. 1898 నాటికి ఒక్క ల్యాండ్ రెవెన్యూ మాత్రమే 60,19,224 రూపాయలకు పెరిగింది. ప్రభుత్వం దృష్టినుంచి చూచినప్పుడు సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టకు ఇంతకు మించిన యోగ్యతాపత్రం ఏమి కావాలి?

అయితే, సృష్టిలో దేనికీ శాశ్వతత్వం లేదు; మానవుడు నిర్మించినదానికి అసలే లేదు. నూరేళ్ళవరకు చెక్కు చెదరకుండా నిలిచిన ఆనకట్ట ఒక్కొక్క సంవత్సరం గడుస్తున్నకొద్దీ పగుళ్ళు చూపడం మొదలుపెట్టింది. మరమ్మతు లకు నానాటికి హెచ్చుగా ఖర్చుచేయవలసి వస్తున్నది. ఏమి మరమ్మతులు చేసినా మరి ఎంతోకాలం అది నిలబడేట్టుగా కనిపించడం లేదు.

ఆనకట్టకు ప్రమాదం సంభవిస్తే, ఉభయ గోదావరి జిల్లాలకే కాదు, మొత్తం రాష్ట్రానికే తీరని నష్టం వాటిల్లుతుంది. 1965లో కేంద్ర ప్రభుత్వం

నియమించిన నిపుణులబృందం ఆనకట్టకు ఎగువలో బరాజ్ నిర్మించాలని సూచించింది. ఆ సూచన జరిగిన అయిదేళ్ళకు దానికి శంకుస్థాపన జరుగుతున్నది. ఇంజనీరింగ్ శాస్త్రం అంతగా అభివృద్ధి చెందని పరాయి ప్రభుత్వకాలంలోనే కాటన్ నివేదిక అందిన రెండేళ్లలోపలనే, ఆనకట్ట నిర్మాణం ప్రారంభం కాగా, ఇప్పుడు మన ప్రభుత్వానికి బరాజ్ విషయమై ఒక నిర్ణయానికి రావడానికి అయిదేళ్లు పట్టింది!

అవాంతరాలను లెక్కచేయక, అపనిందలను లెక్కచేయక, ఆనకట్టను కాటన్ ఆరేళ్లలో పూర్తిచేయించాడు. ఇప్పుడు బరాజ్‌కు ఏడేళ్ళు పట్టనున్నదట! అప్పుడు ఆనకట్టకు పదిహేను లక్షల రూపాయల చిల్లర మాత్రమే ఖర్చు కాగా, ఇప్పుడు బరాజ్‌కోసం పెట్టుబడి 26 కోట్ల 60 లక్షల రూపాయలు కానున్నదట!

ఖర్చు ఎంత అయితేనేమి? బరాజ్ వల్ల ప్రజానీకానికి కలగనున్న ప్రయోజనంతో పోల్చితే అదొక లెక్కలోనిది కాదు. ఆనకట్టకింద ఎనిమిదిన్నర లక్షల టన్నుల బియ్యం, 160 వేల టన్నుల చెరకు, ఇంకా ఎన్నో పంటలు ఇప్పుడు పండుతున్నాయి. ఈ ఉత్పత్తికి భద్రత కల్పించడమే కాక, గోదావరి బరాజ్ దాన్ని మరింతగా పెంచనున్నది. నిర్మాణం పూర్తికావడానికి ఏడేళ్ళు పడుతుందని ఇప్పటి అంచనా, మరి నాగార్జునసాగర్ వలె కాకుండా ఇది అనుకున్ననాటికి పూర్తి కాగలదని ఆశించవచ్చునా? ధనలోపమని, అదని, ఇదని, సాకు చెప్పకుండా ప్రభుత్వం ఈ నిర్మాణాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తుందని ఆశించవచ్చునా? *

[ఏప్రిల్ 11, 1970]

---

* మేము ఆశించినట్లుగా జరుగలేదు. బరాజి నిర్మాణంలో తాత్సారం చేసినందున, 1976 జులై 8/9 రాత్రి ధవళేశ్వరంవద్ద ఆనకట్టకు గండిపడింది.

పురాణ పురుషులు

మొత్తం ప్రపంచమే ఊపిరి బిగబట్టి గంటలను లెక్కిస్తున్నది; సర్వ మానవాళి అన్యధ్యాస లేకుండా గడియారంవంక రెప్పవేయకుండా చూస్తున్నది. "శుక్రవారం ఎప్పుడు వస్తుంది, ఎప్పుడు వస్తుంది?" అనే తహతహ సర్వే సర్వత్రా వ్యక్తమౌతున్నది. రెండుసార్లు జయప్రదంగా చంద్రమండలానికి వెళ్ళివచ్చిన తర్వాత మూడవ ప్రయాణం మరింత జయప్రదంగా జరుగుతుందని ఆశించగా, అపోలో-13 ఎన్నెన్నో చిక్కులలో పడిపోయింది. చంద్రమండలంపై దిగే ప్రయత్నాన్ని విరమించి, భూతలానికి తిరిగి రావలసిన దుస్థితి దానికి యేర్పడింది. సురక్షితంగా అది తిరుగు ప్రయాణాన్ని ముగించగలదా అనే భయసందేహాలు ప్రస్తుతం మనను కలవరపడుస్తున్నాయి. మానవ విజ్ఞాన పరిధిని పెంచడానికి, చంద్రమండలపై మానవాధిపత్యాన్ని స్థాపించడానికి సాహసోపేతంగా రోదసీ గర్భంలోనికి లక్షల మైళ్ళు పయనించి వెళ్ళిన ముగ్గురు యాత్రికులకు ఏమి ప్రమాదం వాటిల్లగలదో అని మన హృదయాలు తల్లడిల్లుతున్నాయి.

అపోలో నిర్మాతలు తీసుకోదగు అన్ని జాగ్రత్తలను తీసుకొన్నారు. రోదసీనౌకలో ఒక "ఫ్యూయెల్ సెల్" చెడిపోతే, ఆదుకొనడానికి రెండవ దాన్ని, అది కూడా చెడిపోతే, తిరిగి ఆదుకొనడానికి మూడవదాన్ని వారు అమర్చినారట. కాని, మూడు "సెల్స్" ఒకే సమయంలో చెడిపోవడమనే విడ్డూరం జరిగింది. అందువల్లనే ప్రస్తుత ప్రమాదపరిస్థితిలో రోదసీయాత్రికులు పడిపోయారు!

"బొందితో మరొక లోకానికి వెళ్ళడానికి ప్రయత్నం చేస్తే మరేమి జరుగుతుంది?" అని కొందరు ఛాందసులు ఈ సందర్భంలో అనవచ్చు. పదమూడు అశుభ సంఖ్య. అయినా, 'అపోలో-13' అని కొత్త రోదసీనౌకకు అశుభనామకరణం చేస్తే, మరేమి జరుగుతుందని అనవచ్చు. మరింత ముందుకు వెళ్ళి,

"వేరే లగ్నం దొరకనట్టు పదమూడు గంటల పదమూడవ నిమిషంలో (మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత పదమూడవ నిమిషంలో) రోదసీ నౌకను ప్రయోగించితే మరేమి జరగగలదని అనవచ్చు.

ఈ ఛాందసుల మాటలను పాటిస్తే, రోదసీయాత్రలకే పూర్తిగా స్వస్తి చెప్పవలసివస్తుంది. అందువల్ల వారిని, వారి మాటలను నిర్లక్ష్యంచేసి, ప్రమాద స్థితిలో పడిన రోదసీయాత్రికులను రక్షించడానికి చేతనైన సమస్తాన్ని ఇప్పుడు చేయాలి. "ఆక్సిజన్" తగినంతగా లేకపోవడం ప్రస్తుతం వీరిని యెదుర్కొంటున్న పెద్ద ప్రమాదం. దాన్ని ఏదో ఒక విధంగా అధిగమిస్తే, వాయుమండలంలో పునఃప్రవేశ సందర్భంలో పుట్టే వేడిమి రెండవ ప్రమాదం. అది కూడా తప్పితే, రోదసీనౌక దిగవలసిన పసిఫిక్ ప్రాంతంలో చెలరేగుతున్న తుపాను మూడవ ప్రమాదం. ఈ మూడింటిలో మొదటి రెండు ప్రమాదాల నివారణకు భూతలంపై వున్నవారు చేయగలిగింది స్వల్పం కావచ్చు. కాగా, మూడవదాన్ని నివారించడానికి సాధ్యమైన సమస్తాన్నీ చేయాలి. ఈ సందర్భంలో సహకరించడానికి కొన్ని సోవియెట్ నౌకలు రోదసీనౌక దిగగల ప్రాంతానికి వెళ్ళడం హర్షించదగు విషయం.

ప్రమాదం వచ్చినప్పుడే ఎవరి ధీరోదాత్తత ఏపాటిదో తెలుస్తుంది. అతి ఘోర ప్రమాదంలో చిక్కుకొన్నా, అపోలో-13 లోని ముగ్గురు రోదసీయాత్రికులు ఎంతో ధైర్యంగా, నిశ్చలంగా, మహోదాత్తంగా సంచరిస్తున్నారు. తమ ప్రవర్తనద్వారా వీరు సమస్తమానవాళి గౌరవాన్ని సంపాదించుకొన గలుగుతున్నారు. ఇంతే కాదు, మృత్యుసన్నిధిలోనైనా మానవుడు పరాజయాన్ని గుర్తించబోడని వీరు నిరూపిస్తున్నారు. పురాణాలలోని వీరుల, శూరుల గాథలు ఎంతవరకు నిజమో మనకు తెలియదు. ఈ వీరులు, శూరులు మాత్రం నిజమైన పురాణపురుషులు! వీరికి చేయెత్తి నమస్కరిస్తూ, ప్రస్తుత ప్రమాదంనుంచి వీరు సురక్షితంగా బయటపడాలని మనం మనసారా కోరుకోవాలి. ప్రస్తుత వైఫల్యాన్ని పాటించక, త్వరలోనే చంద్రమండల యాత్రకు వీరు తిరిగి బయల్దేరి, దాన్ని జయప్రదంగా పూర్తిచేయాలని కూడా మనం మనసారా కోరుకోవాలి. ప్రమాదాలను నిర్లక్ష్యం చేస్తేనే, మానవునికి పురోగతి! మృత్యువును ధిక్కరిస్తేనే మానవునికి అమృతత్వం!!

[ఏప్రిల్ 17, 1970]

దెబ్బపై దెబ్బ

మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఒక వైపునుంచి కాదు; అన్ని వైపులనుంచి దెబ్బ తగులుతున్నది, దెబ్బపై దెబ్బ తగులుతున్నది.

ఇది ఎవరో బాధ్యతలేని వ్యక్తులు, రాజకీయపక్షాలు మాత్రమే చేస్తున్న పని కాదు. దేశంలో అత్యున్నత అధికారపీఠాలలో కొన్నింటిని అధిష్ఠించినవారే ఈ అనుచితికి పాల్పడుతున్నారు; రాజ్యాంగసూత్రాలను పరిరక్షించ వలసినవారే వాటిని ఉల్లంఘిస్తున్నారు. ప్రజాస్వామ్య సంప్రదాయాలను నిలబెట్టవలసినవారే వాటిని పడగొడుతున్నారు.

మేము ఈ వాక్యాలను ఆవేశంతో వ్రాయడం లేదు, ఆందోళనతో వ్రాస్తున్నాము, మన ప్రజాస్వామ్యం చివరికి ఎక్కడికి పోనున్నదోనన్న ఆవేదనతోనే వ్రాస్తున్నాము.

ఈ వాక్యాలు మేము వ్రాయడానికి సరికొత్త ప్రేరణ ఉత్తరప్రదేశ్‌లో కొద్ది రోజులుగా జరుగుతున్న శోచనీయ సంఘటనలు. వీటికి బాధ్యులెవరన్నది ముఖ్యం కాదు; వారు ఎవరైనా కావచ్చు; వారికంటె ప్రజాస్వామ్యపు ఉత్తమ సంప్రదాయాలకు జరుగుతున్న అపచారమే ముఖ్యం.

ముఖ్యమంత్రి శ్రీ చరణ్‌సింగ్ తన మంత్రివర్గంలోని కొత్త కాంగ్రెసు మంత్రులను రాజీనామా చేయవలసిందిగా కోరాడు. వారిని మంత్రిపదవులకు ఆహ్వానించింది ముఖ్యమంత్రి కనుక, ముఖ్యమంత్రి కోరగానే వారు రాజీనామా చేసివుండవలసింది. ముఖ్యమంత్రికి తమ సమర్థనను ఉపసంహరించుకొన్నట్టు బాహాటంగా ప్రకటించికూడా వారు రాజీనామా చేయలేదు. ఇది యు.పి. లో పార్లమెంటరీ సంప్రదాయాలకు తగిలిన మొదటి దెబ్బ.

ఆ తర్వాత ముఖ్యమంత్రిని రాజీనామా చేయవలసిందిగా గవర్నరు కోరాడు. ఇది ఉచితమా, అనుచితమా అన్నది వేరే ప్రశ్న. ఆయన రాష్ట్రంలో రాజ్యాంగానికి అధినేత. ఆయన కోరిన వెంటనే ముఖ్యమంత్రి శ్రీ చరణ్‌సింగ్ రాజీనామా చేసివుండవలసింది. ఆ తర్వాతనే గవర్నరు కోర్కె ఉచితానుచితాలను ఆయన ప్రశ్నించి వుండవలసింది. ఆ విధంగా ఆయన చేయలేదు. ఇది పార్లమెంటరీ సంప్రదాయాలకు రెండవ దెబ్బ.

పోతే, గవర్నరు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి ఉత్తర ప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన వెంటనే విధించాలని ఎందుకు సిఫారసు చేయవలసివచ్చిందో మేము ఊహించలేకపోతున్నాము. అసెంబ్లీ మరి కొద్ది రోజులలో సమావేశం కానున్నది. కొత్త కాంగ్రెసు ఉపసంహరణతర్వాత శ్రీ చరణ్‌సింగ్‌కు మెజారిటీ వున్నదో, లేదో అసెంబ్లీలోనే పరీక్షకు పెట్టివుండవచ్చు. అంతే తప్ప, ఆయన రాజీనామాను కోరనవసరం లేదు.

పోనీ, రాజీనామా చేయవలసిందిగా ముఖ్యమంత్రిని తాను కోరిన తర్వాత ఆయన అందుకు నిరాకరించినప్పుడు గవర్నర్ ఆయనను బర్తరఫ్ చేసివుండవచ్చు. తిరిగి ఆయననే కొత్త మంత్రివర్గ నిర్మాణానికి ఆహ్వానించివుండవచ్చు; లేదా కొత్త కాంగ్రెసునో, పాత కాంగ్రెసునో, మరొకదానినో—ఏ పార్టీ మెజారిటీని సమకూర్చుకోగలదని తనకు తోస్తే, ఆ పార్టీని ఆహ్వానించి వుండవచ్చు.

గవర్నరు శ్రీ గోపాలరెడ్డి వీటిలో ఏదీ చేయలేదు. సంప్రదాయాలకు విరుద్ధంగా—అందుకు తగు పరిస్థితులైనా లేకుండా—కొంతకాలంపాటు రాష్ట్రపతి పాలనను విధించాలని, అసెంబ్లీని సస్పెండ్ చేయాలని ఆయన సిఫారసు చేశాడు. దీన్నిబట్టి శ్రీ చరణ్‌సింగ్‌కు తగు మెజారిటీ వున్నా, ఆయనను ముఖ్యమంత్రిగా కొనసాగనివ్వడం గవర్నర్‌కు ఇష్టంలేదని, కొత్త కాంగ్రెసుకు మెజారిటీ లేకపోయినా, దాన్ని సమకూర్చుకొనడానికి వ్యవధి నివ్వడం ఆయన అభిమతం కావచ్చునని ప్రతిపక్షాలవారు ఆరోపించడానికి అవకాశం కలగలేదా?

గవర్నరు సిఫారసును రాష్ట్రపతి ఆమోదించిన తీరుకూడా కొన్ని అనుమానాలకు, ఆరోపణలకు అవకాశ మిస్తున్నది. ఉత్తరప్రదేశ్‌లో రాజకీయ

సంక్షోభం రావడానికి మూడు, నాలుగు రోజుల ముందునుంచి ఆయన దేశంలో లేడు. ఇక్కడ ఏమి జరుగుతున్నదీ స్వయంగా పరిశీలించి తెలుసుకునే అవకాశం ఆయనకు లేదు. ఢిల్లీనుంచి కేంద్రప్రభుత్వం పంపించే నివేదికలే ఆయనకు ఆధారం ఉత్తర ప్రదేశ్ గవర్నరు నివేదిక, దానిపై కేంద్రప్రభుత్వపు అభిప్రాయాలు తనకు రాత్రి ఎప్పుడో ప్రొద్దుపోయిన తర్వాత కీవ్‌లో (సోవియట్ నగరం) అందినంతమాత్రాన సంగతి సందర్భాలను క్షుణ్ణంగా పరిశీలించకుండా తెల్లవారేసరికి ప్రెసిడెంట్ పాలనను విధిస్తూ ఉత్తర్వుపై సంతకం పెట్టవలసిన అవసరం ఆయనకు లేదు. వెంటనే తన పర్యటనను రద్దుచేసుకొని ఢిల్లీకి ఆయన తిరిగివచ్చి వుండవచ్చు, లేదా తన పర్యటన పూర్తికాగలవరకు ఉత్తర్వును ఆపుచేసి వుండవచ్చు.

కొన్నాళ్ళక్రిందట మాజీ సంస్థానాధీశుల భరణాలను రద్దుచేస్తున్న ఉత్తర్వుపై రాష్ట్రపతి సంతకం చేసిన తీరుకూడా ఇదే విధమైన విమర్శలకు అవకాశం కలిగించింది. ఆ సమయంలో ఆయన హైదరాబాద్ క్యాంప్‌లో వున్నాడు. కేంద్రం క్యాబినెట్ రాత్రి పదిన్నరకు సమావేశమైంది. మరొక పావుగంటకు భరణాలను రద్దుచేస్తూ అది నిర్ణయం చేసింది. క్యాబినెట్ సమావేశం కావడానికి ఎంతో ముందుగానే భరణాల రద్దు ఉత్తర్వుకు సంబంధించిన పత్రాలను ఒక ప్రత్యేక విమానం హైదరాబాదు తీసుకొని వెళ్ళడం, రాత్రి 11-10కి 11-50కి మధ్య రాష్ట్రపతి వాటిపై సంతకాలు చేయడం జరిగిపోయింది. రాత్రి 10-45కు గాని క్యాబినెట్ నిర్ణయం జరగనప్పుడు, మరొక అరగంట, లేదా ముప్పావు గంటలోనే రాష్ట్రపతి ఆ నిర్ణయంపై ఆధారపడిన ఉత్తర్వుపై ఏ విధంగా సంతకం చేశాడు? టెలిఫోన్ ద్వారానో, టెలిగ్రామ్‌ద్వారానో తెలియజేశారనుకొనడానికి ఆ సమయంలో లైన్లు సరిగా లేవట. అందువల్ల వైర్లెస్‌ద్వారా క్యాబినెట్ తన నిర్ణయాన్ని రాష్ట్రపతికి తెలియజేసినట్టు ఊహించుకోవాలి కాబోలు! ఒకవేళ ఆ విధంగా క్యాబినెట్ నిర్ణయాన్ని తనకు తెలియజేసినా, పూర్వాపరాలను ఆలోచించుకొనే వ్యవధికూడా తీసుకొనకుండా రాష్ట్రపతి సంతకం పెట్టవచ్చునా?

దాదాపు ఇదే పద్ధతిలో రాష్ట్రపతి మరొకసారి వ్యవహరించి, ఉత్తర ప్రదేశ్‌లో తలయెత్తిన రాజకీయసంక్షోభం స్వభావం ఎటువంటిదో, దానిపూర్వాపరాలు ఎటువంటివో తెలుసుకొనకుండా కీవ్ నగరంలో తనకు అందిన కాగితాలపై ఆయన సంతకం పెట్టడం బాధాకరమైన విషయం. ప్రజాస్వామిక సంప్రదాయాలకు తగిలిన మరొక దెబ్బగా దీన్ని భావించక తప్పడంలేదు.

[అక్టోబర్ 2, 1970]

మేధావుల కర్తవ్యం

నిజమే, నేటి రాజకీయరంగంలో మేధావులు నిర్వహించవలసిన పాత్ర ఎంతైనా వున్నది. ఇందుకు వారు వెనుకాడరాదని, సమాజంపట్ల తమ కర్తవ్యాన్ని తాము నిర్వర్తించాలని శ్రీ నీలం సంజీవరెడ్డి ప్రభృతులు ఇటీవల విజ్ఞప్తులు చేస్తున్నారు. ఈ విజ్ఞప్తులను మేధావులు పాటించగలరనే ఆశిస్తున్నాము.

మన జాతీయోద్యమం ప్రారంభమైంది మేధావులతోనే. ఆ ఉద్యమం ఆదిలో మత, సంఘ సంస్కరణల రూపాన్ని ధరించింది. నిద్రాణమైన జాతిని ఇట్టి సంస్కరణలద్వారా జాగరితంచేయడానికి రాజా రామమోహన రాయ్, దేవేంద్రనాథ్ టాగోర్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, దయానంద సరస్వతి, మహదేవ గోవింద రణడే, కేశవచంద్రసేన్, బి. ఎమ్. మలబారీ, శివనాథ శాస్త్రి, కందుకూరి వీరేశలింగంవంటి మహనీయు లెందరో తమ మేధాశక్తిని ధారవోశారు.

భారతీయ సమాజంలో వీరు తీసుకువచ్చిన కదలికను రాజకీయరంగం వైపు మళ్ళించినవారు కూడా మేధావులే. దాదాబాయ్ నౌరోజీ, ఆనందమోహన్ బోస్, ఫెరోజ్ షా మెహతా, గోపాలకృష్ణ గోఖ్లే, సురేంద్రనాథ్ బెనర్జీ, బిపిన్ చంద్రపాల్, అరవింద ఘోష్, బాలగంగాధర తిలక్, మదనమోహన మాలవ్యా వంటి మేధావులు దేశ స్వాతంత్రోద్యమానికి తొలిరోజులలో నాయకత్వం వహించారు; ప్రజాహృదయాలలో ఎన్నటికీ ఆరని దేశభక్తి జ్యోతిని వెలిగించారు.

గాంధియుగంలో మేధావులకు ప్రాధాన్యం తగ్గినమాట నిజమే. కాని సి. ఆర్. దాస్, మోతీలాల్ నెహ్రూ, రాజగోపాలాచారి, మౌలానా ఆజాద్, పట్టాభి సీతారామయ్యలవలె ఆ యుగంలో సయితం మన స్వాతంత్రోద్యమంలో ప్రముఖపాత్ర వహించిన ధీశాలురు పలువురు లేకపోలేదు.

కాని, స్వాతంత్రోద్యమం చివరిఘట్టాలను చేరుతున్న కొద్దీ ఇట్టివారి సంఖ్య, ప్రాబల్యం కూడా తగ్గుతూ వచ్చింది. స్వాతంత్ర్యసిద్ధి తర్వాతకాలంలో వీరి పాత్ర దాదాపుగా మృగ్యమైపోయింది. ఈనాడు రాజకీయాలనుగురించి మేధావులైనవారు పట్టించుకొనడమే లేదు. అంతే కాదు నేటి రాజకీయాలను వారు అసహ్యించుకొంటున్నారు. వాటి కొక నమస్కారం పెట్టి, వీలైనంత దూరంగా వుండి పోతున్నారు.

ఔను! నేటి రాజకీయరంగం అసహ్యించుకొనదగినట్టిదే. పదవులు సంపాదించడానికి, పర్మిట్లు రాబట్టడానికి, లైసెన్సులు చేజిక్కించుకొనడానికి, కోటాలు తెచ్చుకొనడానికి, డబ్బు మూట కట్టడానికి అది నేడు ముఖ్యరంగ మైపోయింది. ప్రజా సేవ అన్న పదానికి నేటి రాజకీయనిఘంటువులో స్థానం లేదు. అవినీతి, బంధుపక్షపాతం, మతదృష్టి, కులాభిమానం, అధికారవ్యామోహం—ఇవే నేటి రాజకీయాలకు మూలకందాలు!

నేటి రాజకీయాలను కేవలం అసహ్యించుకొనడంతో మేధావులబాధ్యత తీరిపోగలదా? తమపరిసరాలు దుర్గంధభూయిష్ఠమైనప్పుడు ఎవరైనా ముక్కు మూసుకొనడం సహజమే. కాని, ఎంతకాలం ముక్కుమూసుకొని కూర్చుంటారు? ఆ దుర్గంధానికి కారణమైన మురికిగుంటలను తొలగించాలి కదా?

నేటి మన రాజకీయరంగంలో ఇట్టి దుర్గంధకూపాలు ఎన్నో వున్నాయి. వాటిని అసహ్యించుకొనడంతో, లేదా విమర్శించడంతో సరిపుచ్చక, వాటిని తొలగించడానికి మేధావులు ముందుకు రావాలి. ప్రస్తుతపు రాజకీయదుర్గంధ కారణాలను నిశితంగా పరిశీలించి, వాటిని అవగాహన చేసుకొని, వాటి నిర్మూలన మార్గాలను అన్వేషించగలిగిన తామే అందుకు సన్నద్ధ పడకపోతే, ఆ పని మరెవరు చేస్తారు?

తమ మాట ఎవరు వింటారని నిస్పృహచెందడం, తమ మాట నెగ్గుతుందా అని నిరాశ చెందడం ధీమంతుల లక్షణం కాదు. ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా మేధావులు అల్పసంఖ్యాకులే! తమ మాట నెగ్గుతుందా అని రామమోహన్ రాయ్, విద్యాసాగర్, రణడేవంటి మేధావులు నిరాశ చెందివుంటే, భారతీయ

సమాజాన్ని కొన్ని శతాబ్దాలుగా దుర్బలం చేసిన స్తబ్ధత తొలగిపోయి వుండేదా? సహగమన నిషేధం, స్త్రీ విద్య, వితంతుపునర్వివాహంవంటి సంస్కరణలు సాధ్యమై వుండేవా?

తాము అల్పసంఖ్యాకులమన్న నిస్పృహనుంచి మేధావులు బయటపడాలి. అవసరమైతే ఒంటరిగానైనా నిలబడి, దేశానికి శ్రేయస్కరమైనవని తాము భావిస్తున్న సిద్ధాంతాల పరిరక్షణకోసం పోరాడాలి. నేటి కలుషితరాజకీయాలను ప్రక్షాళన చేయడానికి, పతనమైన నైతికపు విలువలను పునరుద్ధరించడానికి, ఒకనాటి మహోన్నతాదర్శాలతో ప్రజలను తిరిగి ఉత్తేజితులను చేయడానికి మేధావులు ముందుకు రావాలి. ఇందుకు ముందుగా తాము స్వయంగా నిరాశా నిస్పృహలనుంచి బయటపడాలి; ముందుగా తమ స్తబ్ధతను వదలించుకోవాలి.

[నవంబర్ 1, 1970]

ఇండియా ఆఫీసు లైబ్రరీ

లండన్‌లోని ఇండియా ఆఫీసు లైబ్రరీ భవిష్యత్తు విషయమై బ్రిటన్, ఇండియా, పాకిస్తాన్‌ల ప్రతినిధులమధ్య ఒప్పందం కుదిరిందట. ఈ లండన్ లైబ్రరీ, ఇండియా, పాకిస్తాన్‌లలోవున్న లైబ్రరీలు పరస్పర సహకారం నెరపు కొనడం విషయంలో కూడా ఒడంబడిక కుదిరిందట.

లండన్‌లోని ఇండియా ఆఫీసు లైబ్రరీ అమూల్యమైనట్టిది. ఇండియాను గురించి ముఖ్యంగా బ్రిటిష్ పరిపాలనాకాలంనాటి ఇండియానుగురించి తెలుసు కొనగోరేవారికి, పరిశోధన జరపదలచిన చరిత్రకారులకు నిశ్చయంగా ఇది "కొంగు బంగారం" వంటిది.

1801లో స్థాపించిన ఈ లైబ్రరీలో అయిదులక్షల సంపుటాలు వున్నాయి. వీటిలో ఎనిమిదివేల సంస్కృత తాళపత్రగ్రంథాలు, రెండున్నర లక్షల అధి కార పత్రాలు, 37 వేల చిత్తరువులు కూడా వున్నాయి. ఇండియాపై వ్రాసిన గ్రంథాలే కాక, ఈస్టిండియా కంపెనీకి సంబంధించిన చారిత్రక పత్రాలు కూడా అనేకం దీనిలో వున్నాయి. పైగా, బ్రిటిష్‌ప్రభుత్వంలో ఇండియా వ్యవహారాల మంత్రులుగాను, ఇండియాలో వైస్రాయిలుగాను పనిచేసినవారితో సహా 120 మంది ప్రముఖవ్యక్తుల ప్రవేయిట్ పత్రాలను, లేఖలను కూడా ఈ గ్రంథాల యం ఇటీవల సేకరించింది.

ఈ లైబ్రరీ ఇండియా ఆస్తి కాబట్టి, దీన్ని ఇండియాకు అప్పగించాలని కొంతకాలంక్రితం మన కేంద్ర ప్రభుత్వం బ్రిటన్‌ను అభ్యర్థించింది. దానిలో తమకు కూడా భాగస్వామ్యం వున్నదని పాకిస్తాన్ పేచీ పెట్టగా, ఇండియా చరిత్రకు సంబంధించిన గ్రంథాలను ఇండియాకు, పాకిస్తాన్‌వి ఆ దేశానికి పంపించాలన్న ప్రతిపాదన జరిగింది.

కాని, ఈ ప్రతిపాదన ఆచరణయోగ్యమైనదని మేము భావించడం లేదు. ఇండియా, పాకిస్తాన్‌ల చరిత్ర 1947 వరకు ముడివడి లేదా? అయినప్పుడు. మన ఉపఖండం చరిత్రకుసంబంధించిన గ్రంథాలలో ఇండియాకు చెందినవి, పాకిస్తాన్‌కు చెందినవి వేరుచేయడం సాధ్యమా? అందువల్ల ఈ లైబ్రరీని లండన్ నుంచి కదిలించకుండా అక్కడనే వుంచడమే మంచిదని మాకు తోస్తున్నది.

ఈ సందర్భంలో ఒక విషయం గమనార్హం. కలకత్తాలోని నేషనల్ లైబ్రరీ, మద్రాసులోని కన్నెమరా లైబ్రరీవంటి పెద్ద గ్రంథభాండాగారాలు ఇండియాలో లేకపోలేదు. వీటిలోని అమూల్యమైన గ్రంథాలనే మనం సక్రమంగా భద్రపరచుకొన లేకపోతున్నాము. ఇప్పుడు మనకున్న గ్రంథాలనే మనం సరిగా జాగ్రత్త చేసుకోలేక పోతున్నప్పుడు, ఇండియా ఆఫీసు లైబ్రరీని లండన్‌నుంచి తెప్పించి, దాన్ని హీనస్థితికి దిగజారదీయడం విజ్ఞతగా కనిపించదు. పోతే, ఇండియా ఆఫీసు లైబ్రరీని ఇటీవలనే లండన్‌లో కొత్తగా నిర్మించిన పదహారు అంతస్తుల భవనంలోకి మార్చారట. అయినప్పుడు దాన్ని అక్కడనే వుంచితే గ్రంథాలు భద్రంగా వుంటాయికదా! తగినంత విశాలభవనం లేక బొంబాయి లోని మన ఏసియాటిక్ సొసైటీ లైబ్రరీ "నానాటికి తీసికట్టు నాగంభొట్టు" స్థితిలో పడిపోలేదా?

ఇండియా ఆఫీసు లైబ్రరీని ఇండియా, పాకిస్తాన్‌లకు ఒక వేళ పంచి యిచ్చినా, ఇండియా మాజీ మంత్రులు, వైస్రాయిలకు సంబంధించిన ప్రయివేట్ పత్రాలను, లేఖలను బ్రిటిష్ ప్రభుత్వం అట్టేపెట్టుకొనగలదట. ఇవి లేకుండా ఆ లైబ్రరీని మనం పుచ్చుకొంటే, దాని విలువ తగ్గిపోతుంది. మనకు అవసరమైన గ్రంథాలు, పత్రాల మైక్రో ఫిల్ములను తీసుకొనడం ఈనాడు సులభం కాబట్టి, ఆ పని చేయడంద్వారా, ఇండియాలో ఆఫీసు లైబ్రరీని లండన్‌నుంచి కదల్చకుండానే దాని పూర్తిప్రయోజనాన్ని మనం పొందవచ్చు.

ఈ సందర్భంలో మనకు సంబంధించిన ఒక ముఖ్య విషయాన్ని కూడా గమనించాలి. పదిహేడు, పద్దెనిమిది, పంథొమ్మిదవ శతాబ్దాల ఆంధ్రచరిత్రను గురించి సరిగా పరిశోధన జరగలేదు, గ్రంథాలు వెలువడలేదు. ఉదాహరణకు,

బెంగాల్, బీహార్, మలబార్‌లలో డచ్‌వారి పరిపాలనాకాలానికి సంబంధించిన గ్రంథాలు అనేకం వుండగా, ఆంధ్రప్రాంతంలో వీరి ఉనికికి సంబంధించిన గ్రంథం ఒక్కటైనా రాలేదు. అలాగే ఇండియాలో ఫ్రెంచిపాలనకు సంబంధించిన గ్రంథాలు ఇంగ్లీషులో, ఫ్రెంచిలో అనేకం వెలువడగా, ఆంధ్రప్రాంతానికి సంబంధించింది ఒక్కటి కూడా రాలేదు. ఆంధ్రప్రాంతంతో బుడతకీచుల సంబంధాన్ని గురించి కాని, మచిలీపట్నంలో బ్రిటిష్, ఫ్రెంచి, డచ్‌వారి పోటాపోటీలనుగురించి కాని ఒక గ్రంథమైనా లేదు. ఇక పద్దెనిమిది, పంధొమ్మిదవ శతాబ్దాలలో ఆంధ్రుల సాంఘిక, ఆర్థిక పరిస్థితులనుగురించి మనకు బొత్తిగా తెలియదు. ఇదే కాలానికి సంబంధించి బెంగాల్, కేరళ ప్రాంతాల పరిస్థితులపై చాలా పుస్తకాలు వచ్చాయి.

కడచిన మూడు శతాబ్దాల ఆంధ్రచరిత్రపై వెలుగును ప్రసరించగల గ్రంథాలు, చారిత్రకపత్రాలు ఇండియా ఆఫీసు లైబ్రరీలో కొల్లలుగా వున్నాయి. మన యూనివర్శిటీల లైబ్రరీలకు, స్టేట్ లైబ్రరీకి, ప్రాంతీయగ్రంథాలయాలకు వీటి మైక్రోఫిల్ములను తెప్పించడానికి ప్రయత్నం జరగడమేమి, అవి ప్రాతిపదికగా గతమూడు శతాబ్దాల ఆంధ్రచరిత్ర రచనకు చారిత్రక పరిశోధకులు పూనిక చూపడమేమి ముఖ్యావసరం.

[డిసెంబర్ 15, 1970]

"స్లోగన్స్ యుగం"

"స్లోగన్" అనే మాటను సి. పి. బ్రౌన్ తన ఇంగ్లీషు - తెలుగు నిఘంటువులో ఎక్కించనే లేదు. ఇది సర్ ఎమ్. మోనియర్ విలియమ్స్ ఇంగ్లీషు-సంస్కృతం నిఘంటువులో సయితం కానరాదు. వారి కాలంలో "స్లోగన్స్" అసలే లేవని అనుకోలేము. అయితే, అప్పటిలో చెదురుగా తప్ప అవి వినవచ్చేవి కాదు కాబోలు: పైగా, అప్పటిలో వాటికి ప్రజలు అంతగా ప్రాధాన్య మిచ్చేవారు కాదు కాబోలు. కాని, ఇప్పుడు మాత్రం వాటి కున్నంత ప్రాధాన్యం మరి వేటికీ లేదు. నిజానికి ఇప్పటిదాన్ని "స్లోగన్స్ యుగం" అనవచ్చునేమో !

"స్లోగన్"కు మొట్టమొదటి అర్థం "యుద్ధనినాదం". ఇప్పుడు మాత్రం యుద్ధరంగంలో కంటె రాజకీయరంగంలోనే ఇది హెచ్చుగా వినవస్తున్నది; చెవులు చిల్లులు పడవచ్చునని భయపడవలసినంత హెచ్చుగా వినవస్తున్నది. ఎంతటి అధర్మయుద్ధంలోకైనా సైనికులను కళ్లు మూసుకొని దూకించడానికి సేనానులకు "స్లోగన్" ఒకనాడు ఎంతగానో తోడ్పడివుండవచ్చు. ఈ కిటుకును కనిపెట్టినందువల్లనే కావచ్చు, కళ్లు మూసుకొని ప్రజలను గోతిలో దూకించ డానికి "స్లోగన్"ను రాజకీయనాయకులు దేశదేశాలలో ప్రస్తుతం విరివిగా వినియోగిస్తున్నారు.

... ...

ఒక పెద్ద నల్లమందు మాత్రకంటె ఒక "స్లోగన్" ఎక్కువగా మత్తు కలిగిస్తుంది. దాని మత్తులో పడితే, మెదడు మరి పని చేయదు. పందిని చూపించి "ఇది నంది" అంటే "ఔనౌను" అనే పాటివరకు బుద్ధిజాడ్యం పెరుగుతుంది. అందువల్ల విజ్ఞులైనవారు "స్లోగన్"కు ఎంతమాత్రం విలువనీయరు. వాటిని విని పించుకోనైనా వినిపించుకోరు. అదే పనిగా వాటిని సృష్టించేవారిని, ప్రయోగించే వారిని కంటగించుకొంటారు కూడా.

ఈనాడు లోకసభకు ఎన్నికల సందర్భంలో వినవస్తున్న "స్లోగన్స్"ను, అవి ఏ పార్టీవారివైనా, ఓటర్లు నిర్లక్ష్యం చేయాలి. ఇతర సమయాలలో కంటె ఎన్నికల సందర్భంలో వాటిలో మరింత మత్తు వుంటుంది, మరింతగా మోసం వుంటుంది. వాటిని నమ్ముకోవడం కళ్లుమూసుకొని గోతిలో దూకడమే, చేజేతులా మెడకు ఉరి పెట్టుకోవడమే?

ఈనాడు ఎన్నికలలో పోటీచేస్తున్న పార్టీలలో ఏదీ కొత్తది కాదు; పోటీ చేస్తున్నవారిలో కూడా చాలామంది కొత్తవారు కాదు. అందువల్ల ఆ పార్టీల మంచి చెడ్డలు ప్రజలకు తెలుసు, ఆ అభ్యర్థుల మంచిచెడ్డలు కూడా తెలుసు. అందువల్ల వాటి - లేదా, వారి - "స్లోగన్స్"ను పెడచెవిని పెట్టి, దేనికి - లేదా ఎవరికి - తమ ఓటు వేస్తే, తమకు, తమబిడ్డలకు, తమ దేశానికి మేలు కలుగుతుందో—కనీసం చెరుపు జరగకుండా వుంటుందో - దానికే లేదా, వారికే — తమ ఓటు వేయాలి.

ఏ దృష్టినుంచి చూచినా ప్రస్తుతం మన దేశం ఘోరస్థితిలో వున్నది; మన సరిహద్దుల వెలుపల ఈనాడు మనకు పలుకుబడి లేదు, ప్రతిష్ఠ లేదు. సరిహద్దుల లోపల శాంతి లేదు, భద్రత లేదు. పంటలు పుష్కలంగా పండుతున్నా, కొందరికి పస్తులు తప్పడం లేదు. సంపద పెరుగుతున్నా, చాలా మందికి దారిద్ర్యం తప్పడం లేదు. మనది ప్రజాస్వామ్యమైనా, బ్రిటిష్‌వారి కాలంలోకంటె నేడు అధికారంలోగల కొందరు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. సత్యం స్థానాన్ని "స్లోగన్" ఆక్రమిస్తున్నది; నీతిని ప్రక్కకుతోసి, అవినీతి తిష్ఠ వేస్తున్నది; త్యాగాన్ని స్వార్థం వెక్కిరిస్తున్నది; ఉదాత్తత కంటిని నైచ్యం వేలుతో పొడుస్తున్నది. ఈ ఘోర పరిస్థితులనుంచి దేశాన్ని కాపాడగలిగింది "స్లోగన్స్"కు భ్రమపడని విజ్ఞత మాత్రమే! అట్టి విజ్ఞతను ప్రజలు ప్రదర్శించగలరనే ఆశిస్తున్నాము.

[మార్చి 1, 1971]

పౌరులవిధి

తమలో పెక్కుమందికి చదువు సంధ్యలు లేవు; ఏ పూట పని మాను కొంటే, ఆ పూట తమ పొయ్యిలోనుంచి పిల్లి లేవదు. అయినా "లోకసభకు ఎవరు ఎన్నికైతే మన కేమి?" అనుకోకుండా మొదటిరోజు పోలింగ్‌లో నూటికి యాభైమందికి పైగా వోటర్లు పాల్గొన్నారు. కొన్నిచోట్ల నూటికి 85 మంది కూడా పాల్గొన్నారు. పోటీచేస్తున్న వారిలో తమకు నచ్చినవారు, తాము చేయెత్తి నమస్కారం పెట్టదగువారు తమ నియోజకవర్గంలో మచ్చుకైనా లేరన్న నమ్మకంవల్లనే, లేదా పోలింగ్‌స్టేషన్‌కు వెళ్లడానికి ఏవో యిబ్బందులు, సబ్బందులు కలిగినందువల్లనే తక్కినవారు తమ వోటింగ్ హక్కును విని యోగించుకొన లేదని అనుకోవడం పొరపాటు కాదేమో।

ఏమైనా, మొదటిరోజు పోలింగ్‌లో నూటికి 50 మొదలు 85 వంతుల వరకు వోటర్లు పాల్గొనడం గొప్ప విశేషమే। బ్రిటన్, ఫ్రాన్సు, జర్మనీ, అమెరికావంటి దేశాలలో సయితం నూటికి నూరుపాళ్లు వోటుచేయరు. అయితే, నిన్నటి పోలింగ్ సందర్భంలో కొన్నిచోట్ల దౌర్జన్యాలు జరగడం, ఇద్దరు చని పోవడం శోచనీయం. ఎన్నికల సందర్భంలో పట్టుదలలు హెచ్చడం, ఆవేశ కావేషాలు పెరగడం సహజమే. ముఖ్యంగా ఇప్పటి యెన్నికలలో - మన ప్రజాస్వామ్య వ్యవస్థ చావు బ్రతుకులను తేల్చనున్న యెన్నికలలో - అవి మరింత సహజం. అయినా, దౌర్జన్యాలవరకు, హత్యలవరకు, వాటిని పోనివ్వడం విజ్ఞత కాదు. అది మన ప్రజాస్వామ్య వ్యవస్థకే ఒక పెద్ద మచ్చ, ఒక గట్టి దెబ్బ.

మొదటిరోజు పోలింగ్ ముగిసీముగియక ముందే కొందరు రాజకీయ ప్రముఖులు "గెలుపు మాదే!" అనే ధోరణిలో ప్రకటనలు చేశారు. బుకాయింపు తెలియనివారికి ఏనాటి రాజకీయాలలోనైనా స్థానం లేదు; ఈనాటి రాజకీయాలలో

బుకాయింపుతోపాటు బొల్లులు, మాయలు, మోసాలు, తలల మార్పిడులు వగైరాలు అవసరమన్నట్టు కనబడుతున్నది. అందువల్ల, ఓడిపోతున్నట్టు తెలిసినా, "గెలుపు మాదే!" అని వారు చెప్పరా? గట్టిగా ఆ మాట చెప్పకపోతే, బల్లగుద్ది ఆ మాట చెప్పకపోతే, ఈనాటి పాటిగానైనా రేపు తమకు వోట్లుపడకపోవచ్చునని వారికి తెలియదా? కాబట్టి ఈ విధమైన ప్రకటనలకు, ప్రగల్భాలకు ప్రజలు ఎంతమాత్రం విలువ నివ్వనక్కరలేదు.

కాగా, తాము చేయవలసింది ఏదో ఒక వ్యక్తిగతమైన, సంకుచితమైన, పాక్షికమైన, తాత్కాలికమైన ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొనక, ప్రజాహితానికి, దేశం భవిష్యత్తుకు ప్రాధాన్యమిచ్చి, అందుకు అనుగుణంగా వోటు చేయడమే! ఇదివరలో జరిగిన ఎన్నికల పోలినవి కావివి. ఇప్పుడు వోటర్లు చేసే నిర్ణయంపై రానున్న అయిదేళ్ళలో ఎవరు మన దేశాన్ని పాలించనున్నారన్న విషయం మాత్రమే కాక, ఒక ప్రజగా, ఒక జాతిగా మన భవిష్యత్తు ఆధారపడబోతున్నది.

చర్చిల్ సామాన్యుడా, డిగోల్ సామాన్యుడా? వారిద్దరూ తమ దేశాలను ఘోరవిపత్కాలంలో రక్షించిన మహానాయకులు. అయినా తమ స్వేచ్ఛకు, స్వాతంత్ర్యానికి, పురోగతికి వారి విధానాలు భంగకరం కాగలవని తోచినంతనే వారికి, వారి పార్టీలకు వ్యతిరేకంగా వోటు చేయడానికి బ్రిటిష్, ఫ్రెంచి పౌరులు అణుమాత్రమైనా సంకోచించలేదు. ఇదే విధమైన విజ్ఞతను ఇప్పుడు మనంకూడా ప్రదర్శించాలి. అప్పుడుగాని మన ప్రజాస్వామ్యం నిలవదు, అప్పుడుగాని మన భవిష్యత్తు పదిలం కాదు.

ఏ యెన్నికలలోనైనా వ్యక్తులను కాక, వారి పార్టీలను దృష్టిలో పెట్టుకుని వోటు చేయాలి; వాటి పాత రికార్డును దృష్టిలో పెట్టుకొని వోటు చేయాలి. ఈ యెన్నికల సందర్భంలో ఇది మరింత ముఖ్యం. నియంతృత్వంవైపు మొగ్గుతున్న పార్టీల అభ్యర్థులలో ఒక్కరిని గెలిపించినా, అది నియంతృత్వానికి ఒక వోటు కాగలదన్న విషయాన్ని మరిచిపోరాదు.

[మార్చి 3, 1971]

అవినీతి నిరోధం

ప్రభుత్వంలో అవినీతినిగురించి ఇటీవల మనం అధికంగా వింటున్నాము. దాని ఫలితాలను అధికతరంగా అనుభవిస్తున్నాము. అయితే, ఇది కొత్తగా పుట్టిన జబ్బు కాదు; అన్ని కాలాలలోనూ ఇది వుంటూ వచ్చింది. ఒక్క మన దేశంలోనే కాదు, అన్నింటిలోనూ వుంటూ వచ్చింది. కౌటిల్యుని అర్థ శాస్త్రాన్ని పరిశీలిస్తే, ప్రభుత్వంలో అవినీతిప్రసక్తి దానిలో కానవస్తుంది. ఇతర దేశాలకు సంబంధించిన ప్రాచీనగ్రంథాలను పరిశీలించినా దీని ప్రస్తావన కనబడుతుంది. కాని, ఈ అవినీతి స్వాతంత్ర్యానంతరం ఆసియా, ఆఫ్రికా దేశాలలో కానవస్తున్నంత తీవ్రంగా లోగడ ఏ కాలంలోను, ఏ దేశంలోను లేదేమో !

ఒక్కసారి మంత్రి పదవిని పొందడం మూడు, నాలుగు తరాలవరకు సరిపడినంతగా మూట కట్టడానికి ఒక మహదవకాశమన్న భావం ఇటీవల అధికాధికమై పోతున్నట్టు కానవస్తున్నది. ప్రతివారు అలాగే భావిస్తున్నారని, తదనుగుణంగానే వ్యవహరిస్తున్నారని మా అభిప్రాయం కాదు. కాని, మంత్రిపదవిని గురించి అలా అంచనా వేయనివారు చెదురుగానే తప్ప ప్రస్తుతం లేరనడం అత్యుక్తి కాదు. మన దేశాన్నే చూడండి. పది, పదిహేను సంవత్సరాల క్రితం మంత్రివర్గంలోని అవినీతిపరు లెవరని వెతకవలసి వచ్చేది. ఇప్పు డేమో నీతిపరు లెవరని వెతకవలసి వస్తున్నది.

మంత్రులైనవారే ఇంతగా అవినీతికి పాల్పడుతున్నప్పుడు ప్రభుత్వోద్యోగులలో అవినీతి పెరగడం అత్యంత సహజమే. అందువల్లనే ప్రభుత్వ యంత్రాంగంలో సయితం పది, పదిహేను సంవత్సరాలకంటె ఈనాడు అవినీతి హద్దులు మీరుతున్నదని చెప్పవచ్చు.

అవినీతి ఇంతగా పెచ్చరిల్లి పోవడానికి మరొక ప్రత్యేక కారణం కూడా వున్నది. మంత్రులైనవారు స్వలాభంకోసం కాకపోయినా, తమ పార్టీ ప్రయోజనాలకోసం అక్రమమైన పద్ధతులద్వారా నిధుల సేకరణకు తమ ప్రభుత్వోద్యోగులను నియోగిస్తున్నారు. తాము చేస్తున్న రసీదులేని వసూళ్ళలో ఎంతో కొంత భాగాన్ని ఉద్యోగులు తమ జేబులో వేసుకొనక పోవడానికి వారు మహాత్ములు కారు.

ఇంతగా మితిమీరిపోయిన అవినీతి విషయమై ప్రజలలో అసంతృప్తి కాని, ఆందోళనకాని అంతగా కానరాకపోవడం ఒక జాతిగా మనకు మంచిది కాదు. అవినీతిని నిత్యజీవితంలో ఒక భాగంగా, అనివార్యమైన ఒక అనుభూతిలా ప్రజలు భావించడం అత్యంత ప్రమాదకరమైన పరిణామం. అయితే, అవినీతినిగురించి మన దేశంలో బొత్తిగా ఆందోళన కానరావడం లేదని మా తాత్పర్యం కాదు. అప్పుడప్పుడు పార్లమెంటులోను, అసెంబ్లీలలోను దీని ప్రసక్తి రాకపోవడం లేదు; అవినీతినిరోధకశాఖలను ప్రభుత్వాలు ఏర్పరచక పోనూ లేదు. అయితే, అవినీతినిరోధకశాఖలవారి వార్షిక నివేదికలను చూస్తే, వారి వలలో చిక్కుతున్నవి చిరుచేపలే కాని, పెద్ద పెద్దవి అరుదుగా తప్పలేదని స్పష్టపడుచున్నది.

ప్రెసిడెంట్ సుకర్ణో చివరిరోజులలో ఇండొనేసియాలో కూడా అవినీతి విలయతాండవం చేసింది. దీన్ని రూపుమాపాలని విద్యార్థులు తీవ్రమైన ఆందోళనచేసిన ఫలితంగా, ఎనిమిది నెలలపాటు తర్జనభర్జనలు జరిపిన పిమ్మట ఇండొనేసియన్ పార్లమెంటు అవినీతినిరోధక శాసనాన్ని ఆమోదించింది. దీని ప్రకారం అవినీతికి పాల్పడినవారికి యావజ్జీవిత కారాగారశిక్ష వేయవచ్చు; 5,00,000 రూపాయలవరకు జరిమానా విధించవచ్చు. ప్రభుత్వోద్యోగి ఎవరి నుంచి, ఏ రూపంలో ఏ బహుమతి పుచ్చుకొన్నా, దాన్నిగురించి అతడు తన ఉన్నతాధికారికి వీలైనంత త్వరగా తెలియజేయాలని ఈ శాసనంలో పేర్కొనడం సముచితంగా వున్నది. అలాగే ఒక వ్యక్తికి అతిస్వల్ప వ్యవధిలో ఆస్తిపాస్తులు పెరిగితే, అవి ఏవిధంగాపెరిగినవో సంజాయిషీ చెప్పవలసిన బాధ్యతను అతనిపైనే పెట్టడం, సైనికాధికారులైనవారు అవినీతికి పాల్పడితే, వారిని సయితం విచారించే అధికారం పౌరన్యాయస్థానాల కివ్వడం ఈ శాసనంలోని మరి రెండు ఉత్తమసూత్రాలు.

అయితే, ఇంత కఠిన నిబంధనలతో వున్న ఈ శాసనంలో కూడా ఒక పెద్ద లోపం కానవస్తున్నది. లోగడ అవినీతికి పాల్పడినవారికి ఇది వర్తించదట. తప్పు ఇదివరకు చేసినా, ఇప్పుడు చేసినా, ఇకముందు చేసినా అది తప్పే. ఇదివరలో అవినీతి ద్వారా కొల్లగొట్టిన ప్రజాధనంపై ఈ శాసనం ధర్మముద్ర వేయడం ఎంతమాత్రం భావ్యంగా లేదు. పోతే, ఇప్పటికి మాకు చేరిన భోగట్టా ప్రకారం, ఈ శాసనంలో ప్రభుత్వోద్యోగుల ప్రసక్తే తప్ప, మంత్రుల ప్రస్తావన కనబడదు. అయినా, వారికి కూడా ఇది వర్తిస్తుందనే అనుకొంటున్నాము. ఈ విధమైన శాసనం మన దేశంలో కూడా అత్యవసరమని మేము భావిస్తున్నాము. సోషలిస్టుసమాజ సంస్థాపనకు నడుం కట్టుకొన్నానని చెప్పుకొంటున్న మన కేంద్ర ప్రభుత్వం ఇలాంటి శాసనాన్ని మన దేశంలో కూడా తీసుకురాకపోతే, నిజమైన సోషలిస్టుసమాజ సంస్థాపన సాధ్యపడదు.

[మార్చి 15, 1971]

నియంతలు, నియంతృత్వం

ప్రజాస్వామ్యంతో విసుగెత్తిన సందర్భాలలో కొందరు "దేశ పరిస్థితులను చక్క దిద్దడానికి కొంతకాలంపాటు సైనిక నియంతృత్వం నెలకొనా" లని కోరుకొనడంకద్దు, మన దేశంలో సయితం ఈ కోర్కెను కొందరు అక్కడక్కడ చెదురుగా వెల్లడిస్తున్నారు. ఇట్టివారు ఒక ముఖ్య విషయాన్ని మరచిపోతూవుంటారు. అది సైనిక నియంతృత్వమైనా, మరొక నియంతృత్వమైనా రమ్మనప్పుడు రావచ్చుగాని, పొమ్మన్నప్పుడు పోదు.

నియంతృత్వాన్ని నెలకొల్పిన వ్యక్తిని, అతడు బలహీనపడితే, మరొకడు తొలగించవచ్చు. అయితే, అప్పుడు వచ్చే మార్పు ఒక నియంతస్థానాన్ని మరొకడు ఆక్రమించడమే! పాకిస్తాన్‌లో అయూబ్ పోతే, అతడి స్థానంలో యాహ్యాఖాన్ బైఠాయించలేదా? నియంత ఎవరిని శాసించినా, మృత్యువును శాసించలేడు కాబట్టి, అతడు కాలధర్మం చెందితే, అతడి స్థానాన్ని మరొక నియంత ఆక్రమించడం తరచు జరుగుతూ వుంటుంది. ఈజిప్టులో నాసర్ కాల ధర్మం చెందగా, అతడి స్థానానికి సాదత్ రాలేదా?

నియంతలకు స్వజన, పరజన భేదం లేదు. తమ పదవికి, తమ ప్రాబల్యానికి అడ్డుగా నిలుస్తున్నట్టు తోస్తేచాలు, ఎవరినైనావారు ఊచకోతకోస్తారు. స్త్రీలు, శిశువులు, వృద్ధులన్న సంకోచమైనా లేకుండా, తూర్పు పాకిస్తాన్‌లో వేలమందిని, లక్షలమందిని యాహ్యాఖాన్ ఈనాడు చంపడం లేదా? జనపదాలపై టాంకులను, విమానాలను ప్రయోగించడం లేదా?

నాయకత్వంవిషయంలో తమకు ప్రత్యర్థులు కాగలరని తోస్తే, తమ సహచరులను బంధించడానికి, కొన్ని సందర్భాలలో వారిని "సఫా" చేయించడానికి సయితం నియంతలు సంకోచించరు; ఈజిప్టులో వారం, పదిరోజుల ఈలోపల

సాదత్ తన సహచరులలో ఎంతమందిని పదవీభ్రష్టులను చేయలేదు, ఎంత మందిని కారాగారబద్ధులను చేయలేదు ?

హిట్లర్, ముసోలినీ, స్టాలిన్‌లతో నియంతలు ప్రారంభం కాలేదు ; యాహ్యాఖాన్, సాదత్, మావోలతో నియంతలు అంతం కాబోవడం లేదు. ప్రజాస్వామ్యంపట్ల, ప్రజాస్వామ్య జీవితవిధానంపట్ల, ప్రజాస్వామ్యపు విలువల పట్ల ఎప్పుడు ప్రజలలో పట్టుదల తగ్గుతుందో, ఎప్పుడు అనాలోచితంగా వారు "కొంతకాలంపాటు మనకు, మన దేశానికి నియంతృత్వంకావా"లని కోరుకొనడం ప్రారంభిస్తారో, అప్పుడు నియంతలు తలయెత్తుతూవుంటారు. అందువల్ల స్వాతంత్రప్రియులు, ప్రజాస్వామ్యాభిలాషులు చివరికి కలలోనైనా కొంతకాలం పాటు నియంతృత్వం కావాలని కోరుకోరాదు.

వెనుకటి కాలంలోకంటె ఇప్పుడు నియంతలు నూరు రెట్లు, వెయ్యిరెట్లు, ఎక్కువగా కాలూనడమేమి, కాల్చుకు తినడమేమి జరుగుతున్నది. ఇందుకు వలసిన సాధనసంపత్తిని సైన్సు వారి చేతిలో పెడుతున్నది. ఇంచుమించుగా ఒక శతాబ్దంక్రితం నియంతలకు లేని టెలిఫోన్, రేడియో, టెలివిజన్, విమానాలు, టాంకులు మొదలైనవి ఈనాడు వారి కున్నాయి. వాటివల్ల ఒక జెంఘిస్‌ఖాన్‌కు, ఒక అటిల్లాకు, ఒక నెపోలియన్‌కు లేని శక్తి వారికి సిద్ధిస్తున్నది; ఈ సాధనాలను భయ పెట్టడానికివలె వ్యామోహ పెట్టడానికి సయితం వారు వినియోగించుకొన గలుగుతున్నారు. వ్యామోహపరచగల ఈ శక్తివల్లనే ఇదివరలో హిట్లర్, ముసోలినీ, స్టాలిన్‌లు అతీతమానవులుగా, అపరదేవతలుగా చెల్లగలిగారు; మావో ఇదే విధంగా ప్రస్తుతం చెల్లుతున్నాడు.

ప్రజాస్వామ్యంలో ఎన్ని లోపాలున్నా, దానిలో ఎంత జాప్యం జరిగినా, కొంతవరకు అవినీతి, ఆశ్రితపక్షపాతం మున్నగు దుర్లక్షణాలు తప్పకపోయినా, మానవత్వపు విలువలలో నియంతృత్వంకంటె అది వందరెట్లు, వెయ్యిరెట్లు మెరుగు. ఈ సంగతిని గుర్తించలేనివారే "కొంతకాలంపాటు నియంతృత్వం కావా" లంటారు.

[మే 17, 1971]

కులవ్యవస్థ ప్రభావం

హిందూసమాజంలో కుల వ్యవస్థ ప్రభావం రకరకాలుగా వుంటున్నది. కులవ్యవస్థను నిర్మూలించడానికి వివిధకాలాలలో ఎందరెందరో సంస్కర్తలు ప్రయత్నించక పోలేదు. కాని, వారి ప్రయత్నాలు ఫలించ లేదు. అంతే కాదు. కులనిర్మూలనకు ఒక్కొక్క ప్రయత్నం జరిగిన ప్రతి సందర్భంలో పాత కులాలు అంతరించక పోగా, కొత్త కులాలు పుట్టుకురావడం జరిగింది. ఉదాహరణకు, బసవేశ్వరుని సంస్కరణ ప్రయత్నాన్నే చూడండి. దాని ఫలితంగా కొత్తగా రెండు కులాలు పుట్టుకువచ్చాయి. వీరశైవాన్ని అవలంబించిన బ్రాహ్మణులు ఆరాధ్యులుగా మారారు; బ్రాహ్మణేతరులు జంగాలుగా మారారు.

తండ్రి చేపట్టిన వృత్తినే కుమారుడు చేపట్టడం కులవ్యవస్థ లక్షణాలలో ప్రధానమైనట్టిది. అందువల్లనే "కులవృత్తికి సాటిరాదు గువ్వలచెన్నా!" అనే సుభాషితం వచ్చింది. ఒకప్పుడు కులానికి ప్రాతిపదిక వృత్తి; వృత్తినిబట్టి కులం నిర్ణయమయ్యేది. కాని, పోనుపోను కులాన్నిబట్టి వృత్తినిర్ణయం కావడం, కులవృత్తి అనుల్లంఘనీయం కావడం జరిగింది. అది ఎంత హేయమైనవృత్తి అయినా కావచ్చు. ఆ వృత్తికి సంబంధించిన కులంలో జన్మించిన ప్రతివ్యక్తి విధిగా ఆ వృత్తినే అవలంబించవలసి వచ్చేది. దాన్ని నిరాకరించడాన్ని పాపంగా పరిగణించేవారు.

ఇప్పుడు కాలం మారింది. పారిశ్రామికయుగం ప్రవేశించింది. పాత వృత్తులు కొన్ని పోతున్నాయి, కొత్త వృత్తులు అనేకం వస్తున్నాయి. అయినా, కులవ్యవస్థ ప్రభావం తగ్గలేదు. పాతకులాలు అంతరించక పోగా కొత్త కులాలు వస్తున్నట్టు, కొత్త కులవృత్తులు వస్తున్నట్టు అనిపిస్తున్నది. ఇప్పటికీ బడిపంతులు కొడుకు బడిపంతులే అవుతున్నాడు. ఇలాగే డాక్టర్ కొడుకు డాక్టరు, ప్లీడరు

కొడుకు ప్లీడరు, గుమాస్తా కొడుకు గుమాస్తా కావడం ఎన్ని సందర్భాలలో, మనం చూడ్డంలేదు ?

రాజకీయాలు కూడా కొత్తరకం కులవృత్తిగా మారుతున్నట్లు కనిపిస్తున్నది. తండ్రి రాజకీయవేత్త అయితే, కుటుంబంలోనివా రందరు రాజకీయాలనే అనుసరించడం తరచు జరుగుతున్నది. ఒక శాసనసభ్యుడు మరణిస్తే అతని భార్యనో, కుమారుడినో తిరిగి శాసనసభకు పంపించడం కూడా జరుగుతున్నది. కులవ్యవస్థ ప్రభావం మనలో ఎంతగా జీర్ణించి పోయిందో దీన్నిబట్టే గ్రహించవచ్చు.

ఆర్థికవ్యవస్థ అతివేగంగా మారుతున్నా, కులవ్యవస్థ ప్రభావం మాత్రం తగ్గడంలేదనడానికి మరొక తార్కాణగా ఐ.ఎ.ఎస్. ఉద్యోగాలను చూడవచ్చు. ఈ ఉద్యోగాలు ఇటీవలివి; మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినతర్వాతనే ఏర్పడినట్టివి. అయినా, ఇవి ఒక కులవృత్తిగా మారుతున్నవా అనే సందేహం కలుగుతున్నది; అలహాబాదు యూనివర్సిటీవారు 1969-70 సంవత్సరంలో ఐ.ఎ.ఎస్. ఉద్యోగులనుగురించి ప్రత్యేకంగా ఒక సర్వే చేయించారు. దాని ద్వారా వెల్లడైన ఒక విశేష మేమ: ఐ. ఎ. ఎస్. ఉద్యోగులలో సగం మందికిపైగా ఆదివరకే ప్రభుత్వోద్యోగాలలో వున్న కుటుంబాలనుంచి వచ్చినవారట. దీన్నిబట్టి ఐ. ఎ. ఎస్. ఉద్యోగాలు కూడా కులవృత్తిగా మారుతున్నవా అనిపిస్తున్నది. ఇదే ధోరణి కొనసాగగా, కొనసాగగా, కొన్నేళ్ళకు "మీది ఏ కులం ?" అని ప్రశ్నిస్తే "మాది ఐ. ఎ. ఎస్. కులం" అని బదులుచెప్పేవారు రావచ్చునేమో.

[జూన్ 13, 1971]

ఏది ధర్మం?

అర్చనలు చేస్తే అరిష్టాలు తొలగిపోగలవని కొందరు విశ్వసించవచ్చు; యాగాలు చేస్తే, యజ్ఞాలు చేస్తే యుద్ధాలైనా నిలిచిపోగలవని వారు విశ్వసించవచ్చు. ఇవి మతసంబంధమైన విశ్వాసాలు, మతం విషయంలో, మతసంబంధమైన విశ్వాసాలవిషయంలో హేతుదృష్టికి తావు లేదు; తర్కానికి తావు లేదు.

"మంత్రాలకు చింతకాయలు రాలతాయా?" అనే సామెత ఈనాడు పుట్టింది కాదు. ఇంగ్లీషు చదువుకొని, "సైన్సులు" చదువుకొని, కొందరు నిందిస్తున్నట్టు, మనం "చెడిపోక"ముందే ఆ సామెత పుట్టింది. అయినా, దానిలోని నిజాన్ని గుర్తించడానికి మతవిశ్వాసాలు అడ్డుగా నిలుస్తూనే వుంటాయి.

ఈ విశ్వాసాల ప్రాబల్యంకొద్దీ ఈతిబాధలనుంచి, ఇతరేతర బాధలనుంచి మన దేశాన్ని కాపాడ్డానికి కొంచ రెవరైనా ప్రయత్నం చేస్తే, అందుకు అడ్డు చెప్పడం తగదుగాని, వారి ప్రయత్నం - విజయవాడలో జరగనున్నట్టు - అరలక్ష రూపాయల ఖర్చును తప్పనిసరిచేస్తే మాత్రం మౌనం వహించడం భావ్యం కాదు.

"ఆంధ్రజ్యోతి"లో నిన్న వెలువడిన ఒక వార్తప్రకారం, ఈతిబాధల నివారణకు, యుద్ధప్రమాద నిరోధానికి శ్రీ దుర్గామల్లేశ్వర దేవాలయం ధర్మకర్తలు అరలక్ష రూపాయల ఖర్చుతో డిసెంబర్ మూడవ తేదీనుంచి, 21 వతేదీ వరకు ''కోటి కుంకుమార్చన, మహారుద్ర, శతచండి యాగాలను'' జరిపించబోతున్నారు.

మన ఇరుగు పొరుగు రాష్ట్రమైన ఒరిస్సాలో కనివిని యెరుగని తుపాను దెబ్బవల్ల అతిఘోరమైన కష్టనష్టాలకు లోనై అలమటిస్తున్నవారు లక్షలాదిగా ఇప్పుడున్నారు. పాక్ సైనిక నియంతల దారుణదౌష్ట్యాల కారణంగా మన దేశానికి, మన రాష్ట్రానికికూడా కట్టుగుడ్డలతో పారిపోయి వచ్చినవారు మరెందరో ఇప్పు

డున్నారు. వీ రందరికి తిండి కావాలి, బట్టలు కావాలి, తలదాచుకోడానికి ఆధారం కావాలి, మందు మాకులు కావాలి, ఇతర సహాయాలు అనేకం కావాలి. వ్యక్తులేమి, సంస్థ లేమి ఈ లక్షలాది ప్రజల సముద్ధరణకై శక్తివంచనలేని కృషి చేయవలసిన ప్రస్తుత సన్నివేశంలో అర్చనలకు, యాగాలకు అరలక్ష రూపాయలను ఖర్చు చేయబూనడం అనాలోచితచర్య కాబోదా ?

తమ దేవాదాయనిధులనుంచి ఈ అరలక్షకు తోడుగా మరొక అర లక్షను భక్తులనుంచి విరాళాలక్రింద సేకరించి, ఒరిస్సా తుపానుబాధితుల సహాయార్థమో, బంగ్లాదేశ్ కాందిశీకుల సహాయార్థమో పంపిస్తే, తాము నమ్ముకొంటున్న దైవమే తమను హర్షించడం జరగదా, ఆశీర్వదించడం జరగదా ?

స్వయంసహాయం చేసుకోగలవారికే దైవసహాయం లభిస్తుందనే సూక్తిని ఆస్తికదృష్టిగలవారు ఆమోదించకపోవచ్చు. కాని, వారైనా అన్యులకు సహాయం చేసేవారికే, ఆపదలోవున్నవారిని ఆదుకొన్నవారికే దైవసహాయం లభిస్తుందనే సూక్తిని బహుశా కాదనలేరు.

అయినప్పుడు, విజయవాడలో అర్చనలకై, యాగాలకై తలపెట్టిన ఖర్చు తగునా ? ఇప్పుడు కావలసింది "కోటి కుంకుమార్చన" కాదు; జీవితం కుంటుపడిన ఒరిస్సా తుపాను బాధితులకు ఋణమో, పణమో సహాయం చేయడంద్వారా "ప్రేమార్చన"! ఇప్పుడు కావలసింది "రుద్రయాగం" కాదు; బంగ్లాదేశ్ కాందిశీకుల కన్నీటిని తుడవడం రూపంలో "కారుణ్యయాగం!!"

విజయవాడ దేవాలయ ధర్మకర్తలు మేము వ్రాస్తున్న ఈ విషయాలను నిర్లక్ష్యం చేయబోరని ఆశించవచ్చునా ? ఇంగ్లీషు చదువుకొని, "సైన్సు"లు చదువుకొని "చెడిపోయినవారు" ఇంతకంటె మరేమి వ్రాస్తారని మా హితవును త్రోసిపుచ్చబోరని విశ్వసించవచ్చునా ? వారు వ్యయపరచదలచిన అరలక్ష రూపాయలను ఒరిస్సా తుపాను బాధితుల నిధికి, లేదా బంగ్లా కాందిశీకుల నిధికి జమకట్టగలరని అనుకోవచ్చునా ? కేవలం ఈ దేవాలయ ధర్మకర్తలకే కాక, తక్కినవా రందరికి ప్రస్తుత సందర్భంలో ఇదే న్యాయం, ఇదే ధర్మం. ఎవరైనా ఇప్పుడు జరపవలసింది - మేము ఇంతకు ముందే వివరించినట్టు - ప్రేమార్చనే, కారుణ్యయాగమే, ఇప్పుడే కాదు, ఎప్పుడైనా ఇవే మనిషిని పెంచగలవు, మహీతలాన్నే స్వర్గంగా మార్చగలవు.

[నవంబర్ 23, 1971]

నేటి నాయకులు

పత్రికలు, రేడియో, టెలివిజన్, సినిమా మొదలైన ప్రచారసాధనాలన్నీ కలిసికట్టుగానే కాక, పట్టుదలగా రెండు పనులను ప్రస్తుతం మన దేశంలో చేస్తున్నాయి : అంధవిశ్వాసాలను పెంచడం, మూఢభక్తిని ప్రోత్సహించడం.

ఇది ఖేదపడవలసిన విషయమైనా, ఆశ్చర్యపడవలసిన విషయం కాదేమో! ఈనాడు మన సంఘనాయకులే, ప్రజానాయకులే, ప్రభుత్వనాయకులే అంధవిశ్వాసాలకు అగ్రతాంబూలాన్ని పుచ్చుకొంటున్నారు, మూఢభక్తిమార్గం వెంట ముందు వరసలో నడుస్తున్నారు.

ఏ యోగి కనబడినా, వీరు సాగిలబడతారు; ఏ స్వామి ఎదురైనా, వీరు సాష్టాంగనమస్కారాలు చేస్తారు; పీఠాధిపతులవద్ద వీరు పడిగాపులు కాస్తారు; అడుగడుగుకు వీరికి అమ్మలు, అమ్మమ్మలే తారసిల్లుతూ వుంటారు, అవతారపురుషులే సాక్షాత్కరిస్తూ వుంటారు. తాము ఎంత ఆస్తికులైనా, తమ చర్యలు తమ లోకేశ్వరుడనే చౌక చేస్తున్నాయని, తమ ఆరాధ్యదైవాన్నే అపహాస్యం పాలు చేస్తున్నాయని వీరికి కొంచెపాటుగానైనా తోచడం లేదు.

ఈ శోచనీయ పరిణామాన్ని చూచినప్పుడు రాజా రామమోహన్ రాయ్, దయానంద సరస్వతి, కేశవచంద్రసేన్, మహదేవ్ గోవింద రనడే, వీరేశలింగం గడచిన రెండువందల సంవత్సరాలలోపల మన దేశంలోనే పుట్టినారా, ఇక్కడనే మెట్టినారా అని సందేహించవలసి వస్తున్నది. ఇంతే కాదు. ఇది గౌతమబుద్ధుడు, మహావీరుడు, బసవేశ్వరుడు, కబీర్, నానక్, వేమన ప్రభృతుల మాతృదేశమా అని ప్రశ్నించుకోవలసివస్తున్నది. పోనీ, తక్కినవారి మాట విడిచిపెట్టండి. తాము జవహర్‌లాల్ నెహ్రూ అనుచరులమని, వారసులమని చెప్పుకొంటున్న వారే ఆయన పెంచగోరిన శాస్త్రీయదృష్టికి ("సైంటిఫిక్ స్పిరిట్" అనే దానికి) ప్రోదిచేయడానికి మారుగా, దాని గొంతు నులిమివేస్తున్నారు!

పోనీ, వీరు శాస్త్రీయదృష్టికి పూర్తిగా విరోధులైతే, పాత సాంఘిక వ్యవస్థను, పురాతన జీవితవిధానాన్ని పునరుద్ధరించ గోరుతున్నవారైతే, వీరిని హర్షించలేని వారైనా, కనీసం వీరిని అర్థం చేసుకోగలుగుతారు. కాని, వీరు మనకు ఆధునిక వైజ్ఞానికశాస్త్రాలు కావా లంటారు, మన దేశంలో పారిశ్రామిక, సాంకేతిక విప్లవాలు రావా లంటారు. అంధవిశ్వాసాల సరసన ఆధునిక వైజ్ఞానిక శాస్త్రాలు అభివృద్ధి చెందగలవా? విభూతితో, ప్రసాదాలతో, రక్షరేకులతో? లక్షవత్తుల నోములతో పారిశ్రామిక, సాంకేతిక విప్లవాలను సాధించగలమా, అమ్మల, అమ్మమ్మల, బాబాల, భగవానుల ఆశీస్సులతో నవసంఘాన్ని నిర్మించ గలమా?

అర్ధశతాబ్దిలో రష్యా అగ్రరాజ్యమైంది. అంతకు సగంకాలంలోనే చైనా అగ్రరాజ్య మైంది. మన నాయకులు నడుస్తున్నదారినే రష్యా, చైనా నాయకులు నడిచివుంటే, అవి ఇంత త్వరలో ఇంతటి పురోగతిని సాధించగలిగేవా, ఇంతటి శక్తివంతమైన రాజ్యాలు కాగలిగివుండేవా? ఇట్టి సందేహాలు ఈనాటి మన సంఘనాయకులకు, ప్రజానాయకులకు ప్రభుత్వనాయకులకు ఎందుకు తోచవు? ఇట్టి ప్రశ్నలు వారికి ఎందుకు స్ఫురించవు? చరిత్రజ్ఞానం లేకపోవడంవల్లనా? లేక, ప్రపంచ చరిత్రకు విరుద్ధంగా తాము నడవగలమని, దేశాన్ని నడిపించ గలమని భ్రమ పడుతున్నందువల్లనా?

[ఫిబ్రవరి 16, 1972]

ఆగస్టు 15, 1972

ఏ సంవత్సరంలోనైనా ఆగస్టు 15 మనకు పర్వదినం. ఈ సంవత్సరం అది మహాపర్వదినం. రెండున్నర దశాబ్దాలుగా ప్రతి సంవత్సరంలో వలె, ఇది మన స్వరాజ్యానికి జన్మదినం మాత్రమేకాక, రజతోత్సవదినం కూడా.

ఇక్కడ అనావృష్టి, అక్కడేమో అతివృష్టి, అన్నిచోట్ల దుర్భిక్ష సూచనలు-ఈ పరిస్థితులలో ఏమి పర్వదినం?

పెరిగిపోతున్న ధరలు, కరవైపోతున్న నిత్య జీవితావశ్యక వస్తువులు, కరకుకోతగా పరిణమిస్తున్న బ్రతుకులు-ఈ పరిస్థితులలో ఏమి పర్వదినం?

ఎంత చదువుకొన్నా నిరుద్యోగం, ఏమి చదువుకొన్నా నిరుద్యోగం-ఈ పరిస్థితులలో ఏమి పర్వదినం?

ఎటుచూచినా అధికారదుర్వినియోగం, ఆశ్రితపక్షపాతం, అన్యవిధాల అవినీతి -ఈ పరిస్థితులలో ఏమి పర్వదినం?

కోటానుకోట్ల హృదయాలను ఈ విధమైన ప్రశ్నలు ఈ నాడు వేధించవచ్చు. అయినా, ఇది ప్రతి భారతీయునికి ఒక మహాపర్వదినమే: కొత్త తరం వారికి తెలియకపోవచ్చుగాని, స్వరాజ్యంకోసం పోరాటం కొనసాగుతున్న సమయంలో మన జాతీయనాయకులు "సురాజ్యం స్వరాజ్యానికి ప్రత్యామ్నాయం కాదు" అని ఉద్ఘాటిస్తూ వుండేవారు. ఇది నిజానికి ఒక బ్రిటిష్ ప్రధాని సూక్తి. ఆయన పేరు సర్ హెన్రీ కాంబెల్-బెన్నర్మన్. బోయర్ల విషయంలో ఆయన "గుడ్ గవర్నమెంట్ ఈజ్ నో సబ్‌స్టిట్యూట్ ఫర్ సెల్ఫ్ - గవర్న్మెంట్" అని చెప్పాడు. ఆ బ్రిటిష్ ప్రధాని మాటనే నాటి మన బ్రిటిష్ పరిపాలకులకు మన నాయకులు అప్పజెబుతూ వుండేవారు.

ఇదివరలోనే కాదు, ఇప్పుడైనా, ఎప్పుడైనా "సురాజ్యం స్వరాజ్యానికి ప్రత్యామ్నాయంకాదు." స్వరాజ్యవ్యవస్థలో ఎన్ని దొసగులైనా వుండవచ్చు,

అవి ఎన్ని కష్టనష్టాలనైనా కలిగించవచ్చు, కొన్ని కొన్ని సందర్భాలలో కడగండ్లకు దారితీయవచ్చు అయినా, స్వరాజ్యానికి అదే సాటి. దాస్యంలో స్వర్గసుఖాలకంటె స్వరాజ్యంలో నరకయాతనలే ఒక లక్ష రెట్లు వాంఛనీయం.

ఈ విశ్వాసంతోనే ఎందరెందరో లాఠీ దెబ్బలు తిన్నారు, జైలు శిక్షలు అనుభవించారు, ఉరికంబాల నెక్కడానికి సయితం వెనుదీయలేదు. ఈ విశ్వాసంతోనే ఎన్ని కష్టాలు పడవలసివచ్చినా, ఎన్ని త్యాగాలు చేయవలసివచ్చినా, అందుకు ఎందరెందరో సంతోషంగా సన్నద్ధులైనారు.

స్వరాజ్యంతో మన సమస్య లన్నీ తీరనిమాట నిజమే. అయితే, అంత మాత్రం చేత స్వరాజ్య సముపార్జనతర్వాత దేశం అసలే పురోగమించ లేదనడం కంటె పొరపాటు లేదు. ఎన్ని రంగాలలోనో, ఎన్ని విధాలుగానో ఈ రెండున్నర దశాబ్దాలుగా దేశం ముందుకు నడిచింది.

ఈ నడక మరింత త్వరగా జరిగి వుండవచ్చు, మరింత సాఫీగా జరిగి వుండవచ్చు. కాని, 17వ, 18వ శతాబ్దాలలో మన జాతీయజీవితం బహుముఖాలుగా క్షీణించింది. అటుపైన దాదాపు మరి రెండు శతాబ్దాలపాటు బ్రిటిష్ దాస్యంలో మ్రగ్గిన తర్వాతనే మనం స్వరాజ్యం పొందినామన్న విషయాన్ని మరచిపోరాదు. ఈ నాలుగు వందల సంవత్సరాలలో కొండలాదిగా పేరుకుపోయిన పీడ లన్నీ, కీడు లన్నీ ఇరవై అయిదేళ్ళలో తొలగగలవా ?

పైగా, మనది జనాభాకు సంబంధించినంతవరకు ప్రపంచం మొత్తం మీద రెండవ రాజ్యం. ఒకప్పుడు నాటి ప్రధాని నెహ్రూను "మీ కెన్ని సమస్యలున్నాయి?" అని ప్రశ్నించగా, "నలభై కోట్ల సమస్య" లని ఆయన సమాధానం చెప్పాడు. ఇప్పుడు మన జనాభా 55 కోట్లు కాబట్టి, ఇప్పుడైతే ఆయన సమాధానం "55 కోట్ల సమస్యలు" అయివుండేది.

ఇన్ని సమస్యలు ఒక్క నాటిలో తీరవు. ఒక్క తరంలోనైనా తీరవు. అందుకు కొన్ని తరాలపాటు కృషి జరగాలి. ముఖ్యంగా ఈ తరంలో దీక్షాయుతమైన కృషి జరగాలి; ఈ కృషి సందర్భంలో కష్టాలకు, త్యాగాలకు

సన్నద్ధపడాలి. అప్పుడుగాని మరింత పురోభివృద్ధి సాధ్యపడదు, అప్పుడుగాని మన భవిష్యత్తు పదిలపడదు.

ఇప్పటి కొత్త తరంవారికి దాస్యబాధ తెలియదు, దానిలోగల అవమానాలు తెలియవు, ఆవేదనలు తెలియవు. ఈ కారణాన స్వాతంత్ర్యాన్ని, దాని విలువలను వారు పూర్తిగా అర్థం చేసుకోలేక పోవచ్చు, గౌరవించక పోవచ్చు. అందువల్ల ఇదివరలో స్వాతంత్ర్యసమరంలో పాల్గొన్నవారు ఈ తరంవారికి చెప్పవలసిన మాట "తాత్కాలికంగా మీకు ఎన్ని చిక్కులున్నా, చికాకులున్నా స్వాతంత్ర్యాన్ని మించిన మహద్భాగ్యంలే"దని! "మేము పడిన కష్టాలను మించి, చేసిన త్యాగాలనుమించి మీరు కష్టాలు పడకపోతే, త్యాగాలు చేయక పోతే, మేము సంపాదించిన స్వాతంత్ర్యాన్ని మీరు కాపాడుకోలే" రని!!

స్వాతంత్ర్య సమరాలలో పాల్గొన్నవారు కొన్ని వేలమంది ఈనాడు మన మధ్య వున్నారు. మన స్వరాజ్యం స్వర్ణోత్సవం జరిగేనాటికి వీరిలో బహు కొద్దిమంది తప్ప మిగలకపోవచ్చు. అందువల్ల పూర్వపు స్వాతంత్ర్య యోధులు స్వాతంత్ర్యం ఎంతటి మహద్భాగ్యమో ఈనాడు ముక్తకంఠంతో ఘోషించడం ముఖ్యావసరం.

పాత తరంవారితోపాటు కొత్త తరంవారు సయితం మన స్వరాజ్యాన్ని, మన స్వాతంత్ర్యాన్ని సుదృఢం చేసుకోగలమని, సుస్థిరం చేసుకోగలమని ఈనాడు ప్రతిన పూనాలి. పునఃకంకణధారణ చేయాలి.

[అగస్టు 15, 1972]

ఆయన జీవించివుంటే...

"రండి! మగటిమి చూపండి! ఈ పూజారులను తన్ని తరమండి. చచ్చినా మారలేరు కనుక, వీరు ప్రగతికి విరోధులు; వీరికి హృదయవికాసం లేదు. శతాబ్దాల తరబడిగా పేరుకు పోయిన గుడ్డినమ్మకాలనుంచి వీరు పుట్టుకువచ్చారు; ప్రజాహింసనుంచి వీరు పుట్టుకువచ్చారు. ముందుగా కూకటి వ్రేళ్లతో పెరికి పార వేయవలసింది వీరి పూజారితనాన్నే. రండి, మగటిమి చూపండి! మీ కలుగులలో నుంచి వెలికి రండి! ఒకసారి నలుదిక్కులకు చూడండి! దేశదేశాలు ఏ విధంగా పురోగమిస్తున్నవో గమనించండి......"

ఇది రాజా రామమోహన రాయ్ ఉద్బోధ కాదు. మరొక రాయ్ - ఎం. ఎన్. రాయ్ - హెచ్చరిక సయితం కాదు. అయితే, మరెవరిది? డాక్టర్ అంబేద్కర్‌దా? కాదు. రామస్వామినాయకర్‌దా? కాదు. త్రిపురనేని రామస్వామిదే ఇది తగునా? తిరిగి మీ ఊహ తప్పు. పోతే, మిగిలింది "గోరా" యే అనుకొంటున్నారా? ఇది ఆయన హెచ్చరిక కూడా కాదు.

అయితే, మరెవరిది? సాక్షాత్తు వివేకానందస్వామి చేసినట్టిది ఈ హెచ్చరిక. ఏ స్వామి పేరుచెప్పి ఈనాడు పెక్కుమంది ప్రతి మూఢవిశ్వాసాన్ని స్థిరంగా నిలపడానికి తరచు ప్రయత్నం చేస్తూవున్నారో, ఆ వివేకానందస్వామి స్వయంగా ఈ హెచ్చరిక చేశాడు. నిన్ననో, మొన్ననో కాదు; కొన్ని దశాబ్దాల క్రితం ఆయన ఈ హెచ్చరిక చేశాడు. నాడు మనకు స్వరాజ్యం లేదు, జాతీయ ప్రభుత్వం లేదు. నాడు ఇన్ని స్కూళ్లు లేవు, కాలేజీలు లేవు. అయినా, నాటి కంటె ఈనాడే హెచ్చుగా. గుడ్డి నమ్మకాలున్నాయి, మతమౌఢ్యాలున్నాయి. నాటికంటె ఈనాడె నూరు రెట్లు హెచ్చుగా, వెయ్యిరెట్లు, లక్షరెట్లు హెచ్చుగా పూజారితనం బలిసిపోయి వెర్రితలలు వేస్తున్నది.

అతి చిత్రమైన విషయం - కాదు, మహావిషాదకరమైన విషయం - ప్రభుత్వనాయకులైనవారే, ప్రభుత్వోద్యోగులైనవారే ఈ గుడ్డి నమ్మకాలకు

ఎక్కువగా ప్రోది చేస్తున్నారు. విద్యాధికులైనవారే, పైగా వారిలో సైంటిస్టులైన వారే, వీటికి బలాన్ని కూర్చుతున్నారు. ఈ పలుకులు నూటికి నూరుమంది విషయంలో నిజం కాకపోవచ్చు. కాని, కనీసం నూటికి 99మందికి ఇవి వర్తిస్తాయి.

గుడ్డి నమ్మకాలు ఇంత హెచ్చుగా పెరిగినందునే, ఇంత యేపుగా వెర్రితలలు వేసినందునే వర్షాలకోసం రుద్రాభిషేకాలు చేస్తే, ప్రభుత్వ సహాయం లభించగలదన్న ప్రకటన జరిగింది! పైగా, ఒక మంత్రి అధ్యక్షత వహించిన సభలో - ఆయన ఆమోదంతోనో, కాదో తెలియదు గాని - ఈ ప్రకటన జరిగింది. ఇంతే కాదు, రాష్ట్ర రాజధానినగరంలో ఒక శంకరాచార్యుల ఆధ్వర్యాన మహారుద్ర - వరుణయజ్ఞం ప్రారంభమై కొనసాగుతున్నది. అభిషేకాలవల్ల, యజ్ఞాలవల్ల వానలు కురవడం నిజమైతే, ప్రభుత్వాల బడ్జెట్‌లోనే వాటికోసం సాలుకు కొన్ని లక్షలనో, కోట్లనో కేటాయింపు చేయడం మంచిది కాదా? అప్పుడు సకాలంలో వానలు కురుస్తాయి, కరవుకాటకాల బెడద మరి లేకుండా పోతుంది। అన్నట్టు, కప్పల పెళ్లిళ్లకుకూడా కొంత కేటాయింపు జరగాలి। అభిషేకాలకంటె, యజ్ఞాలకంటె వానలను కురిపించడంలో ఈ కప్పలపెళ్లిళ్ళు మరింతగా అమోఘమైనవని ఒక గట్టి నమ్మకం వున్నది. నిజానికి, ఈ అభిషేకాలు, యజ్ఞాలు పుట్టకముందే ఈ దేశం ఆదివాసులలో ఆ నమ్మకం పుట్టింది.

ఈనాటి మన ప్రభుత్వనాయకుల, ప్రభుత్వోద్యోగుల ధోరణులు చూస్తే, పూజారిమూకను తన్ని తరమడానికి మారుగా, వారి పాదాలముందు సాగిలబడుతున్న దృశ్యాలను చూస్తే, స్వామి వివేకానంద "నాదేశస్థులు తమ కలుగులనుంచి బయటికి రావడం కల్ల" అని ఎంతగా విచారపడతాడో! "మగటిమిని చూపి, ఈతిబాధల నేమి, ఇతర ప్రమాదాల నేమి వివేకంగా, వైజ్ఞానికదృష్టితో వీరు పరిష్కరించగలగడం కల్ల" అని ఎంతగా ఖిన్నుడౌతాడో!!

[సెప్టెంబర్ 1, 1972]

సంస్కృతంపట్ల మోజు

గ్రీక్, లాటిన్ భాషలపట్ల మోజు తగ్గినతర్వాతగాని ఆధునికపు యూరోపియన్ భాషలు వృద్ధిలోకి రాలేదు. ఇదే విధంగా క్రీస్తుశకం పదవ శతాబ్దానికి కొంత ముందు వెనుకలుగా సంస్కృతంపట్ల మోజు తగ్గిన తర్వాతగాని ఆధునికపు భారతీయ భాషలు వికాసాన్ని పొందలేదు.

ఈనాడు మన ప్రాంతీయ భాషలలోనే విద్యాబోధన జరగాలని, వాటిలోనే పరిపాలన కొనసాగాలని ఒక వైపున చెబుతూనే, మరొక వైపున సంస్కృతభాషా ప్రచారానికి కొన్ని రాష్ట్రప్రభుత్వాల నాయకులు ఎందుకు తాపత్రయపడుతున్నారో మాకు అర్థంకావడం లేదు.

ప్రాచీన విశ్వాసాలపై, సంప్రదాయాలపై తిరుగుబాటు చేసి, నవ ధర్మాన్ని, నూతనవ్యవస్థను సంస్థాపించడానికి ప్రయత్నించినవా రందరు సంస్కృతంపట్ల వ్యతిరేకతను చూపించారు. గౌతమబుద్ధుడు తన శిష్యులకు "సంస్కృతంలో మాట్లాడవద్దు" అని స్పష్టంగా నిర్దేశించాడు. బసవేశ్వరుడు సంస్కృతంలో కాక, కన్నడంలోనే తన రచనలు చేశాడు. వేమన వాడింది తెలుగు. కబీర్, నానక్, దాదూ ప్రభృతులు సయితం సంస్కృతాన్ని ఒక పక్కకు నెట్టివేసినవారే:

పోతే, సంస్కృతాన్ని అభిమానించినవా రందరు ప్రాచీనవిశ్వాసాలను, పూర్వవ్యవస్థను పునరుద్ధరించగోరినవారే. అట్టివారిలో సుప్రసిద్ధులు శంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు, వల్లభాచార్యులు. ఇదే విధంగా సంస్కృత ప్రచారంవిషయమై నేడు విశేషంగా పట్టుదల చూపుతున్నవారిలో అత్యధిక సంఖ్యాకులు ముందుకుకాక వెనుకకు చూస్తున్న వారని చెప్పవచ్చు. వారికి

ఇంగ్లీషుపట్ల విముఖత్వానికి మూలం అది విజాతీయ భాష అని కాదు; పాత నమ్మకాలనుంచి, పాత పుంతలనుంచి ప్రజలను అది మరలిస్తున్నదన్న ఆందోళనే. ఇంగ్లీషును అవహేళనచేస్తూ ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవి ఒక వ్యంగరచన చేశాడు. అయితే, దానివల్ల అవహేళన పాలౌతున్నది ఇంగ్లీషు భాష కాదు ; ఆ కవి స్రష్టే !

నేటి యూరోపియన్ సాంస్కృతికజీవితంలో ఓల్డ్ గ్రీక్, లాటిన్ భాషలకు స్థానం వున్నట్టే, మన సాంస్కృతికజీవితంలో సయితం సంస్కృతానికి నిస్సందేహంగా స్థానం వున్నది. అయితే, అది ఎంతో పరిమిత స్థానం. అందువల్ల సంస్కృతాన్ని నేర్వవలసింది ఎవరో కొందరు పండితులు, రచయితలు, చారిత్రికపరిశోధకులు మాత్రమే; లేదా మంత్రాలు, తంత్రాలు మొదలైనవాటిని ఒక వృత్తిగా చేసుకొనగోరేవారే. ఇతరులు దానివల్ల ప్రయోజనం పొందలేరు. పైపెచ్చు, అది వారిలో ఛాందసాన్ని పెంచుతుంది, వారిని వ్యర్థులను చేస్తుంది.

అయినా, మన రాష్ట్రప్రభుత్వం సంస్కృత భాషాప్రచారానికి ఒక ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని సంస్థాపించడానికి సన్నద్ధపడుతున్నది. ప్రస్తుతం మన రాష్ట్రంలోగల కొన్ని సంస్కృతకళాశాలలలో విద్యార్థుల సంఖ్యకంటె ఆచార్యుల సంఖ్యే అధికం. రేపు సంస్కృత విశ్వవిద్యాలయాన్ని ప్రారంభిస్తే సరిగా ఇంతే జరగవచ్చు. ఎవరైనా కొందరు సంస్కృత పండితులకు జీవనోపాధిని కల్పించగోరితే, వారికి మన ప్రభుత్వం భూము లివ్వవచ్చు, మరేదైనా చేయవచ్చు. విశ్వవిద్యాలయసంస్థాపనకు, నిర్వహణకు కాగల ఖర్చులో నూరవ వంతుతో ఇది సాధ్యపడుతుంది. అంతటితోనే సరిపుచ్చితే, ప్రజలు సంతోషిస్తారు. పైగా, ఈనాడు పాఠశాలలకు, కళాశాలలకు, విశ్వవిద్యాలయాలకు అందించవలసిన గ్రాంటులను సకాలంలోగాని, వలసినంతగా గాని అందించలేక పోతున్న ప్రభుత్వం సంస్కృత విశ్వవిద్యాలయంపేర సాలీనా కొన్ని లక్షలను ఎందుకు వృథా చేయాలి ?

ఈ విషయంలో బీహార్ మన రాష్ట్రం తల దన్నుతున్నది. ఈ సంవత్సరంనుంచి అక్కడ ప్రతి విద్యార్థి సంస్కృతాన్ని విధిగా అభ్యసించాలట.

సంస్కృతంలో ఉత్తీర్ణులు కానివారికి మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్ లభించబోదట. దీని తాత్పర్యం - బీహార్ ప్రభుత్వనాయకులు సంస్కృతంపట్ల తమకున్న ప్రత్యేక భక్తిగౌరవాల కారణంగా లక్షలాది విద్యార్థుల జీవితాలను, భవిష్యత్తును బుగ్గిచేయడానికి సముతం సందేహించడం లేదని కాదా?

చిత్రం ఏమంటే, ఈనాటి ప్రభుత్వనాయకులు ప్రజారాజ్యాన్ని బలపరచ గోరుతున్నామని ఉద్ఘాటిస్తూవుంటారు, సోషలిస్టువ్యవస్థ సంస్థాపనకై కంకణం ధరించామని ఉద్ఘోషిస్తూ వుంటారు. ''దేవభాష"ద్వారా వీరు ప్రజారాజ్యాన్ని బలపరచగోరుతున్నారు కాబోలు! "గీర్వాణభాష" ద్వారా నవవ్యవస్థను స్థాపించగోరుతున్నారు కాబోలు! గౌతమబుద్ధుని కాలంలోనే ప్రజాసామాన్యానికి సంబంధించినంతవరకు "మృతభాష"గా పరిణమించినదాని ప్రచారంద్వారా సోషలిస్టు రాజ్యాన్ని నెలకొల్పనున్నారు కాబోలు!!

[సెప్టెంబర్ 2, 1972]

ఈనాడు ఏమి కావాలి?

మా నిన్నటి, మొన్నటి సంపాదకీయాలు రెండు విభిన్న విషయాలను గురించి. అయితే, వాటికి ప్రేరణ ఒక్కటే. అది-ఒక జాతిగా మన ప్రగతిని గురించి, మన భవిష్యత్తునుగురించి ఆందోళన: ప్రగతికి నిదర్శనాలు ఎక్కువ రోడ్లు, ఎక్కువ వంతెనలు, ఎక్కువ కార్లు, బస్సులు, లారీలు, ఎక్కువ రైళ్లు, విమానాలు, ఎక్కువ స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీలు - ఇట్టివి మాత్రమే కావు. మన భవిష్యత్తును పదిలపరచగలిగినవి మరింతగా పంట, మరింతగా పారిశ్రామికోత్పత్తులు, మరింతగా జాతీయాదాయం మొదలైనవి మాత్రమే కావు. ఇవి ముఖ్యావసరాలే. కాని, ఇవి మాత్రమే చాలవు. వీటికంటె మిన్నగా మరొకటి కావాలి. అది - మన దృక్పథంలో ప్రాథమికమైన మార్పు, విప్లవాత్మకమైన పరివర్తన.

మన సంస్కృతి, మన నాగరికత హరప్పా, మొహెంజొదారోల కాలం నుంచి దాదాపు క్రీస్తుశకం ఏడెనిమిది శతాబ్దాలవరకు వికాసాన్ని పొందుతూ వచ్చాయి. అటుతర్వాత అవి ఎందుకు క్షీణస్థితిలో పడిపోయాయి? మనలో మౌలికచింతన ఎందుకు నశించింది? వ్యాఖ్యానాలపై వ్యాఖ్యానాలు ఎందుకు ప్రారంభమైనాయి? అటు రోమ్‌నుంచి, ఇటు ఫిలిప్పీన్స్‌వరకు, ఆ పైవరకు కూడా నౌకావ్యాపారాన్ని చేస్తూవచ్చిన జాతి సముద్రయానాన్ని ఒక మహాపాపంగా పరిగణించే ఘోరస్థితికి ఎందుకు దిగజారింది? గణిత, ఖగోళ, రసాయనిక, వైద్య, ఖనిజాది అనేకశాస్త్రాలలో మానవవిజ్ఞానాన్ని సుసంపన్నం చేసిన జాతి ప్రతి అంధవిశ్వాసానికి, ప్రతి మూఢాచారానికి మారుపేరుగా ఎందుకు మారింది? శూద్రులకోసం, ఇతర పామరజనులకోసం సూతులు స్థాపించిన పౌరాణిక మతమే అన్నివర్గాల మతంగా ఎందుకు స్థిరపడింది? ఈ విధమైన ప్రశ్నలు వేసుకొనకపోతే, వీటికి నిజమైన సమాధానాలు నిష్కర్షగా తెలుసుకొనడానికి

ప్రయత్నించక పోతే, మనకు ప్రగతి లేదు, భద్రత లేదు, భవిష్యత్తు లేదు. అయినా, ఈ ప్రశ్నలు వేసుకుంటున్నవారు కోటికి ఒక్కరైనా కానరావడం లేదు; వీటికి నిజమైన సమాధానాలను నిష్కర్షగా తెలుసుకొనడానికి ప్రయత్నం అంతకంటె కూడా అరుదుగా కానవస్తున్నది.

ఏ విప్లవమైనా అది మనస్సులో ప్రారంభం కావాలి. నవచింతనలేనిదే నవసమాజం లేదు, నవజీవనం లేదు. కడచిన నాలుగైదు శతాబ్దాలలో యూరప్‌ను మహోజ్జ్వలస్థితికి తెచ్చినవారు ట్రెవిథిక్, జేమ్స్ వాట్, ఆర్క్‌రైట్, కార్ట్‌రైట్‌లను పోలిన "ఇన్‌వెంటర్స్" కాదు; ఫ్రాన్సిస్ బేకన్, న్యూటన్, లాక్, హ్యూమ్, బెంథమ్, వాల్టేర్, రూసోలను పోలిన మౌలికభావుకులే. ఈ రెండవవర్గం వారే ప్రతిదాన్ని ప్రశ్నించడాన్ని - ప్రతిదాన్ని పరిశీలించడాన్ని - యూరప్‌కు నేర్పారు; వీరే యూరప్ దృక్పథాన్ని మార్చారు; వీరే యూరప్‌లోనే కాక ప్రపంచంమొత్తంలోనే ఆధునికయుగానికి మూలపురుషులైనారు.

వీరు తెచ్చిన భావవిప్లవాన్ని పోలిందే మన దేశంలోకూడా ప్రారంభం కావాలి. అప్పుడుగాని మతమౌఢ్యాల ప్రాబల్యం తగ్గదు, అప్పుడుగాని కుల శాఖాది సంకుచితత్వాలు సడలవు, అప్పుడుగాని సాంఘికదురాచారాలు సమసి పోవు, అప్పుడుగాని మనకు వెన్నెముక ఏర్పడదు, అప్పుడుగాని, వివేకానంద హెచ్చరించినట్టు, మనం మగటిమి చూపలేము.

నిన్నటి మన జాతీయవిప్లవ సందర్భంలోగాని, ఇప్పటి సోషలిస్టువిప్లవ నినాదాల సందర్భంలోగాని దాదాపు కానరానిది ఈ భావవిప్లవమే. పాతబూజు మన మనస్సులనుంచి వదలడం లేదు; పాత పుంతలనుంచి మన ఆలోచనలు తప్పుకొనడం లేదు. పైగా, ఇతరదేశాలకు లేని ఏదో ఆధ్యాత్మికసంపత్తి మన కున్నదన్న భ్రమ మనలను పీడిస్తున్నది. బియ్యంలో రాళ్ళు రప్పలను కలపడంలో, మందు మాకులను సయితం కల్తీచేయడంలో, దొంగనిల్వలను చేసి, కరవు కాటకాలను కల్పించడంలో వున్నదేమో ఈ ఆధ్యాత్మికసంపత్తి!

చదువు సంధ్యలు లేనివారు, సంస్కృతి లేనివారు, ఎంత అంధప్రాయంగా, ఎంత మూఢంగా ప్రవర్తించినా, దాన్ని కొంతవరకు అర్థం చేసుకో

వచ్చు. కాని, యూనివర్శిటీ డిగ్రీ లున్నవారిలోనే, సాంఘికంగానో, రాజకీయం గానో, మరొక విధంగానో సంఘానికి నాయకత్వం వహిస్తున్నవారిలోనే నూటికి తొంభై తొమ్మిదిమంది అతి సంకుచితంగా ఆలోచిస్తున్నారు. పరమ మూఢులవలె సంచరిస్తున్నారు. అయినప్పుడు, మనం నిజమైన ప్రగతిని సాధించ గలమా, మన భవిష్యత్తునుగురించి ధైర్యంగా వుండగలమా?

రెండు వందల సంవత్సరాల క్రితం రాజా రామమోహన్ రాయ్ మనకు వైజ్ఞానికదృక్పథం కావాలన్నాడు. ఇటీవల సరిగా ఇదే మాటను జవహర్‌లాల్ నెహ్రూ పదే పదే చెప్పాడు. ఈ విషయంలో నెహ్రూకంటె కూడా ఎమ్. ఎన్. రాయ్ ముందుకు వెళ్లాడు. అయినా, ఇంటి కొక అమ్మ, వీధి కొక స్వామి, ఊరు కొక బాబా, నాడు కొక అవతార పురుషుడు వెలుస్తున్నారు; వారి అనుగ్రహంకోసం, వారి ఆశీస్సులకోసం వేలాదిగా, లక్షల కొలదిగా విద్యాధికులే పడిగాపులు కాస్తున్నారు! నానాటికి మనలో పెంపొందుతున్నది వైజ్ఞానిక దృక్పథం కాదు, మూఢాతిమూఢవిశ్వాసం! ఈ పరిస్థితి ఎప్పటికి మారుతుందో, అసలు మారుతుందో, లేదో తెలియదు. ఇది మారనంతవరకు మనకు నిజమైన ప్రగతి సున్న, మనకు ఉజ్వలమైన భవిష్యత్తు హుళక్కి!!

[సెప్టెంబర్ 3, 1972]

ఫీల్డ్ మార్షల్ మానెక్ షా

కాల మేమో 1942; స్థల మేమో బర్మాలో సిట్టాంగ్ వంతెన; సన్ని వేశ మేమో ఆ వంతెన రక్షణ బాధ్యత.

నల్లేరుపై బండి నడకవలె బర్మాలో జపాన్ సేనల పురోగమనం సాగు తున్నది. వాటి కైవసం కాకుండా ఆ వంతెనను రక్షించడం సాధ్యమా ? సాధ్యా సాధ్యాల ఆలోచనతో నిమిత్తం లేకుండా ఒక ఇండియన్ మేజర్ తన సైనిక ధర్మాన్ని నిర్వహిస్తున్నాడు. అతడు యువకుడు కాడు గాని, 28 సంవత్సరాలు ఇంకా దాటనివాడు.

అతడికి మరతుపాకి గుండు దెబ్బలు తగిలాయి. అతడు నేలపై కుప్ప కూలినట్టు పడిపోయాడు. అతడు మరణించినట్టుగానే భావించి, అతడి ఆధిపత్యం కింద వున్న సైనికులు హుటాహుటిగా తిరోగమించారు. అయితే, అతడి ఆర్డర్లీ మాత్రం తన ఆఫీసర్‌ను విడిచి పారిపోలేదు. అక్కడనే ఒక మూల దాక్కున్ని జపాన్‌వారు వెళ్ళిపోయిన తర్వాత అతడిని భుజంపై వేసుకొని ప్రోంపట్టణం దిక్కుగా నడవడం ప్రారంభించాడు, మార్గంమధ్యలో స్పృహవచ్చిన ఇండియన్ మేజర్ "మరి నేను బ్రతకను. నీకు లేని పోని శ్రమ దేనికి ? నన్ను దిగవిడిచి వెళ్ళిపో !" అని హెచ్చరించాడు. అయినా, అతడు వినలేదు. "మీలో వూపిరి వుండగా, నేను మిమ్మల్ని విడిచివెళ్ళేది లేదు" అని గట్టిగా చెప్పాడు.

ఇంతలో జపాన్ విమానాలు బాంబుల వర్షాన్ని కురిపించడానికి రాగా, తన ఆఫీసర్‌ను అతడు కందకాలలో భద్రంగా దాచిపెట్టాడు. తిరిగి ఆ రోజంతా నడుస్తూపోయాడు. ఆ మరునాడు కూడా అదే విధంగా ఆఫీసర్‌ను మోసి, చివరికి ఒక మిలిటరీ ఆసుపత్రికి చేర్చాడు.

తెల్లవారు జామున నాలుగు గంటలకు ఒక ఆర్మీ సర్జన్ ఆపరేషన్ చేసి, ఆ ఇండియన్ మేజర్ పేగులలోనుంచి, లివర్‌లోనుంచి, ఊపిరి తిత్తులలోనుంచి మొత్తం ఆరు మరతుపాకి గుళ్ళను తీశాడు.

ఆటు తర్వాత ఆ మేజర్‌ను రంగూన్‌కు పంపించారు. ఆ పైన ఓడలో మద్రాసుకు చేర్చారు. అతడు కోలుకోగల అవకాశాలు లేవని రంగూన్ డాక్టర్లు భావించారు గాని, మద్రాసులో మరొక ఆపరేషన్ పిమ్మట క్రమంగా అతడు కోలుకొన్నాడు. బర్మాయుద్ధంలో చూపిన ధైర్యసాహసాలకు అతడికి నాటి బ్రిటిష్ ప్రభుత్వం "మిలిటరీ క్రాస్" బహూకరించింది. అతడినే మొన్న నేటి భారత ప్రభుత్వం మొదటి ఫీల్డ్ మార్షల్‌ను చేసింది.

మేము చెప్పకుండానే మేము ఇంతవరకు వ్రాసింది ఎస్. హెచ్. ఎఫ్. జె. మానెక్‌షానుగురించే అని మీరు ఇప్పుడు గ్రహించివుంటారు. సర్వ సేనానిగా రాణించడానికి కేవలం ధీరోదాత్తత చాలదు; యుద్ధవ్యూహరచనలో సామర్థ్యమైనా చాలదు; తన సహచరులలో, అనుచరులలో తననాయకత్వంపట్ల దృఢ విశ్వాసాన్ని పాదుకొల్పగల శక్తికూడా కావాలి; వారిని ఉత్తేజపరచగల, వారిచే ఎట్టి త్యాగాలనైనా చేయించగల ప్రవృత్తికూడా కావాలి. వీటిలో అధికుడైనందునే మానెక్‌షా స్వతంత్ర భారతంలో మొదటి ఫీల్డ్‌మార్షల్ కాగలిగాడు.

తల్లిదండ్రులకు మానెక్‌షా "శామ్"; మిత్రకోటికి "శామ్"; ఇదే విధంగా తన సైనికులకు కూడా "శామ్". ఇంతగా అందరి ప్రేమానురాగాలను అతడు చూరగొన గలిగాడు. జనరల్ కౌల్‌వలె, ఫీల్డ్‌మార్షల్ మానెక్‌షా రాజకీయాలలో ఎన్నడూ వేలు పెట్టినవాడు కాడు. సైన్యాధికారులు రాజకీయాలకు దూరంగా వుండవలెనన్న బ్రిటిష్‌సంప్రదాయాన్ని అతడు సర్వదా పాటించాడు.

నంగి నంగి మాటలు మానెక్‌షాకు చేతకావు. కల్లకపటాలకు అతడు అపరిచితుడు. అందువల్లనే కృష్ణమీనన్ రక్షణ మంత్రిగా వున్న రోజులలో ఆయన వైఖరులపట్ల, విధానాలపట్ల తన అసంతృప్తిని తన మిత్రవర్గంమధ్య వెల్లడించడం జరిగింది. అతడి పలుకులను కృష్ణమీనన్‌వద్దకు ఎవరో చేరవేయగా, విచారణ జరిపించడంవరకు వెళ్ళారు. అయితే, అతడిపై వచ్చిన ఆరో

పణలను విచారణసంఘం త్రోసిపుచ్చింది. అయినా, అప్పటిలో అతడి ప్రమోషన్ నిలిపివేశారు.

అయితే మాత్రమేమి? అన్ని విధాల సమర్థుడైనందున స్వతంత్రభారతంలో మొట్టమొదటి ఫీల్డ్‌మార్షల్ కాగల ఘనత అతడికే దక్కింది.

విశిష్టవ్యక్తి కనుకనే తాను ఫీల్డ్‌మార్షల్ అయిన మరునాడే "నలుబది సంవత్సరాలనుంచి నేను సర్వీసులో వున్నాను. నన్ను మరి సర్వసేనాని పదవి నుంచి తప్పించి, నాకంటె తక్కువ వయస్సులోగల సేనానిని ఆ పదవికి నియమించాలి" అని మానెక్‌షా ప్రకటించాడు. ఇంతలోనే జనరల్ జి. జి. బెవూర్‌ను ఆ పదవికి నియమించినట్టు వార్త వచ్చింది కూడా.

సర్వసేనానిపదవినుంచి మానెక్‌షా తప్పుకొన్నా, ఫీల్డ్‌మార్షల్‌గా ఆయన సలహాలు భారత సాయుధబలాలకు లభిస్తూనే వుంటాయి. సర్వసేనానిగా మనకు, మన దేశానికి ప్రతిష్ఠతెచ్చిన ఫీల్డ్‌మార్షల్ మానెక్‌షాకు ఈ సందర్భంలో మా గౌరవాభినందనాలను అందజేస్తున్నాము.

[జనవరి 5, 1973]

ఎవడు మేధావి?

ఏక ఆసియాఖండం మహాసభలో ఇటీవల ప్రసంగిస్తూ శ్రీమతి ఇందిరా గాంధి భారతీయ మేధావులలో "సినిసిజం" ప్రబలంగా కానవస్తున్నదని, సామాన్య ప్రజలలో వారికి విశ్వాసం లేదని, దైనందిన జీవితంలోని సామాన్యానుభూతుల మాధుర్యాన్ని అనుభవించగల శక్తిని వారు కోల్పోయినారని విమర్శించడం జరిగింది. ఈ విమర్శ సందర్భంలో మాకున్న పెద్ద సందేహం - అసలు మన దేశంలో మేధావు లున్నారా అని, అట్టి వారుండే వారి సంఖ్య అతి స్వల్పం కాదా అని.

"మేధ"కు మన నిఘంటువులు చెబుతున్న రెండు అర్థాలలో మొదటిది "ధారణాశక్తిగల బుద్ధి", రెండవది "యజ్ఞము". కాని, ధారణాశక్తి గలవాడు, ఆ శక్తి ఎంత ఘనంగా వున్నా, మా దృష్టిలో మేధావి కాడు. పోతే, యజ్ఞం చేసేవాడు మేధావి అసలే కాడు. ఆవేశరహితంగా ఆలోచించగలవాడే మేధావి. విశ్వాసానికి కాక, తర్కానికి ప్రాధాన్యమిచ్చేవాడే మేధావి. సత్యాన్వేషణమే ఏకైక మతంగా గలవాడే మేధావి. అలౌకికశక్తులపై, అభూతసంఘటనలపై ఎంతమాత్రం విశ్వాసం లేనివాడే మేధావి. ఒక్క మాటలో, ఏది తర్కానికి భిన్నమైనదో, ఏది హేతువాదానికి విరుద్ధమైనదో దాన్ని తిరస్కరించగలవాడే మేధావి. ఇట్టివారు మన దేశంలో ఎందరున్నారు? వీరి సంఖ్య కొన్ని వందలనైనా మించగలదో, లేదో!

"మేధ"కు "ధారణశక్తిగల బుద్ధి" అని మన నిఘంటువులు అర్థం చెప్పడం అకారణంగా జరగలేదు. మన సంప్రదాయంలో (ముఖ్యంగా హిందూ సంప్రదాయంలో) ఆలోచనాపాటవానికి కాక, జ్ఞాపకశక్తికి ప్రాధాన్య మిచ్చాడు. రెండు వేదాలను కంఠస్థం చేసినవాడు ద్వివేది, మూడింటిని కంఠస్థం చేసినవాడు త్రివేది, నాల్గింటిని కంఠస్థం చేసినవాడు చతుర్వేది. వాటి అర్థం అతడికి తెలియకపోవచ్చు; "టేప్ రికార్డింగ్ మెషిన్"కు, అతడికీ నిజానికి ఏమీ భేదం లేకపోవచ్చు. అయినా, అతడికే గౌరవం, అతడికే మన్నన. కాగా, వేదాల అపౌరు

షేయత్వాన్ని ప్రశ్నించడానికి ఎవడైనా సాహసిస్తే అతడు పాషండుడు, సంఘం నుంచి వెలివేయదగినవాడు.

ఆలోచనాపాటవానికి కాక, ధారణశక్తికి ఇంతగా మనం అనేక శతాబ్దాలుగా ప్రాధాన్యమిస్తున్నందున, ఆధునిక వైజ్ఞానికశాస్త్రాలలో పెద్ద డిగ్రీలను పొందినవారిలో సయితం ఆలోచన దాదాపు పూజ్యం; మౌలికమైన ఆలోచన, సాహసోపేతమైన ఆలోచన మొదలే సున్న. ఈనాడు మన దేశంలో "ఫిలాసఫీ" పేర మౌలికచింతన చేయడానికి మారుగా, మూఢవిశ్వాసాలను పెంచుతున్నవారు ఎందరు లేరు? ఈనాడు మన దేశంలో "సైన్సు" పేర నూతన సత్యాలను కనుగొనడానికి మారుగా, పాత అబద్ధాలకు ప్రోదచేస్తున్నవారు ఎందరు లేరు? ఈనాడు మన దేశంలో "మోడర్న్ ఎడ్యుకేషన్" పేర జ్ఞానాన్ని పెంచడానికి బదులుగా, భక్తిని వ్యాపింపజేస్తున్నవారు ఎందరు లేరు?

మేధావులుగా యెన్నదగువారు చెదురుగాతప్ప మనకు లేరు కనుకనే, ఊరు కొక "యోగి", నాడు కొక "బాబా" ఈనాడు వెలుస్తున్నారు; వారి పాదసేవకై పేరుకు "ఉన్నత విద్య" అభ్యసించిన వారితోపాటు ఉన్నతోన్నతమైన పదవులలో వున్నవారు ఎగబడుతున్నారు!! మేధావుల దారిద్ర్యం మనకు ఇంత విశేషంగా కలదు కనుకనే, ఒక జాతిగా మనకు ఆలోచన తక్కువ, ఆవేశం హెచ్చు; ఇందువల్లనే మనకు వివేకం తక్కువ, విశ్వాసం హెచ్చు; ఇందువల్లనే మనకు జ్ఞానం తక్కువ, భక్తి హెచ్చు; ఇందువల్లనే మనం వ్యక్తుల కిచ్చే ప్రాధాన్యాన్ని భావాల కివ్వము; ఇందువల్లనే నినాదాలకు మనం సులభంగా మోసపోతూవుంటాము.

[ఫిబ్రవరి 14, 1973]

మనం, మన ప్రవృత్తి

తెలుగు గడ్డపై పుట్టి, ఇతర ప్రాంతాలకు విస్తరించిన ఏ కొత్త మతం, ఏ నూతనోద్యమం దాదాపు కానరాదు. కాని, ఎక్కడ ఏ కొత్త మతం పుట్టినా, ఏ నూతనోద్యమం ప్రారంభమైనా, అతి శీఘ్రంగా, అత్యంత సులభంగా అది తెలుగుగడ్డకు పాకుతుంది. మనకు మౌలికచింతన తక్కువ కావడమే ఇందుకు కారణమా? ఈ ప్రశ్న వేయడమైనా పెక్కుమందికి కోపాన్ని తెప్పించవచ్చు. అయినా, కోపానికి లోనుగాక, ఈ దృష్టినుంచి మన రెండు, మూడు వేల సంవత్సరాల చరిత్రను ఒకసారి సమీక్షచేసుకొనడం ముఖ్యావసరం. ఈ సమీక్ష వల్ల మనం కనీసం కొన్ని సందర్భాలలోనైనా మౌలికచింతన చేసినట్టు స్పష్ట పడితే, మనం ప్రారంభించిన మతాలు, ఉద్యమాలు దేశంలోని అన్యప్రాంతాలకు విస్తరించినట్టు స్పష్టపడితే, మాకంటె సంతోషించగలవా రుండరు.

అన్యప్రాంతాలనుంచి ఏదైనా మతాన్ని, లేదా ఉద్యమాన్ని స్వీకరించి నపుడు దానిపట్ల భక్తిని, విశ్వాసాన్ని, ఉత్సాహాన్ని, ఉత్కంఠను చూపడంలో మనకు మనమే సాటి. బుద్ధునికాలంనుంచి గాంధికాలంవరకు ఇంతే జరిగింది.

బౌద్ధాన్ని మనం ఎప్పుడు పరిగ్రహించినామో స్పష్టంగా తెలియదు. కొందరు చరిత్రకారులు అశోకుని కాలానికి ముందే అది జరిగినట్టు చెబుతున్నారు; మరి కొందరేమో అశోకుని కాలంలోనే అని వ్రాస్తున్నారు. ఏమైనా, ఉభయ వర్గాలు ఒక విషయమై ఏకీభవిస్తున్నారు. బుద్ధుడు తన నూతన ధర్మ ప్రచారానికి మన ప్రాంతానికి రాలేదు. అయినా, ఆయన నిర్యాణంతర్వాత మనం బౌద్ధాన్ని స్వీకరించడానికి ఎంతో కాలం పట్టలేదు.

బౌద్ధమతాన్ని మనం స్వీకరించినతర్వాత అనతికాలంలో అది మనమధ్య విశేషవ్యాప్తి పొందింది. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం తెలుగు గడ్డపై వెలిసిన వందలాది, వేలాది బౌద్ధక్షేత్రాలే. భూగర్భంలో దాగి ఇప్పటికి కూడా ఎన్ని

బౌద్ధక్షేత్రా లున్నవో తెలియదు. కాగా, ఇప్పటికి బయల్పడినవాటిలో సాలి హుండం, శంకరం, రామతీర్థం, కొత్తూరు, లింగరాజుపాలెం, నీలావతి, ఆరు గొలను, కొడవలి, ఆదుర్రు, గుంటుపల్లి, కాపవరం, అల్లూరు, గుమ్మడిదుర్రు, గరికపాడు, గుడివాడ, ఘంటసాల, జగ్గయ్యపేట, భట్టిప్రోలు, కనుపర్తి, విద్యాధరపురం, అమరావతి, పెద గంజాం, చిన గంజాం, బుద్ధాం, వేల్పూరు, రెంటాల, గోలి, నాగార్జునకొండ, మంచికల్లు, ఉప్పుగుండూరు, కొండాపురం, ఫణిగిరి, ఏలేశ్వరం, గాజులబండ, గుత్తి— ఇవి కొన్ని మాత్రమే. వీటిలో అమరావతి ప్రపంచప్రసిద్ధికెక్కిన క్షేత్రం. దాని శిల్పరీతి ప్రభావం దేశ దేశాలకు లకు విస్తరించింది. ఆటు తర్వాత సుప్రసిద్ధమైనట్టిది నాగార్జునకొండ.

... ...

ఏదైనా కొత్త మతంపట్ల, లేదా నూతనోద్యమంపట్ల మనం ఎంత త్వరగా, ఎంతటి ప్రగాఢమైన ప్రేమాభిమానాలను ప్రదర్శిస్తూవుంటామో, కొంతకాలం తర్వాత దాన్ని అంత పూర్తిగా ఒక ప్రక్కకు నెట్టివేస్తూ వుంటాము. అందువల్లనే, కొంతకాలంపాటు ప్రపంచదృష్టిని విశేషంగా ఆకర్షించిన మన బౌద్ధ క్షేత్రాలే మన దృష్టిలో చివరికి "లంజదిబ్బలు"గా మారిపోయాయి. స్వీకృతిలోవలె తిరస్కృతిలో, ప్రేమలోవలె విద్వేషంలో, భూషణలోవలె దూషణలో మన ప్రవృత్తిలో గల ఈ "అతి" కారణంగానే మన దేశచరిత్రలో మనకు తగు పాత్రను మనం పూర్తిగా వహించలేకపోవడం అన్ని కాలాలలో జరుగుతూ వస్తున్నదేమో ఒకసారి మనం గట్టిగా, ప్రశాంతంగా ఆలోచించుకోవాలి.

[మార్చి 25, 1973]

వ్యర్థమైన మూడు జీవితాలు

మహదేవ్ గోవింద రణడే శిష్యుడు గోపాలకృష్ణ గోఖ్లే; గోఖ్లే శిష్యుడు గాంధి. వీరు ముగ్గురు నైతికపునరుజ్జీవన లేనిదే జాతీయ పునరుజ్జీవన లేదని చెప్పినవారే, నైతికపునరుజ్జీవన సాధనకై తమ బోధనలద్వారానే కాక, తమ జీవితాలద్వారా కృషి చేసినవారే. వీరి ముగ్గురి బోధనలు నిష్ఫలమైనాయి, వీరి ముగ్గురి జీవితాలు వ్యర్థమైనాయి. ఇవి కటువైన మాటలుగా తోచవచ్చు. కాని, వీరు ముగ్గురు ఈనాడు మనమధ్య వుండే తమ జీవితాలు వ్యర్థమైపోయినట్టు స్వయంగా చెప్పివుండేవారు!

ముస్ముందు మంచిరోజులు రావచ్చునన్న ఆశతో రణడే, గోఖ్లేలు చనిపోయారు. తన జీవితం చివరి ఘట్టంలో గాంధిలో అట్టి ఆశ సయితం విలుప్తమైపోయింది. బ్రతుకుపై తనకు రోత పుడుతున్నట్టు తన హత్యకు ముందు అనేక పర్యాయాలు ఆయన స్పష్టం చేశాడు. మరణాన్ని ఆహ్వానిస్తున్నట్టు కూడా ఆయన స్పష్టం చేశాడు. అట్టి గాంధి ఈనాడు మన మధ్యవుంటే, మరెంతగా ఆయన విలవిలలాడి వుండేవాడో!

ఈనాడు కల్లకు తప్ప, కపటానికి తప్ప, కాలుష్యానికి తప్ప నీతికి, నిజాయితీకి, నైర్మల్యానికి మన జాతీయజీవితంలో స్థానం లేకుండా పోయింది. ఈనాడు మోసానికి తప్ప, స్వార్థానికి తప్ప, సంకుచితత్వానికి తప్ప, ఋజువర్తనకు, నిస్వార్థానికి, ఉదాత్తతకు మన జాతీయజీవితంలో స్థానం లేకుండా పోయింది. ఈనాడు ద్రోహం తప్ప, మైత్రి లేదు; ద్వేషం తప్ప, ప్రేమ లేదు; హింస తప్ప, అహింస లేదు; క్రౌర్యం తప్ప, కారుణ్యం లేదు. ఒక్క రాజకీయ రంగంలోనే కాదు; సాంఘిక, ఆర్థిక, పారిశ్రామిక, వాణిజ్య, విద్యారంగాలలో,

అన్యరంగాలలో పరిస్థితులు ఒకే విధంగా వున్నాయి. మొత్తం జాతీయజీవనమే నైతికపు విలువలకు సంబంధించినంతవరకు నికృష్టస్థాయికి దిగజారిపోయింది.

ధర్మోపన్యాసా లేమో అవిరళంగా సాగుతున్నాయి. దేశభక్తినిగురించి, ప్రజాసేవనుగురించి, నవసమాజ నిర్మాణాన్నిగురించి ధర్మోపన్యాసాలను విన లేక చెవులు చిల్లులు పడుతున్నాయి. మందలో కలిసిపోకుండా చెదురుగా ఎవరో కొందరు ఇప్పటికి కూడా కుడి ఎడమలను పాటించేవా రుంటే, ఇప్పటికి కూడా ఉచితానుచితాలు పరిగణించేవారుంటే, ఇప్పటికి కూడా చూస్తూ చూస్తూ అప మార్గాన పోవడానికి బిడియపడేవారుంటే - అట్టివారికి బ్రతుకుపైనే జుగుప్స పుడుతున్నది.

అవినీతి బలిసినప్పుడు, అధర్మం పెచ్చు పెరిగినప్పుడు దైవభక్తి హెచ్చడం కద్దు. ఇది అన్ని దేశాలలో జరుగుతుంది, అన్ని కాలాలలో జరుగుతుంది. ప్రస్తుతం మన దేశంలో ఇంతే జరుగుతున్నది. ఏవో కూళ్లు కుడిచి ఒక పదవిని సంపాదించినవాడు పెద్ద భక్తుడు! ఎన్ని కొంపలైనా ఆర్పి, నాలుగు డబ్బులు మూటగట్టినవాడు అంతకంటె పెద్ద భక్తుడు! భక్తుల సంఖ్యబట్టి బాబాల సంఖ్య, అమ్మల సంఖ్య, అమ్మమ్మల సంఖ్య, భగవానుల సంఖ్యా పెరుగుతుంది. ఇది కూడా ఈనాడు విశేషంగానే జరుగుతున్నది.

వయస్సు మళ్ళినవారు, మరెంత కాలమో జీవించబోనివారు ఈ దుష్పరిణామాలనుంచి తమకు త్వరలో విముక్తిరాగలదని ఎలాగో సరిపెట్టుకోవచ్చు. కాని, తమ కుమారులసంగతి, తమ మనుమలసంగతి ఏమి కానున్నదన్న చింత మాత్రం వారిని ఎంతగానో సంక్షుభితులను చేస్తుంది! అవి కటువైన మాటలుగా తోచినా, నిజంగానే రణడే, గోఖ్లే, గాంధీ జీవితాలు వ్యర్థమైనాయి;

[మార్చి 28, 1973]

నైతికపతనం

ఒక సుప్రసిద్ధ వ్యక్తి, ప్రముఖ ప్రజానాయకుడు "వ్యర్థమైన మూడు జీవితాలు" అనే శీర్షిక కింద గత బుధవారంనాడు మేము వ్రాసిన సంపాదకీయం అధికమైన, అకారణమైన నిరాశానిస్పృహలతో నిండి వున్నట్టుగా భావిస్తున్నాడు. ఇప్పటికి కూడా దేశంలో ఉన్నతమైన, ఉత్తమమైన జీవితపు విలువ లున్నవారు కొందరు లేకపోలేదని అయన వ్రాస్తున్నాడు. ఇట్టివారు ఎవరో కొందరు లేకపోలేదు. అయితే, మేము మా సంపాదకీయంలో వివరించినట్టు, వీరు చెదురుగా తప్ప ఈనాడు కానరావడం లేదు. ఇట్టి వారిని కాక, సంఘం మొత్తాన్నే మనం దృష్టిలో పెట్టుకోవాలి.

మొత్తం సంఘం నైతికపు విలువలకు సంబంధించినంతవరకు ప్రస్తుతం ఎంత హీనస్థాయికి-ఎంతటి నైచ్యస్థితికి - మనం దిగజారిపోయామో మన వార్తా పత్రికలు నిత్యం తెలపడం లేదా? పోయిన రెండు, మూడు రోజులలోనే మా కంటబడిన ఈ మూడు వార్తలను మా పాఠకులలో ఎందరు గమనించారో తెలియదు. అందువల్ల వాటిని సంగ్రహంగా పేర్కొంటున్నాము.

కేరళ ప్రభుత్వానికి చెందిన ఇద్దరు మంత్రులు తమ నివాసగృహాలకు అద్దెలను తమ భార్యలకు చెల్లింపజేస్తున్నట్టు అసెంబ్లీలో విమర్శ వచ్చింది. అందుకు వారు చెప్పిన సమాధానం - ఆ గృహాలు తమవి కావని, తమ భార్యల వని: వా రిద్దరి చర్యను సమర్థిస్తూ, అది న్యాయసూత్రాలరీత్యా సమర్థనీయమైన దని ముఖ్యమంత్రి పేర్కొన్నాడు. కావచ్చు. కాని, అది నైతికసూత్రాలరీత్యా అసమర్థనీయమైనది కాదా? కానిపక్షంలో, తమపై ఒకసారి విమర్శ జరిగినంతనే ఇక మీదట తాము తమ భార్యలకు అద్దె యిప్పించబోమని ఆ మంత్రు లిద్దరు చెప్పడం ఎందుకు జరిగేది?

పోతే, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ చర్చల సందర్భంలో బర్న్‌పూర్‌లో కేంద్రప్రభుత్వ యాజమాన్యం కిందవున్న ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీలో రెండున్నర, మూడువేల రూపాయలను దళారీలకు చెల్లించినవానికి ఉద్యోగం తేలికగా దొరుకుతున్న దన్న ఆరోపణ జరిగింది. ఈ విధంగా "చేయి తడిపి" ఉద్యోగాలు సంపాదించినవారిలో దాదాపు అయిదు వందల మంది హాజరు పట్టీలో చేవ్రాలు చేసి, తమ సొంతపనులు చేసుకొనడానికి వెళ్ళిపోతున్నట్టు ఆరోపణ జరిగింది. ఈ ఆరోపణలు ఎంతవరకు నిజమో మాకు తెలియదు గాని, వీటిని చేసినప్పుడు ప్రభుత్వపక్షంవారు మౌనం పాటించారు.

కాగా, ఢిల్లీ పరిపాలక సంస్థకు చెందిన విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కథనం ప్రకారం, కొందరు ఉపాధ్యాయులు తమకు ఎంతో కొంత ముడుపు చెల్లించినవారిని పరీక్షలలో ఉత్తీర్ణులను చేస్తున్నారు! ఉపాధ్యాయవర్గానికి చెందినవారే ఈ ఘోరస్థితికి దిగజారిన తర్వాత ఇతరవర్గాలవారిలో నీతి ఎలా వుంటుంది, నిజాయితీ ఎలా వుంటుంది ?

నిజానికి, వార్తాపత్రికలవరకు వెళ్ళడం దేనికి ? మన చుట్టుపక్కలలోనే, మన ఎరుకలోనే - ఇట్టి సంఘటనలు ఎన్ని వందలు లేవు, ఎన్ని వేలు లేవు ? ఇతరుల ఆరోగ్యం చెడిపోగలదని తెలిసినా, ప్రాణాలే పోవచ్చునని తెలిసినా, లాభాలకోసం కల్లు, సారాలను కల్తీచేయబట్టే కదా కడచిన రెండు, మూడు నెలలలోనే దేశం మొత్తంమీద అయిదారు వందలమందికిపైగా చనిపోవడం సంభవించింది ! నిజానికి ఈనాడు చివరికి ఔషధమైనా ఏదో కల్తీలేకుండా దొరకగలదన్న నమ్మకం మన కున్నదా ?

కృతయుగ మొకటి కలదన్న, కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలపై నడిచినదన్న అంధ విశ్వాసం మాకు లేదు. ఇప్పుడు "పాడు కలికాలం" వచ్చిపడినదన్న మూఢవిశ్వాసమైనా మాకుసుతరాములేదు. ఎప్పుడైనా, ఎక్కడైనా మానవసంఘంలో ఎంతో కొంత అవినీతి వుంటుంది, అధర్మం వుంటుంది. కాగా మా బాధ, మా ఆవేదన, ఈనాడు మన సంఘంలో అవినీతి, అధర్మాలు మితిమీరి పోయినవనే, "మనలో మానవత చచ్చిందా?" అని సందేహించవలసినంతటి మేరకు అవి పెరిగిపోయినవనే ! !

[మార్చి 31, 1978]

తిరిగి ఉగాది

తిరిగి ఉగాది వచ్చింది; కొత్త సంవత్సరంలో పాదం పెడుతున్నాము. అయితే ఆశతో కాదు, అనుమానాలతో; ఆనందంతో కాదు, ఆందోళనతో. క్రితం ఉగాదికి, ఈ ఉగాదికిమధ్య తెలుగువారికి సంక్షోభం తప్ప ప్రశాంతి లేదు; కష్టాలు, కడగండ్లు, కన్నీళ్ళు తప్ప అన్యం లేవు. పోయిన పన్నెండు నెలలలో దాదాపు సగం కాలంపాటు పరిపాలన స్తంభించింది; ప్రణాళికలు, పథకాలు కుంటుపడినాయి; లక్షలాది విద్యార్థుల చదువులు వెనుకబడి పోయాయి; రైళ్ళు, బస్సులు నిలిచిపోయినందున, ప్రయాణికులు చిక్కుపడవలసి వచ్చింది; పోస్టల్, టెలిగ్రాఫ్, టెలిఫోన్ సౌకర్యాలకు భంగం కలిగినందున, ఒకరి యోగక్షేమాలు మరొకరికి తెలియడమైనా కష్టమైపోయింది; బ్యాంకులు పనిచేయనందున వర్తక వాణిజ్యాలకు దెబ్బ తగిలింది; ఎంద రెందరో ఎన్. జి. ఓ. లు, తక్కిన సమ్మెదారులు ఒక పూట తింటే, మరొక పూట పస్తు పడుకోవలసి వచ్చింది; దుర్భిక్ష ప్రాంతాలలోని దీనులు తమ గోడు పట్టించుకొనగల నాథుడు లేనందున చెప్పరాని అగచాట్లపాలు కావలసివచ్చింది. ఇంతవరకు మేము పేర్కొన్నవి కొన్ని కష్టాలు, కొన్ని నష్టాలు మాత్రమే. ఇట్టివి మరెన్నో వున్నాయి. వాటివల్ల మనం, మన రాష్ట్రం ఒక దశాబ్దంపాటు వెనుకకు వెళ్ళడం జరిగింది.

కొందరి అంచనా ప్రకారం, పోయిన కొద్ది నెలలలో మనం పొందిన నష్టం నూరు, రెండు వందల కోట్ల రూపాయల మధ్యలో వుండవచ్చు. కాని, ధనరూపంలో అంచనాకు అందని కష్ట నష్టాలు ఎన్ని లేవు? ఉదాహరణకు, వెనుకబడిన చదువులు ఇట్టి అంచనాకు అందగలవా? వైద్యసహాయ లోపం ఇట్టి అంచనాకు అందగలదా? దౌర్జన్యపూరిత ప్రదర్శనలలో, పోలీసు కాల్పులలో పోయిన నిండుప్రాణాలు ఇట్టి అంచనాకు అందగలవా? విలుప్తమైపోయిన ప్రజాస్వామ్య జీవితపు విలువలు - వాక్ స్వాతంత్ర్యం, సభాస్వాతంత్ర్యం, పత్రికాస్వాతంత్ర్యం మొదలైనవాటి విలువలు - ఇట్టి అంచనాకు అందగలవా?

అయినా, కడచిన సంవత్సరాన్ని తలచుకొని, లోలోపల పొంగిపోగల వారు కొందరు లేకపోలేదు. ఇట్టివారిలో ప్రత్యేకించి పేర్కొనదగువారు —

(1) ఒక్క గంతులో నాయకులై కూర్చున్న అనామకులు

(2) రైళ్ళు, బస్సులు నిలిచిపోవడాన్ని సావకాశంగా తీసుకొని వేలు, లక్షలు మూటకట్టిన ప్రయివేట్ బస్సు ఆపరేటర్లు, టాక్సీ యజమానులు

(3) కిరొసిన్, టార్చి లైట్లు, బ్యాటరీలు మున్నగువాటిని బ్లాక్ మార్కెట్ ధరలకు అమ్ముకొన్నవారు

(4) ఏన్. జి. ఓ. ల సహాయార్థం వసూలుచేసిన నిధులకు లెక్క చెప్పడానికి నిరాకరిస్తున్నవారు

(5) ప్రభుత్వకార్యాలయాలపై దాడుల పేరుతో ఇంటి పన్ను, అమ్మకం పన్ను, ఆదాయం పన్ను మొదలైనవాటి రికార్డులను తగలబెట్టించినవారు.

ఇట్టి మరి కొందరు నిజంగానే "కడచిన సంవత్సరం ఎంత మంచి సంవత్సర"మని సంబరపడతారు. అయితే, ఆట్టి నికృష్టులసంఖ్య బహుపరిమితం. ప్రజాకోటికి సంబంధించినంతవరకు అది ఆందోళనతో నడిచిన సంవత్సరమే, ఆవేదనతో నిండిన సంవత్సరమే! కొత్త ఉగాదితో ఈనాడు పాదం పెట్టిన కొత్త సంవత్సరం కడచినదానికి పూర్తిగా భిన్నమైనది కాగలదా? ఇది మనకు, మన రాష్ట్రానికి శాంతిని కూర్చగలదా? సుభిక్షాన్ని నెలకొల్పగలదా? ఇతర విధాల శుభదాయకం కాగలదా? ఈ ప్రశ్నలకు సమాధానాలు మన దూరదృష్టి పైనే, మన సంయమనంపైనే, మన విజ్ఞతపైనే ఆధారపడి వుంటాయి.

[ఏప్రిల్ 4, 1973]

పికాసో

ఆయన పేరు వినివుండలేదంటే, అది తన అజ్ఞానాన్ని అచ్చుకొనడం, ఆయన కళను హర్షించలేనంటే అది తన అరసికత్వాన్ని చాటుకొనడం — ఆధునిక ప్రపంచంలో ఇట్టి ప్రతిపత్తిని గడించుకొన్నవాడు నిన్న ఫ్రాన్సులో కన్ను మూసిన పాబ్లో పికాసో. ఒక దశాబ్దం, రెండు దశాబ్దాలపాటు కాదు, అర్ధశతాబ్దికి పైగా ఆధునికచిత్రకారులలో ఆయనే ప్రథముడు! ఒకటి కాదు, రెండు కాదు, ఎన్నెన్నో ఆధునిక చిత్రకళారీతులకు ఆయనే జనకుడు!!

ఆయన పుట్టింది స్పెయిన్‌లో, జీవితంలో అత్యధికభాగాన్ని గడిపింది ఫ్రాన్సులో. ఆయన రక్తనాళాలలో ప్రవహించినట్టిది స్పానిష్, జ్యూయిష్, ఇటాలియన్ రక్తం. ఈ ద్వివిధ జాతీయపరిసరాలు, ఈ బహుళవిధ రక్తకణాలు ఆయనలో పెంపొందించినట్టిది దేశకాలావధులను దాటిన విశ్వవిశాల కళాదృష్టి. ఆయన తండ్రి చిత్రకారుడు. అందువల్లనే బాల్యంలోనే ఆయన సాంప్రదాయిక చిత్రకళారీతులలో ప్రజ్ఞ సంపాదించాడు. ఆటుతర్వాత ఆయన మొత్తం జీవితం ఒకే ఒక కృషికి అంకితమైపోయింది. అది - సాంప్రదాయిక చిత్రకళా రీతులను అధిగమించి, వినూత్నమైన, విలక్షణమైన రీతులను సృష్టించడమే!

ఆయన సృష్టించిన ఈ వినూత్న, విలక్షణరీతులను వికారమైనవిగా, విపరీతమైనవిగా, విడ్డూరమైనవిగా విమర్శించినవారు లేకపోలేదు; కళను ఆయన వక్రమార్గాలను పట్టించినట్టు విరుచుకుపడినవారు లేకపోలేదు. కాని, ఎంతటి తీవ్ర విమర్శకులైనా పికాసో సృజనాత్మకశక్తిని, దాని వైవిధ్యాన్ని, దాని ప్రాగల్భ్యాన్ని గుర్తించక తప్పలేదు. దాన్ని పోల్చవలసింది వర్షాకాలంలో ఒక్కొక్కప్పుడు గట్టులను తెంచుకొని, నురుగులు కక్కుతూ, సుడులు తిరుగుతూ, పరవళ్ళు తొక్కుతూ, చెట్టు చేమలను కూకటివేళ్ళతో పెకలిస్తూ, మిట్టలను పల్లాలుగా, పల్లాలను మిట్టలుగా మార్చుతూ, ఉగ్ర నరసింహమూర్తిని గుర్తుకుతెచ్చే నిర్ఝరంతో!!

కళాస్రష్టగా తన జీవితంలో ఏ రెండు దశాబ్దాలలోను ఒకే రీతిని పికాసో అనుసరించలేదు. ఎప్పటికప్పుడు ఏదో కొత్త రీతిలో ఆయన కొత్త సృష్టిచేస్తూ పోయాడు. ఈ రీతులలో అతి నవ్యమైనది, అతిముఖ్యమైన క్యూబిస్టురీతి. ఒక మిత్రునికి లేఖ వ్రాస్తూ, సుప్రసిద్ధ ఫ్రెంచిచిత్రకారుడు సేజాన్ ప్రకృతిలోని ప్రతిదాన్ని స్ఫియర్‌క్రింద, కోన్‌క్రింద, సిలిండర్‌క్రింద మార్చవచ్చు నన్నాడు. ఈసూక్తి ప్రేరణతోనే కావచ్చు, పికాసో క్యూబిస్టు కళారీతిని సృష్టించాడు. అయితే, క్యూబిజమైనా, ఆయన సృజనాత్మకశక్తికి సీమాంతం కాలేదు. అటుతర్వాత సర్రియలిజం మొదలైన కొత్త కొత్త కళారీతులకు అది సాగిపోయింది; కొత్త కొత్త దిగంతాలను తాకింది.

పికాసో చిత్రకారుడు మాత్రమే కాదు, శిల్పి కూడా, అగ్గిపెట్టెలపై, సిగరెట్టుపెట్టెలపై ఆయన కొన్ని చిత్రాలు వేశాడు. కాగితం ముక్కలను అంటించి కొన్ని చిత్రాలు చేశాడు. ఇసుకతో, బొగ్గుతో, సీమసున్నంతో కొన్ని చిత్రాలను రూపొందించాడు. శిల్పాలవిషయంలో కూడా ఆయన చేయని గారడీ లేదు. సైకిల్ హ్యాండిల్ బార్‌తో, సీటుతో ఆయన ఎద్దుముఖం శిల్పాన్ని చేశాడు. అగ్గిపుల్లలతో, ఇసుకతో, జిగురుతో ఇతర శిల్పాలను కొన్నింటిని చేశాడు పింగాణి పాత్రలకు శిల్పగౌరవాన్ని కూర్చాడు.

రూపంలో నైరూప్యాన్ని చూడ్డం పికాసో ప్రత్యేకత; నైరూప్యంలో రూపాన్ని చూడ్డం ఆయన వైశిష్ట్యం. ఇదే విధంగా ఆకృతిని వికృతిగా, వికృతిని ఆకృతిగా మార్చడంలో ఆయన దిట్ట. అర్థాన్ని అయోమయంగా, అయోమయాన్ని అర్థంగా మార్చడంలో సయితం ఆయన ఘటికుడు. ఏ సూత్రానికీ, ఏ నియమానికీ, ఏ సంప్రదాయానికీ లొంగనివాడు కనుకనే, పికాసో తనకు తానే సాటి. చిత్రకారుడుగానే కాక, శిల్పిగానే కాక, వ్యక్తిగా కూడా ఆయన అతి విశృంఖలుడే! షష్టిపూర్తి తర్వాతకూడా ఆయన జీవితంలో ప్రవేశించిన, దానినుంచి నిష్క్రమించిన భామల సంఖ్య తక్కువేమీ కాదు.

చిన్నతనంలో పికాసో దారిద్ర్యబాధలను అనుభవించాడు; అటు తర్వాత ఫాసిజం కన్నెర్రకు గురిఅయినాడు; ఒక అంతర్యుద్ధం క్రౌర్యాన్ని,

రెండు ప్రపంచ యుద్ధాల బీభత్సాన్ని చూచాడు; పాత ప్రపంచం శిథిలమైపోగా, దాని స్థానంలో తలయెత్తలేక విలవిలలాడుతున్న కొత్త ప్రపంచం దురవస్థను గమనించాడు. ఈ వివిధానుభూతులు తనలో కలిగించిన నైరాశ్యాన్ని, శైథిల్యాన్ని తన కళద్వారా వ్యక్తంచేయడానికి ఆయన ప్రయత్నించాడు. ఎవరికి అర్థమైనా, మరెవరికి అర్థం కాకపోయినా, ఎవరిని అలరించినా, మరెవరికి జుగుప్స కలిగించినా, ఆయన కళాసృష్టి చిత్తశుద్ధితో కూడినట్టిది. అట్టి చిత్తశుద్ధి లేకుండానే వేలాది చిత్రకారులు దేశదేశాలలో ఆయన కళారీతులను అనుకరించడమే ఆధునిక చిత్రకళలో, ముఖ్యంగా నైరూప్య చిత్రకళలో, ప్రథమ లోపం, ప్రధాన దౌర్భాగ్యం ! చిత్తశుద్ధి కొరవడిన కళలో ప్రజ్ఞ చెదురుగా కనబడవచ్చు గాని, ఉపజ్ఞ దానిలో సర్వదా పూజ్యమే !

నిన్న ఫ్రాన్స్‌లో కన్ను మూసింది ఒక వ్యక్తి మాత్రమే కాదు, ఒక అద్భుతశక్తి, ఒక అపూర్వశకం.

[ఏప్రిల్ 10, 1973]

జుల్ ఫికర్ అలీ భుట్టో

స్త్రీ చిత్తం చంచలమైన దనడం నిజం కాదు; అది పురుషులనే మాట. భుట్టో చిత్తం మాత్రం నిశ్చయంగా చంచలమైనదే. అది ఆయన విరోధులనే మాట కాదు; ఆప్తులైనా అంతే అనక తప్పదు.

నిన్న చెప్పిన మాట ఆయన నేడు చెప్పడు. ఉదయం చెప్పిన మాట సాయంత్రానికి మారిపోతుంది. ఒక గంటలోనే ఆయన తన మనస్సు మార్చుకోవచ్చు. కొన్ని కొన్ని సందర్భాలలో ఈ నిమిషంలో చెప్పినదానికి, మరొక నిమిషంలో చెప్పినదానికి పరస్పర వైరుధ్యం వుండవచ్చు.

మాట నిలకడ లేకపోవడం ప్రతి రాజకీయ నేతలో తరతమ విభేదంతో కానవచ్చే లక్షణమే. అయితే, ఇది భుట్టో విషయంలో పరాకాష్ఠను అందుకొన్నది.

ఇట్టి వ్యక్తితో వ్యవహరించడం కష్టమే. ఈ విషయాన్ని ఇదివరలో అయూబ్‌ఖాన్ తెలుసుకొన్నాడు; యాహ్యాఖాన్ తెలుసుకొన్నాడు; ముజిబుర్ రహమాన్ తెలుసుకొన్నాడు; ఇందిరాగాంధి కూడా తెలుసుకొనడం ఈసరికి చాలావరకు జరిగినట్లు అనుకోవచ్చు.

అయినా, భుట్టోతో మనమేమి, బంగ్లాదేశ్ నాయకులేమి వ్యవహరించక తప్పదు. ఆయనతో వ్యవహరించకపోతే, ఏ టిక్కాఖాన్‌తోనో, మరొక పాక్ సైనికాధికారితోనో వ్యవహరించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ సంగతి గుర్తించినందువల్లనే కావచ్చు, పాకిస్తాన్‌లోని ప్రతిపక్షాల నాయకులు భుట్టోతో నూతన రాజ్యాంగం రచనవిషయమై ఒడంబడికకు వచ్చారు.

ఈ సందర్భంలో భుట్టో సయితం తెగేవరకు లాగలేదనే చెప్పాలి. ఆదిలో పట్టుదలకు పోయినా, వ్యవహారం బెడిసిపోగలదని తోచినంతనే ఆయన రెండు, మూడు మెట్లు కిందికి దిగివచ్చాడు.

ఇదే భుట్టో ప్రత్యేకత. ఆయన చంచలత్వానికి మూలం బుద్ధిమాంద్యం కాదు, బుద్ధికుశలత. ఆయన ఎంతో తెలివితేట లున్నవాడు; "ఎప్పటి కెయ్యది నెయ్యమొ అప్పటి కా మాటలాడ"గలవాడు; అవసరమైనప్పుడు ''అన్యుల మన ముల నొప్పింప'' జేయడానికి సంకోచించనివాడు; ఆ వెనువెంటనే మెత్తమెత్తగా, తియ్యతియ్యగా మాట్లాడ నేర్చినవాడు.

రాజకీయవేత్తకు వాక్చాతుర్యంమాత్రమే చాలదు; నటనలో ప్రజ్ఞాప్రాభ వాలు సయితం కావాలి. లేకపోతే, అతడు ప్రథమశ్రేణి రాజకీయవేత్త కాలేడు. భుట్టో వాక్చాతుర్యంలోనే కాక, నటనాకౌశల్యంలో కూడా అధిక ప్రతిభావంతుడే. కోపాన్ని నటిస్తూ ఆయన దుర్భాష లాడగలడు; పశ్చాత్తాపాన్ని నటిస్తూ కన్నీరు కాల్వలు కట్టించగలడు; స్నేహాన్ని నటిస్తూ కౌగిలించుకొనగలడు; ఉదాత్తతను నటిస్తూ అరచేతిలో వైకుంఠాన్ని చూపించగలడు.

ఈ గుణగణాలతోపాటు భుట్టోలో వాస్తవికతాపరిజ్ఞానం కూడా కొల్లలుగా వున్నది. అందరురాజకీయవేత్తలవలె ఆయన సయితం "జూదరి". రాజకీయాల ''జూదం"లో ఏమి పందెం కాయవలెనో, ఎవరిపై కాయవలెనో, ఎంతవరకు కాయవలెనో, ఎక్కడ కాయవలెనో, ఎక్కడ ఆగవలెనో ఆయనకు తెలుసు. అందువల్లనే అయూబ్‌ఖాన్‌ను ధిక్కరించి, ఆయన నిలదొక్కుకొనగలిగాడు; యాహ్యాఖాన్‌ను త్రోసిపుచ్చి, పాకిస్తాన్ నాయకత్వాన్ని చేపట్టగలిగాడు; నిరుడు సిమ్లాలో ఇందిరాగాంధితోను, నిన్న పాక్ ప్రతిపక్షాలతోను ప్రతిష్టంభన మరి తప్పదన్న క్లిష్టఘట్టంలో రాజీకి రాగలిగాడు.

ఇప్పుడు తిరిగి ఇండియా, బంగ్లాదేశ్‌లతో భుట్టో ''జూదం'' ఆడు తున్నాడు. దీనిలో సయితం ఎక్కడ ఆగవలెనో ఆయన తెలుసుకోగలడా? రానున్న కొద్ది రోజులలో, లేదా వారాలలో, ఈ ప్రశ్నలకు సమాధానం లభిస్తుంది.

[ఏప్రిల్ 13, 1973]

ఎక్కడికి పోతున్నాము?

ఎందరు రాష్ట్ర విభజన కోరుతున్నారు? ''నూటికి 90 మంది" అని శ్రీ బి. వి. సుబ్బారెడ్డి అనవచ్చు. "కాదు, నూటికి 95 మంది'' అని శ్రీ తెన్నేటి విశ్వనాథం పలకవచ్చు. "దాల్చాలు! ప్రజల సంగతి మీకేమి తెలుసు? నూటికి 99 మంది" అని శ్రీ గౌతు లచ్చన్న హుంకరించవచ్చు.

కేవలం వాదంకోసం శ్రీ లచ్చన్న హుంకరింపు ప్రకారం నూటికి 99 మంది రాష్ట్రవిభజన కోరుతున్నారనే అనుకోండి. అయినా, ప్రతి నూర్గురిలో రాష్ట్ర సమైక్యతను కోరుతున్న ఒక్క వ్యక్తికి తన వైఖరిని ప్రకటించడానికి స్వేచ్ఛ వుండాలి, తన వాదాన్ని ప్రచారం చేసుకొనడానికి స్వాతంత్ర్యం వుండాలి. ఈ స్వేచ్ఛ లేనట్టిది, ఈ స్వాతంత్ర్యం మృగ్యమైనట్టిది ఫాసిస్టు నియంతృత్వం కావచ్చుగాని, ప్రజాస్వామ్యవ్యవస్థ కాదు, కానేరదు.

అయినా, సమైక్యతావాదుల నోరు నొక్కడానికే, వారి సభలను చెదరగొట్టడానికే, వారి పౌరస్వత్వాలను కబళించడానికే విభజనవాదులు ఈనాటికి కూడా ఉద్యమిస్తున్నారు- రెండు, మూడు రోజులనాడు విశాఖపట్నం సమైక్యతావాదులసభపై వారు బాంబులు వేశారు; వారం, పది రోజులనాడు గుడివాడలో ఈ పనినే చేశారు; మరికొన్ని చోట్ల కూడా ఇంతే చేశారు, చేస్తున్నారు.

విభజనవాదుల కోర్కె ఫలిస్తే, ప్రత్యేకాంధ్రరాష్ట్రం నెలకొంటే, దానిలో మైనారిటీ గొంతును మెజారిటీ నొక్కివేయడమే జరగబోతున్నట్టు దీన్నిబట్టి తీర్మానించుకొనవలెనా? దానిలో భావస్వాతంత్ర్యం, వాక్స్వాతంత్ర్యం, సభా స్వాతంత్ర్యం, పత్రికాస్వాతంత్ర్యం మటుమాయం కానున్నవని నిర్ధరించుకొనవలెనా? దానిలో పౌరసత్వాలు పూజ్యం కాగలవన్న సారాంశాన్ని తేల్చుకొనవలెనా? గుడివాడ, విశాఖపట్నం సంఘటనలను పోలినవాటిని విభజనోద్యమ

నాయకులు ఖండించక పోవడాన్నిబట్టి ఇంతే జరగనన్నట్టు నిర్ణయించుకొనక తప్పదేమో !

అది చిన్ని కోర్కె కానివ్వండి, విస్తృతవాంఛ కానివ్వండి; అది ఎంతస్వల్ప విషయమైనా కానివ్వండి, ఘనసమస్య కానివ్వండి; అది ఏదైనా, ఎట్టిదైనా, ఈనాడు మన దేశం మొత్తంమీద జరుగుతున్న పని ప్రజా స్వామ్యం విలువలను తూర్పారబట్టడమే, ప్రజాస్వామ్య సంప్రదాయాలను మంటగలపడమే. ఇంతే కాక, ఆంధ్రప్రదేశ్ విభజనోద్యమాల సందర్భంలో సంస్కృతికి, సభ్యతకు తిలోదకా లివ్వడం సయితం జరిగింది, జరుగుతున్నది. 1969-70లో తెలంగాణాలో వలె, 1972-73లో ఆంధ్రప్రాంతంలో కూడా బండబూతులతో ఎన్ని గోడలు ఖరాబు కాలేదు ? జంట నగరాల గోడలను 1969-70 లో చూచిన నాటి మైసూరు ముఖ్యమంత్రి "తెలుగువారి సంస్కృతి, వారి సభ్యత ఇంత హీనమైనవా, ఇంతగా హేయమైనవా !" అని ముక్కుపై వేలు వేసుకొన్నాడట. వాటిని చూస్తే ఆయనకే కాదు, ఏ శిష్టవ్యక్తికైనా, ఇదే విధమైన ఆశ్చర్యం కలుగుతుంది. ఆవేదన కలుగుతుంది.

దేశం మొత్తంమీద తర, తమ భేదాలతో ఈ విధమైన విపరిణామాలు ప్రబలుతున్నప్పుడు, మనం ఎక్కడికి పోతున్నామన్న ప్రశ్న సహజంగానే ఉదయిస్తుంది. ఆ ప్రశ్న ప్రతి ప్రజాస్వామ్యవాది మనస్సును నేడు వికలం చేస్తున్నది, ప్రతి శిష్టమానవుని హృదయాన్ని సంక్షుభితం చేస్తున్నది !

[ఏప్రిల్ 13, 1973]

"మాకు అర్థంకాని విషయాలు"

ఉద్యోగా లంటే ప్రభుత్వోద్యోగాలే కావు. అయినా, అట్టి భావం మన దేశంలో ప్రబలంగా వుండడం మన జాతీయదౌర్భాగ్యం. బ్రిటన్‌లో, ఫ్రాన్సులో, జర్మనీలో, జపాన్‌లో, సర్వతోముఖాభివృద్ధి చెందిన అన్యదేశాలలలో మరొక ఉద్యోగంలో ప్రవేశించగల ప్రజ్ఞాప్రాభవాలు తక్కువైనవారే ప్రభుత్వోద్యోగాలలో చేరతారు. ఒకవేళ తమకు అట్టి ప్రజ్ఞాప్రాభవా లున్నా, అన్యరంగాలలో ప్రవేశం లభించకపోతేనే ప్రభుత్వోద్యోగానికి అయిష్టంగా ప్రయత్నిస్తారు. ప్రభుత్వోద్యోగంతో కొంత స్తిమితం వుండవచ్చు; స్థిరత్వం వుండవచ్చు. కాని, దానిలో స్వాతంత్ర్యం తక్కువ; మౌలికచింతనకు, ప్రతిభకు అవకాశం తక్కువ. ఇంతే కాదు. అవినీతికి పాల్పడితే తప్ప, దానిలో సంపాదనకూడా తక్కువే.

మరొక విషయాన్ని కూడా ఈ సందర్భంలో మనం గమనించాలి. మొత్తం ఉద్యోగాలలో ప్రభుత్వోద్యోగాల శాతం ఎంత తక్కువైతే, అంతగా ఏ దేశమైనా అభివృద్ధి చెందిందని, లేదా చెందుతున్నదని తీర్మానించు కొనవలసి వుంటుంది. ఈనాటికి కూడా మన దేశంలో మొత్తం ఉద్యోగాలలో ప్రభుత్వోద్యోగాల శాతం అధికంగా వుంటే, మన ఆర్థిక, పారిశ్రామిక, వాణిజ్యాది వ్యవస్థలు త్వరితంగా వృద్ధిచెందడంలేదన్న విషయాన్నే అది సూచిస్తుంది. ఏమైనా, ప్రభుత్వోద్యోగాలను పెంచవలసిన మేరకు – ఆ మేరకు దాటిపోయి కూడా – ఈసరికే పెంచివేశారు. "మంది ఎక్కువైతే, మజ్జిగ పలచన" అన్నట్టు, ఆఫీసులలో సిబ్బంది పెరిగినకొద్దీ వారు చేస్తున్నపని పలచబడుతున్నది కూడా.

ఇంతే కాక, ప్రస్తుతం ప్రజలనుంచి ప్రభుత్వం పన్నుల రూపంలో, శిస్తుల రూపంలో, సెస్సుల రూపంలో, సుంకాల రూపంలో, ఇతర రూపాలలో వసూలుచేస్తున్న మొత్తంలో అత్యధిక భాగం ఉద్యోగుల జీతనాతాలకిందనే

చెల్లిపోతున్నది; ప్రజావసరాలను తీర్చడానికి మిగులుతున్నది కొన్ని సందర్భాలలో దాదాపు పూజ్యం. కాగా, మరి కొన్నింటిలో బహుస్వల్పం. అందువల్ల ప్రజావసరాలను తీర్చాలంటే ప్రభుత్వం ఋణాలను చేయవలసివస్తున్నది. దీనితో నానాటికి మన ఋణభారం పెరుగుతున్నది; పాత ఋణాలను తీర్చడానికి కొత్త వాటిని చేయవలసివస్తున్నది కూడా.

ఏమైనా, ప్రస్తుతపరిస్థితులలో ప్రభుత్వోద్యోగాలకు అవకాశాలు తక్కువ. మన రాష్ట్రానికి సంబంధించినంతవరకు సాలుకు కొత్త ప్రభుత్వోద్యోగాలు బహుశా వెయ్యింటికి మించవు. పైగా, వాటిలో దాదాపు సగం, సగానికి ఏపాటిగానో పైగాకూడా, నాల్గవ తరగతి ఉద్యోగాలే! వాటిని "ఉద్యోగా"లనడం కంటె "ఊడిగా"లనడమే ఎక్కువ సమంజసం!

ఒక పది పరిశ్రమలను పెడితే, ఒక వెయ్యిమందికి కాక, మూడు నాలుగు వేల మందికైనా ఉద్యోగాలు దొరుకుతాయి. ప్రభుత్వవ్యవస్థకు వెలుపల ఇట్టి ఉద్యోగాలకల్పనకై ఢిల్లీ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నది కూడా. ఇందుకు సంబంధించిన పథకంకోసం 1973-74వ సంవత్సరానికే ఆరు కోట్ల రూపాయలను అది మంజూరు చేసింది. ఈ సంవత్సరంలోపల దాదాపు 40,000మందికి కొత్త ఉద్యోగాలను చూపించడానికి కృషి జరుగుతున్నది. ఇటీవలి ఆందోళనలు, అలజడులు అడ్డురాకపోతే, ఈ పథకం ఈసరికే మరెంతగానో ముందుకు సాగిపోయివుండేది. అయితే, అవాంతరాలెన్ని వచ్చినా, ఈ పథకంకింద ఇప్పటికే 4000మందికి సహాయంచేయడం జరిగింది.

అయినా, కేవలం ప్రభుత్వోద్యోగాలకే లేనిపోని ప్రాధాన్యాన్ని ఎందుకిస్తున్నారో మాకు అర్థంకావడం లేదు ప్రభుత్వోద్యోగాలు లేకపోతే, బ్రతుకే లేనట్టు ఎందుకు అలజడిచేస్తున్నారో మాకు అర్థంకావడం లేదు. వాటి విషయమై పెంచుకొంటున్న ఆవేశకావేషాలతో, రాష్ట్ర సమగ్రతను రక్షించడానికై ఏ రాజీ పథకాన్ని సూచించినా, దాన్ని త్రోసిపుచ్చాలని కొందరు ఎందుకు పట్టుదల చూపుతున్నారో మాకు అర్థంకావడం లేదు. వీటికంటెకూడా మేము అర్థం చేసుకొనలేకపోతున్న విషయాలు కొన్ని వున్నాయి. రాష్ట్రంలో ప్రజలు లేరా, ప్రజానాయకులు లేరా? వీరుంటే, ఎన్.జి.ఓ. సంఘాలవారిని, ఆ సంఘాల నాయకులను కేవలం తామే రాష్ట్ర ప్రజలైనట్టు, ప్రజానాయకులైనట్టు వ్యవహరించనివ్వడం ఎందుకు జరుగుతున్నది?

[సెప్టెంబర్ 27, 1973]

"పోయావా, బాబూ!"

నిక్సన్ బాబూ! వైట్‌హౌస్‌నుంచి వెళ్లిపోయావా? బొంకులు, బూకరింపులు మరి పనిచేయవని తెలుసుకొని వెళ్లిపోయావా? ఇంకా బింకానికి పోతే, మరింత పరాభవాలు తప్పకపోవచ్చునని గ్రహించి వెళ్లిపోయావా? ఏమైనా, నీవు రాజీనామా పెట్టడం జరిగింది, వైట్‌హౌస్‌నుంచి వెళ్లిపోవడం జరిగింది. ఇందుకు అమెరికా ప్రజ మాత్రమే కాక, అఖిలమానవాళి సంతోషిస్తున్నది.

ఇటీవల దాదాపు అన్ని దేశాలలో బలపడుతున్న ఒక కొత్త రకం రాజకీయవేత్తలకు నీవు ప్రతినిధివి. ఏదో ఒక విధంగా రాజకీయాధికారాన్ని చేజిక్కించుకోవడం నీకు, నిన్ను పోలినవారికి ముఖ్యం. ఒకసారి చేజిక్కించుకొన్న రాజకీయాధికారాన్ని వీలైనంత కాలంపాటు పదిలపరచుకొనడం మీకు ముఖ్యం. ఇందుకోసం ఎంతటి అకృత్యానికైనా మీరు పాల్పడతారు, ఎంతటి నికృష్టానికైనా సన్నద్ధపడతారు. ఇదే మీ దృష్టిలో కార్యకుశలత, ఇదే రాజకీయదక్షత, ఇదే దేశనాయకత్వానికి రావడానికి తిరుగులేని సాధనం.

ఒకసారి అధికారంలోకి వచ్చినతర్వాత మిమ్మలను తప్పు పట్టడానికి ఎవరికి గుండె లుండగలవని మీ ధీమా! అంతటి సాహసాన్ని నిజంగా ఎవరైనా చేస్తే, వానిని కాలరాచివేయగలమని మీ భరోసా! అయితే - నిక్సన్ బాబూ!- ఒక విషయం నీవు మరిచిపోయావు! ఎంత చెడినా, అమెరికా వాషింగ్టన్, జెఫర్సన్, యాడమ్స్, ఫ్రాంక్లిన్, పేన్, లింకన్ ప్రభృతుల దేశం. ప్రజాస్వామ్యానికి, ప్రాథమికస్వత్వాలకు, ఇట్టి జీవితపు విలువలు మరికొన్నింటికి ప్రాధాన్య మిచ్చే దేశం. అందువల్లనే నీ పదవి నిన్ను కాపాడలేక పోయింది, నీ రాజకీయాధికారం నిన్ను రక్షించలేకపోయింది.

దుష్టమైన ఒక దృక్పథానికి నీవు ప్రతినిధివి కనుకనే, నీపతనం ఇంతగా ప్రపంచ ప్రజాళికి సంతోషాన్ని కలిగిస్తున్నది. ఎవ రెంత పెద్ద పదవిలో తిష్ఠ

వేసినా, ఎంతటి శక్తిమంతమైన స్థానాన్ని వశపరచుకొన్నా, నీతినిజాయితీలు లేకుండా నడిస్తే, నిరంకుశంగా వ్యవహరిస్తే, నైచ్యాలకు పాల్పడితే, వారికి ఏనాటికో ఒకనాటికి పరాజయ పరాభవాలు తప్పవని - నిక్సన్ బాబూ !- నీవిషయంలో రుజువు అయింది. నేడు కాకపోతే రేపు ఇతరుల విషయంలో మాత్రం ఇది రుజువు కాకపోతుందా ? ఈ ఆశాభావమే ప్రపంచప్రజాళి సంతోషానికి ఇప్పుడొక ప్రత్యేక కారణం.

అయితే, న్యాయమే, ధర్మమే చివరికి జయించగలదన్న నమ్మకంతో చేతులు ముడుచుకొని కూర్చోవడంవల్ల - నిక్సన్ బాబూ ! - నిన్ను పోలినవారి పీడ వదలదు. అందుకు నిన్ను పాటించక, నీ కన్నెర్రను పాటించక, నీతో కొందరు అమెరికనులు పోరాడినట్టు, దేశదేశాలలో ఎవరో కొందరు పోరాడాలి; దేశదేశాలలో నిన్ను పోలినవారు పదవులనుంచి వైదొలగిపోవాలి. అప్పుడుగాని న్యాయం గెలవదు, అప్పుడుగాని ధర్మం జయించదు, అప్పుడుగాని ప్రపంచ ప్రజాళికి నిజమైన పండుగరోజు రాదు.

[ఆగస్టు 10, 1974]

కృతజ్ఞత

ఈ సంకలనంలోని సంపాదకీయాలలో 1944 - 1959 సంవత్సరాల మధ్య నేను వ్రాసినవి "ఆంధ్రప్రభ''లోనివి కాబట్టి, 1960-1974 సంవత్సరాలమధ్య వ్రాసినట్టివి "ఆంధ్రజ్యోతి''లోనివి కాబట్టి, ఆ రెండు దినపత్రికల వ్యవస్థాపకులకు—

నా సంపాదకీయాలలో తమకు నచ్చినవాటిని సేకరించుకొని, వాటిలో కొన్నింటిని మూడు దశాబ్దాలకుపైగా భద్రపరచి, నేను కోరగానే వాటిని నాకు పంపించిన శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్యా, శ్రీ వెలగా వెంకటప్పయ్యా మున్నగు మిత్రులకు—

వేటపాలెంలోని సరస్వతీ నికేతనంలో గల "ఆంధ్రప్రభ" ఫైల్స్‌నుంచి నా సంపాదకీయాలను సేకరించడంలో అనేక విధాల ఎంతగానో సహాయపడిన సహృదయులు అడుసుమిల్లి శ్రీనివాసరావు గారికి—

సరస్వతీ నికేతనానికి అయిదారు యాత్రలు చేసి, పునర్ముద్రణకు నా సంపాదకీయాలను ఎన్నికచేయడంలో నాకు తోడ్పడిన మిత్రులు శ్రీయుతులు ఇ. భాస్కరరావు, సుంకర కోటీశ్వరరావు, లంక సూర్యనారాయణ, అన్నం అమ్మయ్య, రమేశ్, శేఖర్, డాక్టర్ కొల్లి గంగాధరరావులకు—

"ఆంధ్రజ్యోతి" విషయంలో ఇదే విధమైన సహాయంచేసిన శ్రీ అట్లూరి రామమోహనరావుకు, శ్రీ చెరుకూరి సురేంద్రబాబుకు—

"ఆంధ్రప్రభ", "ఆంధ్రజ్యోతి" ఫైల్స్‌నుంచి నా సంపాదకీయాలను టైపు చేయడంలో, లేదా అన్యవిధాల సేకరించడంలో నాకోసం విశేష శ్రమపడిన శ్రీ యం.వి. సుబ్బారావు, శ్రీ కృష్ణంబాబుసోదరులకు, శ్రీ వి. ఉదయవర్లుకు—

ప్రూఫుల విషయంలో తోడ్పడిన శ్రీ నిడుదవోలు సుందరేశ్వరరావు, శ్రీ సి. కె. శర్మలకు—

ముద్రణవిషయంలో ప్రత్యేకశ్రద్ధ వహించిన ఆప్తమిత్రుడు శ్రీ ఆలపాటి రవీంద్రనాధ్‌కు, ఆయన పెద్ద కుమారు లిద్దరికి—

అన్యవిధాల నాకు చేదోడు, వాదోడుగా నిలిచిన తక్కిన మిత్రు లందరికి నా కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు.

సంపాదకీయాల సూచిక

		పేజీ
పీఠిక	—	3
మహోపన్యాసం	—	13
వీరేశలింగం	—	15
చర్చిల్‌ను గెలిపిస్తే	—	18
అమరజ్యోతి	—	21
ఆంధ్ర శిల్పసంపద	—	23
రాజవైద్యుడు	—	26
ఉగాది	—	28
బెర్లిన్ పతనం	—	30
నాయకత్వం	—	32
యుగపురుషుడు	—	35
భారత మిత్రుడు	—	40
హెచ్. జి. వెల్స్	—	42
నిత్యసమరం	—	45
వినాశకర వ్యవస్థ	—	47
అరుణోదయం	—	49
నవప్రాచ్యం	—	53
ఆసియా మహాసభ	—	55
భాషాప్రయుక్త రాష్ట్రాలు	—	57
స్వాతంత్ర్య భానూదయవేళ	—	59
ఇది మౌఢ్యమే కాదా ?	—	78
సముద్రాధిపత్యం	—	80
రాజీ, రాజీ, రాజీ	—	82
ఇండియా, జపాన్	—	85
అంతులేని దోపిడి	—	87
విభిన్న ప్రభావాలు	—	89
తిరిగి ఆగస్టు 15వ తేదీ వచ్చింది	—	94
అప్పుడు, ఇప్పుడు	—	98
నవప్రపంచం	—	100
ప్రభుత్వోద్యోగులు	—	102
విద్య, విజ్ఞానం	—	104

గ్రామీణ నాయకత్వం	—	107
భారతనారి	—	110
ఏది దేవాలయం ?	—	112
కుటీరపరిశ్రమలు	—	115
హిందూసంఘ సంస్కరణ	—	118
గాంధి, ఆయన అనుచరులు	—	123
కాంగ్రెసు విప్లవస్వరూపం	—	125
ఆత్మహత్యలు	—	127
నిరశనవ్రతాలు	—	130
పోలీసు జులుం	—	132
ప్రాచ్య, పాశ్చాత్యాలు	—	135
కుంటిసాకులు	—	138
మేధ, హృదయం	—	141
అడవులు	—	144
ప్రజల సహనం	—	147
ఆధునిక ఋషి	—	149
వెలుగు నీడలు	—	153
స్వయంకృతాపరాధం	—	157
ఆంధ్రరాష్ట్రం	—	159
కంట్రోల్స్	—	162
తెలుగువాడా !	—	164
ఎన్నికల పాఠాలు	—	166
ఎవరెస్ట్	—	179
ఫలసిద్ధి	—	181
విశాలాంధ్ర	—	184
కళాపోషణ	—	187
భాషావిద్వేషాలు	—	190
ఏది ప్రగతి ?	—	192
జాతీయ విప్లవం	—	200
పత్రికలభాష	—	203
గౌతమబుద్ధుడు	—	205
భూస్వామ్య సంస్కరణలు	—	208
గాంధి జయంతి	—	210
1857	—	212
"జాతికే ముప్పు"	—	215

విశ్వకవి	—	218
వరకట్నాలు	—	221
ప్రాచ్యసంస్కృతి	—	223
విభేదాలు	—	226
ఆగస్టు 15, 1960	—	229
ఆసియా, ఆఫ్రికాలు	—	231
విదేశాంగ మంత్రిగా నెహ్రూ	—	234
యుగధర్మం	—	238
"త్రివిక్రముడు"	—	241
చీలుదారులు	—	244
మేధావుల కర్తవ్యం	—	246
మానసికపు పంజరాలు	—	248
దుష్టగ్రహాలు	—	250
మ్లేచ్ఛప్రభావం	—	253
"అన్నగారు"	—	256
"స్వార్థచింత"	—	258
దేవీపూజ	—	261
సోషలిజం నిర్వచనం	—	264
ఆగస్టు 15, 1964	—	269
నెహ్రూ తాత్త్వికదృష్టి	—	273
దేశచరిత్ర	—	276
విపత్కర ధోరణులు	—	281
రోదసిపై విజయం	—	285
త్యాగరాజు	—	289
"నవమతం, నూతనవేదం కావాలి"	—	292
"అసత్యాగ్రహం"	—	297
మొహెంజొదారో	—	299
జాతీయ విద్యావిధానం	—	301
ఇరవయ్యో శతాబ్దిలో నరబలి	—	306
మద్యనిషేధం	—	308
చరిత్ర, సాహిత్య పరిశోధన	—	312
కలం కన్నీటిలో ముంచి....	—	316
రేపు, రేపటితరం	—	318
మానవ విజయం	—	321
మతకలహాలు	—	325

గురునానక్	—	328
కాటన్ "పెట్టిన దీపం"	—	330
పురాణపురుషులు	—	333
దెబ్బపై దెబ్బ	—	335
మేధావుల కర్తవ్యం	—	339
ఇండియా ఆఫీసు లైబ్రరీ	—	342
"స్లోగన్స్ యుగం"	—	345
పౌరుల విధి	—	347
అవినీతి నిరోధం	—	349
నియంతలు, నియంతృత్వం	—	352
కులవ్యవస్థ ప్రభావం	—	354
ఏది ధర్మం?	—	356
నేటి నాయకులు	—	358
ఆగస్టు 15, 1972	—	360
ఆయన జీవించి వుంటే....	—	363
సంస్కృతంపట్ల మోజు	—	365
ఈనాడు ఏమి కావాలి ?	—	368
ఫీల్డ్‌మార్షల్ మానెక్‌షా	—	371
ఎవడు మేధావి?	—	374
మనం, మనప్రవృత్తి	—	376
వ్యర్థమైన మూడు జీవితాలు	—	378
నైతిక పతనం	—	380
తిరిగి ఉగాది	—	382
పికాసో	—	384
జుల్‌ఫికర్ ఆలీ భుట్టో	—	387
ఎక్కడికి పోతున్నాము ?	—	389
"మాకు అర్థంకాని విషయాలు"	—	391
"పోయావా, బాబూ!"	—	393
కృతజ్ఞత	—	395

అచ్చుతప్పులు

ఎంత శ్రద్ధ వహించినా, కన్ను చెదిరినందువల్ల, ఇతర కారణాలవల్ల అచ్చు తప్పులు హెచ్చుగా పడినందుకు చింతిస్తున్నాను. ఇప్పుడైనా కనబడిన మేరకు అన్నింటిని పూర్తిగా సవరించలేదు. ఒత్తులు, దీర్ఘాలు మొదలైనవాటికి సంబంధించినంతవరకు (అపార్థమో, దురర్థమో రాగల ప్రమాదం లేనప్పుడు) అచ్చు తప్పులను ఇక్కడ పేర్కొనలేదు. ఏమైనా, ఈ అచ్చుతప్పులు చికాకు కలిగించినందుకు మన్నించవలసిందిగా పాఠకమహాశయులకు మనవి.

పుట		పంక్తి	తప్పు	ఒప్పు
3	పైనుంచి	7వ పంక్తి	పదివంతులైనా	తొంభైవంతులు
6	పైనుంచి	11వ ”	1943లో గాని, 1943లో	1942లో గాని, 1943లో
14	కింద నుంచి	4వ ”	కోడిదూడ వలె	కోడెదూడ వలె
15	పైనుంచి	8వ ”	గోచరించిది	గోచరించింది
16	కిందనుంచి	7వ ”	తమ	తన
20	పైనుంచి	5వ ”	మనలేనని	మనలేదని
22	” ”	8వ ”	మహాసేనాలు	మహాసేనానులు
24	” ”	11వ ”	బిక్షువువలె	భిక్షువువలె
31	” ”	1వ ”	సాస్కృతిక	సాంస్కృతిక
38	” ”	1వ ”	ఏ దిశకో	ఏ దిశకు
38	కింద నుంచి	7వ ”	వినియోంచినప్పుడు	వినియోగించినప్పుడు
40	పైనుంచి	2వ ”	సంపూర్ణ స్వాంతంత్ర్యాన్ని	సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని
40	” ”	11వ ”	అరం	అర్థం
40	” ”	12వ ”	ఈ ఆయన కారణంగానే	ఈ కారణంగానే
48	కింద నుంచి	2వ ”	స్వస్తిచెప్పగలితేనే	స్వస్తిచెప్పగలిగితేనే
51	పైనుంచి	11వ ”	నివశిస్తూ	నివసిస్తూ
56	” ”	8వ ”	భోగలాలసత్యాన్ని	భోగలాలసత్వాన్ని
57	శీర్షిక		బాషాప్రయుక్త	భాషాప్రయుక్త
59	పైనుంచి	9వ ”	పరాజం	పరాజయం
63	” ”	8వ ”	స్వాతంత్రాన్ని	స్వాతంత్ర్యాన్ని
64	కిందనుంచి	13వ ”	కారణావల్లనే	కారణాలవల్లనే
74	” ”	10వ ”	స్వతంత్ర్య	స్వతంత్ర
75	” ”	3వ ”	సంతషోద్విగ్నులై	సంతోషోద్విగ్నులై
84	పైనుంచి	9వ ”	అర్ధశతాబ్దింలోనైనా	అర్ధశతాబ్దిలోనైనా
85	కిందనుంచి	4వ ”	నౌకబలపాటవంవల్ల	నౌకాబలపాటవంవల్ల
86	” ”	5వ ”	యంత్రాలను	యంత్రాలకు
93	డేట్‌లైన్		ఆగస్టు 15, 1947	ఆగస్టు 15, 1948
104	కిందనుంచి	6వ ”	అధికసంతృష్టి	అధికసంతుష్టి
108	పైనుంచి	11వ ”	పదవులను	పదవులకు
108	కిందనుంచి	2వ ”	యగంధరు లున్నారు	యుగంధరు లున్నారు

పుట		పంక్తి	తప్పు	ఒప్పు
139	పైనుంచి	2వ పంక్తి	హిండూవులలో	హిందువులలో
”	కిందనుంచి	4వ ”	చెప్పవచ్చు	చెప్పవచ్చు
144	పైనుంచి	5వ ”	చిక్కు రొక్కురుగా	చిక్కురొక్కురుగా
154	కింద నుంచి	5వ ”	ప్రయత్నించేస్తే	ప్రయత్నం చేస్తే
156	డేట్‌లైన్		జనవరి **1, 1971**	జనవరి **1, 1951**
159	శీర్షిక		అంధ్రరాష్ట్రం	ఆంధ్రరాష్ట్రం
177	డేట్‌లైన్		ఫిబ్రవరి **9, 1947**	ఫిబ్రవరి **9, 1952**
193	పైనుంచి	17వ ”	ద్వేషాని	ద్వేషాన్ని
195	” ”	14వ ”	స్వతంత్ర్యంగా	స్వతంత్రంగా
200	” ”	8వ ”	కూడనిపని	కూడిన పని
201	” ”	1వ ”	గూడచారులే	గూఢచారులే
208	కిందనుంచి	10వ ”	దేశాలైనా	దేశాలైన
”	”	4వ ”	పరోక్షలగా	పరోక్షంగా
214	డేట్‌లైన్		మే **4, 1957**	మే **10, 1957**
218	పైనుంచి	4వ ”	కాళిదాసు అయినా	అయినా, కాళిదాసు
”	కిందనుంచి	4వ ”	జ్యోతిర్విదాభరణం	జ్యోతిర్విద్యాభరణమ్
219	పైనుంచి	2వ ”	జ్యోతిర్విఢాభరణం	జ్యోతిర్విద్యాభరణమ్
229	కిందనుంచి	1వ ”	అంతరంగలో	అంతరంగంలో
274	” ”	7వ ”	పర్శనాలిటీ	పర్సనాలిటీ
285	” ”	10వ ”	భూప్రదక్షణాలను	భూప్రదక్షిణాలను
285	” ”	10వ ”	మైళ్ళ మాత్రమేం	మైళ్ళమాత్రమే
285	” ”	9వ ”	సూర్యమండల.	సూర్యమండలం
285	” ”	8వ ”	కృతిమోపగ్రహంగా	కృత్రిమోపగ్రహంగా
297	పైనుంచి	10వ ”	నిర్లక్షం	నిర్లక్ష్యం
300	” ”	6వ ”	నిపుణులు	నిపుణులను
309	” ”	11వ ”	చేయవలెలన్న	చేయవలెనన్న
311	కిందనుంచి	1వ ”	విలువులు	విలువలు
318	కిందనుంచి	1వ ”	సిద్దాంత	సిద్ధాంత
334	కిందనుంచి	3వ ”	ప్రమాలను	ప్రమాదాలను
339	” ”	2వ ”	స్వాతంత్రోద్యమంలో	స్వాతంత్ర్యోద్యమంలో
342	” ”	7వ ”	ప్రవేయిట్	ప్రయివేట్
366	పైనుంచి	3వ ”	వ్యంగ రచన	వ్యంగ్య రచన
371	” ”	9వ ”	ఆధిపత్య్యం	ఆధిపత్యం
371	” ”	10వ ”	ఆర్డర్లీం	ఆర్డర్లీ
371	” ”	11వ ”	దాక్కున్ని	దాక్కుని
391	” ”	3వ ”	అన్యదేశాలలలో	అన్యదేశాలలో
391	” ”	7వ ”	ప్రభుత్వోద్యోగంతో	ప్రభుత్వోద్యోగంలో

403

ఆగాఖాన్ (పూనా) ప్యాలెస్‌లో బందీగా 1943లో గాంధీ జరిపిన నిరశనవ్రత సందర్భంలో ఒక సంపాదకీయాన్ని చదివినమీదట శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి : "ఈ నాడు (మీరు) వ్రాసిన ఎడిటోరియల్ చదివి ఆవురుమని యేడ్చినాను. మీ తత్త్వ పరిజ్ఞానమునకు జోహారులు...."

* * *

తేదీ లేని ఒక లేఖ వ్రాస్తూ (1954 లోనో, 1955 లోనో కావచ్చు) శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి : "మీ వ్రాతలలో నొక విధమైన సొంపు కలదు.... అవి చదివినప్పుడు నా కెంతో సంతసము కలుగుచుండును. మీ భాష గ్రాంథికము గాకున్నను, పాఠక మనోహరమై యుండును. వార్తా పత్రికలలో నట్టి భాషయే సమంజసము...."